

# అనంత యాత్ర
# 3వ భాగం

**పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్, కస్తూరీ బహెన్‌ల**
**ఉత్తర ప్రత్యుత్తరాలు**

**3 నవంబర్ 1953 నుంచి 19 జూలై 1955 వరకు**
**ఉత్తరం సంఖ్య 351 నుంచి 500 వరకు**

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

కె. రామదాస్ - **9440652774**

కె. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# రెండు మాటలు

ప్రియమైన అభ్యాసీ సోదరీ సోదరులకు,

ఇప్పుడు అనంత యాత్ర యొక్క మూడవ భాగాన్ని మీ చేతుల్లో పెట్టూ ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. 'అనంతం' వరకు చేరే యాత్ర కూడా అనంతమైనదే. అవని మీద ఉన్న మానవమాత్రుల కొరకు సహజమార్గాన్ని ఏర్పరిచిన శ్రీ బాబూజీ మహరాజ్ అనంతశక్తి (Ultimate Power) మీద ఆధిపత్యం కలిగి ఈ ధరణి మీద అవతరించారు. నేటికి కూడా వాతావరణంలో వ్యాపించి ఉన్న 'వారి' దివ్య ప్రకాశం గ్రహించగలిగినా, గ్రహించలేకపోయినా కూడా ప్రాణిమాత్రుల హృదయాలను ఇంకా, ఇంకా దీనిలో ముంచి ఉంచటానికి ప్రయత్నిస్తోంది. **శ్రీ బాబూజీ మహరాజ్ వచించిన మాటలు కూడా ఈ పరమసత్యాన్ని ప్రత్యక్షం చేశాయి –"మనం ఒక కాలని కట్టెను కాలుతూ ఉన్న మరొక కట్టెతో పలుమార్లు కలిపి ఉంచటానికి ప్రయత్నం చేసినట్లయితే, అలా ఆరిపోయి ఉన్న కట్టె కూడా ఒకానొక సమయంలో నిప్పంటుకుని ప్రకాశిస్తుంది" అని 'వారు' చెప్పిన మాటల్లోని వాస్తవికతను సహజమార్గ సాధన, అభ్యాసుల హృదయాలకు స్పష్టంచేసి దానిని సార్థకం చేసింది.** ఈశ్వరీయ ప్రకాశం మనలో ఉన్నదని నిరంతరం మనం ప్రయత్నం చేస్తూ ఉన్నా, మాటిమాటికీ మన హృదయాన్ని దానిలో ముంచి ఉంచటానికి ప్రయత్నిస్తూ ఉన్నా, హృదయమే కాదు, శరీరం యొక్క అణువణువూ ఈశ్వరీయ ప్రకాశంతో శోభిల్లుతుంది. అంతేగాకుండా మన జీవనయాత్రలో ఆ అనంత శక్తి యొక్క ఉనికి సహజంగానే మనకు దర్శనమవుతూ ఉంటుంది.

ఈ అనంతయాత్ర పుస్తకం, నా బాబూజీ యొక్క కృపా రూపంగాను, అభ్యాసులపట్ల 'వారి' శిశుప్రేమకు దివ్య నమూనాగా ఉంటుంది. దివ్య సౌందర్యం ద్వారా నన్ను అలంకరిస్తూనే అంతిమసత్యం యొక్క ద్వారంలో నాకు ప్రవేశం కల్పించి, అలాగే అందరికీ వారు 'అనంత దేశం' (భూమా) యొక్క ద్వారాన్ని తెరచి ఉంచారు. ఇప్పుడింక మీరు దీనిలో ప్రవేశించాలి అనే దానిని మీ జీవిత పరమలక్ష్యంగా పొందాలి, ఇవే నా శుభాకాంక్షలు.



కస్తూరీ చతుర్వేది

# అనంత యాత్ర 3వ భాగం

## ఉత్తరం సంఖ్య - 351

కాన్పూర్,
03.11.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని భావిస్తున్నాను. అదేమిటో తెలియదుగాని నాకు షుమారు 5,6 రోజుల క్రిందట అకస్మాత్తుగా తుపాకుల సవ్వడి మార్మోగుతూ వినిపించింది. అగ్నికీలలు, ఆర్తనాదాలు 'మాలిక్' కృపతో నా ఎదుటనే కనిపించాయి. 'తమకు' ఒక యూనాని వైద్యుడు వైద్యం చేస్తున్నట్లు కేసర్ ద్వారా తెలిసింది. దాని వలన ప్రయోజనం కలిగిందో లేదో దయచేసి తెలియజేయండి. 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఈ దశ అయితే దానిని దశ అనటం కూడా చాలా భారంగానే ఉంది, కనుక దానిని అనుభూతి అని మాత్రమే చెప్పాల్సి ఉంటుంది. ఎందుకంటే, ఈ స్థితిని అనుభూతి చెందాలని ప్రయత్నిస్తూ ఉంటే, దానిలో ఎంతో తేలికగా మునగాల్సి వస్తోంది. ఎంతగా మునిగినప్పటికీ అది ఇంకా తక్కువగానే అనిపిస్తోంది. అందులో స్వయంగా మునిగి ఉండాలని కోరుకుంటున్నాను. స్థితి యొక్క అనుభూతి చెందటానికని ఎంత సహజస్థితిలో ఉంటున్నప్పటికీ, ఈ స్థితిలో లోతుగా మునిగి ఉండటమో, లేదా కూర్చుండి ఉండటమో జరగకుండా పూర్తిగా స్వచ్ఛమైన స్థితి అనుభవానికి రావటం లేదు. ఇంకా చెప్పాలంటే, అనుభూతి చెందినప్పటికి కూడా, వీటన్నింటి (స్థితుల) వెనుక ఏదో ఒక ధార ప్రవహిస్తూ ఉండగా దానిలోనే మునిగి తేలుతున్నాను. ఆ ధారలో కానివ్వండి లేదా ఇటువంటి దశలో కానివ్వండి పరమానందం యొక్క విలువ లేకపోతోంది. ఇప్పుడు దానిలో తడిసినటువంటి దశలో పరమానందం యొక్క విలువ లేకపోతోంది. ఇప్పుడు దానిలో తడిసినటువంటి అనుభూతి ఉన్నప్పటికీ దానిలో ఆనందానికి స్థానమే లేకుండాపోయింది. అయితే లోపల అప్పుడప్పుడు ఏమనిపిస్తుందంటే, ఏదైనా చిందిపడినా కూడా హృదయం దానిని సహించలేక బ్రద్దలైపోవాలనిపిస్తుంది. కాని 'మాలిక్' యొక్క కృపావశం అలా జరగనివ్వదు. ఎందుకోగాని నిన్నటి నుంచి హృదయం నా వశంలో లేకుండా విచారగ్రస్తంగా ఉండటమేగాక తరచుగా ఏడ్వాలనిపిస్తుంది. దశ పూర్తిగా శూన్యంగాను, ఎడారిలాగాను ఉండి ఆస్వాదించటానికి ఏమిలేనట్లు ఉంది.

'తమరు' వ్రాసిన ఉత్తరంతో ఉన్న కవర్ అందింది, చదివి చాలా సంతోషించాను. 'తమ' ఆశీస్సులు మరియు కృపయే నా జీవనాధారం. అంతేకాదు, ఈ జీవితం 'తమరి' కోసమే. 'మాలిక్' దయతో అంతా స్వయంగానే జరుగుతోంది, 'తమరు' ఎంతమాత్రం చింతించాల్సిన పనిలేదు. వృక్షం మరియు జీవం గురించి 'తమరు' వివరించినటువంటిది, ఇంతవరకు ఎవ్వరూ వివరించటం జరగలేదు. జ్ఞానయోగంలో స్వామి వివేకానంద కూడా బాగానే వివరించారు కాని, క్షమింతురుగాక, అది 'తమరు' వివరించినంతగా లేదనిపించింది. ఎవరేమి అనుకున్నా, అనుకోనివ్వండి కాని 'తమరు' వివరించినదే నాకు బాగా అర్థమవుతుంది. **శ్రీ బాబూజీ, స్వర్ణయుగమైతే నడుస్తోంది కాని మేము మాత్రం నిద్రను వీడలేదు.** లఖీంపుర్‌లో కూడా సత్సంగ్‌లో అంతగా అభిరుచి కనిపించటం లేదు. 'తమరు' చెప్పినట్లు, శుక్లాజీకి సమయం తక్కువగా ఉందన్న మాట వాస్తవం. నేను కూడా కోరుకున్నంతగా ఎందుకోగాని శీఘ్రగతిన పొందలేకపోతున్నాను. తమరు 'కుకరా' (గ్రామం పేరు) వెళ్ళబోతున్నారంటే, అది వారందరి అదృష్టం అనుకోవాలి. అలసటవలన కలిగిన నా జ్వరం గురించి 'తమరు' పట్టించుకోనవసరం లేదు. నాకల్లా 'మాలిక్' కోసం పడిచావటమే. అదే నా ధ్యేయం. నాకయితే జీవనం మృత్యుసమానం. ఎందుకంటే, ఇలాంటి జీవితమే జీవితం అని

నా భావన. అయినా కాని నేను మాత్రం సేవకురాలినే, సదా 'మాలిక్'కు ఋణపడి ఉన్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 352

కాన్పూర్,

10.11.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు పంపిన కవర్ అందింది, చదివి చాలా సంతోషించాను. తమకు యూనాని వైద్యుడి ద్వారా సమకూరుతున్న వైద్యం ఎలా ఉంది? నాకు రేపు చివరిదైన 30వ ఇంజక్షన్ ఇవ్వబడుతుంది. తరచుగా నా ఆరోగ్యం చాలా విసుగుదలగా ఉంది. బహుశా నేను ఎక్కువగా పరుండి ఉండటం వలన కావచ్చును కాని నేను ఎంతో కొంత నడుస్తూనే ఉన్నాను. తమరు 'కుకరా' వెళ్ళి వచ్చారా లేదా? తమరు 'కుకరా' వెళ్ళి ఉంటే, బహుశా లఖీంపుర్ కూడా వెళ్ళి ఉంటారు. నేను లఖీంపుర్ వెళ్ళినట్లయితే, నా బాబూజీ వద్దకు షాజహాన్‌పూర్ కూడా వెళ్ళగలను అనే ఆలోచనతోను, ఆ ఆనందంలోను నేను నా అస్వస్థతను సహించగలుగుతున్నాను. ఒక రకంగా చెప్పాలంటే, ప్రస్తుత కాలంలో ఉన్న పరిస్థితులననుసరించి నేను నా కుటుంబంలో ఒక శాపరూపంలో వచ్చానేమోనని అనిపిస్తోంది. అయితే ఈశ్వరానుగ్రహం వలన ఏదో విధంగా సంసారం గడిచిపోతోంది. దీనిని నేను అనవసరంగా వ్రాశాను. కనుక తమరు దీనిపై దృష్టి పెట్టకండి. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన స్థితి గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో ఎలా ఉందంటే, నేను గతంలో వ్రాసినట్లు 'బ్రహ్మం'లో ఆహ్లాదం కలిగించే సువాసన ఏదైతే ఉందో, అది ఇప్పుడు నేను ఈ స్థితిలోకి ఎంత లోతులోకి దూసుకుపోతున్నప్పటికీ అది వెలిసిపోతున్నట్లు నేను గమనిస్తున్నాను. ఇప్పుడు కలుగుతున్న ఈ దశలో, 'మాలిక్' నన్ను ప్రకృతిలో మిళితం చేసినట్లు అనిపిస్తోంది. అంతేగాకుండా ప్రకృతి యొక్క ప్రతి చర్య, నా పర్యవేక్షణలో జరుగుతున్నట్లుగాను, అయినా 'మాలిక్' దానిని నా దృష్టికి రాకుండా నా కన్నులు మూసివేసినట్లు, దానితో నాకు సంబంధంలేనట్లు ఏమీ పట్టించుకోకుండా దానికి దూరంగా నా 'మాలిక్'ను చేరిపోయినట్లుగా అనిపించింది. నేను ఈ స్థితిని స్పష్టంగా వ్రాయలేకపోయి ఉండవచ్చు. ఈ తేలికదనం కూడా ఇప్పుడు అంతమైపోయింది అని నేను చెప్పినట్లయితే అది సక్రమమే అవుతుంది. ఇప్పుడు దశ కూడా సహజంగానే అవుతున్నది. నా బాబూజీ, ఈ దశలో ఎలా అనిపిస్తున్నదంటే, జీవికి తన అసలు నివాసం యొక్క వాసన తగులుతున్నట్లు ఉంది. ఇంకా ఏమిటంటే, ఏ కారణంతోనైతే జీవి 'జీవి'గా అయ్యిందో, అది (ఆ కారణంగా) 'మాలిక్' దయతో అదృశ్యమైపోతూ తన అసలు స్వరూపం దాల్చుతున్నట్లు ఉంది. గతంలో నేను వ్రాసి ఉన్నట్లుగానే ఇప్పుడు ఈ స్థితి ఎలా ఉందంటే, స్వయంగా నాకు నా సువాసన లభిస్తున్నట్లుగాను, దానిలో (ఆ సువాసనలో) నేను కరిగిపోతున్నట్లుగాను అనిపిస్తోంది. ఇప్పుడు అన్ని తంతువులూ ఆ స్థితితో బంధం వేసుకుని ఉన్నట్లుగాను, అది పేరుకు మాత్రమే నాది అన్నట్లుగాను ఉంది. ప్రతి తంతువూ 'మాలిక్' యొక్క హృదయంతో లయ చెందినట్లు ఉంది. ఓ నా 'మాలిక్', ఇదే నా ప్రస్తుత స్థితి. జ్ఞాన యోగంలోని విషయాలు తమరు చెప్పిన మాటలతోనే ఏకీభవించి ఉంటున్నాయి. ధర్మం, మొదలైనవాటి విషయంలో 'తమరి' మాటలు పూర్తిగా సరిపోలి ఉంటున్నాయి. తరచుగా నాకు ఈ విషయం దృష్టికి వస్తోంది. ఏమిటంటే, **మన సత్సంగ్‌లోని సోదరీ సోదరులందరికీ, కొంచెం కనువిప్పు కలిగి తమ సర్వస్వమైన 'దానిని' చూసే ప్రయత్నంలో తగినంత తీరిక కలిగితే బాగుంటుంది** అని. నా కయితే అందరూ అందుకు తీరిక కలిగే ఉన్నారనిపిస్తోంది. అయితే కాలం యొక్క విలువను మనం గుర్తించలేకపోతున్నాం.

పూలో జిజ్జీ మరియు కేసర్ తమకు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 353

కాన్పూర్,

21.11.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసే ఉత్తరం చాలా రోజులనుండి రాలేదు, కారణం ఏమిటై ఉంటుంది? దయచేసి తమ ఆరోగ్యస్థితిని గురించి శీఘ్రంగా తెలియజేయండి. నా అనారోగ్యం 4వ వంతు మిగిలి ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నాలోని కణకణాలన్నీ ఛిద్రమైపోయి చెల్లాచెదరైపోయినట్లు గాను, ఒక (Parallel) సమానాంతర స్థితి నెలకొని ఉన్నట్లుగాను నాకు ఇప్పుడు అనుభవమవుతోంది. వాస్తవానికి అది స్థితి అనదగినది కాకపోయినప్పటికి, ఒక వింత అనుభవంలాగా అనిపిస్తోంది. ఈ దశలో పైన పేర్కొన్న కణాలన్నీ మాయా రహితంగా ఉన్నాయి. శుద్ధత, అశుద్ధత అనేవి ఏవీ నాకు తెలియకపోతున్నాయి. శ్రీ బాబూజీ, ఎందుకో తెలియదుగాని అనుభవం అంటూ ఏమీ లేకుండా పోయింది. ఈ స్థితిలో ఏమనిపిస్తోంది అంటే, ప్రతి కణమూ విసరివేయబడినట్లు ఉండిపోయి, ప్రతిదానిలోను శబ్దాల ద్వారా వర్ణింపజాలనటువంటి ఒక వింతైన నిశ్చలస్థితి ఉన్నట్లు తలపిస్తోంది. 'మాలిక్' కృపతో నాకు అనుభవం కలుగుతున్నప్పటికీ, దానిని వ్రాయనలవి కాకుండా ఉంది. ఆ కణాలు అద్దంలాగ ఉన్నాయని అనుకోకతప్పదు.

నా బాబూజీ, ఒకవేళ నేను దీనిని వ్రాయవలసివస్తే, ప్రతి ఒక్క కణంలోను ఒక వింతైన ప్రపంచం దర్శనమవుతోంది. అది ఏమిటో తెలియదు కాని, ప్రతి ఒక్క కణాన్ని జోడించినట్లయితే, సంపూర్ణ బ్రహ్మాండం తయారవుతున్నట్లు ఉంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, నా యొక్క ప్రతి రోమకూపం నుంచి ఒక్కొక్క ప్రపంచం ఆవిర్భవించగలదు అన్నట్లు ఉంది. ఈ దశ ఇటువంటిదే అయినప్పటికీ, దీనిలో ఎటువంటి శక్తి యొక్క జాడ లేకుండా ఉంది. దీనిని వ్రాయాల్సివస్తే, ఇక్కడ (Force) శక్తి యొక్క వత్తిడి అనేది సద్దుమణిగిపోయి ఉందని చెప్పేబదులు అది మరణించిందని చెప్పటమే సబబుగా ఉంటుంది. స్పృహ కూడా మరణించి పోయింది. పవిత్రత అనేది ఉంది అనుకున్నా, దాని నుండి ప్రాణం పెరికివేయబడినట్లు ఉంది. ఇంక ఉన్నదల్లా బేరసారాలే. ఇది వస్తువు అనేది ఏదీ లేకుండా చేసే వ్యాపార బేరం, ఒకవేళ బేరం చేయాలన్నా కూడా కొనుగోలుదారుడు అనగా బేరగాడు దొరకటం కష్టసాధ్యం. ఒకవేళ కొనుగోలుదారుడు ఎవరైనా అందుకు సాహసించినా కూడా, అక్కడకు చేర్చేవారు ఎవ్వరూ దొరకరు, అయితే నాకు మాత్రం దొరికారు. వారు ఎటువంటివారు అంటె, వారు నన్ను తీసుకొని వెళ్ళగలరు, నాలో సాహసం నింపగలరు. ఇప్పుడు ఏమీకాదు కాని, 'మాలిక్' మాత్రం నాకు తెలియనిదానిని (నేను ఊహించలేనిదానిని) అనుగ్రహించటం కోసం నన్ను అర్హురాలిగా తయారు చేస్తున్నారు. నేను పాత్రురాలిగా అనగా అర్హురాలిగా తయారుచేస్తున్నారు. నేను పాత్రురాలిగా అనగా అర్హురాలిగా తయారైపోయే శుభదినమును శీఘ్రంగా తీసుకు రావాలని నేను 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను. ఆరోజు తప్పక వస్తుందని నేను ఆశాభావంతో ఉన్నాను. కొంచెం బలహీనత ఉన్న కారణంగా తమకు శీఘ్రంగా ఉత్తరం వ్రాయలేకపోయాను. మానవుడు, మానవుడు మాత్రమే కాదని, ఇంకా ఏదో అయిపోతాడని నాకు అవగాహన కలిగింది. బ్రహ్మ కూడా నన్ను సానబట్టుతున్నాడేమో (మార్పు చేస్తున్నాడేమో) అని అనిపిస్తోంది. అలాకాదు, 'మాలిక్'యే నన్ను మలుస్తున్నాడనుకుంటాను. ఎక్కడైతే ఇప్పుడు నాకు జీవం అనే భావం కాని, అనగా నా ఉనికి యొక్క భావం కాని, బ్రహ్మ యొక్క ఊహ మాత్రంగాని లేవో అక్కడకు నన్ను తీసుకుపోతున్నారు.

శుక్లాజీ నుండి ఎందుకు చాలా ఆశిస్తున్నారో తెలియటం లేదు. వారికి సమయం ఉన్నా, లేకున్నా (తీరిక ఉన్నా లేకున్నా) గాని, మిషన్‌కు సహాయం లభించేటటువంటి అంశమేదో వారిలో తప్పకుండా ఉంది. జడ్జి పదవి ఏమైంది, వారికి దక్కిందా లేదా? ఫూలో జిజ్జీ మరియు కేసర్ తమకు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 354

షాజహాన్‌పూర్,

22.11.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం, కేసర్ ఉత్తరమూ అందాయి. నేను దీపావళికి 'కుకరా' గ్రామంలో ఉన్నాను. లఖీంపూర్ వెళ్ళలేకపోయాను. చౌబేజీ, మాస్టర్ సాహెబ్, ఇంకా అనేకమంది అక్కడకు వచ్చారు. ఇంగ్లీషు పుస్తకం ప్రూఫులు అలహాబాద్ నుంచి వస్తూ ఉన్న కారణంగా పూర్తిగా తీరిక లేకుండా ఉన్నాను. నీవు వ్రాసిన ఉత్తరానికి జవాబు వ్రాయించాలంటే చాలా నిడివైనదిగా అవుతుంది. నీవు కూడా ఈ సమయంలో అన్ని పనులు ప్రక్కనపెట్టి కేవలం ఆరోగ్యం సంరక్షించుకోవాలి. నిన్ను వెంటబెట్టుకుని షాజహాన్‌పూర్‌కు వచ్చి, కొన్ని రోజులు ఉండి, అక్కడి నుంచి లఖీంపూర్ వెళ్ళదలచినట్లు చౌబేజీ నాతో చెప్పారు. నీవు వస్తే బాగుంటుంది. నేను ఒక హకీమ్ (యునాని వైద్యుడు)తో వైద్యం చేయించుకుంటున్నాను. దాని వలన కొంత ప్రయోజనం కూడా కనిపించింది. నిజం చెప్పాలంటే, నీవు నీ ఉన్నతిని స్వయంగానే చేకూర్చుకున్నావు. నేను ఎంతోకొంత తోడ్పాటు (సహాయం) ఇస్తూ వచ్చాను, అలాగే ఇస్తూ ఉంటాను కూడ. నాలో సామర్థ్యం ఉండి ఉంటే, అభ్యాసులు ఎంతమంది ఉన్నారో అందరూ బాగా ఉన్నతి చెంది ఉండేవారు. దైవం నీకు త్వరగా ఆరోగ్యం చేకూర్చాలి. కేసర్, ఫూలో మరియు వారి పిల్లలకు నా ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 355

కాన్పూర్,

27.11.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన పోస్టుకార్డ్ అందింది. సంగతులు తెలిసాయి. ఇంగ్లీషు పుస్తకం ప్రూఫులు మూలంగా తమకు తీరిక లేకపోతోంది. అయినాగాని తమ ఉత్తరం అందుతున్నందువలన నాకు సంతోషంగా ఉంది. నేను ఎప్పుడు వస్తానో తెలియదు. ఎందుకంటే, ఇంజక్షన్లకు పరిమితి అంటూ లేకుండా పోయింది. ఆ తర్వాత కరెంట్ ట్రీట్‌మెంట్‌ను ఆరంభిస్తారు. తమరు ఎంతమాత్రం చింతించవద్దు. ఇంగ్లీషులో పుస్తకం ప్రింట్ జరుగుతుండటం చాలా బాగు అనిపిస్తుంది. తమకు హకీమ్ (యునాని వైద్యుని) మందుతో ఫలితం కలిగినట్లు తెలిసి అందరికీ సంతోషమైంది. తమకు ఈ ఉబ్బసం యొక్క ఇబ్బంది మరెన్నడూ కలగనట్లు ఈశ్వరుడు అనుగ్రహించాలి. నా ఆత్మోన్నతికి కారకులు తమరు ఒక్కరు మాత్రమే. నా శిథిలమైన జీవిత నావను తమరు మాత్రమే దయతో నడిపి తీరం చేరటానికి అంగీకరించారు. ప్రాపంచిక బంధనాలనుంచి విముక్తిచేసి నన్ను తమ కుమార్తెగా అంగీకరించి తమ అడుగుజాడల్లో ఒక్కటిగా చేసి నడిపించుకపోతున్నవారు 'తమరు' మాత్రమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఇప్పుడు ఆంతరికం కూడా ఛిన్నాభిన్నమై చెదరిపోయినట్లు అనిపిస్తోంది. ఇంకా ఎలా ఉంది అంటే, చెల్లాచెదరైపోయిన కణకణంలోను 'మాలిక్'నే చూడగలుగుతున్నాను. నా బాబూజీ, ఇప్పుడు నా ఈ దశలో ఎలా ఉందంటే, ప్రకంపనలు (Vibrations) ఉంటూ కూడా చలనం క్రమంగా మందగిస్తూ పూర్తిగా నిలిచిపోతున్నటువంటి మైదానంలో నేను ముందుకు సాగిపోతున్నట్లు అనిపిస్తోంది. నా కోసం ప్రకృతియే శాంతి వహించినట్లు ఉంది. ఇంకా చెప్పాలంటే, అణువణువులోను, కణకణంలోను చలనం దాదాపు శాంతం దాల్చినట్లు ఉంది. ఈ దశ ఎటువంటిది అంటే, దీనిలో సమస్త విశ్వం లేదా ప్రకృతి యొక్క ప్రతికణంలోను నేను వ్యాపించిపోయినట్లు అనిపిస్తోంది. ఈ 'నేను' గురించి వ్రాయాల్సివస్తే, మాయారహితంగాను, నిర్జీవంగాను అయిపోయినట్లు చెప్పాల్సి ఉంటుంది. నా కణకణమూ చిన్నాభిన్నమైపోయి, చెల్లాచెదురైపోయినట్లుగాను, మాయారహితంగా అయిపోయినట్లుగాను అనిపిస్తోంది. చలనాలు అన్నీ నిలిచిపోయాయి. స్వామి, సేవకుడు అను భావం, సంబంధాలు తొలగిపోయాయి. బాబూజీ, ఇంకా చెప్పాలంటే, ఆంతరిక దృష్టి యొక్క దృష్టి కూడా సమసిపోయింది. అన్ని రంగులు, రూపాలు కూడా అదృశ్యమైపోయాయి. నేను మాత్రం శూన్యంగా అయిపోతూ సాగిపోతున్నాను.

కేసర్‌కి తీరిక దొరకటం లేదు. అందుచేత తమకు ప్రణామ మాచరిస్తూ తానేమీ చేయలేకపోతున్నట్లు, దయచేసి తమరు తనపై కృప నిలపాలని కోరుతోంది. ఫూలో జిజ్జీ తమకు ప్రణామం చెబుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 356

కాన్పూర్,

05.12.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా లేఖ అందిందని భావిస్తున్నాను. ఈశ్వరుడు నా ఈ జబ్బు ద్వారా నా ఆంతరికాన్ని శుభ్రం చేసాడనిపిస్తోంది. అలా ఎందుకు అంటే, నేను 'అతడి'ని నాలో ఇంకా బాగా నిలుపుకుంటాను అని. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మికదశను గురించి వ్రాస్తున్నాను.

నాలో లయమవుతున్న ఈ దశ, ఇటువంటిది అని చెప్పటానికి వీలుపడనిదిగా ఉన్నట్లు అనిపిస్తోంది. ప్రకృతి కూడా నా కోసం లయమై పోతున్నట్లు లేదా నశించిపోతున్నట్లు అనిపిస్తోంది. అన్నివైపులా, అన్ని వస్తువులూ మౌనందాల్చిన ప్రదేశంగా అనుభవమవుతోంది. ఇది ఒక మైదానం కాకుండా రుద్ర భూమిలాగా ఉంది. తమరు ఆరోగ్యవంతులు కావాలని ఆశిస్తున్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 357

షాజహాన్‌పూర్,

07.12.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం అందింది. నీవు నీ ఉత్తరంలో తరచుగా నశింపు గురించి వ్రాశావు. నశింపు అంటే దేహత్యాగం చేయటం కాదు. దానిని ఆరోగ్యంగా ఉంచటమే మన ధర్మంగా ఉంటుంది. దేహత్యాగం చేయటమంటే, మన స్థూల సూక్ష్మ అహంకారాలను తొలగించుకోవాలి. ఆ విధంగా అహం తొలగిన తర్వాత, మానవుడు స్వచ్ఛమై

అసలైన మానవుడుగా తయారవుతాడు. ఈ ప్రయత్నంలోనే మహాత్ములు అందరూ తలమునకలై ఉంటారు. ఇప్పుడు మరణించటం (నశింపు కావటం) అంటే ఏమిటో నీకు అర్థమై ఉంటుంది. ఇప్పుడు నీవు ఆరోగ్యవంతం కావటం కొరకే ప్రయత్నించాల్సి ఉంది. ఒక్కసారి నీవు ఆరోగ్యవంతురాలవైతే, అది నీ (ధ్యాన) సాధనకు, మిషన్ కార్యనిర్వహణకు ఎంతగా ఉపయోగపడుతుందో ఆలోచించుకో. **నీ వ్యాధులన్నీ తొలగిపోతున్నట్లుగాను, నీవు ఆరోగ్యవంతమవుతున్నట్లుగాను నీ ధ్యాస నిలుపుకోవాలి. ఈ విధంగా ఆచరణ చేస్తే నీవు త్వరగా కోలుకుంటావు.**

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 358

కాన్పూర్,

11.12.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉంటుందని ఆశిస్తున్నాను. ప్రస్తుతం నా ఆధ్యాత్మిక దశ 'మాలిక్' కృపతో కొంచెం నిదానంగా ఉంది. బహుశా దీనికి కారణం పాయింట్ మార్పిడి దశ వలన కావచ్చు. ప్రస్తుతం ప్రూఫులు వస్తున్నాయనుకుంటాను. దాని ప్రింట్ ఎలా జరుగుతోంది?

అమ్మగారు 'తమ'కు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 359

షాజహాన్‌పూర్,

14.12.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీవు 05.12.1953వ తేదీతో వ్రాసిన ఉత్తరం చేరింది. **శరీరం ఆరోగ్యంగా ఉంచుకోవటం ప్రతి ఒక్కరి ధర్మం. శరీరం ఆరోగ్యంగా ఉన్నట్లయితే అదే తరహాలో సూక్ష్మ శరీరం కూడా ఆరోగ్యంగా తయారుకావటమేకాక, మెదడు (మైండ్) ఆలోచన, విశ్లేషణలకు బాగా పని చేస్తుంది.** గత ఉత్తరంలో నేను నీకు "కృశించిపోవటం" అంటే "ఎవ్వరైనా తన అహంను తొలగించుకోవటం" అని వ్రాశాను. అంతేకాని దాని అర్థం శరీరాన్ని నిర్లక్ష్యంచేసి, బలహీనపడిపోయి చివరకు మరణించటం కాదు. ఈ అహంను తొలగించుకోవటానికే జనం చాలా ప్రయాసపడిపోతారు. మన సహజమార్గ విధానంలో ఇది చాలా సులభంగా తొలగిపోతుంది. అది ఎలా అంటే, నీవు అవలంబించిన విధానాన్ని అనుసరిస్తే అది తొలగిపోతుంది. దాని కొరకు వేరే విధానాలు ఉన్నప్పటికీ అవి కొంచెం కష్టసాధ్యంగా ఉంటాయి. జనానికి శ్రద్ధయే లేనప్పుడు ఎవరేమి చేస్తారు. అందుచేత ఈ విధానం మీద పూర్తిగా విశ్వాసం లేనంతవరకు ప్రతి ఒక్కరికి దీని గురించి చెప్పకూడదు. ఒకవేళ చెప్పినా ఆచరించేవారు ఎవరు ఉన్నారు! శిక్షకునికి అనగా ప్రిసెప్టర్‌కు ఈ విషయంలో బాగా అహంకార రహితంగా ఉండవలసిన అవసరం ఉంది. అలా లేకుంటే ఈ విధానం మంచి ఫలితం ఇవ్వదు. నా గురించి చింతించవద్దు. ఎందుకంటే, నాకు ఇప్పుడే మరణం రాదు. పుస్తకం యొక్క ప్రూఫులు వస్తూ ఉన్నాయి.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 360

కాన్పూర్,
14.12.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన పోస్టుకార్డ్, 7.12.1953వ తేదీతో ఉన్నది చేరింది, చదివి సంతోషించాను. 'మాలిక్' దయతో (Energy) శక్తి దినదినాభివృద్ధి చెందుతోంది. ఏది ఏమైనా సరే, నేను తమ శ్రమను వృధాకానివ్వను. తమ కృపను గ్రహించటమే నా పూజగా ఉంటుంది. 'మరణం' గురించి తమరు వ్యాఖ్యానించినది చాలా బాగుంది. అయితే 'మాలిక్' కృపవలన దీనిని నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. నా బాబూజీ, ఈ మిషన్ (రామచంద్ర మిషన్) నాది, నా కణకణమూ దాని సేవ చేస్తుంది. ఎందుకంటే, అది నా కర్తవ్యం మాత్రమేగాక 'మాలిక్'ను పూర్తిగా ప్రాప్తం చేసుకోవాల్సి ఉంది. అందుకు ఆరోగ్యంగా ఉండాలనటంలో సందేహం లేదు. జబ్బు కారణంగా అభ్యాసానికి నష్టం వాటిల్లుతున్నది. కాని నా ప్రార్థన ఏమిటంటే, తమరు అధికంగా శ్రమించవద్దని, ఎక్కువగా ఆలోచించవద్దని. ఎందుకంటే, తమ శరీరం కూడా చాలా నిర్బలమైనది కనుక.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 361

లఖీంపుర్,
27.12.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇప్పుడు మాస్టర్ సాహెబ్‌జీ (ఈశ్వర్ సహాయ్‌జీ) కూడా తమవద్దకు చేరి ఉండవచ్చు. తమరు స్వస్థత చెందాలని ఆశిస్తున్నాను. ఈ రోజంతా చెవులు 'పండిట్‌జీ' అను శబ్దం వినటానికిగాను సత్యాగ్రహం చేస్తున్నట్లు కూర్చున్నాయి. కాళ్ళు అయితే ఆఫీస్ వరకు పరుగులు తీయటానికి ఉవ్విళ్ళూరుతున్నాయి. చేతులు స్వయంగా వాటికవి కట్టుకుని తమ ఐక్యతను చాటుతున్నట్లు అనిపిస్తోంది. పరమ సౌమ్యం మరియు సుమధుర ముఖారవిందాన్ని దర్శించటానికని నయనాలు ఉత్సాహంతో ఉన్నాయి. కనురెప్పలు విప్పుకుని తమ ఇష్టదైవాన్ని స్వాగతించటంలో విలీనమైపోయాయి. కాని చీకటిపడటం వలన తమ రాక యొక్క సమయం దాటినందువలన, లేఖ వ్రాస్తున్నాను. ప్రూపులు మరియు బలహీనతల కారణంగా తమరు రాలేకపోయి ఉంటారని నాకు అనిపిస్తోంది. సరే, 'తమరు' ఎక్కడ ఉన్నా, నావారే అని, నావారుగానే ఉంటారని నాకు విశ్వాసం ఉంది. ఇప్పుడు వసంత పంచమి సమీపిస్తోంది, అప్పుడు తప్పకుండా తమ దర్శనం కలుగుతుంది.

నా బాబూజీ, ఇప్పుడు ఉన్న స్థితిలో మరపుస్థితియే సర్వత్రా నెలకొని ఉంది. ఇప్పుడు దశ ఎలా ఉందంటే, దశ యొక్క సౌందర్యంలో సువాసన కూడా లేకుండా పోయింది. విచారగ్రస్తంగా గాని, మరేమీగాని లేవు. దశ శూన్యతలో కోల్పోతూ సాగిపోయినట్లు అనిపిస్తోంది. స్పృహ ఉన్నా, లేనటువంటి దశ వస్తోంది. మరపుస్థితి, మరపులేనిస్థితుల మాటే కాకుండా హృదయం ఎక్కడో లోతుకు దూసుకుపోతోంది, కాని ఏమీ దక్కటం లేదు. ఇప్పుడు కలుగుతున్న దశలో, హృదయంలో ఏమీ వ్రాయబడి ఉండలేదు కనుక చదివేందుకు ఏముంటుంది? నాబాబూజీ, తమతో ఉన్న అనుబంధంలో ఏమైనా లోపంగాని, బలహీనతగాని ఉన్నాయంటారా! నేను మాత్రం అటువంటిది ఏమీ ఉందనుకోను. మనస్సుకు ఏమైందో ఏమోకాని అది సర్వత్రా ఉన్నట్లుగాను, లేనట్లుగాను చూస్తున్నాను. వాస్తవానికి అది ఎక్కడా లేదు. నా ఆవేదన ఎక్కడో అణచిపెట్టబడి ఉండవచ్చు. అక్కడ మనస్సు కూడా

ఉండవచ్చు. ఇప్పుడు ఎటువంటి దశ ఉందంటే, దానిలో రూపం లేదు, రంగు కూడా మాసిపోయింది. ఈ దశ, ఆరిపోతున్న దీపం లాంటిది. అప్పుడప్పుడు తన కాంతిని విజృంభించి ఆ తర్వాత అణగారిపోయినట్లు ఉంది. దయచేసి నాపై శ్రద్ధ చూపండి. నేను మాత్రం ఎలా ఉన్నానో అలాగే తమ ఎదుట ఉన్నాను. నా ఈ దశ ఎలా ఉందంటే, దీనిలో చెడిపోయిందీ లేదు, బాగయ్యిందీ లేదు.

నా ఆరోగ్య స్థితి బాగానే ఉంది కనుక దానిని గురించి వ్రాయలేదు, తావూజీ తమకు చెప్పుతారు. కాని తావూజీ ఇప్పుడు రావటం లేదు. అమ్మగారు తమకు ఆశీర్వాదాలు, కేసర్, బిట్టొ మరియు లల్లూ ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 362

లఖీంపుర్,

03.01.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఈరోజు మాస్టర్ సాహెబ్ (ఈశ్వర్ సహాయ్) గారి ద్వారా తమ ఆరోగ్యం గురించిన సమాచారం విని సంతోషించాను. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. నా బాబూజీ, నిదానంగా సాగుతున్న నా ఉన్నతిని నేను సహించలేకపోతున్నాను. నేను ఎక్కువగా సహాయం చేయలేకపోతున్నందువల్లనే నా 'మాలిక్' ఇలా దయ చూపుతున్నారనుకుంటాను. నేను కోరే దానిలో ఔచిత్యం ఉందనుకుంటె, ఇప్పుడు కూడా ఇదివరకులాగా తమ సహాయక హస్తాన్ని చాపండి. నిదానంగా పురోగమించటం వలన నా మనస్సు విసుగుచెందుతోంది. ఈ విధంగా వ్యధ చెందుతున్న కారణంగా కలిగిన ఒత్తిడితో నా ఉదరం యొక్క నాళాలలో దుఃఖమే వ్యాపిస్తోంది. అది నిదానంగా సద్దుమణిగిపోతుంది కనుక తమరు చింతించవద్దు. ఇంకొక నా విన్నపం ఏమిటంటే, నేను ఇదివరకటిలాగానే పని ప్రారంభించాను. అది నాకు ఏమీ కష్టమనిపించటం లేదు. 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో ఏమనిపిస్తోంది అంటే, నేను ఎక్కడ ఉన్నా, అక్కడ ఎటువంటి అనుభూతి ఉండే అవకాశమే లేదు శ్వాసలో కూడా. బాహ్యాంతరాలు ఇప్పుడు సమాప్తమైపోయాయి. సూక్ష్మత్వం కూడా కనుమరుగైపోతున్నట్లు ఉంది, అంతేకాదు అది కరిగిపోయింది కూడా. శ్వాస యొక్క అనుభూతి అయితే లేదుగాని, జీవనం మాత్రం ఉంది. దీపంలో తైలం అయిపోతున్నదను మాట తప్పక చెప్పాలి. సూక్ష్మత్వం కూడా నీరుగారిపోయి నాలో పీల్చుకుపోతున్నట్లు ఉంది. మరి నా పరిస్థితి ఏమిటంటే, 'మాలిక్' యొక్క నరనరాల్లో నేను దూరిపోతున్నట్లు అనిపిస్తోంది. నా బాబూజీ, ఇప్పుడు 'సూక్ష్మత్వం' గురించి తప్పక వ్రాస్తాను, కాని దాని వర్ణన చెప్పనలవికాదు, వినగలిగినదీ కాదు, అనుభవానికి అందేది కాదు. దాని బరువు మాత్రం దృష్టికి వస్తుంది. పైన నేను వ్రాసిన జీవనం (జీవితం) సామాన్య జీవనం కాదు, కాని అది 'మాలిక్' అనుగ్రహించిన జీవనం (జీవితం). అదే నన్ను పురోగమింపజేస్తూంది. బాబూజీ, నా సూక్ష్మరూపం ఇప్పుడు నా 'మాలిక్'లో కరిగిపోయినట్లు ఉంది. ఈ దశ ఏమిటోగాని, చేతిమీద చేయి వేసుకుని కూర్చున్నాను కాని, స్పర్శ తెలియడం లేదు. ఇంకా చెప్పాలంటే, విస్మృతి దశ అనగా స్పృహలేని దశగా కూడా అనిపించటం లేదు. ఈ దశ సూక్ష్మ రూపానికి చెందినదిగా అయిపోయింది, అంటే నా సూక్ష్మ రూపానికి నేను అంటిపెట్టుకోనట్లుగానే ఉంటున్నాను. నేను దానిలోనికి ప్రవేశించిపోతున్నాను లేదా 'మాలిక్' స్వయంగా నన్ను దానిలోనికి చేర్చి తీసుకుపోతున్నారు. ఇంతకుపూర్వమైతే నేను 'మాలిక్'తో నిరంతరం ఆంతరికంగా సంబంధం, స్పర్శ కలిగి ఉండేదానను. కాని ఎప్పుడైతే ఆ స్పర్శ యొక్క జ్ఞానంతో నేను అంటనట్లుగా

ఉంటున్నానో అప్పటి నుంచి నాకు ఆ పాత అనుభవం కలగటం లేదు. ఏదైతేనేమి, ఎలా ఉంటేనేమి, ఉన్నది 'మాలిక్' మాత్రమే. ఈ మధ్యలో ఉన్న స్పర్శ అనేది తొలగిపోయి, ఆంతరికంలో దేనిలోకో దూసుకుపోతోంది. ఇప్పుడు అది లోపలి ఇంద్రియాల జ్ఞానంతో కూడా స్పర్శలేనటువంటిదై స్వచ్ఛంగా తయారైంది. 'మాలిక్' దయతో ఈ స్పర్శ అనే దశ సక్రమంగా నడుస్తున్నట్లు అనుభవమవుతోంది. అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టొ ప్రణామం తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 363

లఖీంపుర్,

05.01.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను ఒక ఉత్తరం వ్రాసాను. దానిలో ఒక విషయం వ్రాయటం మర్చిపోయాను. అది ఏమిటంటే, లక్నోలో చతుర్వేది అనే ఒకాయన ఉన్నారు. వారి పెద్ద కుమారుడు (లేదా మరెవరో) బాగా పిచ్చివాడైపోయాడు. అందుచేత ఆయన తావూజీకి అతడిని ఇక్కడకు తీసుకు రావటానికి మరియు తమవద్దకు తీసుకు వెళ్ళటానికని ఉత్తరం వ్రాశారు. అయితే తావూజీ వారిని వారిస్తూ జాబు వ్రాశారు. మా పినతండ్రిగారు ఇటీవలనే లక్నో వచ్చినపుడు వారు తమ చిరునామాను వ్రాసుకున్నారు. బహుశా వారు ఆ పిచ్చివానిని తమవద్దకు తీసుకురావచ్చని అనుకుంటాను. కాని అమ్మ, మేమందరం కూడా చెప్పేది ఏమిటంటే, 'తమ' ఆరోగ్యం బాగుండ లేదు, కనుక ఆ విషయం ఏమీ పట్టించుకోవద్దు అని. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, గతంలో నేను వ్రాసినట్లుగా– ఉన్న పిచ్చితనం చూస్తూ చూస్తూనే అంతులేకుండా పోయింది. ఇప్పుడు ఉన్న దశ ఎటువంటిది అంటే, అది శూన్యత యొక్క దశను కూడా స్పృశించకుండా పోయింది. దానిని ఇంకొక రకంగా చెప్పాలంటే, దృష్టి లేదా అనుభవం (Touchingless) స్పర్శా రహితంగా అయిపోయింది. (Vacuum) శూన్య స్థితి యొక్క ప్రభావాన్ని 'మాలిక్' నాలో కల్పిస్తూ వెళ్తున్నారు. బాబూజీ, ఇంకా నా సంగతి ఏమిటంటే, పూర్తిగా శూన్యతయే ఉంది. దానిలో ఈ అనుభవం యొక్క స్పర్శ (Touching) కూడా లేదు. ఎటువంటి గాలి కూడా (ఆధ్యాత్మికమైనది లేదా ఆంతరికమైనది) ఈ దశను తాకలేకపోతున్నది. ఆధ్యాత్మికతకు చెందిన వాయువు కూడా లేకుండా ఉంది. 'మాలిక్' కృపతో ఏమనిపిస్తోంది అంటే, ఇప్పుడు నేను దీనిలోనికే చొచ్చుకుపోతున్నాను. అంతా శూన్యమే అయి  ఉండగా ఇంక చొచ్చుకుపోవటం కూడా ఎక్కడికి? నా బాబూజీ, మరి స్థితి ఏమిటి అంటారా, 'మాలిక్' వస్తువునంతటినీ శూన్యంచేసి ఉంచినట్లు అనిపిస్తోంది. దానిని ఎలా శూన్యంగా చేసారో నా 'మాలిక్'కే తెలియాలి. ఏదైనాగాని 'అతడు' తన అభీష్టంమేరకే చేస్తాడు.

ఈ రోజు శుక్లాజీ వచ్చారు. ఇంకా మా ఇంటికి రాలేదు. అయితే వారిలో ప్రేమ మూలంగా ఆకర్షణ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. లయ–అవస్థ కూడా బాగున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు నా స్థితి ఏమిటంటే, శూన్యత అయితే ఉంది కాని మరి దేనికీ దారి లేదు. అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టొలు ప్రణామం చెబుతున్నారు. అమ్మ మెదడులో కొంత బలహీనత ఉంది, కొంచెం తడిలేమి లేదా పొడిబారినట్లుగా ఉండటంతో అప్పుడప్పుడు తల తిరిగినట్లు ఉంటుంది, అయినాగాని చింతించాల్సిన అవసరం లేదు. దైవ కృపతో అన్నీ సద్దుకుంటాయి.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 364

లఖీంపుర్,
10.01.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. మాస్టర్ సాహెబ్ నుద్దేశించి తమరు వ్రాసిన పోస్టుకార్డు చేరింది. విషయాలు తెలిశాయి. అమ్మకు, భోజనాంతరం 'తమరు' ఏదైతే తినమని చెప్పారో అది తింటోంది. దాదీ బహుశా నిన్న వెళ్ళి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో నడుస్తున్న ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఉన్న దశ ఎలా ఉందంటే, 'మాలిక్'ను నాలో ఇముడ్చు కొన్నప్పటికీ దశలో మధురానుభూతి కలగటంగాని, ఇంకా ఏదైనా భావనగాని లేదా అనుభూతిగాని కలగటం లేదు. దశ ఇదివరలో ఎలా ఉందో అలాగే ఉంది. అనగా (No feeling of 'Touching') స్పర్శారహిత దశయే ఉంటోంది. బ్రహ్మదశకు కూడా దూరంగా, అస్పృశ్యంగా నా దశ నడుస్తోంది.

నా 'శ్రీ బాబూజీ', నా ఈ దశలో, ఈశ్వరీయ ధార నన్ను స్పర్శించలేనట్లుగాను, నాలోకి దూసుకుపోవటం లేదన్నట్లుగాను అనిపిస్తోంది. 'మాలిక్' నాకు ఈ దశ ఎందుకు కల్పించారో తెలియటం లేదు. ఎందుకంటే, ఒకవేళ నేను 'మాలిక్' యొక్క ధ్యానం చేసినప్పటికీ, నేను 'అతడి'ని స్పర్శించలేనట్లు అవుతోంది. ఆ స్పర్శ కలగకపోవటం ఎందుకో ఆ 'మాలిక్'కే తెలుసు. బహుశా ఇందుకే ఉత్సాహం తగ్గుతూ ఉండవచ్చు. అది ఏమిటో 'మాలిక్'కే తెలియాలి.

నా 'శ్రీ బాబూజీ', ఇప్పుడు నా ఈ దశ ఎలా ఉందంటే, 'మాలిక్' యొక్క నరనరాల్లోను నేను కలిసిపోయినప్పటికీ, నేను 'అతడి'ని స్పర్శించలేకపోతున్నట్లు ఉంది. ఇంకొక విషయం కూడా ఉంది. అది ఏమిటంటే, 'మాలిక్' నన్ను ఖాళీచేసి ఉంచినట్లుగాను, అదే విధంగా 'మాలిక్' కూడా పూర్తిగా ఖాళీ అయిపోయినట్లుగాను నాకు అనిపిస్తోంది. రూపం మీద ధ్యానం చేసినప్పటికీ, అందులో కూడా ఏమీలేనట్లుగాను, పూర్తిగా ఖాళీగాను, స్వచ్ఛంగా ఉన్నట్లుగాను అనుభవమవుతోంది. ఇంతకుపూర్వం– 'మాలిక్' సర్వస్వతంత్రుడై ఉండి కూడా బందీకృతుడై ఉన్నాడు అను నా అనుభూతి, ఈ కారణంగానే నాలో కలలాగా కరిగిపోయి ఉండవచ్చు. హృదయం బంధనరహితమైనది కనుక అది కూడా శూన్యమైపోయినట్లు అనిపిస్తోంది. ఇంతేగాకుండా, బాహ్యాంతరాల్లో ఇదే దశ సరిసమానంగా ఉంటోంది. ఈ దశ బ్రహ్మదర్శనానికి చెందినదిగాని, అఖండ చలనరహిత స్థితికి చెందినదిగాని కాదు. బాబూజీ, ఇప్పుడు ఈ దశ అనేది ఉన్నట్లుగా కాకుండా లేనట్లుగానే ఉంది.

'మాలిక్' కృపతో 30.12.1953న పూలో జిజ్జీకి కుమారుడు పుట్టాడు. అలాగే అలహాబాద్‌లో బంగా భాయిసాహెబ్‌కు కూడా 6.01.1954 తారీఖున కొడుకు పుట్టాడు. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. నాకు 7,8 రోజుల నుండి ఎందుకో తెలియదు కాని రాత్రంతా నిద్ర రావటం లేదు. బోర్లాపడి నిద్రించటం వలన, రాత్రంతా మేల్కొని ఉన్నట్లుగానే ఉంటోంది. కాని ప్రత్యేకించి ఎటువంటి ఇబ్బంది ఉన్నట్లు అనిపించటం లేదు. ఉదరం కుడివైపు అయితే అంతా బాగానే ఉందిగాని, ఎడమవైపు మాత్రం కొంచెం నొక్కితే బాధాకరంగానే ఉంటోంది. ఇంకా చెప్పుకోదగ్గ కష్టాలేమీ లేవు. కనుక విచారించకండి.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 365

లఖీంపుర్,

18.01.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. అమ్మ, చిన్న సోదరుడు మరియు బిట్టొ 20 లేదా 21వ తారీఖుల్లో అలహాబాద్‌కు వెళ్తున్నారు. అక్కడి నుండి అందరూ మరియు పెద్దసోదరుడు కూడా తప్పనిసరిగా రమ్మని ఆహ్వానించారు. అక్కడి నుంచి అమ్మ ఇంకా తదితరులు 6వ తారీఖుకు ఉత్సవంలో పాల్గొనటానికి షాజహాన్‌పూర్ చేరుకుంటారు. ఇక్కడి నుండి మేము కూడా 6వ తేదీ రాత్రి గం. 11.00 లకు అక్కడికి చేరుకుంటాము.

శ్రీ బాబూజీ, ఇప్పటికయితే నేను "రాజయోగంలో ప్రేమ మరియు భక్తి యొక్క సమన్వయం" అను వ్యాసం వ్రాశాను. 'తమరు' అనుమతించినట్లయితే, ఈసారి మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. నేనయితే తప్పక మాట్లాడగలను. ఎందుకంటే, తమరు, "బిటియా, నీవు వ్రాయగలవు, వ్రాస్తూ ఉండు" అని చెప్పి ఉన్నారు. అప్పటినుండి నేను వ్రాస్తున్నాను. గతసంవత్సరం తమరు, "బిటియా, నీవు మాట్లాడగలవు" అని చెప్పారు. అప్పటి నుండి నాకు తమరు ఆదేశించినట్లుగానే మాట్లాడాలని ఆసక్తి కలిగింది. హిందీలో మాట్లాడటానికి అనుమతి ఇస్తే, నేను పార్లమెంట్ సమావేశాల్లో కూడా మన మిషన్‌కు ప్రాతినిధ్యం వహించటానికి ప్రయత్నించగలను, ఏమి జరుగుతుందో చూద్దాం. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో, నేను గతంలో వ్రాసినది, ఈశ్వరీయ ధార నన్ను స్పర్శించలేకపోయింది అన్నట్లుగానే ఇప్పుడు పవిత్రత, స్వచ్ఛతల స్థితి కూడా అలాగే ఉంది. అవి నా దరిదాపులకు కూడా రాకుండా ఉన్నాయి. వినయం లేదా మరేదైనాగాని నన్ను స్పర్శించలేకపోతున్నాయి. నా హృదయం కూడా వీటిని స్పర్శించలేకపోతున్నది. ఒకవేళ స్థితిని కల్పించుకున్నప్పటికీ అది పైపైనే తేలిపోతున్నట్లు ఉంటోంది కాని, నన్నుగాని, నా హృదయాన్నిగాని ఏది కూడా స్పర్శించలేకపోతోంది. ఇంతేకాదు, 'మాలిక్'ను గురించి ధ్యానం చేస్తూ ఉన్నా కూడా పవిత్రత అను దానిని కూడా అనుభూతి చెందలేకపోతున్నాను. ఒక శూన్య రూపం వంటిదే తేలియాడుతున్నట్లు అనిపిస్తోంది. అయితే ఆ శూన్య రూపమే ఇప్పుడు నా దశగా ఉంది. అదే నా రూపంగాను ఉంది, అక్కడే నేను ఉన్నాను. ఈ దశ ఎలా ఉందంటే, నా రూపం 'అతని' రూపంలో కలిసిపోయినట్లుగాను, నా రంగు కూడా విస్తరించుకుపోయినట్లుగాను అనిపిస్తోంది. ఇంకా ఎలా ఉందంటే, 'మాలిక్' స్వరూపం కూడా శూన్యమైపోయినట్లు ఉండటమేగాక, అది కూడా ఎంత స్వతంత్రంగా లేదా స్వేచ్ఛగా అంటే, నా రూపంగా కావాలంటే నా రూపంగానే, హృదయంగా కావాలనుకుంటె అలాగనే, ఎదురుగా ఉంచితే ఎదురుగానే, ఆంతరికంగా ఉంచాలనుకుంటే ఆంతరికంగానే (అనగా నేను ఎలా తలచుకుంటే అలా) ఉంటోంది. అది ఎంత తేలికగా ఉందంటే, గాలిలో తేలియాడుతున్నట్లు ఉంది. నా రూపం కూడా ఎంత తేలికగా అయిపోయిందంటే, ఊదితే ఎగిరిపోయినట్లు ఉంది. ఈ స్థితిని వర్ణించాలంటే దీని ముందు ఒక గడ్డిపోచ కూడా బరువే అన్నట్లు ఉంటుంది. ఇటువంటి దశలో నేను విహరిస్తూ పోతున్నాను. ఆ విధంగా నాలో నేనుగా చొచ్చుకుపోతున్నాను. నేను ఈ దశను గురించి ఇంకా ఏమని వ్రాయను, ఉన్నది ఉన్నట్లుగా వ్రాశాను. అయినాగాని నా దశ భారంగానే ఉండవచ్చు. అలాగే ఒక రోమం కూడా భారమే అనిపించవచ్చు. ఒక ఖాళీ మైదానం నాలో వ్యాపించి ఉన్నట్లు ఉంది. అంతేకాదు, నా సూక్ష్మ రూపం కూడా ఒక శూన్య మైదానంలాగాను, ఏమీలేనిదిగాను అయిపోయింది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్, బిట్టొ మరియు లల్లూ తమకు ప్రణామం చెప్పుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 366

లఖీంపుర్,
23.01.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందిందని ఆశిస్తున్నాను. తమరు దయతో వ్రాసిన పోస్టుకార్డును మాస్టర్ సాహెబ్ చదివి వినిపించారు. విన్నాక చాలా సంతోషం కలిగింది. నిజంగా మాస్టర్ సాహెబ్ చాలా ధన్యులు, ఎందుకంటే, వారు 'మాలిక్'కు సేవ చేయటంలోను, తమ కర్తవ్య పాలనలోను సర్వదా అగ్రగామిగా ఉన్నారు. వారు లఖీంపుర్ పేరును ప్రతిష్ఠాత్మకంగా చేశారు. అందుకు 'మాలిక్' కృపయే అవకాశం కల్పించింది. వారికి అనేకానేక ధన్యవాదాలు.

కారణం ఏమిటో నాకు తెలియదు కాని, తమ కృప మరియు ప్రేమ, నాకు పనిని ముందుగానే అప్పగించాయి, అలాగే పని ఆరంభించటానికి పూర్వమే నాకు చైతన్యం కలిగించాయి. 'మాలిక్' యొక్క సంకేతంతోనే పని అంతా జరిగిపోయింది. తమరి కృప మరియు మాస్టర్ సాహెబ్ యొక్క కృషితో పూర్తిగా సఫలమవుతుంది. ఉత్సవం జరిగే మైదానంలో, మాస్టర్ సాహెబ్ నిర్వహణ చాలా వేగంగాను, విస్తారంగాను జరిగినట్లు తెలుస్తోంది. వాతావరణం అంతా కూడా దివ్యత్వంతో నిండిపోయింది. వాస్తవంగా, అదంతా 'తమకు' తెలుసు. అది 'తమరి' సాటిలేని కృపయే.

'మాలిక్' దయతో అక్కడి జనుల (అభ్యాసుల) ఆంతరికాల్ని శుభ్రం (నిర్మలీకరణ) చేయాల్సి ఉంది. దానిని నేను తప్పకుండా నిర్వహిస్తాను. అందుకు నాకు ఏమాత్రం కష్టమనిపించటం లేదు. ఏమిటో తెలియదు కాని నేను ఒక క్రొత్త విషయం చూస్తున్నాను. అది ఏమిటంటే, నేను ఉత్సవ మైదానంలోకి దృష్టి సారించినప్పుడల్లా, అక్కడి పనిలో నా (Shadow) ఛాయ నెలకొని ఉన్నట్లు చూస్తున్నాను, అంతేకాదు ఆ ఛాయలో 'మాలిక్' యొక్క ఉనికిని చూస్తున్నాను. నేను ఈ విషయం తమ ఉత్తరం రాకపూర్వం నుంచే గమనిస్తున్నాను.

మేమందరం ఉత్సవం కోసం నిరీక్షస్తున్నాము. నెమ్మది నెమ్మదిగా ఉత్సవం దగ్గర పడుతోంది. ఆత్మిక దశను గురించి గత ఉత్తరంలోనే వ్రాశాను. ఇంకా ఏమయ్యింది అంటే, లయ-అవస్థ యొక్క అనుభూతి నాకు కలగటం లేదు. ఇది ఎంత తేలికైన మాట అంటె, నేను దీనిలో తేలియాడుతూనే ఉన్నాను కాని ఈ స్థితి యొక్క అనుభవం మాత్రం పొందలేకపోతున్నాను. మిషన్‌కు చెందిన పని అలహాబాద్‌లో సంపూర్ణంగా సఫలం కావాలి అని ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఇది వాస్తవికత ప్రకటితం కావాల్సిన సమయం, అది జరిగి తీరుతుంది, అందులో సందేహం లేదు. కేసర్ తమకు ప్రణామంచేసి చెబుతోంది ఏమిటంటే, "శ్రీ బాబూజీ! ఇంకా నేను పూజలో తక్కువ కృషి చేస్తున్నాను, అయితే తమ కృపమీదనే ఆధారపడి ఉన్నాను" అని.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 367

లఖీంపుర్,
31.01.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' వ్రాసిన రెండు పోస్టుకార్డులు అందాయి. వాటిల్లోని విషయాలు తెలుసుకొని సంతోషించాను. బాబూజీ, నా వద్ద ఏదైనా కొంచెం (ఆధ్యాత్మికత) ఉంది అంటే, అది 'తమరు' ఇచ్చినదే. జ్ఞానం (Knowledge) అంటే నాకు నాకేమి తెలుసు. నాకు వాటితోగాని, వాటికి నాతోగాని ఏమి పని ఉంటుంది. అవునుగాని,

'అతని' జ్ఞాపకంలో ఏదైనా వ్రాసినపుడుగాని, చదివినపుడుగాని అది నాకు తోడుగా ఉంటుంది. శ్రీ బాబూజీ, అక్కడికి త్వరగా చేరాలను ఉద్దేశ్యంతో నా శరీరం, నా వశంలో లేకుండా పోతోంది. అందుకు ధైర్యం, సహనం వహించవలసి వస్తోంది. డబ్బు త్వరగా కావాలని బాబూజీతో చెప్పమని, తావూజీ మాస్టర్ సాహెబ్‌కు చెప్పి పంపారు. అది అందితే 5వ తేదీ రాత్రికిగాని లేదా 6వ తేదీ రాత్రికిగాని చేరుకుంటాము. అతిధులు (పుండ్లు) విడిచిపోయారు. ఇప్పుడింక ఎల్లుండి, ఆవలెల్లుండులు అని లేకుండా పోయాయి. ఇంకను పల్చని రసి కారుతోంది కాని అది కూడా హెూమియో మందుతో ఎల్లుండి, ఆవలెల్లుండికి పూర్తిగా మానిపోయి మామూలుగా అయిపోతుంది. ఈరోజు మధ్యాహ్నం ఒకటిన్నర గంటకు మాస్టర్ సాహెబ్ అలహాబాద్ వెళ్తున్నారు, రేపు ఉదయం 5 గంటలకు చేరిపోతారు.

నేను వ్రాసిన వ్యాసం స్వచ్ఛంగా రాలేదని తమరు వ్రాశారు. ఒకటి, రెండు రోజుల్లో దానిని సరిచేయటానికి ప్రయత్నిస్తాను. వ్యాసంలోలాగ కాకుండా దశ శుద్ధమైంది. ఇప్పుడు స్థితి బాగానే సాగిపోతోంది. కొంచెం భారమనిపించే స్థితుల నుండి నేను విముక్తరాలనైనట్లు అనిపిస్తోంది. మరణానంతరం మనిషి ఏ విధంగా బాదరబందీ లేకుండా స్వేచ్ఛగా అయిపోతాడో అదే విధంగా నా స్థితి కూడా స్వేచ్ఛగా, తేలికగా ఉన్నట్లు అనిపిస్తోంది. నేను లోపల (ఆంతరికంలో) పరిశీలించినట్లయితే, బాహ్యంలోలాగానే అది కూడా ఖాళీగా కనిపిస్తోంది. లోపలగాని, బయటగాని నేను బందీకృతురాలుగా లేను. ఒక చిన్న పడవ, మహాసముద్రంలో అలలు లేవు కనుక, తిరగబడుతుందనే భయం లేదు. వాయువు కూడా తోడుగా అనుకూలంగానే ఉంది. అక్కడ జీవజంతువులు ఏవీలేవు. ఎక్కడా త్రాళ్ళుకట్టి లేవు కనుక వాటిల్లో చిక్కుకుపోయే అవకాశం లేదు. ఈ విధంగా స్వచ్ఛంగా, నిర్మలంగా ఉన్న సముద్రం నా ఎదుట ఉంది. శ్రీ బాబూజీ, నా దశ యొక్క దశ ఇలా ఉంటే, ఇంక నా 'మాలిక్' సంగతి ఏమని చెప్పను! 'మాలిక్'తో ఉన్న సంబంధాన్నిబట్టి 'అతడి' గురించి ఆలోచించాల్సిన పనిలేదు. ఇంక ఎక్కడైనా చూడటంగాని, వెదకటంగాని లేదు. దానికి బరువు అంటూ లేదు. నాకు ఏమనిపిస్తోంది అంటే, ఆ చతురుడైన నావికుడు (అనగా మాలిక్) నెమ్మదిగా నావకు కట్టిన త్రాళ్ళు అన్నింటినీ త్రెంచివేసి ప్రశాంత సాగరంలో ముందుకు సాగిపోయేట్లు వదిలి వేశాడు. ఆ నావ నావగా ఉండి కూడా, తన ఉనికి యొక్క స్పృహ కూడా లేకుండా సాగిపోతోంది. అయితే, ఏదైనా చిరుగాలి సోకినప్పుడు మాత్రం ఆ నావకు 'అతని' ఉనికి యొక్క స్పృహానుభూతి మాత్రం కలుగుతుంది. 'అతడు' ఉన్న ఆ అనుభూతి యొక్క సహాయంతోనే అది సాగిపోతోందని అనిపిస్తోంది. నా 'మాలిక్' (బాబూజీ), ఈ దశలో, నేను ఎక్కడ ఉన్నా, అక్కడ నుంచి నా స్వంత జాడ యొక్క సమాచారాన్ని పొందలేకపోతున్నాను. కేసర్, మంజూ, మున్నీ తమకు ప్రణామం తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 368

షాజహాన్‌పూర్,
02.02.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం చేరింది. "నాకు ఉన్నదంతా తమరు ఇచ్చినదే" అని నీవు వ్రాసింది బాగుంది. "ఇవ్వటం, తీసుకోవటం" అనే ప్రశ్న ఉదయించినపుడు నా దగ్గర ఉన్నదంతా కూడా నీవు ఇచ్చినదే అని నాకూ అనిపిస్తుంది. నీ స్థితిని చదివాక, నీవు బంధనం నుంచి విముక్తి పొందినట్లు నాకు అనిపిస్తోంది. ఇది భగవంతుడుకి బాగా తెలుసు. ఈ స్థితిలో కూడా ఇంకా ఈదవలసినది చాలా ఉంది. నీవు సాధించదలచినది సాధించావు. ఇంకా ఎక్కువ సాధించటానికి తలపెట్టునటువంటి మానవ ప్రయత్నం ఇంతటితో ముగిసిపోతుంది. అయితే నా కళ్ళు కళ్ళుగా లేవు. మరి చూడాలంటే

దేనితో చూడను. నా పరిస్థితి ఏమిటో తెలియకుండా ఉంది. ప్రతి స్థితిలోను దైవానికి ధన్యవాదాలర్పిస్తాను.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 369

లఖీంపుర్,

16.02.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. మేమందరం నిన్న చాలా క్షేమంగా ఇక్కడకు చేరాము. శ్రీ బాబూజీ, అక్కడి (ఉత్సవం) నుంచి రావాలనిపించలేదు. కాని రాక తప్పలేదు. ఉత్సవం అంటే ఇలా ఉండాలి, ఇది నిజం. నేను అక్కడి అణువణువును లేదా ఆ ప్రాంతాన్ని పరిశీలించటంలో, నాకు ఉన్న కొద్దిపాటి సామర్థ్యంతో ఏమి అనుభూతి చెందానో దానిని వ్రాస్తున్నాను. నా విశ్వాసం ప్రకారం, అత్యంత సామర్థ్యం లేక సత్తా ఉన్న వారికే దీనిని గ్రహించగలగటం సంభవమవుతుంది. ఒక్క కణంలో ఉన్న స్థితి ఎటువంటిది అంటె, అది సమస్త బ్రహ్మాండం యొక్క ఆత్మిక పాలన చేయగలదు. కాదంటే, సమస్త బ్రహ్మాండం యొక్క ఆత్మిక శక్తితో పాలించగలదు అని అనుభూతి చెందాను. ఇంకా నేను గ్రహించినది ఏమిటంటే, **ప్రతి సత్సంగీ (అభ్యాసీ) యొక్క హృదయం, ఎటువంటి దశతో అనుసంధానమై ఉన్నదంటే, వేయి సంవత్సరాల తపస్యానంతరం ఒక నిజమైన సద్గురువు యొక్క శరణును పొంది ఉన్న అభ్యాసీయైనా పొందగలడో లేదో అన్నట్లు ఉంది.** ఇందులో సందేహం లేదు. నేనయితే తమ ప్రాణాహుతి శక్తిని ఇప్పుడు కేవలం అల్పంగా మాత్రమే అనుభూతి చెందాను. కాని 'మాలిక్' కృపతో నేను దానిని అధికాధికంగా పొందగలనన్న విశ్వాసం నాకు ఉంది. ఇటువంటి (Divine condition) దివ్య స్థితి, ప్రాణాహుతి శక్తి ఎక్కడ దక్కుతాయి? ఈ ఉత్సవంలో పాల్గొన్న ప్రతి అభ్యాసీ, ఎంత స్వచ్ఛమైన ఆత్మిక స్థితిని పొందాడు అంటే అది మాటల్లో చెప్పనలవికాదు. అక్కడ పవిత్రత మరియు శుద్ధమైన దశయే రాజ్యమేలాయి. వీటిని అంటిపెట్టుకుని ఉండే శక్తి ఎవ్వరికీ ఉండకపోవచ్చు. **ఇది తప్పనిసరిగా చదివి ఉండటమో లేక విని ఉండటమో జరిగింది. అది ఏమిటంటే, సంవత్సరాల తరబడి తపస్సుతోను, సంయమనం మరియు సాధన తర్వాత, సాధకులు ఎప్పుడు యోగ్యులవుతారో, అప్పుడే మహాత్ములు వారిలో ఒకరిద్దరు శిష్యులను మాత్రమే ఆధ్యాత్మికంగా ఉన్నత దశకు చేర్చుతూ ఉండేవారు. నేను, మన సమర్థ లాలాజీ సాహెబ్ చరణాలకు శతాధిక ప్రణామాలు చేస్తున్నాను. ఎందుకంటే, మనకు తెలిసి ఉన్నా, తెలియకపోయినా కూడా మనకు ఆత్మ ప్రకాశం పొందునటువంటి వెలుగును నిరంతరం కలిగి ఉన్న నేటికాలాన్ని వారు ప్రసాదించారు.** నేను నా ఆత్మిక దశను గురించి ఏమి వ్రాయాలి బాబూజీ!

నా స్థితి ఎలా ఉందంటే, ఈ ప్రపంచం యొక్క గాలితో శ్వాస తీసుకోవటం కూడా కష్టమనిపిస్తోంది. ఈ దశ ఎంత తేలికగా ఉందని చెప్పాలంటే, దానిలో శ్వాసకు కూడా అవకాశం లేనట్లుగా ఉంది. ఇంకా ఏమిటంటే, శ్వాస అనేది వేరైనది అన్నట్లుగాను, నన్ను స్పర్శించలేకపోతున్నట్లు గాను, నా దరిదాపులకే రాలేకపోతున్నట్లుగాను అనుభూతి చెందుతున్నాను. నాలో 'మాలిక్' కొలువై ఉన్నాడు అను అనుభూతికి చెందిన వాయువు వస్తూ ఉండగా, ఆ వాయువు యొక్క శ్వాసలోనే నేను ఉంటున్నాను. దానితోనే పోషించబడుతూ ఉన్నట్లు ఉంది. కాని అది ఎటువంటి వాయువు అంటె, ఇద్దరినీ కలిపేసినా కూడా, గంగా యమునా నదులులాగా ఒకరి స్పర్శ మరొకరికి తగలనట్లుగానే ఉంది. 'మాలిక్' కృప అనీ, ఇంకా ఏదో అని అంటున్నమాట నిజమే కాని, వాస్తవంగానైతే నాకు ఇప్పుడు 'అతడి' కృపవైపుగా నా దృష్టి నిలవటం లేదు. ఎందుకంటే, నా బాబూజీ, 'అతని' కృప నాదిగానే అయిపోయింది. బాబూజీ, స్థితులు వాటికవే తెరచుకుని వస్తున్నట్లుగాను, వాటి నిర్మల దశలో నేను కలిసిమెలిసిపోతున్నట్లుగాను అనిపిస్తోంది. నేను పైన

వ్రాసిన ఆ దశలో, ఏవైతే 'మాలిక్' నాలో కొలువై ఉన్నాడనుభూతి యొక్క వాయువు ఉందని వ్రాశాను కదా! ఇప్పుడు దానిలో నా అణువణువు తడిసిపోవటమేగాక పీల్చుకుపోవటమో లేదా ఇంకిపోవటమో జరుగుతోంది. నేను వచ్చినప్పటి నుండి సూక్ష్మ శరీర బంధనాలు అన్ని దాదాపుగా నిర్మలమైపోయినట్లు అనిపిస్తోంది. ఆంతరిక నేత్రాలు కూడా తెరవబడి ఉన్నట్లు అనిపిస్తోంది. సంతోషం లేదా తపన ఎలా ఎగసిపడుతున్నాయంటే, అందు మూలంగా నా గుండెను అదిమి పట్టుకుని ఉంటున్నాను. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 370

లఖీంపుర్,
18.02.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. అమ్మ ఆరోగ్యం బాగానే ఉంది. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఎటువంటి దశ ఉన్నదంటే, ఆంతరికం ఎందుకని అలా అనిపిస్తుందో తెలియదుగాని, నా గుండెను గట్టిగా పట్టుకుని తిరగాలని, దానిని పెరకివేయాలని అనిపిస్తోంది. ఇటువంటి బాధతో ఉంటున్నాను. కాని శరీరం బాధతో "హా హా" అంటూ హాహాకారం చేయాలని అనుకోవటం లేదు. దీని మూలంగా నాకు సంతోషం ఏమీ కలగటం లేదు. బహుశా ఈ కారణంగానే తరచుగా నా గుండెలో ఒకసారి అల్పంగాను మరొకసారి ఒక్కపెట్టున వేగంగాను దడ కలిగి మళ్ళీ అంతలోనే అణగారిపోతుంది. అయితే నాకు ఇది క్రొత్త ఏమికాదు, బాధాకరమైనది కాదు. ఇది నేను నా 'మాలిక్' చరణాలు పట్టుకున్నప్పటి నుంచి ప్రారంభమైనదే. శ్రీ బాబూజీ, వినయంతో కూడిన దశ, తుడిచిపెట్టబడిన అద్దంలాగ అయిపోయింది అన్నట్లుగాను, అంతేగాకుండా నా రూపమే ఆ విధంగా అయిపోయినట్లుగాను అనిపిస్తోంది. ఈ అద్దమే నా దృష్టిలో నిలిచిపోయినట్లు ఉంది. అన్నివైపుల నుంచి, ప్రతిదాని నుంచి ఇటువంటి కాంతియే వెలువడుతున్నట్లుగాను, అదే రాజ్యమేలుతున్నట్లుగాను ఉంది. ఇంకా చెప్పాలంటే, నా దృష్టియే దీనిలో కడగబడి వ్యాపించిపోయిందా లేక చూడగలిగిన శక్తి దీనిలోనే కడగబడిగాని లేదా ఇదే చూడగలిగిన శక్తిలో కడగబడి వ్యాపించిపోయిందా అన్నట్లు ఉంది. ఇప్పుడైతే కంటిపాపయే అన్ని దిశలా వ్యాపించి ఉంది. శ్రీ బాబూజీ, ఈ స్థితిలో ఎటు చూసినా, దేనిలో చూసినాగాని నా రూపమే కనిపిస్తోంది, కడిగివేయబడింది (లేదా శుభ్రపరచబడింది) అని చెప్పటంలో కొంత వత్తిడి మరియు స్థూలత్వం వంటిది ఉంటాయి కనుక, ఈ రూపం కేవలం కడగబడింది అని మాత్రమే చెబుతాను. ఈ స్థితిలో ఇంకా ఏమి అనుభవమవుతోంది అంటే, అంతటా కన్నులే విస్తరించి ఉన్నాయి. అయితే నేను దేనిని చూడాలి, ఎవరిని చూడాలి. చూడగల శక్తి అయితే పూర్తిగా వ్యాపించిపోయింది, కనుక ప్రతిదాని నుంచి ప్రకాశమే వెలువడుతోంది. నా స్థితిని "నేను ఇంకేమి మేల్కొనాలి, నా ఆంతరికమే మేల్కొంది" అని మాత్రమే చెప్పగలను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెప్తున్నారు. పూలో జిజ్జి తమకు ప్రణామం చెప్పమని వ్రాశారు. కేసర్, బిట్టొ తమకు ప్రణామం తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 371

లఖీంపుర్,
21.02.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. రెండు ఉత్తరాలు కలిపి పంపుతున్నాను. 'మాలిక్' కృపతో ఏర్పడిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. బాబూజీ, ఈ దశలో ఏకత్వమే రాజ్యమేలుతోంది. కాని ఆంతరికంలో విధేయత మేలుకుంటూ ఉంది. అది పురోగమనానికి మార్గమై ఉంది. అది స్వయంగానే 'మాలిక్' కృపలోనో లేక మాలిక్‌లోనో ప్రకాశవంతమవుతోంది. ఆంతరికంగానో లేదా దృష్టిలోనో కేవలం ఒకే ఒక్క మార్గం కనిపిస్తోంది. దానిలోనే నేను ముందుకు సాగిపోతున్నాను, దాని అంతు ఎక్కడో తెలియటం లేదు. ఎక్కడా మలుపులుగాని (Junctions) కూడళ్ళుగాని లేవు. అలా ఎందుకు అని ఎవ్వరైనా అడగవచ్చు. దానికి సమాధానం ఈ దీనురాలి (భిక్షుకురాలి) వద్ద ఉన్నది ఇదే. ఈ విధేయురాలికి 'మాలిక్' ఏదైతే ఇచ్చారో దానిని (విధేయతను) కూడా 'అతని'కే అర్పించటానికి 'అతడు' ఇచ్చిన ఈ కానుకను 'అతని'కే అర్పించటానికి వెళ్తున్నాను. ఎందుకంటే, ఇదితప్ప ఇవ్వటానికి మరేదీ నావద్ద లేదు. నా బాబూజీ! నేనయితే విధేయతా రూపంగా అయిపోయాను. నా అణువణువూ ఆ విధేయతకు సాక్ష్యంగా ఉన్నాయి. నా లోపల కణకణం నుంచి ఆ విధేయత యొక్క ఆర్తనాదమే వినిపిస్తోంది. నేనేగనుక, ఆ విధేయతే నాలోకి చొచ్చుకుపోయింది అని వ్రాస్తే, ఆ చొచ్చుకుపోవటం అను శబ్దం కూడా భారమవుతుంది. నేనేమి చెబుతానంటే, నేను ఆ విధేయతలో వ్యాపించి ఉన్నానో లేక ఆ విధేయతయే నాలో వ్యాపించి ఉన్నదో అని. అన్ని దిక్కులా, బయట, లోపల, అన్నింటి నుండి నిర్మల ప్రకాశం వస్తోంది.

శ్రీ బాబూజీ, (Oneness) ఏకత్వం ఎలా ఉంది అంటే, నా కణకణమూ అందులో వ్యాపించిపోయింది, లీనమైపోయింది. అది ఎంతగానంటే, ఈ ఏకత్వానికి వ్యతిరేకంగానో లేక దానిని వేరుగా చూడటమో అసంభవమనిపిస్తుంది. ఇప్పుడు ఈ స్థితిలో (Grossness, etc.) దుమ్మూ ధూళి వాటి జాడ తెలియనంతగా శుభ్రత చోటుచేసుకుంది. ఇంక మొదలు నుంచి శాశ్వతంగా స్వచ్ఛమైన మార్గం పరచబడినట్లు ఉంది. నా శరీరం గురించిన స్పృహ కూడా కరిగిపోయి స్వచ్ఛమై పోయింది. ఆంతరికంలో కొద్దిపాటి బంధనం (Bondage) కూడా లేకుండా చేశారు. సూక్ష్మాతి సూక్ష్మ బంధనం కూడా తొలగించి 'మాలిక్' ఆంతరికానికి స్వేచ్ఛ కల్పించాడు అన్నట్లు ఉంది. ఈ స్థితి ఎటువంటిదీ అంటే, జన్మ జన్మాంతరాల సంస్కారాలు లేదా చెత్తచెదారాలన్నింటినీ కృపావంతుడైన 'మాలిక్' ఊడ్చి శుభ్రం చేసినట్లు అనిపిస్తోంది. శరీరంలోను, ప్రతిదానిలోను, ఇంద్రియాలు, వృత్తులు, మనస్సు ఎలా మసకబారిపోయాయి అంటే, ఏది ఉన్నదో, ఏది లేదో తెలియనట్లు ఉంది. 'మాలిక్' బంధనాల నుంచి స్వేచ్ఛను కల్పించి, వినయం యొక్క స్వచ్ఛమైన, ప్రకాశవంతమైన మార్గంలో నన్ను విడిచిపెట్టినట్లుగాను, అది లేకుండా నేను లేనేలేనట్లుగాను అనిపిస్తోంది. ఒకవేళ నేను అక్కడ ఉన్నానని అనుకున్నప్పటికీ, అంతకుముందే నన్ను దానిలో కలిపేశారు. అదే నాకు మార్గంలో అన్నీ చూపిస్తూ తీసుకువెళ్తోంది.

కేసర్ దశ చాలా తేలికైనదిగాను, స్వచ్ఛమైనదిగాను అనిపిస్తోంది. ఆమె, పాపం, దానిని గ్రహించలేక మాటిమాటికీ సహనం కోల్పోతున్నది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 372

లఖీంపుర్,

22.02.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమకు రెండు ఉత్తరాలు వ్రాశాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, ఈ స్థితిలో నేను ఒక భిక్షకురాలిగా ఉన్నాను. ఎటు చూసినా భిక్షాపాత్రయే చూపబడి ఉన్నట్లు ఉంది. కడిగి శుభ్రం చేయబడిన భిక్షాపాత్రయే అన్నివైపులకు చూపబడి ఉన్నట్లుగాను, భిక్షకురాలికి ఆ పాత్రను ఎవరు పట్టుకుని ఉన్నారో కాని, ఎక్కడ పెట్టబడి ఉందోగాని తెలియకనే ఉన్నది. కాని కళ్ళు మూసుకుని ఉన్నట్లుగాను, పాత్ర మాత్రం ఎక్కడ ఉన్నాగాని చూపబడి ఉన్నట్లుగాను తెలుస్తోంది. నా బాబూజీ, హృదయంలోపల గ్రుచ్చుకోవటం ఎలా ఉందంటే, దానివలన తరుచుగా నా కంఠాన్ని తెగ నరుకుకోవాలని, ఒంటి మీద దుస్తులన్నీ పెరికివేయాలని అనిపిస్తోంది. హృదయంలో ఏ ధ్వని లేకుండా మౌనంగానే ఉండిపోయింది అన్నట్లు ఉంది. హృదయం విలవిల్లాడుతున్నట్లు ఉంది. అయితే 'మాలిక్' యొక్క మధుర రూపం నా ఎదుట నిలిచి ఉంది. కేవలం అదే నాకు తోడుగా ఉంది. తరచుగా ఏమనిపిస్తోంది అంటే, ఈ అశాంతి యొక్క పరమాణువులు కూడా నా నుంచే వెలువడుతూ ఉన్నట్లు అనిపిస్తోంది. కాని 'మాలిక్' నా హృదయాన్ని పట్టుకొని ఉండి నేను పైన వ్రాసిన కర్మలు ఏమీ అమలు జరపకుండా నియంత్రించినట్లు ఉంది. 'అతడు' నా మనస్సును వికలం కాకుండా ఉంచుతున్నాడు. అయితే నాలోపల ఉన్న స్థితి ఎలాంటిదంటే, హృదయాన్ని పెరికివేసి చితకబాదాలని అనిపిస్తోంది. కాని దీనివలన లాభం ఏమీ ఉండదు కదా! లోపల అంతా చెదలుపట్టినట్లు ఉంది. పరిశీలిస్తే, పాత్ర అడుగున కూడా ఇదే విధంగా ఉన్నట్లు అనిపించింది.

పూజ్య శ్రీ బాబూజీ! అది ఏమిటో తెలియదు కాని, 2,3 రోజుల నుండి సాయంత్రం రాగానే భయం వేస్తున్నట్లు అనిపిస్తోంది. ఎందుకో నాకు అంతుబట్టడం లేదు. గది నుండి బయటకు వచ్చినా కూడా ఆ భయం వెంటాడుతూనే ఉంది. ఆ సమయంలో అందరూ మేల్కొని ఉన్నా కూడా అలాగే అనిపిస్తోంది. చీకటి సహించలేకపోతున్నాను. ఇది ఏమిటోగాని, భయపడటమనేది నా స్వభావానికే విరుద్ధమైనట్టి విషయం. ఇప్పుడు 2,3 రోజుల నుండి ఏమైందో తెలియదు, కాని మనస్సు మాత్రం పూర్తి సరళంగాను, తేలికగాను ఉంటోంది. కేసర్‌కు కూడా భయమేస్తున్నట్లు చెబుతోంది, కాని అది భయం కంటె కొంచెం తక్కువ స్థాయిదే. భయంవల్లనేమో హృదయం కంపించుతోంది. ఆ భయం కలగటానికి కారణం ఏమిటో తెలియడం లేదు. నేను ఒక్కొక్కసారి విచారంగాను, ఒక్కొక్కసారి విశ్రాంతి లేనట్లుగాను ఉంటున్నాను. ఇదే నా స్థితి.

తావూజీ, కేసర్ మరియు బిట్టొ ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 373

షాజహాన్‌పూర్,

27.02.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. తులసీదాస్ (కస్తూరీ బెహెన్ సోదరుడు) ఇక్కడకు వచ్చారు. ఒక నలభై నిమిషాలసేపు నాతో గడిపారు. ఆయన 16.02.1954వ తేదీతో ఉన్న నీ ఉత్తరం అందించారు. ఈ ఉత్తరంలో మొత్తం మన లాలాజీ సాహెబ్ గురించిన ప్రశంసయే ఉన్నట్లు నాకు అనిపించింది. వాస్తవంగా 'వారు' అందుకు అర్హులు కూడా. ఉత్సవం

(బసంత పంచమి)లో అంతా 'వారి' కృపయే వర్ధిల్లింది. నీవు గ్రహించినది ఏదో అది సరైనదే. నిజం చెప్పాలంటే నా ద్వారా జరిగేవి ఏవైనా ఉన్నప్పటికి వాటిని గురించి నాకు ఏమీ తెలియదు. ఇక్కడ విశేషించి చెప్పవలసింది ఏమీలేదు కాని, యాత్ర జరుగుతున్నపుడు, నేను తరుచుగా నిందపడాల్సి వస్తోంది– నేను పూర్తిగా అంచనా వేయలేకపోయిన కారణంగా. అది ఎందుకంటే, జీవంలేని వాటికి నేను శక్తిని (Charge) ఇస్తున్నప్పుడు, నేను తరచుగా అవసరానికిమించి ఇవ్వటం జరిగింది. గోశాల (గోవుల నివాసం) మీద నేను దృష్టిని సారించినప్పుడు అక్కడ పిల్లలు కూడా ఉన్నారని భావించాను. నా ప్రథమ తప్పిదం మధురలో ఉన్న గోవర్ధనగిరి విషయంలో జరిగింది. ఆ సందర్భంలో నావలన ఈ విధంగా కూడా జరుగుతుందని నేను ఊహించలేకపోయాను. అది నా ప్రథమ ప్రయత్నం కూడ. ఇదంతా వ్రాయడం వ్యర్థమే. ఇది నా దినచర్య పుస్తకంలో పూర్తిగా వ్రాయబడి ఉంది.

జనం షాజహాన్‌పూర్‌కు వస్తూ ఉంటారు. నేను వారికి సత్సంగ్ జరుపుతాను. అయితే ఎవ్వరైనా కొద్దిరోజులపాటు ఇక్కడ ఉంటే నేను వారికి ఏమి చేయాలి అనేది సరిగ్గా ఆలోచనకు వస్తుంది. ఆ విధంగా నేను గ్రహించి, తగిన విధంగా చేసినట్లయితే ఫలితం బాగుంటుంది. నీ విషయంలో కూడా ఇలాగే జరిగింది. దాని ఫలితంగా ఆత్మ యొక్క బంధనాలు సడలింపు కావటం జరిగింది, అది ఎంతగానంటే, వాటి అనుభూతి చెందటం చాలా కష్టం.

1954 ఫిబ్రవరి 18 మరియు 22వ తేదీల్లో నీ స్థితిని గురించి వ్రాశావు. నేను సంక్షిప్తంగా వాటికి కూడా జవాబు ఇస్తున్నాను. నీలో కలిగిన స్వచ్ఛత ఎటువంటిదంటే, నా మనస్సు కూడా ఇటువంటి స్వచ్ఛత కోసం ఆరాటపడుతుంది. నాలో స్వచ్ఛమైనది ఏదైనా ఉందంటే, అది నా లాలాజీ సాహెబ్ ప్రసాదించినదే. మిగిలిన విషయాన్ని నీవు ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు. సృష్టి అంతా నా పొట్టలోనే ఇమిడి ఉన్నట్లుగాను, దానిలో జరిగే అలజడులు అన్నీ నన్ను తాకుతున్నట్లుగాను అర్థం చేసుకోవచ్చు. శుభ్రత, అశుభ్రతలన్నీ దానిలోనే ఇమిడి ఉంటాయి. నీలో శుచిత్వాన్ని గమనిస్తున్నప్పుడు నేను ఆనందపడిపోతూ ఉంటాను. ఏమని చెప్పను, ఈశ్వరునికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలపటానికి నావద్ద మాటలు లేవు. ఆధ్యాత్మిక ఉన్నతి దాని అంతిమస్థాయికి చేరినప్పుడు, దానిలోని విశిష్టత ఎటువంటిదంటే, దానిని వర్ణింపతరం కాదు. అంతేకాదు, అది ఒక రహస్యం కూడ. దానిని దాచటానికి నా హృదయం అంగీకరించటం లేదు. అందుకని ఆ మర్మాన్ని పూర్తిగా వివరించటానికి ప్రయత్నం చేయను. ఎందుకంటే, జనులు ఎవ్వరూ దీనిని అంగీకరించటానికి సిద్ధపడకపోవచ్చు. ఒకవేళ సిద్ధపడినప్పటికీ ఆధ్యాత్మిక పురోగతికి ఎవ్వరూ ఇష్టపడకపోవచ్చు. ఈశ్వరుడు చేర్చిన ఆ ఉన్నతస్థితి ఎటువంటిదంటే, దాని నుంచి వైదొలగటానికి అభ్యాసీకి మనసొప్పదు. ఈ రహస్యాన్ని బహిర్గతం చేయటానికి నేను శక్తివంచనలేకుండా ప్రయత్నిస్తున్నాను కాని నోరు విప్పటానికి మనస్సు అంగీకరించటం లేదు. హృదయం అడ్డుపడుతోంది. ఇది చాలా పెద్ద రహస్యం కనుక దానిని అలా ఉండనివ్వు. ఆ దశకు చేరినవారికి లేదా ఆ స్థితిని పొందినవారు ఎవ్వరికైనా నేను దానిని గురించి చిన్న సూచన ఇచ్చినట్లయితే దానిని అతడు అర్థం చేసుకోగలుగుతాడు. నా జీవితకాలంలో ఎవ్వరైనా ఆ దశకు చేరటమో లేక స్థితిని పొందటమో జరిగినట్లయితే అప్పుడు నేను సంతోషపడతాను. ఎటుచూసినా నీకు నీ ముఖమే కనిపిస్తోంది అని నీవు వ్రాశావు. ఇది చాలా మంచి స్థితి. దీనినే మహాత్ములు (Realisation) సాక్షాత్కారంగా అంటారు. ఇటువంటి ఉన్నతస్థితికి స్వాభావికంగా చేరినటువంటివారు చాలా అరుదుగానే ఉంటారు. ఒకవేళ ఉన్నప్పటికీ దానిని మించి మరొక్క మెట్టు ఎక్కగలిగితే (ఉన్నతి చెందగలిగితే) అది పరిపూర్ణత (Perfection) పొందినట్లవుతుంది. ఆధ్యాత్మికతకోసం చేసే ప్రయత్నాలు ఇక్కడితో ఆగిపోతాయి, అయితే నా అభిప్రాయంలో ఇది సాక్షాత్కారానికి మొదటి సోపానం మాత్రమే. నీ సాక్షాత్కార స్థితిని గురించి చెప్పాలంటే దాని A,B,C,Dలు ఇప్పుడు ఆరంభమైనట్లు చెప్పాల్సి ఉంటుంది. ఈ విషయం నేను ఎవరితోనైనా ప్రస్తావించినట్లయితే నన్ను ఒక వెర్రివానిగా జమకట్టారు. ఒకవేళ అతనికి, నాకు కూడా ఆధ్యాత్మికలో ప్రవేశం ఉందని తెలిసినట్లయితే, అతడు నన్ను ఒక

బడాయికోరుగా జమకట్టారు. ఈ మానవునికి ఏమీ తెలియదు, అయినప్పటికి నేను నా రచనల్లో ఏదో విధంగా విషయాలన్నీ వ్రాశాను. ప్రస్తుత స్థితిని నీవు స్వచ్ఛమైన తురీయావస్థగా చెప్పవచ్చు.

1954 ఫిబ్రవరి 21వతేదీతో నీవు వ్రాసిన ఉత్తరంలో విధేయత గురించి వ్రాశావు. అది చాలా ఉన్నతమైన స్థితి. విధేయుడు ఎప్పుడూ విధేయుడుగానే ఉంటాడు. అతడు మాలిక్‌ను తన సర్వస్వంగా భావిస్తాడు. అందుచేత మనం కూడా (Submissiveness) విధేయతా భావాన్నే కలిగి ఉండటం చాలా మంచిది. ఈ ఆలోచన రోజంతా నా మదిలో మెదుల్తూనే ఉంది. ఇది చాలా మంచిది కనుక దానిని నాలో నిలుపుకోవటానికి చాలా ప్రయత్నించాను. నాకు ఈ విషయం ఎప్పుడూ దృష్టికి రాలేదు, ఒకవేళ అనుభవానికి వచ్చి ఉన్నప్పటికీ అది జ్ఞాపకం లేదు. ఈ విధేయతను సాధ్యమైనంతవరకూ ఎప్పటికీ నిర్లక్ష్యం చేయకూడదు. ఎందుకంటే, ఇదే ముందుకు నడిపిస్తుంది. నీవు స్వయంగా గాని, మాస్టర్‌సాహెబ్‌తో సంప్రదించిగాని, నేను ఈ విధేయతా స్థితిని ఎలా పొందాలో తెలియజేయాలి. ఇది చాలా మంచి విషయం. అమ్మగార్కి ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

**అనుబంధం:** పైన వ్రాసిన జాబు పూర్తయ్యేసరికి నీ ఉత్తరం 22.02.1954వ తేదీగలది చేరింది. దుస్తులు ఊడతీసిపారేయాలని అనిపిస్తోందని, ఇంకా ఏవో నీవు వ్రాశావు. ఇటివంటివన్నీ నీలోని అవిశ్రాంతతను నివారించుకోవటానికి తలపించినవిగా నేను భావిస్తున్నాను. ఇది కూడా తపనకు చెందిన ఒక స్థితియే. పైన వ్రాసిన చర్యలు జరగకుండా ఎవరో నీ గుండెను లేదా హృదయాన్ని నొక్కిపట్టి ఉంచినట్లు అనిపిస్తోంది అని నీవు వ్రాశావు. ఇవన్నీ మన లాలాజీ సాహెబ్ యొక్క అద్భుతాలే. అలా కాకుంటే, ఇటువంటి అవధూతగా మారే అవకాశం ఉంది. మన మిషన్‌లో ఎవరూ అవధూతలు కాబోరు.

నీవు భయం, భీతి గురించి వ్రాశావు. ఇది చాలా మంచి స్థితి. షుమారు 6 లేకా 7 మాసాల క్రితం నేను ఏదో ఒక ఉత్తరంలో వ్రాయటమో లేక మాటల్లోనో ప్రస్తావించినట్లు జ్ఞాపకం ఉంది, అది నీకు ఎప్పుడైనా భయం యొక్క అనుభూతి కలిగిందా అని. దానికి సమాధానంగా నీవు 'అవును' అని చెప్పావు. అప్పుడు ఈ స్థితి పరిపక్వత చెందలేదు. ఇప్పుడు అది పరిపూర్ణస్థాయికి వచ్చింది. ఈ స్థితిని 'ఖుదా తరసీ' స్థితి అంటారు. తరస్ అనగా భయం, అనగా భగవంతునిపట్ల భయం అనిపించటం. ఈ స్థితి కలిగిన తర్వాత, శాస్త్రవిరుద్ధమైన పనులు ఏవైనా మనస్సుకు చేయాలనిపించినట్లయితే, ఈ భీతి కారణంగా ఆ విధంగా చేయటం జరగదు. ఈ ఆధ్యాత్మిక స్థితిని ఫకీరులు (సెయింట్స్) మెచ్చుకున్నారు. నీకు ఈ స్థితిని (భీతి స్థితిని) భగవంతుడు అనుగ్రహించుగాక! దీనిని నేను కుదించను. సమయం వచ్చినప్పుడు దానంతట అదే సక్రమంగా కలుగుతుంది. నేను నీకు నిర్దేశించిన పనిని, దానినే మాస్టర్ సాహెబ్ కూడా జ్ఞాపకం చేసి ఉండవచ్చు, దానిపైన దృష్టి నిలుపు.

## ఉత్తరం సంఖ్య - 374

లఖీంపుర్,
27.02.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కృపతో మాస్టర్ సాహెబ్‌కు వ్రాసిన పోస్టుకార్డులోని విషయాలు విని విచారం కలిగింది. ఈశ్వరుని ప్రార్థిస్తున్నాను. 'అతడు' తప్పక మన మొరాలికిస్తాడు. నేను మంగళవారం తావూజీతోపాటు అలహాబాద్ వెళ్తున్నాను. చాచా మరియు అమ్మకు కూడా అదే కోరిక ఉంది. ఇంతకుమించి విశేషాలు ఏమీలేవు. సిన్హా దంపతుల అభిలాష 'మాలిక్' కృపతో బాగానే నెరవేరుతోంది. వాళ్ళ విశ్వాసం మరియు అనుభవం కూడా

బాగానే ఉన్నాయి. అదంతా 'మాలిక్'కు తెలిసిందే. ఇద్దరూ షాజహాన్‌పూర్ నుంచి తిరిగివచ్చాక దాదాపు ప్రతిరోజు పూజ్య మాస్టర్ సాహెబ్‌వద్దకో లేక నావద్దకో వస్తూనే ఉన్నారు. నా పొట్టలో జాడ్యం (వాతరోగం) గురించి తమరు అడిగారు. దానివలన బాధ అయితే లేదు కాని, కొంత భారంగా అనిపిస్తోంది. ప్రేగుల్లోను, ఉదరంలోను కొంత ఉపశమనం కలుగుతోంది. 'మాలిక్' కృపతో ఏర్పడిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. తమరు ఇకమీదట నాకు వ్రాసే ఉత్తరాలు అలహాబాద్‌కు వ్రాయండి.

బాబూజీ, ఇప్పుడు ఈ దశలో ఇచ్చిపుచ్చుకోవటాల స్పృహ అనేది సమాప్తమైపోయినట్లు అనిపిస్తోంది. ఇంకను భిక్షాపాత్రయే విస్తరించి ఉన్నది. 'అతని' ఇష్టప్రకారం ఇవ్వదలచింది ఇస్తాడు. కోరుకున్నది తీసుకుంటాను, కాని పాత్ర మాత్రం ఖాళీగానే ఉంది. నా దృష్టి, (Senses) ఇంద్రియాలు లేదా వృత్తులు వగైరా ఎక్కడో పైనే ఉన్నట్లుగాను, హృదయంలో ఏమీలేనట్లుగాను అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే బాబూజీ, పాత్ర కూడా దాని ప్రతికణం 'మాలిక్' కృపతో కూడి ఉన్నట్లు ఉంది. ఇంకో విధంగా చెప్పాలంటే, బహుశా దాని (పాత్ర) కణకణం 'మాలిక్' యొక్క జ్ఞాపకంతోనే కూర్చబడి ఉన్నట్లు ఉంది, కనుక కణకణం 'అతడే' అయిపోయినట్లుగాను లేదా కణకణంలో 'అతడే' ఇమిడిపోయినట్లు ఉంది. ఇప్పుడింకొక దశలో ఏమనిపిస్తోంది అంటే, నా అణువణువులోనూ 'అతడి' జ్ఞాపకమే నిలిచిపోయినట్లుగాను లేదా కణకణం, రోమ రోమం, 'అతడే' ఉన్నట్లు ఉంది. ఇంకా చెప్పాలంటే, నాలో 'అతడు' లయమైపోయాడు అనిగాని, నా లోపలికి చొచ్చుకుపోయాడనిగాని చెప్పవచ్చు. ఇంకా ఎలా ఉందంటే, నా కణకణం విప్పి చూసినట్లయితే కేవలం 'అతడు' ఒక్కడే కనిపిస్తున్నాడు. నాలోని కణకణాలన్నీ వాటంతటవే వ్యాప్తమైపోయినట్లు ఉంది. శరీరంలోను, సూక్ష్మశరీరంలోను, కణకణంలోను అంతటా 'అతని' వ్యాపకమే (వ్యాపించి ఉండటం) ఉంది కాని మదింపు అంటూ ఎక్కడా లేదు. ఇంకా చెప్పాలంటే, దృష్టితో చేస్తే శక్తి ఏదైనా ఉంటే, ఆ బిందువుల స్థానంలో 'అతడే' పొదగబడి / కూర్చబడి ఉన్నాడని అనిపిస్తోంది. 'అతడు' లేకపోవటం అంటూ ఎక్కడా, ఎప్పుడూ లేనేలేదు. నేను ఎప్పుడు 'అతని'కే చెందియే ఉన్నాను, చెంది ఉంటున్నాను అను విషయంలో ఏమని చెప్పేది! నాలో ఒక రకమైన పవన చలనం కలిగింది. దానితో 'అతడి' ఉనికి యొక్క కంపనాన్ని (కదలిక) కల్పిస్తోంది. నా కణకణంలోను, పరిశుద్ధం, స్వతంత్రం మరియు తేలిక స్థితి ఏవైతే నాలో ఉన్నాయో అది 'అతని' అనుభూతినే కల్పిస్తున్నాయి. ఈ దశ ఎంత సునిశితమైనది అంటే, అది 'అతని' వాతావరణంలోనే ఉండి, దానివల్లనే 'అతని' యొక్క భావన కలుగుతోంది. ఇంకా చెప్పాలంటే, అటువంటి వాతావరణంలోనే నేను ఉన్నాననిగాని, లేదా కేవలం 'అతని'తో కలిసిమెలసి ఉన్న వాతావరణంలోనే నేను ఉన్నాను అనిగాని చెప్పాల్సి ఉంటుంది. నాకయితే దాని స్పృహలేదు, 'అతని'కే తెలియాలి. శ్రీ బాబూజీ, అసలు (Seed) బీజమే దగ్ధమైపోయిందా అని అనిపిస్తోంది. ఇప్పుడు ఉన్నది ప్రవాహమే ప్రవాహం. మరి దశ ఏమిటంటే, అది ఒక భూతద్దం (Convex Mirror) లాంటిది, దానిలో నా రూపం చిత్రించబడింది. ఈ స్థితిని గురించి చెప్పాలంటే,

"ప్రతి హృదయంలోను చిత్రం ఉంది, కొంచెం మెడవంచి చూడాలి." అనగా నా ప్రియుని చిత్రం నా హృదయంలో ఉంది, నేను తలవంచినపుడు 'అతడి'ని చూశాను అని.

భయం కలుగుతోందని నేను వ్రాశాను కదా! అది, తమకు దాని గురించి ఉత్తరం వ్రాసిన రోజు నుంచి తొలగిపోయింది. అయితే అప్పుడప్పుడు దాని స్పందన వస్తున్నాగాని వెంటనే తొలగిపోతోంది. ఈ దశలో ఎలా ఉందంటే, నాకు తెలిసియో తెలియకనో, నా స్వభావం, నా నడత, ఆచరణ, పద్ధతులన్నీ ప్రకృతితో అనుకూలించి ఉంటున్నాయి. ఇంకా చెప్పాలంటే, ప్రకృతియే నా హృదయం, నా నివాసంగా ఉంటున్నాయి.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 375

లఖీంపుర్,

02.03.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరంతో ఉన్న కవర్ నిన్న అందింది, చదివి ఆనందించాను. నేను వెళ్తున్న సమయంలో తమరు ఏ పనియైతే అప్పగించారో, అది నాదిగానే భావించండి, మరి నేను ఎలా మరచిపోతాను? ఈశ్వరుని కృపతో తప్పనిసరిగా విజయం కలుగుతుంది. నేను రేపు మధ్యాహ్నం అలహాబాద్ వెళ్ళుతున్నాను. 'మాలిక్' దయతో నాకు కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, నా దృష్టియే సర్వత్రా వ్యాపించి ఉంటోంది, కాని ఏదీ కనిపించటం లేదు. చూడగల శక్తియే వ్యాపించి ఉన్నదని నేను ఇంతకుముందు వ్రాశాను కదా! కాని దానిలో అటువంటి ప్రకాశం లేదు ఇప్పుడు. ఇంకోరకంగా చెప్పాలంటే, అంతర్దృష్టి యొక్క ప్రకాశం కూడా లేకుండా పోయింది. దీపంలో తైలం అయిపోతూ ఉన్నట్లుగాను, వత్తి తైలాన్ని పీల్చివేస్తున్నట్లుగాను ఉంది. అది ఎలా ఉందంటే, నేను లయావస్థలో ఉండటానికి ప్రయత్నిస్తున్నప్పటికి, లయావస్థ కాకుండా, 'అతని' ఉనికి యొక్క గాలి ప్రతికణంలోను ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. నా బాబూజీ, లయావస్థయే తన అవస్థను నాలో లయం చేసుకున్నదా అని అనిపిస్తోంది. దానితో అది స్వతంత్రించిపోవటమేగాక, నన్ను కూడా దాని (లయావస్థ) అనుభూతి యొక్క బంధనం నుంచి విముక్తి చేసినట్లు అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, 'అతని' జ్ఞాపకంతో ఉండటం ఇప్పుడు స్వయంగా ఒక బంధనంలాగా ఉంటోంది. బాబూజీ, ఇప్పుడు పాత్ర (భిక్షాపాత్ర) లేక స్వచ్ఛతయే 'అతని' జ్ఞాపకం యొక్క ఉనికికి సాక్ష్యంగా ఉంది. ఇంకా ఏమనిపిస్తోంది అంటే, ఈ శుద్ధత్వాన్ని కూడా దశను పీల్చుకుంటున్నట్లు లేదా హరించి వేస్తున్నట్లు ఉంది.

శ్రీ బాబూజీ, ఇప్పుడు 'మాలిక్' కృపతో, ఇతరుల దశ కూడా పూర్తిగా అనుభవానికి వస్తోంది. తమరు (Realisation) సాక్షాత్కారం గురించి ఏదైతే వ్రాశారో, ఇప్పుడు నాకు కూడా A,B,C,Dలు మాత్రమే ప్రారంభమైనట్లు కనిపిస్తోంది. శుద్ధత కూడా ఇప్పుడే ప్రారంభమవుతున్నట్లు అనిపిస్తోంది. తమరు విధేయత గురించి ఏదైతే వ్రాశారో అది నా స్వచ్ఛమైన ఆలోచన ప్రకారం ఆ విధేయత అనేది ఒక సేవకునికే అన్వయిస్తుంది కాని 'మాలిక్'కు కాదు. ఆ 'మాలిక్' ఎటువంటివారు అంటే, సమస్త విశ్వం 'అతని' హస్తగతంగా ఉన్నటువంటివారు. కాని 'అతని'కి ఆ ఎరుక లేదు. అయితే చూడండి, ఎవరితోనైతే ఆధిపత్యం యొక్క భారం నిర్వహించబడక (నిభాయించబడక) పోతుందో, అటువంటివారు విధేయుణ్ని లేదా సేవకుణ్ని ఎలా నిభాయించ గలుగుతారు. ఎవరిలోనైతే 'ఓమ్' యొక్క శక్తిని ఉద్భవింపజేయగల శక్తి ఉంటుందో, 'అతడు' ఆ విధేయుడికి లేదా సేవకుడికి ఏమూలనో ఆశ్రయం కల్పించగలడు. (బంధితుడు అనగా భక్తుడు ఎప్పుడూ దైవానికి బందీయేగదా! అనగా సర్వసృష్టికి సమ్రాట్ అయిన దైవం తమ విధేయుణ్ని ఉద్ధరిస్తారేకాని అణగద్రొక్కరు అని భావం.)

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 376

షాజహాన్‌పూర్,

06.03.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీవు వ్రాసిన ఉత్తరం 27.02.1954వ తేదీతో ఉన్నది కూడా చేరింది. నేను నీకు వ్రాసిన గత ఉత్తరంలో నీకు అర్థమయ్యేటట్లుగా వివరణ వ్రాయటం జరగలేదు. అది ఏమిటంటే, ఈశ్వరుని గురించిన భీతిస్థితి

ఎప్పుడు ఆరంభమవుతుందో అపుడు భయం యొక్క అనుభూతి కలుగుతుంది. అయితే ఆ భయం ఎవరి గురించి అనేది తెలియదు. కనుక మామూలు భయానికి, ఈ భయానికి (భగవంతుని గూర్చిన భయానికి) ఇదే భేదం.

నీ ఉత్తరం పూర్తిగా చదివి నీ యొక్క ఈ స్థితిని పరిశీలించగా, నీవు ఎంతగానో ఎదురుచూస్తున్న సాక్షాత్కార స్థితి ఇదే అని అనిపిస్తోంది. ఎవ్వరికైనా సాక్షాత్కారం కలిగిందంటే, నాకు ఎంత సంతోషమో! బిటియా! నేను ఏమి చేయను? **నా మాటలు పట్టించుకునేవారు లేరు. అలా కాకుండా నా మాటలు ఆలకించి ఉంటే ఇప్పటివరకు నావద్దకు వస్తున్న అభ్యాసులలో పాతవారు కొందరైనా సాక్షాత్కార స్థితిని పొంది ఉండేవారు. నేను ముత్యాలు వెదజల్లాలనుకుంటున్నాను కాని కొంగుపట్టి వాటిని కూడగట్టుకునేవారు లేరు. ఇదీ నా అదృష్టం!** ఎటువంటి తప్పిదమూ వారిది లేదు, అయితే నీ విషయంలో మాత్రం నీకు సాక్షాత్కారస్థితి కలిగింది అని ఖచ్చితంగా చెప్పగలను. అయితే నీవు దీనితోనే సరిపెట్టుకోవద్దు. ఇప్పుడు ఇంకను ఎంతో దూరం పోవలసి ఉంది. బిటియా! నాకయితే ఇప్పటివరకు దాని అంతుచిక్కలేదు. కొంతమంది జనం తమంతట తామే గొప్ప సెయింట్‌గాను, పరమహంసగాను ఎలా భావించుకుంటారో నాకు అర్థంకాని విషయం. **నేటి పరిస్థితిని చూస్తూ ఉంటే, సన్యాసులలోను, ఇతర సంప్రదాయాలలో కూడా పుస్తకాలు చదివి, కీర్తనలు పాడి, స్తోత్రాలు వల్లిస్తూ, రకరకాల పూజలుచేసి తమంతటతాము బ్రహ్మగా భావించుకుంటున్నట్లుగా ఉంది.** నీ ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని నేను నిన్ను 'W' స్థానం నుంచి ముందుకు నడిపించటం లేదు. ఈ స్థానంలో నీ యాత్ర అనతికాలంలోనే ముగింపు కానున్నదని ధృవపరుస్తూనే, నీవు వ్రాసిన స్థితులు ఏవైతే ఉన్నాయో అవి అన్నీ ఈ స్థానానికి చెందినవే అని తెలుపుతున్నాను. నీ ఆరోగ్య సమాచారం నాకు ఇప్పటికి అందింది.

నేను ఆధ్యాత్మికత గురించి నీ విషయంలో ఎక్కువగా శ్రమించనవసరం లేదు; ఎందుకంటే, దానిని లాలాజీ సాహెబ్ తృటిలో చేయగలరు.

నీవు 02.03.1954న వ్రాసిన ఉత్తరం ఇప్పుడే అందింది. లయ–అవస్థ కలిగినప్పుడు, దాని ప్రయత్నంలో కొంత బంధనం ఉన్నట్లు అనిపిస్తోంది. సాక్షాత్కారం పొందిన తర్వాత 'అతడి'ని జ్ఞాపకం చేసుకునే ప్రయత్నంలో హృదయం కంగారుపడుతుంది. నీ ఉత్తరం ప్రకారం నీవు ఇప్పుడు సాక్షాత్కారం యొక్క రెండవ ప్రకరణంలో ప్రవేశిస్తున్నట్లు అర్థమవుతోంది.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 377

అలాహాబాద్,
09.03.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చదివి సంతోషించాను. తమకు నేను కేవలం శతాధిక ధన్యవాదాలకు మించి ఇంకేమి వ్రాయగలనో అర్థం కావటం లేదు. నేను 'అతని' అభీష్టంమేరకే నడవాలని, 'అతని'కే సమర్పితం కావాలని, తమరు ఆశీర్వదించాలని కోరుతున్నాను. నేనయితే ఓడిపోయాను, ఎందుకంటే, ఈ బాలికపట్ల తమ యొక్క ఇటువంటి కృప మరియు ప్రేమ నన్ను కొనివేశాయి. కాశ్మీరుకు చెందిన ఒక సజ్జనుడు, తన యొక్క ఇంకొక మిత్రునితో కలిసి రెండు రోజుల నుంచి వస్తున్నారు. పూజ (ధ్యానం) చేశారు, ప్రశ్నలు వేశారు. 'మాలిక్' దయతో సంతృప్తి చెందారు. నా ప్రేగుల్లో ఇబ్బంది ఎంతమాత్రం లేదు, కాని వానిలోని శక్తి హరించుకపోయినట్లు అనిపిస్తోంది. నా ఆరోగ్య స్థితిని గురించి 'తమరు' ఇంతగా చింతిస్తున్నారు అది చదివిన తర్వాత అసలు ఈ విషయం నేను

ఎందుకు వ్రాశానా అని దుఃఖిస్తున్నాను. బాబూజీ, ఈ విషయం గురించి తమరు ఇంకెన్నడూ దయచేసి దృష్టిపెట్టవద్దు. నాకయితే నిజంగా కష్టమనిపించలేదు. ఇప్పుడూ లేదు, భారం కూడా ఎంతమాత్రం లేదు. భయం గురించి తమరు వ్రాశారు, కాని అది ఎటువంటి స్థితియో, ఎవరివలన భయం కలుగుతోందో తెలియటం లేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

3వ తారీఖున ఉదయం 8 గం॥లకు పూజలో కూర్చున్నాను. పూజ మధ్యలో, శిరస్సులో ఏమైందో తెలియదుగాని, ఒక్కసారిగా తెరచుకుని ఒక మగత లేక మత్తు వంటిది శిరస్సు అంతటా వ్యాపించింది, దాని ప్రభావం శిరస్సుమీదనేగాక శరీరమంతటా ఉంది. అది ఎంత తేలికైన ప్రభాత స్థితి అంటే, దానితో శరీరమంతా కూడా ప్రభావితమైంది. అది శిరస్సు నుంచి దానికి సంబంధించిన నరాల ద్వారా ఆ స్థితి శరీరమంతటా వ్యాపించినట్లు అనిపించింది. ఏదో తేలికపాటి దశ తెరచుకుని, దానితో ఏదో కల్లోలం లేదా ఝుంకారం వంటిది రెండు నిమిషాలపాటు అనుభవమైంది. ఆ తర్వాత శరీరమంతటిపైనా ఒక ఇంజక్షన్ మాదిరిగా ప్రభావం చూపాక శాంతించింది. ఇంకా ఏమైందంటే, ఎవరైనా ఈ రోజు వ్రతం అని చెప్పినట్లయితే, నేను ఎల్లప్పుడూ వ్రతమాచరిస్తూనే ఉన్నాను కదా, అని అనిపిస్తోంది. అలాగే ఎవ్వరైనా భోజనం చేయమని చెప్తే ఒక్క క్షణంపాటు, అసలు నేను ఎప్పుడూ ఆకలిగా ఉండలేదు, తింటూనే ఉన్నాను గదా, అని అనిపిస్తుంది.

నా బాబూజీ, ఎటువంటి దశ కలిగిందంటే, ఏ విధేయత యొక్క అస్థిత్వం నెలకొని ఉందో, అది సంకోచించుకుపోయి నా హృదయంలోనో లేక మనస్సులోనో కరిగిపోతోంది అని. శుద్ధత కూడా ఒక అద్దంలాగా నా వస్త్రంగా తయారైపోయిందని అనిపిస్తోంది. దానిని కూడా మనస్సు ఎలా పీల్చివేసిందంటే, దానితో (అలా జరగటంతో) ఆ వస్తువు (మనస్సు) ఖాళీ అయిపోయినట్లు ఉంది. బాబూజీ, ఇప్పుడైతే ఆధ్యాత్మిక సామ్రాజ్యం యొక్క దృశ్యం కూడా నాకు కనిపించటం లేదు. అది వెనుకబడిపోయినట్లు ఉంది. ఇప్పుడు (వస్త్రాన్ని పిండి శుభ్రం చేసినట్లు) శుభ్రమైన మైదానంలో నేను ఉన్నట్లు అనిపిస్తోంది. పరిశుభ్రత మరియు విధేయతల సామ్రాజ్యం అనగా వాటి ఏలుబడి హరించుకుపోయినట్లుగాను, విస్తరించి ఉన్న దశ కూడా జీర్ణమైపోయినట్లుగాను ఉంది. ఏమిటో తెలియటం లేదు. ఇప్పుడు ఆత్మ యొక్క మైదానంలో నేను నడుస్తూ ఉన్నట్లు ఉంది. అమ్మగారు తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 378

షాజహాన్‌పూర్,
13.03.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

కుశలమగుగాక! అమ్మగారి ఆరోగ్య విషయంలో నాకు తరచుగా చింత కలుగుతోంది. ఈశ్వరుడు శీఘ్రంగా ఆరోగ్యం ప్రసాదించునట్లు ప్రార్థిస్తాను. 'X','Y' అను రెండు స్థానాల మధ్య ఏదో కొంత అవరోధం ఉన్నది, అది ఇప్పుడు శుభ్రపడింది. ఆ ఆటంకం ఎడమ వంక ఇంకా మిగిలి ఉంది కాని, అది కూడ ఒకటి రెండు రోజుల్లో స్వచ్ఛమైపోతుంది. నీవు మార్చి 9, 1954వ తేదీగల ఉత్తరంలో వ్రాసినటువంటి స్థితి, అది ఆ స్థానానికి చెందినదే. నీ యాత్ర ప్రారంభమైపోయింది కాని అది 'X','Y' అను రెండు స్థానాలకు చెందిన కలగలుపు స్థితి యొక్క యాత్రగా ఉంది. ఎవ్వరైనా ఉపవాస వ్రతం గురించి చర్చించితే నీవు ఆ వ్రతంలోనే మగ్నమై ఉన్నట్లుగా అనిపిస్తోంది అని నీవు వ్రాశావు. ఇది చాలా ఉత్తమ స్థితి. దీనినిబట్టి ఈశ్వరుడు లేదా సత్యత్వం (వాస్తవికత)తో నీ స్థితికి సంబంధం కలిగి ఉన్నట్లు అనిపిస్తోంది. ఎందుకంటే, దీనిలో ఉన్న ఒక గుణం ఏమిటంటే, దైవం ఎప్పుడూ తినడు. తిండి గురించి

ఎవ్వరైనా నీతో మాట్లాడుతున్నప్పుడు, నీవు అప్పటికే తింటున్నట్లుగా నీకు అనిపిస్తుంది అని కూడా వ్రాశావు. దీనినిబట్టి నీకు అటువంటి గుణం కలిగిన దైవంతో సంబంధం ఏర్పడినట్లు గ్రహించాలి. అది ఎలాగంటే పైన చెప్పినట్లుగా ఏమీ తినకుండానే తను తిన్నట్లుగా భావించటం అనగా తినటం, తినకపోవటం అను రెండు స్థితులూ దైవానివే.

నీవు వినమ్రత (Submissiveness) గురించి వ్రాస్తూ అది క్రమంగా జీర్ణించుకుపోతున్నదని వ్రాశావు. ఆ విధంగా అది పూర్తిగా జీర్ణించుకు పోవటం, (రియాలిటి) వాస్తవికతకు చెందిన ఉత్తమ స్థితి. దీనికి సూచనగా నేను మరొక విషయం వ్రాస్తున్నాను. ఈ వ్రాసిన విషయాలను గురించి జనం ఎప్పుడైనా ఆలోచించే అవకాశం కలగవచ్చు. ఈ వినమ్రత ఉన్నంత వరకు మనం బందీలమే. దీనిలో మనం ఎప్పుడైతే జీర్ణించుకు పోతామో, అప్పుడు ఇంక బందీలంకాము. అయితే మానవత్వపు మర్యాద ఎలాంటిదంటే, మాలిక్‌ను మాలిక్‌గా గుర్తించటమే (దైవాన్ని దైవంగా భావించటమే). అభ్యాసులు ఈ వినమ్రతను పాటిస్తే బందీలుగానే ఉండిపోవలసి వస్తుందని భావించి ఈ వినమ్రతను అనుభూతి చెందకుండా దానిని వదలిపెట్టమని అర్థం చేసుకోకూడదు. నమ్రతా భావంవల్లనే కలిగేటటువంటి ఒక స్థితి ఇది. 'Z' స్థానం మీద దీనికంటె మంచి స్థితి కలిగే అవకాశం ఉంది. ఆధ్యాత్మికత నుంచి నీవు మరొక అడుగు ముందుకు వేసినట్లుగా నీలో కలిగిన భావన సరైనదే. అది నేను నా 'సత్యోదయం' (Reality at Dawn) పుస్తకంలో వివరించినట్లుగా, "స్వచ్ఛతను గురించిన భావం లేకుండటమే అసలైన స్వచ్ఛత అయి ఉండగా మరింక అన్నీ కనుమరుగైపోయాక ఇంక మిగిలినది సత్యత్వమే (వాస్తవికతయే)."

ఇదంతా నీ ఘనతను చాటిచెప్పటమే. ఇంతకుమించి నేను ఏమి వ్రాయను! నీలాగనే అభ్యాసులందరూ ఈ సూక్ష్మ విషయాలను అర్థం చేసుకోవాలని కోరుకుంటాను. ఈ జ్ఞానానికి అంతు అంటూ ఏమీ లేదు. నిజం చెప్పాలంటే, అది నాకు కూడా అంతుబట్టదు. ఈ స్థితులు పొందినవారు ఎవరికైనా దీని జాడ తెలుస్తుంది. స్వయంగా ఆలోచన చేయటం మూలంగానే మేధస్సు పెరుగుతుంది, అయితే జనానికి అంత తీరిక ఎక్కడ ఉంది? ఆధ్యాత్మికత కొరకు జనానికి ఆసక్తి పెరిగితే దీనిని వారు అన్నివేళలా తప్పకుండా పొందుతారు. నేను కోరేది, నాకు తెలిసినది ఏదో దానిని అందరికీ నేర్పాలని, దాని తర్వాత వారు దానితో ఉన్నతి చెందుతూ ఉండాలి అని. కాని ఒకరిద్దరు మినహా మరెవ్వరూ సాహసించి ముందుకు వస్తున్నట్లు తోచటం లేదు. **ఎంత సహజం, సులువైన రీతిలో నేర్పబడతున్నప్పటికీ కూడా జనులు తమంతట తాము ఆ హద్దుకు తయారుకాలేకపోతున్నారు.** బాగా పరిశీలించిన మీదట, ఇప్పటివరకు ఇటువంటి ఉన్నత స్థాయికి ఎదిగినవారు ఒరిద్దరు మాత్రమే ఉన్నారన్న మాట వాస్తవం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 379

అలాహాబాద్,
13.03.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరాలు రెండు అందాయి, చదివి ఆనందించాను. అందరి విషయాలు ఆలకించినందుకు ఈశ్వరునికి అనేకానేక ధన్యవాదాలు. ప్రార్థన గురించి ఏమి చెప్పమంటారు, బాబూజీ! ఎప్పుడైతే లఖీంపుర్ నుంచి వెళ్ళానో అప్పటినుంచి దానిమీదకు దృష్టి మళ్ళటం లేదు. పని అయిపోయింది కదా అనిపించటంతో దాదాపు అన్నీ వదిలేశాను. 'X' మరియు 'Y' పాయింట్ల గురించి 'మాలిక్'కు ధన్యవాదాలర్పిస్తున్నాను. వారికి అందుకుగాను నేనేమి ఇవ్వాలో తెలియటం లేదు. ఎందుకంటే, ఇచ్చి పుచ్చుకోవటాలు గురించిన స్పృహ

కూడా 'మాలిక్'యే నియంత్రించారు కనుక. తమకు తోచినట్లు నన్ను తీసుకొని వెళ్ళండి. ఇవే నా సుఖ సంతోషాలుగా ఉన్నాయి.

'X' మరియు 'Y'స్థానాలు తెరచుకుంటున్నాయి. వాటిలో విహారం కూడా జరుగుతోంది కాని దశ మాత్రం ఇంకా పూర్తి అనుభవంలోకి రాలేదు, కాని ఎంతో కొంత అనుభవంలోకి వస్తోంది. ఇక్కడ ఉన్న ఒక వింత ఏమిటంటే, నేను పాయింట్లు దాటుతున్నందుకు ధన్యవాదాలు తెలిపే ప్రయత్నంలో ప్రార్థించే తీరుకోసం వెదుకుతున్నాను. తమ ఉత్తరం కోసం నిరీక్షిస్తున్నాను. నా 'మాలిక్' కృపయే ఈ విధంగా ఉంటుంది కదా!

డాక్టర్ సిన్హాగారు నా ఆరోగ్యం బాగుండలేదని ఎలా వ్రాశారు, నేను తమరితో అబద్ధం చెప్పగలనా? లఖీంపుర్ నుంచి వచ్చినప్పటి నుంచి నా శారీరిక స్థితి అంతా బాగానే ఉంది. ప్రేగుల్లోను, ఉదరంలోను శక్తి ఉంది, కాని విషయం ఏమిటంటే, 'వారు' శక్తిని పీల్చివేశారు. అందుచేత కొద్దిగా దుఃఖమవుతోంది, అది కూడా ఇప్పుడు శాంతించింది. ఆకలి అయితే మొదటినుంచి ఎక్కువసార్లు అనుభవమవుతూ ఉండేది. ఏదైనా భారమైన పదార్థాలు తిన్నప్పుడుగాని, ఎక్కువసార్లు తిన్నప్పుడుకాని కొంచెం భారమనిపిస్తుంది, సుఖం లేదనిపిస్తుంది. బాబూజీ, అయితే నేను అలా జరగకుండా కాపాడుకుంటున్నాను. శరీరం అంతటిలోను ఇప్పుడు శక్తి తరచుగా తరుగుమెరుగులుగా ఉంటున్నట్లు అనిపిస్తోంది. తమరు తరచుగా వ్రాస్తున్నట్లుగానే, నేను శారీరికంగా కూడా ఆరోగ్యంగా ఉండటానికే ప్రయత్నిస్తున్నాను. విమల యొక్క సంస్కారాలు పూజ చేయిస్తుండగా ఒక్కసారిగా నా ఎదుటకు వచ్చాయి, వాటన్నింటినీ తొలగించటం జరిగింది. నా అనుభవానికి వచ్చిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నేను ఇప్పుడు ఆత్మ యొక్క మైదానంలో నడుస్తున్నట్లు ఉంది. ఇప్పుడు పూజగాని, లయావస్థగాని లేవు. ఆ దశయే పూజ మరియు లయావస్థగా ఉంది. పూజకు ఉపక్రమిస్తూ కళ్ళు మూసుకోగానే శరీరం భయకంపితమవుతోంది. అయితే ఇప్పుడు 'మాలిక్' కృపతో దాని (ధ్యానం) విధానం అర్థమయ్యింది. ఇప్పుడు, దృష్టి పరిశుద్ధ మైదానంలోగాని, విధేయతలోగాని లేదు. వీటన్నింటికి మించి దృష్టి స్వల్పంగా జీవనహీన స్థితిలో ఉన్నట్లు ఉంది. నా దృష్టిలోకి వచ్చిన పూర్తి దశను గురించి దీని తర్వాత ఉత్తరంలో వ్రాస్తాను. అమ్మగారు తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 380

అలహాబాద్,

24.03.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని ఆశిస్తున్నాను. పూజ్య మాస్టర్ సాహెబ్ హోలీ సందర్భంగా తమవద్దకు వచ్చి ఉంటారనుకుంటున్నాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఇప్పుడు కొంచెం సోమరితనం వచ్చింది. 4,5 రోజుల నుంచి వ్రాయాలనుకున్నా ఏమీ వ్రాయలేకపోతున్నాను. దశ ఏమిటి అంటారా, తపన అను శబ్దం హృదయంమీద బల్లెంలాగ గ్రుచ్చుకుంటోంది. భక్త మీరాబాయి పాటలు హృదయాన్ని చీల్చి వేస్తున్నాయి, అయినా కాని బాగున్నాయని అనిపిస్తోంది. సినిమా పాటలలో ఇటువంటి శబ్దాలు లేదా భావాలు విన్నా కూడా హృదయం లోలోపల అవిశ్రాంతంగా ఉంటోంది. అయితే **'తమరి' కృపారూపమైన సూది మరియు 'హాఁ' అను శబ్దం యొక్క దారం హృదయాన్ని రెండు ముక్కలు కాకుండా నిరోధిస్తున్నాయి.** ప్రపంచం అంతటా మృత్యువు సోకినదానిలాగ దృశ్యాలు కనపడుతున్నాయి. ఎక్కడో హత్యలు, రైళ్ళు ఢీకొనటాలు, మరెక్కడో

ప్రమాదంతో అగ్నికీలలు, పృథ్విలో అగ్నిపర్వతాలు మరియు భూకంపాల లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇంగ్లాండ్‌లోని లండన్ నగరంలో అనతికాలంలోనే అగ్నిపర్వతం బ్రద్దలు కాబోతోంది. దానివలన మామూలుగా కొంత భాగం మిగిలి ఉన్నప్పటికీ, మిగిలిన దానిలో సముద్రం చోటుచేసుకుంటుంది. పృథ్వి సమస్తమూ రక్తమయంగా అయిపోయిందని గుర్తించాలి. ఎందుకంటే, ప్రతిచోట ఇలాంటి స్థితికి చెందిన పరమాణువులే కనిపిస్తున్నాయి. అయితే దీనితోపాటు రానున్న కాలంలో భారత్, రాణిలాగా ఒక స్థితితో అలంకృతమవుతుంది అన్నట్లు తలపిస్తోంది. పచ్చని లతలు, పచ్చని తోరణాలులాగ శోభిస్తున్నాయి, పాల సముద్రాలు పారుతున్నాయా అని అనిపిస్తోంది. ఎక్కడో 'మాలిక్' యొక్క ఇచ్ఛాశక్తి, మరెక్కడో పరమాణువులలో ఇటువంటివి సృష్టించబడి పని చేస్తున్నాయని అనిపిస్తోంది.

ఇంకా ఏమైందంటే, నా ఆంతరికం శిలలాగా అయిపోయింది. ఎందుకంటే, ఏమి సంభవించినా కూడా, దానివలన ఏమి కానట్లు, యధాతథంగా ఉంటున్నట్లు ఉంది. బాబూజీ, నేను ఇంతకుముందు, నా హృదయం ఒక పాలరాయిలాగాను, అద్దంలాగాను మెరుస్తూ ఉందని వ్రాస్తూ ఉండేదానను కదా, కాని ఇప్పుడు చూస్తూ ఉంటే అది ఒక మామూలు రాయి వంటిదిగా మాత్రమే ఉండిపోయింది. అయితే దీని (రాతి) లోపల చెమ్మ మాత్రం ఉండి, దశను చదివింపజేస్తోంది. నాకు ఏమి ప్రసాదించారో అది 'మాలిక్'కే తెలియాలి.

పినతండ్రిగారి స్థితి మాత్రం బాగానే నడుస్తోంది. నాకు ఇప్పుడు మెదడు యొక్క చక్రాలమీద కూడా తగినంతగా ప్రభావం ఉంటోంది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 381

షాజహాన్‌పూర్,
26.03.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. ఈరోజు మధ్యాహ్నం 2 గంటల నుండి నిరవధికంగా నీవు, మరియు తరచుగా చేయవల్సిన పనిని గురించి గుర్తు వస్తున్నాయి. సాయంత్రం 4 గంటల వరకు నా స్థితి ఎలా ఉందంటే, అలహాబాద్ వెళ్ళాలని మనస్సు బాగా ఉబలాటపడుతోంది. దానికి కారణం ఏమిటో నీవు వెంటనే ఉత్తరం వ్రాయి. నాకు బాగా కుతూహలం కలుగుతోంది. అమ్మగారి స్థితి గురించి కూడా వ్రాయి.

అమ్మగార్కి, మీ పినతండ్రిగార్కి ప్రణామాలు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 382

అలహాబాద్,
29.03.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' వ్రాసిన ఉత్తరం ఇప్పుడే అందింది, సంగతులు తెలిసాయి. పూజ్య శ్రీ బాబూజీ, నా జ్ఞాపకం వచ్చిందని తమరు ఉత్తరంలో వ్రాయటం, నా సౌభాగ్యంగా భావిస్తున్నాను. నన్ను చూడటానికి 'తమరి' హృదయం కోరుకొంటున్నదని నాకు ఇంతవరకు తెలియలేదు. నా బాబూజీ, ఈ దీనురాలిమీద ఉన్నట్టి తమ దయ, ఇంకా ఉండబోతున్న దయకు చెందిన ఋణం ఎన్నటికైనా తీర్చగలనా! తమరు ఆ జ్ఞాపకానికిగల కారణం

ఏమిటి అని అడిగారు కదా! దానికి నేనేమి సమాధానం ఇవ్వగలను? కేవలం నా యొక్క కొద్దిపాటి దిగులుతప్ప, విశేషించి చెప్పాల్సింది ఏమీ నాకు స్ఫురించటం లేదు. అదేమిటో జ్ఞాపకం రావటం లేదు. నేను చేతులు జోడించి స్వయంగా తమరిని ప్రార్థించేది ఏమిటంటే, ఇది తమకు సరియైనదేనని అనిపిస్తే, నాకు దీనికి కారణం ఏదో తప్పక వ్రాయండి. నాలో ఎటువంటి లోపం లేదనుకుంటాను. నా వలన మోసపూరితంగా ఎటువంటి తప్పు జరగలేదనుకుంటాను. దయచేసి తప్పక వ్రాయండి. నాకయితే 'మాలిక్' కృపయే భరోసాగా ఉంది. అదే నా జీవితానికి ఆధారం. తమరు తప్పకుండా జవాబు వ్రాయటానికి దయ చూపండి. బాబూజీ, నేను 'తమ' చరణాలను ఆశ్రయించటంవల్లనే నాకు జీవనం కలిగింది. ఒకవేళ పొరపాటునకాని, సోమరితనం వలనకాని ఏదైనా లోపం ఏర్పడి ఉంటే, వెంటనే తప్పకుండా ఉత్తరం వ్రాయండి.

నా స్థితి ఎలా ఉందంటే, 'తమరి'ని జ్ఞాపకం చేసుకున్నప్పుడల్లా నా గుండె గాబరా చెందుతోంది. పూజ మాత్రం దానంతట అదే జరిగిపోతున్నది. దానితో బంధనం ఏర్పడిపోయింది. దీనత్వం, పేదరికం నాలో పేరుకైనా లేవు. వినమ్రత కూడా అనుభవానికి రావటం లేదు. అయితే ఏదో ఒక రకమైన స్థితిలో మాత్రం స్పర్శ ఉంది. దీనికిమించి నేను ఎటువంటి పూజ చేయలేకపోతున్నాను. ఇప్పుడు గమనం మధ్యస్థంగా ఉంది. ఎందుకోగాని దశను గురించి కూడా స్పష్టంగా తెలుసుకోలేకపోతున్నాను. అయినప్పటికీ అనుభవం, అనుభూతి ఒకదానికొకటి తోడుగా స్పష్టంగానే ఉన్నాయి. శ్రీ బాబూజీ, ఇంకొక విషయం ఏమిటంటే, ఎవ్వరైనా స్థితిని గురించిగాని, పనిని గురించిగాని, వాటిని గురించిన వాస్తవికతను గోప్యంగా ఉంచాలని ప్రయత్నించినా కూడా అది దాగటం లేదు. ఎందుకంటే, తమరు ఇచ్చిన దానిని ఎంతవరకు నిర్వర్తించగలను! హృదయాన్ని 'మాలిక్'యే కొనివేశారు కదా! దశ ఎటువంటిది అంటే, ఈథర్ (ఆకాశతత్వం) కంటె తేలికైనదిగా అనిపిస్తుంది. పొగ కంటె కూడా తేలికగానే ఉంటుంది. నన్ను ఖాళీగా (శూన్యంగా) ఉంచుకున్నా కూడా, అది మంచిదిగా అనిపించటం లేదు, బాబూజీ! ఆ సంగతి ఏమిటోగాని, నేను ఆంతరిక దృష్టి ఉంచినప్పుడల్లా హృదయం గాబరా చెందుతోంది. నాలో ఏదైనా లోపం ఏర్పడి ఉంటే, 'తమ' కార్డు వచ్చిన తర్వాత అది పూర్తిగా తొలగిపోయింది. అయినప్పటికీ నాలో ఎటువంటి దోషం లేదని అనిపిస్తోంది. అదేమిటో తెలుసుకోవటానికి నేను ఆత్రుతతో ఉన్నాను, దయచేసి తప్పక వ్రాయండి.

అమ్మగారు తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 383

షాజహాన్‌పూర్,
31.03.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆనందమస్తు. నీ ఉత్తరం 24.03.1954వ తేదీన వ్రాసినది చేరింది. నీవు కొన్ని రాబోయే సంఘటనలు త్వరలోనే జరుగుతాయని నీవు వ్రాసిన విషయం యదార్థం కావచ్చు. ఈ రోజు నీ ఉత్తరం 29.03.1954వ తేదీది కూడా చేరింది. నాలో అలహాబాద్ వెళ్ళాలనే తపన ఎందుకు కలిగిందో నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనికి కారణం ఏమిటి అని నీవు ప్రశ్నిస్తే, ఆ ఆకర్షణకు కారణం నీవే అని అనిపిస్తోంది. నీకు నా గురించిన స్మరణ, ఏదో కారణం వలన అధికమైంది, దానివలన అయి ఉండవచ్చు. స్మరణ (Sub-Conscious-mind) అవచేతన మనస్సుకు చేరినపుడు దాని తీవ్రత మరియు ఆకర్షణ పెరుగుతాయి. అవచేతనా మనస్సు యొక్క పరిశోధన గురించిన ఆలోచన నాకు ఈ సమయంలోనే కలిగింది. ఆ పరిశోధన ఎంతవరకు చేయాలన్న విషయం నీవే ఆలోచించు. ఒక సూచన

ఇస్తున్నాను; అదేమంటే, **అవచేతనా మనస్సు (Sub-Conscious-mind) ఎక్కడ ఉన్నదంటే, అది ఉన్న స్థానంలో ఒక రకమైన విద్యుత్తు వంటిది ఉత్పన్నమవుతుంది. అందువల్లనే దృష్టి దేనిమీదకు మళ్ళితే ఆ వైపు దానిపరంగా తీవ్రత ఎక్కువవుతుంది.** మంత్రజపం నిశ్శబ్దంగా చేయాలని ఎందుకు నిర్దేశించబడుతుందంటే, ఆ శక్తి ఉద్దేశించిన స్థానంలో ప్రవేశించి దాని ప్రభావంతో ఆశించిన ఫలితం దక్కుతుంది. ఈ దశలో ఇచ్ఛాశక్తి చాలా వేగంగా పనిచేస్తుంది. ప్రత్యేక ఇచ్ఛాశక్తి ఈ అవచేతనా మనస్సుతోనే ఉద్భవిస్తుంది. దీనికంటె కూడా ఉన్నతంగా మరొక ప్రాంతం (భూమ) ఉంది. అక్కడ ఉద్భవించిన ప్రత్యేక ఇచ్ఛాశక్తి నిముషకాలంలో లేదా సెకండ్ కాలంలోనే ఈ ప్రపంచాన్ని మార్చివేయగలదు. ఈశ్వరాజ్ఞతో దిగి వచ్చినటువంటి ప్రత్యేక వ్యక్తిత్వం (Special Personality), ఈ ఉన్నత ప్రాంతపు (భూమ) ఇచ్ఛాశక్తిని (Special Will-Power) కలిగి ఉంటుంది. ఏ వ్యక్తిమీదనైన ఈశ్వరునికి ఎక్కువ అనుగ్రహం కలిగితే అతనిచేత ప్రత్యేక కార్యం నిర్వహించదలచినప్పుడు అందుకుగాను ఇంకా మూడు ప్రత్యేక ఇచ్ఛాశక్తి స్థానాలు ఉన్నాయి. అక్కడ అత్యధిక శక్తి ఉంటుంది. దైవేచ్ఛకు (Divine- Will) స్థావరమైన మరొక స్థానం ఉంది, అది పూర్తిగా దైవాధీనంలోనే ఉంటుంది. దీనిపై అధికారం పొందినవారు ఇప్పటివరకైతే ఎవ్వరూ లేరుగాని, ఈ విధానం ద్వారా అనగా ఎవ్వరైనా ఎలాంటి స్థితినైతే పొందవలసి ఉందో అలాంటి స్థితిని పొందినవారు ఉంటే దానిపై ఆధిపత్యం సాధించవచ్చు. అనగా అభ్యాసీ పూర్తిగా 'వారి'లో లయమైపోవాలి. ఇప్పుడు ఒక సాధారణ విషయం నీకు వ్రాస్తున్నాను. దీనిని అర్థం చేసుకోగలిగితే, సాధారణంగా జనం ప్రశ్నించేటటువంటిది, ఈశ్వరునికి జీవునకు మధ్యగల భేదం తొలగిపోవటమేగాక ఇచ్ఛాశక్తికి సంబంధించిన అనేక విషయాలు స్పష్టమౌతాయి. **వాస్తవానికి మనం ఎప్పుడూ అధిక పీడనం నుంచి అల్ప పీడనం దిశగా పోవాలి. అంతటా ఉన్న గాలి ఒక్కటే! అయినప్పటికి భూతలం దిశగా ఉన్నది అధిక పీడనంతోను, పైకి పోతున్నప్పుడు వాయుపీడనం అల్పంగాను, అనగా భారమైన స్థితి నుంచి తేలికస్థితికి చేరుతుంది. అది ఎంతగానంటే, ఇంకా పైకిపోతే పీడనం అనేదే లేకుండాపోయి శూన్యత ఏర్పడుతుంది.** నేను నీకు బ్రహ్మం, జీవుడు గురించి ఒక వాక్యం వ్రాసి పంపాను. ఇప్పుడు ఇంకా రెండు వాక్యాలు వ్రాస్తున్నాను. **అధిక పీడనం ఏదైతే ఉందో అది జీవుని స్థితి (జీవగతి), అల్ప పీడనం ఏదైతే ఉందో అది బ్రహ్మగతిగాను (బ్రహ్మ యొక్క స్థితి) అవుతుంది. అయితే విషయం ఒక్కటే. వేదాలలో వర్ణించిన 24 బ్రహ్మలను దీనిలో పరిశోధించవచ్చు. వాయువు ఎంత తేలిగ్గా ఉంటుందో బ్రహ్మదశ కూడా అంతే తేలికగా ఉంటుందని గ్రహించాలి. దీనిని నీకు ఒక సూచనగా వ్రాశాను. ఎందుకంటే, విద్యావంతులు నిన్ను భవిష్యత్తులో జీవ, బ్రహ్మల గురించి ప్రశ్నించినట్లయితే నీవు వివరించటానికి వీలుపడుతుంది.**

నీవలన తప్పిదమేమీ జరగలేదు, కనుక అటువంటి ఆలోచన పెట్టుకోవద్దు. ఇప్పుడు నీకు ధ్యానం చేయడం చాలా కష్టమైనదిగా ఉంటుంది. అందుకే నిన్ను నిత్యం ధ్యానం చేయవద్దని వారించాను. పూజ విషయంలో నూతన విధానాల కొరకు అన్వేషించు. అయితే అవి కొద్దికాలం మాత్రమే ప్రయోజనకరంగా ఉంటాయి. చివరకు మళ్ళీ పూర్వపు స్థితికే వస్తుంది. నీ కళ్ళతో, వాటినే (నీ కళ్ళను) చూసుకోమని చెప్తే, ఎలాగైతే అద్దం, దాని ముఖాన్ని అది (అద్దం) చూసుకోమని ఆజ్ఞాపించినట్లయితే, అది ఏ విధంగా సంభవంకాదో అదే విధంగా నీ నేత్రాలకు కూడా సాధ్యం కాదు. దైన్యం, పేదరికం మరియు నమ్రత (అణకువ) ఏవీ కూడా అనుభవానికి రావటంలేదని వ్రాశావు. ఇవన్నీ ఆధ్యాత్మికయాత్రలోని అనుభూతులే. నీవు ఈ విధంగా ఆలోచించాలి– **మానవుడు ఈ ప్రపంచంలో ఉన్నంతకాలం ప్రతి వస్తువునూ ప్రేమిస్తూ ఉంటాడు, మరణించాక ఏదీ అతని వెంట వెళ్ళదు.** 'వారి'లో పూర్తి లయ–అవస్థ కూడా ఇదే విధంగా ఉంటుందని అర్థం చేసుకోవాలి. ఈ దశలో అభ్యాసీ తనతోపాటుగా ఏమీ ఉంచుకోడు. ఈ విధంగా ఏమీ మిగిలి ఉండకపోవటమే మహాప్రళయం యొక్క విశిష్టత. నీ యొక్క పురోగతి తగ్గిందని వ్రాశావు. నీ యొక్క పురోగతి ఆగలేదు; ఆ స్థానంలో నీ అనుభూతి కొంచెంగా ఉండటంవలన అది నిలిచిపోయినట్లు తలపించింది. దైవకృపతో నీ పురోగతి దినదినాభివృద్ధి చెందుతూనే ఉంది.

అమ్మగారి అరోగ్యం కుదుటపడుతున్నందుకు భగవంతునికి ధన్యవాదాలు. పండితులు లక్ష్మీచంద్ర, రామేశ్వర ప్రసాద్‌ల జన్మదినం లఖనౌర్ గ్రామంలో ఏప్రియల్ 15వ తేదీన జరిపిస్తాం, అభ్యాసులందరినీ ఆహ్వానించాను.

ఇప్పుడు హిందీ వ్రాసేవాళ్ళు ఇద్దరు దొరికారు. అందులో ఒకరు మంచి పండితుడు. ఇంక హిందీలో వచ్చే ఉత్తరాలకు సమాధానాలు ఇవ్వడానికి బాగా వీలుపడుతుంది. నీవు నీ ఉత్తరాన్ని నీ పిన తండ్రికి చదివి వినిపించినట్లయితే ఆయనకు పనికివచ్చేది ఏదైనా దానిలో దొరకవచ్చు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 384

షాజహాన్‌పూర్,
06.04.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆనందమస్తు. నీవు 04.04.1954వ తేదీన వ్రాసిన ఉత్తరం ఈరోజు అందింది. నీకు ఇప్పుడు ధ్యానం చేయటం కష్టతరమవుతుంది; కనుక నేను ఆ నిర్బంధం ఇంతకుముందే తొలగించాను. ఇప్పుడు ఇతరులు నిన్ను పూజించునట్టి స్థితి నీది. అయితే అహంకారం కలగకుండా ఉండాలి. ఎందుకంటే, అది అందరి ధర్మం. నీలో అహంకారం తలెత్తే అవకాశం లేదు. పూజలో మనం ఇంకెవ్వరినైనా పూజిస్తున్నాం అంటే అక్కడ ద్వైతం ఏర్పడుతుంది. నీకు ఉన్న స్థితి అద్వైతం (అనగా స్వ, పర భేదంలేనిది)కు చెందినది. ఈ స్థితిలో పూజ చేయటం జరిగితే ద్వైత భావానికి పాల్పడవలసి వస్తుంది. అప్పుడు అశాంతిగా ఉండటం జరుగుతుంది. ఎప్పుడైతే ఇంకొకరు ఉన్నారు అని అనుకుంటే అప్పుడు మనం వారిని ధ్యానించటం జరుగుతుంది. నీవు సత్సంగ్ నిర్వహించేటప్పుడు నీలో ద్వైత భావం ఉండి ఉండవచ్చు. అందుచేత నీలో కంగారు కలుగుతుంది. జ్ఞాపకం చేసుకుంటూ ఉంటే 'అతడి'ని స్పర్శించినట్లుగా లేదు అని నీవు వ్రాశావు. ఇక్కడ 'స్పర్శ'కు తావేలేదు. ఎందుకంటే, నీవు జ్ఞాపకం చేసుకుంటున్నది ఎవరినో వారు స్వయంగా నీవే అయి ఉన్నావు. ఈ కారణంచేతనే నీవు స్పర్శించలేక పోతున్నావన్న భావన నీలో కలుగుతోంది. అదే (ఆ స్పర్శే) మరొక వానినైతే నీ జ్ఞాపకంతో దానిని స్పర్శించినట్లుగా తెలిసి ఉండేది. నీ స్థితి ఎక్కడైనా ఆగిపోవటం జరిగిందా అని వ్రాశావు. అది అసంభవమైన విషయమే అయినప్పటికీ ఈ రెండూ సరైనవే. నీ స్థితి ఆగిపోవటం, ఆగకుండా ఉండటమూ కూడా జరిగింది. దీనికిగాను నేను చెప్పేదేమంటే, 'X', 'Y' లకు చెందిన మైదానంలో ఒక స్వచ్ఛమైన స్థితి ఉంది, నీవు దానితో స్పర్శ కలిగి ఉన్నావు. ఆ మైదానం ఎంతో ఎక్కువ విస్తీర్ణంగా ఉండటం వలన దాని ప్రవేశం కూడా విశాలంగా ఉంది, దానిలో (ఆ మైదానంలో) నీవు ప్రవేశించావు. దానిలోనికి నిశితంగా దృష్టి సారించి చూస్తున్నావు. అయితే నీకు ఆ మైదానంతప్ప మరేమీ దృష్టికి రావటంలేదు. అందుచేత దానిని నీవు స్థితి నిలిచిపోయినట్లుగా భావించావు. కాని దానిని నిలిచిపోయినట్లుగా భావించటం కూడ తప్పే అవుతుంది. ఎందుకంటే, ఈ మైదానంలో నిలిచి ఉండటంవల్లనే ఇంకా ముందుకు పోవటానికి కావలసిన ధైర్యం, శక్తి సమకూరుతాయి. కనుక ముందుకు వెళ్ళగల శక్తి సమకూరనంతవరకు, నిన్ను ముందు ఉన్న ఉన్నత స్థానానికి చేర్చబోను. ఈశ్వరానుగ్రహంతో ఆ శక్తి కలుగుతుంది. నేను కూడా చేయగలిగినంత సహాయం చేస్తాను. ఈ స్థానంమీద లెక్కలేనంత శక్తి ఉంది కనుక మరికొద్ది రోజులు వేచి ఉండటం మంచిది. నీవు లఖ్‌నోర్ ఉత్సవం గురించి వ్రాసిన దానిని నాకు పంపించు. నేను దానిని చదివించటానికి ప్రయత్నిస్తాను.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 385

లఖీంపుర్,
19.04.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న తావూజీ మరియు మాస్టర్ సాహెబ్ క్షేమంగా ఇక్కడకు చేరారు. లఖనౌర్‌లో జరిగిన ఉత్సవం గురించిన సమాచారం విని నా హృదయం ఉప్పొంగిపోయింది. బాబూజీ, లఖమీచంద్‌గారిలాగ ఉత్సాహం సత్సంగీ సోదర సోదరీలందరిలోను వ్యాపించినట్లయితే, ఎంత బాగుంటుందో కదా! నేను కూడా అమ్మ మరియు కేసర్‌తోపాటు మొన్ననే ఇక్కడకు చేరుకున్నాను. కాన్పూర్‌లో హోమియోపతి డాక్టర్ తివారీగారికి ఇంగ్లీషు పుస్తకం ఇచ్చాను. పుస్తకం సగంవరకే చదివి చాలా సంతోషించారు. ఎప్పుడైతే ఈ పుస్తకం విద్యావంతులకు చేరువవుతుందో, అప్పుడు ఈ పుస్తకం బహుళ ప్రచారం పొంది, అందరికీ నచ్చుతుందని వారు అభిప్రాయపడ్డారు. అయితే కొంతమంది మహాత్ములు  జనుల కళ్ళుకప్పినందువలన వెలుగులోకి రావటానికి కొంత ఆలస్యమవుతుంది. ఇప్పుడు వారికి ఇంకొక ఇంగ్లీషు పుస్తకం, అలహాబాద్‌లో ప్రొఫెసర్ రనడే వారికి రెండు హిందీ పుస్తకాలు పంపుతున్నాను. తమరిని కలిస్తే వారికి బాగా సంతోషం కలుగుతుందని చెప్పారు కాని, నాకు ఆ విషయం తెలియదు. తెలిసి ఉంటే తప్పక పరిచయం కల్పించేదానను. కాశ్మీరీ అభ్యాసీ మరియు అతడి మిత్రుడు వస్తూ ఉండేవారు. ఆ మరో వ్యక్తి అప్పుడప్పుడు ప్రొఫెసర్ రనడే కూడా తనతో ఈ విషయం ప్రస్తావించినట్లు చెప్పారు, కాని అప్పుడు నేను అంతగా ధ్యాసపెట్టలేదు. 'మాలిక్' కావాలనుకుంటే, మళ్ళీ అది జరుగుతుంది. బాబూజీ, నా మనస్సు అంగీకరించటంలేదని, తమరు నాకు మనోయోగం కల్పించినట్లయితే, దానితో తను కొంత యోగిక క్రియ ద్వారా ప్రేగుల టి.బి.ని నివారించే ప్రయత్నం చేయగలను అని డాక్టర్ తివారీగారు చెప్పారు. ఆ ప్రకారమే రెండు రోజులు చికిత్స చేశారు. దాని వలన నాకు ప్రయోజనం కలిగింది కాని, నా మనస్సు ఏ ఇతరమైన దానిని (విధానం) అంగీకరించదు. ప్రేగుల్లో పార్థివతత్త్వం లోపించిన కారణంగానే టి.బి. వస్తుందని వారు (తివారీగారు) చెప్పారు. పార్థివతత్త్వం చంద్రునిలో అధికంగా ఉంటుందనీ, లేదా మూలాధారం నుంచి సహాయం తీసుకోవటానికి ఇచ్ఛాశక్తిని ప్రయోగించమని చెప్పారు. కాని తమరు ఏది చెబితే అదే చేస్తాను. గత ఉత్సవంలో 'తమరు' నాతో షర్బత్ తీసుకువెళ్ళమని చెప్పారు. కాని నేను తీసుకురాలేదు. అందుచేత ఇక్కడి ఉత్సవానికి వచ్చేవారు ఎవరైనా ఉంటే, వారి ద్వారా తప్పక పంపించగోరుతున్నాను.

23వ తారీఖున జరగనున్న ఉత్సవానికి సాధ్యపడినంతవరకు 'తమరు' కూడా దయచేయాలని అమ్మ మరియు మేమందరం ప్రార్థిస్తున్నాము. ఒకవేళ అలసటగాని, బలహీనతగాని ఉన్నట్లయితే మేము ఒత్తిడి చేయము. 'మాలిక్' కృప అయితే తప్పక ఉంటుంది. ఇప్పుడు అలహాబాద్‌లో పూజ గురించి చాలా మందికి తెలిసింది. ఎప్పుడో ఒకప్పుడు 'మాలిక్' పేరు మరియు పూజతో జనం పరిచయం కల్పించుకుంటారని, ఆ రోజు తప్పక ఆసన్నమవుతుందని నా మనస్సు చెబుతోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఈ దశలో ఇప్పుడు ఏ హృదయమైతే పొడుగు, వెడల్పు కలిగిన మైదానంలాగ అనిపిస్తోందో, అది కొద్దిగా బంధనం తెగిపోవటంతో బయట లోపల ఒకే ప్రవాహంగా అయిపోయింది. బహుశా దానివల్లనే ముందుకుపోయే శక్తి ఉత్పన్నమైంది. బాబూజీ, ఈ స్థితి ఎలా ఉందంటే, ఉన్నది ఏదైనాగాని, అంతా 'మాలిక్' కృపవల్లనే. ఎందుకంటే, నేను గమనిస్తున్న దాన్నిబట్టి, సాధన కొరకు సమయం నేను ఎక్కడ నుంచి తేవాలి? రేయింబవలు, ఉదయం సాయంత్రం, అలాగే సమయంతోనే నా సంబంధం సమాప్తమైపోయింది కనుక. ఎవరో ఒకరు చేస్తున్నట్లుగా పూజ చేయిద్దామనుకున్నప్పుడు ద్వైతంలాగా అనిపించి హృదయం ఉక్కిరిబిక్కిరి అయినట్లుగా అనిపిస్తోంది. అది ఏమిటో తెలియదు. మంచిగా అనిపించటం లేదు. అది ఒక శుభ్రమైన ఆధ్యాత్మిక మైదానం అనుకుని, ఏ దశలోనయితే

ఉన్నానో దానిలోనే కూర్చున్నట్లయితే అప్పుడు ఏమీ అనిపించదు (అనగా హృదయం ఉక్కిరిబిక్కిరి అయినట్లు ఉండదు). నేను ఇప్పుడు పూజ (సత్సంగ్) చేయించగలుగుతూ ఉన్నానో లేదో అర్థం కావటం లేదు. నేను ఎటువంటి దీనురాలను కాదు. ఇది ఒక శూన్యదశగా ఉంది. దశ అయితే, నేను (శూన్యం) ఖాళీగా గాని, భారీగా గాని లేను. ఎలా ఉన్నానో 'అతని'కే తెలియాలి. అది ఎంతగా నంటె, నా ఎదుట మరొకరిని పూజ చేయటానికి కూర్చోబెట్టానని అనుకున్నా, నామరూపాలు ఏమీ అనుభవానికి రావటంలేదు. అయినా కూడా ఈ భావం మాత్రంతోనే (అనగా మరొకరు ఉన్న భావన) హృదయం బంధించబడినట్లుగా ఉంటోంది. హృదయంలో విశాలమైన మైదానం ఏదైతే ఉందో, అది బంధనాన్ని తెంచుకుని నా ఎదుటకు కూడా వచ్చేసింది. దానివలన ఇప్పుడు నిలిచిపోవటం వంటి స్థితి తెలియటం లేదు. బాబూజీ, ఇప్పుడు దశను ఏమనాలి అంటే, తత్వమసి ('అదే' 'నీవు') అని అనిపిస్తోంది. లోపల, బయట కూడా అదే అనుభవంలోకి వస్తోంది. నేను గమనించగలిగింది ఏమిటంటే, దశను గురించి చెప్పాలంటే, అది అల్పంగా అనుభవం పొందాలని ప్రయత్నించినప్పటికీ హృదయం కంపించిపోతున్నటు వంటిది అయిన తేలిక దశ. అది దానికదే ఒక స్వాభావిక దశలాగ వ్యాపించింది. జనం దీనిని చెప్పటం ద్వారాగాని, వల్లెవేయటం ద్వారాగాని ఎలా ప్రాప్తింపచేసుకోగలరో నాకు అర్థం కావటం లేదు. బాబూజీ, ఇది ఈశ్వరుని కృప యొక్క ఫలితమే అని గుర్తించాలి. కనుక ఈ దశయే ఇప్పుడు అనుభూతి కలుగుతోంది. శ్రీ బాబూజీ, నేను ఇప్పుడు, శక్తి, వాయువు, సాధన, సాధ్యం అన్నింటికీ రహితంగా (లేనట్లుగా) అయిపోయి, అన్నీ సమాప్తమైపోయినట్లు ఉంది. ఇప్పుడింక ఉన్నది ఏమిటంటే, ఫలితం మాత్రమే. ఆ ఫలితం కూడా 'మాలిక్' ఆధీనంలోనే ఉంది. ఎందుకంటే, నావద్ద చోటు (స్థలం) లేదు కనుక దానిని నేను ఎక్కడ అట్టిపెట్టుకోవాలి! నమ్రత వంటి దశ కొనసాగుతూ ఉంది. దశలో గాఢత్వం లేదు, శూన్యమూ లేదు. అంతా సమతూక స్థితిలోనే ఉంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 386

షాజహాన్‌పూర్,
25.04.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. అలహాబాద్ నుంచి పంపిన ఉత్తరం, 19.04.1954వ తేదీన లఖీంపూర్ నుంచి పంపించిన ఉత్తరం రెండు చేరాయి. వాటికి జవాబు వ్రాస్తున్నాను. "రాజయోగ ప్రభావం (Efficacy of Raja yoga)" పుస్తకాన్ని నీవు ప్రొఫెసర్ రానడెకు అందజేయి. ఇప్పుడు నీ స్థితి గురించి వ్రాస్తున్నాను. దానికి ముందుగా సంత్ తుకారామ్ యొక్క ఒక వాక్యం "బెల్లం కంటె తీయన భగవంతుడు, బయట లోపల ఒక్కటై ఉండు" జ్ఞాపకం వస్తోంది. మరి ఇప్పుడు నీ స్థితి కూడా ఇలాగే ఉన్నట్లు నాకు అనిపిస్తోంది. ఎప్పుడైతే దేహం యొక్క అస్థిత్వభావన పూర్తిగా లేకపోయినప్పుడు, ఆత్మయొక్క అస్థిత్వ భావన కూడా చాలావరకు లేకుండాపోయినప్పుడు, ఇటువంటి స్థితి అనుభవమవుతుంది. ఇప్పుడు నీలో ద్వంద్వత్వం (రెండు ఉన్నట్లు భావన) తొలగిపోయింది. ఇది మన లాలాజీ సాహెబ్ శిక్షణ యొక్క విశిష్టత. అది ఎప్పుడూ ఒక మెట్టు ఎత్తుగానే ఉంటుంది. ద్వంద్వత్వం అయితే లేదుకాని, దాని భావన (అనుభూతి) తక్కువగా ఉంది కనుక అది ఇంకా పెంపొందవలసి ఉంది. ఈ దశ ఒక అంతులేని సముద్రం వంటిది, దీనిలో ఇంకా ఎంత ఈదవలసి ఉంటుందో చెప్పలేము. వేదాలలో అద్వైతం గురించి వివరించబడింది. దీనికిమించి ఇంకా ఏవైనా చెప్పబడి ఉండవచ్చును కాని అవకాశం తక్కువ. ఎందుకంటే, చాలా విషయాలు

స్వానుభవం కొరకు వదిలిపెట్టటం కూడా జరుగుతుంది. నేను చెప్పలేకపోను, కాని జనం దానిని అంగీకరించక పోవచ్చు. మనం ఎప్పుడైతే ద్వైత, అద్వైత భావనలు కలగకుండా ఉండే స్థితికి చేరతామో, వంద, వేయి సంవత్సరాలపాటు ద్వైతం, అద్వైతాల గురించి ధ్యానం చేసినప్పటికీ ఆ రెండూ అనగా ద్వైతం, అద్వైత్వం మన దృష్టికి రానట్లయితే అప్పుడు ఈ స్థితి పరిపక్వత సిద్ధించినట్లు భావించాలి. వాస్తవంగా ఈ స్థితిలో ఉన్నటువంటివారు, ఈ స్థితి మీద ధ్యానం చేయలేనంతగా శక్తిహీనులవుతారు. ఒకవేళ ధ్యానం చేసినట్లయితే ఒక్క నిమిషంలోనే ఆందోళనకు గురవుతారు. మానవుడు ఈ స్థితికి చేరినప్పుడు, వాస్తవికతకు చేరినట్లుగానే భావించవచ్చును కాని, ఇంకా ఈదవలసింది అంతులేనంతగా ఉంటుంది. బిటియా! నేను వాగ్ధాటి కలిగిన జ్ఞానులు మాదిరిగా మాట్లాడగలను కాని నిజానికి అది నాకు తెలియకుండానే జరుగుతుంది. ఎవ్వరైనా అభ్యాసులు ఈ స్థితికి చేరినప్పుడు, నాకు ఆ సమాచారం తెలుస్తుంది. నాకయితే పెద్దగా ఏమీ తెలియదు కాని, నాకు తెలిసిన దానిని జనం తెలుసుకొని ఇతర అభ్యాసులను ఈ స్థితికి చేర్చలేకపోయినా కనీసం తాము స్వయంగా ఈ స్థితికి చేరగలరని ఆశిస్తున్నాను. ఈ విషయమై నేను నిన్న ఆలోచించాను, నా అదృష్టం బాగుంటే ఒకరిద్దరు ఈ స్థితికి చేరవచ్చని నాకు అనిపిస్తోంది. అయితే వారికి ఇతరులను ఈ స్థితికి చేర్చగలగటం కష్టసాధ్యమే. అది జరగాలంటే, వారి శరీరం యొక్క అణువణువూ 'భూమా' యొక్క వాస్తవికస్థితిని దాల్చినప్పుడే సాధ్యపడుతుంది. నా గురుమహరాజ్ (లాలాజీ సాహెబ్)లో ఎటువంటి లోపం లేదు కనుక నాలో కూడా ఏ లోపం ఉండదని నిశ్చయంగా చెప్పగలను. కొంతమంది జనం దీనిని నా అహంకారంగా భావించవచ్చు. అయినా లెఖ్ఖచేయను. శారీరకంగా నేను బలహీనుడనే కాని, ఆధ్యాత్మికత విషయంలో శక్తి మరియు సాహసంగల వాడిని. ఇది నాకు ఒక నిముషంలో అయ్యే పని. బిటియా! నా దృష్టిలో, **ఆధ్యాత్మికతకు సంబంధించిన ఏ దశనైనా కల్పించటంలో ఒక్క సెకనుకు మించి రెండవ సెకను మొదలైతే (అనగా రెండవ సెకనులో కూడా పని పూర్తి చేద్దామనుకుంటే) నేను ఇతరులకు ఆధ్యాత్మిక శిక్షణ ఇవ్వటానికి అశక్తుడను అని భావించుకుంటాను.** జనం దీనిని అహంకారంగా అనుకోవచ్చు, అలాగే అనుకోనిమ్ము. అయితే ఇప్పుడు ఉన్న సమస్య ఏమిటంటే, **ఒక్క సెకనుకాలంలో అంతటి శక్తి అభ్యాసీ భరించగలడా అని. నన్ను తరచుగా బాధించే దిగులు ఏమిటంటే, ఎవ్వరైనా మానవుడు (అభ్యాసీ) ఇంతకుమించి కాకపోయినప్పటికి, కనీసం ఈ మాత్రమైనా సిద్ధింపజేసుకుని దీనిని ఇతరులకు శిక్షణ ఇవ్వగలిగిన వారు ఈ మిషన్‌లో తయారుకావాలి అని.** ఇదంతా 'మాలిక్' చేతిలో పని. 'అతడు' తలచినట్లే జరుగుతుంది. చివరకు ఇది చెప్పవలసి వస్తోంది, మన మందరం అభ్యాసులమే కనుక విధిగా ఆధ్యాత్మిక సదాచారం పాటించాల్సి ఉంటుంది అని. **మన సంస్థలో ఉన్న పరిస్థితి ఎటువంటిదంటే, నేను ప్రత్యేక ఇచ్ఛాశక్తిని ఉపయోగించి అభ్యాసులకు శిక్షణ ఇవ్వగోరుతున్నప్పటికి, వారు నా సంకల్పానికి అవరోధాలు కల్పిస్తున్నారు. మరి ఇది వారి అదృష్టమా లేక నా అదృష్టమా?**

ధ్యాన సమయంలో నీకు ద్వంద్వభావం కలగటం మూలంగా కలిగిన ఆందోళన గురించి అలహాబాద్‌కు పంపిన ఉత్తరంలో వివరించాను. నీకు ధ్యానం చేయించాలను (సత్సంగ్) ఉద్దేశ్యం లేకపోవటం మూలంగా ఈ ఆందోళన అనుభూతమై ఉంటుందా? నీవు ముందుకు సాగిపోతూ ఉంటే, ద్వంద్వభావన గురించిన ఆందోళన కలగకపోవచ్చు. నేను నిన్ను 'X', 'Y' స్థానాల నుండి ముందుకు ఇంకా నడిపించలేదు. శక్తి అయితే బాగానే కలిగింది, కాని అది ఇంకా వృద్ధి కావలసి ఉంది. ఆ శక్తి ఇంకా శరీర మంతటినీ ప్రభావితం చేయలేదు. దైవానుగ్రహం ఉంటే అది కూడా జరుగుతుంది. స్థితిలో ఆగిపోవటమైతే లేదు, శక్తి మాత్రం వృద్ధి అవుతుంది.

సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 387

లఖీంపూర్,

25.04.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. చాలా రోజుల నుంచి తమ ఆరోగ్య స్థితిని గురించిన సమాచారం లేనందున కొంత చింతగా ఉంటోంది. మొన్న ఉత్సవం చాలా బాగా జరిగింది. అదంతా 'మాలిక్' కృప మరియు ఇచ్ఛ వల్లనే. అమ్మ బాగున్నారు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. తమ శ్వాస బాగుందనుకుంటాను, తప్పక తెలియజేయండి.

ఇప్పుడు ఈ దశలో ఎలా ఉందంటే, ఇక్కడ ఇంతకుముందు నేను ఎప్పుడూ లేను, ఇప్పుడూ లేను, అలాగే ఎప్పుడూ ఉండబోనని అనిపిస్తోంది. ఇంకా ఎంతగానంటే, నేను లఖీంపుర్‌కు తిరిగి వచ్చినా కూడా అసలు నేను ఎప్పుడూ ఇక్కడి నుండి ఎక్కడకు వెళ్ళలేదు అని, అలహాబాద్ వెళ్ళినా నేను ఎప్పుడు ఇక్కడ లేకుండా లేననీ అనిపిస్తోంది. నేను కాన్పూర్ వెళ్ళినప్పుడు కూడా నేను ఇప్పుడే ఇక్కడకు వచ్చాననీ అనిపించలేదు.

బాబూజీ, ఇప్పుడు ఉన్న దశలో, శక్తి ఏదో కేవలం ఒకే ఒక్కటి అని, అది స్పందన రహితమైనది అని, ప్రతిచోట ఒకే దశలాగా ఉన్నట్లుగాను, అదంతా నేనే అను భావం కలుగుతోంది. దానిలో మార్పులేదు, మార్పు ఉండబోదు. ఆ శక్తిలో చైతన్యం ఉందన్నా, అంతా సరిసమానంగా ఉండి, అదే నేను అనిపిస్తోంది. రాత్రింబవళ్ళుగాని, వెలుతురు చీకటిగాని, గాలి పీడనంగాని ఎక్కడైతే లేకుండా ఉన్నాయో, అటువంటి స్థితియే నా నివాసంగా ఉంది. నేను మాట్లాడటంగాని, మాట్లాడకపోవటంగాని లేదు. నేను ఎలా ఉన్నా, 'అతని'కే చెంది ఉన్నాను అని 'మాలిక్'కు తెలుసు. చైతన్యం అనేది నాకు ఉన్నది ఎలాంటిది అంటే, ఆ శక్తి యొక్క జ్ఞానం కలుగుతోంది, కాని అలా ఉన్నట్లుగా లేదు, ఎందుకంటే, స్థితి అచేతనమైనటువంటిది. కాని బహుశా దానిలోని చైతన్యం, మానసిక చైతన్యంగా ఉండి దాని జ్ఞానాన్ని కల్పిస్తోంది. అది ఎల్లప్పుడూ మార్పులేనిది. వాస్తవంగా అది ఒక సహజస్థితి. అది ఎల్లప్పుడు అలాగే ఉంటుంది. దానిలోకి లోతుగా వెళ్ళినా లేదా ఆ స్థితిని అనుభూతి చెందినట్లయినా, ఒక రకమైన (Inactivness) చైతన్యం లేనటువంటిది అనుభవమవుతోంది. అయితే 'మాలిక్' దయవలన చైతన్యం లోపించకుండానే ఉంటోంది. అందుచేత దానితో నేను ఉన్నతి దిశగా ముందుకుపోయే అవకాశం కలుగుతోంది. 'అతని'కి వేనకువేలు ధన్యవాదాలు అర్పిస్తున్నాను. శ్రీ బాబూజీ, ఇటువంటి స్థితి మృత్యువుకు పూర్వం కలగదని అనిపిస్తోంది. అది కేవలం ఒక ప్రత్యేక వ్యక్తిత్వంగల వారి కృప మరియు శక్తివల్లనే సంభవిస్తుంది. అది జీవించి ఉన్నా కూడ మృత్యువు తర్వాత కలిగే ఆనందదాయక స్థితి యొక్క జ్వాలను చూపిస్తోంది. ముమ్ముందు ఇంకా చూపిస్తూనే ఉంటుంది. ఇప్పుడైతే జీవితం యొక్క రహస్యమయ పరదాలు లేదా ప్రకరణాలు (Secret chapters of life) తెరుచుకుంటూ పోతున్నాయని అనిపిస్తోంది. బాబూజీ, చైతన్యం కూడా ఎలా అనిపిస్తోంది అంటే, మనస్సు మీద తేలికపాటి వత్తిడిపడితేగాని అనుభవంలోకి వస్తున్నట్లు ఉంది. అదేమిటోగాని, దశ అయితే ప్రకృతిని కూడా దాటిపోయినట్లు అనిపిస్తోంది. అలా ఎందుకో తెలియదుగాని, పూర్వం కంటె ఎక్కువగా ఇప్పుడు తరచుగా నుదుటి మధ్యలో ఒక గుంటలాంటిది ఎప్పుడూ అనుభవమవుతోంది. ఇప్పుడు ఈ స్థితి ఎలా ఉందంటే, నాలో పరిశుద్ధతకు అవకాశమేలేనట్లు అనిపిస్తోంది. ఎవ్వరైనా వెనుదిరిగి చూస్తే అది అనుభవానికి వస్తుందన్నట్లు ఉంది. అది అలా ఉండగా, ఇప్పుడు ఒక శక్తిరహితమైన దానిలో నా దశ చొచ్చుకుపోతున్నట్లు ఉంది. శ్రీ బాబూజీ, ఇప్పుడు రెండు రోజుల నుంచి, ఎందుకోగాని నేను ఎప్పుడూ గతంలో లేకపోయానని, ఇప్పుడూ లేనని, ఇంక ఉండబోనని అనిపిస్తోంది. నిన్న సాయంత్రం షుమారు ఒక గంటపాటు ఎడమకాలు పాదం మధ్య నుంచి ఒక దారం వంటిది ఎడమవైపుకు తొలగి, ఏదో వస్తువు తెరచుకోవటానికని

పగలదీస్తున్నట్లుగా అనిపిస్తోంది. మళ్ళీ అంతలోనే ఆగిపోయింది. ఇంకా కొంచెం తట్టినట్లుగా కూడా ఉంది. అది ఏమిటో తమకే తెలియాలి, నాకైతే ఏమీ తెలియటం లేదు. నాలో సోమరితనం ఎక్కువగా ఉంది. ఇంకా నిద్రలాగ కూడా అనిపిస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 388

లఖీంపుర్,
28.04.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది, చదివి ఆనందించాను. ఇది ఎటువంటి కృపా విధానం అంటే, దీనిలో భగవంతుని దయామయమైన (అహంభావంలేని) కృప ఉంది. ఇటువంటి కృపావిధానాన్ని నేను పూర్తిగా 'తమ'లోనే గ్రహించాను. నేను ఏదైనా చేయగలిగినా, చేయలేకపోయినాగాని, ఏ క్షణం నుండి తమ కృప ఆరంభమైందో ఆరోజు నుంచి ఒక్క క్షణం కూడా విరామం లేకుండా చేశారు. యదార్థం ఏమిటంటే, నాకు ఇటువంటి ప్రవేశం ఇటువంటి (బాబూజీ వంటి) కొలువులోనే కాగలదై ఉండేది. అది ఇప్పుడూ ఉంది, ఇక ముందూ ఉంటుంది. ద్వారం, ద్వారం తట్టి చివరకు 'స్వామి' (బాబూజీ) ద్వారంవద్దకే చేర్చింది, మరి 'మాలిక్'కి కూడా అనర్హురాలైన ఈ అభాగిని మీద ప్రసన్నత చూపారు. ఇంకేముంది, నేను సమస్తమూ పొందాను. ఇటువంటి కృపయే 'స్వామి' నిలుపుగాక! నా అణువణువు నుండి ఈ ప్రార్థనయే ధ్వనిస్తోంది.

'మాలిక్' దయతో పూజ చేయటం, చేయించటం వంటి వాటి ద్వారా కలిగే భయం ఇప్పుడు తొలగిపోయింది. ఎందుకంటే, పాత పూజా విధానాలను 'అతడు' స్వయంగా పరిష్కరించివేశాడు. దశను అనుసరించి పని జరుగుతోంది. దశ నాలో ఇమిడిపోవటం కూడా ఇప్పుడు ప్రారంభమైందని అనిపిస్తోంది. పూజ్య బాబూజీ, జీవితంలో ఏదైనా పొందటమనేది జరిగితే, అది 'మాలిక్' అడుగుజాడల్లో నడుస్తూ పొందవలసిందే. అది భూమాకు చెందినది కావచ్చు. మరేదైనా కావచ్చు. ఎందుకంటే, వారి చరణాలు లేకుండా శాంతి ఎక్కడ లభిస్తుంది? ఇప్పుడు హీనమైనటువంటి నగరం నుండి ఈ దశలోనే ఉండి సాగిపోతున్నాను. దీని వలన ఏ విధమైన భారం, బరువులు లేకుండా పోయాయి. ఎందుకో తెలియదు కాని, కొన్ని రోజుల నుండి అలసత్వం, నిద్ర మరియు అర్థంలేని బాధ వంటిది అనుభవమవుతోంది. ఆ బాధ దేనిని గురించీ కాదు, కాని అది మాత్రం ఉంటోంది. నాకు కూడా 'X', 'Y' పాయింట్లలో యాత్ర దాదాపు పూర్తయినట్లుగా అనిపిస్తోంది. కాని ఇమిడిపోవటమనేది ఎందుకు జరగటం లేదో తెలియకుండా ఉంది. లేదా బలహీనత కారణంగా ఎక్కువ అనుభూతి కలగటం లేదేమో. కాని తమరు 'X', 'Y' పాయింట్ల శక్తి తగినంతగా ఉత్పన్నమైందని వ్రాశారు. దాని అర్థం నా గ్రహింపుకు రాలేదు. అది బహుశా ఆ దశను జీర్ణించుకునే శక్తి అయి ఉంటుందా? అదే సరైనది అయితే, చాలా తేలికయైనదిగా ఉండి నమ్రతకు చెందిన చాలా తేలికైన దశగా అనుభవమవుతోంది. ఈ తేలికదనం కూడా నాలో జీర్ణించుకుపోతున్నట్లు ఉంది. నా బాబూజీ, ఇప్పుడు మార్గం, మార్గంగా అనిపించటం లేదు. అదేమిటో నాకు తెలియటం లేదు. ఇదివరకైతే మార్గంలో ప్రయాణిస్తున్నట్లుగా అనిపించేది. మరి ఇప్పుడు అలాలేదు. ఇప్పుడు మార్గం అనేది లేకుండానే నడిచిపోతున్నాను. గమనం లేకుండానే ముందుకుపోతున్నానా లేక ఆ గమనం (నడక) అనుభవంలోకి రావటం లేదా! అది కూడా ఎలా అంటే, కాళ్ళు లేకుండా నడుస్తున్నాను, చెవులు లేకుండా వింటున్నాను, చేతులు లేకుండా పని చేస్తున్నాను, ముఖం లేకుండాను,

శబ్దాలు లేకుండా మాట్లాడుతున్నాను. ఇలాగైతే శక్తి యొక్క భావన ఎలా ఉంటుంది? ఇంకా ముందుకుపోతే, 'తమరు' వ్రాసినట్లుగా ద్వైతం, అద్వైతం అనేవి అనుభూతి చెందే శక్తియే లేకపోతోంది. ఒకవేళ అనుభూతి చెందటానికి ప్రయత్నిస్తే మనస్సు గాబరా పడుతోంది అంటే సబబుగా ఉంటుంది. ఈ దశ, వెనక్కు తిరిగి చూసినట్లయితే అనుభూతికి వస్తున్నట్లుగా అనిపిస్తోంది. తరచుగా, ఉందనుకున్నా, లేదనుకున్నా చివరకు ఉన్నదనియే భావించి ముందుకుపోతున్నట్లు అనిపిస్తోంది. ఈ దశ ఏమిటో మరి! నాలో ద్వైతం లేదు అని తమరు వ్రాశారు, కాని నా స్థితి ఎలా ఉందంటే, ద్వైతం, అద్వైతం రెండూ నాకు అనుభవం కావటంలేదు. నేను నా జీవితకాలం అర్థశాతం (అనగా 50 సంవత్సరాలు) పూర్తి చేసుకున్నట్లుగాను, మిగతా భాగంలో ఎంతోకొంత జీవించవచ్చని, తమరు వ్రాశారు. అయితే **బాబూజీ, నా అనుభవం, ఆలోచన ప్రకారం, 'తమరు' లేని ఈ ప్రపంచం ఎప్పుడైనా ఉందా అంటే లేదని, (ఇంక) ఉండబోదని చెప్పాలి. ఏరోజునైతే తమ మనస్సులో ఇది (అనగా బాబూజీ లేకపోవటమనేది) కలిగినట్లయితే ఆ రోజు మహాప్రళయం ముంచుకువస్తుంది. అప్పుడు ఏదైనా మిగిలి ఉంటుందంటే, అది కేవలం 'మాలిక్' యొక్క అస్తిత్వం మాత్రమే.** ఇది నా దృఢ విశ్వాసం, స్వాభావిక ఆలోచన. తమరు "నాకు ఇంకా జీవించాలి అని ఉంది" అని వ్రాశారు. దానిని చదివి అందరికీ అత్యంతానందం కలిగింది. నేనయితే, 'మాలిక్' అడుగుజాడల్లోనే మరియు 'అతని' నీడలోనే (వెన్నంటియే) ఉండాలని మాత్రమే కోరుకుంటున్నాను. 'మాలిక్' కృపతో అది సిద్ధించుగాక!

శ్రీ బాబూజీ, తమరు నా జబ్బును, నా శారీరక వ్యవస్థ నుంచి బయటకు నెట్టేసే (తొలగించే) ప్రయత్నం చేస్తున్నారు కనుక, దానికి సంబంధించిన ఒక చుక్క కూడా తమకు చేరకూడదు అని ముఖ్యంగా దృష్టిలో పెట్టుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాను. తమరు 'మాలిక్' కనుక ఈ విధంగా వ్రాసాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. నేనయితే మిషన్ సేవకురాలినే, జీవితమంతా మరియు జీవిత పర్యంతం అలాగే ఉంటాను. నా జీవన సర్వస్వమూ మిషన్ కొరకే.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 389

షాజహాన్‌పూర్,
29.04.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలు ఏప్రియల్ 25 మరియు 28వ తేదీలవి చేరాయి. వీటిలో మొదటి దానికి నేను జవాబు ఇస్తున్నాను. నీవు లేనట్లుగా ఎప్పుడూ జరగలేదని, నీవు ఎప్పుడూ లేనట్లుగా ముందు జరగబోదు అని, నీలో కలిగిన ఆలోచన పూర్తిగా సరైనదే. దీనిని చదివి నేను ఆనందంతో ఉక్కిరిబిక్కిరై పోయాను. పరిపూర్ణత చెందుతూ ఉన్నావు, కాని అది వాస్తవికత యొక్క A,B,C,D మాత్రమే. నేను ఎప్పుడూ నీ మంచి స్థితులను A,B,C,D లుగా లేదా ప్రారంభ దశలుగానే ఉంటున్నాయని చెప్తూ ఉంటానని నీవు చెప్పవచ్చు. నా దృష్టికి అలాగే అనిపిస్తున్నప్పుడు నేను ఏమి అనాలి? నేను వాస్తవికత యొక్క A,B,C,D లుగా చెప్పినదానిమీదకు నీవు చేరే సమయాన్ని ఈశ్వరుడు కల్పించినప్పుడు, నీవు అక్కడకు చేరాక నా పరిశీలన సరైనదే అని నీకు అర్థమవుతుంది. **దీని తర్వాత వచ్చే స్థానంలో దైవ రహస్యాలు వెల్లడవుతాయి. నా దృష్టిలో దైవ రహస్యాలు ప్రకటితమయ్యే చోటు అంటే, ఎక్కడైతే ఋషులకు దైవ రహస్యాలు వెల్లడయ్యాయో ఆ చోటు. దీని తరువాత ఉన్న స్థితిలో శృతి ఆవిర్భవించటం ఆరంభమవుతుంది.** ఎవరెవరు ఈ స్థితికి చేరారు అను విషయం నేను ఇప్పుడు చెప్పజాలను. నేను తేజోమండలంలో (Brighter world) పరిశీలించినమీదట నా గురు మహరాజ్ (లాలాజీ సాహెబ్) మినహా యిస్తే, ఒక వ్యక్తి దీనికిమించి ఉన్నతస్థితికి

ఎదిగినట్లుగా తెలుస్తోంది. నారదీయ సూత్రాలు వ్రాసినటువంటి వ్యక్తి బహుశా అతడే కావచ్చు. ఇంకా ఇద్దరు అతడి కంటె తక్కువ స్థాయిలో ఉన్నారు. అనగా పైన తెలిపిన స్థితి కంటె కొంచెం తక్కువ స్థితిని కలిగి ఉన్నారు. బిటియా! నేను నా రచనలను ఇక్కడే వదిలివెళ్తూ ఉంటాను. ఇవే కనుక ప్రచురించబడినట్లయితే, ఎప్పుడైనా జనం ఈ విధంగా భావించే అవకాశం ఉంటుంది. అదేమంటే, నారదీయ సూత్రాలు రచించినటువంటి సెయింట్ బహుశా సప్తవలయాలను (అల్టిమేట్ రీజియన్) దాటలేకపోయినందువలన, అతని భావప్రకటనలో గందరగోళం ఏర్పడింది అని భావించవచ్చు. **ఆ కేంద్రం (అంతిమం) వరకు చేరగలిగిన వారు నా గురుమహరాజ్ (లాలాజీ సాహెబ్) మాత్రమే. దానివల్లనే ఇతరులకు అక్కడకు చేరే మార్గం తెరవబడింది. అటువంటి వ్యక్తిత్వంగల మహనీయుని ఆగమనం ఇప్పుడు దుర్లభమే.** నేను నీకు వ్రాస్తున్న ఉత్తరాలలో తరచుగా వ్యర్థ విషయాలు వ్రాస్తున్నది ఎందుకంటే, వాటిని చదివిన వారికి కొంత ఆసక్తి కలుగుతుందనే.

నీవు వ్రాసినటువంటి స్థితి అనగా నీవు ఉన్నటువంటి స్థితిలో స్పందనలేదు అనేది వాస్తవమే. ఇది X, Y స్థానాలకు సంబంధించిన స్థితి. విశిష్ట మహోన్నత వ్యక్తి (డివైన్ పర్సనాలిటి) కారణంగా నీవు జీవించియే మరణించిన స్థితిని అనుభవిస్తున్నట్లుగా వ్రాశావు. నేను, నీ మూలంగానే నీవు ఆ స్థితి యొక్క ఆనందాన్ని అనుభవిస్తున్నావని చెప్పగలను.

**ఇప్పుడు నేను ఒక శుభవార్తను గురించి వ్రాస్తున్నాను. నీవు సాక్షాత్కారం పొందిన సందర్భంలో చౌబేజీ నాకు మిఠాయి తినిపించలేదు సరికదా నీవు ఇప్పుడు జీవన-మోక్ష దశను కూడా పొంది ఉన్నావు. ఇప్పుడు ఇది రెండవ సందర్భం కూడా అయ్యింది. కనుక నేను అక్కడకు వచ్చినప్పుడు మన అమ్మ మనందరికీ మిఠాయి తినిపిస్తుంది.** నీ ఎడమ కాలి పాదం మధ్యలో ఏదో అదురుతున్నట్లుగా అనిపిస్తోంది, అని నీవు వ్రాశావు. ఆ స్థానం ఎటువంటిదంటే, దాని మీద ధ్యాన మాచరించటం ద్వారా బ్రహ్మరంధ్ర స్థానం తెరచుకుంటుంది. ఇంకా దీనిలో అదురుడు అనుభవం కావటంలో అర్థం ఏమిటంటే, దాని సమీప స్థానం కూడా తెరుచుకోదలచినట్లు అవుతుంది. బ్రహ్మరంధ్ర స్థానం ఎటువంటిదంటే, ఈశ్వరుడు ఏదైనా సందేశం చెప్పదలచినప్పుడు ఈ స్థానం నుంచే మనకు చేరుతుంది. అనగా ఇది ఒక గ్రాహకంగా (Receiver) అవుతుంది. అలాగే అభ్యాసీ ఏదైనా సందేశం పంపాలనుకున్నప్పుడు అతడు సహస్రదళకమలం మధ్య బిందువు ద్వారా పంపటం జరుగుతుంది. ఆ విధంగా ఈశ్వర కార్యానికి, అభ్యాసీ కార్యానికి ఆ సహస్రదళకమలం ఒక సమాచార వ్యాపక వ్యవస్థలాగ (Transmitter) పని చేస్తుంది. ఇంకొక విషయం ఏమిటంటే, ఈశ్వరుడు బ్రహ్మరంధ్రం నుంచి ఇస్తాడు, కాని దాని అనుభూతి సహస్రదళకమలంలో కలుగుతుంది. ఇది నా పరిశోధనా ఫలితం. ఏదో సందర్భంలో ఎవరో ఒకరు ప్రశ్నించినపుడు నేను దానికి జవాబుగా ఈ విషయం చెప్పాను. ఇప్పుడు రెండో ఉత్తరానికి కొంత సంక్షిప్తంగా జవాబు వ్రాస్తున్నాను.

X,Y స్థానాలు జీర్ణించుకుపోవటం ఇప్పుడు ప్రారంభమైపోయింది అని నీవు వ్రాశావు. అయితే అది ఇంకను పూర్తిగా జీర్ణించుకుపోవటం ఆరంభం కాలేదు. ఎప్పుడు పూర్తయితే అప్పుడు ముందుకు నడిపిస్తాను. అలా జీర్ణం కావటమనేది నీ అణువణువులోను, నరనరంలోను జరగాలని నేను కోరుకుంటున్నాను. అప్పుడు జీవనమోక్ష దశ పరిపక్వమవుతుంది. నీ ఆరోగ్యం బాగు కొరకు నేను ఇచ్చిన కొన్ని సిట్టింగులు నీ నిద్రకు కారణమై ఉండవచ్చు. శారీరక బలహీనత కారణంగా చిరాకు కలుగుతూ ఉండవచ్చు. అంతేకాని దీనికి ఆధ్యాత్మిక కారణమంటూ ఏదీ లేదు. 'X', 'Y' స్థానాలమీద శక్తి కలుగుతుందన్నదానికి అర్థం ఏమిటి? అని నీవు ప్రశ్నించావు. దానికి అర్థం ఏమిటంటే, 'X', 'Y' స్థానాలమీద ఏ స్థితులైతే ఉన్నాయో అవి పూర్తిగా నీలో ఇమిడిపోయి వాటి మీద నీకు ఆధిపత్యం కలగాలని నా ఉద్దేశ్యం. ఇప్పుడు వాటి శక్తి ఏమిటో నీకు వివరిస్తాను. **ఈ స్థానాలలోని శక్తిని కనుక ఏదైనా ఒక నక్షత్రంమీద ప్రయోగించినట్లయితే అది ముక్కలు ముక్కలుగా అయిపోతుంది. అయితే అభ్యాసీకి ఈ హద్దుమేరకు**

**అనుభూతి కలగకుండా చేస్తాను.** దీనిని ఏ వ్యక్తి అయినా ప్రయోగించాలనుకుంటే, ముందుగా అతడు పరిమితులను ఉల్లంఘించాల్సి వస్తుంది. ఆ దుష్ప్రయోగం ఫలితంగా ఈ అవాంఛనీయమైన స్థితి ఇతరులలో కూడా కలగవచ్చు. నీవు వ్రాసిన చెవులు లేకుండా వినటం, కాళ్ళు, చేతులు లేకుండా కదలటం  వంటివి, బ్రహ్మదశ మూలంగా కలుగుతాయి. నీవు ఉన్నతి మార్గంలో ఇంకను సాగిపోతూనే ఉన్నావు , కాని అది నీకు తెలియటంలేదని చెప్పటానికి కారణం నీకు నీ యొక్క స్పృహ లేకపోవటమే. నీ నుదుటి మధ్యలో ఏదో పెద్ద గుంటలాగా ఉన్నట్లు తరచుగా అనుభవమవుతున్నదని నీవు వ్రాసినది నాకు అంతుబట్టటంలేదు. దీని మీద ధ్యానం చేసిన తరువాత తెలుస్తుంది. నీవు దీనికి కారణం ఆలోచించి తెలియజేయి. మే నెలలో మిషన్ ఆవిర్భావ దినోత్సవం మురాదాబాద్‌లో జరగవలసి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేయటం జరిగింది.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 390

లఖీంపుర్,
01.05.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది, చదివి సంతోషించాను. నా బలహీనత ఇప్పుడు కొంతవరకు తగ్గింది. 'మాలిక్' కృప మరియు కృషివల్లను అలాగే డాక్టర్ సిన్హాగారి శ్రమతోను బాగున్నాను కనుక చింతించాల్సిన అవసరం లేదు. పూజ్య మాస్టర్ సాహెబ్, ఉత్తరాలు వ్రాయటం కూడా మాన్పించి పూర్తిగా విశ్రాంతి ఇప్పిస్తున్నారు. అయినాకాని నేను తమకు ఉత్తరం వ్రాయాలనే తపన అలా వ్రాయకుండా నిరోధించలేక పోయింది. అందుచేత వ్రాసేసాను. తమరు నా స్థితి గురించి, సత్యత్వం (రియాలిటీ) యొక్క A,B,C,D అని వ్రాశారు. అది వాస్తవమే. ఇంకా తమరు ఏమి వ్రాసారంటే, "ఏ సత్యత్వం (రియాలిటి) యొక్క A,B,C,D అని నేను చెప్పానో, దాని మీదకు కూడా చేరిపో, అప్పుడు నా దృష్టి సరైనదేనని నీకు అర్థమవుతుంది" అని. కనుక అది సరైనదే అవుతుంది. తమ ఉత్తరం వలన నాకు కూడా కొన్ని సంగతులు తెలుస్తున్నాయి. ఇప్పుడు ఈ దశలో అప్పుడప్పుడు ఏమి అనుభవమవుతోంది అంటే, జీవిత రహస్యపు కోణాలు (ప్రకరణాలు) కొంత స్పష్టమవుతున్నట్లు ఉంది. నేను ఇంతకుపూర్వం (Intellegence) జ్ఞానం వికసించి వ్యాప్తి చెందుతున్నట్లు ఉంది అని వ్రాసేదానను. అయితే నేను ఇప్పుడు కూడా ఎంతో కొంత వ్రాస్తూనే ఉన్నాను, కాని ఎందుకో అటువంటి అనుభవం కలగటం లేదు. నాకు (Intellegence) జ్ఞానం  గురించిన తాపత్రయం లేదు. జ్ఞానం కోసం నాలో స్థానం లేదన్నట్లుగా నాకు అనిపిస్తోంది. శ్రీ బాబూజీ, నేను ఇదివరకు నా యొక్క 'నేను' అను భావం గురించి వ్రాస్తూ ఉండేదానను, అది ఇప్పుడు అనుభవంలోకి రావటంలేదు. కాని ఇప్పుడైతే, నా అస్తిత్వం కూడా తొలగిపోతున్నట్లు అనిపిస్తోంది లేదా నా అస్తిత్వం ఎక్కడో లయమైపోతున్నట్లు అనిపిస్తోంది. అసలు అస్తిత్వం అంటే ఏమిటో నాకు తెలియదు. "నీవు సరైన మార్గం మీద నడుస్తూనే ఉన్నావు, నీకు నీ యొక్క స్పృహ లేనందువలన నీకు అది తెలియటం లేదు" అని తమరు వ్రాశారు. శ్రీ బాబూజీ, మరి అలాగైతే నాలో స్పృహ ఎందుకు లేకుండా పోయింది? ఇది కూడా నాకు అనుభవం కావటం లేదు. తమరు పై విధంగా వ్రాసిన మీదట నేను ధ్యాసపెట్టినా కూడా అర్థం కాలేదు. అవును బాబూజీ, నేను ఎటువంటి ధ్యాసకు / ధ్యానానికి కూడా నాలో స్థానం కల్పించటానికి తావివ్వకపోయి ఉండగా అది మాత్రం ఎందుకు అర్థమవుతుంది? ఈ దశలో ఒక నిలకడగా ఉన్న సముద్రంలో నేను కాదు కాని, నా అస్తిత్వం యొక్క మసకబారిన నీడ తేలియాడుతూ పోతున్నదనిపిస్తోంది. అటువంటి నా అస్తిత్వం తేలుతూ, ఈదుతూ వెళ్ళిపోయిన తర్వాత కూడా, అగాధ సముద్రంలోని

జలంలో పరివర్తనంగాని, స్పందనగాని కలిగినట్లు అనుభూతి చెందలేదు. ఇంకను నా అస్తిత్వం తుంపరతుంపరలుగా అయిపోయి ఆ జలంలోనే కలిసి అస్పష్టంగానో లేదా మసకబారిపోయినట్లుగానో అనిపిస్తోంది. ఎప్పుడైతే ఆ అస్పష్టమైన లేదా పొగబారిన అస్తిత్వం కూడా జలంలో పూర్తిగా కలిసిపోతుందో, అప్పుడు ఆదే రోజున జీవనమోక్ష దశ పూర్తవుతుందని అనిపించింది. ఆ సంగతి దైవానికే తెలియాలి. కాని నాకు ఇంకా ఏమనిపిస్తోంది అంటే, నా అస్తిత్వాన్ని దాటిన జలం ఎంతైతే ఉందో, అంతే జలంలో నేను నా అస్తిత్వాన్నే పొందుతున్నాను. ఈ దశ ఏమిటో అంతుబట్టటం లేదు. ఇప్పుడు తేలికదనం అనిగాని, సూక్ష్మత్వం అనిగాని చెప్పటంలో కూడా సరిగ్గా భావాన్ని వెల్లడించలేకపోతున్నాను. బహుశా ఇది కూడా ఎక్కడో వెనకబడిపోయి ఉండాలి, లేదా లయమైపోయి ఉండాలి, అదేమిటో తమకే తెలియాలి. ఇప్పుడు స్థితిలో అణువణువు తడిసిపోయిందిగాని లయం కావటానికి ఎంత సమయం పట్టుతుందో అన్నట్లు ఉంది. నుదుటి యొక్క మధ్యభాగంలో గుంట ఏర్పడిన దానికి కారణం అడిగాను కదా, అది నాకు ఎలా అర్థమవుతోంది అంటే, దీనికి సంబంధం బ్రహ్మరంధ్రంతో ఉందేమోనని అనిపించింది. బహుశా ఇది దానికి మార్గమే అయి ఉంటుంది. ఈ ఊహ సరైనదో కాదో తమరే వ్రాయండి.

తమర్ని చూసి ఒక సంవత్సరం గడిచిపోయింది అని అమ్మ చెబుతోంది. తమరు తీసుకొనదలచిన శెలవులు ఇక్కడ గడపటానికే తీసుకోండి. మిఠాయిలు తినాలనుకుంటె త్వరగా రండి. ఎవరి ఉత్తరాలు వారికి పంపండి. ఎప్పుడు వచ్చేది వ్రాయమని అమ్మ చెబుతోంది. అందరికీ తమరే జ్ఞాపకం వస్తున్నారు. ఇప్పటినుంచి శెలవులు జూన్ మొదట్లో తీసుకుంటారా లేక చివర్లోనా! అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. తావూజీ ఛాతికి చెందిన చికిత్స జరుగుతోంది. వారిలో ఇచ్ఛాశక్తి ఎంతమాత్రం లేదు. అది వారికి చాలా స్వల్పంగా ఉంది. 'మాలిక్' దయతో దశలో లయమవుతున్నాను.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 391

లఖీంపుర్,
04.05.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. నాలో ఇప్పుడు కొంత శక్తి ఉద్భవించింది. 'మాలిక్' కృప నాకు ఆంతరిక శక్తి నిచ్చింది. అందుకు 'అతని'కి ధన్యవాదాలు. బలహీనత అధికమైపోయినపుడు ఏమి చేయగలను. సహాయం లేకుండా కళ్ళు కూడా తెరవలేకపోతున్నాను, కాని సహాయమైతే లభిస్తూనే ఉంది. అందుకు 'మాలిక్'కు అనేక ధన్యవాదాలు. నిన్న మొన్నటి నుంచి దుఃఖం లాంటిది (తపన) కలుగుతోంది. దానితో అప్పుడప్పుడు 'తమరు' తమ చేతికర్రతో నా ఎదుట నిలిచి ఉన్నట్లుగాను, ఒక్కొక్కసారి నన్ను పిలుస్తున్నట్లుగాను అనిపిస్తోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

శరీరంలోని అణువణువు చిన్నాభిన్నమైపోయి ధ్యానానికి రవ్వంత స్థానం కూడా లేకుండా పోయింది. వాస్తవం ఏమిటంటే, నేను ఏ దశలోనైతే ఉన్నానో, అక్కడ ఒక్క కణానికిగాని, ఆఖరికి పరమాణువుకుగాని చోటులేకుండా పోయింది. దశయే నాలో జీర్ణించుకుపోతున్నట్లు అనిపిస్తోంది. నా మసకబారిన అస్తిత్వంలో దశ యొక్క సముద్రం కలిసిపోతున్నట్లుగాను, ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే, ఆ సముద్రం యొక్క జలమంతా నా అస్తిత్వంలో వ్యాపించి పోతున్నట్లుగాను, అయినాగాని అస్తిత్వం మాత్రం ఉన్నది ఉన్నట్లుగా ఉందని అనిపిస్తోంది. అది ఒక నీటికోడిలాగా అయిపోయింది. జలమంతటినీ పీల్చుకుపోతున్నప్పటికీ దాని రెక్కల ఈకల్లో ఒక్క నీటి చుక్క కూడా అంటి ఉండటం

లేదు. అంతా పొడిగానే ఉంది. అయినప్పటికి, నా రక్తనాళాలన్నింటిలోను దశ యొక్క సముద్రపు నీరు చొచ్చుకుపోయి, నిండిపోతున్నా కూడా, అది ఉన్నది ఉన్నట్లే స్పందనహీనంగాను, నిశ్శబ్దంగాను ఉంది.

శ్రీ బాబూజీ, ఒక విధంగా ఏమి అనిపిస్తోంది అంటే, శిరస్సుపైన మధ్యభాగంలో, శిరస్సు వెనుకవైపు వరకు గుంటలాగా ఏదైతే అనుభవమవుతూ ఉన్నదో, దానికి (Inter-commune) అంతర్వాణితో సంబంధం ఉన్నట్లు అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, ఒక రంధ్రం శిరస్సును చీల్చుకొని పైభాగం వరకు వెళ్ళినట్లుగాను, దాని సంబంధం పైలోకంతో ఉన్నట్లుగాను, అనగా అది అక్కడి సమాచారాన్ని రాబట్టే యంత్రంలాగా ఉన్నట్లుగాను అనిపిస్తోంది. ఇది సరైనదో కాదో తమరే నిర్ణయించాలి. బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, నా స్థితిని గ్రహించటానికి ఎందుకోగాని నేను స్వయంగా దానిని చేరలేకపోతున్నాను. కాని 'మాలిక్' కృపతో నేను దానిని పరిశీలించకుండానే నాకు ఆ దశ అర్థమవుతోంది.

శ్రీ బాబూజీ! నా స్థితి ఎలా ఉందంటే, స్వయంగా నేను నన్నే ఒక్క క్షణమైనా సహించలేకపోతున్నట్లు ఉంది. నా హృదయంలో స్వయంగా నాకే స్థానం లేకుండా పోయింది. ఇప్పుడైతే, మసకబారిన నా అస్తిత్వం ఏదైతే ఉందో, అది కూడా నా హృదయంలో లేకుండా ఎక్కడో బహుదూరంగా ఉండిపోయి, దానితో నా సంబంధం తెగిపోయినట్లుగాను, మరచిపోయినట్లు గాను అనిపిస్తోంది. అస్తిత్వం కూడా మిగిలి ఉన్నప్పటికి, అది ఎందుకు ఉందో నాకు తెలియదు. అయితే అది ఎవరినో కలుసుకోవటానికి, 'అతడి'ని పొందటానికి మాత్రమే. ఇప్పుడు తపనయే నా అస్తిత్వంగా ఉంది కాని మరేమీకాదు. ఇప్పుడు త్రాడు లేకుండానే 'మాలిక్'తో జతగూడి ఉన్నాను. హృదయం లేకపోయినా కలిసియే ఉన్నాను. నేను ఇప్పుడు 'అతడు' దూరంగా ఉన్నాడన్నా, దగ్గరగా ఉన్నాడన్నా, హృదయం మాత్రం కేవలం 'అతడి'కే చెంది ఉన్నది. అదేమిటో 'అతడి'కే తెలియాలి. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 392

లఖీంపూర్,
10.05.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన పోస్టుకార్డు చేరింది, దానిలోని విషయాలను తెలుసుకొని సంతోషించాను. నేనింక ఆరోగ్యం కోసం తప్పకుండా పరిశ్రమిస్తాను. నా వలన 'మాలిక్'కు ఎటువంటి చింత, పరిశ్రమ అధికం కాకూడదని నేను సర్వదా కోరుకుంటాను. అందుచేత నరనరాల నుండి జబ్బు తొలగిపోవటానికి బాగా ప్రయత్నం చేస్తాను. అప్పుడప్పుడు శారీరక బలహీనత కారణంగా పూర్తిగా ఇచ్ఛను ప్రయోగించటంలో బద్ధకం ఏర్పడుతోంది. అయినప్పటికి తమ ఉత్తరం నా నరనరాల్లో శక్తిని ఉత్పన్నం చేస్తోంది. కొంచెం నిద్రలాగా, కొంచెం బద్ధకంగా ఉండి నాలో ఇచ్ఛాశక్తిని కల్పించటం లేదు. మంచిది, ఎలాగైనాగాని శరీరం బాగవుతుంది. 'తమరు' ఈ విషయం గురించి దిగులు చెందవద్దు. నేను ఎలాగైనా ఆరోగ్యవంతురాలనవుతాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, పాయింట్ 'Z' నా ఎదుట ఉన్నట్లు అనిపిస్తోంది. ఈ దశలో సహజ అవస్థ నాలో జీర్ణమవుతూ ఉన్నట్లు అనిపిస్తోంది. అలాకాదు, కాదు, సహజ అవస్థయే నా రూపంగా అయిపోయింది. అనగా నాది సహజ రూపంగా అయిపోయింది. నా కణకణమూ సహజ రూపాన్ని సంతరించుకున్నాయి. నా బాబూజీ, దశ ఏమిటంటారా, దానిలో ఒక చిత్రమైన అందం ఉన్నది, చూడ ముచ్చటగా ఉన్నది. చెప్పటానికి శబ్దాలను ఏదో అలుముకున్నట్లుగా

ఉంది, అనగా వర్ణించనలవి కాకుండా ఉంది. నాకు బయట, లోపల ఈ దశయే అనుభవమవుతోంది. ఇంకా చెప్పాలంటే, సహజ అవస్థ యొక్క సుగంధం నా కణకణంలో ఇమిడిపోయినట్లు ఉంది. ఇప్పుడు దశలో సామ్యావస్థ మరియు వ్యక్తిగతాల సంబంధం ఇసుమంతైనా లేకుండా ఉంది. అది ఎంతగానంటె, ఈ దశల గురించి ఆలోచించి నట్లయితే నా దశ మీద కొంత వత్తిడి కలగటమేగాక, నా స్వేచ్ఛలో కొంత కళంకం వంటిది ఏర్పడుతున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఈ దశలో ఎటువంటి స్థితి ఉందంటే, ఎటువంటి బంధనం లేదు, ఇంకా స్వేచ్ఛ కూడా అనుభూతికి రావటంలేదు. ఇప్పుడు ఈ దశలో, సముద్రంలో మణులు, ముత్యాలు ఉన్నప్పటికీ, నాకు మాత్రం జలమంటే జలం యొక్క అనుభూతియే కాని ఇంకేమీ కనిపించటం లేదు. అంతర్ మరియు బాహ్య వృత్తులు కూడా వాటి అస్తిత్వం కోల్పోయాయి అని అనిపిస్తోంది. అలాగే బాహ్య వస్తువులు కనిపిస్తూ ఉన్నాయి కాని వాటి అస్తిత్వం కోల్పోయాయి. ఈ దశలో ఏమనిపిస్తోంది అంటే, నేను ఒక ప్రాపంచిక స్త్రీనే అని అనిపిస్తోంది. ఇప్పుడేమిటి, జన్మజన్మాంతరాల్లో కూడా పూజ లేక ఈశ్వరునివైపుగాని దృష్టి మరలినపుడు, ఇప్పుడు మాత్రం ఏమి ఆశించగలను! ఎందుకంటే, పూజ మరియు ఈశ్వర ప్రేమకు చెందిన సంస్కారాలేవీ నాలో లేనప్పుడు భక్తి విశ్వాసాలు ఎక్కడ నుంచి వస్తాయి అని అనిపిస్తోంది. అదేమిటో ఆ 'మాలిక్'కే తెలియాలి. ఇప్పుడు ఏమిటోగాని, పూర్వం వ్యాప్తివంటిది ఏదైతే అనుభవమవుతూ ఉండేదో అది ఇప్పుడు ఊహా మాత్రంగానైనా లేకుండా పోయింది. ఇంక వ్యాప్తి కావటం అంటే, అది నాకు జ్ఞాపకమే లేదు. ఇప్పుడు ఉన్నదల్లా (Swimming) ఈదటం అంటే ఈదటం మాత్రమేనని అనిపిస్తోంది. ఎక్కడైనా ఈదటం ఉన్నపుడు, నేను అక్కడ అందులో ఉంటున్నాను. ఏదైనా ఈదటం జరిగిపోతే నేను దానిలో కలిసిపోయి ఉన్నట్లు అనిపిస్తోంది. ఇది ఏమిటో అర్థం కావటంలేదు. ఇంతకూ ఏమిటంటే, అన్నింటిలోను నేను ఉన్నాను, దేనిలోనూ నేను లేను. నాది ఇటువంటి తికమక స్థితిగా ఉంది. బాబూజీ, ఎక్కడా నాలో ఊహామాత్రంగానైనా అలసట లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 393

లఖీంపుర్,
17.05.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు కొంచెం తేలికైనటువంటిది మరియు ఖాళీవంటి దశగా ఉంది. శరీరం దూదిపింజలా అయిపోయి అటూ ఇటూ తేలియాడుతున్నట్లు అనిపిస్తోంది. దానిని (శరీరం) ఎక్కడికైనా ఎత్తి తీసుకుని వెళ్ళాల్సిన అవసరం లేదని అనిపిస్తోంది. కాని అదే స్వయంగా ఎగురుతూ ఉన్నట్లుగా తిరుగాడుతోంది. ఇంకా ఎటువంటి దశ అంటే, ఎంత అల్పమైన వత్తిడి అంటే స్వప్నంలో కూడా స్పర్శించలేనట్లుగా ఉంది. నా దశ వరకు చేరువవుతూనే తేలికదనం కూడా తొలగిపోతోంది అని అనిపిస్తోంది. ఎందుకంటే, నా దశ ఎటువంటిదిగా కనిపిస్తోంది అంటే, అది తేలికపాటి వత్తిడికీ లోనుకావటం లేదన్నట్లుగాను, బంధించబడనట్లుగాను ఉంది. అసలు ఎలా బంధించబడుతుంది? ఎందుకంటే, దానికి 'స్వేచ్ఛ' అని చెప్పదగినంత వత్తిడి యొక్క స్పర్శ కూడా పొందనట్లుగా ఉంది. నా బాబూజీ, అది ఎలా ఉన్నాకాని, 'అతని' ప్రవేశమే ఉంది దానిలో. అలా కాదనుకుంటే, అది విముక్తి చెందినట్లుగా తిరుగుతోంది. ఇప్పుడు

దానిలో దేనికీ ప్రవేశం లేదు, బహుశా ముక్తికి కూడా ప్రవేశం లేదనుకుంటాను. ఎందుకంటే, అది అయితే ముక్తి దశలో కూడా, మతిమరపులాగ, దారి తెన్నూ తెలియని దానిలాగ, విస్మృతి స్థితిలోలాగా ఉంటోంది. అదేమిటో దైవానికే తెలియాలి కాని ముక్తి దశ యొక్క మైదానంలో నేను స్వేచ్ఛగా ముందుకుపోతూ, స్పృహలేనట్లుగా ఉన్నాను. ఇంకా ఎలా ఉందంటే, ఆ మైదానంలో కూడా, ఎక్కడ చూసినా నా ముఖమే కనిపిస్తోంది. దానికి ఆ అద్దంలో కూడా తనే కనిపిస్తున్నట్లుగా ఉంది. దానిలో కేవలం నన్నుగాని లేదా సత్యాన్నిగాని చూస్తున్నాను. అయినా కూడా స్వేచ్ఛగానే ఉంటున్నాను. నా శ్రీ బాబూజీ, ఇప్పుడు ఒక వింతైన దశ ఉంది. దానిని గురించి చెప్పాలంటే, నా రోమరోమంలోను (మోక్ష) దశ చొచ్చుకుపోయింది, కాని చెప్పలేను. ఎందుకంటే, ఆ మైదానం నుంచి, రోమ రోమమూ నా అనుభవంలోకే రావటం లేదు. అయితే ఇంకొకటి కూడా ఉంది, ఈ దశను పొందుతూ కూడా రోమ రోమంలోనూ ఉన్నాను. అది ఏమిటోగాని, నేను ఇంతకుపూర్వం నేను నన్ను దూరంగా, అతిదూరంగా అనుభూతి చెందుతున్నాను అని వ్రాసినటువంటిది, ఇప్పుడైతే ఏమీ చెప్పలేకపోతున్నాను, దూరం, దగ్గర అని. నాకు అంతా సమానంగానే అనిపిస్తోంది. దూరం, దగ్గర అనే ప్రసక్తే లేకుండా రెండూ అంతమైపోయాయి. నాకేమీ అనుభవానికీ రావటం లేదు. ఇంకొక రకంగా చెప్పాలంటే, నాకు ఏమైందో ఏమోగాని, నాకు ఇప్పుడు ఏమీ కనిపించటం లేదు. బహుశా వెలుతురు కూడా లేకపోయింది, ఇంక ఏమైనా ఉన్నాగాని, నాకైతే తెలియటం లేదు. ఇప్పుడు నాలో ద్వైతంగాని, ఏకత్వంగాని ఏదీ అనుభవానికి రావటం లేదు. నేను అన్నింటి నుంచి ముక్తి పొందానేమో తెలియటం లేదు. ఎలాగోకాని, 'మాలిక్' కృపతోనే వెలుగు లేకుండా కూడా పురోగమినస్తున్నాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 394

షాజహాన్‌పూర్,

21.05.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలన్నీ చేరాయి. మే 10 మరియు 17వ తేదీల ఉత్తరాలకు జవాబు వ్రాస్తున్నాను. నీవు ఉన్నటువంటి బిందువులు 'X', 'Y'ల స్థితి బాగా జీర్ణించుకోబడింది, కాని పిండదేశంలో ఇంకను పూర్తిగా జీర్ణించుకోలేదు. నీవు, 'Z' స్థానం యొక్క స్థితికి నిన్ను చేర్చలేదని వ్రాశావు. అయితే జీవనమోక్ష దశ యొక్క జీర్ణింపు కొరకు వేచి ఉండవలసి వస్తోంది. నీలో ద్వంద్వరహిత స్థితి పాలన సాగిస్తున్నట్లు ఉంది అనే నీ అభిప్రాయం నిజమే. నీవు, కణకణం సహజరూపం దాల్చినట్లుగా ఉంది అని వ్రాసిన దానిలో నీ భావం ఏమిటో అర్థం కాలేదు. బాహ్యవృత్తుల ఉనికి లేకుండా పోయింది అని నీవు వ్రాసినది వాస్తవమే. నీ వృత్తులన్నీ తాత్కాలికంగా తొలగించబడిన స్థితికి వచ్చాయి. ఇప్పుడు అది మళ్ళీ లయ–అవస్థకు ప్రారంభమవుతుంది. అయితే వృత్తులన్నీ ఇంకా స్వచ్ఛస్థితికి రాలేదు. వాటిని నేను శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు నాకు నీ ఆరోగ్యం గురించిన ఆలోచన ఉంది. ఇంకా జరగవలసింది చాలా ఉంది, అందుకుగాను ఇంకా ఆరోగ్యం పొందాల్సి ఉంటుంది.

మే 17వ తేదీ ఉత్తరంలో, "నేను మొదట నాకు నేనే దూరమవుతూ ఉన్నట్లు ఉంది. అయితే ఇప్పుడు దూరం, దగ్గర అను ఆలోచనే లేదు" అని వ్రాశావు. ఇప్పుడు దైవానికి దగ్గర కావటం పెరిగింది అని దాని అర్థం. నుదుటి మధ్యలో గుంటను అనుభూతి చెందినప్పుడు, దానిని గురించి వివరించమని నిన్ను అడిగాను. దానిని గురించి నీవు వివరించినది సరైనదే. ఇప్పుడు నీవు మరొక విషయం గురించి నీ అనుభూతి చెప్పాల్సి ఉంది. అది ఏమిటంటే,

ఎక్కడ జుట్టు ముడివేసుకోబడుతుందో అక్కడ ఏదైనా వెడల్పుగా లేదా గుంటలాగా ఉన్నట్లుగా అనిపిస్తోందా?

నేను అక్కడికి వచ్చే తేదీని ఇప్పటివరకు ఖరారు చేయలేదు. రెండు, మూడు రోజుల్లో దాని నిర్ణయం తెలుస్తుంది.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 395

లఖీంపుర్,
21.05.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్ మరియు జియా (మాస్టర్ సాహెబ్ పత్ని) వగైరాలు క్షేమంగా చేరి ఉంటారనుకుంటున్నాను. నాకు ఇప్పుడు నా శారీరిక వ్యవస్థ అంతా వ్యాధుల నుంచి విముక్తమై పోయినట్లు ఉంది. జబ్బుకు చెందిన చిహ్నం కూడా లేదు. చాల నిర్మలమైన దశగా కనిపిస్తోంది. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, నా చైతన్యం (Consciouness) అనేది (Sub-conscious mind) సుప్తచేతనా మనస్సులోనే ఉంటున్నది. అది అక్కడి నుండి ఎప్పుడు కూడా దిగిరావటం లేదు. అదే (అధిచేతనా మనస్సుయే) దాని నివాసంగా అయిపోయింది. దీనినే మరోరకంగా చెప్పాలంటే, అసలు దానికోసం క్రింద ఏమీలేదు అంటే, సబబుగానే ఉండవచ్చు. దానిలో సర్వత్రా నేను కలిసిపోతున్నట్లు ఉంది. అది కూడా ఒక అద్దంలాగా అయిపోయి, ఎక్కడ చూసినా అక్కడ నా ముఖం కనిపిస్తోంది. అది ఏమిటోగాని, నా ముఖం కనిపిస్తూ ఉన్నా కూడా నేను స్వతంత్రురాలిగానే ఉంటున్నాను. బంధనానికి గురికాకుండా ఉంటున్నాను. నేను ఎక్కడ సంచరిస్తున్నానో నాకు తెలియదు.

నా బాబూజీ, నా స్థితి ఎలాంటిది అంటే, నాకు బాగా సంతోషం కలుగుతోంది. దానిలో కూడా బంధనం లేదు. అది స్వేచ్ఛాయుత ఆనందం. బంధనం లేదు అని ఎందుకు అంటున్నానంటె, అది హృదయంలో ఉన్నట్లు అనిపించకపోగా, సర్వత్ర ఒక స్వేచ్ఛాయుత దశగా ఉంది. అది ఉత్పన్నమవుతున్నట్లుగాని, ఉత్సాహం మరియు ఆవేశం కలసి ఉన్నట్లుగాని అనిపించటం లేదు, కాని స్వయంగా దానికదే అన్నట్లుగా ఈ దశ ఉంది. ఈ ఆనందంలో ఒక తీయని అనుభవం ఏదో కలిగింది. అది ఎంత పల్చగా ఉన్నదంటే, దానిని పట్టుకోవటం కూడా చాలా కష్టంగా ఉంది. ఈ దశ చాలా శుద్ధమైనదిగాను, స్పష్టమైనదిగాను ఉంది. పూజ్య శ్రీ బాబూజీ, ఈ ఆనందమయ దశ, బయట లోపల అన్నిచోట్ల అనుభూతికి వస్తూ ఉన్నప్పటికీ, అది నాకు అతిసమీపంలోను లేదా దానిలోనే ఉంటూ కూడా దానిని (స్థితిని) మరచిపోయినట్లు ఉంది. నేను నా చైతన్యం లేదా స్మృహను కూడా కోల్పోయినట్లు ఉంది. మరచిపోవటమే కాదు, నాతో ఎవరికీ సంబంధం లేనట్లుగా ఉంది. ఇంకా నా స్థితి ఎలా ఉందంటే, స్వయంగా నా ఆత్మ యొక్క జాడ కూడ లేకుండాపోయింది. దానితో సంబంధమే తెగిపోయినట్లుగా ఉంది. నాకు బ్రహ్మ, అహం బ్రహ్మోస్మి (నేను బ్రహ్మ) వగైరాలన్నీ స్వప్న సదృశంగా అయిపోయాయి. ఇంకా ఏమంటే, ఇదివరకు ఆత్మ గ్రుచ్చుతున్నట్లుగా ఉండేది. కాని ఇప్పుడు అది (గ్రుచ్చటం) లేకుండా పోయింది. ఇప్పుడు ఆత్మ గ్రుచ్చుకోవటమనేది ఎలా జరుగుతుంది? అసలు ఆత్మ అనేది నాలో ఉందా లేదా అన్నట్లు అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడు నాకు ఏమైందో ఏమోకాని, బ్రైటర్‌వరల్డ్ (తేజోమండలం) యొక్క దృశ్యం నాకు కనిపిస్తోంది. ప్రార్థనను పఠించినట్లయితే నాకు అక్కడ కొంచెం అలజడి లాంటిది అనుభవమవుతోంది. ఇది ఏమిటో తమరే వివరించాలి. నాకు ఇప్పుడు శరీరం ఇక్కడ ఉండి కూడా, కోరుకుంటే ఎక్కడైనా తిరగగలను అన్నంత తేలికదనం ఇప్పుడు ఏర్పడింది. అన్నింటితోను నాకు సంబంధం అనగా

జడ చైతన్యాలన్నింటితోను ఉన్నప్పటికీ, దేనితోనూ సంబంధం లేనట్లుగానే అనిపిస్తోంది. నాలో సంతోషం అధికంగా ఉంది. ఇంకను, వ్యవస్థ అంతా గాజులాగా స్వచ్ఛంగా ఉంది. శారీరిక రుగ్మతలన్నీ కూడా తొలగిపోయాయి. ప్రతివస్తువు, ప్రతిస్థితి నా అసలు రూపంలో కనిపిస్తున్నాయి. కాదు కాదు, (రియాలిటి) అసలు తత్వం లేదా అసలు రూపమే నా నేత్రజ్యోతిలో మిళితమైపోయినట్లు ఉంది. అదంతా తమకే తెలియాలి. తమరు ఏదైతే ఇచ్చారో అదే నావద్ద ఉంది. ఇప్పుడు నా ఎదుట ఏదో నూతన అధ్యాయం తెరవబడినట్లు ఉంది. (రియల్) అసలు తత్వం లేదా అసలైన దశలో ప్రవేశిస్తున్నట్లుగా అనిపిస్తోంది.

పూజ్య మాస్టర్ సాహెబ్‌గారికి నా ప్రణామం తెలపండి. నా బాబూజీ, నేను తమకు చెందిన దానను. తమకే చెంది ఉంటాను. నాలో అధిక సంతోషం ఉందా లేదా బాధ ఉందా అనేది నాకైతే తెలియటం లేదు. తమరే వ్రాయండి. అప్పుడే నాకు తెలుస్తుంది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 396

లఖీంపుర్,
22.05.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను ఒక ఉత్తరం పూజ్య మాస్టర్ సాహెబ్ ద్వారా పంపాను. అది తమకు చేరి ఉంటుందనుకుంటున్నాను. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

అక్కడ తమవద్దకు రావాలని మనస్సు ఆవేదన చెందుతోంది. కాని నేను ప్రతిస్థితిలో మనస్సును స్వాధీనంలో ఉంచుకొనటమే తమ నుంచి నేర్చుకున్నాను. బహుశా ఇందుకే నేను నా మనస్సును 'మాలిక్' వద్దనే ఉంచాను. ఎందుకంటే, అది ఎప్పుడైనా వశం తప్పుతున్నట్లయితే, 'అతడే' దీనిని సరైన దారిలోకి తెస్తాడు. తమరు జూన్ 6,7వ తేదీల్లో ఇక్కడకు వస్తున్నారు. నాకు ఉన్న కోరిక ఏమిటంటే, నేను నా ఈ నేత్రాలలో నా 'మాలిక్'ను మాత్రమే నిలుపుకోవాలి అని. బాబూజీ, 'అతడు' అయితే అందుకు కనికరించాడు, కాని నేను మాత్రమే ఈ విధంగా దశను మరచి ఉంటున్నాను. అలా కాకుంటే నాలో 'అతడు' తప్పించి ఇంకెవరు మాత్రం ఉన్నారు అని అంటాను.

ఇప్పుడు నేను బహుశా (తేజోమండలం) బ్రైటర్‌వరల్డ్‌లోనే నివసిస్తున్నట్లుగా అనిపిస్తోంది. నేను ఊహా మాత్రంగానే చెప్పాను. వాస్తవం ఏమిటో తమకే తెలుసు. తమరు ఎక్కడకు తీసుకుని వెళ్తే అక్కడే నా నివాసం. నేనొక అమాయక వ్యక్తిలాగా ఈ ప్రపంచంలో ఉంటున్నా కూడా నాకు తెలియకుండా ఉంది. నాకు స్వయంగా నన్ను నేను గుర్తించగల శక్తి మైమరుపులోనే కాదు పూర్తిగా లోపించింది. శారీరిక వ్యవస్థ ప్రకాశవంతంగా ఉంది. దానిలో అనారోగ్యం అనేది మచ్చుకైనా లేదు. నాడీ మండలంలో కూడా బలహీనత తొలగిపోతున్నట్లు అనిపిస్తోంది. పాలిపోవటం (వెచ్చదనం) కూడా తగ్గిపోతూ ఉంది. చైతన్యం కూడా అధికంగానే ఉంది.

నా దశ ఎలా ఉందంటే, (Memory) స్మృతి నిద్రిస్తున్న స్థితిలో ఉంటున్నది. ఎలాగో తెలియదు గాని, 'మాలిక్' తన కృపతో స్వయంగా నేర్పుతూ తీసుకుని వెళ్ళుతున్నారు, నిద్రావస్థలో ఉన్నా కూడ. నాకు, నా ఆరోగ్యం గురించిన చైతన్యం ఉంది. నా కొరకు 'మాలిక్' మీద ఎక్కువ పని వత్తిడి లేకుండా ఉండటానికి నేను తగిన కృషి చేస్తాను. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారికి నా ప్రణామం తెలియపర్చండి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టో తమకు ప్రణామం తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 397

లఖీంపుర్,

23.05.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న ఒక ఉత్తరం పోస్టు చేశాను. ఇప్పుడు కేసర్ పరీక్షా ఫలితం వచ్చింది. దైవానికి అనేకానేక ధన్యవాదాలు. 'మాలిక్' కృపతో ఆమె 2వ శ్రేణిలో M.A ఉత్తీర్ణురాలైనది. అదంతా కేవలం తమరి కృప వల్లనే. 21వ తేదీ ఉత్తరంలో, ఎక్కడైతే పిలక జుట్టు ఉంచబడుతుందో అక్కడ వెడల్పుగా, గుంటలాగా ఉందని వ్రాసినది అర్థం కాలేదని తమరు వ్రాశారు. దీనికి సమాధానం నేను 10వ తేదీ వ్రాసిన జాబులో కాని, లేదా అంతకుపూర్వం వ్రాసిన జాబులో కాని జవాబు వ్రాశాను. ఎందుకంటే, నేను నా డైరీలో 2వ తేదీన వ్రాశాను. అయినా ఇప్పుడు వ్రాస్తున్నాను. నాకు గుంట మరియు వెడల్పుగా ఉన్నది అనుభవమవుతోంది. దానితోపాటు ఏదో గిలిగింత లేదా సరసరమను శబ్దం కూడా ఉంటున్నది. నుదుటి (త్రికుటి) నుంచి పాయింట్ లన్నింటివరకు మార్గం స్పష్టంగాను, తెరవబడి ఉన్నట్లుగాను అనిపిస్తోంది. అలాగే (Link) సంబంధం కూడా పైన ఎక్కడో ఉండవచ్చు. అది ఎటువంటిది అంటే నేను చెప్పజాలను, నాకు అర్థం కాలేదు.

తావూజీ 'తమ'కు ప్రణామం, అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారికి నా ప్రణామం చెప్పండి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 398

షాజహాన్‌పూర్,

24.05.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నేను వ్రాసిన ఉత్తరం నీకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. నీవు వ్యాధుల నుంచి విముక్తురాలవు కావాలని నా కోరిక. వాస్తవానికి భౌతిక విషయాల గురించి జనం వారికి ఉన్న ఇష్టతనుబట్టి ఇతరులపట్ల శ్రద్ధ కనపరుస్తారు. మరి నా అభీష్టం ఏమిటంటే, అభ్యాసులు నీవలన ప్రయోజనం పొందాలని. అయితే వాయిద్య పరికరం యొక్క తంతులు సరిగ్గా బిగించకపోయినట్లయితే అది బాగా పలకదు (కస్తూరీగారు ఆరోగ్యంగా ఉండాలని భావం).

ఇప్పుడు అసలు విషయానికి వస్తున్నాను. నీవు 22.5.1954వ తేదీగల ఉత్తరంలో "బహుశా నేను (తేజోమండలం) బ్రైటర్‌వరల్డ్‌లోనే జీవిస్తున్నాను" అని వ్రాశావు. నీవు 'బహుశా' అని వ్రాయటంలోనే తేడా వచ్చింది. ఎందుకంటే, నీవు వాస్తవంగా ఆ స్థితి పొంది ఉన్నట్లయితే, బహుశా ఆ అభిప్రాయం నీలో ఉత్పన్నమై ఉండేది కాదు. నేను ఒక్క విషయం చెబుతున్నాను- బ్రైటర్‌వరల్డ్ (తేజోమండలం) ఇంకా చాలా దూరంలో ఉంది. ఒకవేళ దృష్టిని దానివైపు మరల్చినట్లయితే ఆ చూపు కూడ అలసిపోయినట్లవుతుంది. అయితే నీ ప్రస్తుత స్థితి బ్రైటర్‌వరల్డ్‌కు చెందిన స్థూల రూపంగా ఉంది. ఆ (తోజో మండలం) బ్రైటర్‌వరల్డ్ అనే పేరు కేవలం ఏదో ఒక పేరు కోసం అనగా దానిని వర్ణించటానికి తగిన మాటలేదు కనుక ప్రయోగించాల్సి వచ్చింది. **ఆధ్యాత్మికంగా బాగా ఉన్నతి చెందినవారు, మహోన్నతులు అక్కడ నివసిస్తారు కనుక దానిని 'బ్రైటర్' అను పదం, మరియు ఆ స్థానానికి పేరు, ఒక పెద్దపేరు ఉండునట్లుగా "బ్రైటర్ వరల్డ్"గా ప్రయోగించబడింది. ఎవ్వరైనా నన్ను దానిని మీరు ఏమని పిలుస్తారు అని**

**అడిగినట్లయితే దానిని "లేనిప్రపంచం" (No world) అని అంటాను.** అయితే ఈ బ్రైటర్‌వరల్డ్ అను మాట నా నోటి నుంచి నీవు విని ఉండటంవలన దాని మీద నీకు మంచి ఆసక్తి కలిగింది. మరి ఇప్పటివరకు ఎవ్వరైనా తెలివిగలిగినవారు అక్కడకు చేరగలిగారా? ఇంక మూర్ఖులైతే మైళ్ళకు మైళ్ళ దూరంలో ఉన్నారు. ఎవరైనా అక్కడకు చేరగలిగారా అనే విషయం చౌబేజీ బాగా వివరించగలరు. ఈ విధంగా చెప్పేటప్పుడు, బాగా దృష్టిలో పెట్టుకోవల్సిన విషయం, **తెలివైనవారు అంటే జ్ఞానులుగా భావించకూడదు. అలా చెప్పాల్సివస్తే, జ్ఞానులకు అక్కడ ప్రవేశమే లేదు. ఒక ఏనుగును ఇరుకైన దానిలో ఇమడమంటే అది అసంభవమే. మూర్ఖునికి అతనితోపాటు చాలా సామాన్లు (సంస్కారాలు అని భావం) ఉంటాయి; వాటిని అక్కడ ఉంచటానికి స్థలమే లేదు కనుక అతడు అక్కడకు చేరలేడు. ఇంక జ్ఞానుల విషయానికి వస్తే, వారు ప్రాపంచిక విషయాలన్నీ త్యజించటానికి ప్రయత్నించి, తాము శూన్యంగా అయిపోయినట్లు భావించుకుంటారు కాని వారికి ఇంకా జ్ఞానం యొక్క భారం కలిగి ఉంటుంది. అక్కడ స్థితి ఎలా ఉంటుందంటే, ఎవరైనా బ్రైటర్‌వరల్డ్‌కు చేరగలిగినట్లయితే వారికి భౌతిక ప్రపంచానికి బ్రైటర్‌వరల్డ్‌కు మధ్య భేదం అనుభవం కాదు. అక్కడకు చేరేవారిలో భౌతిక ప్రపంచం, బ్రైటర్‌వరల్డ్ లయమైపోయి, వారి క్రియాత్మక శక్తి (సంకల్ప శక్తి) వాస్తవికతలో లీనమైపోయినవారై ఉంటారు.** మరైతే ఇది ఎప్పుడు జరుగుతుందంటే, ఎప్పుడు తమ దృష్టి తమ జ్ఞానం మీద నిలుపకుండా, ఎక్కడ నిలిపినట్లయితే ఆ మూలస్థానం యొక్క సమాచారం లభిస్తుందో అక్కడ దృష్టి ఉంచినప్పుడు సంభవమవుతుంది. మరి దీనిని ఎప్పుడు పొందగలుగుతాము అంటే, మానవుడు తన భౌతికతను విస్మరించినప్పుడు మాత్రమే! అయితే ఇటువంటి **"ఏమీలేని"** స్థావరానికి చేరాలని ఎవరు సంకల్పిస్తారు అని నీవు నన్ను ప్రశ్నించవచ్చు. అందుచేతనే జనం అక్కడికి (బ్రైటర్ వరల్డ్) చేరటానికి ప్రయత్నించరు, అని నేను భావిస్తాను.

నీ ఉత్తరం 21.05.1954వ తేదీతో వ్రాసినదానిలో సంతోషం గురించి వ్రాశావు. **ఎవరైతే సంతోషంగా ఉంటారో వారికి అంతా సంతోషంగానే అనిపిస్తుంది. వివాహాది సందర్భాలలో ప్రతి ఒక్కరు ఆనందంగానే ఉంటారు. అందుకు పరిసరాలు కూడా ప్రభావితం చేస్తాయి. ఇంద్రియాలు బాహ్యవస్తువులు లేదా విషయాలతో సంబంధం కలిగి ఉన్నప్పుడు వాటి అనుభూతి ప్రభావమే మానసంలో కలుగుతుంది. ఒకవేళ ఇంద్రియాలలో స్వచ్ఛత (అసలైనది అని నేనిప్పుడే చెప్పను) ఏర్పడిపోయినప్పుడు మానసం దాని రుచిని అనుభూతి చెందినప్పుడు, ఏ విషయం మీద దానికి ఆసక్తి ఉంటుందో దానిని బాహ్యంలో చూస్తుంది. ఇప్పుడు దానికి చూడటానికి అదే ఇష్టమైనదిగా ఉంటుంది. అన్ని స్థితులలోను ఇదే పరిస్థితి ఉంటుంది. అనగా మనం ఆధ్యాత్మికస్థితిలో పూర్తిగా నిమగ్నమైపోయినప్పుడు మానసంలో లోతుగా అది పాతుకుపోయి, అదే విషయం బాహ్యంలో కనిపిస్తుంది. ఉదాహరణకు ఒక దొంగ తన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచుకుంటాడు. ఎందుకంటే, అతడు దొంగ కనుక ఇతరులు కూడా దొంగలే అని భావిస్తాడు. ఇదే విధంగా మంచి మనుష్యులు అందరినీ మంచివారుగానే భావిస్తారు.** అయితే ఇంద్రియాలలో ఎప్పుడైతే అసలు (Originality) స్వచ్ఛత ప్రారంభమవుతుందో అప్పుడు దృశ్యమే మారిపోతుంది. అప్పుడు అక్కడ ఉన్న ఆనందం పరమానందంగా (Bliss) మారిపోతుంది. బ్రైటర్‌వరల్డ్‌కు అర్హులైన వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే, వారికి ఈ పరమానందం కూడా ఉండదు. నీ ఆనందం గురించిన కథ ఇది. నేను లఖీంపూర్ చేరిన తర్వాత నాకు నీ ఆరోగ్యం బాగున్నట్లుగా తలపిస్తే అప్పుడు పరమానందం యొక్క గాథ ప్రారంభమవుతుంది. నీకు కావాలంటె దాని తరువాత గాథను కూడా వ్రాస్తాను. ఇప్పుడు అసలు రూపం ఏర్పడిందే అనుకుందాం. మరి మనలో కలిగిన విశిష్టత ఏమిటై ఉంటుంది? అది మనం మొట్టమొదటిసారిగా ఈ ప్రపంచంలో అడుగుపెట్టినప్పుడు మనలో ఉన్నటువంటి అసలు (Original) స్థితి. ఇది చెప్పటం మంచిది కాదు కాని అయినా తప్పక చెబుతాను. ఇక్కడ ఈశ్వరుని భావన ఉండదు. ఇప్పుడు మనం ఈ స్థితి నుంచి ముందుకు కదులుతున్నప్పుడు, మనం ఈ **(Original) అసలు స్థితికి** అనగా పూర్వపు మూలస్థితికి చేరామని గట్టిగా చెప్పగలం. ఇంకొక విషయం నేను వ్రాస్తున్నాను – నా తర్వాత శ్రద్ధ

కలిగినవారు ఎవరైనా మనం ఈ విధంగా బ్రైటర్‌వరల్డ్ చేరటానికి అర్హులం కాగలిగినట్లుగా దృష్టి పెట్టాలి. అయితే **నేను మాత్రం ఒక నైపుణ్యం, అనగా దేనివల్లనైతే బ్రైటర్‌వరల్డ్ మనల్ని తీసుకోవటానికి హక్కుదారుగా తయారవుతుందో దాని కోసం అన్వేషిస్తున్నాను. దీనికిమించి చెప్పటానికి అనుమతి లేదు.**

నీకు తపన ఉన్నట్లు వ్రాశావు. అది ఉండవలసిందే. అది ఒక మంచు వంటిది. **తపన అనేది ఇచ్ఛాశక్తి యొక్క వేడిమితో పైకి పోతుంది. మనల్ని గమ్యం వరకు చేర్చటానికి ఇది ఒక మాధ్యమంగా ఉంటుంది. తపన అనేది ఆయుధం మాత్రమే, అది ఎప్పుడూ లక్ష్యాన్ని తాకునట్లు చేస్తుంది. ఇది వ్యథతో ప్రారంభమై వృద్ధి చెంది తపనగా మారుతుంది.** నీవు ఒకచోట, నీ చైతన్యాన్నే (స్పృహనే) కోల్పోతున్నట్లుగా వ్రాశావు. ఇది సరైనదే. వాస్తవికత ప్రారంభమైనప్పుడు ఈ విధంగా జరుగుతుంది. ఇంకొకచోట, "నాకు నా ఆత్మను గురించిన సమాచారం కూడా తెలియటం లేదు" అని కూడా నీవు వ్రాశావు. నీ దృష్టి మరొకవైపు మళ్ళినందున నీకు దాని (ఆత్మ) స్పృహ లేకుండాపోతోంది. ఆ స్థితిని సిద్ధింపజేసుకునే విధానం ఇదే. ఇది ఇంకా పూర్తి కావలసి ఉంది. "బ్రహ్మ మరియు అహం బ్రహ్మోస్మి అనేవి అన్నీ కలగా (ఒక స్వప్నంగా) అయిపోయాయి" అని నీవు వ్రాశావు. ఇది పూర్తిగా సరైనదే కాని దాని మొలక ఇంకా మిగిలి ఉంది. పరిస్థితి మారిపోయింది. ఇది ఆధ్యాత్మిక యాత్రకు చెందినదే. నేనయితే 'అహం బ్రహ్మోస్మి' అని భావించేవారిని గురించి ఈ విధంగా అనుకుంటున్నాను– వారు మానవుల్లో మల్లయోధులులాగా ఉంటారు. వారి దేహ దారుఢ్యం గురించి ప్రశంసిస్తాను. అటువంటి వారిలో రామమూర్తి (మల్లయోధుడు) అగ్రగణ్యుడుగా నిలిచాడు. నీ ఉత్తరాలకు జవాబు ఇంతే. అవును, ఇంకొక విషయం నా దృష్టికి వచ్చింది. "నా వద్ద తమరు ఇచ్చినదేదో అదే ఉంది" అని నీవు వ్రాశావు. అందుకు నేను కూడ "నావద్ద కూడా నీవు ఇచ్చినదేదో అదే ఉంది" అని అంటున్నాను. ఇప్పుడింక ఎవ్వరికి ఎటువంటి భావానికి తావులేదు, అందుకు ధన్యవాదాలు కూడా అవసరం లేదు.

అమ్మకు నా ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 399

లఖీంపుర్,
27.05.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. డాక్టర్‌గారి ద్వారా తమరు నాకు, కేసర్‌కు పంపించిన లేఖలు అందాయి. వీటికి ముందురోజున ఒక కవర్ కూడా అందింది. అక్కడకు వెళ్ళిన వీరందరూ ఎంతగా సంతోషించారు అంటే, దానిని చెప్పనలవికాదు. ఆ విషయం వాస్తవంగా కూడా అలాగే ఉంది. తమ ఉత్తరం పొంది చాలా సంతోషం కలిగింది. (Veins) రక్తనాళాలులో (Health-molecules) ఆరోగ్య పరమాణువులు వ్యాపించి ఉన్నాయని, వాటిని నాళాలన్నీ పీల్చుకుంటున్నాయని, నేను తమకు వ్రాసి ఉన్నాను. కాని ఇప్పుడు నాకు ఒక విషయం గ్రహింపుకు వస్తోంది. అది ఏమిటంటే, యావత్తు శరీరం యొక్క నాళాలు శీఘ్రంగాను, సంపూర్ణంగాను ఆ ఆరోగ్య పరమాణువులను పీల్చుకుంటున్నాయి. కాని, పొట్టలోని నాళాలు మాత్రం నిదానంగాను, తక్కువ పరిమాణంలో మాత్రమే పీల్చుకుంటున్నాయి. నాళాలకు ఇంక పీల్చుకోవాల్సినది ఏమీ లేనపుడు, తమకు తప్పక తెలియజేస్తాను. బాబూజీ, ఇప్పుడు నాలో జబ్బు అంటూ లేదని నొక్కి చెబుతున్నాను. నా శారీరక వ్యవస్థ అంతా శుభ్రమైపోయింది. పొట్టలో 4,5 రోజుల నుంచి లోపల అధికమైన తేలికదనం, దాదాపు ఎప్పుడూ ఉంటోంది. లోపల ఏదో కరుగుతున్నట్లు ఉంది. పొట్టలో శక్తి కూడా చాలా తక్కువగా ఉంది. ఇప్పుడు నాకు ఆరోగ్యం గురించిన ఆలోచన కలుగుతోంది, అది

తమకు వ్రాసిన దానినిబట్టి అర్థమవుతోంది. నాకు ఏమయిందో ఏమోగాని, ఆరోగ్యానికి సంబంధించిన ఒక్కొక్క విషయాన్ని గ్రహిస్తున్నా, వ్రాస్తున్నా కూడా ఆధ్యాత్మిక దశను గురించి వ్రాస్తున్నట్లుగానే ఉంది. ఏదో కొద్దిగా తిని, దాని రుచిలో మరిగిపోయి, 'మాలిక్' యొక్క విలువైన శ్రమను వ్యర్థం కానివ్వను. నేను నా 'మాలిక్' పరిశ్రమలోను మరియు ఇచ్ఛలోను తప్పకుండా సహకరిస్తూనే ఉంటాను. శ్రీ బాబూజీ, 'మాలిక్' కృపతో మనస్సు మరియు ఆంతరికం ఏ విధంగా సాదాగా ఉంటున్నాయో, బయట కూడా నాకు మంచి వస్త్రాలుగాని, ఆభరణాలుగాని ధరించటం ఇష్టం లేనట్లు నా స్థితి ఉంది. నాకు బాహ్యంగాను, ఆంతరికంగాను సాదాసీదాగా ఉంటూ, తెల్లని వస్త్రమే నచ్చుతోంది. అయినాకాని అమ్మ మరియు ఇతరుల ఇష్టప్రకారం అన్నీ ధరిస్తున్నాను, కాని ఎప్పుడైనా, ఎక్కడికైనా చాలా అరుదుగా వెళ్తున్నాను. ఏ విషయంపట్ల నాకు విద్రోహ భావం లేదు. ఎందుకంటే, అది 'మాలిక్'కే చెంది పోయింది. ఆ విధంగా నాకు ఆంతరికంగాను, బాహ్యంగాను అన్నివైపులా అన్నీ సాదాసీదాగాను, స్వచ్ఛంగాను కనిపిస్తున్నాయి. నాకు పని ఉన్నా మరియు కోరిక ఉన్నా 'మాలిక్'తోనే, 'మాలిక్' కొరకే. నామీద ఎవరైనా అరచినప్పటికీ కూడా అది నాకు పట్టనట్లుగానే ఉంటోంది. ఆ అరుపు మాత్రమే వినబడుతుంది. అదే విధంగా, కోపంగాని, విసుగుగాని ఎప్పుడైనా కలిగినా, అవి ఎలా, ఎక్కడి నుండి నాకు వస్తున్నా, అవి ఒకటి లేదా అర నిమిషంలో శాంతించిపోతున్నాయి. ఇంకా ఎలాగంటే, నేను రేపు ఎలా మాట్లాడాలి, ఫలానా విషయం చెప్పాలని తలపెట్టి, దానిని 4,5 సార్లు అదే ఆలోచించినట్లయితే, బహుశా ఈ ఆలోచన యొక్క తాపంతో తరచుగా శరీరం వేడి ఎక్కుతోంది. ఇప్పుడు నాలో దానికి, ఆఖరికి స్వయంగా నాకు కూడా స్థానం లేకుండా పోయింది. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

బాబూజీ, నూతన ప్రపంచంలో అడుగుపెట్టినట్లుగాను, వాస్తవమైన లయావస్థకు చెందిన క్రొత్త అధ్యాయం తెరుచుకున్నట్లుగాను ఈ స్థితిలో నాకు అనిపిస్తోంది. దీనిని నేను (తేజోలోకం) బ్రైటర్‌వరల్డ్‌గా అర్థం చేసుకున్నాను. ఇప్పుడు ప్రతి విషయం నాకు తమ ఉత్తరం మరియు కృప మూలంగా అద్దంలాగా ప్రస్ఫుటమవుతోంది. ఇప్పుడు నేను వేగంగా ఎలా ముందుకుపోవాలో నాకు అర్థం కావటం లేదు. అది నా వశంలో లేదు, 'మాలిక్' ఎలా నడిపిస్తే అలాగే నడుస్తాను. దశ పొగలాగ తేలిగ్గా అయిపోయి దాని మాదిరిగా నాలో ఇమిడిపోతున్నట్లు ఉందనిపిస్తోంది. దశ అనేది, నా దశకు అందినంతవరకు, పైనుంచి లేక లోపలి నుంచి నాలోకి చొచ్చుకుపోతున్నట్లుగాను, అలా చొచ్చుకుపోతూ ఉండగా ఇప్పుడు పిండ ప్రదేశం వంతు వస్తున్నట్లు చూస్తున్నాను. దశ ఎలాంటిది అంటే, కొంచెం పొగలాగా ఉండి, దశయే కాకుండా స్వయంగా నా అస్తిత్వమే ఇది అని అనిపిస్తోంది. అటువంటి దశ ఊహ (భ్రమ) అను శబ్దం కంటె కూడా పల్చగా లేక మందగమనంగా ఉంది. ఇది ఎటువంటి సత్యదశ అంటే, అంతా సత్యమయంగానే అవగతమవుతోంది. ఇంతకుముందు ఏదైనా దశ కలిగింది అంటే, ఆ స్థితియే దృష్టిలో నిలిచి, ఆ తర్వాత దానిలోకి చొరబడి, లయమవుతున్నట్లు అనిపించేది. కాని ఇప్పుడైతే, దశ, దృష్టిలో లేక అంచనాలో ఉంటూనే కూడా, నేను నన్నుగాని లేదా దానినిగాని మర్చిపోతూ ఉన్నాను. 'మాలిక్' కృపతో ఇప్పుడు అది దానంతటదే జరిగిపోతూ ఉంది, ఇది నా వశంలో లేదు. బహుశా ఈ కారణంవల్లనే దశను అనుభూతి చెందటంలో పూర్వం కంటె ఎక్కువ సమయం పడుతోంది. ఇంతకుపూర్వం అయితే దశ కూడా కొంచెం పరిమితంగా ఉండేది, నేను కూడా పరిమితంగానే ఉండేదానను. ఇప్పుడు దశ కొంచెం మందకొడిగాను, తేలికైన పొగలాగాను ఉంటోంది. అది దృష్టికి కనిపించటం లేదు, కాని నా అవగాహనలో ఉంటోంది. ఇప్పుడు నాకు దృష్టి ఎక్కడ ఉందో తెలియదు, కాని నొప్పితో ఉంటున్నాను. ఈ నొప్పి (Core of heart) హృదయంలోని ముఖ్యకేంద్రంలోనే ఉంటున్నట్లు అనిపిస్తోంది. ఈ నొప్పి కారణంగా దృష్టి అనేది జ్ఞాపకం వస్తోంది. బహుశా ఈ కారణంవల్లనే దశలో ఆనందానుభూతి చెందటానికి ఆలస్యమవుతోంది. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎటువంటిదంటే, (Non-duality) నిర్ద్వందం చెలామణి

అవుతూ కూడా, అది నాకు తెలియకుండా ఉంది. ఇంకా ఏమిటంటే, నేను తెలియని స్థితిలోనే ఉంటూ ఉన్నాను. అదేమిటో తెలియటం లేదు కాని, ప్రతి విషయం అనగా దేని గురించి తెలియాలో అది తెలుస్తూనే ఉంటోంది. ప్రతి కణానికి సహజరూపం ప్రాప్తించింది. అనగా కణకణం శుద్ధరూపం దాల్చేశాయి అన్నమాట. కణకణం నుండి దోషం మరియు స్థూలత్వం సమసిపోయాయి. ఏదో ఒక (Blotting) తుడుపు వంటిది అన్నింటిలోను చోటుచేసుకుంది. ఈ దశ ఏమిటో తెలియటం లేదు. బాబూజీ, ఇప్పుడు దశ అనేది నా కణకణంలోను లయమైపోయినట్లుగాను, ప్రతికణం సజీవమైనట్లుగాను అనిపిస్తోంది. ఒక నవజీవనం సంప్రాప్తమైంది. అన్నింటిలోను ఒక చిత్రమైన జాగృతి కలిగింది. అయితే ఇప్పుడు బాధయే నాకు ఆధారంగాను, ఆనందంగాను ఉంది. 'తమ' ఉత్తరానికి ఇది సమాధానం కానేకాదు. నేను సమాధానం ఇవ్వలేను కూడా. నేనయితే ఒక్కొక్క శబ్దం, ఒక్కొక్క దశ, ఏవైతే తమరు వ్రాస్తున్నారో వాటి అన్నింటిలోను ఈదుకుంటూ, ప్రతి ఘాట్‌లోని నీరు త్రాగి 'మాలిక్' పాదాలవద్దకు చేరాలని, ఇంకా చెప్పాలంటే, నా వెంట ఎవరు రావాలనుకుంటే (అభ్యాసులు) వారికి, 'మాలిక్' కృపతో కొంత సహాయపడటానికి ప్రయత్నిస్తున్నాను.

నేను డాక్టర్‌గారి నుండి మందులు, ఇంజక్షన్లుకు సంబంధించిన సలహాలు, సూచనలు పొంది దానితోపాటు మందులు కూడా వ్రాయించుకున్నాను. ఈ రోజు వెళ్తున్నాము. తమరు, చేతిలోని రక్త నాళాలు వేటినైతే ఒకటి రెండు నిమిషాలు వత్తమని చెప్పారో, అదే విధంగా 4,5 సార్లు నొక్కుతున్నాను. ఫలితం కనిపించింది. 'తమరు' శనగల గురించి చెప్పారు. ఆ విధానం కూడా ఈ రోజు నుంచి ఆచరిస్తాను. ఈసారి నా ఆరోగ్యం గురించి తప్పక వ్రాస్తాను. తమరు వచ్చే తేదీ తప్పకుండా వ్రాయండి. తమరు ఇక్కడే ఉంటే బాగుంటుందని అందరూ ప్రార్థిస్తున్నారు.

అమ్మ తమకు, మాస్టర్ సాహెబ్‌గార్కి శుభాశీర్వాదాలు చెప్తున్నారు. నేను హృదయం యొక్క ఉనికిని కూడా మర్చిపోయాను.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 400

లఖీంపుర్,
01.06.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో ఏ రోజునైతే తమకు నా ఉత్తరం చేరిందో ఆరోజు నుండి, నా ఉదరంలోని నాళాలు, యావత్ శరీరం యొక్క నాళాలు మాదిరిగానే, ఆరోగ్యం గురించిన పరమాణువులను పీల్చుకోవటం ప్రారంభించాయి. కాని ఆరోగ్య పరమాణువులు నాళాలలో కొద్దిగా మిగిలిపోయాయి. అవి పీల్చుకుపోనందున ఇలా అనిపిస్తోంది. ఉదరం అన్ని విధాలుగా చాలా మృదువుగాను, లోపలి నుండి చాలా తేలికగాను, సుఖంగాను ఉన్నట్లు అనిపిస్తోంది. అది వికారంగానైతే లేదుకాని, నొక్కినట్లయితే చాలా నామ మాత్రంగా కొంచెం నొప్పిగా ఉంటోంది. బలహీనత మాత్రం ఇంకా తగ్గలేదు. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నా స్థితి ఎటువంటిదంటే, పవిత్రతగాని, అపవిత్రతగాని లేవనిపిస్తోంది. ప్రపంచంలోని సాధారణ మానవునిలాగా చాలా సాదాసీదాగా ఉన్నాను, చెప్పదగిన విశేషం ఏదీలేదు. ఒక సాధారణ స్థితియే, నాకు కప్పుకునేదిగాను, పడక వస్త్రంగాను ఉంది. అదే విధంగా స్థితిలో వేగంగాని, అనుకూలతగాని అనుభవం కావటంలేదు. ప్రపంచంలోని జనులందరిలాగానే నేను ఉన్నాను. నిజానికి ఇదే నా ప్రపంచంగా ఉంది. భక్తులుగాని, జ్ఞానులుగాని, మంచివాళ్ళుగాని, చెడ్డవాళ్ళుగాని నాకు అందరూ సమానంగానే కనిపిస్తున్నారు. బాబూజీ, నా గ్రహింపు ఎంత

అల్పంగా అయిపోయిందంటే, (Innocent) అమాయకత్వం అన్నా, గ్రహింపు లేకపోవటం అన్నా కూడా అర్థం కావటంలేదు. ఇంక తెలివిదనం లేదా విజ్ఞత అనేది నన్ను ఎప్పుడు విడిచివెళ్ళిందో నాకు తెలియదు. బాబూజీ, జనం పలురకాల ఆలోచనలతో కొట్టుమిట్టాడుతున్నారు. నేను అప్పుడప్పుడు అనేకాదు, అసలు ఆలోచన అంటూ ఏదైనా వచ్చినాగాని చింతించటం లేదు. అది ఏమిటోగాని, నన్ను ఎవరైనా బలహీనురాలు అన్నప్పటికీ నేను బలహీనత అనుదానికి బహుదూరంగా ఉన్నాను. ఇదివరకు నేను నా 'మాలిక్'లో బలహీనత లేదు అనుకొని ఉండగా అది నాకు ఎక్కడ నుంచి వస్తుంది? ఇప్పుడు నాలో ఒక స్వాభావిక దశ ఏర్పడింది. దానివలన నేను బలవంతురాలినీ కాదు, బలహీనురాలనీ కాదు. ఇప్పుడు నాకు నా బలహీనతగాని, జబ్బుగాని తెలియటం లేదు. నేను బాగా అస్వస్థురాలినా, మరేమైనానా అనేది కూడా నాకు తెలియటం లేదు. అయినప్పటికీ దానిపట్ల నిర్లక్ష్యం చేయటం లేదు, కాని ఇది నా స్వాభావిక దశగా అయిపోయింది. నా దశ ఉదయిస్తూ ఉందా, లేక అస్తమిస్తూ ఉందా, అన్నట్లు ఉంది. ఇది ప్రస్తుత స్థితిగా ఉంది. నా బాబూజీ! జీవన్మరణాలు రెండూ సమానమే అన్నట్లుగా నా స్థితి ఉంది. ఎందుకంటే, ఆనందం అనేది ప్రతిస్థితిలోను ఉంది. ఈ దశను గురించి చెప్పాలంటే, "సర్వేశ్వరుడు ఎలా జీవింపచేస్తే అలానే ఉంటాను. సుఖదుఃఖాలు రెండు సమానమే, రెండింటి విలువ ఒక్కటే" అన్నట్లు ఉంది.

బాబూజీ, గుండె గుచ్చుకుంటోంది. అదే సంతోషంగా ఉంటూ  ఉంటే, శాంతిలో ఆనందం ఏముంటుంది. ఇలా ఉంటూ ఉన్నా కూడా ఇంకను (Originality) స్వాభావికత ఆరంభం కాలేదు. అయినప్పటికీ కూడా శ్రీ బాబూజీ కృపతో అప్పుడప్పుడు దాని మెరుపు మాత్రం తప్పక పొందుతున్నాను. ఆ వాతావరణం యొక్క ప్రకంపనం వంటిది కలుగుతోంది. ఇంకేముంది, దానిలోకి ప్రవేశిస్తూనే అనుభూతి కలుగుతుంది. 'అతని' యొక్క ఆ మెరుపు వంటి దానిలో ఒక విచిత్రమైన జాగృతి అనుభూతికి వస్తుంది. సంస్కారాల ముసుగు ఎంత పలచబడిపోయిందంటే, సంస్కారాలు అంటూ నాలో ఉన్నాయా లేవా అనేది కూడా నాకు తెలియటం లేదు. నాకు సమస్త జగత్తులోను ఒక చిత్రమైన స్వచ్ఛ దశయే దర్శనమవుతోంది. దానిలో సంస్కారాల ప్రసక్తే లేదు. అది తమకే తెలియాలి. ఇప్పుడు తమకు వ్రాసినది: "తమరు ఏది ఇచ్చారో అదే నా వద్ద ఉందని వ్రాసేదానవు, నేనైతే ఏదైతే ఇచ్చానని చెబుతున్నావో అదే నా దగ్గర ఉంది" అను దాని అర్థం 'తమ' దయతో కొంచెం అర్థమవుతోంది. ఏదైతే నాకు అర్థమైందో అది నాకు తెలియదు. నిజంగా నేను 'తమరి'ని పొంది స్వేచ్ఛగా అయిపోయాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. కేసర్ చెబుతోంది, "ఈ రోజు ఉదయం నుంచి, నేను శూన్యంలో ఉన్నట్లుగాను, నా చుట్టూరా శూన్యమే వ్యాపించి ఉన్నట్లుగాను, ఆ శూన్యతలోకి నేను ముందుకు దూసుకుపోతున్నట్లుగాను అనిపిస్తోంది" అని.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 401

లఖీంపూర్,
18.06.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుకరా నుంచి షాజహాన్‌పూర్‌కు చేరి ఉంటారని అనుకుంటున్నాను. 'మాయ' గురించి మేము ఆసక్తితో ఉన్నాం. దయచేసి వ్రాయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఇలా ఉంది: ముక్తిని గురించిన కోర్కెగాని, సాక్షాత్కారం గురించిన కోర్కెగాని లేవు. నాకు 'మాలిక్'ను కలుసుకోవాలను కోరిక యొక్క అధికమైన తపనతప్ప మరేదీ లేదు. బాబూజీ! అది ఎందుకో

దైవానికే తెలియాలి, 'తమరు' పధిక్‌జీ (వ్యక్తి) కొరకు ఏదైతే వ్రాయించి వెళ్ళారో అలాగే 'తమరు' వ్రాయించి వెళ్ళిన విషయంలో, మరేదైనా విషయం నా వ్రాతలో జోడించటానికి సిద్ధపడినప్పటికీ నా మనస్సులో ఎలాంటి సంకోచం ఇప్పుడు కలగటం లేదు. కాని ఇదివరలోనయితే సంకోచం కలిగేది. మనస్సుకు నచ్చేది కాదు. ఇప్పుడు అటువంటిదేమీ లేదు, బాధ కూడా కలగటం లేదు. ఈ కారణంగా నేను ఏమంటున్నాను అంటే, నావద్ద 'మాలిక్' కృపతప్ప మరేమీ లేదు. ఒకటి మాత్రం ఖాయం, నా సామర్థ్యం ఎంత ఉందో, ఆ మేరకే నేను గ్రహించగలుగుతున్నాను. నా బాబూజీ, ఇప్పుడు నా కళ్ళు మొద్దుబారిపోయినట్లు ఈ దశ ఉంది. అందుచేత నన్ను ఎవరైనా అంధురాలు అన్నాగాని తప్పుగా అనిపించటం లేదు, చెవిటిది అన్నా ఫర్వాలేదనిపిస్తోంది.

బాబూజీ, ఇప్పుడు ప్రతి నరం నిద్రలో మునిగి ఉంటోంది. నేను పూజలో కూర్చున్నా లేదా ఇంక ఎలా ఉన్నాగాని, నరాలు ఎక్కడెక్కడ ఉన్నా వాటిల్లో చైతన్యం ఉంటోంది. అలా కాదంటే, నా శరీరంలోని సూక్ష్మమైన ప్రతి అణువూ నిద్రమత్తులో ఉండాలనుకుంటోంది. కేవలం 'మాలిక్'ను కలుసుకోవాలను తపనయే వాటిలో జీవం కల్పిస్తూ ఉంటోంది. వాస్తవంగా చెప్పాలంటే, అవి నిద్రించటం లేదు. అవి (ఆ నరాలు) ఒక విచిత్రమైన ప్రశాంత సాగరంలో మునిగి ఉంటున్నాయి. ఆ సాగరంలో తపన అను ఒక తరంగం మాత్రమే ఉంది. అది కూడా ఎలాంటిది అంటే, ఒక బడబానలం అనగా సముద్రంలోపల ఉన్న అగ్నిగుండం లాంటిది. దాని మూలంగా సముద్రంలోని జీవజాలమంతా దహించుకుపోయి నశిస్తాయి. 'మాలిక్'యే ఉతికి శుభ్రపర్చారా అన్నట్లుగా రక్తనాళాలన్నీ ఖాళీ అయిపోయాయి. లోపలి (Inner senses) గుణాలన్నీ అంతరించిపోయినట్లు అనిపిస్తోంది. 'తమరు' నా ఎదుట ఉన్నా కూడా నేను సావధానంగా ఎందుకు ఉండటంలేదో నాకు అర్థం కావటం లేదు. అదేమిటో 'మాలిక్'కే తెలియాలి. నన్నైతే 'వారు' మాత్రమే సదా సరిదిద్దుతూ వచ్చారు. కనుక వారే సరిదిద్దుతారు. 14.06.1954వ తేదీన 'తమరు' ఇక్కడే ఉన్నారు, కాని ఆ రోజున ఏమైందో ఏమోగాని నాకు తెలియకుండానే, ఎందుకో ఏడ్వడం, పాడటం జరిగింది. అకారణంగా అశ్రువులు ప్రవహించాయి. మనస్సులో ఆనందంగాని, ప్రేమగాని ఏమీలేవు. అయినా కాని అశ్రువులు జలజలా స్రవించాయి. ఈ విధంగా అప్పుడప్పుడు ఎందుకు జరుగుతుందో తెలియకుండా ఉంది. ఇంతకుపూర్వమైతే, "బాబూజీ! నేను చేయి పైకెత్తుతున్నట్లయితే, అది ఎవరిదో, ఎందుకు ఎత్తుతున్నానో కూడా తెలియటం లేదు" అని వ్రాస్తూ ఉండేదానను. అదే విధంగా ఇప్పుడు లోపల ఇదే స్థితిలాగా అయిపోయింది. అనగా సూక్ష్మత్వం యొక్క అనుభూతి కూడా లేకుండా పోయింది. ప్రతి నరమూ నిద్రపోతుంది. ఇంద్రియాలన్నీ మృత్యువాతబడ్డాయి. ఇప్పుడు సూక్ష్మత్వం కూడా మృతి చెందుతోందా అన్నట్లు ఉంది. నేను పాడుతున్నప్పుడు స్వరంతో సంబంధం లేదన్నట్లు ఉంది. విలపిస్తూ ఉన్నానంటే, అశ్రువులకు ఆంతరికంగా సంబంధం ఏమీలేనట్లు ఉంది. ప్రతి విషయంలోను, చర్యతోను, ఆఖరికి సూక్ష్మత్వంతో కూడా సంబంధం తెగిపోయినట్లు ఉంది. ఎందుకంటే, ఇప్పుడు నాకు సూక్ష్మత్వం కూడా అనుభవం కావటం లేదు. ఏది జరుగుతున్నా కూడా, దానికి కారణం అనేది లేకుండా ఉంది. పూజ్య శ్రీ బాబూజీ! ప్రతిది నాలో విలీనమైపోయినట్లు అనిపిస్తోంది. కారణానికి నాలో ఉండే అవకాశమే లేదు. ఎందుకంటే, అవగాహనతో కూడా నా సంబంధం తెగిపోతోంది. ఇంతేకాదు, ఇప్పుడు తపన కూడా నాలో లయమైపోతున్నట్లు అనిపిస్తోంది. ఆ తపన నా నాడులు అన్నింటిలోను, కణకణంలోను వ్యాపించిపోతున్నట్లు ఉంది.

శ్రీ బాబూజీ, తమరు వెళ్ళి 4,5 రోజులే గడిచినా, తమరు ఎప్పుడు వెళ్ళారా అన్నట్లు అనిపిస్తోంది. ఎప్పుడైతే తమరు, "నేను వచ్చి 7 రోజులైంది" అని అన్నారో అప్పుడు నాకు ఒక్కసారిగా త్రుళ్ళిపడి స్వప్నం నుంచి మేల్కొన్నట్లు అయ్యింది. ఎందుకంటే, నాకు అంతవరకు తెలియలేదు. మా అందరిపట్ల దయ చూపటానికి స్వయంగా వస్తున్నారు. ఈశ్వరుడు దయాళువు అని విన్నాం కాని నేనయితే కళ్ళారా చూశాను అని చెప్పగలుగుతున్నాను. బహుశా దీనివలన నాకు ఎప్పుడూ స్వప్నంలో కూడా కోరిక కలగదు. అప్పుడప్పుడు శరీరంపైన, కనురెప్పల మీద చల్లని బిందువులు

చిమ్మబడుతున్నట్లు అనిపిస్తుంది. అది చల్లని పిప్పరమెంటులాగా ఉంటుంది.

పూలో జిజ్జి, 3,4 రోజుల నుంచి తరచుగా, విశేషించి ఉదయం 4 గంటలకు "శ్రీ బాబూజీ నాకు సిట్టింగ్ ఇస్తున్నారు" అని చెబుతోంది. అమ్మ తమకు, మాస్టర్ సాహెబ్‌కు ప్రేమాశీర్వాదాలు తెలుపుతున్నారు. మాస్టర్ సాహెబ్‌గారికి నేను కూడా నమస్కరిస్తున్నట్లు చెప్పండి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 402

లఖీంపుర్,

25.06.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం, డాక్టర్ సిన్హాగారు అక్కడకు చేరి ఉంటారని అనుకుంటున్నాను. 'తమరు' ఇక్కడకు వచ్చినప్పటినుండి, 3 రోజులకు ఒకసారి ఒక పౌండ్ బరువు పెరుగుతున్నాను. మొన్న రాత్రి గం. 8.30 ని॥ల నుంచి గం. 9.30 ని॥ల వరకు జబ్బు ఎంతగా తిరగబెట్టింది అంటే, అది అర సెకన్ నుంచి సెకన్ కాలం వరకు అప్పుడప్పుడు దాని వలన బాధ కలుగుతూ మళ్ళీ ఉపశమనం కలుగుతోంది. ఒక్కసారిగా నాభికి దిగువన ఉదరం యొక్క నరాలు ఒక్కపెట్టున వదులైపోయి క్రిందికి జారిపోతున్నాయా అని అనిపించింది. దాని వలన చాలా కష్టం కలిగింది. బాధ కూడా అధికంగానే ఉన్నది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు కలిగిన దశలో లోపల, బయట కూడా ఎక్కడా (Vibration) కంపనం లేదు. కళ్ళు తెరచి ఉంటే బయటగాని, కళ్ళు మూసుకుంటే లోపలగాని లేదు. కంపనం అనేది పూర్తిగా సమాప్తమై పోయింది. శరీరం లోపలగాని, నరాల్లో కూడా ఇప్పుడు కంపనం అనుభూతికి రానిస్థితిగా ఉంది. అన్నీ జడత్వం దాల్చి ఉన్నాయి. అయితే ఒక్కటి మాత్రం ఖాయం, అది ఏమిటంటే, దశ పురోగమిస్తూ, మార్పు చెందుతూ ఉంది. ఇంకా ఏమిటంటే, 'మాలిక్' ఆజ్ఞ ఉన్నట్లయితే ఏదైనా వ్రాయాలని అనుకుంటే, తప్పనిసరిగా పైనుంచి వచ్చే చైతన్యంతోగాని లేదా 'మాలిక్' యొక్క కృపా చైతన్యంతోగాని వ్రాస్తున్నాను. కాని ఇంకా జడత్వమే ఉన్నట్లు భావించండి. మొన్న ఎడమ కాలిపాదం క్రింద జరజరమనిపించింది. కాని ఇదివరకు గిలిగింతగా (ఏదైనా కీటకం ప్రాకినప్పుడు కలిగే అనుభూతి) ఉండేది. షుమారు 15 నిమిషాలవరకు అలాగే అనిపించింది.

అమ్మ తమకు, మాస్టర్ సాహెబ్‌గార్కి శుభాశీర్వాదాలు చెప్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 403

షాజహాన్‌పూర్,

27.06.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం అందింది. ఇంజక్షన్‌వలన బాధ కలగకపోవటం అనేది నీ గొప్పదనంవల్లనే. నీకు నా మీద విశ్వాసం కలిగి ఉండటం వలన నీ ఆధ్యాత్మిక శక్తియే పని చేస్తుంది. నీ ఆత్మోన్నతికి నీ భక్తి మరియు సాధనల ఫలితమేనని నేను నీకు చాలాసార్లు వ్రాశాను. నాలో ఏదైనా విశిష్టత లేదా ఇటువంటి ఆధ్యాత్మిక శక్తి ఉండి

ఉన్నట్లయితే సంస్థలోని అభ్యాసులందరూ ఇప్పటికే ఆధ్యాత్మికత యొక్క ఉన్నత స్థాయికి చేరి ఉండేవారు. నీకు ముక్తికి చెందిన ఆకాంక్షగాని, సాక్షాత్కారం గురించిన ఆశగాని లేవని వ్రాశావు. ఇది చాలా మంచి స్థితి. నీకు సాక్షాత్కారం దక్కింది. ఇప్పుడు జీవన-మోక్ష గతి కలుగుతోంది. కోరుకున్నది ప్రాప్తమైపోయినప్పుడు, ఇంక దాని గురించిన కోరిక ఎందుకు ఉంటుంది. మానవునికి తన అభీష్టం నెరవేరనంతవరకు దానిపై కోరిక ఉంటుంది కాని, అది ఫలించాక ఇంక ఆ కోరిక ఉండదు. **"ప్రతి కణం, ప్రతి నరం నిద్రావస్థలో ఉన్నట్లు ఉంది" అని నీవు వ్రాశావు. దానినిబట్టి, లక్షల జన్మల నుంచి ప్రోగైన ఆడంబరాలు తొలగిపోయి సత్యావస్థ కలిగినట్లు అర్థం చేసుకోవాలి.** అనగా ఈ స్థితి గతజన్మలకు పూర్వపు స్థితికాగా, ఇంకా కొంత పొందాల్సి ఉంది.

నీ ఆంతరిక జ్ఞానాలు (Inner senses) లేకుండాపోయాయి అని నీవు వ్రాసిన విషయానుభవం సరైనదే. నీకు అనుభవమవుతున్న నిద్రిస్తున్నట్లు ఉన్న అవస్థకు ఇదే కారణం. ఇంద్రియాలను పూర్వపు అసలు స్థితికి తీసుకురావటానికి, నేను పరిశోధనచేసి నీకు మూడు విషయాలు చెప్పాను. అవి సరిగ్గానే ఉన్నట్లు నా అనుభవానికి రావటమే కాదు, ఆ విషయం నీవు కూడా గమనించావు. వాటి తర్వాత కూడ వాటికి సూటిగా ఇంకా మూడు సూక్ష్మ బిందువులు ఉన్నాయని, నేను నీకు ఉత్తరం వ్రాస్తున్న సందర్భంలో నా దృష్టికి వచ్చాయి. వాటి తర్వాత బిందువులు ఇంకేమీ లేవు కాని ఏదో ఉన్నట్లు అనిపిస్తోంది. నీ ఆరోగ్యం బాగున్న తర్వాత, నేను ఈ సూక్ష్మ బిందువులు, వాటి తర్వాత ఇంకా ఏదో ఉన్న దానిని గురించి దృష్టి నిలుపుతాను. నీవు రోదన (విలాపం) గురించి వ్రాశావు. అది ప్రేమ మూలంగానే. **నేను ఈ ప్రేమ దాహంతోనే ఉన్నాను. ఎవ్వరైనా నాకు ఈ ప్రేమను అర్పించినట్లయితే, వారికి నేను వందల కొద్దీ దైవిక ఉపస్థితులను అనుభవింపజేయటానికి సంసిద్ధుడిగా ఉంటాను.** నేను నా స్వాధీనం కోల్పోయినప్పుడు లేదా నిస్సహాయుడనైనప్పుడు పాట పాడుకుని కొంతసేపు ద్వంద్వ స్థితిని కల్పించుకుంటాను. ఊరట కలిగించటానికి ఎంతో కొంత ప్రేమలహరి చెంతకు చేరుతుంది అని. నీవు "సూక్ష్మత్వం కూడా మరణించబోతూ ఉంది" అని వ్రాశావు. ఇది లయ-అవస్థ మూలంగా అనుభవమవుతుంది. వాస్తవానికి నాకు అది ఇంకా నీలో కనిపించలేదు. సూక్ష్మత్వం యొక్క నశింపు కలిగినపుడు ఆత్మ యొక్క స్పృహ ఎంతగా లేకుండా పోతుందంటే, ఈ స్థితికి చేరిన మానవుడు వేల కొలది సంవత్సరాలు దీనిపై ధ్యానం నిలిపినప్పటికీ ఈ ఆత్మ యొక్క ఉనికి తెలియదు. ఈ అవస్థకు చేరినపుడు, అభ్యాసీ నెగేషన్‌కు సిద్ధపడుతున్నట్లు అర్థం చేసుకోవాలి. ఇందులో చాలా దశలు ఉన్నాయి. నాలో ఈ అసంఖ్యాకమైన దశలు ఉన్నాయన్న ఆలోచన ఎందుకు వచ్చిందో నాకు అర్థం కావటం లేదు. నా ఈ వ్రాతలు చూసి జనం ఏమనుకుంటారో ఏమో తెలియదు. నాకయితే అంతుబట్టటం లేదు. చాలా శీఘ్రంగా తమంతట తాము పరమహంస మరియు ముక్తిని పొందినట్లు భావించుకుంటున్న వారు చాలామంది ఇక్కడ ఉన్నారు. ఎవ్వరైనా అరుదైనవారు ఈ స్థితిని పొందినప్పటికీ అంతకుమించి ముందుకుపోలేక నిలిచిపోతారు. ఇది కూడా వాస్తవమే. ఎందుకంటే, ఎవ్వరైనా సరే తమ అహంను కోల్పోయిన వారికే ఇంకా పురోగమించటం సాధ్యపడుతుంది. బిటియా! నాకయితే (Complete Ignorance) సంపూర్ణ అస్థిత్వలేమి దశ మరియు నెగేషన్ దశ కలిగి ఉండటమే ఇష్టం.

నీవు "అప్పుడప్పుడు శరీరమంతట మరియు కనురెప్పల మీద పిప్పర్‌మెంట్‌తో కూడిన తుంపర జల్లు కురుస్తున్నట్లు అనుభూతి కలుగుతోంది" అని వ్రాశావు. నీకు ఈస్నోఫేలియా వ్యాధి నివారణ కొరకు నేను ఇచ్చిన సిట్టింగ్ మూలంగానే ఇది అనుభవమయ్యింది. నీ హృదయం 'మాలిక్' హృదయాన్ని అంటిపెట్టుకుని ఉంటోంది అని నీవు వ్రాసినది కొంతవరకు సబబే. నీవు ఇంకా ఆధ్యాత్మిక మైదానంలోనే విహరిస్తూ ఉన్నావు. సముద్రాన్వేషణలో, ఆంతరికం 'ఇంకా కావాలి', 'ఇంకా కావాలి' అంటూ ఆర్తితో వేడుకుంటూ ఉండాలి. ఎప్పుడైతే వ్యష్టి (Individuality), సమష్టి (The Whole) అనగా ఆత్మ, పరమాత్మల మధ్య భేదం లేకుండాపోతుందో అప్పుడే అభ్యాసీకి తృప్తి కలుగుతుంది.

అమ్మ (కస్తూరీగారి తల్లి) యొక్క ఇచ్ఛాశక్తి చాలా బలీయంగా ఉండటం వలన నేను భీతి చెందుతున్నాను. సాధ్యమైనంతవరకు తన వాక్కును నియత్రించుకొనమని ఆమెకు తెలియజేయి. అమ్మకు నా ప్రణామం.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 404

షాజహాన్‌పూర్,

29.06.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం 25.06.1954 తేదీన వ్రాసినది చేరింది. నీవు శరీరం లోపల, బయట కూడా ఎటువంటి కంపనం (Vibration) తెలియటంలేదని నీ ఆధ్యాత్మిక స్థితిని గురించి వ్రాశావు. దానికి కారణం ఇది: మనం అల్పపీడనంగల ప్రాంతానికి చేరినప్పుడు స్వచ్ఛత అధికమవుతూ, ఒత్తిడి తగ్గుతూ ఉంటుంది. ఇది నేను జీవుడు మరియు బ్రహ్మ గురించి ఏదో ఒక ఉత్తరంలో వివరించినట్లుగానే ఉంటుంది. మనం పురోగమిస్తున్న కొద్దీ, ఒత్తిడి తగ్గుతూ, తగ్గుతూ మనం బ్రహ్మగతిని పొందుతాము. ఇంకా బాగా ముందుకుపోతే, ఆ పీడనం అతిస్వల్పంగా ఉంటుంది. అది ఎంత స్వల్పంగానంటే, అది అనుభవానికి రాదు సరికదా ఇంకా ముందుకుపోతే అది కూడా ఉండదు. నీ స్థితిని తెలియజేయటానికి సముచితమైన దానిని నేను వ్రాశాను.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 405

లఖీంపుర్,

29.06.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. నా ఆరోగ్యం ఇప్పుడు చాలా బాగుంది. తమరు ఇచ్చిన కాప్స్యూల్‌తోను మరియు 'మాలిక్' కృపతోను చాలా శీఘ్రంగా బలహీనత తగ్గిపోయింది. విచారించాల్సిన పనిలేదు. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

హృదయంలో ఏదో దశ తెరచుకుంటున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఉన్న స్థితి ఎటువంటిది అంటే, ఏ దశతో లేదా హృదయంతో నేను అంటిపెట్టుకుని ఉంటున్నానో, అది పూర్తిగా నాలో ఏర్పడినట్లుగా అనిపిస్తోంది. నా స్వరూపమే దానిలాగ అయిపోయింది. కొంచెం ఆంతరిక ఆనందం యొక్క దశ ఎంతగా ఉంది అంటే, అది ఒక్కసారిగా కుమ్మరించి నట్లయితే, హృదయం పగిలిపోవటంగాని లేదా పిచ్చిదానిలాగ అయిపోతాను అన్నట్లు ఉంది. ఎందుకంటే, నాలో దీనిని తట్టుకునే అవకాశమే లేదు. అది ఎంత ఆనంద దాయకమైనది అయినాగాని ఇప్పుడు నాలో దానికి స్థానం లేదు. నా రూపం ఆనందమయంగా అయిపోతున్నట్లు ఉంది కాని, ఇటువంటి దశ ఏదీ లేకపోయిందని అనిపిస్తోంది. దాని అనుభూతి ఆనందమయంగా ఉంది, ఇంతేకాకుండా అది ఆనందం యొక్క స్వయం వర్ణనగా ఉంది. శ్రీ బాబూజీ, రెండు రోజుల నుంచి దశ మారినట్లుగా తెలియటం లేదు కాని, అది (స్థితి) నాలో జీర్ణమైపోయినట్లుగా మాత్రం నా ఆంతరికంగా తెలుస్తోంది. అందుచేతనే దానిని అంటిపెట్టుకొని ఉన్నట్లు అనిపించటం లేదు. అంతేగాక అది నాలో కరిగి ఏకమైపోయింది. నేను ఏకత్వం గురించి వ్రాసిన విషయం, బాగా తరచిచూస్తే రక్త నాళాలన్నీ వాటిని పీల్చుకొని అంతం చేశాయి. కాని ఆ విధంగా ఎక్కువగా ఖాళీగా ఉన్నటువంటి దశ ఉంటోంది.

ఆధ్యాత్మిక సముద్రంలో సూక్ష్మాతిసూక్ష్మ అలలు లేవటం కూడా సమాప్తమైపోయింది. అసలు ప్రకంపనమే లేకపోగా అలలు ఎక్కడి నుంచి వస్తాయి! ఎడారి వంటి మైదానం ఇప్పుడు అలాగే ఉంది. దానిలో గాలి వీచటమంటూ లేదు కనుక గడ్డిపోచ కూడా ఎగరటం లేదు. ఇప్పుడు హృదయం గురించి చెప్పాలంటే, అది ఒక చదునుగా ఉన్న ఎడారివంటి మైదానంలాగానే ఉంది. శ్రీ బాబూజీ! ఇప్పుడు ఎలా అయిపోయిందంటే, నాలో ఏదైనా దశ ఉన్నాగాని, స్వయంగా 'మాలిక్'యే నాలో నివాసం ఉన్నాగాని, అది నాకు జ్ఞాపకం లేదు. నేను మాత్రం శూన్య దశ యొక్క (Forgetfulness) మరపుస్థితిలోనే ఉంటున్నాను.

అమ్మ తమకు, మాస్టర్ సాహెబ్‌కు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 406

షాజహాన్‌పూర్,

05.07.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం 29.06.1954వ తేదీది అందింది. దానికి జవాబు వ్రాస్తున్నాను. "నా రూపం ఆనందమైపోయినట్లుగా అనిపిస్తోంది" అని నీవు వ్రాశావు. నీ అనుభూతి సరైనదే. అయితే నేను నిన్ను **సర్వానందమయస్థితి**కి తీసుకురావాలని అనుకుంటున్నాను. నీవు ఆరోగ్యవంతురాలుగా అవ్వవలసి ఉన్నందున నేను నిన్ను ముందుకు నడిపించటం లేదు. నీ జీవన-మోక్ష (Liberation) దశ ఏదైతే ఉందో, దాని యొక్క పరిపూర్ణ ఆనంద స్థితిని నీకు అనుభూతి కలిగించాలని అనుకుంటున్నాను. ఈ స్థితిలో నేను నిన్ను బాగా గమనిస్తూ ఉండాల్సి ఉంటుంది. దైవానుగ్రహంతో ఆ స్థితి కలిగి తీరుతుంది. ఎందుకంటే, వాస్తవంగా అందరి పరిరక్షకుడు పూజ్య శ్రీ లాలాజీ మహరాజ్‌యే. ఈ జీవన-మోక్ష దశను చాలామంది పొంది ఉండవచ్చును కాని వారు ఈ జీవన-మోక్ష దశ ప్రారంభం కాకముందే వారు జీవన్ముక్తులుగా అయినట్లు భావించుకుని ఉంటారు. వారు ఈ దశ వరకు చేరి ఉన్నట్లుగా చెప్పుకుంటూ ఉండవచ్చును, కాని నాకయితే వారి జాడ తెలియదు. ఇది మోక్షానికి చెందిన అత్యున్నత గతి అని చెప్పకతప్పదు కాని, దీని తర్వాత మరొక దశ ప్రారంభమవుతుంది. నేను ఇంతకుపూర్వమే ప్రకంపనం మరియు ఒత్తిడి (Vibration and Pressure) గురించి వ్రాసి ఉన్నాను. వాస్తవానికి ఈ మైదానంలో ప్రకంపనం అంటూ లేదు. అయితే మరేదో ఉంది, కాని అది నిశ్శబ్దంగా ఉంది. ఇది కూడా బ్రహ్మగతి యొక్క మంచి స్థితి. ఈ స్థితిని నేను పెంపొందింపజేస్తాను.

లయ-అవస్థకు చెందినవి నాకు తెలిసినంతలో నాలుగు దశలు మాత్రమేకాగా వాటిల్లో మూడింటిని నీవు దాటి వేశావు. నాలుగవది ఇంకను ప్రారంభం కాలేదు. ఈ 4వ దశ దాటడానికి ఎక్కువ సమయం పట్టుంది; అది దాటిపోయాక ఏమవుతుందో నేను ఏమీ చెప్పలేను. నేను ఈ 4 దశలను దాటి వేశాక, ఈ 4వ దశను లాలాజీ సాహెబ్ ప్రేరణ కల్పించకముందుగానే దానిని దాటి వేశాను, అని లాలాజీ సాహెబ్ నాకు వివరించారు. అయితే నాకు ఆ విధానం కలలో చిత్రించబడింది. లాలాజీ సాహెబ్ కృపతో ఆ నాలుగవదశ పూర్తయ్యాక దాని 5వ దశ గురించి నాకు తెలిసింది. దానిని అర్థం చేసుకోవటానికి నెగేషన్ యొక్క నెగేషన్ (శూన్యావస్థ) విధానం ఉంది. అయితే శ్రీ లాలాజీ మహరాజ్ నన్ను ఈ విధానాన్ని ప్రయోగించనివ్వకుండా ప్రస్తుతం ఉన్న స్థానం (4వ స్థానం) మీదనే నిలిపివేసి, నా దృష్టిని దానిపై నుంచి మరల్చారు. ఆ విధంగా చేశాక నాతో వారు ఏమి చెప్పారంటే, "నీవు ఈ స్థితి (5వ దశ) ని చేరటానికి ఉపక్రమించగానే నేను నీకు ఆ స్థితిని కల్పించాను, అలా కాకుంటే, నీవు

నా ప్రయోగానికి నిరర్థకమవుతావు" అని అన్నారు. దానితోపాటు, "నీవు కనుక ఐదవ దశను అన్వేషించటానికి ప్రారంభించకపోయినట్లయితే నేను ఇంకా కొంత సమయం తీసుకునేవాడిని" అని కూడా చెప్పారు. అమ్మకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 407

లఖీంపుర్,

05.07.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' దయతో వ్రాసిన ఉత్తరం చేరింది, చదివి చాలా సంతోషించాను. అదేమిటోగాని, ఇప్పుడు నా స్థితి తారుమారైంది. నాకయితే నిజంగానే ఆరోగ్యం గురించిన ఆలోచన ఉంది. ఎప్పటి నుండి తమరు ప్రార్థన చేయమని వ్రాశారో, నేను అప్పటినుండి అలా చేస్తుండగా, ఒక బాలకుడులాగా అమాయకంగా తన 'మాలిక్' ఎదుట తన ఆరోగ్యం నిమిత్తం చేతులుచాపి నిలబడి అర్థిస్తూ ఉన్నట్లు ఉన్నదే ఇప్పుడు నా స్థితిగా ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

దశతోగాని, 'మాలిక్' యొక్క హృదయంతోగాని హత్తుకొని ఉన్నట్లు తలపించినటువంటిది, ఇప్పుడు అనుభవం కావటం లేదు. ఆ విధంగా అనుభూతి చెందాలని ప్రయత్నించినా కూడా అది మంచిదిగా అనిపించకపోగా, అప్పుడప్పుడు దిగులుగా ఉంటుంది. ఎందుకో తెలియకున్నదిగాని, నా హృదయం ఖాళీగా ఉన్నట్లు అనిపించినా కూడా అది నాకు బాగున్నట్లే అనిపిస్తోంది. ఈ దశ పరిస్థితి ఏమిటంటే, ఏకత్వం అను దశను ఇప్పుడు నాలో కల్పించుకోలేకపోయినప్పటికీ, దానివలన ఏమీ జరగనట్లుగానే ఉంది. ధ్యానం యొక్క స్థితి ఎలాంటిది అంటే, ఒక సమతల మైదానంలో ఒక బిందువుమీద దృష్టి కేంద్రీకృతమై ఉన్నట్లు అనిపిస్తోంది. బిందువు అని ఉదాహరణకు చెప్పటమేకాని, అలా కాకపోతే దృష్టి దేనిమీదనో సారించబడి ఉన్నట్లు అర్థం చేసుకోవచ్చు. ఇంకా చెప్పాలంటే, అదే నాకు ధ్యానానికి చెందినపాయింట్.

నా బాబూజీ, ఇప్పుడు ఈ దశలో ఎలా ఉందో చూడండి. ఇదివరలో నేను, ఏదో ఆకర్షణ నన్ను తనవైపు బలవంతంగా గుంజుకుపోతున్నట్లు అనిపిస్తోంది అని వ్రాస్తూ ఉండేదానను. కాని ఇప్పుడు ఆ విధంగా అనిపించటం లేదు. ఒకవేళ ఆ విధంగా కావాలని ప్రయత్నించినట్లయితే గుండె భీతి చెందుతోంది. అంతేగాకుండా ఆ ఆకర్షణ అనేది స్వయంగా నాలో ఆంతరికంగా కొంత నిలిచి ఉన్నట్లుగాను, ఆ ఆకర్షణ నాలో తడిసి లేదా ఉనికి కలిగి ఉండి కొంచెం కొంచెంగా నాలో స్వయంగా జీర్ణించుకుపోతున్నట్లు అనిపిస్తోంది. ఇందువలన, ఆకర్షణ అనేది ఇప్పుడు ఎటువంటిదైనాగాని, ఆ పేరుతో ఉన్న వస్తువు నాలో మాసిపోయింది. నా మనస్సు స్వయంగా ఆ ఆకర్షణను తనలో లయం చేసుకుంటున్నట్లు ఉంది. బాబూజీ, నా దశ ఏదైనా కానివ్వండి, అది జీర్ణించుకుపోయి, నా హృదయం పూర్తిగా ఖాళీగా ఉంటోంది. ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, దానిని ఏకత్వం యొక్క దశగా భావించినప్పటికీ, హృదయం గాబరాపడి వెంటనే కళ్ళు తెరుచుకుంటున్నాయి. ఆ విధంగా నా 'మాలిక్' కొరకు అని నాలోని ప్రతి తంతువూ ఎండిపోయి హా హా కారం చేస్తున్నట్లు అనిపిస్తోంది. ప్రస్తుతం పూర్తిగా, ఒక బాలకునిలాగా శూన్యం మరియు పవిత్రమైన అమాయకత్వపు దశగా ఉంది. పూజ్య శ్రీ బాబూజీ, నేను ఇప్పుడు బంధనరహితంగా అయిపోయినట్లు అనిపిస్తోంది. నా ప్రార్థన ఒకటి ఆలకించండి –ఎవరితోనైతే 'తమరు' ఉత్తరాలు వ్రాయిస్తూ ఉంటారో, వారు 'తమరు' చెప్పిన శబ్దాలనే, ఒకవేళ అవి ఉర్దూ భాషాపదాలే అయినా చెప్పింది చెప్పినట్లు వ్రాసేవారు ఉండాలని నా కోరిక. అలా జరగకపోతే భావ మాధుర్యం మందగించిపోతుంది. ఇంక ఆత్మోన్నతి అంటారా, అది నా వలన కలగవచ్చు లేదా తమ వలన జరగవచ్చు. 'మాలిక్'వైపు ఏ అడుగులైతే ముందుకుపడ్డాయో అవి 'వారి'ని

పొందిన తర్వాతనే సంతృప్తి చెందుతాయి. అలాగే జరుగుతుండటంలో సందేహం లేదు. 'మాలిక్' ఎలా తలిస్తే అలా జరుగుతుంది. 3 పాయింట్ల గురించి తమ పరిశోధన పూర్తిగా క్రొత్తదిగాను, సత్యస్థితిగాను ఉంది. సూక్ష్మ పాయింట్లు ఇంకా వేటినో గురించి వ్రాశారు. అది కూడా పూర్తిగా తమరి సముచిత నిర్ణయమే.

అమ్మ గురించి తమరు వ్రాసిన విషయం చెప్పాను. ఆమె తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 408

లఖీంపుర్,

09.07.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం నిన్న సాయంత్రం పూజ్య మాస్టర్ సాహెబ్ ద్వారా చేరింది. వారి ద్వారా తామందరి క్షేమ సమాచారం, జరిగిన చర్చనీయాంశాలు విని చాలా సంతోషం కలిగింది. తమ ఉత్తరం చదువుతూనే నిన్న సాయంకాలం నుంచే హోమియో వైద్య చికిత్స నిలిపివేశాను. తమరు వ్రాసిన గడ్డ వంటి దానిని గురించి లేడీ డాక్టర్‌ను సంప్రదించాను. అది పొట్ట అంతటా ఉందని ఆమె చెప్పారు. ఈ గడ్డస్థితి ప్రేగుల్లో బాగా ఉందా లేదా చెడుగా ఉందా అనే సంగతి ఆమె ధృవీకరించలేకపోయారు. అయినా కూడా ఆమె దృష్టిలో చెడుగా ఉన్నట్లుగానే ఉంది. దాని విషయం అడగమని మాస్టర్ సాహెబ్‌గారు చెప్పారు. ఇప్పుడు నేను ఆమె చికిత్సనే అమలుపర్చుకుంటున్నాను. ఎందుకంటే, ఇప్పటివరకు డాక్టర్ సిన్హాగారి ఉత్తరంగాని, ప్రిస్క్రిప్షన్‌గాని రాలేదు. పుత్తీబాబు (అభ్యాసీ) ఉత్తరం యొక్క నకలు కూడా తీశాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ నా ఈ దశలో తపన కూడా కరిగి, కరిగి, నా రక్తంలో జీర్ణించుకుపోయింది. ఎందుకంటే, హృదయంలో తపన అనేది ముల్లులాగా గ్రుచ్చుకోవటం లేదు కాని అది కూడా నా రక్తంలో మిళితమైపోయింది. దానివలన నరాల్లోను, కణకణాల్లోను శుష్కించిపోయిన హా, హా (బాధతో ఉన్నప్పుడు కలిగే శబ్దం) ను పొందుతున్నాను. ఈ శబ్దాన్ని గురించి ఎవ్వరైనా ప్రశ్నిస్తే, ఏ (Vibration) ప్రకంపనం నాలో కలగటమేలేదని చెప్పాల్సి ఉంటుంది. కాని ఒకవేళ ధ్యాస నిలిపినట్లయితే రక్తనాళాల యొక్క ప్రతియొక్క స్పందనలోను 'మాలిక్, మాలిక్' అను మాటయే వినబడుతోంది. నా శబ్దం ("మాలిక్, మాలిక్"), ప్రకంపనం గురించిన భావన ఇదే. నా దశలో ఉప్పొంగటం అనేది కలగటం లేదు. దానికి బదులుగా 'మాలిక్' అణచిపెట్టి ప్రతిదశను ఇదే విధంగా నాలో నిలుపుతున్నారని అనిపిస్తోంది. నిన్నటినుంచి ఏర్పడిన దశలో నా హృదయం యొక్క పగ్గాలను ఎవరోచేతబట్టి, తరచుగా లోపల నాడులన్నింటిలోనూ పొంగువారుతున్నట్లు ఉన్న ఆనంద (పరమానంద) దశను నియంత్రిస్తున్నారు అని అనిపిస్తోంది. దశ కొంచెం ఉప్పొంగగానే నా కణకణం, 'మాలిక్', 'మాలిక్' అని ఆనందంతో పరవశమై అరుస్తోంది. ఏదో నూతన అధ్యాయం తెరవదలచినట్లు అనిపిస్తోంది. అయితే పగ్గం కొద్దిగా కొద్దిగా పనిచేయటానికి అవకాశం ఇస్తోంది. ఎలా ఉందంటే, ఇది ఆనంద దశయేకాదు, ఇంకా చెప్పాలంటే, నేను ఆనంద స్వరూపంగాను, ఆనందమయంగాను అయిపోతున్నట్లు ఉంది. నా బాబూజీ, జబ్బుతో ఉన్నది మరో కస్తూరీ అయి ఉండవచ్చునేమో కాని, నాకు మాత్రం ఎటువంటి జబ్బూ లేదు. తరచుగా హృదయం పట్టుకుని కూర్చోవటం బాగుందని అనిపిస్తోంది. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 409

లఖీంపుర్,
16.07.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. తమకు మాస్టర్ సాహెబ్‌గారి వలన మంచి విశ్రాంతి లభిస్తోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు కలుగుతున్న ఈ దశలో ఏమనిపిస్తోంది అంటే, లోపల ఏదో కరుగుతున్నట్లు ఉంది. దాని ఫలితంగా ఆనందం కాకుండా "ఆత్మానందం (Spiritual Happiness)" కలుగుతోంది. బాహ్యశరీరం మీద ప్రభావం లేనప్పటికీ లోపల కణకణమూ పులకరించిపోతున్నట్లు ఉంది. ఈ కరగటం ద్వారా ఏదో ముసుగు తొలగిపోతున్నట్లుగాను, అంతరాత్మ విస్తరించాలనుకుంటున్నట్లుగాను ఉంటోంది. ఎందుకంటే, ఆ ముసుగు లోపల అంతరాత్మ కరుగుతూ ఉంది. బాబూజీ, అంతరాత్మ కరగటం ప్రారంభించినట్లు అనిపిస్తోంది. అంతరాత్మ కరుగుతున్నదని నేను ఎందుకు వ్రాశానంటే, 'మాలిక్' యొక్క దృష్టి అక్కడ నిలకడగా ఉంది. ఆ దృష్టి మరెక్కడా నిలవటం లేదు. ఇప్పుడు నాలో దివ్యానంద స్థితి జాగృతమైనట్లు ఉంది. ఒక విచిత్రమైన దశ ఎలా ఉందంటే, రక్తంలోను, ధమనులలోను వ్యాకులత, తపన ప్రవహిస్తున్నాయి. మరి ఆంతరిక స్థితి ఎలా ఉందంటే, అంతరాత్మ యొక్క కణకణం సంతోషంతో వెల్లివిరుస్తున్నట్లు ఉంది. ఇంతేకాదు, బయట, లోపల కణకణమూ ఆనందంతో వ్యాప్తమైపోయినట్లు అనిపిస్తోంది. దాని మూలంలో "హా మాలిక్, హా మాలిక్" అను అర్తనాదం కలుగుతోంది. అయినాగాని దశ తెరచుకుంది కాని సంపూర్ణంగా కాదు. ఏదో కొంత దానిని (స్థితిని) మరచిపోయాను. నా ఈ స్థితిలో రంగుగాని, అనురాగం గాని, రోగం కాని, మందుగాని లేవు. ఇంకా ఏదో మార్పు కలిగిన దశగా ఉంది. నేను ఒక నశింపులేని రూపంగా ఉన్నాను. అయితే నేను అంతటా వ్యాపించి ఉన్నట్లుగాని, ఎక్కడా లేకుండాగాని అనిపించటం లేదు. ఎందుకంటే, అది నశింపులేనిది అని అంటారు కాని, ఆకాశంలాగ వ్యాప్తి చెందుతోంది. అవిచ్ఛిన్నం అంటె ఛిన్నాభిన్నం కాజాలదు, కాని లేకుండా పోదు. కాని ప్రాప్తం చేసుకోబడుతుంది. నాకు గ్రహింపు ఉన్నంతలో, 'మాలిక్' యొక్క కృపతోనే ఈ దశలు సంప్రాప్తం కాగలవే కాని లేకుంటే అవి కలగవు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. పూలోజిజ్జి తమకు ప్రణామం చెప్పమని వ్రాసింది. ఈ పూజలో ఉన్న ఆనందం మరియు సుఖం మరిదేనిలోను లేవు అని కూడా వ్రాసింది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 410

షాజహాన్‌పూర్,
20.07.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. ఈ రాత్రి అంతా వ్రాయటానికి లేఖకుడు అందుబాటులో ఉన్నందువలన రాత్రి ఒంటి గంట తర్వాత నీ ఉత్తరానికి జవాబు ఇవ్వటానికి పూనుకున్నాను. నీ ఉత్తరాలు 1.07.1954 మరియు 16.07.1954 తేదీలవి చేరాయి. రెండింటికి కలిపి సమాధానం ఇస్తున్నాను.

జన్మాష్టమికి రావటానికి నేను ఇంకా నిర్ణయించుకోలేదు. ఒకవేళ రాదలిస్తే 4,5 రోజులు ముందుగానే తెలియజేస్తాను. నేను నీ ప్రస్తుతదశలో పూర్తిగా ప్రయాణింపజేసి, అక్కడ ఆనందాన్ని పూర్తిగా అనుభవింపజేయాలని

అనుకుంటున్నాను. నా కోరికకు తగినట్లుగా నీ స్థితి క్రమక్రమంగా తెరుచుకుంటోంది. నీవు జూలై 1వ తేదీ ఉత్తరంలో "నా పురోగతికి చెందిన పగ్గాలు మీ చేతిలోనే ఉంచుతున్నాను, ఎందుకంటే, ఎక్కడా హద్దు మీరటంగాని, చేతిని విడిచిపెట్టటంగాని జరగకూడదు" అని వ్రాసినది సబబుగానే ఉంది. ఈ విషయాన్ని ఎవరో ఒకరు ఇలా చెప్పారు – **"ఎవరైతే ఉన్నతస్థితికి ఎదుగుతారో, దానిని నిలుపుకోవటం కష్టం"** అని భావం.

నీవు 'తపన' గురించి వ్రాశావు. కాని అది అలా కొనసాగుతూనే ఉంటుంది. తపన, తపనలో విలీనం కానంతవరకు అది ఉంటుంది. నీలో ప్రస్తుత స్థితి యొక్క ఆనందం వెల్లివిరుస్తోంది. ఆ స్థితిలో కణకణమూ కరిగిపోతూ, అభ్యాసీ ఆ ఆనందాన్ని భరించగలుగునంతగా అవి తెరుచుకుంటాయి. నీ దృష్టి ఎప్పుడూ ఆంతరికంగా ఉండి స్థితితో మిళితమై ఉన్నట్లుగాను, పురోగతి యొక్క జ్ఞానం కలిగి ఉంటూ, వాటితోపాటు అసలైన తపన, అవన్నీ నీ ఆధ్యాత్మిక ఉన్నతికి తగినంతగా ఉన్నాయి. ఆధ్యాత్మిక ఉన్నతి నీ స్వంతం. అది నీవు ఎంత కావాలనుకుంటే అంతగా పురోగమించవచ్చు.

నేను నీ అనుభవం కోసం ఒక విషయం వ్రాస్తున్నాను. వర్షం గురించి ఆందోళనగా ఉంది. అది ఆలస్యమయ్యేటట్లుగా ఉండటంతో చింతించాల్సి వస్తోంది. **ప్రకృతిని పరిశీలించగా, వర్షం కురిపించే పని (ప్రకృతి యొక్క పని) విషయంలో మనస్సు లగ్నం కావటం లేదు. అయితే కొన్ని కారణాలవల్లనూ, నా హక్కుల వినియోగంచేతనూ, వర్షం కురిపించటానికి అనుమతి పొందాను. అయితే వర్షానికి ఆధారమైనది లేకుండా పోయింది. నేను నా మాట నిలబెట్టుకోవటం కోసం అత్రి ఋషిని ఈ పనికి నియోగించాను. ఫలితంగా అతడు సముద్రం మీద ఋతుపవనాలు కల్పించటానికి ఉద్యుక్తుడయ్యాడు. మూడవ రోజున వర్షం కురిసింది. దానితో ఆయన విధానం, శక్తి కూడా అంచనా వేయగలిగాను. అత్రి ఋషి జీవించియే ఉన్నారు. ఆయన గంగ, యమున నదుల మధ్యగా ఉత్తరదిశగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఆ శక్తిని, విధానాన్ని నీకు తెలియజేస్తాను. దీని గురించి నీవు ప్రత్యక్షంగా కలిసినపుడు అడిగి తెలుసుకో.**

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 411

లఖీంపుర్,
22.07.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' వ్రాసిన ఉత్తరం ఇప్పుడే చేరింది. చదివి చాలా సంతోషించాను. 'తమ' ఆరోగ్య స్థితి గురించి తెలిసాక అమ్మకు, మా అందరికీ చాలా సంతృప్తి కలిగింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పటి దశలో, ఎందుకోగాని 'మాలిక్'పట్ల నాకు ప్రేమ జనించటం లేదు, ఏమి చేయాలి. ఎక్కడి నుండి తీసుకుని రావాలి? ఇప్పుడు ఆంతరికంగా ఉన్న దశలో, సూర్యాస్తమయమైన తర్వాత ఒక్కొక్కటిగా కమలం యొక్క రేకలు క్రమంగా అన్నీ ఎలా ముకుళించుకుపోతాయో, అదే విధంగా అన్ని క్రియలు, అన్ని వృత్తులు ముడుచుకుపోయి కమలంలాగా స్పందనరహితంగా అయిపోయినట్లు ఉంది. ఇప్పుడు బుద్ధి కూడా సంకుచితంగా అయిపోయి, ముకుళించుకుపోయినట్లు ఉంటోంది. కాని ఏదైనా ఆలోచిస్తూ ఉన్నప్పుడు పరిమితంగా ఉంటోంది; ఏదైనా వ్రాస్తూ ఉన్నప్పుడు విశాల దృక్పథం కలుగుతున్నట్లు అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, నా రూపం ఇప్పుడు ఒక తొర్రలాగా (ఖాళీగా) అయిపోయింది. నా స్థితి ఏమిటో దైవానికే తెలియాలి. 'మాలిక్' యొక్క గొప్పదనాన్ని గురించి ఎప్పుడైతే

ఆలోచిస్తానో అప్పుడు నాలోనే ఆ గొప్పతనం పెల్లుబుకుతున్నట్లు అనిపిస్తోంది, కాని ఆ తర్వాత ఏమిలేనట్లుగానే ఉంటోంది. నిన్న సాయంత్రం కలిగిన దశలో, అందరి ఆత్మ ఆ సర్వవ్యాపియైన పరమాత్మయేయని అనిపిస్తోంది. వాస్తవంగానే నా ఆత్మ యొక్క స్థానంలో స్వయంగా 'మాలిక్' విరాజిల్లుతున్నారు. నేను మాత్రం ఎప్పటిలాగానే ఉన్నాను. నేను ఏమిలేనిదానిలాగ ఉన్నాను. ఒక తొర్ర నివాసంగా ఉండి, అందులో ఆత్మయే మిగిలి ఉంది. బాబూజీ, ఇంతకుపూర్వం, నా దృష్టి దేనిమీదో కేంద్రీకృతమై ఉందని వ్రాస్తూ ఉండేదానను కదా! కాని ఇప్పుడు అది తారుమారైంది. ఆ దృష్టియే ఆత్మ అన్నట్లుగాను, అదే లక్ష్యం అన్నట్లుగాను, అలాకాకపోతే దృష్టిలోనే ఆత్మ లేక లక్ష్యం మునిగి ఉన్నట్లుగాను అనిపిస్తోంది. దృష్టి అయితే దానిలో లేకుండాపోయింది. బాబూజీ! నాదొక అవినాశ (నశింపులేని) సంబంధంలాగా ఉంది. ఎందుకంటే, ఆత్మకు నశింపులేదు కదా! నా ఆత్మ అయితే కరిగిపోతూ ఉంది. ఆ కరిగిపోవటంలోనే అవినాశ దశయే ప్రవహిస్తోంది.

నిన్న సాయంత్రం పూజలో ఒక్కపెట్టున దృష్టి ఎదుట క్షణిక దృశ్యం ఏర్పడింది. అదేమిటో నాకు అర్థం కాలేదు. అది తమకే తెలియాలి. ఒక్క క్షణకాలం, నిర్జీవ మైదానం కాకుండా దాని స్థానంలో ఇసుకతో కూడిన మైదానంలో, దాని మధ్యన ఒక్కసారిగా నేను కనిపించాను. కాని ఒక్క క్షణంలో ఏమైందో ఏమో కాని, నేను ఆ మైదానంలో పూర్తిగా పాతుకుపోయినట్లుగాను, దానిలో మునిగిపోయినట్లుగాను, నాపైన ఆ ఇసుకతో కూడిన మైదానమే సమతలంగా వ్యాపించినట్లుగాను అనుభవమైంది. తరచుగా నా దృష్టిలో ఆ మైదానం, ఆ దృశ్యం కదులుతూ ఉన్నాయి. బాబూజీ, అది మైదానమేగాని, భూమి కాదు. ఎందుకంటే, దానితో పోల్చితే పృథ్వీతత్వం భారంగా ఉంటుంది. దానిలో ఈ భారం లేదు. (మట్టికణాలు దగ్గర దగ్గరగా కలిసిపోయి సాంద్రత ఎక్కువగా ఉండి, భారమనిపిస్తోంది. అదే ఇసుక అయితే దాని రేణువులు విడివిడిగా ఉండి ఎంతోకొంత గాలి కలిసి ఉండటం వలన తేలిక అనిపించటం, అలాగే దానిలో ఏదైనా గుచ్చాలన్నా తేలికగా దూరిపోతుంది. ఇసుకలో కూరుకుపోయినంత తేలిగ్గా మట్టిలో కూరుకుపోలేము.)

'తమ' రాక యొక్క వార్త తప్పకుండా తెలియజేయండి. నేను విశ్రాంతి తీసుకుంటున్నాను. నియమిత పూజ కూడా చేయటం లేదు. ఆధ్యాత్మిక ఉన్నతిని గురించి 'తమరు' వ్రాసినది యదార్థమే. నాకు కూడా స్వయంగా ఏమి అనిపిస్తోంది అంటే, అది నా ఇంటికి చెందిన వస్తువే అని. ఎప్పుడు, ఎంత కావాలనుకుంటె అంత 'మాలిక్' కృపతో ప్రాప్తం చేసుకుంటాను అని. స్వస్థత గురించిన ఆలోచనయే నాకు ఎంతైనా ఉంది. ఎందుకంటే, 'మాలిక్' యొక్క రూపం నా చేతుల్లో నిలిచి ఉంటుంది. ఆ రూపమే నా ఆరోగ్యం గురించి ఆలోచించేదిగా ఉంది. అందుకనే నా వలన నిర్లక్ష్యం జరగదు. బాబూజీ, నాకైతే వేదం తమరే, శిక్షకులుగా తమరే, ఎంతగా చదివించాలో తమకే తెలుసు.

కేసర్ L.T.లో చేరింది. ఎల్లుండి అలహాబాద్ వెళ్తోంది. అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెప్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 412

లఖీంపుర్,

25.07.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. నేను నిన్న డాక్టర్‌గారికి పొట్ట చూపించాను. ఇప్పుడు తరచుగా (గ్లాండ్స్) గ్రంథులు ఉబ్బటం, అణగిపోవటం జరుగుతున్నదని చెప్పారు. కాని నాభి క్రింద గ్రంథి యొక్క గడ్డ లాంటిది తక్కువగానే ఉందని చెప్పారు. ప్రేగుల్లో, మొదటినుంచి కొంచెం ఎక్కువ శక్తి ఉన్నట్లు చెప్పాను,

తమకు వ్రాశాను కదా! అది స్వయంగా కూడా నాకు అనుభవమవుతోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

ఇప్పుడు నా దశ ఈ విధంగా ఉంటోంది. నా దృష్టి అంతరిక్షం వగైరాలవైపు ఉన్నదేమో కాని నాకు తెలియదు అన్నట్లు ఉంది. నాకు తెలిసిందల్లా, నావైపుగా ఉన్న 'మాలిక్' దృష్టిలోనే నా దృష్టి కలిసిపోయి అంతమైపోయింది. అందువలన కేవలం 'మాలిక్' యొక్క దృష్టి లేదా కృపమీదనే నా ఉన్నతికిగాని మరి దేనికైనాగాని అన్ని రకాలుగా ఆధారపడి ఉన్నాను. నాకయితే ఇప్పుడు నావైపుగా ఉన్న 'అతడి' దృష్టియే నాకు ఎప్పుడు అనుభవమవుతూ ఉంది. అదే నా జీవితంగా ఉంది. 'అతని' దృష్టిలో ఉన్న చలనమే నా ఉన్నతికి కారణంగా ఉంది. అదే నా స్పందనగాను ఉంది. ఆ స్పందనే నా హృదయం కొట్టుకోవటంలోను ఉంది. నా పరమ పూజ్య బాబూజీ! నేనయితే 'అతని' ప్రేమమయ దృష్టిలో నా దృష్టిని సమర్పించివేశాను అన్నట్లు ఉంది. ఇప్పుడు 'అతడు' ఎంతగా, ఏమి తలపింపజేస్తే, అదే అంతగా నాకు తలంపుగా ఉంటోంది. ఇప్పుడు మైదానం ఎలా ఉందంటే, దానిలో ఏకాంతం ప్రారంభమవుతున్నట్లు ఉంది. కాని 'అతని' యొక్క కృపయే నా ఆనందానికి మూలకారణంగా ఉంది. 'మాలిక్' యొక్క కృపాదృష్టి నన్ను అనుక్షణం ఆనందంగాను, ఉత్సాహంగాను ఉంచుతోంది. నా దృష్టి కొరకైన శక్తి, ఆలోచనచేసుకొను శక్తిని, అన్నీ కూడా 'మాలిక్' యొక్క ఆకర్షణా దృష్టికి అర్పితమైపోయాయి. నేనైతే పురాతన గుహలాగా ఉన్నాను. దశ చాలా నిదానంగా తెరచుకుంటోంది. దానితో సదా నా ఆనందం కణకణంలోను నిండి ఉంటోంది కాని, ఉప్పొంగటం లేదు. ఈ దశ ఇంకా పూర్తి స్థాయిలో అనుభవం కావటంలేదు. అయినప్పటికి నా మనస్సు ఈ నిదానంతో తరచుగా అధైర్యపడుతోంది. అయితే దీనితో బంధనం తెంచుకునే శక్తి నాలో లేదు. అణగిమణిగి ఉంటున్నాను. అయితే నా ఆనందం 'మాలిక్' యొక్క ఆనందంతోనే ముడిపడి ఉంది. అమ్మ, కేసర్ మరియు బిట్టో తమకు ప్రణామం చెబుతున్నారు.

పూజ్య మాస్టర్ సాహెబ్‌ను గురించి తమరు వ్రాసినటువంటిది, నాకు కూడా సంవత్సరం క్రితమే కాన్పూర్‌లో అనుభవయ్యింది. నేను వారికి వ్రాశాను కూడా, కాని మాస్టర్ సాహెబ్‌కు అది చేరలేదు. దీని మూలంగా నాకు కొంత కోపం కూడా కలిగింది. అది తమకు తెలిసినదే. కాని మాస్టర్ సాహెబ్‌కు ఇది తెలియటం లేదు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 413

లఖీంపుర్,
29.07.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం 'తమ'కు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. పొట్ట విషయంలో ఏ స్థితినైతే తమకు వ్రాశానో అదే కొనసాగుతోంది. ప్రత్యకించి చెప్పాల్సిందేమీ లేదు. భారంగా అనిపించటం లేదు కాని, సాయంత్రం మాత్రం తప్పకుండా ఉంటోంది. ప్రస్తుతం నడుస్తున్న ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పటి ఈ స్థితిలో నిద్ర నుంచి లేస్తున్నప్పుడుగాని, తిరుగుతూ ఉన్నప్పుడుగాని, ఎప్పుడైనా, ఎవ్వరైనా అరచినాగాని, చప్పట్లు చరిచినాగాని, నా హృదయం మీద చరిచినట్లు అనిపిస్తోంది. నిద్ర నుండి లేస్తూ పండుకొని ఉండగా నా మంచాన్ని ఎవ్వరైనా కదిపినట్లయితే చాలా అసహనంగా అనిపిస్తోంది, అది ఎందుకో తెలియదు. ప్రార్థన చేస్తున్నా, పాడుతున్నా కూడా నేను వాటిలో తన్మయత్వం పొందలేకపోతున్నాను. ఆ సందర్భంలో కూడా ఎవ్వరైనా తప్పెట్లు మోగించినట్లయితే హృదయం కుదిపేసినట్లు అనిపిస్తోంది. శ్రీ బాబూజీ, ఇప్పుడు మనస్సు మీద ఏదో అద్భుతమైన తళుకుబెళుకు రంగులేనిది అద్దినట్లు ఉంది. మనస్సు యొక్క కణకణం దానిలోనే రంజితమై, అదే

రంగు చోటుచేసుకున్నట్లు అనిపిస్తోంది.

నా 'మాలిక్', ఇప్పుడు ఏమి జరిగింది అంటే, మనస్సు యొక్క అణువణువు వేర్వేరుగా వెదజల్లబడ్డాయా అన్నట్లు అనిపించటమేగాక, ప్రతికణంలోను అదే తపన వంటిది మరియు ఆనందం మిశ్రితమై ఉన్న దశ ప్రవహిస్తోంది. శరీరం అంతటి రక్తబిందువులోను ఇదే దశ ప్రవహిస్తోంది. అదేమిటో తెలియకున్నదిగాని, వ్రేలుతెగితే వెలువడే రక్తంతో 'అనల్‌హక్' (అనగా అహంబ్రహ్మాస్మి) అను ధ్వని మరియు ప్రియుని రూపం గోచరిస్తున్నాయి. ఆ రక్తాన్ని స్పర్శించినట్లయితే 'మాలిక్'నే స్పర్శిస్తున్నట్లుగాను, స్వయంగా నేను కూడా 'అతని'తో వేరుగా లేనట్లుగాను అనుభూతి కలుగుతోంది. ఇంకా ఏమిటంటే, తరచుగా, నాకు నేను తిరుగాడుతూ, లేస్తూ కూర్చుంటూ ఉన్నప్పుడు నా అణువణువూ ఉప్పొంగుతున్నట్లు అనిపిస్తోంది. అయినా కాని ప్రతిస్థితిలోను, ప్రతి సమయంలోను అదుపులో ఉంటోంది. ఇందులో కూడా నాకు ఏవగింపు ఉండటం లేదు, ఎందుకో తెలియదు. తరచుగా గుండె దడదడలాడుతోంది. నా బాబూజీ, 'తమరు' నాకు దక్కారు, నేను తమరిని పొందగలిగాను. ఇప్పుడు ముల్లోకాల ఆధిపత్యం కూడా నాకు ఎవ్వరైనా కట్టబెట్టినట్లయినాగాని దానిని నేను తమకే సమర్పితంచేసి, 'తమ' చరణాలవద్దనే తిరుగాడుతూ ఉండటమే నాకు యోగ్యంగా ఉంటుంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. బిట్టో, లల్లూ మరియు కాంత తమకు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 414

షాజహాన్‌పూర్,
31.07.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు రెండూ అందాయి. 22వ తారీఖు దానికి జవాబు ఇస్తున్నాను. నీవు గొప్పదనం అను స్థితిని గురించి వ్రాశావు. నీవు ఎప్పుడైతే 'మాలిక్' దృష్టిలో ఉంటావో అప్పుడు గొప్పదనం స్వయంగా నీలో వ్యక్తమవుతుంది. ఇది చాలా మంచి విషయం. అయితే దీనికి ఒక్కటే జవాబు చెప్పవలసి ఉంటుంది. ఏమిటంటే, **దైవంలో లయ అవస్థ ఎంత ఎక్కువగా కలుగుతూ ఉంటుందో, అంతే ఎక్కువగా దైవీయ గుణాలు అభ్యాసీలో కలుగుతూ ఉంటాయి. ఎవరిపై ధ్యానం చేస్తావో, వారికి చెందిన గుణాలు నీలో కనబడుతూ ఉంటాయి. అందుకే అసంపూర్ణ గురువుపై (Incomplete Guru) ధ్యానం ఎప్పుడూ చేయకూడదు.**

"దృష్టియే ఆత్మ అన్నట్లు ఉంది. అదే లక్ష్యం లేదా ఆత్మ. దృష్టిలోనే లక్ష్యం ఇమిడి ఉంది" అని నీవు వ్రాశావు. మానవుడు తనకుమించి ఉన్నతంగా ఎదిగినప్పుడు, ఆ దృష్టి యొక్క దృశ్యం కూడా మారిపోతుంది. ఆ దృష్టియే స్థూలత్వం నుంచి సూక్ష్మత్వం చెందుతూ ఉంటుంది. దీనినే 'సురత్' (జ్ఞానం) అంటారు. మరైతే ఎప్పటివరకైతే ఆ దృష్టి కలిగి ఉంటుందో అప్పటివరకు దానిని అసంపూర్ణం అనే చెప్పాల్సి ఉంటుంది. మనలో కలిగే ప్రతి విషయాన్ని దివ్యస్థితిలోనికే తీసుకుంటూ పోవాలి. ఇంకా చెప్పాలంటే, **మనం ఒక స్థితికి చేరాము అంటే, మరి ఇకపై దానిని కూడా విస్మరించాల్సి ఉంటుంది (అనగా దానినే అంటిపెట్టుకుని ఉండకూడదు). ఇది చాలా ఉన్నతమైన విషయమే కాదు ఒక రహస్యం కూడ.**

వేదాల యొక్క తరువాతి అభ్యున్నతి ఇంకా జరగలేదు. ఎందుకంటే, ఋషులు అద్వైతం యొక్క స్థితినే చివరిస్థితిగా ముగించారు. మరి దీనికిమించి ఇంకేమీ ఉండబోదా? అది ఆ అద్వైతస్థితిలోనే తప్పనిసరిగా ఉంటుంది. నేను పైన వివరించిన స్థితిని దాటి ఇంకా ముమ్ముందుకు పోవాల్సి ఉంటుంది. వేదాలలో 'నేతి-నేతి' అనగా ఇదే కాదు,

ఇదే కాదు (ఇంతే కాదు, ఇంతే కాదు) అని ఘోషించబడింది అంటే దీనికి మించినది మరేదో ఉంది అని సూచిస్తుంది. వేదాల యొక్క తుదిపలుకునే అంతిమ హద్దుగా జనం ఎందుకు భావిస్తున్నారో నాకు అర్థం కావటం లేదు. బిటియా! నా వాదన అయితే ఇదే, దీనిని జనం నా అహంకారంగాను లేదా మరో రకంగాను భావించవచ్చునేమోకాని, ఈ వాస్తవాన్ని ప్రకటించటానికి నేను సాహసిస్తున్నాను. నా వయస్సు మరియు అభ్యాసించేవాని (Disciple) వయస్సు దైవం ఇంకా ఇచ్చినట్లయితే, పదివేల సంవత్సరాలవరకు నేను ఒక చిన్న విషయంమీద బోధించటం, చర్చించటం చేయగలను. నేను తీసుకున్నటు వంటి పాయింట్ చాలా చిన్న విషయం, కాని ఇటువంటివి మానవునిలో కోటానుకోట్లుగా ఉంటాయి. ఈ చిన్న విషయాన్ని ఎవ్వరైనా తరచి చూడగలిగితే బయటపడే అద్భుత విషయాలు చూసి నివ్వెరపోతారు. ఇది ఇతరులను ఆలోచింపజేసే విషయమే కాదు, అందరికి నిర్దేశించబడుతున్నది ఏమిటంటే, ముందుగా వారు దైవాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. ఆ విధంగా దైవాన్ని గురించి తెలిసిన తర్వాత ప్రతి ఆధ్యాత్మిక విషయం వారు తెలుసుకోగలుగుతారు.

**పుస్తక (వ్రాతల్లో) దేవుణ్ని అందరూ చూడగలుగుతారు, కాని జీవించి ఉన్న దేవుణ్ని ఎవరో అరుదైన ఆధ్యాత్మిక వ్యక్తి మాత్రమే చూడగలుగుతాడు. ఒకవేళ అటువంటి వ్యక్తి ఎవ్వరైనా ఉండి, ఆ అసలు దైవాన్ని చూడటానికి ప్రయత్నించినట్లయితే ఈ రెండు దైవాలు (అనగా పుస్తకంలోని దైవం, జీవించి ఉన్న దైవం) ఆ నిజదైవం (అసలైన దైవం) యొక్క ఆత్మీయ ప్రతిబింబాలే అని గ్రహించబడుతుంది. ఎవ్వరైతే పూర్తిగా తనను శరణ మర్పించుకుంటాడో అట్టివాడే ఆ దైవాన్ని దర్శించుకోగలుగుతాడు. అతడు ఆ దైవానికి ఎంతగా అనుసంధానమైతే అంతగా సఫలీకృతుడవుతాడు. ఆ అనుసంధానం అనేది ఎలా ఉండాలంటే, అది పూర్తిగా లయమైపోయేట్లుగా ఉండాలి. దానితో అతనికి స్వంత ఉనికి కూడా తెలియకుండా పోవాలి. ఈ 'ఉనికి' అనే మాట ప్రయోగించటంలో నా ఉద్దేశ్యం అస్థిత్వం, అస్థిత్వలేమి (Being, Non-Being) అనేవి అతని తలంపుకు రాకూడదు, అంటే ఈ రెండింటినీ మరచిపోవాలి.**

నీవు ఎడారి వంటి మైదానం గురించి వ్రాశావు. ఇది చాలా మంచి స్థితి. నేను తరచుగా చెప్పినటువంటి ఈ విశాల మైదానం కూడా చాలా సూక్ష్మమైనది. ఒక విధంగా చెప్పాలంటే, అది ఒక బంజరుభూమి లాంటి దృశ్యాన్ని తలపింపజేస్తుంది. ఇది చాలా శ్రేష్టమైన స్థితి. దీని తర్వాత, దైవం తలిస్తే, దీనికంటె కూడా ఇంకా బంజరు మైదానాలు నీ కళ్ళకు కట్టతాయి. ఆ స్థితిని పొందాక నీవు వ్రాయి.

నీవు జూలై 25వ తేదీన వ్రాసిన ఉత్తరంలో విశ్వాసం మరియు భక్తి నిరూపించబడుతున్నాయి. అంతకుమించి ఇంకేమీ లేదు, కనుక జవాబు వ్రాయవలసిన అవసరం లేదు.

జూలై 31వ తేదీ రాత్రి 12 గం. 10 ని॥ల సమయంలో, నీ గమనం ఒక్కసారిగా ఆగిపోయి, ఆ స్థితిలో మృత్యువాతపడినట్లుగా నాకు అనిపించింది. అయితే ఐదు నిమిషాల తర్వాత నీవు అలాగే ఉండి కూడా అదే మైదానంలో మళ్ళీ ప్రయాణించసాగినట్లుగా నేను గమనించాను. ఈ మైదానం, కుడివైపున ఒక మారుమూలన ఉంది. ఇది రాత్రి సమయం కావటంచేతను, పని భారంచేత మనస్సు అలసిపోయి ఉన్న కారణంగాను, అది బాగా అవగాహనకు రాలేదు. ఈ విషయాన్ని నేను పునరాలోచించి వ్రాస్తాను. అలాగే నీవు కూడా బాగా ఆలోచించి వ్రాయి. మృత్యుస్థితి ఇకమీదట ఉండబోదు. అమ్మకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 415

లఖీంపుర్,

04.08.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉంటుందని ఆశిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు కొంత అల్పమైన దశ ఏర్పడింది. దానిని రూపకల్పన చేయటానికి గుండెలో భంగపాటు కలగటంతో కొంత భయంగా ఉంటోంది. బహుశా దీనివలన కొంత భారీతనం కలగనున్నదేమో. ఇంతేకాదు, ఈశ్వరుని తలిస్తే కూడా కొంత విసుగు మరియు భయం కలుగుతున్నాయి.

నా పరమ పూజ్య బాబూజీ, మనస్సు యొక్క పరిస్థితి ఎలా ఉందంటే, అది ఎప్పుడైనా నిద్రించటంగాని, అలసిపోవటంగాని, బద్ధకించటంగాని జరగటం లేదు. ఈ కారణంగానే శరీరంపైన కూడా ఎటువంటి చిహ్నం ఏర్పడటం లేదు. 'మాలిక్' ఆదేశిస్తే రాత్రి అంతాగాని, పగలంతాగాని సాధనలో నిమగ్నమై ఉంటాను. ఈ విషయం ఏమిటో తెలియకుండా ఉంది, ఒకే ఆసనంలో కూర్చుని ఒక్క గంటసేపు మాత్రమే ధ్యానం చేసినప్పటికి నా ప్రతినాళం, ప్రతిసారి ధ్యానంలో నిమగ్నమై ఉంటోంది. నా కణకణం, నరనరమూ సరళత్వంలో స్థిరత్వం పొందినట్లు అనిపిస్తోంది. గత రెండు రోజుల నుండి దశ యొక్క రూపం అత్యంత శుద్ధంగా ఉన్నట్లు అనిపించలేదు, కాని ఇప్పుడు అది పూర్తిగా శుద్ధమై స్పష్టంగా ఉంది. నా కణకణం మేల్కొనియే ఉంటోంది. ఇప్పుడు ఉన్న ఇంకొక స్థితి ఎటువంటిది అంటే, నాకు ప్రతి మానవుని దశ నా దశలాగానే ఉన్నట్లు భావన కలుగుతోంది. బాబూజీ, నా లోపల కణకణమూ స్థిరంగా, నిలకడగా ఉన్నట్లు అనిపిస్తోంది. నాలోపల ఉన్న దశ ఎటువంటిది అంటే, కణకణం దప్పికతో పైన మాత్రమే నిలిచి ఉంటున్నట్లుగాను, ఏమీ తెలియనిస్థితిలో కూడా పైవంకే చూస్తున్నట్లుగాను అనిపిస్తోంది. అంతేకాదు, ఆధ్యాత్మికతలో ఎవ్వరూ తక్కువకాదు అన్నట్లు ఉంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. శ్రీ బాబూజీ, అప్పుడప్పుడు ఎందుకోగాని ప్రతియొక్క తంతువూ అధైర్యపడుతున్నట్లుగా అనిపిస్తోంది. ఎందుకంటే, 'మాలిక్'పట్ల నా ప్రేమ వృద్ధి చెందటం లేదు. నా కళ్ళు తమరిని చూడటానికి ఎప్పుడూ దప్పికతోనే ఉంటున్నాయి. దయచేసి తమ రాక యొక్క తారీఖు తప్పక వ్రాయగలరు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 416

లఖీంపుర్,

05.08.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమ' ఉత్తరం నిన్న చేరింది, చదివి సంతోషించాను. జూలై 31 రాత్రి గం. 12.10 ని॥లకు గమనం (పురోగతి) ఒక్కసారిగా నిలిచిపోయిందని, మృత్యువు వచ్చేసింది అన్నట్లుగా అనిపించింది అని 'తమరు' వ్రాశారు. దీనికి సమాధానం నేను దీనికిముందు ఉత్తరంలోనే వ్రాశాను. ఏమంటే, రెండు రోజులపాటు దశ పూర్తిగా అవిశ్రాంతిగాను, స్వచ్ఛత లేకుండాను ఉంది. కాని నా కొరకు నిన్న నాకు చేరిన ఉత్తరం, తమరు వ్రాయిస్తూ ఉన్న సమయంలో అదే రోజున అదే సమయానికి సరిదిద్దుకుంది. మృత్యువైతే పూర్తిగా లేదుకాని, అది ఏమైంది, ఎలా

అయ్యింది అని 31వ తారీఖు రాత్రి కలిగిన దశ గురించి నాకు చాలా చింత కలిగింది. నా వలన ఎటువంటి తప్పిదం జరగలేదు కదా! లేదంటే, ఆ 5 నిమిషాలు 'మాలిక్' జ్ఞాపకం లేకుండా గడిపి ఉంటానా? 'మాలిక్' పాదాలవద్ద ఎప్పటినుంచి అయితే ఉన్నానో, అప్పటి నుండి ఈ 5 నిమిషాలు కూడా 5 సంవత్సరాలు వృధా చేసినట్లు అనిపిస్తోంది. 'మాలిక్' జ్ఞాపకమే అయితే లేకుండా పోయిందో ఏమో, ఈ మృత్యువు కలిగి ఉండవచ్చును. ఎందుకంటే, ప్రాణం లేకుండాపోతే జీవనం ఎలా ఉంటుంది? దయచేసి తమరు వివరణ వ్రాయండి. నేను ప్రయత్నం చేస్తున్నప్పటికీ, ఇప్పుడే కాదు, ఇంకా భవిష్యత్తులో కూడా, ఒకవేళ ఇసుమంతైనా ప్రేమ ఉంటే, అది కూడా కళంకితం కాకూడదని ఇంకా ప్రయత్నం చేస్తాను. ఇదే కాకుండా, జ్ఞాపకానికి సంబంధించి ఏమైందో ఏమోకాని, నా ఆంతరిక దృష్టి కూడా స్థిరంగాను, చైతన్యరహితంగాను అయిపోయింది. కాని ఒక దప్పికగా ఉన్నవానిలాగ పైకిలేచి ఉండి నిశ్చలంగా అయిపోయింది. దానిలో 'ఉంది' అను అనుభూతిగాని, 'లేదు' అను అనుభూతిగాని లేనట్లు ఉంది. కళ్ళలో రాళ్ళు ఉన్నట్లుగా అయిపోయాయి. కేవలం 'మాలిక్'యే నా జీవిత నౌకను నడుపుతున్నారు. అందువలన నేను ఏ విధంగాను చింతించటం లేదు. కాని నాకు మాత్రం వ్యాకులంగా ఉంది, అదే నా ప్రాణం, అదే నా జీవనాధారం.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 417

లఖీంపుర్,
10.08.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

నా పరమపూజ్య బాబూజీ! 7వ తారీఖున ఏమైందో ఏమోకాని, ఏదో ఆటంకం ఏర్పడినట్లు ఉంది. దానిని నేను వివరించలేకపోతున్నాను. హృదయం తల్లడిల్లుతున్నట్లుగాను, విరక్తి చెందినట్లుగాను ఉన్న స్థితి ఏర్పడింది. దానివలన నాకు సాధన చేయాలన్నా, 'మాలిక్' గురించిన ధ్యానం చేయాలన్నా కూడా ఏమాత్రం రుచించటం లేదు. హృదయంలో వినమ్రత లేకపోవటమే కాకుండా, స్వచ్ఛత కూడా లేదు. కాని దుడుకుతనంగాని, తెగబడటంగాని లేదు. స్థిరత్వం మరియు ఏకాగ్రత కూడా లేవనిపిస్తోంది. నిన్న మొన్నటి నుండి దిగులు మరియు ఎగసిపడటం సద్దుమణిగాయి. ఇలా ఎందుకు అవుతున్నాయి అంటే, ఇది నా దశ యొక్క మాలిన్యాన్ని శుభ్రపరచటానికి లేదా ఆటంకాలను తొలగించటానికేమో అన్నట్లు ఉంది. అయితే పూర్తిగా సరియైనదేదో తమకే తెలియాలి, దయచేసి అది నాకు తెలియజేయండి.

నిన్న మధ్యాహ్నం పూజ గదిలో పండుకొని ఉండగా నిద్రపట్టింది. ఏమైందో ఏమోకాని ఆ నిద్రలో, నిద్రపట్టినప్పటినుండి నిద్రలోనే దప్పిక కలిగిన స్థితి ఎలా ఉందంటే, ఎంతగా త్రాగినప్పటికీ ఇంకా దప్పికగానే అనిపించింది. అలా త్రాగటానికి అంతూ పొంతూ లేకుండాపోయింది. కళ్ళు తెరచేసరికి అంతులేని దప్పికతోనే లేచాను. నా దశ ఎలా అనిపిస్తోంది అంటే, దానిలో 'మాలిక్' ప్రేమ కూరి కూరి నింపబడినట్లు లేదు. అందుచేత పూర్తిగా నిండకుండా ఇంకా ఖాళీయే ఉన్నట్లు అనుభవమవుతోంది. ఇంకా ఏమనిపిస్తోందంటే, దశలో ఇంకను జీర్ణించుకొనగల సత్తా ఉన్నప్పటికీ, అలా జీర్ణించుకోవటానికి ఇంక ఏ వస్తువు లేనందున ఖాళీగా ఉండిపోతోంది అని భావించాల్సి వస్తోంది. బాబూజీ, దశలో ఆనందం మూలంగా శరీరం ఉప్పొంగిపోతోందని నేను వ్రాసినటువంటిది, ఇప్పుడు

7,8 రోజులనుండి ఒక్కసారిగా ఆ రోజునుంచే అనగా జూలై 31వ తేదీ నుంచి పూర్తిగా ముగిసిపోయింది. ఇప్పుడు ఈ దశ ఎటువంటిది అంటే, దశలో ఉప్పొంగటంగాని, నిస్పృహ చెందటంగాని, హృదయం భారంగా అనిపించటంకాని లేదు. అంతేగాకుండా, హృదయం మీద ఒక రకమైన గ్రుచ్చుకోవటంగా ఉంది. దానిలో నిస్సహాయ దశ మిళితమై ఉంది. దిగులు జ్ఞాపకానికి వస్తోంది. శ్రీ బాబూజీ, ఇప్పుడు ఉల్లాసంగాని, ఉత్సాహంతో చిందులు వేయటంగాని లేకపోగా హృదయమే కాదు నా నరనరమూ వ్యాకులంగా ఉన్నాయి. నా జీవిత కాలంలోనే నిజంగా నేను నా 'మాలిక్'ను పొందగలను అను దృఢ నిశ్చయంతో ఉన్నాను. తమరు రాబోతున్నారు, రేయింబవలు ఇదే ఉత్సాహం నెలకొని ఉంటోంది. అమ్మ ఆరోగ్యం బాగుంది. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. తమరి రాకకు ఇంకా 9 రోజులు వ్యవధి మాత్రమే ఉంది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 418

షాజహాన్‌పూర్,
18.08.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం జూలై 25వ తేదీదానికి జవాబు ఇస్తున్నాను. నీ ఉత్తరం రెండవ భాగంలో చాలా విషయాలు వ్రాశావు. దానిలో ఒకచోట 'మాలిక్' యొక్క ధ్యానమే నిరంతరం కలిగి ఉంటున్నట్లుగాను, ఆ ధ్యాన భావన నీలో స్పందన కలిగిస్తున్నట్లుగాను వ్రాశావు. **లయ–అవస్థ వృద్ధి చెందుతున్నప్పుడు, 'మాలిక్' మరియు అభ్యాసీ మధ్యగల సంబంధం గాఢతరమవుతూ ఉంటుంది. 'మాలిక్' ధ్యాసలో అభ్యాసీ శూన్యమైపోతూ ఉన్నప్పుడు, 'మాలిక్'లో ఆధ్యాత్మికతకు సంబంధించినవి ఏవైతే ఉన్నాయో అవి అభ్యాసీలో కలుగుతూ ఉంటాయి. ఆ విధంగా అవి ప్రవేశిస్తున్నందువలన ఇద్దరి దైవికస్థితి సమానస్థాయిలోకి వస్తుంది.** ఇది లయ–అవస్థకు చెందిన మంచి స్థితి అని చెప్పాలి. నీలో ఈ లయ–అవస్థ ప్రారంభమైనందుకు దైవానికి ధన్యవాదా లర్పిస్తున్నాను. నా ఆభ్యాస కాలంలో నాకు కూడా ఇదే అనుభవం కలిగింది. **'మాలిక్'ను స్మరిస్తూ అభ్యాసీ, తన అస్థిత్వాన్ని మరచిపోవటాన్ని నిజమైన భక్తికి నిదర్శనంగా చెప్పవచ్చు. తన యొక్క ఉనికి తెలియకపోవటం అంటే మనలో ఉన్నవన్నీ పూర్తిగా తొలగిపోయి మన స్థానంలో దైవం నిలిచి ఉండటమే.** ఇది ఎప్పుడు జరుగుతుందంటే, మన ఉనికి యొక్క ఉనికి కూడా లేకుండాపోయినపుడు, ఒక శ్రేష్టమైన స్థితి కలుగుతుంది. ఆ సందర్భంలో స్పృహ కోల్పోవడానికి బదులుగా ఒక విధమైన స్పృహ కలుగుతుంది. దాని అర్థం ఏమిటంటే, స్పృహ లేకపోయి కూడా కలుగునట్టి స్పృహ (స్పృహ లేకపోయిన దానిలో కలిగే స్పృహ ఒక ప్రత్యేకతను కలిగి ఉండి, అది ముందుగానే ప్రారంభమై, దాని ఆఖరి హద్దు చాలాకాలం తర్వాత కలుగుతుంది) ఒక రకమైన స్మరణగా అర్థం చేసుకోవాలి. అది స్మరణయే కాదు జీవితం యొక్క నిజస్థితిగా ఉంటుంది. మరి ఇంకేమి అవుతుంది? తన యొక్క జ్ఞాపకంగాని, 'మాలిక్' యొక్క జ్ఞాపకంగాని లేకుండా పోతుంది. నా ఉత్తరాలలో మున్ముందు రాబోయే విషయాలను కూడా వ్రాస్తూ ఉంటాను. "వారు నాకు దేనిని తెలియజేస్తారో, దానిని తెలుసుకోగలుగుతాను" అని నీవు వ్రాశావు. నీవు పరిపూర్ణస్థాయిలో ఆత్మ, శరణాగతిని కావించినట్లుగా దాని అర్థంగా తెలుసుకోవాలి. ఇంకా "నాలో ఉన్న కొద్ది ఆలోచనా శక్తిని కూడా 'మాలిక్' పూర్తిగా తనవైపు లాగేసుకున్నాడు" అని వ్రాశావు. దాని అర్థం ఏమిటంటే, దైవం అనుగ్రహిస్తే ఆ స్థితి నీలో త్వరలోనే కలుగుతుంది. దీనిని కబీరు ఈ విధంగా వర్ణించాడు:

**"మన్ థిర్, చిత్త్ థిర్, సూరత్ థిర్, థిర్ భయా సకల్ శరీర్**

**తాకె పీఛె హరి ఫిరై, కహై కబీర్ - కబీర్"**

మనస్సు, చిత్తం, జ్ఞాపకం, సమస్త శరీరం స్థిరత్వాన్ని పొందాయి. దాని వలన కబీర్, కబీర్ అంటూ దైవం నా వెంటబడ్డాడు. "నా ఆనందమే 'మాలిక్' యొక్క ఆనందం" అని కూడా వ్రాశావు. ఇది చాలా శ్రేష్ఠమైన స్థితి. సూఫీతత్వంలో దీనిని 'తస్లీమ్-బరజా' అని అంటారు.

నీ ఉత్తరం ఆగష్టు 5వ తేదీది నాకు ఆగష్టు 14న చేరింది. దానికి జవాబు వ్రాస్తున్నాను. రాత్రి 12 గం. 10 ని॥లకు నీలో మృత్యువు వంటిది కలిగి, ఒక శక్తి తలయొక్క ఎడమ భాగం నుండి దాని స్థానం నుంచి దిగిపోతున్నట్లు అనిపించింది. ఇది చెడ్డ విషయం ఏమీ కాదు. నీ ప్రయాణం నెమ్మది నెమ్మదిగా సాగుతోంది. ఏ అభ్యాసీలోను ముందుకు పోగల శక్తి ఉన్నట్లుగా నాకు కనిపించటం లేదు. ఈ సందర్భంలో నేను 'గురు' శబ్దం ప్రయోగిస్తున్నాను. అయితే, గురువు యొక్క శక్తి మాత్రమే ముందుకు నడిపిస్తుంది అను ఆలోచన నాకు ఎప్పుడూ కలిగి ఉండలేదు. **మరి ఈ గురువు ఎవ్వరు? ఆ గురువు లాలాజీ సాహెబ్‌కాగా ఆ దివ్యశక్తి వారిదే.** ఒక్క కుదుపు ఇచ్చినట్లయితే నీవు ఆ స్థానం నుంచి దాటిపోతావు. ఎడమవైపు నుంచి శక్తి ఎందుకు దిగిపోతోంది? దానిని ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు. నదిలో ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు కుంటలు, కాలువలు ఎటు అవకాశం ఉంటే అటు దారి తీస్తూ ఉంటుంది. నీవు క్రమక్రమంగా ప్రయాణం సాగించి జీవనమోక్ష దశను సాధించావు కాని దానిలో నీవు పూర్తిగా లయం కావటం ఇంకా మిగిలి ఉంది. నీవు పూర్తిగా ఆరోగ్యవంతమయ్యాక, ఈ స్థితిలోని ఆనందం నీకు మరొకసారి అనుభవింపజేయాలని అనుకుంటున్నాను. **ఈ ఆధ్యాత్మిక స్థితి వేదాలను ఆశ్రయించినవారికి వారు వాటికి బానిసలుగా ఉన్నంతకాలం దక్కడం దుర్లభం. ఎవరైతే (ఏ అభ్యాసియైనా) ఏ మూల్యం లేకుండా అమ్ముడుపోతాడో (శరణాగతి పొందుతాడో) సదరు వ్యక్తి (శ్రీ బాబూజీ మహరాజ్) కూడా అదే విధంగా మరొక్కరికి (లాలాజీ సాహెబ్‌కు) అమ్ముడుపోయినవాడై ఉన్నప్పుడు, అనగా శరణాగతి చెందినవాడైనప్పుడు అతడు (అటువంటి అభ్యాసీ) అదృష్టవంతుడవుతాడు.**

ఆగష్టు 4వ తేదీ ఉత్తరానికి సుదీర్ఘమైన సమాధానం కాకుండా రెండు మాటల్లో జవాబు ఇస్తున్నాను. "భగవంతుని పేరు కూడా ఇప్పుడు విసుగు, ఆందోళన కల్పిస్తోంది" అని వ్రాశావు. 'అతడి' గురించిన ఆలోచన మరియు ధ్యానం కూడా ఆందోళ కలిగిస్తూ ఉండవచ్చు. అసలు విషయం ఏమిటంటే, ఆలోచన వలన ద్వంద్వం ఏర్పడుతుంది, కాని నీవు ప్రశాంత స్థితిలో ఉన్నావు, అది భగ్నమవుతున్నందువలన ఆందోళన కలుగుతోంది. ఎవరో కవి ఇలా చెప్పారు:

**"సిర్క్ (దుఃఈ) సె ఖాలీ నహిం, ఐశేఖ్ జీ తాఅత్ (పూజ) కోయి,**

**ఖ్వాహ్ బుత్ (మూర్తి)కి పూజియె, యా లీజియె నామే అల్లాహ్"**

మూర్తిపూజ చేసినా లేదా నామజపం చేసినా, హృదయంలో ద్వైత భావం కలుగుతుంది అని అర్థం.

**ఎవ్వరైతే (శ్రీ బాబూజీ మహరాజ్) మరెవ్వరికో (లాలాజీ సాహెబ్) శరణాగతుడైపోయి ధన్యజీవి అయ్యారో అటువంటివారికి శరణాగతులైనవారు (అభ్యాసీ) భాగ్యశాలవుతారు.**

"ప్రతి ఒక్కరి స్థితి నా స్థితిలాగానే ఉంది" అని నీవు వ్రాశావు. దానికి అర్థం ఏమిటంటే, నీవు బాగా 'ఆత్మమయం' అయిపోయావు కనుక అలా అనిపిస్తుంది. అనగా నీవు 'ఆత్మ' స్థితిలో బాగా లీనమైపోయావు కనుక నీవు అందరిలోను దానినే చూస్తున్నావు.

ఇప్పుడు ఆగష్టు 10వ తేదీ ఉత్తరానికి జవాబు ఇస్తున్నాను. నీ ఉత్తరంలో 2వ పేరాకు జవాబు, నీకు 5వ తేదీ ఉత్తరానికి సమాధానం ఇచ్చిన దానిలో ఉంది. నీవు ఒక వాక్యం, "నేను నిజంగా నా 'మాలిక్'ను పొందగలనా?" అని

వ్రాశావు. అది చదివి నాకు బాగా నవ్వు వచ్చింది. అప్పుడు ఒక కవిత నాకు జ్ఞాపకం వచ్చింది.

**"రాహెః తలబ్‌మె ఐసె ఖుద్ రఫ్తాహెు రహేః హై, మంజిల్ పర్ హమ్ పహుంచ్ కర్, మంజిల్ కొ ఢూంఢతెహైః"**

అనగా మనం మజలీ (మకాం) చేరుకుని కూడా ఇంకా అది ఎక్కడ ఉంది అని వెతుక్కునేటంతగా మనం ఈశ్వరప్రాప్తిలో మైమరచిపోతున్నామన్న మాట. ఇది ఎలాంటిది అంటే, ఎవ్వరైనా చక్కెరతో తయారు చేసిన బొమ్మను తిని కూడా చక్కెర యొక్క తీపి అనుభవాన్ని పొందాలనుకోవటం వంటిది. ఇంక దానిలో ఉన్న భేదం ఏమిటి? అనగా ఆ వ్యక్తి చక్కెర బొమ్మను బొమ్మగా భావించి తింటున్నాడు, అయినా ఇంకనూ అతడు ఆ చక్కెర రుచి (తీపి)ని అనుభవించాలనే కోరికతో ఉంటున్నాడు. ఆ రెండూ ఒక్కటే. రుచిని గురించిన ఆలోచనయే తేడా, అది బొమ్మ కావటం మూలంగానే. నేను ప్రత్యేకించి ఒక వాస్తవం వ్రాస్తున్నాను, ఏమంటే, **చక్కెర అనేది బొమ్మ కానేకాదు, అయితే బొమ్మలో చక్కెర ఉంది. అనగా బ్రహ్మం, జీవుడులో కూడా ఇదే భేదం ఉంది. జీవుడు బొమ్మ అయితే చక్కెర బ్రహ్మ అన్న మాట.** నీ హృదయంలో తపన గురించి, దానివలన కలిగే అశాంతి గురించి వ్రాశావు. ఈ కలత, 'మాలిక్' మరియు భక్తుడు, పాలలో పంచదారలాగ, అనగా చక్కెర పాకం కానంతవరకు ఏదో రూపంతో ఉంటూనే ఉంటుంది. నాకు ఆ స్థితి కలిగినపుడు, 12 సంవత్సరాల తర్వాత శాంతి సమకూరింది. **నీ ప్రతి ఉత్తరానికి జవాబు వ్రాయటానికే నేను ప్రయత్నిస్తున్నాను. ఎందుకంటే, నీ ఉత్తరాలు, నా జవాబులు కలిపి ముద్రింపజేయాలని అనుకుంటున్నాను. దానివలన సామాన్య ప్రజలందరికీ మేలు కలుగుతుంది.**

అమ్మకు ప్రణామాలు అందజేయి.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 419

లఖీంపుర్,
23.08.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' మరియు తదితరులు క్షేమంగా చేరి ఉంటారని భావిస్తున్నాను. కాని బస్సు ప్రయాణం మూలంగా కొంత అసౌకర్యం కలిగి ఉండవచ్చు. కేవలం మా అందరిమీద కృపను వర్షింపజేయటానికని 'తమరు' ప్రయాణంలోని కష్టాన్ని, డబ్బును ఖర్చుపెడుతున్నారు. ఇటువంటి మంచి చేయాలని ఎవరికి ఉంటుంది? ఇంతకుముందు 'తమరు', నిన్న ఇక్కడే ఆగి ఉండాలని తలంచినట్లుగా తెలిసింది, కాని 'తమరు' వెళ్ళిపోయారు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఇటువంటి దశ నడుస్తోంది. 'తమరు' 19వ తేదీ రాత్రికి ఇక్కడకు వచ్చాక, తమ ఎదుటనే ఉండి కూడ, దశలో ఒక నిర్జీవమైనటువంటిది (నైరాశ్యం) పెరుగుతూ వచ్చింది. అసలు ఆనందం మరియు రుచి ఎటువంటివైనాగాని, నా శరీరంలోని రోమ రోమంలోనూ వెదికినా దొరకనట్లుగా ఉంది. వ్యాకులత, నిస్పృహలతో కూడినదే నా దశగా ఉండి, అది నా జీవితంలో పదిలంగా ఉండిపోయింది.

ఇంకా ఎటువంటి దశ అంటే, 'మాలిక్'ను కలవాలి, దర్శించుకోవాలి అనే కోరిక యొక్క తాపమే ఉంటోంది. కాని, ఎప్పుడైతే ఎదుట ప్రత్యక్షమవుతారో, అప్పుడు కూడా శక్తి లేకపోయి, తపన మరియు వ్యాకులత పెరుగుతున్నాయి. శాంతి పత్తా లేకుండా పోయింది. ఆనందమైతే ఇంకా విశ్రాంతి లేకుండా చేస్తోంది. ఇప్పుడు చల్లదనం నుంచీ వేడిమి కలుగుతోంది. అయితే అది (వేడిమి) అగ్నిని రగల్చటం లేదు. బాబూజీ, ఇంతకూ యదార్థం ఏమిటంటే, ఇప్పుడు

నేనులేను, నా 'మాలిక్'గాని, 'అతని' జ్ఞాపకంగాని లేనట్లే ఉంది. ఎందుకంటే, ఇప్పుడు దిగులు, తపనతప్ప నా దృష్టిలో ఇంకేమీ లేవు. అవి లేకుండా నా జీవితానికి అర్థమే లేదనిపిస్తోంది.

బాబూజీ, ఇప్పుడు లయావస్థను గురించిన కోరికగాని, అభిరుచిగాని ఎందుకో లేకుండా పోతున్నాయి. ఇంకా ఏమిటంటే, లయావస్థను స్పర్శించగానే హృదయంలో భయాందోళన కలుగుతోంది. ఇప్పుడైతే నాకు ఆ రోజే సమీపించనున్నట్లు ఉంది, ఏరోజునైతే నా కాళ్ళూ చేతులు పనికిరాకుండాపోయి, స్వయంగా నా 'మాలిక్'యే నాలో లయమవుతాడో ఆరోజు. అప్పుడింక నా హృదయం కూడా భీతి చెందదు. ఎందుకంటే, తరచుగా 'అతడు' స్వయంగా నాలో లగ్నమై ఉండి, నన్ను దారిలోకి తెస్తున్నాడు. ఇంకొక విషయం ఏమిటంటే, నాకు అసలు ఆ దారియే అనుభవం కావటం లేదు. అదేమిటో నా 'మాలిక్'కే తెలియాలి.

ఆగష్టు 21వ తేదీ సాయంత్రం, ఎప్పుడైతే 'తమరు' నన్ను పూజలో కూర్చుండబెట్టారో, అప్పటి నుండి, 'మాలిక్' కృపతో నేను చాలా సామాన్యమైన మరియు సహజమైన దశలో ప్రవేశిస్తూ ఉన్నట్లు అనిపిస్తోంది. ఇంక అప్పటినుండే నాలోని తీవ్ర స్వభావం, అసహజత్వం వంటివి తొలగిపోయినట్లు అనుభవమైంది. ఆ విధంగా ఇటీవల దశ స్థిర రూపం చెందనట్లుగాను, చక్కర్లు కొడుతున్నట్లుగాను, సమత్వం కూడా లేకుండా ఉన్నట్లుగాను అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, దశలో స్థిరంగా కూర్చునే స్థానమే లేకుండాపోయింది. ఇదంతా కూడా ఆ రోజు సాయంత్రం నుంచే జరుగుతోంది. ఇప్పుడు మళ్ళీ దశలో ఇమిడిపోతూ ఉండే అవకాశం కలిగినట్లు అనిపిస్తోంది. నా పరమపూజ్య బాబూజీ! ఇప్పుడు చేయూత లేకుండా ఒక్క అడుగైనా ముందుకు వేయలేకపోతున్నాను. ఎందుకంటే, ఇప్పుడు కళ్ళలో వెలుగులేదు, ముందుకు పోగలశక్తిగాని, అనుభవానికి మార్గంకాని కనిపించటం లేదు.

బాబూజీ, ఈ దశలో, నాకు అనుభవం లేదా అవగాహన ఉన్నంతలో ఏమి అనిపిస్తోంది అంటే, స్పృహ యొక్క స్పృహ కూడా కోల్పోయిన తర్వాత కూడా లోపల ఏ స్పృహ అయితే మేల్కొల్పుతూ ఉందో 'మాలిక్' కృపతో, ఈ స్పృహలో ఏమీలేదు అని ధృవీకరించుకున్న తర్వాత నడుస్తున్న ఈ దశ యొక్క ఏదో తళుక్కు మాత్రం అనుభూతి చెందుతున్నాను. కనుక దీని విషయంలో తమరు ఏది వ్రాస్తే అదే సరైనదవుతుంది. నేనెంత, నా అవగాహన ఎంత! ఈ చైతన్యం కూడా, ఒక ఆవేదన, పోటు, బాధయే అనిపిస్తోంది. అవి 'మాలిక్' అనుగ్రహించిన ప్రకాశం మరియు వరప్రసాదం. అది నాకు ముందుకు సాగిపోవటానికి మార్గం చూపేదిగా ఉంటుంది. నా పరమపూజ్య బాబూజీ! ఇప్పుడు దశను చూస్తున్నా కూడా ఏమీ చూడనటువంటి దశగా ఉంది. ఇలా ఎందుకో నాకు తెలియటం లేదు. తమ ఎదుట కూర్చుని ఉండగా కూడా ఇది నా అనుభూతికి ఎందుకు రావటం లేదో తెలియటం లేదు. ఇటువంటి వెర్రివాని వంటి దశలో ఏమి కలిగిందంటే, ఎవరైనా రావలసి ఉందనుకుంటే, వారు త్వరగా రావాలను తపన, వారే గనుక వచ్చి ఉంటే, ఒక విస్మృత స్థితి వంటిది అనగా చూసి కూడా చూడనట్లుగాను, వారు తిరిగి వెళ్ళిపోయి ఉంటే, అయ్యో వెళ్ళిపోయారే అను బాధ కలుగుతోంది. బాబూజీ, నా ఆంతరిక దృష్టి కూడా పోతున్నందున, నేను నా 'మాలిక్'ను సరిగ్గా చూడలేకపోయాను. అంతేకాదు అనగా చూడటమేకాదు, హృదయమైతే 'మాలిక్'ను దానిలో (హృదయంలో) నిలుపుకోవటానికి వ్యాకులపడుతూ ఉండగా అలా చూడలేకపోయిన దోషం కళ్ళకు ఎందుకు అంటగట్టాలి. 'మాలిక్' యొక్క దర్శనాలు అయితే హృదయం యొక్క ఆ తంతువును (తీగను) స్పర్శించాయి అని అనిపించింది. దానితో నా ప్రతికణంలోను నిరంతరం ఘల్లు ఘల్లుమని మ్రోగుతోంది. నా ప్రతి అణువు ఖంగు ఖంగుమంటోంది. ఆ ఖంగు ఖంగుమను శబ్దానికి ప్రతిధ్వనిగా ఆనందం ఉంటోంది. నా హృదయమైతే వశంలో లేకుండాపోయింది, దానిని వశం చేసుకోవాలి అని కోరుకుంటూ ఉన్నాను కాని నా హృదయంలో ఏదో పగ్గం లాంటిది (ఏదో నియంత్రణ) ఉన్నట్లు అనిపిస్తోంది. అదేమిటో నాకు తెలుసు. అది 'మాలిక్' ఇష్టం. దాని వలన నా హృదయంలో కొంత ఊరట వంటిది కలుగుతోంది. అలాకాకపోతే ఈ ప్రపంచంలో, నా హృదయంలో పగ్గం

లాగిపట్టు సాధించే శక్తి ఎవ్వరికీ లేదు. ఇది నా 'మాలిక్' నియంత్రణయే. ఈ విధంగా ఆలోచన కలుగుతూనే హృదయంలో సమాధానం వంటిది కలుగుతుంది. నేను ఇదివరలో, నా స్థానంలో 'మాలిక్' మాత్రమే ఉన్నాడు అని వ్రాస్తూ ఉండే దానను కదా! కాని ఇప్పుడైతే 'నేను' లేను, 'అతడు' లేడు, 'అతని' జ్ఞాపకం లేదు అను స్థితిలాగ ఉంది. నన్ను పూర్తిగా విస్మృత (స్పృహలేని) స్థితికి గురికాకుండా నిలుపుతున్నది ఆ చైతన్యం మాత్రమే. నేను బహుశా ఆ చైతన్యంలోనే ప్రవేశిస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఏమీలేదు అను దాని అట్టడుగులో నేను జీర్ణించుకుపోతున్నట్లు ఉంది.

నేను తమకు మాత్రమే ఇవన్నీ వ్రాస్తున్నాను. నా ఉదరం బాగానే ఉంది. ఇంక ఆరోగ్యం అంటారా, దాని పరమాణువులను రక్తనాళాలు పీల్చుకోవటం ప్రారంభించాయి. 'తమరు' నింపుతూ ఉంటే, 3,4 రోజులవరకు రక్తనాళాలు నిశ్శబ్దంగా ఉంటున్నాయి, మళ్ళీ నెమ్మది నెమ్మదిగా పీల్చుకోవటం ప్రారంభిస్తున్నాయి. కొద్ది రోజుల తర్వాత వేగం పుంజుకుంటాయి.

తమరు ఏ ఉత్తరాలైతే నా కోసం వ్రాయించి తెచ్చారో, వాటిలో 'తమ' కృప మరియు ప్రేమ నిండుగా ఉన్నాయి. వాస్తవంగా నేనయితే భక్తి మరియు అర్పణల యొక్క అన్వేషణలో ఉన్నాను. 'మాలిక్' దయతో బహుశా సఫలీకృతురాలనవుతాను. ఇప్పుడు నేను ప్రతి ఒక్కరి దశ నాలాగ కాకుండా, నాకంటె మిన్నగాను, మంచిగాను ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. కేసర్ రెండు సంవత్సరాల ఉత్తరాలు మరియు తమ సమాధానాలను నకలు చేసింది. నేను కూడా అప్పుడప్పుడు చేస్తూ ఉన్నాను. కాశీరామ్‌గారు నా ఉత్తరాలు కావాలని అడిగారు, కాని వాటిలో ఏముంది? అందులో 'మాలిక్' యొక్క కృపాదృష్టి యొక్క ఒక చిన్న మహిమ మాత్రమే ఉంది.

అమ్మ తమకు ప్రేమాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 420

లఖీంపుర్,
31.08.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. బహుశా రేపు తమ కృపతో కూడిన ఉత్తరం వస్తుందని తలుస్తున్నాను. ఎందుకంటే, 'తమరు' వెళ్ళిన 3,4 రోజుల తర్వాత నాకు దశలో మళ్ళీ వత్తిడి (Force) పెరుగుతున్న అనుభవం కలిగింది. అది ఉదయమే మళ్ళీ తగ్గిపోయిందని అనిపిస్తోంది. బహుశా మొన్న రాత్రి ఏదో సమయంలో 'తమ' ఉత్తరం వ్రాయించి ఉంటారు. అందుకని ఈ విధంగా అనిపిస్తోంది. (బాబూజీ భావించినంతనే దాని ఫలితం కనిపిస్తుంది.) దశ పెరగని కారణంగా, పైకి ఎగరటానికి బలవంతం చేస్తున్నాను. అందువలన వత్తిడి (Force) ఉత్పన్నమవుతోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ స్థితి ఎలా ఉందంటే, 'సురత్' లేదా 'యక్–సుయీ' అనగా స్మృతి లేదా జ్ఞాపకం నాలో ఉన్నదా, లేదా అనేది తెలియటం లేదు. ఎందుకంటే, ఏకాగ్రతగాని, మరేదైనాగాని లేనందున నాకు అనుభవం కావటం లేదు. అన్నీ ఏకమైపోయినట్లు అనిపిస్తోంది. ఒక్కటైనదే కాదు, దానికి చెందిన తపన, ఆవేదన తప్ప ఇంకేమీ అనుభవానికి రావటం లేదు. ఇంకా ఏమిటంటే, నా అంగాంగాలేకాదు, ప్రతి రక్తనాళం, కణకణం నిశ్చలంగా ఉండిపోతున్నాయి అని అనిపిస్తోంది. ఆవేదనలో కూడా వీటిమీద ఎటువంటి ప్రభావం ఉండటం లేదు. ఆంతరిక దృష్టి పరిస్థితి కూడా ఈ విధంగా ఉండి నాలోపల జడత్వం ఏర్పడిపోయినట్లు అనిపిస్తోంది. ఆలోచనా శక్తి, గ్రహింపు శక్తి, ధ్యానం లేదా

స్థిరత్వం, ఏకాగ్రత లేదా స్మృతి అన్నీ చైతన్యరహితంగా (జడత్వం పొందినదిగా) అయిపోయాయి. లయావస్థ పరిస్థితి కూడా ఇలాగే అయిపోయి, దానిలో ప్రవేశించాలి అనుకుంటే దానిలో చలనమే లేకుండా పోయింది. తడారిపోయి ఉన్నట్లు అనిపిస్తోంది. దానిలో కూర్చున్నా కూడా తడవటం లేదు. బహుశా ఇందువల్లనే ఆలోచనలు గుమిగూడుతున్నాయి. ఇంకొక రకంగా చెప్పాలంటే, అవి నామీద దాడి చేస్తున్నాయి. అదేమిటో దైవానికే తెలియాలి. రేయనక, పగలనక ఆలోచనలు వస్తూనే ఉన్నాయి.

పూజ్య నా బాబూజీ! ఇప్పుడు దశ ఎలా ఉందంటే, వర్తమాన దశలో తడిసి కూడా మళ్ళీ తడారిపోయినట్లుగానే బయటపడుతున్నాను. ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, దశలో మునిగి ఉంటే తడిసినా, బయటకు వస్తే మాత్రం పొడిగానే ఉంటున్నాను. నీటిలో కమలదళాలు నీరంటకుండా ఎలా ఉంటాయో, నా దశలో కూడా అలాగే ఉంది. అప్పుడప్పుడు తమరు వ్రాసినది –"జనం ప్రాపంచికంగా విముఖత్వం చెందటానికి బదులు 'మాలిక్'తో విముఖత్వం చెందుతున్నారు" అనేది జ్ఞాపకం వస్తోంది. ఇటువంటి మరక నాకు ఎప్పుడూ అంటలేదు కాని, ఇది శాశ్వతంగా అసంభవం. ఇదే నా నిశ్చయం కూడ. కాని ఇప్పుడు ఏమైపోయింది? నిన్నటి నుండి దశలో వత్తిడి (Force) మళ్ళీ కలగటం లేదు. దశ చాలా తేలికైనదిగా ఉంది. దిగులు చెందిన హృదయంలో శాంతిని నెలకొల్పుతోంది. నా స్వభావంలో ఎప్పుడైనా ఉద్రేకం (వేడిమి) కలగవచ్చును కాని, దశలో మాత్రం ఇప్పుడు (వేడిమి) తాపం లేదు.

బహుశా నేను రేపటి నుండి సాయంత్రపువేళ ముప్పావు గంటసేపు సంగీతం నేర్చుకొనటానికి వెళ్తాను. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. తావూజీ కూడా తమకు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 421

షాజహాన్‌పూర్,
01.09.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీవు ఆగష్టు 23,24వ తేదీలతో వ్రాసిన ఉత్తరం అందింది. దానిని చదివి చాలా ఆనందించాను. నీకు ఎడారి ప్రాంతం యొక్క దృశ్యం కనిపించటం ప్రారంభం కావటం చాలా మంచి విషయం. **వసంతంలో ఉద్యానవన విహారం అందరికీ ఆహ్లాదం కలిగిస్తుంది. మౌనంగా ఉండేవారు ఉద్యానవనంలో విహరిస్తూ ఉంటారు, చంచల మనస్కులు వాద్య సంగీతంతోను, తప్పెట్లు తాళాలతోను తృప్తి చెందుతూ తమ ఆధ్యాత్మిక విహారం జరిగినట్లు భావిస్తుంటారు. అయితే తమ ప్రియతముని (అనగా దైవాన్ని) సదా స్మరించుకుంటూ ఉండే వారి ఆధ్యాత్మిక యాత్ర పూర్తిగా దీనికి భిన్నంగా ఉంటుంది. దైవాన్ని ప్రేమించేవారికి రణగొణ ధ్వనులతో పని ఏమిటి? భక్తునికైతే ఆ దైవం యొక్క ఉనికిని తెలిపేదే సంతృప్తినిస్తుంది. ఎప్పుడైతే మన ప్రాపంచిక మానసిక ఉల్లాసాలు సమాప్తమైపోతాయో అప్పుడు మాత్రమే 'అతడి' ఉనికి మనకు తెలుస్తుంది. ఆయన మాయలు, లీలలు దాటి ఉన్నతంగా ఎదుగుతాము.** ఆ మాయలు, మహిమలు, దాటిపోయినట్లు నీ స్థితి ఖరారుగా తెలియజేస్తున్నప్పటికీ, నీవు ఆ ఎడారిలో విహరించాలని కోరుకుంటున్నా కూడా ఆ ఆధ్యాత్మిక యాత్ర నీకు ఎందుకు సాధ్యపడలేదో అర్థం కావటం లేదు. నీ లేఖ సారాంశమంతా గ్రహించాక, నీవు లక్ష్యం చేరటానికి మొగ్గు చూపినప్పటికీ అది ఇంకనూ దూరంగానే ఉంది. బిటియా! నిజం చెప్పాలంటే, నీ యాత్రలో ముప్పాతికవంతు కూడా పూర్తికాలేదు. నీ ఉత్తరంలో వ్రాసిన లక్షణాలనుబట్టి నీవు అక్కడికి తప్పకుండా చేరతావు. నీవు "ఏదైనా చూస్తూ ఉన్నా కూడా నాకు చూడనట్లుగానే ఉంది" అని నీ దశను వ్రాశావు. దీనినిబట్టి "నెగేషన్" ప్రారంభం కాబోతున్నట్లు సంకేతపరుస్తోంది. ఇది దాని లక్షణాలే. నెగేషన్ ఇంకను చాలా దూరంలో ఉంది. నేను

ఇలా వ్రాస్తున్నందుకు నీవు విచారపడవద్దు. ఎందుకంటే, **మానవుడు ప్రయాణించి తీరాలని నిశ్చయించుకున్నప్పుడు, ఎన్ని మైళ్ళ దూరం ఉన్నప్పటికీ దానిని అధిగమించి చేరగలడు.**

"తమరు వస్తున్నట్లు తెలుపగానే త్వరగా రావాలని ఆతృత, వచ్చివెళ్ళేప్పుడు వెళ్ళిపోతున్నారను చింత కలుగుతున్నాయి" అని నీవు వ్రాశావు. ఇవన్నీ అమితమైన ప్రేమకు నిదర్శనాలు. నా సాధనాకాలంలో కూడా ఒకసారి నాకు ఇలాంటి స్థితియే కలిగింది. ఇప్పుడు నీకు బాగా అర్థమైందనుకుంటాను. ఇలాంటి స్థితియే ఒకరు పారశీ భాష ద్విపదలో వివరించారు. దాని అర్థం ఏమిటంటే, **"దర్శనం గురించి నాకు జ్ఞానం లేదు. దర్శనం కలిగినపుడు భరించలేనంతగాను, అది తొలగినపుడు సహించలేనంతగాను ఉంది"** అని. నేను ఈ స్థితిలో చాలా రోజులు ఉన్నాను. ఆ కష్టాన్ని సహించాను. ఈ కష్టం తొలగిపోయాక మరో కష్టం ఎదురైంది. అదేమిటంటే, ఎవ్వరైనా దేవుని పేరు వినిపించినపుడు గుండెను గుప్పిట్లో పెట్టుకుని ఉండిపోయి 'హా' అనే వాడిని. ఎవ్వరినైతే ప్రేమిస్తామో (దైవం) వారి పేరు వినగానే బాధ కలుగుతుంది, ఇదొక ఆశ్చర్యకరమైన విషయం. బిటియా! ఇంతేకాదు, ఆయన ఆ విధంగా నన్ను చంపివేసి (అహం) తనలో కూర్చుండ బెట్టుకున్నందుకు, నేను, ఆయన్ను కరుణామయుడని చెప్పనా లేక నిర్దయుడు అని చెప్పనా! ఇవన్నీ సులభంగానే లభిస్తాయని చెప్పక తప్పదు. ఈ విషయంలో మాస్టర్ సాహెబ్ (ఈశ్వర సహాయ్) ఖచ్చితంగా అదృష్టవంతుడే. ఎందుకంటే, ఆయనకు ఏ కష్టమూ లేకుండానే ఈ ఆధ్యాత్మిక ఉన్నతోన్నత స్థితులకు చేరుకున్నారు. ఇవన్నీ ఆయనకు కలిగినట్లు స్వయంగా తెలియకపోవటం జాలి పడాల్సిన విషయమే. నెమ్మది నెమ్మదిగా ఈ విషయాలు ఆయనకు అనుభవమవుతాయి. ఆయన అత్యున్నత స్థితులను అధిగమించారు. ఇటువంటి ఉన్నత ఆధ్యాత్మిక స్థితిని పొందిన మానవునికోసం ఎవరైనా వెదికినప్పుడు ఎక్కడా కనిపించకపోవచ్చు. అవును! **ఆధ్యాత్మిక స్థితుల యొక్క అనుభవాలు, అనుభూతులు కలిగి ఉన్న నీవు ఒక్కరివే మన మిషన్‌లో ఒక నమూనాగా (ఉదాహరణగా) నిలిచి ఉన్నావు.**

నీవు వ్రాసావు– "ప్రతి మనుష్యుడు, చివరకు బాలుడుతోసహా ఇప్పటి నా స్థితిలాగా లేకుండా నా కంటే ఉన్నతంగా కనిపిస్తున్నారు" అని. ఈ దశ ఈశ్వరుని అత్యంత రహస్యాలతో కూడినటువంటిది. నా లాలాజీ సాహెబ్ నాకు కొన్ని సంకేతాలతో దీనిని అర్థం చేసుకోగలిగేటట్లు చేశారు. నేను కూడ ఈ రహస్యాన్ని నీకు సూచనప్రాయంగా చెబుతున్నాను. ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) ఇచ్చే సందర్భంలో దివ్య శక్తి అంతా ఆ శక్తిని పొందుతున్న అభ్యాసిలో ప్రవేశం పొందిన కారణంగా అతని (Nervous system) నాడీ మండలం విశృంఖలమైపోయి అతడు మరణించవచ్చు. నేను ఈ స్థితిని పొందినప్పుడు, అభ్యాసీ అర నిమిషం కూడా ప్రాణాహుతిని భరించలేకపోవటం నేను గ్రహించాను. గురు మహరాజ్ లాలాజీ సాహెబ్ మానవతాదృక్పథంతో ఎటువంటి హద్దులు నిర్ణయించ లేదు. ఇటువంటి స్థితిలో నేను అభ్యాసులకు శిక్షణ నివ్వలేని పరిస్థితిలో నేను లాలాజీ సాహెబ్‌ను ప్రార్థించగా వారు కొన్ని షరతులు విధించారు. అంతేకాదు, నేను కోరినపుడు ఆ షరతులను సడలిస్తానని కూడా వాగ్దానం చేశారు. అయితే నాకు ఆ అవసరం ఎప్పుడూ రాలేదు.

ఆధ్యాత్మిక గురువు శరీరం త్యాగంచేసిన తర్వాత, సత్సంగీయులకు చేకూరే లాభం ఏమిటంటే, శిక్షకుడు (గురువు) ఆర్జించిన ఆధ్యాత్మికత అంతా నిబద్ధులైన అభ్యాసులలోకి చేరుతుంది. ఇంతేగాకుండా, ఉన్నటువంటి ఇంకొక విషయం ఏమిటంటే, ఎవ్వరైతే అత్యంత ప్రేమ మరియు లయ–అవస్థ కలిగి ఉంటారో వారు దానిలో అధికభాగం పొందుతూ ఉంటారు. అదే విధంగా శిక్షకుడు ఈ ప్రపంచం విడిచివెళ్ళాక కూడా అటువంటి అభ్యాసీ లబ్ధిపొందుతూ ఉంటాడు. అటువంటి అభ్యాసుల ఆలోచనా తరంగాలు, స్మరణ కూడా ఆ గురువుకు చేరుతూ ఉంటాయి. **లయ–అవస్థ యొక్క ప్రయోజనాలు చాలా ఉన్నాయి. ఎప్పుడైతే నీ అహం వీడిపోతుందో అప్పుడు నీవు ఎవ్వరికోసమైతే అన్వేషిస్తున్నావో 'అతడు' మాత్రమే నీలో కొలువై ఉంటాడు. ఎంత ఎక్కువగా అభ్యాసీలో లయ–అవస్థ**

**కలుగుతుందో అంతగా అతను సఫలీకృతుడవుతాడు. "లయ అవస్థను పొందటానికి ప్రయత్నించండి" అని నేను మొత్తుకోవటానికి ఇదే కారణం. అయితే జనానికి ఈ దిశగా మళ్ళటానికి తీరికే దొరకటంలేదు. ప్రతి ఒక్కరూ నేను నా శక్తితోనే అన్నీ సమకూర్చాలని అనుకుంటారు. నా ఔదార్యం, ప్రేమ కారణంగా ఎంతో కొంత (లయ-అవస్థ మాత్రం కాదు. ఎందుకంటే, అది అభ్యాసీ యొక్క కర్తవ్యం) చేశాను కూడ. కాని వారిని తరచిచూస్తే వారి మనసులు ప్రాపంచిక విషయాలలోనే నిమగ్నమై ఉన్నట్లు గమనించాను. నేను వాటిని తొలగిస్తూ ఉంటే వారు వాటిని నింపుకుంటూ, స్థితిని చెడకొట్టుకుంటున్నారు. అభ్యాసీ సక్రమంగా సాధనచేస్తూ ఉన్నట్లయితే నేను ప్రసరింపజేసిన కాంతిలో అంధకారం చోటుచేసుకోకుండా ఉంటుంది. లయ-అవస్థను కల్పించుకోవటం అభ్యాసీ యొక్క కర్తవ్యం. దానికి తగిన విధానాలను నేను తెలుపుతూనే ఉన్నాను.** శిక్షకుడు అస్తమించిన తర్వాత శిక్షితునికి కలిగే రెండవ ప్రయోజనం ఏమిటంటే, అతనికి సంపూర్ణ పవిత్ర అనుగ్రహం లభించటమేకాక, అతనికి తన అదృష్టం యొక్క జ్ఞానం కూడ కలుగుతుంది. ఆ జ్ఞానాన్ని శిక్షకుడు అస్తమించిన తరువాత ఎక్కువగా గ్రహించగలుగుతాడు. దీనికిమించి ఇంకా ఒకటి రెండు విషయాలు ఉన్నాయి, కాని వాటిని వివరించటానికి తగిన మాటలు లేవు. ఇప్పుడు నేను నా స్వవిషయం చెబుతున్నాను. నా గురు మహరాజ్ లాలాజీ సాహెబ్ తన దేహత్యాగంచేసిన తర్వాత, నన్ను ఈ స్థితికి తీసుకు రావటానికి వారికి 12 సంవత్సరాల కాలం పట్టింది. అప్పుడు 'వారు' ఏమి చెప్పారంటే, "నేను ఇంకా ఎక్కువ సమయం తీసుకునేవాడినే కాని నీవు కొద్ది రోజుల తర్వాత ఎవ్వరికీ శిక్షణ ఇవ్వలేని స్థితి నీకు కలుగుతుందని గ్రహించిన తర్వాత దానిని విరమించుకున్నాను" అని. నాకు జ్ఞాపకం ఉన్నంతవరకు అసలు విషయం ఏమిటంటే, నేను నెగేషన్ యొక్క నెగేషన్ స్థితిలోకి ప్రవేశించ నారంభించాను. దాని ఫలితంగా నేనంటూ ఏమీ లేకపోవటం జరుగుతుంది. ఒకవేళ "నెగేషన్ యొక్క నెగేషన్" స్థితి తర్వాత ఉన్న స్థితిని అనగా దాని యొక్క మరుపుస్థితికి చేరినట్లయితే నా శరీరం వదిలిపెట్టాల్సి వచ్చేది.

ఇప్పుడు నీ ఉత్తరాలకు జవాబులు ఇస్తున్నాను. నీవు వ్రాసిన ఒక ఉత్తరంలో "మెదడులో ఒక మత్తు వంటిది వ్యాపించి ఉంటోంది" అని వ్రాశావు. మత్తు అనేది పదార్థంలో ఉంటుంది. దాని తీవ్రత తగ్గినపుడు దాని ప్రభావంతో ఏర్పడిన మగత ఉంటుంది. దానిని ఇంకా నిశితంగా నీవు గమనించినట్లయితే అది మగతగా కాకుండా, ఒక నదీ తీరంలో కూర్చున్నప్పుడు కలిగే చల్లని హాయి లేక ఆహ్లాదం లాంటి స్థితిగా అనిపిస్తుంది. నీ ప్రస్తుత స్థితి ఆ చల్లని హాయికి భిన్నమైనది అనకతప్పదు. అది ఏకాగ్రత మూలంగా ఆ విధంగా అనిపిస్తుంది. దీనిని ఇంకా వివరించటానికి మాటలు లేవు. మరైతే, ఈ మగత ఎందుకు ఉంది? దానికి కారణం నీవు 'Z' స్థానం యొక్క ప్రభావపరిధిలోకి ప్రవేశిస్తున్నందువల్లనే. నీవు కోరుకుంటే త్వరలోనే దానిలో నీ ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభిస్తాను. మూలమూలలా ఇంకా నిర్మలీకరణ చేయాల్సి ఉంది. నీవు వ్రాసినటువంటి స్థితి 'Z' స్థానానికి చెందినది. నీ అస్థిత్వాన్ని చాలా సామాన్యమైనదిగా భావించటమనేది ఆధ్యాత్మికత యొక్క సభ్యతను సూచిస్తుంది. నీకు చల్లదనం యొక్క అనుభూతి కలగటానికి కారణం పదార్థం యొక్క వేడి ఎక్కువగా బయటకు వెళ్ళిపోవడం వలన. దీనిని నేను "సహజమార్గ దశ నియమాల వర్ణన"లో వివరించాను. ఈ చల్లదనం యొక్క అనుభూతి, నీవు పదార్థం నుంచి వేరుపడిపోతున్న దానిని సూచిస్తుంది. వెన్నెముకలోని ఎముకలలో ప్రకంపనం, గిలిగింత యొక్క అనుభూతికి కారణం, అక్కడి స్థానాలు వరుసగా విచ్చుకుంటున్నాయి. ఒక్క క్షణమాత్రమైనా మృత్యువులాంటి స్థితిని అనుభూతి చెందటం చాలా మంచిది. దీని గురించి చెప్పాలంటే, ఈ మృత్యువులాంటి స్థితి యొక్క అనుభూతి కూడా నీలో కలగటం ఆరంభమైంది. నేను ఎక్కువగా ఉన్నత స్థితుల యొక్క (ట్రాన్స్‌మిషన్) ప్రాణాహుతిని ఇస్తూ ఉంటాను. కనుక అభ్యాసుల్లో తరచుగా ఉన్నత స్థితి కనిపిస్తూ ఉంటుంది. మృత్యువులాంటి స్థితి యొక్క అనుభూతి కలగటం చాలా ఉన్నతమైన స్థితియే అయినప్పటికి ఆ స్థితి నీలో ఇంకా ఉత్పన్నం కాలేదు.

నీవు వ్రాసిన ఉత్తరం మరొకటి కూడా చేరింది. నీలో ఈశ్వరుని హృదయం విలీనమైపోయినట్లు అనుభూతి చెందటమంటే నీవు హృదయ మండలం దాటటానికి సిద్ధమవుతున్నట్లు గ్రహించాలి. నిన్ను ఇప్పుడే దానిని దాటించాలని అనుకుంటున్నప్పటికీ, ఎందుకు చేయకుండా ఉంటున్నానంటే, అన్ని బిందువుల ఆధ్యాత్మిక యాత్ర యొక్క ఆనందాన్ని నీకు కలిగించాలని. ఆరంభంలో నేను వాస్తవానికి త్వరితంగానే పని చేశాను. దాని ఫలితంగా పిండదేశం, బ్రహ్మాండ మండలాల మీద నీకు ఆధిపత్యం రెండు రోజుల్లోనే కల్పించటం జరిగింది. దాని మూలంగా, నీకు సమయం కలిసి వచ్చింది. దైవ సృష్టిలో చాలావరకు ఆధిపత్యం కలిగింది. నీకు పరిజ్ఞానం కలిగించాలనే ఉద్దేశ్యంతో నేను నిన్ను ఇప్పుడు ప్రతి పాయింటులోను యాత్ర చేయిస్తూ ముందుకు నడిపిస్తున్నాను. ఈ విధమైన పాయింట్లు ఎన్ని ఉన్నాయో అంతుబట్టదు. అవి వేల సంఖ్యలో కాకపోవచ్చును కాని వందల సంఖ్యలో ఉండవచ్చు.

లెక్కకురాని పాయింట్లు నా దృష్టికి వచ్చినప్పుడు, నేను త్వరపడి సంపూర్ణ యాత్రకు నిమిషాల్లో, సెకన్లలో పూర్తి చేయించాల్సి ఉంటుంది. ఎందుకంటే, నా ఈ జీవిత కాలంలోనే ఈ పాయింట్లన్నింటిలోను, యాత్ర జరిపించాలి. నీవు ఏ విషయం గురించి ప్రయత్నిస్తున్నావో అది హృదయ మండలం కంటె చాలా ఉన్నతంగా ఉన్నదని నీవు భావిస్తున్నది వాస్తవమే. నీ అంతట నీవు తలపెట్టిన ప్రయత్నంలో నీవు దానిని ప్రాప్తింపచేసుకోవాలి.

నిజం చెప్పాలంటే, నా ఉద్దేశ్యంలో హృదయ మండలం పిల్లల యొక్క ఆటస్థలం వంటిది. అయితే అభ్యాసులు దీనిని కూడా దాటలేకపోవటం విచారకరమైన విషయం. స్వాములు తమ శిష్యులందరినీ వారి జీవితాంతం భజనలు, కీర్తనలతోనే గడిపేటట్లు చేస్తారు. బహుశా అలా చేస్తూన్న సంగతి వారు గ్రహించలేకపోతున్నారని నేను భావిస్తున్నాను. అలా ఎందుకు జరుగుతుంది? ఎటువంటి రంగూ లేకుండా ఉండవల్సిందిపోయి వారు రంగు గౌనులు (డ్రస్సు) ధరిస్తున్నారు. వారు ధరించే వస్త్రం యొక్క రంగు సన్యాసానికి చెందినది కాదు. సన్యాసం యొక్క రంగు, అసలు రంగు అంటూ లేకపోవటమే, ఈ రంగు లేకపోవటమనేది ఏమై ఉంటుంది? దేనిలోనైతే ఏ రంగూ కనిపించదో అదే! ఏ రంగూ లేనప్పుడు అది "తెలుపు" అనబడుతుంది. అన్ని రంగులూ కలగలిసిపోయినపుడు అది తెలుపుగా మారుతుంది. ఇప్పుడు ఆ తెలుపు రంగువి ధరిస్తే స్వామీజీలకు, గృహస్థులకు (సాధారణ ప్రజానీకానికి) మధ్య తేడా ఉండదు. నా ఉద్దేశ్యంలో, సాధువులను సామాన్యుల నుంచి వేరుగా ఉంచడటంకోసం కాషాయ రంగు వస్త్రాలు సాధువులకు ఇవ్వబడింది. ఈ రంగుకు అర్థం మనం 'అహం'ను కాల్చివేశాం అని. జనాలు వారిని ఈ కాషాయ రంగుతో గుర్తిస్తారు. అయితే ఇప్పుడు కాషాయ రంగు బట్టలు ధరించిన ప్రతి ఒక్కరినీ సన్యాసులుగా అంటున్నారు. నా అభిప్రాయంలో జనసమూహంలో ఇంకా బాగా చైతన్యం కలగలేదు, అలాగే శ్రద్ధా, విశ్వాసం కూడా పెరగలేదు. అంటే ఈ రంగుతో ఉన్న ఎద్దును, కుక్కను కూడా సన్యాసిగా భావించాల్సి ఉంటుంది. ఇందులో ఒక ప్రత్యేకత ఉంది. అది ఏమిటంటే, ఈ రంగునే దృష్టిలో పెట్టుకుని సన్యాసులుగానే పుట్టుతున్నారు. నా ఈ వ్యాఖ్యతో స్వామీజీలను విమర్శించటం నా ఉద్దేశ్యం కాదు, కాని వారు తమ విచక్షణాశక్తిని ఉపయోగించుకుంటె వారికి ఆధ్యాత్మిక రహస్యాలు స్వయంగా వెల్లడవుతాయి. దానితో వారు సన్యాసిగా తయారుకావటానికి కలిగిన అభిప్రాయానికి తగినట్లు రూపొందవచ్చు. ద్వైతభావాన్ని నీవు సహించలేకపోతున్నావు కనుక దానిని వ్యతిరేకించే ఆలోచనలో ఉండు. ఏకత్వం మరియు ద్వైతం రెండూ ఒకటిగానే తలపించే స్థితి నీలో ఇంకా ఉత్పన్నం కాలేదు. స్వప్నంలో ఒక మనిషి గొణుగుతూ ఉన్నప్పుడు, తను గొణుతూ ఉన్నాననే విషయం అతనికి తెలియదు. తను గొణుగుతున్నట్లుగా అతనికి తెలిస్తే అలా గొణగటం జరగదు. అదే విధంగా, నీకు ఏకత్వం గురించి తెలిస్తే, ద్వైత భావన యొక్క బాధ ఉండదు. వాస్తవానికి మనం ఏకత్వం, ద్వైతం అను రెంటికీ దూరంగానే ఉండాలి. అప్పుడు "ఉన్నదేదో ఉన్నది" అను స్థితి కలగనున్నదని తెలిపే సంతోషకరవార్తగా ఉంటుంది. ఇది వ్రాస్తూ ఉండగానే నాకు ఒక ఆలోచన వచ్చింది. **దైవం తనకు ఉన్నదంతా సృష్టిరచన కొరకు పూర్తిగా సమర్పితంచేసి దివాలా తీశాడు. ఇప్పుడు అదే విధంగా మనం మనవద్ద ఉన్నవాటిని**

**దైవానికి ఇచ్చివేసి 'వారి'లాగే మనం కూడా దివాలాకోరులుగా అవ్వాలి.** ఈ రోజుల్లో జనం తమవద్ద ఉన్న వాటిని (సంస్కారాలు) ఇచ్చివేయలేకపోతున్నారు. ఎందుకంటే, వారు దివాలాకోరు జాబితాలో తమ పేర్లు కూడా ఉంటాయేమోనని. దీనికి బదులుగా వారు సంపదలను పెంచుకుంటున్నారు. "నమ్రతాభావం కూడా ఒక విధంగా అసంతృప్తికరమైనదిగా అనిపిస్తోంది" అని నీవు వ్రాశావు. నీవు నమ్రతను వాస్తవికతకు వేరుపడినట్లుగా భావించటం మూలంగా అది ఇంకా నిలిచి ఉండటానికి కారణమైంది. **అసలైన నమ్రత ఎలాంటిదంటే, "ఏమీ మిగలకపోవటం" వంటిది, అది (Zero) శూన్యాన్ని తలపిస్తోంది.** నీవు చివరగా, "దరిజేరటానికిగాని, వేరుగా ఉండటానికిగాని మనస్కరించటం లేదు" అని వ్రాశావు. శిక్షకుడు అభ్యాసీకి భగవంతుని స్థితిని గాఢంగా కల్పించినపుడు, అభ్యాసీ దరిచేరటానికి ఇష్టపడదు. మరి వేరుగా ఉండటం వలన వ్యథ ఎందుకు కలుగుతుందంటే, అది ప్రేమ యొక్క బలవంతం (Demand of love) మూలంగానే! దానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. అది ఆ విధంగా జరుగుతూనే ఉంటుంది. దాని వలన నష్టం ఏమీ లేదు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 422

లఖీంపుర్,
06.09.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' వ్రాసిన పోస్టుకార్డు ఈ రోజు అందింది, చదివి ఆనందించాను. పూజ్య మాస్టర్ సాహెబ్ తమవద్దకు వస్తున్నారు. నేను కూడా రావాలని అనుకుంటున్నాను, కాని ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు, నిర్ణయించుకొని ఉంటే ఏదో మార్గం దొరికేది. బాగుంది, అది 'మాలిక్' అభీష్టం ప్రకారమే జరుగుతుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

ఇప్పుడు ఉన్న నా స్థితిలో, చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి మనిషికి, పిల్లవానికి, జంతువులకు, చేతన అచేతనాలన్నింటికీ ప్రణామం చేయాలని, శిరస్సు వంచాలని నా మనస్సు కోరుతోంది. బాబూజీ, దశ ఏమిటంటే, జీవితం యొక్క నూతన అధ్యాయం ప్రారంభమైనట్లు ఉంది. ఇప్పుడు చల్లని ప్రపంచంలోకి వచ్చినట్లుగాను, వేడిమి యొక్క జాడ కూడా లేకుండాపోయినట్లుగాను, బూడిదలో కూడా చల్లదనం ఏర్పడుతున్నట్లుగాను అనిపిస్తోంది. అక్కడ చల్లదనంగాని, తడిగాని ఏమీలేవు. అగ్ని ముందు కూర్చున్నా కూడా సెగ తగలటం లేదు. నేను కోరుకొంటున్నప్పటికీ, వేడిగాని, మంటగాని నన్ను తాకలేకపోతున్నాయి. ఈ దశలో ఇంకా ఏమిటంటే, బాబూజీ, అగ్ని నన్ను దహించలేకపోతున్నట్లుగాను, నీరు నన్ను తడపలేనట్లుగాను, వాయువు నన్ను తడి ఆరబెట్టలేనట్లుగాను, అనగా అవన్నీ నన్ను స్పర్శించలేనట్లు అనిపిస్తోంది. అదేమిటో తెలియటం లేదు. అదేమిటోగాని, లఖనౌర్ పట్టణంలో ఉన్న జ్ఞానులకు "ఈశ్వరుడు సద్బుద్ధిని కలిగించుగాక, వారి దుష్టబుద్ధిని నశింపుజేయుగాక!" అని ప్రార్థన చేస్తున్నాను. అంతేగాని వారిపట్ల కోపతాపాలు లేవు. దీనివలన నా బాబూజీకి కష్టం కలుగుతోందనే ఆలోచన కలిగినపుడు మాత్రం క్షణంపాటు ఆవేశం వంటిది కలుగుతోంది. మళ్ళీ అదే స్థితి ఉంటోంది. అదేమిటో తమకే తెలియాలి. ఇదివరలో స్థితి మారుతున్నప్పుడు, ఏదో క్రొత్త మైదానం తటస్థపడుతున్నట్లుగాను, మళ్ళీ A,B,C,Dతో ఆరంభమైనట్లుగాను అనిపించేది. కాని ఇప్పుడైతే, నేను ఇప్పటివరకు ఏవైతే చదివానో అదంతా మరచిపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు A,B,C,D గురించిన జ్ఞానం లేకుండాపోయింది. అదే విధంగా మళ్ళీ A,B,C,Dతో ప్రారంభించాలి అనే భావన కూడా కలగటం లేదు. ఇప్పుడు నూతన సరళమైన దశలో ఒక అమాయక స్థితి ఉంటోంది. నాకు ఏమీ తెలియదు,

ఏమీ జ్ఞాపకం కూడా లేదు అసలు ఇప్పటివరకు ఏమైనా నేర్చుకున్నానా లేదా అని. "బిటియా! నీ ఆధ్యాత్మిక యాత్రలో ఇంకా 3/4 వంతు కూడా అవ్వలేదు" అని 'తమరు' వ్రాశారు. ఇది నాకు బాగా అర్థమయ్యింది. ఇప్పుడు ఎలా ఉందంటే, నేను ఇతురులెవ్వరికైనా ఉత్తరం వ్రాయాలనుకుంటే, ఏమి వ్రాయాలో అర్థం కావటం లేదు. సోమరితనం వలన లేదా నీరసం వలన మనస్సు కుదుటపడటం లేదు. అందుచేత తటపటాయిస్తూ, బలవంతంగానైనా ఉత్తరం వ్రాయాలని పూనుకుంటె, 'మాలిక్' కృపతో ఎంతో కొంత వ్రాస్తున్నాను. ఇంక 'మాలిక్' నేర్పదలచుకుంటే అప్పుడు ఆలోచిస్తాను. ఆలోచనలు నా మెదడుకు తట్టుతూనే ఉన్నాయి కాని అదేమిటో నాకు తెలియటం లేదు. ఇప్పుడు 'మాలిక్' కృపతో (Condition of blankness) శూన్యత్వపు దశ ఉంటున్నట్లు అనుభూతికి వస్తోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. ఈ రోజు అక్కడికి (షాజహాన్‌పూర్‌కు) వెళ్ళాలని హృదయం తపన చెందుతోంది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 423

లఖీంపుర్,
12.09.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని భావిస్తున్నాను. పూజ్య మాస్టర్ సాహెబ్ అక్కడ అనిర్వచనీయమైన పరమానందంలో నిమగ్నమై ఉంటారు. అది ఎలా ఉంటుంది? అంటే, ఆ ఆనందాన్ని కూడా ఆధ్యాత్మిక అలలతో శుభ్రపరచినట్లయితే, ఆ శుద్ధానందంలో పూజ్య మాస్టర్ సాహెబ్ యొక్క కణకణమూ తడిసిపోయి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఉన్న స్థితిలో, 'మాలిక్' యొక్క కృప ఎటువంటిది కలిగిందంటే, నా కళ్ళు తన దృష్టిని కోల్పోయాయి అన్నట్లు ఉన్నాయి. కుడి ఎడమలు తిరగాల్సిన పనిలేనట్లు ఒక్కసారిగా నేను అంధురాలనైపోయాను. ముళ్ళు ఉన్నాయన్న సందేహమే లేదు. ఇప్పుడు మైదానం కూడా అనుభవంలోకి రావటం లేదు. నాకయితే, నడవాలను అభిప్రాయం కూడా లేదు, కాని నేను నడుస్తున్నాను అని చెప్పటానికి మారుతున్న దశ యొక్క అనుభూతియే అందుకు సాక్ష్యం. పూజ్య బాబూజీ! నా స్థితి ఏమిటంటే, నన్ను ఎవ్వరైనా నీవు ఎందుకు అంధురాలువయ్యావు? అని అడిగారు అనుకోండి, దానికి జవాబుగా నేను అంధురాలను ఎలా అవుతాను, నేను 'మాలిక్'ను కనుబొమ్మలపై కూర్చోబెట్టి నేత్రాలను శాశ్వతంగా మూసివేసుకున్నాను, అని పలుకుతాను. ఇదే నా దశగా ఉంది, నేత్రాలే కాదు, ప్రతి జ్ఞానేంద్రియం యొక్క స్థితి ఇలాగే ఉంది. జ్ఞానేంద్రియాలు మూసుకుపోయి, వెనకబడిపోయినట్లు అనిపిస్తోంది. ఈ మైదానంలో వాటి ఉనికియే లేకుండా పోయింది. చెవులు, ఇప్పుడు వినటానికి వీలుపడదు అని జవాబు ఇచ్చినట్లు ఉంది. పూజ్య బాబూజీ! ఇప్పుడు నా వెన్నెముక అంతా నిటారుగా, ఒక లైనులో ఉన్నట్లు కనిపిస్తోంది. దాని నిర్మాణమంతా నా కళ్ళెదుటకు వస్తోంది. వెన్నుపూసలోని ప్రతి ఎముక, సాదాగాను, నిటారుగాను నాలాగే స్థిరంగా ఉన్నట్లుగాను అనిపిస్తోంది. బాబూజీ, నాకు ఈ సంగతి ఏమిటో తెలియటం లేదు, ఆత్మోన్నతి కొరకు అయినా ప్రార్థన చేయాలనుకున్నాగాని, అది పైపైనే ఉంటున్నట్లు అనిపిస్తోంది. నా ప్రార్థన నన్ను కూడా చేరటం లేదు, తాకటం లేదు. కాని ప్రార్థన అయితే నా కణకణంలోను కుక్కి కుక్కి నింపబడినట్లు అనిపిస్తోంది. అది (ప్రార్థన) స్వయంగా నాలోని ఒక అంగంగానే ఉంది. ఏమైనా సరే, ఇప్పుడు ప్రార్థనకు నాలో అవకాశమే లేకుండా పోయింది. నా వెన్నెముక లోపలి నుంచి సన్నని వెలుగు బయటకు వస్తోంది. చాలా రోజుల నుంచి, నాలో ఇది చెయ్యి, అది

చెయ్యవద్దు అనేటటువంటి ఆదేశాలు ఏమీ తలెత్తనట్లు కనిపిస్తోంది. నాలోపలి మహిమలు, చిక్కులు అన్నీ అంతమైపోయినట్లు అనిపిస్తోంది. సామాన్యత అనేది జీవితంలో పాతుకుపోయినట్లు ఉంది. ఆ సామాన్యత కూడా ఎటువంటిది అంటే, అది ఉండి కూడా నన్ను తాకనట్లుగానే అనుభూతి చెందుతున్నాను. బాబూజీ! ఇప్పుడు అశాంతికి చోటులేదు, శాంతికి కూడా గుర్తింపు లేదు, దానిపట్ల ప్రేమాలేదు. ఇదే నా స్థితి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. ఈ ఉత్తరం చేరేసరికి మాస్టర్ సాహెబ్‌గారు అక్కడ ఉన్నట్లయితే వారికి నా ప్రణామం తెలపండి.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 424

లఖీంపుర్,
15.09.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' వ్రాసిన ఉత్తరం పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు షాజహాన్‌పూర్ నుంచి తిరిగిరాకపూర్వమే చేరింది, మొన్న వారిని కలిశాను. చదివి సంతోషించాను. దురదృష్టవశాత్తు మాస్టర్ సాహెబ్‌గారు తమతోపాటుగా తెచ్చిన ఉత్తరం, వారి కళ్ళజోడు బస్సులోనే పోగొట్టుకున్నారు. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి నుండి తమకు విరోచనాలు మూలంగా 2,3 రోజుల నుండి చాలా బలహీనంగా ఉన్నారని తెలుసుకొని, **అమ్మ తమరిని ఎప్పుడూ తమకు తాముగా బాగా ఆరోగ్యంగా ఉన్నారని తలచుకోవద్దని చెబుతున్నారు. ఎందుకంటే, తమ దృష్టి తమకు తొందరగా తగులుతుందట.** నేను పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నాను. కాలినడకన కాలేజీకి వెళ్ళివస్తున్నా కూడా పెద్దగా అలుపు అనిపించటం లేదు.

నేను సంగీత కళాశాలలో ప్రవేశం గురించి తమకు వ్రాయలేదు. ఎందుకంటే, నా తలంపుమీద నాకు అధికారం లేదు. ఒకవేళ మానివేస్తే దానికి అనారోగ్యం అని చెప్పే అవకాశం (సాకు) ఎలాగూ ఉంది. కాని అలా జరగదని విశ్వాసం ఉంచండి. ఎందుకంటే, తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందినప్పటి నుండి తమ సంతోషం నాలో సంతోషాన్ని నింపింది. నా మనస్సు అయితే ఉప్పొంగటం లేదు. కాని ఇంతకంటె ఎక్కువగా నా ఆలోచన గాడితప్పకుండా ఉండాలని, పూజ్య మహాత్ములైన తమకు విన్నవించు కుంటున్నాను. ఇంక చాలును, ఎందుకంటే, దీనివలన నా (Restlessness) వ్యాకులత నన్ను ఇంతసేపు విడిచి వెళ్ళిపోయింది, అయితే పూర్తిగా మాత్రం కాదు. పూజ్య శ్రీ బాబూజీ, అది నా జ్ఞాపకాన్ని పోషిస్తున్నదని నేను కలలో కూడా చెప్పజాలను. అంతేగాకుండా, దానిని నుంచి నేను ఒక తాబేలు మాదిరిగా వేరుగా ఉంటున్నానని మాత్రమే నాకు తెలుసు. దీని పోషణ అయితే ఇంకెవరో చేస్తున్నారు. నా దృష్టి మాత్రం తప్పకుండా దానివైపే ఉంటున్నది. నేను 'మాలిక్' యొక్క ప్రతి పరిశోధనకు ఒక నిర్ధారణగా ఉంటాను. దాని మూలంగా **జనం ఎప్పుడైనా బహుశా ఇలా అనుకుంటారు– తల్లి యొక్క మహనీయమైన గొడుగు నీడ సదా నిలిచి ఉంది, దాని మధ్యలోనే మనం ఉంటున్నాము, అని.** తమరు, నేను పాడటానికని నాకు ఒక విషయం వ్రాశారు. ఆ విధంగా నేను (Trial) పరిశీలనగా ప్రయత్నం చేశాను. అది రూపుదిద్దే ప్రయత్నమే కాదు, దానికదే అసలైన రూపంగా నిర్ధారించుకుంది. ఎందుకంటే, వాతావరణం యొక్క చలనమంతా నిశ్చేష్టమైపోయింది. ఒక వింతైన రీతిలో ఆ గానం ప్రతిధ్వనించింది. పూజలో కూర్చున్న వారందరూ, దాని పారవశ్యంతో తమ హృదయం, మనస్సు మూగపోయినట్లు అనిపించింది అని చెప్పారు. శ్రోతలకు ఒళ్ళు జలదరింపు, ఘల్లుఘల్లున మ్రోగినట్లు అనిపించింది. అంతేకాదు, ఎందుకోగాని స్పృహ కోల్పోయినట్లు అయిపోయారు. ఈ అనుభూతులన్నీ పాడటం

ఆపివేసిన తర్వాత కూడా చాలాసేపు అలానే ఉండిపోయాయి. అయినా కాని దానిని (ఆ గానాన్ని) నేను చేయగలిగినంత పూర్తిస్థాయికి చేయలేకపోయానని అనిపించింది. నాకు ఆ విధంగా నేర్పించువారు (మాలిక్) దొరికినందుకు నేను అదృష్టవంతురాలినని అనిపించింది. పరిపూర్ణులు, అసలైన మాస్టర్ యొక్క కీర్తి ఎటువంటిది అంటే, నాకు ఇప్పుడే 'మాలిక్' కృపతో కొంత అవగాహనకు వచ్చింది. ఒక విషయం గురించి ఏమీ తెలియకపోయినాగాని దానిపై మనస్సుపెట్టి ఒక్కొక్క గ్రంథిని తెరచి పరిష్కరించగల సమర్థత ఎవరికి ఉంటుందో వారే అసలైన మాస్టర్, పరిపూర్ణులైన మాస్టర్ అనిపించింది. నాలో చాలా ఆలోచనలు రావటానికిగల కారణం తమరు వ్రాశారు, అది నాకు బాగా గ్రహింపుకు వచ్చింది. ఇంకొకటి, 'మాలిక్' నుండి భిన్నంగా ఉన్న మిగతా వాటి గురించిన కారణం వ్రాశారు. అది నిజమే. ఇంకా ఏదో ఈశ్వరుని రహస్యంతో సంబంధించి ఉంటుందని, నేను నా క్రితం ఉత్తరంలో వ్రాసిన "ప్రతి మనిషి దశ నా దశ కంటె మించినదిగా ఉన్నదని అనిపిస్తుంది" అన్నదానికి, ఈ విధంగా......... అని అసంపూర్ణంగా వదిలివేశారు. లఖనోర్‌లోని అభ్యాసుల కొరకు తమరు వ్రాసినట్లుగానే, ఏరోజునైతే దీని విషయంలో తమ మొదటి ఉత్తరం వచ్చిందో ఆ రోజునుంచే చేస్తున్నాను. ఒక కథను గురించి తమరు ఒక విషయం ప్రస్తావించి వెళ్ళారు. దానిని మాస్టర్ సాహెబ్ హిందీలో వ్రాశారు. అప్పటిలోగా ఒక కథను 'ధర్మయుగ్' (హిందీ పత్రిక)కు పంపిస్తాను. మాస్టర్ సాహెబ్ దేనిని పంపమంటే దానినే పంపుతాను. కాని తమరు వ్రాసినట్లుగా, అది నా పేరుతో కాకుండా, 'శ్రీరామచంద్ర మిషన్'కు చెందిన ఒక 'క్షుద్ర సేవికా' (చిన్న సేవకుడు) అను పేరుతో ప్రచురించబడితేసరి, లేకపోతే తిరిగి తీసుకుంటాను.

నా అనుభూతి తెరవబడటం గురించి 'తమరు' వ్రాశారు, అది 'మాలిక్' కృపతో జరిగి తీరుతుంది. ఎందుకంటే, మనస్సు యొక్క ప్రతిదళం విచ్చుకుని ఉంది, ప్రతి రక్తనాళం జాగృతమైంది. ఇంతేగాదు దేహం యొక్క ప్రతినాళం జాగృతమైనట్లు అనిపిస్తోంది. ఇంతగా నిద్రపోయినా కూడా నేను నిద్రించినట్లుగా అనిపించటం లేదు. అలాకాకపోతే ఒకవేళ 2,3 రాత్రులు, 2,3 గంటలైనా నిద్రించటానికి అవకాశం కలిగినా, కలగకపోయినా గాని నేను మేల్కొని ఉన్నట్లే అనిపించటం లేదు. బాబూజీ, నాకు ఇప్పుడు, నిద్ర, ఆకలి, నేర్చుకోవటం, మరచిపోవటం, జీవన్మరణాలు అన్నీ ఒక కథలాగ అనిపిస్తున్నాయి. ఆధ్యాత్మికత అనేది పజిల్ (చదరంగం) లాగా అనిపిస్తోంది. అది 'మాలిక్'తోనే పరిష్కరించబడుతుంది. ఇంకొక స్థితి ఏమిటంటే, నాకు ఇప్పుడు మునగటంగాని, తేలటంగాని, లోతు తెలియకుండా ఉంది. ఒక సాధారణ దశలాగ ఉంది. నాకు ఇప్పుడు దశలో కలగలుపుగా ఉండటం కూడా సాధ్యం కావటం లేదు. స్థితిలో ఎలా ఉందంటే, దశలోకి దూరి చూడటంగాని, బయటనే ఉండిపోవటానికిగాని సాధ్యపడటం లేదు, స్థితిని మర్చిపోతున్నాను. దశ అయితే ఉంది కాని నేను గమనం యొక్క స్థితి నుంచి దాటిపోయినట్లు ఉంది. గతి (గమనం) కూడా ఇప్పుడు నా అనుభూతికి రావటంలేదని అనిపిస్తోంది. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 425

లఖీంపుర్,
19.09.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశ ఎలా ఉందంటే, ఏ పని చేసినప్పటికీ, నా కణకణమూ నిశ్చలంగానే ఉన్నట్లు అనిపిస్తోంది. వాటిలో స్పందన ఎప్పటికీ కలగదు. ఏ అణువులతో నయితే నా శరీర నిర్మాణం జరిగిందో, అవి చలనం లేకుండా

నిశ్చలంగా ఉన్నాయి. నా చేయి కాలినా లేదా ఎక్కడైన బాధ కలిగినా, అది ఎంత ఎక్కువగా ఉన్నా కూడా నా కణకణమూ నిశ్చలంగానే ఉంటున్నాయి. శరీరంలో ఇంత క్రియాతత్వం ఉన్నా కూడా నా కణాలన్నీ శూన్యంగానే ఉంటున్నట్లు అనుభూతి కలుగుతోంది.

నా పరమ పూజ్య బాబూజీ! ఇప్పుడు నేను ఎటువంటి మరపుస్థితిలో ఉంటున్నాను అంటే, దానిని జ్ఞాపకం చేసుకుంటే, ఆ మరపుస్థితి గురించి నాకు తెలుస్తోంది. నేను ఏం చేయాలి, దశ ఈ విధంగా ఉంటోంది. జ్ఞాపకం చేసుకుంటే మరపుదశ ఎదుట నిలుస్తోంది. దానిని మరచిపోతే, జ్ఞాపకానికి రాదు. నా కళ్ళకు ఏమయ్యిందో ఏమోకాని, ఎంత విచ్చుకుని చూసినాగాని అన్నీ ఆఖరికి మానవులుసైతం ఒక మసకబారిన గీతలాగా లేక ఒక నీడ వంటిదిగానే కనిపిస్తున్నాయి. అలా కూడా బాగా నిశితంగా చూస్తేనే కనిపిస్తున్నాయి కాని లేకపోతే ఏమీ లేనట్లుగానే అనిపిస్తోంది.

శ్రీ బాబూజీ! నేను దానిని నా అహంకారం అని చెప్పినట్లయితే, నా ఆలోచన ఎలా ఉన్నప్పటికీ, నా మనస్సు అందుకు అంగీకరించటం లేదు. నా అహం యొక్క ఒక రకమైన మసకబారిన దృష్టియే ఏర్పడి ఉంటోంది. ఈ దృష్టి లేదా స్పృహ 'అతని'దా లేక నాదా అని నిర్ణయించుకోలేక పోతున్నాను. అదేమిటోగాని, రాత్రి ఎక్కువగా నిద్రపోతే దానిని సహించలేకపోతున్నాను. ఇలా ఎందుకు అంటే, 'మాలిక్'తో నిర్లక్ష్యం వహించి ఉన్న కారణంగా అశాంతిగా ఉంటోంది. మరి దానిని జ్ఞాపకం చేసుకున్నట్లయితే సహించలేకపోతున్నాను. ఇంకొక రకంగా చెప్పాలంటే, జ్ఞాపకం చేసుకోవటంలో గాబరా చెందుతున్నాను, ఏమైనా నిర్లక్ష్యం జరిగిందేమో అను విచారంతో రాత్రింబవళ్ళు పోరాడుతూ ఉంటున్నాను. ప్రస్తుతం ఈ పోరాడటమే నాలో ఉంది. మిగతా సంఘర్షణలన్నీ జాడలేకుండా తొలగిపోయాయి. ఏకత్వం లేదా ద్వంద్వత్వం అను రెండు రకాల ఆలోచనలు కూడా నాకు కలగటం లేదు. నాకు మరపుస్థితియే బాగుంటోంది. ఎందుకంటే, ఈ దశలో నాకు 'అతని' పరిమళమే నన్ను కలిపి ఉంచుతోంది. 'అతడే' నా విషయాలన్నీ చక్కపెట్టుకుంటున్నాడు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 426

లఖీంపుర్,
25.09.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కృపతో వ్రాసిన ఉత్తరం బుధవారమే అందింది. చేతికి కందిరీగ కుట్టిన కారణంగా చాలా బాధగా ఉండి, కవర్ ద్వారా ఉత్తరం పంపించాలనుకుని కూడా పంపలేకపోయాను. ఈ రోజు చేయి బాగానే ఉంది. తమరు ప్రేగుల్లో దృష్టి నిలపాలని, (Self training) స్వయం శిక్షణ విధానం గురించి వ్రాశారు, అర్థం చేసుకున్నాను. కాని నాలో ఏమీ శక్తి లేనట్లుగానే అనిపిస్తోంది. నేను ప్రతిపనికీ 'మాలిక్' సహాయం మీదనే ఆధారపడి ఉన్నాను. అదే నాకు ఇష్టం కూడా. నాలో సహనం కూడా అంతంత మాత్రంగానే ఉంది. లఖనోర్‌కు చెందిన వారి పనికొరకు నా మనస్సు ఇప్పుడు ఎక్కువగా లగ్నమై ఉంటోంది. పుస్తకాలు మాస్టర్ సాహెబ్‌గారి వద్ద చూసి వచ్చాను, బాగున్నాయి. కాని ఫోటో ముద్రణకు వాడిన పేపర్ బాగుండ లేదు. నేను ఇంగ్లీషు పుస్తకాలు 2,3 సార్లు చదివాను. కాని అదేమిటో తెలియదు. తమ మాటలైతే ఎన్నడూ మరువలేకున్నాను కాని పుస్తకంలోని విషయం మరచిపోతున్నాను. 'మాలిక్' కృపతో అర్థం చేసుకోగలుగుతున్నాను. ఇంగ్లీషు సరళంగా ఉంది. వెన్నెముక గురించి

తమరు అడిగారు. అది రెండు విధాలుగా ఉంటోంది అనగా ఛాయా మాత్రంగా (Vision) దర్శనంలోనూ కనిపిస్తోంది. అప్పుడప్పుడు (Subtle form) సూక్ష్మ రూపంలో ఎదుట కూడా కనిపిస్తోంది. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ! ఇప్పుడు ఈ దశను చూస్తుంటే కబీరు యొక్క ఈ ద్విపద జ్ఞాపకం వస్తోంది– "ఒకటి అని చెప్పుదునా ఏమిలేదు, రెండవది అని చెప్పిదునా అది నింద." అనగా ఫలానా అని చెప్పటానికి వీలుకాదు, మరేదైనా అని చెప్పినట్లయితే అదీ అపచారం అవుతుంది అని అర్థం. నాలో సత్యం యొక్క అనుభూతికి చెందిన పరదా చిరిగిపోయి ఆ సత్యం వెదజల్లబడినట్లుగా అనిపిస్తోంది. లోపల, బయట కూడా ఒక చిత్రమైన గతి వ్యాపించి ఉన్నట్లు అనుభూతమవుతోంది. పరమ పూజ్య మహాత్మా శ్రీ బాబూజీ! ఇదే కాకుండా, నా ప్రతికణం చిందరవందరగా దేనికది పడియున్నట్లుగా అనిపిస్తోంది. ఒక్క శ్వాస మాత్రమే అన్నింటినీ కలిపి ఉంచినట్లు ఉంది. ప్రతికణంలోను సత్యదశను పొందుతున్నాను. నా అణువణువూ సత్యరూపం దాల్చినట్లుగా ఉంది. బహుశా ఈ కారణంవల్లనే నా సృష్టికి సంబంధించిన కణాలతో మాయ యొక్క సంబంధం ముగిసిపోయినట్లుగా అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, 'మాలిక్' ప్రసాదించిన ఈ స్థితితో ఇప్పుడు ఏ ఆధ్యాత్మిక స్థితి నా కణాలలో లేదనిపిస్తోంది.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు ఈ దశ ఎలా ఉందో వివరిస్తున్నాను. జీవనమోక్ష దశ ఎంత సామ్యావస్థ పొందింది అంటే, దానిని గురించి ఆలోచిస్తే, అది చల్లగా ఉండి దానిలో ప్రాణంలేనట్లు ఉంది. ఏమీ ఆలోచించకపోతే అది లేకుండా ఉంటోంది. ఈ దశ యొక్క వేడిమిని కోల్పోయి చతికిలబడిపోయింది. దీనిలో ఇప్పుడు ప్రాణం లేదు, లేదా అది నాలో ఉంచుకునే సామర్థ్యం లేదు, లేదా అది భరించే శక్తి నాలో లేకుండాపోయాయి. ఈ దశలో ఏమయ్యిందో ఏమోకాని, ఏదైనా విషయం గురించి పిల్లలమీద ఆగ్రహం చెందినా, అరచినా, చేతితో దెబ్బలు కొట్టినా (ఇప్పటివరకు ఇవన్నీ జరగనప్పటికీ), వేడిమి ఎటువంటిదైనాసరే అది నా ఆంతరికాన్ని ఎప్పటికీ చేరకుండా ఉంటోంది. ఇప్పుడు ఎక్కడివి అక్కడే అనగా బయట విషయం బయటనే, లోపలివి లోపలనే ఉంటున్నాయి. ఇప్పుడు స్వయంగా నా రూపాన్నే గ్రహించలేకపోతున్నాను. నేను ఏమిటి, నేను ఎవర్ని, నేను ఎక్కడ ఉన్నాను –అను ప్రశ్నలకు సమాధానం కూడా నావద్ద లేకుండా పోయింది, దాని జాడ కూడా లేదు. శ్రీ బాబూజీ, పూర్వం నాకు లోపల, బయట ఒకే రూపం, ఒకటే ప్రవాహం, ఏకత్వం మాత్రమే అనుభవమవుతూ ఉండేవి. ఇప్పుడైతే నాకు ప్రతి మనిషి యొక్క రూపం విడివిడిగాను, ఉన్నది ఉన్నట్లుగాను కనిపిస్తోంది. ప్రతి మానవుడు కనిపిస్తున్నాడు, కాని అతడి ఆంతరిక దశ ఎలా ఉంటుందో చెప్పలేకపోతున్నాను.

ఇప్పుడు ఇంకొక దశ ఎలా ఉంది అంటే, 'మాలిక్' యొక్క జ్ఞాపకం వచ్చినపుడు గుండెమీద దెబ్బ చరిచినట్లు అనిపిస్తోంది. అలా ఎందుకంటే, నేను 'అతడి'ని హృదయ పూర్వకంగా జ్ఞాపకం చేసుకోలేకపోతున్నాను. 'అతని' జ్ఞాపకం వచ్చినపుడు ఒక విచిత్రమైన మానసిక స్థితిలో ఉంటూ ఉన్న స్థితి ఉంటోంది. ఇంతకుముందు అయితే దీనివలన ఎంతో ఆనందం, ఉత్సాహం కలుగుతూ ఉండేవి, కాని ఇప్పుడు ఆవేదనయే ఉంటోంది. ఎప్పుడైతే దశ నిండిపోయిన అవస్థలో, మరపుస్థితిలో కోల్పోయి, అమ్ముడుపోయినట్లుగా మనస్సు ఉంటున్నపుడు, ఇలా ఎందుకు జరగదు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 427

లఖీంపుర్,

29.09.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందింది. చదివి ఆనందించాను. డాక్టర్ సిన్హాగార్కి తమరు వ్రాసిన ఉత్తరం యొక్క నకలు కూడా వ్రాశాను. తమరు వ్రాస్తున్నటువంటి ఇవన్నీ ఒక శిక్షణ వంటివి, అవి సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. అంతేకాదు, తమరు వ్రాస్తున్నటువంటివి అన్నీ సువర్ణాక్షరాలతో లిఖించేరోజు తప్పకుండా వస్తుంది. 'పరమార్థ పత్రిక'కు వ్యాసం పంపిస్తున్నాను. వ్యాసం చిన్నదే, దాని పేరు 'పరమార్థ అభ్యుదయ్'. దీనిలోని విషయం ఏమిటంటే, పరమార్థంవైపు పురోగమించు సాధకుని స్వరూపం మాత్రమే. తమరు విని ఏది ఉచితం అనుకుంటే అది చేయండి. 'ధర్మయుగ్' పత్రికకు 'అమర్ జ్యోతి' కథను పంపుతున్నాను. అలాగే 'కళ్యాణ్' పత్రికకు 'అనోఖీ ప్రీతి కీ రీతి' (సాటిలేని ప్రేమ విధానాలు) పంపుతాను. వీటిని నేరుగా పంపమంటారా లేక అలహాబాద్ పంపించమంటారా? అలహాబాద్‌లో చాచాకు (పినతండ్రికి) పంపినట్లయితే అందులో ఒక ఉత్తరం ఉంచుతాను. ఏమని అంటే, వాటి సంపాదకులు వాటికి నా పేరుపెట్టనట్లయితే, 'శ్రీరామచంద్ర మిషన్' పేరు తప్పక ముద్రించాలి అని. తమరు ఎలా చెబితే అలాగే చేస్తాను. అయితే రెండవ కథ 'పథిక్' (బాటసారి) పంపటానికి యోగ్యమైనదే కాని అది ఇంకా పూర్తి కాలేదు.

శ్రీ బాబూజీ, ఇప్పుడు గమనం నిదానంగా ఉంది. స్వయంగా నా మనస్సు దిగులుగా ఉంది. నేను ఉన్న స్థానం నిదానంగా శుభ్రపడుతోంది. అందువలన నాకు మంచిగా అనిపించటం లేదు. మనస్సు ఉపశమనం పొందనంతవరకు, ఎంతో కొంత చికాకుగానే ఉంటోంది. తమ ఉత్తరం చదివిన తర్వాత దాని ప్రభావంతో కణాల భారమంతా కూడా తేలికపడుతూ దశలో శుద్ధత కలుగుతోంది. ఇందుకుగాను తమకు ధన్యవాదాలర్పిస్తున్నాను. స్థితి కొంత స్వచ్ఛతనందినట్లుగానే ఉంది కాని ఇంకా పూర్తిగా కాలేదు. నాకు ఉన్న కొద్దిపాటి గ్రహింపులో, ఈ పాయింట్ల జ్ఞానం మరియు పరిచయం పెంచటమనేది కేవలం తమ ఘనకార్యంగానే భావిస్తాను. నేను ఏ మార్గంలో ముందుకు వెళ్తున్నానో, వాటివలన సాధకునికి అనగా అభ్యాసీకి అభిరుచి మరియు ఉత్సాహం పెంపొందుతాయి. అలుపు అంటూ రానేరాదు. ఇంతేగాకుండా, దీని ప్రభావం శరీరం మీద కూడా ఉండి పరుగిడుతూ పచార్లు చేస్తూ ఉన్నాగాని, అలుపు అనేదే కలగదు. ఇంకా ఏమిటంటే, నేను నిద్రిస్తున్నపుడు ఒక విధంగా మానసికంగా గాఢనిద్రలోకి జారుకోవచ్చు. రెండో విధంగా శాశ్వత నిద్రలోకి కూడా జారుకోవచ్చు. అందుకని నిద్రలో కూడా జాగ్రదావస్థ ఉంటోంది. ఇప్పటికి ఇంకా దశ పూర్తిగా తెరచుకోలేదు. దానిని సరిగ్గా అర్థం చేసుకున్నాక వ్రాస్తాను. 'మాలిక్' కృపతో ఈ విషయంలో ఆలస్యం జరగదని ఆశిస్తున్నాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. నేను 'కళ్యాణ్' పత్రికకు 'పథిక్' అను కథను మాత్రమే సిద్ధంకాగానే పంపిస్తాను.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 428

లఖీంపుర్,
07.10.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. కేసర్‌కు తమరు చెప్పిన కొన్ని విషయాలు, తమ ఆరోగ్యం గురించిన విషయాలు కూడా తెలుసుకుని సంతోషించాను. ఈసారి ఉత్తరం వ్రాయటం చాలా ఆలస్యమైంది, కనుక తమరు తప్పక క్షమించాలని ప్రార్థిస్తున్నాను. తమరు, నన్ను తప్పక క్షమిస్తారని ఆశిస్తున్నాను. ఉత్తరం వ్రాయటానికి సమయం దొరక్కపోవటం, అలసట, అశ్రద్ధల వలన వ్రాయలేకపోయాను. ఈ విధంగా ఉత్తరం వ్రాయలేకపోయినందుకు నాకు దిగులుతో శాంతి లేకుండాపోయింది. మా సాధకులకు ఇటువంటి తపన అవసరం కూడా. 'ధర్మయుగ్'కు కథను పంపించాను. వారు ఏమి వ్రాస్తారో వేచి ఉండి దానిని తమకు తెలియజేస్తాను. ఉదరం బాగానే ఉంది. ఇప్పుడు ఉన్న దాని కంటె బాధ ఎక్కువ పెరగటం లేదు. 5,6 రోజుల నుంచి తావూజీ దశ బాగున్నట్లు గ్రహిస్తున్నాను. వారి మనస్సుకు చెందిన కణాలనుంచి కూడా స్థూలత్వం తొలగిపోతున్నట్లు అనిపిస్తోంది. ఆ స్థానంలో చాలా స్వల్పమైన కాంతి యొక్క ఛాయ వంటిది ఉన్నట్లు అర్థమవుతోంది. అలహాబాద్‌లోని అభ్యాసులందరి ఆత్మిక ఉన్నతి కొద్దిగా ఏర్పడుతున్నదని తెలుసుకుని చాలా సంతోషం కలిగింది. **'మాలిక్' యొక్క కృపాశక్తికి చెందిన అల్పమహిమతో రాళ్ళు కూడా కరిగి నడుస్తాయి. పురోగమనం కోసం మాకు రాళ్ళను కరిగించాల్సిన అవుసరం చాలా ఉంటుంది. పూజ్య నా శ్రీ బాబూజీ! ఇంకా ఏమిటంటే, రాళ్ళు మాకు ఈశ్వర సాక్షాత్కారానికి ఎలా సహాయపడతాయి? అనే ఈ రహస్యం కూడా వెల్లడవుతుంది. అది ఎప్పుడంటే, ఎవ్వరైనా ఆ విధంగా కరిగిన స్థితిలో ఉండి ఈ హద్దుకు చేరినవారు దొరికితే, అటువంటివారిని చూసి రాళ్ళు (శరీరం యొక్క కణకణం మరియు శరీరతత్వం యొక్క జ్ఞానం) కూడా కరిగిపోతాయి. నా అదృష్టం అలాంటి వారిని వెదకిపట్టుకుంది. ఈ అదృష్టం కల్పించిన ఈశ్వరునికి కోటానుకోట్ల ధన్యవాదాలు.**

ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, ఎక్కువగా ఒక మూగబోయిన మనస్సులాగా ఉంటున్నాను. ఈ విషయం కూడా నాకు తెలియకుండా ఉంది. దాని స్పృహ ఎప్పుడైనా జనం గుంపుగా ఉన్నపుడుకాని, గోలగోలగా ఉన్నప్పుడు కాని కలుగుతుంది. ఇంకా ఎంతగానంటే, ఆ గుంపు నుంచి, ఎవ్వరైనా తొలగమని చెప్తేగాని బయటపడలేకపోతున్నాను. ఎప్పుడైనా జన సమూహంలోకి వెళ్ళినప్పుడు ఇలా జరుగుతోంది. ఎడమకాలి బొటనువ్రేలు ప్రక్కనున్న వ్రేలులో ఏమి జరిగిందో ఏమో తెలియదు కాని బాధగాను, బాగా తొలిచినట్లుగాను ఉండి, ఏదో కీటకం పాకుతున్నట్లు భావించి కాలు విదిలించాను. కుడివైపు మాత్రం అప్పుడప్పుడు, క్రిందివైపు, పైన కూడా ఉంటోంది. దశలో ఇప్పుడింకా చైతన్యం కనిపించటం లేదు. శ్రీ బాబూజీ, ఇందువలన నా మనస్సు అధైర్యంగా ఉంటోంది. పూర్తిస్థాయిలో నేను అటువైపు అనగా 'మాలిక్'వైపు దృష్టి నిలపలేకపోతున్నాను. మనస్సును కూడా అటువైపు మళ్ళించలేకపోతున్నాను. జ్ఞానేంద్రియాలపట్ల నాకు విరక్తి కలిగిందని చెప్పవచ్చునేమో కాని, దశానుభూతి యొక్క అనుభూతి మాత్రం నాకు తప్పనిసరిగా ఉంటోంది. దీనినే 'తమరు' జ్ఞాపకమనిగాని, స్మరణ అనిగాని చెప్పవచ్చు.

నా పరమపూజ్య శ్రీ బాబూజీ, ఈ దశ ఏమిటోగాని, మనస్సు విచార సాగరంలో నిమగ్నమై ఉన్నట్లు అనిపిస్తోంది. నేను ఆ స్థితిని పట్టించుకోకపోయినట్లయితే, రోజంతా ఏదో ఒకటి వ్రాస్తూ ఉంటాను. కాని ఇదంతా నా మనస్సుకు అతీతమని ఖచ్చితంగా అనిపిస్తోంది. ఎందుకంటే, నా మనస్సు ఆ ఆలోచనలను సమీకరించి వ్రాయటంలోనే బాగా అలసిపోతోంది. అలాంటప్పుడు ఈ ఆలోచనలు తిష్టవేయటానికి స్థానం ఎక్కడ ఉంది? ఇంకొక ఆశ్చర్యం ఏమిటంటే, మనస్సు ఎటువైపు మళ్ళితే, దానికి తగిన ఆలోచనలే రేకెత్తుతాయి. ఇప్పుడు ఇసుక

మైదానం కూడా కనుమరుగైపోయినట్లు అనిపిస్తోంది. ఎందుకంటే, ఆ మైదానానికి చెందిన ఆలోచన కూడా మంచిదిగా అనిపించటం లేదు. కాని ఈ మైదానం కూడా నాకు శుచిగా, సమతలంగా (చదునుగా) ఉన్నట్లు అనిపించటం లేదు.

కేసర్ ఆదివారం నాడు అలహాబాద్ వెళ్తుంది. అమ్మ తమకు శుభాశీర్వచనాలు చెబుతున్నారు. ఇప్పుడు దీపవాళి కూడా దగ్గర పడుతోంది. తమరు రాత్రి 12 గం॥ల నుంచి ఉదయం 11 గం॥ల వరకు ఇక్కడ ఉంటారు. లఖనోర్‌లో శక్తి యొక్క కేంద్రం (Focus of Power) దాని దిగువవైపుగా ఉంది. ఇది 7,8 రోజుల నుండి అనుభవమవుతోంది. కేసర్ ఇక్కడ రెండు ఉత్తరాలు నకలు తీసి వెళ్ళింది. ఇంకొక మూడు ఉత్తరాలు అక్కడ నకలు తీసి తెచ్చింది. ఈ ఫైలు నావద్ద ఉంది. నేను కూడా ఎంతోకొంత నకలు తీస్తాను. దశలో స్వచ్ఛత లేకపోవటంచేతగాని, దశ తెరచుకోకపోవటం వలనగాని మనస్సులో ఇంకా చైతన్యం కలగలేదు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 429

లఖీంపుర్,

12.10.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు వచ్చారు. వారి ద్వారా విషయాలు, తమ ఆరోగ్యం గురించి తెలుసుకుని సంతోషించాను. కాని తమ శ్వాస ఇబ్బంది మరియు నీళ్ళ విరోచనాలు ఉన్నాయని తెలుసుకుని చింతిస్తున్నాను. తమకు ఈ విరోచనాలు ఎందుకు అవుతున్నాయి? ఉబ్బసంతో తమకు బలహీనత ఏర్పడుతుంది కనుక ఏదైనా మందు వాడండి. నా ఆరోగ్యం ఇప్పుడు మెరుగవుతోంది. తమకు వ్రాసినప్పటి నుండి, 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని వ్రాస్తున్నాను.

నా పరమ పూజ్య శ్రీ బాబూజీ! నేను 'మాలిక్'ను ప్రేమించలేక పోతున్నాను. ఇది నా ఫిర్యాదు. నా ఒక్కొక్క కణం ప్రేమకోసం ఖాళీగా ఉన్నది. దీనితో ఎప్పుడైనాగాని ఈశ్వరుడు నాకు ఈ అమూల్యరత్నాన్ని ప్రసాదిస్తాడు అని ఆశిస్తున్నాను. నా శరీరం యొక్క కణకణం ఒక గిన్నెలాగా అయిపోయింది. ఇప్పుడు దశ ఇలా ఉంది: ఇప్పటివరకు హృదయం కంటె సూక్ష్మమైనది, తేలికైనది ఏదీ లేదని వింటున్నాం. కనుక దాని గమనం క్షణం ఇక్కడ, క్షణం అక్కడ ఉంటున్నది. నా స్థితి ఎలా ఉంది అంటే, ఈ గమనాన్ని కనుక అరికట్టినట్లయితే, నా ఒక్కొక్క కణమూ హృదయంలాగే అయిపోతుంది లేదా హృదయంగానే అయిపోతుంది. ఈ దశ నుంచి శూన్యత్వం యొక్క పరిమళం వస్తూ ఉన్నట్లు అనిపిస్తోంది. కాని ప్రతికణం యొక్క గమనం మరియు హృదయం యొక్క గమనం ఒక్కటిగా అయిపోయింది. కేవలం ఒకే ధ్వనిలో "హాఁ, మాలిక్ ప్రేమ ఎక్కడైనా దొరికితే" అంటూ లయమైపోతున్నాయి. నా బాబూజీ, ఇప్పుడు హృదయం, ప్రతికణం యొక్క స్థితి మరియు లోపల బయట స్థితి ఒకే విధంగా ఉంటోంది. ఇప్పుడు నా స్థితి ఎటువంటిదంటే, తపన ఉంది. బాధ లేదు. పోటుపెడుతున్నటువంటిది హృదయం యొక్క బాధగా ఉండి, తరచుగా 'మాలిక్' యొక్క జ్ఞాపకాన్ని కలిగిస్తోంది.

ఇప్పుడు మైదానం సీదా సాదాగాను, అంతులేనిదిగాను అనిపిస్తోంది. కాని దీనిలో అంతులేనిది ఏదో, నేను చెప్పలేకపోతున్నాను. ఎందుకంటే, దానిని శాంతి అని చెబుదామంటే, ఆ దశకు కూడా హద్దు ఉంది. ఒకవేళ దానిని మించి తొంగిచూద్దామనుకుంటే, శాంతి అని సంబోధించటానికి వీలుపడటం లేదు. పోనీ ఆనందం అని చెబుదాం అంటే అది కుదరదు, ఎందుకంటే, దానికి కూడా హద్దంటూ ఉంది. అంతకుమించి ఆలోచించినట్లయితే, అది కూడా పరమానందం అని చెప్పటానికి యోగ్యమనిపించటం లేదు. శ్రీ బాబూజీ, ఇప్పుడు నాకు ఒకే శబ్దం దొరకుతోంది.

అది ఏమిటంటే, 'అశాంతి' అని చెప్పవచ్చు.  అది మార్పుచెంది హృదయ వేదనగా మారిపోయింది.

ఇప్పుడు, వెన్నెముక నుంచి మెదడు వరకు ఒక నాడి స్థిరంగా నిలిచి ఉన్నట్లు ఉంది. దానిలో లోపల, బయట ఎంత చలనం ఉన్నా కూడా తేడా ఏమీ కనిపించటం లేదు. దీనిని మనసు గతి అని చెప్పవచ్చు అనుకుంటే, దానికి ఏమి అభ్యంతరం ఉండదు. దీని సంబంధం, మెదడుకు పైన, ఏదో పైప్రపంచంతోనే ఉంటోంది. అది ఆలోచనలు కల్పిస్తుంది. కాని ఈ అనుభూతులను ఎవరు పరిగణిస్తారో తెలియదు. ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, లోపల, బయట కూడా ఎటువంటి బంధనంగాని, ఆవరణగాని కనిపించటం లేదు. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఒక కణం నుంచి మరొక కణానికి కూడా సంబంధం లేకుండా ఉంది. అన్నీ శుద్ధంగాను, ఖాళీగాను, దేనికదే స్వతంత్రించి ఉన్నట్లు కనిపిస్తోంది. జీవితం ఇప్పుడు ఆలోచనలతో పోషించబడుతోంది. పూజ్య శ్రీ బాబూజీ! 'మాలిక్' యొక్క ఈ అద్భుతాన్ని చూసినవారు ఎవరైనా ఇటువంటి మహిమను ఎవ్వరికైనా చూపగల సాహసం ఉన్నదా అని ఆశ్చర్యపోక తప్పదు. నేనయితే చూసి పులకించిపోతున్నాను. ఇప్పుడు నా 'మాలిక్'కు ధన్యవాదాలు చెప్పటానికని, నా ప్రపంచంలో  డాబుసరి మాటలు కూడా లేవు. ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, నా శిరస్సు ఎప్పుడూ వంగియే ఉంటోంది. ఒకవేళ 'మాలిక్'కు ధన్యవాదాలు తెలపటం కోసం శిరస్సు పైకెత్తినాగాని, ఏమి చెప్పాలో తెలియటం లేదు. మళ్ళీ శిరస్సు స్వయంగా ఎప్పుడు వాలిపోతుందో కూడా తెలియటం లేదు. నా శిరస్సు వంగి ఉన్నదని కూడా జ్ఞాపకం లేకుండాపోతున్నది. ఇదియే ప్రేమదశగా ఉంది. శిరస్సు వంగి ఉండటం మినహా నా నుంచి ఇంక ఎటువంటి ప్రయత్నం లేకపోయింది. నాకైతే అర్థం కావటం లేదు కాని, 'మాలిక్' నన్ను తన రాజ్యంవైపుగా లాక్కొని వెళ్ళుతున్నట్లుగాను, నేను ఆ మార్గంలోనే ఇప్పుడు ఉన్నట్లుగాను అనిపిస్తోంది. దశ, దాని అనుభూతి కంటే కూడా చాలా తేలికగా ఉంటోంది. ఇలా ఉండగా కూడా, 'మాలిక్' కృపతో దశ శుద్ధంగా ఎదుట పడుతోంది. అలాగే దృష్టి కూడా వెంటనే అలాగే అయిపోయి దానిని చదివేస్తోంది, వెంటనే కొన్ని మాటల ద్వారా వెలువడుతోంది. నా దశ ఇప్పుడు మరపుస్థితిలో ఉంటోంది. అది చాలా స్పష్టంగా ఎదుటనే ఉన్నప్పటికీ, మనస్సును ప్రేరేపించనంతవరకు, స్పృహ కలగదు, జాగృతం కాదు, చదవశక్యమూ కాదు. ఒకవేళ ఈ ప్రేరేపణను నిలిపివేసినట్లయితే, ఆ పరిశీలన ఆగిపోతుంది. ఏదైనా వ్రాయటానికైనా, చెప్పటానికైనా ఈ దశ ఇలాగే ఉంటోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 430

లఖీంపుర్,
17.10.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది, చదివాక అత్యంత ఆనందం కలిగింది. పరమ పూజ్య బాబూజీ, తమరి ప్రేమాన్విత వాక్కులు "నేను నీ పగ్గాలు నా చేతుల్లో ఉంచుకుంటున్నాను" అని చదువుతూ ఉంటే అత్యంత ఆనందం కలుగుతోంది. ఇంకను ఒక్కొక్కసారి సాధకుల శ్రేణిలో నేను లెక్కకు వస్తానా? అనే ఆలోచన కలుగుతోంది. ఎందుకంటే, ఎప్పటివరకైతే సాధకుని పగ్గాలు 'మాలిక్' చేతిలో ఉంచుకుంటారో అప్పటివరకు ఈ ప్రశ్నయే నిరర్థకమవుతుంది. ఈ బాలికలో సాధన చేయగల శక్తి లేకపోయినా కూడా 'మాలిక్' చేయూత నిచ్చినందుకు వేలకువేలుగా ధన్యవాదాలర్పిస్తున్నాను. ఇప్పటివరకు నా సంరక్షణా భారం వహించింది 'అతడే'. ఇంక ముందు కూడా 'అతడే' బాధ్యత వహిస్తాడు. ఇప్పుడు నేను ఎక్కడైన తప్పు చేస్తాను అనే భయం లేదు. ఏదైనా సరైనది

కూడా చేయనపుడు తప్పు చేయటానికి అవకాశం ఎక్కడ ఉంటుంది? నేను ఇప్పుడు స్వతంత్రంగానే సంచరిస్తున్నాను. శుక్లాజీ అక్కడకు వెళ్ళి 'తమర్ని' కలిశారు. అది చాలా మంచిదయ్యింది. లేకపోతే అంధకారంలోనే పడియుండి దానినే ప్రకాశంగా భావిస్తూ ఉండేవారు. పూజ్య శ్రీ బాబూజీ, నాలో ఒక చిన్న లోపం ఉంది. అది ఏమిటంటే, 'మాలిక్'పట్ల ఒక్కింత ప్రేమయైనా ఎవ్వరోలోనైనా చూసినపుడు, నా మనస్సు ఎంతగా ఉప్పొంగిపోతూ ఉందంటే, అతని దోషాలు ఇంకేమీ కనిపించవు. పూజ్య మాస్టర్ సాహెబ్‌లో ఎటువంటి లోపం లేదు కనుక, వారి పరిశీలన ఎల్లప్పుడూ సరైనదిగానే ఉంటుంది. 'తమరు' తమ విలువను శూన్యంగా చెప్పారు. తమను గురించి చెప్పటానికి దీనికిమించిన వివరణ మరొకటి ఉండబోదు. ఇది తమకు చెందిన అసమానమైన విషయం. బహుశా ఇటువంటి ఉపమానం ఎన్నడూ ఎవ్వరూ కూడా చెప్పి ఉండరు. ఈ స్థాయికి చెందినవారు ఎవ్వరూ లేకపోయాక ఇటువంటి ఉపమానం చెప్పగలిగినవారు మాత్రం ఎవరు ఉంటారు. తమకు ఉబ్బసం వలన కలుగుతున్న కష్టాన్ని విని అందరూ చింతిస్తున్నారు. పూజ్య శ్రీ బాబూజీ, షుమారు 7,8 రోజుల నుండి నాకు తెలియకుండానే హృదయం ప్రార్థిస్తోంది. ఆ ప్రార్థన ఏమిటంటే, "ఈశ్వరా, నా బాబూజీకి ఉబ్బసం వలన కష్టం కలగకుండా ఉండుగాక!" అని. ఈ కారణంతో ఒకటి రెండు రోజులు బలవంతంగా ఇచ్ఛాశక్తిని నిదానంగా ప్రయోగించాను. అలా ఎందుకో తెలియదు. నా శ్వాస కూడా 4,5 రోజుల నుండి ఇబ్బందికరంగా ఉండగా మందు తెచ్చుకున్నాను, దారిలోకి వచ్చింది. పొట్టలో వ్యాధి లక్షణాలు ఏమీ కనిపించటం లేదు కాని 6-10 సంవత్సరాలు వ్యాధిగ్రస్తురాలనుగా ఉండటం వలన మళ్ళీ కనిపిస్తూ కొద్ది సమయం తర్వాత వేగంగానే తరలిపోతోంది. బసంత పంచమి ఇప్పుడు మమ్మల్ని తొందరపెడుతోంది. ఇది చాలా సంతోషమే. ఇప్పుడు తమవద్దకు చేరుకోవటానికి ఇంకా 6 రోజులు గడువే ఉంది. అది త్వరగా గడచిపోవాలనిపిస్తోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఎప్పుడైతే తమరు "నీ హృదయం వాస్తవికతవైపు వేగంగా ఆకర్షితమవుతోంది" అని వ్రాశారో అప్పుడు నాకు ఆశ్చర్యం కలిగింది. కాని 'తమరు' వ్రాసిన దానిపట్ల నాకు దృఢ విశ్వాసం ఉంది. ఆశ్చర్యం ఎందుకు కలుగుతోంది అంటే, నేను రోజంతా ఈ విషయం గురించే ప్రయత్నిస్తున్నాను, హృదయం అటువైపు మొగ్గు చూపాలి అని. అయితే జ్ఞాపకం ఎంతగా పాడయ్యింది అంటే, అరనిమిషం కూడా లగ్నం కావటం లేదు, దృష్టి మరలిపోతోంది. చాలా సమయం తర్వాత జ్ఞాపకం వస్తోంది. శ్రీ బాబూజీ, ఇదివరకైతే, ఈ విధంగా జ్ఞాపకం వచ్చినపుడు ఒక దశలో కుదుపు లాంటిది అనుభవమవుతూ ఉండేది. అటువంటిది ఇప్పుడు ఏమీ అనుభవంలోకి రావటం లేదు. దశలో బహుశా నా జ్ఞాపకం యొక్క ప్రభావం ఏమీ లేనట్లుగాను లేదా జ్ఞాపకమనేది దాని దరిదాపులకు చేరలేనట్లుగాను అనిపిస్తోంది. ఇంతకుపూర్వమైతే దశలో హృదయం క్రిందికి దిగివచ్చినట్లు ఉండేది. కాని ఇప్పుడు అది, తుపాకులు మ్రోగినా, గుంపు చేరినా, జ్ఞాపకం వచ్చినా రాకపోయినాగాని హృదయానికి కుదుపు కలగటంగాని, క్రిందికి వంగటంగాని అసంభవంగా అనిపిస్తోంది. శ్రీ బాబూజీ, ఎందుకంటే ఈ స్థితిలో నా హృదయం కోల్పోయి ఎక్కడకు పోయిందో తెలియటం లేదు. ఇంకొక రకంగా చెప్పాలంటే, హృదయం దశలోనే ఇమిడిపోయి ఉంటోంది. నా జ్ఞాపకం అను త్రాడు (బంధం) తెగిపోయింది. నేను ఇప్పుడు ఒక దారి తప్పిన దానిలాగ ఉంటున్నాను. వెన్నెముకకు సమీపంలో, భుజానికి క్రింద, ఏదో ప్రాకుతున్నట్లుగాను, చలనం ఉన్నట్లుగాను తెలుస్తోంది. నాకు తరచుగా ఏమి అనిపిస్తోంది అంటే, నాకు తెలియకుండానే మాట్లాడుతున్నట్లుగాను, నడుస్తున్నట్లుగాను లేదా అన్ని స్పందనలు ఒక చిత్రమైన సూటిదశలో, సామాన్యమైన దశలో కలిసి ఉంటున్నట్లుగా అనిపిస్తోంది. ఒక వింతైన ప్రాకృతిక జీవనంలో నేను ఉంటూ, దాని అనుభూతి నాకు స్పృహ లేకుండా కలుగుతోంది.

నిన్న 'ధర్మయుగ్' పత్రిక వాళ్ళు నా కథను తిరిగి పంపించివేశారు. అలాంటి కథను అందులో ముద్రించమని చెప్పారు. ఇప్పుడు "నవనీత్ పత్రిక" మరియు "హిందుస్థాన్" పత్రికలలో ప్రయత్నిస్తాను. పినతల్లి భర్త గారికి, లేఖ

వ్రాసి రేడియోలో 10 నిమిషాలు ప్రసంగించటానికి అవకాశం కలుగుతుందేమో ప్రయత్నించమని అడుగుతాను. విషయం నేనైనా నిర్ణయిస్తాను లేదా వారైనా సూచించవచ్చు. ఏమవుతుందో వేచి చూస్తాను. నేను నా కథలో నోట్స్ కూడా ఇచ్చాను. తమరు వస్తున్నారు అంటే అదే మాకు సంతోషం.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 431

లఖీంపుర్,
29.10.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. మీరందరూ, దద్దాతోపాటు క్షేమంగా చేరి ఉంటారని భావిస్తున్నాను. నేను కూడా తావూజీతోపాటు 'మాలిక్' కృపతో క్షేమంగా చేరాను. నా కళ్ళెదుట ఇంకనూ 'శ్రీ బాబూజీ'యే కనిపిస్తున్నారు. నాకయితే ఏ పని చేయటానికి మనసుపడటం లేదు. ఒకే సౌందర్యానికి ఎదుట అన్నీ తీసికట్టుగా అయిపోయాయి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఉన్న దశలో ఈ విధంగా ఉంటోంది. ఎప్పుడూ కూడా 'మాలిక్' యొక్క పొడుగైన చేతులు నా తలపైన ఉంటున్నాయి. లేదంటే, ఇంకో స్థితిలో తేలు నా ఎదుట ఉన్నట్లుగాను, నేను దానిని పరిశీలిస్తున్నట్లుగాను ఉంది, కాని దాని స్పృహ లేదు. దానిని ఒక కర్రమీద నిలిపి బయట పారవేయటానికి వెళ్లగా ఎవ్వరో నా చేయిపట్టుకుని కుదిపేసినట్లు, అప్పుడు కళ్ళలో వెలుగు నింపితే (స్పృహ కల్పిస్తే) తేలు అనుకని చంపేసినట్లు అనిపించింది. ఇప్పుడు దశ ఎలా ఉందంటే, స్పృహ లేకుండా ఉంటే, స్పృహ ఉండటం లేదు, ఇంకనూ స్ప ృహలో ఉన్నప్పటికీ స్పృహ ఉండటం లేదు. నాకు ఆశ్చర్యం కలిగిస్తున్న విషయం ఏమిటంటే, ఏదైనా స్కూలులో నన్ను పాడమని అడిగినట్లయితే, నేను స్వయంగా స్ప ృహలేని స్థితిలోనే ఉన్నా కూడా దానంతట అదే సవ్యంగా పాట నోటి నుంచి వెలువడుతుంది.

ఇప్పుడు రెండు మూడు రోజులుగా బహుశా 26,27 తారీఖుల నుండి అదేమిటో తెలియకపోయినా గాని, వీపు వెనుక వెన్నెముక మీద ఒక పిడికిలి బిగించియున్నట్లుగాను, అది నా శరీరాన్ని తాకుతూ ఉన్నట్లుగాను ఉంది. దాని మూలంగా నా వీపు అంతా ఎడతెరిపిలేకుండా (Vibration) కంపనంతో ఉంటోంది. ఏదో ఒక రకమైన తేలికపాటి కాంతి వెలువడుతోంది. తరచుగా వాటినుంచి కొంత వేడి వస్తున్నట్లు అనుభవమవుతోంది. నా పూజ్య బాబూజీ! వీపు అంతా తెరుచుకుని తేలికగా ఉన్నట్లు ఉంది. అప్పుడప్పుడు వీపు అంతటా ఏదో వ్యాపించి ఉన్నట్లు అనిపిస్తోంది. బహుశా ఇది గట్టి ప్రకంపనల మూలంగా కావచ్చు. కాని ఆ విధంగా ప్రకంపనలు ఉన్నా కూడా, వెన్నెముక మధ్యలో ఉన్న నాడీ మండలం మీద (అనగా కుండలిని మీద) ఎటువంటి ప్రభావం లేనట్లు ఉంది. అది (నాడీ మండలం) చలించకుండా స్థిరంగాను, ఉన్నది ఉన్నట్లుగాను నిటారుగానే ఉంది. వీపు అంతటా, బహుశా ప్రకంపనల మూలంగా ఒక రకమైన తేలికపాటి శాంతి, సౌమ్యత వంటి దశ వ్యాపించి ఉన్నట్లు అనుభవమవుతోంది. వీపు మొత్తంలోని ఎముకలు, నరాలు పలచబడి కరిగిపోయాయి అన్నట్లు ఉంది.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు ఈ దశలో ఏమనిపిస్తోంది అంటే, హృదయం పేరుకేగాని, నావద్ద ఏమీలేనట్లుగానే ఉంది. హృదయం యొక్క బంధనం తెగిపోయినట్లుగాను, అంతటా వ్యాపించిపోయినట్లుగాను అనిపిస్తోంది. అది ఏమీలేదు అని చెప్పినా గాని ఏమీకాదు. అది ఒక నిర్లక్ష్యపు దశ. నా బాబూజీ, ఇంకా ఏమనిపిస్తోంది అంటే, సమస్త జగత్తులోను, ఆఖరికి బ్రహ్మాండంలోను నా హృదయం వ్యాపించి ఉన్నట్లు అనుభవమవుతోంది. 'మాలిక్' కృపతో

‘Z’ పాయింట్ శుద్ధంగా తెరవబడి ఉంది. ఎందుకంటే, ఇటువంటి చదునైన మైదానంలో నేను ముందుకు సాగిపోతున్నట్లు అనుభూతి చెందుతున్నాను. ఎందుకోగాని ఆ వ్యాపించి ఉన్న హృదయం నాలో పీల్చుకుపోతున్నట్లు అనిపిస్తోంది. అదేమిటోగాని అప్పుడప్పుడు పిచ్చిచేష్టలు చేయాలని మనస్సు దిగజారుతుంది. కాని ‘మాలిక్’ కృపా రూపమైన పగ్గాలు, నా మనస్సులో కొంత స్పృహ నిలిపి, ఆ విధంగా జరగకుండా చేస్తున్నాయి. కాని జ్ఞానేంద్రియాల గ్రహింపు అంతా సమాప్తమైపోయినట్లుగాను, పూర్తిగా నిశ్చలంగా ఉన్నట్లుగాను చూస్తున్నాను. నాలోనివన్నీ చలనరహితంగా ఉన్నట్లు కాదు. ఒక్క క్షోభ (తపన) మాత్రమే ఉన్నట్లుగాను, అదే మనస్సు రూపంలో నావద్ద ఉన్నట్లుగాను అనిపిస్తోంది. బాబూజీ అదేమిటోగాని, నేను తమ దగ్గర ఉన్నంతవరకు అక్కడి నుంచి కదలాలని మనస్సుకు అనిపించేది కాదు, కాని ఇంటికి వచ్చాక మళ్ళీ ‘మాలిక్’ దగ్గరకు వెళ్ళాలని అనిపించటం లేదు. అయినాగాని నేను వెళ్ళటానికే సిద్ధపడుతున్నాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 432

లఖీంపుర్,
1.11.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం ఈ రోజు చేరింది, చదివి సంతోషించాను. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందనుకుంటున్నాను. దీదీ ఆరోగ్య పరిస్థితి మరియు తమది తెలియచేయగలరు. తమరు ఇంతగా తీవ్ర బాధకు గురికావటం ఎప్పుడూ చూడలేదు. అది ఇంకనూ తగ్గకుండా కొనసాగుతుంది. ఈశ్వరుడు ఎందుకోగాని మన ఆక్రందన మీద దృష్టి పెట్టడంలేదు. కాని ఇప్పుడు ‘అతని’కి దృష్టి నిలపకతప్పదు. బాధితుని నిజమైన ఆర్తి తీర్చబడుతుంది. తగిన బాధకంటె ఎక్కువగా ఉంటే నేను సహించలేను. ఈశ్వరుడు దయాళువు, అందులో సందేహంలేదు. దైవం తలిస్తే తమ బాధను మించిన అధిక బాధను కూడా తగ్గించివేయగలడు. తావూజీ ఉదయం పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి దగ్గర సిట్టింగ్‌కు వెళ్ళుతున్నారు. మంచి స్థితిపైన ఏవో పరదా వంటి ఆటంకాలు ఉన్నాయి. ‘మాలిక్’ కృపతో అవి కూడా శుభ్రపడతాయి.

నా అశ్రువులు గోలా స్టేషన్ చేరేంతవరకు ధారగా వస్తూనే ఉన్నాయి. ఈ బాధతో శ్రీ బాబూజీకి కష్టం కలగకూడదని నేను ప్రయత్నించినప్పటికి ఆ కన్నీరు ఆగలేదు. అలా ఉంటున్నప్పటికీ 24 గంటలూ ‘మాలిక్’ యొక్క సూక్ష్మరూపం యొక్క ప్రతిబింబం అనుభవానికి వస్తూనే ఉంది. అయినా గాని ఇలా ఎందుకు అవుతోందో తెలియటం లేదు. ఇప్పటివరకు ఉన్న స్థితి ఏమిటంటే, ఎవరైనా శ్రీ బాబూజీ అని పలికితే, ఒక విధమైన కలత లోపల తొణికిసలాడుతోంది. అది ఏమైనా కావచ్చు, కాని దానిలోనే నాకు ఆనందం కలుగుతోంది. కన్నీరు ప్రవించటమనేది నా బలహీనతగా అనిపిస్తోంది. బాబూజీ, తమరు చేసిన పొగడ్త ఎవరికోసం, తమ కుమార్తె మరియు సేవకురాలికి చెందినదే. వారు స్త్రీ కాదు, పురుషుడు కాదు, ఆమె ఎవరైనా ‘తమ’కు చెందినదే. ఆమెలో పొగడదగిన అంశమేదైనా ఉంది అంటే అది నా ‘మాలిక్’ యొక్క అల్పమైన మహిమయే. ఇది నా యదార్థమైన దృఢ నమ్మకం. తమరు నన్ను నిదానంగానే ముందుకు తీసుకుని వెళ్ళండి. తమకు ఎలా ఇష్టమైతే అలాగే తీసుకుని వెళ్ళండి. నేనయితే ప్రతి స్థితిలోను సంతోషంగానే ఉన్నాను. స్వామి ప్రసన్నుడు కావటమే సేవకుని కర్తవ్యంగా ఉంటుంది. నాకు మాత్రం ‘మాలిక్’ కావాలి. ‘మాలిక్’ కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

ఈ స్థితిలో, మెదడు మీద ఒక మత్తు యొక్క మగత వంటిది వ్యాపించి ఉంటోంది. ఇప్పుడు గమనం అయితే ఒక తిన్నని చదరపు మైదానంలో ఎలా సాగాలో అలాగే ఉంటోంది, కాని నా మనస్సు అయితే అప్పుడు కూడా విలవిలలాడకుండా ఎగిసిపోయి ఎక్కడికో పారిపోవాలను తలంపుతో వ్యధ చెందుతోంది. బాబూజీ, ప్రస్తుతం ఉన్న స్థితి ఎలా ఉందంటే, ఒక శుద్ధమైన, తేలిక దశ నాలో ఎప్పుడూ ఇమిడి ఉంటూ, చొచ్చుకుపోతున్నట్లు ఉంది. ఎంతగా అది కలిసిపోతుందో, అంతగా లోపల కరిగిపోయి కొంత ఖాళీ ఏర్పడుతూ ఉంది. ఆ ఖాళీ అనేది పెరుగుతూ పోతోంది. ఇటువంటి తేలికైన మైదానం నాలో ఎప్పుడూ కలిసిపోయి ఉంటోంది. అది జీర్ణమైపోతున్నట్లు ఉంది. ఇంకా ఏమనిపిస్తోంది అంటే, బుద్ధి, మనస్సు యొక్క తేలికదనం, స్పందనం అన్ని చలించకుండా, స్థిరంగా ఉండిపోయి మౌనందాల్చినట్లు ఉంది. ఇంకా ఇదేమిటోగాని, నా కంటె పెద్దవారుగాని, చిన్నవారుగాని ఎవ్వరైనాసరే నన్ను తరచి తరచి చూడలేకపోతున్నారు. ఎందుకంటే, వారందరి పాదధూళిలాగా నా ఉనికి వినమ్రంగా ఉంటోంది. ఇది ఈ విధంగా స్వల్పదశగా ఉంది. పూజ్య బాబూజీ, నా ఈ దశలో లోపల, బయట అన్నీ కూడా చలనం లేకుండా స్థిరంగా ఉన్నట్లే నాకు అనుభవమవుతోంది. జడ, చేతనాలు కూడా ఇలాగే నిశ్చలంగా ఉన్నట్లు అనుభవమవుతోంది.

మొన్న శిరస్సు మధ్యలో, పాపటికి ఆనుకుని ఎడమవైపున, పాపట ప్రారంభమైన చోటు నుంచి, బాలురకు పిలక ఉండే ప్రాంతం వరకు మాడు అంతటా పిప్పరమెంట్‌లాగా షుమారు రెండు, రెండున్నర గంటలపాట తిమ్మిరితో చల్లదనం వ్యాపించి ఉంది. ఇప్పుడు కూడా అప్పుడప్పుడు కొంచెం తక్కువ స్థాయిలో అనుభవమవుతూ ఉంది. వీపు అంతటా 24 గంటలూ స్పందన ఉంటోంది. గిలిగింత లాంటిది, చల్లదనం వంటిది అప్పుడప్పుడు అనుభవమవుతూ ఉన్నాయి. ఇటీవల అప్పుడప్పుడు మెడలో వెన్నెముక ప్రారంభమయ్యే స్థానం నుంచి, నాలుగు అంగుళాలు దిగువ ఉన్న వెన్నుపూస మరియు వీపు మధ్య ప్రాంతంలో చాలా కంపనం ఉంటోంది. అదే విధంగా వీపు అంతటా ఎల్లప్పుడూ ఉంటోంది. అదేమిటో తెలియదు కాని, తరచుగా కూర్చుని ఉన్నపుడు ఒక మృతస్థితి వంటిది ఏర్పడుతుంది, కాని పూర్తిగా స్పృహ కోల్పోకుండా ఉంటోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 433

లఖీంపుర్,
4.11.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది. చదివి సంతోషించాను. మనసు యొక్క బంధనం ఇంకా కొంత ఉందని, దాని మూలంగా కొంత అసహనీయమైన ఒత్తిడి ప్రభావం ఉంటోందని తమరు వ్రాసినది హేతుబద్ధంగానే ఉంది. ఈ కారణంవల్లనే నేను కూడా నా మనస్సులో స్వచ్ఛత లేకుండా ఉండటాన్ని చూస్తున్నాను. ఆ లోటు మాత్రమే కాదు. పూర్తిస్థాయిలో స్వచ్ఛత పొందలేకపోతున్నాను. 'మాలిక్' యొక్క కృప మరియు శక్తి వలన ఎప్పుడైనా దశలో నాకు అవాంతరం లేదా అసహనం అనుభవంలోకి రాకుండా ఉంటోంది. అటువంటప్పుడు నాకు చింత ఎందుకు? 'తమ' ఇష్ట ప్రకారమే చేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా బాబూజీ! అదేమిటోగాని నాలో ఒక విధమైన స్థితి ఈ విధంగా ఉంటోంది. దానిలో దృష్టిని సారించటమో లేక నిలబెట్టటమో జరిగినప్పుడు శరీరంలో శిధిలత్వం కలుగుతోంది, అది కూడా పూర్తిగా మృత్యువాత లాంటిదే.

ఆ విధంగా ఊహా మాత్రంగా ఉంటోంది కాని, నాకు ఇప్పుడు స్థితి యొక్క జ్ఞాపకం కూడా ఉండటం లేదు. దాని వలన ఆలోచనల పోరాటంతో మనస్సు జోడించబడి ఉండటం వల్లనో లేక దానిలో మమేకమై ఉండటంవల్లనో అలసట కలగటం లేదు. ఇంక ఆలోచనల జాడయే నాకు తెలియదు. మనస్సు ఆలోచనా సాగరంలో మునిగి ఉన్నట్లుగా కొంచెం భ్రమ వంటిది కలుగుతోంది కాని, అది నాకు అనుభవంలోకి రానందున అలుపు అంటూ లేకుండా ఉంది. నా బాబూజీ! నాది ఒక జడ (నిర్జీవ) అవస్థ అయిపోయినట్లు అనిపిస్తోంది. కాని చైతన్యం అనేది ఎంత ఉందంటే, మొక్కలు, చెట్లు జీవించటానికని భూమి నుంచి సారం పీల్చుకుంటున్నట్లు ఉంది. అదేమిటోగాని, తరచుగా హృదయం యొక్క వ్యాపకం వేయి బ్రహ్మాండాల సృష్టి కంటె ఎక్కువగా ఉన్నట్లుగాను, దానికి పరిమితి కూడా లేనట్లుగాను అనుభవమవుతోంది. 'మాలిక్' కృపతో ఎటువంటి దృఢమైన స్థితి ఉందంటే, ఎవ్వరైనా నన్ను అగ్నిలో దహించినాగాని, నీటిలో ముంచినాగాని నా స్థితిలో రవ్వంత మార్పు కూడా కలగనట్లు ఉంది. దృష్టి లేక బుద్ధి మరలనట్లుగాను, ఉన్నది ఉన్నట్లుగానే నిశ్చలంగా, స్థిరంగా ఉన్నట్లుగాను అనుభవమవుతోంది. ఇలా ఉంటూ కూడ, దీని భావం కాని, లేదా జ్ఞానం కాని లేని స్థితిగా ఉంది. నా మనస్సుకు ఎలా ఉంటున్నది అంటే, అసలు నా వద్ద ఏమీ లేదన్నట్లుగాను, నాకేమీ తెలియదు అన్నట్లుగాను, ఈ దశ ఉంటున్నా కూడా దానిని మరచి ఉన్నట్లుగానే ఉంటున్నాను. ఎప్పుడైనా జ్ఞాపకం వస్తున్నదంటే, అది వేరే విషయం. ఈ రోజు ఉదయం నుండి మనస్సు పూర్తిగా ఖాళీగాను, నిశ్శబ్దంగాను ఉంది. గాంభీర్యం అనేది మనస్సుకు అలవాటుగా అయిపోయింది. ఈ రోజు నుంచి నా దశలో ఇంకొంత మార్పు వచ్చింది కాని దానిని ఇంకా పూర్తిగా పసికట్టలేకపోయాను. దశ అయితే ఎదుట స్వచ్ఛంగానే ఉంది కాని వ్రాయనలవి కాకుండా ఉంది. ఇప్పుడు శుద్ధం అని చెప్పటం కొంచెం అసహనీయంగా అనిపిస్తోంది. ఆ దశ ఎదుట ఉన్న దానిలో వ్యాప్తిగాని మరేమీగాని లేవు. నేనయితే అన్నీ కోల్పోయినదానిలాగా ఉన్నాను, కాని అది కూడా నాకు తెలియకుండా ఉంది. ఎవ్వరైనా కోల్పోవటం అనే శబ్దం ఉచ్చరించినపుడు ఆ కోల్పోవటం అను సంగతి జ్ఞాపకం వస్తోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 434

లఖీంపుర్,
7.11.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. తమ ఉత్తరంలో తమరు తమ అలవాట్లను గురించి వ్రాస్తున్నారు. ఆ ముత్యాలను పరిశీలించి నా హృదయంలో పేర్చుకోవాలని అనుకుంటున్నాను. కాని నా గ్రహింపుకు వచ్చినంతలో ఇంకను నా హృదయంలో ఆ ముత్యాలను జీర్ణించుకునే నైపుణ్యం ఉత్పన్నం కాలేదు. దానికి కారణం నాకు తెలుసు. నిదానంగా గ్రహింపుకు తెచ్చుకుంటూ వస్తున్నాను. నా బుద్ధికి తోచినంతలో, లయావస్థ యొక్క లోటు మరియు హృదయంలో ఒక రకమైన బంధనం అనుభూతి చెందుతున్నాను. ఇవియే నన్ను 'మాలిక్'లో లేక దశలో పూర్తిగా లయమైపోవటానికి అడ్డంకిగా ఉన్నాయి. ఆ బంధనం పూర్తిగా మసకబారి ఉండలేదు అన్నట్లు అనుభవమవుతోంది. నాకు అనుభవమవుతున్న దాని ప్రకారం బహుశా ఆ బంధనమే తమరు వ్రాసిన మన్మయీ–కోష్ అయి ఉంటుందని అనుకుంటాను. ఈ బంధనమే నా మనస్సు యొక్క సంపూర్ణ వ్యాప్తిలో ఒక రేఖలాగా ఉంది. ఎందుకంటే, నా 'మాలిక్' యొక్క పొడవైన హస్తాలు నన్ను అటువైపుగా గుంజుకెళ్ళి ఆ దశ యొక్క

అనుభవం కూడా కల్పించారు, కల్పిస్తున్నారు కూడా. 'అతని' కృపతోనే నా పురోగతిలోని ముళ్ళు, పుష్పాలుగా మారి నాకు దారి నిచ్చాయి. వీపు మీద ఉన్న చేతిస్పర్శతో నాకు సంబంధం ఉన్నది కనుక అది తమ వరమిచ్చే హస్తమేనని నేను గ్రహించాను. తావూజీని గురించి 'తమరు' వ్రాసినది సహేతుకంగానే ఉంది. నా అనుభవం కూడా అదే. కాని ఇక్కడ కొన్ని ఆందోళనల మూలంగా అన్నీ మట్టిలో కూరుకుపోయాయి. అయితే ఇప్పుడు 'మాలిక్' దయతో దశలో మళ్ళీ వెలుగు వచ్చింది లేదా దశ మళ్ళీ మెరుగుపడింది. ఈ అసంభవమైనదానిని సాధించిపెట్టినందుకు 'మాలిక్'కు వేలకువేలు ధన్యవాదాలు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈశ్వరుని హృదయమంతా నాలో అంతటా కలిసిపోతున్నట్లుగాను, అంత విశాల దివ్య హృదయమూ నాలో కలిసిపోతూ ఉన్నట్లుగాను అనుభవమవుతోంది. ఇంత విశాల హృదయ క్షేత్రం అంతా నాలో ఎలా కలిసిపోతున్నాగాని, దాని పూర్తి దశ నాలో చొచ్చుకుపోయినాగాని, ఈ అనుభూతి తప్ప నామీద ఇంక ఎటువంటి ప్రభావం లేనట్లు అనిపిస్తోంది. ఇది కూడా నాకు తెలియనటువంటి దశగా ఉంటోంది. నా బాబూజీ, ఎందుకంటే, నేను దీనికి కూడా వేరుగా ఉన్నట్లు లేదా అతీతంగా ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. కాని, అదేమిటో తెలియదుగాని, 'నేను' అను శబ్దం పలకవలసి వచ్చినపుడు, చెప్పలేకపోతున్నాను. నేను వేరు లేదా అతీతం అని చెప్పినా కూడా అసహనీయంగానే ఉంటోంది. స్థితి గంభీరంగా ఉండటంచేత కలిగిన శుద్ధత, దశలో కలిగిన చాంచల్యంచేత కాకుండా కేవలం ఆలోచన చేయటంతోనే అసహనం ఎందుకు కలుగుతున్నదో నాకు తెలియటం లేదు. కాని ఇటువంటి అసహనం కలిగించే విషయాన్ని 'మాలిక్' తొలగించివేశారు. ఇంకా ఏమిటోగాని, నమ్రత యొక్క అనుభూతి కూడా దశలో కొంత అసహనం యొక్క అనుభూతిని కల్పిస్తోంది. సిగ్గు మూలంగా నేనొక విషయాన్ని వ్రాయలేకపోయాను. దానివలన ఎటువంటి దుష్ప్రభావం నా మీద పడదను విశ్వాసంతో వ్రాస్తున్నాను. దీనిని నా సంపూర్ణ ప్రయత్నంలో కూడా సంస్కరించలేకపోయాను. తమరు ఇక్కడకు వచ్చినపుడు నేను తమవద్దకు రావటానికి లేదా తమకు కనిపించటానికి నా మనస్సు ఎందుకో అంగీకరించలేదు. అది తమకే తెలియాలి. అలా వేరుగా ఉన్నందుకు కూడా మనస్సు వికలమైంది. ఇదంతా తమకు తెలుసు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 435

లఖీంపుర్,
13.11.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా చేరింది. చదివి సంతోషించాను. తమరు ఇప్పుడు దయచేసి ఎవ్వరైనా డాక్టర్‌చేత వైద్యం చేయించుకోండి. వారి ద్వారా ఉబ్బసం మరియు ఉదరానికి చెందిన బాధ రెండిటికి చికిత్స జరిగి నివారణ అవుతుంది.

తమరు లయా అవస్థ మరియు (Initiation) దీక్ష పొందటం యొక్క ప్రాముఖ్యత గురించి వ్రాసినటువంటిది వాస్తవంగా సరైనదే. తమరు తమ బాధ, కష్టం మరియు శిక్షకునిగా శరీర త్యాగం చేసిన తర్వాత, అభ్యాసులకు చేకూరే లాభం ఏమిటో వ్రాశారు కదా, అది వాస్తవమే. కాని నా దృష్టి ఈ విధంగా కలిగే లాభంవైపు మరలటం లేదు. 'మాలిక్' చిరాయువులుగా ఉండాలని, 'వారి' కష్టాలు తగ్గిపోవాలని మాత్రమే నేను రేయింబవళ్ళు ఈశ్వరునికి

విన్నవించుకుంటున్నాను. తమరు క్షమిస్తారు అంటే నేను ఒక మాట చెబుతాను. అభ్యాసులమైన మేము ఒకవేళ అతిత్వరగా లాభం పొందాలంటే, 'తమ' బాధ, కష్టాల ద్వారా లాభం పొందటానికి బదులు, 'తమ' యొక్క (Supreme Power) సంపూర్ణ శక్తితో ఒక్క సెకను కాలంలోనే ఏదో ఒక్కటి కావటానికి సిద్ధం కావచ్చును కదా! అప్పుడింక శరీరం ఉన్నా, లేకున్నా, నాడీ మండలం ఛిద్రమైపోయినా పెద్ద విషయం కాదు. వాస్తవానికి లయ అవస్థ పొందటానికి అభ్యాసీ సోదరీ సోదరులు ప్రతి ఒక్కరూ పూర్తిగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. తావూజీ విషయంలో కూడా చివరకు పరిష్కరించినందుకు 'మాలిక్'కు మా అందరి తరఫున వేలకువేలు ధన్యవాదాలు అర్పిస్తున్నాము. ఇది కృప యొక్క పరిమితియేగాక, 'మాలిక్' చరణాల యొక్క మహిమోన్నతియే. **వాస్తవానికి గురువు తల్లివంటివారుగా ఉండి, పిల్లలను అన్నివిధాలుగా మంచిచెడ్డలు చూసి అసలైన (సత్యవంతమైన) జీవితంలోకి మరల్చుతారు.** 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఈ దశలో, నా లోపల కరగటంగాని, దేనితోనైనా సంబంధం కలిగి ఉన్నట్లుగాని అనుభవం కావటం లేదు. దానికి బదులుగా ఇప్పుడు లోపల ఒక తేలికపాటి వెచ్చదనం వంటిది ఉంటోంది. అయినప్పటికీ దానిలో వేడిమి ఉందో లేదో నేను అంచనా వేయలేకపోతున్నాను. ఇప్పుడు కరగటం అను శబ్దం నాకు పైన అనిపిస్తూ ఉందే కాని, దాని ప్రభావం లేకుండా ఉంది. 'మాలిక్' కృపతో (Corpse-like) మృత తత్వం మాత్రం తప్పకుండా అనుభవమవుతూ ఉంది. మరపుస్థితి ఎలా ఉందంటే, నాపై అసలు దాని ప్రభావమే ఉండటం లేదు. మరపుస్థితి ఉందనుకుంటే ఉన్నట్లుగాను, లేదనుకుంటే లేనట్లుగాను ఉంటోంది. నా పరమ పూజ్య బాబూజీ, ఈ దశ మామూలుగాను, సాధారణమైనదిగాను ఉన్నట్లు అనిపిస్తోంది. నా కణకణం, స్థిర రూపం దాల్చినట్లు ఉంది అని ఇంతకుపూర్వం వ్రాసినటువంటిది ఇప్పుడు నేను స్వయంగా గ్రహించలేకపోతున్నాను. అసలు ఆ స్థిరత్వం ఉందో లేదో కూడ నాకు అవగాహన లేకపోతోంది. నేను ఏమీ తెలియనట్లు ఉంటున్నాను. నాకు అన్నివైపులా ఒక సాధారణమైన ప్రపంచమే కనిపిస్తోంది. అయినాగాని (Simplicity) నిరాడంబరత లేదా సామాన్యత మరియు (Stability) స్థిరత్వం నాలో మునిగిపోయాయి అని అనిపిస్తోంది. ఎందుకోగాని మౌనంగా ఉండే స్వభావమే మంచిదని అనిపిస్తోంది. ఈ స్థితికి ఏదైనా శబ్దం సరితూగటం లేదు కాని, దశయే మౌనం దాల్చినట్లయ్యింది. పూజ్య బాబూజీ, 'తమరు' వ్రాసిన దాని మీద నేను నిశితంగా దృష్టి నిలిపినపుడు, మనస్సు యొక్క ఏకాగ్రత కొంచెం బంధనంలాగానే అనిపిస్తోంది. అంతేగాని దానికిమించి ఇంకా ఏమి అనుభవం కావటం లేదు. ఇది కూడా స్వల్పంగానే ఉంది. ఇప్పుడు దశయే కాదు, అన్ని రంగులు కలిసిపోయి తెలుపుగా కాకుండా మరొక రంగుగా అయిపోయినట్లు ఉంది. కాని అదేమిటో నాకు తెలియటం లేదు. కాని దానిలోనయితే రంగు ఏమీలేదు అని చెప్పాలి. అన్ని రంగులు రంగును కోల్పోయాయి అని చెబుదామంటే, అన్ని స్థితులు దానిలో మునిగిపోయి లయమైపోయినట్లు అనిపిస్తోంది. ఎందుకంటే, ఇంకేదైనా దశ దానిలో కలిసిపోయినట్లుగాని, కరిగిపోయినట్లుగాని కనిపించటం లేదు. నేను ఇంకేమి వ్రాయాలి? పూజ్య శ్రీ బాబూజీ, నేను ఇప్పుడు సరిగ్గానే వ్రాస్తున్నాను. ఎందుకంటే, నేను చూస్తున్నదానినిబట్టి, ప్రతి దశ నుంచి చివరకు నా రెక్కలు తడారిపోయి లేదా తడిలేనట్లుగానే వెలువడుతున్నట్లు అనిపిస్తోంది. దానిని సాదాతనంలో (Emptiness) ఖాళీగా ఉన్నట్లు చెప్పవచ్చు. ఎందుకంటే, దీనిని శూన్యత అని చెప్పతగదు. ఇప్పుడు నా రూపమే లేకపోయాక, నా దశ ఎటువంటిదో ఎలా చెప్పగలను! నా దశ ఏమిటో తమకే తెలియాలి. పిప్పరమెంట్ బిందువుల్లాగా అంతటా నాకు చల్లదనమే అనుభవమవుతోంది. తమకు తోచినట్లుగానే నన్ను నడిపించుకు వెళ్ళండి. నా పురోగతిలో 'మాలిక్' దయతో ఇసుమంతైనా లోపం కలగటం లేదు. అది కూడా హార్ట్ రీజియన్ (హృదయ మండలం) దాటాక. పరమ పూజ్య బాబూజీ! ఇప్పుడు తమ దయతో హార్ట్ రీజియన్ (హృదయ మండలం) నాకు కూడా పిల్లల ఆటస్థలంలాగా అనిపిస్తోంది. (గాంభీర్యత) పరిపక్వత, తర్వాత దశతో ప్రారంభమయ్యింది. ఇప్పుడు 'మాలిక్' దయతో రంగులేని

దాని రంగుకూడా గ్రహింపుకు వస్తోంది. అయితే నా ఆలోచన దీనిలో కూడా మునిగి పొడిగానే వెలువడుతోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 436

లఖీంపుర్,

16.11.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందిందని ఆశిస్తున్నాను. ఈశ్వరుని కృపతో తమ ఆరోగ్యం ఇప్పుడు కుదుటపడి ఉంటుందని అనుకుంటున్నాను. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఈ విధంగా ఉంది. ప్రతిదశ యొక్క ఆధ్యాత్మికత నాకు లేకుండా పోయింది. ఎందుకంటే, నేను ఇప్పుడు ఏ దశను గురించి వ్రాస్తూ ఉన్నానో అది అంతర్గతంగా 'ఉన్నది' అనిపిస్తుంది. వాస్తవానికి నా స్థితికి ఈ 'ఉన్నది' అను శబ్దం ఎంత మాత్రం తగదని అనిపిస్తోంది. నా రెక్కలు ఎండిపోయి ఉన్నాయి. ఇంతేకాకుండా, మనఃస్థితికి ఏమైందో ఏమోకాని, దానిని చూసి 'మాలిక్' నాలో కలిసిపోయాడని అనుకుందాము అంటే, అటువంటి అనుభూతి కలగటం లేదు. ఒకవేళ నేను దానిని ప్రాప్తింపజేసుకోవాలనుకున్నాగాని ఎటువంటి అనుభూతి కలగటం లేదు. రెండూ సరిసమానంగానే కనిపిస్తున్నాయి. ఇంతేకాదు, తెలుసుకోవటం, లేక అనుభూతి అను శబ్దాలను దీని (స్థితి) నుంచి తొలగించాల్సి ఉంటుంది. బాబూజీ, ఇది ఏమిటోగాని, శ్రద్ధ, విశ్వాసం, ప్రేమ, భక్తి, ఆనందం మొదలైనవానిలోగాని లేదా 'మాలిక్' యొక్క స్పర్శలో నన్ను ఎంతగా ముంచుతున్నా లేదా నేను ఎంతగా మునిగినా గాని చివరకు రెక్కలు తడి అంటనట్లు అనగా పొడిపొడిగానే వెలువడుతున్నాయి. ఏ దశ యొక్క స్పర్శ కూడా కలగటం లేదు. అది ఎంతగానంటే, 'Z' పాయింట్ దశలో కూడా నా స్థితి ఇలాగే ఉంటోంది, దాని వలన నేను ఆనందమే పొందలేకపోతున్నాను. ఎందుకంటే, ప్రయత్నించిన తర్వాత కూడా రెక్కలు పొడిపొడిగానే బయటకు వస్తున్నాయి. నేను, నా దృష్టి విస్తరించింది అని చెప్పాలనుకుంటే, అది అనుభవానికి రావటం లేదు. అలాకాకుండా ముడుచుకుపోయి నిస్తేజంగా అయిపోయింది అనిగాని, మరణించింది అనిగాని చెబుదామనుకుంటే, అప్పుడు కూడా నిర్లక్ష్యపు దశగానే ఉంటోంది. ఈ దశ ఏమిటో 'మాలిక్'కే తెలియాలి. నిజం చెప్పాలంటే, 'ఇది ఉంది', 'ఇది లేదు' అనే సంఘర్షణ సమసిపోయింది. ఇంకా ఏమిటంటే, అసలు నా జ్ఞాపకమే లేకుండాపోయింది.

నా పరమ పూజ్య శ్రీ బాబూజీ! దశలో ఏకత్వానికి స్థానమే లేదు అనే దశగా అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, ఎండిపోయిన రెక్కలు జ్ఞాపకం కూడా మరచిపోయినట్లు అనిపిస్తోంది. బహుశా వాటి ఈకలు కూడా రాలిపోతున్నాయేమో! దశ ఎటువంటి సమస్థాయిలో ఉందంటే, దశ బాగుందని అందామనుకుంటే, ఏ దశలో కూడా మనస్సు యొక్క దశలో ఏమి భేదంలేనట్లు అనిపిస్తోంది. ఎందుకంటే, ఈ దశలో నిజంగా మనస్సు యొక్క జాడ కూడా లేదు. అనగా ఎప్పుడు, ఎవ్వరు, ఎక్కడకు తీసుకుని వెళ్ళారు అని తెలుసుకోవటానికి అది (మనస్సు) ఉందా లేదా అన్నంతగా దాని జాడ లేకుండాపోయింది. అప్పుడప్పుడు కుడికాలు వ్రేళ్ళలో కొస నుంచి మధ్యన ఉన్న నరంలో పిప్పరమెంట్ వంటి చల్లదనం కూడుకుంటోంది. దాని సంబంధం శిరస్సులోని పిలక స్థానంలో ఉంటోంది. వీపుమీద 'మాలిక్' హస్తం సదా నిలిచి ఉండి మృదువుగా నిమురుతున్నట్లు ఉంది. మెడ క్రింద, వీపుకు ఇరువైపులా ఉన్న ఎముకలలో ఎడమవైపు దానిలో ఎడతెగకుండా పోటుపెడుతున్నట్లు అనిపిస్తోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 437

లఖీంపుర్,
19.11.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన కార్డు పూజ్య మాస్టర్ సాహెబ్‌గారివద్ద నుంచి తావూజీ తీసుకుని వచ్చి వినిపించారు. తమ కష్టం తొలగిపోతున్నదని తెలిసింది. ఇటువంటి సత్ఫలితం 'మాలిక్' కృపతోనే జరుగుతుంది, కనుక 'వారి'కి అనేక వేల ధన్యవాదాలు. మా అందరి తరపున కూడా తమకు ధన్యవాదాలు. ఎందుకంటే, మా వలన ఏదైనా తప్పు జరిగినా కూడా తమరు తమ ఆశీస్సులను మా అందరిమీద వర్షిస్తున్నారు. తమరు నా కడుపునొప్పి గురించి, నేను నా ఉత్తరంలో ఏమి వ్రాయలేదు, అని వ్రాశారు. పూజ్య బాబూజీ, నా వలన తమకు ఎప్పుడైనా కష్టం కలిగిందా! కాని తమరు ఎప్పుడూ నాకు తమ కష్టం గురించి వ్రాయలేదు. ఉత్తరంలో కనీసం ఆ వివరాలు కూడా వ్రాయలేదు. అయినా నేను కష్టాలలో కూడా నా స్థితి గురించి వ్రాస్తున్నాను. నా ఉదరం బాగానే ఉంది. దానిని గురించి చింతించవద్దు. కాని చాలా రోజుల నుండి దానిని ఒక విధమైన చల్లదనం పట్టిపీడిస్తోంది. పాదాలకు ఆవనూనె పట్టించినట్లయితే చలి బాధించదని వింటున్నాను. అందుకని ఇప్పుడు అలా చేయగా ఉపశమనం కలిగింది. దగ్గు ఏమాత్రం లేదు. దయచేసి తమ ఆరోగ్యస్థితిని తెలియపర్చండి. తమరు 'జౌన్‌పుర్' వెళ్తున్నారు అంటే నాకు చాలా సంతోషం కలిగింది. అక్కడి వారికి అత్యంత లాభం కలుగుతుంది. తమకు ప్రయాణంలో ఇబ్బంది కలుగుతుంది, కాని అక్కడ బాగా విశ్రాంతి లభిస్తుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వివరిస్తున్నాను.

17వ తారీఖు నుంచి, అదేమిటో తెలియదుగాని, మనస్సులో ఎటువంటి బంధనం అనుభవంలోకి రావటం లేదు. ఈశ్వరుని హృదయం అంతా నాలో జీర్ణమైపోయిందా అన్నట్లు ఉంది. అది ఎలా ఉందంటే, ఏదో వస్తువు ఒక్కపెట్టున జారిపడినట్లుగాను, వేడెక్కిపోయినట్లుగాను, ఇదే విధంగా నా హృదయం ఈశ్వరుని వశమైపోయినట్లుగాను అనిపించింది. వేడెక్కిపోయి ఏమీ జరగలేదు కాని, అన్నీ నా పిడికిలిలో బిగించబడినట్లు అనగా నా వశమైపోయినట్లు ఉంది.

నా పరమ పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు లయమైపోయే సామర్థ్యం నాలో లేనట్లుగా అనిపిస్తోంది. ఎంతగానంటే, దశలో కూడా లయమైపోయే ప్రయత్నంలో సఫలం కాలేకపోతున్నాను. ఎందుకంటే, మొదటి విషయం, మరపు కారణంగా ధ్యానం కలగటం లేదు. రెండవ విషయం, దేనిలోనైనా (మాలిక్‌తోసహా) లయమైపోయే సత్తా కూడా తరిగిపోయి, తుడిచిపెట్టినట్లు ఉంది. ఇంక నా స్థితి అంటారా, ఒక నీటికోడిలాగ నీటిలోకి వెళ్ళి కూడా నాకు తడి అంటనట్లు అనుభూతి చెందుతున్నాను. ఇంకోరకంగా చెప్పాలంటే, హృదయం నిస్సారంగా ఉంటోంది. అయితే భేదం లేకపోలేదు. ఎలా అంటే, నిస్సారమైన భూమి ఏదో ప్రయత్నంతో సారవంతంగా మార్చశక్యమవుతుంది. కాని ఈ విషయంలో అది లేదు. దీని నీరు ఇంకిపోయింది. ఈ స్థితి ఎలా ఉందంటే, దీనిమీద నీటి చుక్కలు రాల్చే ప్రయత్నం ఎప్పుడైనా చేసినా గాని, అది మధ్యలోనే ఎండిపోయినట్లు చూస్తున్నాను. అది 'మాలిక్'కే తెలియాలి. ఇంకా తెలియని విషయం ఏమిటంటే, నేనయితే నీటిలో మునిగిన నీటికోడిలాగా పొడిగా ఉంటున్నాను అని వ్రాశాను కాని, వాస్తవానికి దశ చుట్టుప్రక్కల ఎక్కడా నీటి జాడయే అనుభవానికి రావటం లేదు. అందుకని ఎండిపోయిన దానిలోనే ఈదుతూ, తిరుగుతున్నాను అని చెప్పాల్సి వస్తోంది. పూజ్య బాబూజీ! 'Z' పాయింట్ ఇప్పుడు పూర్తిగా శుద్ధమైపోయి తెరచుకుపోయినట్లు ఉంది. ఇంకా ఏమిటంటే, అన్నీ నా హృదయంలోనో లేక పొట్టలోనో ఉన్నాగాని,

ఎందుకో మరి, అక్కడ కూడా నా ఆలోచన యొక్క అనుభూతి నాకు కలగటం లేదు. అయినప్పటికి, పాయింట్ నాలో కుంచించుకుపోతూ వస్తోంది. అలా జరుగుతూనే దానితో కూడా జీర్ణమైపోతున్నట్లుగా అనుభవమవుతోంది. నా ఆలోచన ఆవిరైపోయింది. ఆలోచన యొక్క భ్రమ లేదా ఊహ లాంటిది ఏదైతే ఉందో అది కూడా బలం కోల్పోయినట్లయ్యింది. దానిని స్వచ్ఛం అనిగాని మరేదైనా అనిగాని చెప్పండి. నేను దాని గురించి పట్టించుకోను. నేను 'రాము'ని (బాబూజీ) సేవకురాలను. కాని సేవకత్వం అను స్పృహ లేదు. కనుక దానిని (సేవను) నియంత్రించాలన్నా నియంత్రించబడదు. 'మాలిక్' కూడా ఆ భారాన్ని తీసివేశారు. ఇప్పుడు కొంత సమత్వం వంటిది అయిన పరిస్థితి కొనసాగుతూ ఉంది అని చెప్పటం బాగుండదు. కనుక దయచేసి నన్ను క్షమించండి. మనస్సులో నయితే ఇటువంటిది ఏమీలేదు, అయినాగాని దశయే ఈ విధంగా ఎందుకు ఉంటున్నదో తెలియటం లేదు.

తావూజీ, లల్లూ, చిన్నసోదరుడు తమకు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 438

షాజహాన్‌పూర్,
21.11.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ప్రశాంతమస్తు. నీ రెండు ఉత్తరాలు నవంబరు 13, 16వ తేదీలవి అందాయి. నీ పరిస్థితికి తగిన మందును డాక్టర్ బి.యన్. సిన్హాగారు పంపించారు. ఆ మందు నీకు కూడా తెలియజేసి ఉంటారు, కనుక దానిని వినియోగించు. నీ వ్యాధిని పూర్తిగా నయంచేసే విషయం ఒకటి ఉంది. అది ఏమిటంటే, **నీవు బాగుపడుతున్నట్లుగాను, నీ వ్యాధులు అన్నీ తొలగిపోతున్నట్లుగాను సంకల్పం చేసుకోవాలి. దీనిని గురించిన ధ్యానం ప్రతిరోజూ ఒక గంట, అర్ధగంట చేస్తూ ఉండు. ఈ విధంగా నిరంతరాయంగా నీవు కొనసాగించినట్లయితే అన్ని వ్యాధులనుంచి విముక్తి పొందుతావు. ఈ పద్ధతిని కొంతకాలం నీవు అనుసరిస్తావని ఆశిస్తున్నాను. ఇంకా చెప్పాలంటే, ఒక నెల లేదా ఒకటిన్నర నెలల్లోనే నీ ఇబ్బందులు అన్నీ తొలగిపోతాయి.**

నేను నా గత రెండు ఉత్తరాల్లోను నా అనారోగ్య కారణంగా అభ్యాసులకు చేకూరే ప్రయోజనం గురించి వ్రాయటమేకాక, ఈ ప్రపంచం వదలి వెళ్ళాక అభ్యాసులకు ఒనగూరే లాభం ఏమిటో కూడా వ్రాశాను. ఇంకొక విషయం కూడా గత ఉత్తరాలలో వ్రాశాను, అయినా సంక్షిప్తంగా దీనిలో కూడా వ్రాస్తున్నాను, దీనితో ఆ విషయం పూర్తవుతుంది. అధ్యాపకుడు (టీచర్) ఉన్నతస్థితికి చెందినవాడై ఉండినట్లయితే అతడు తన ప్రతినిధిని (Representative) తయారుచేయాలి. అతడు తన దేహత్యాగం చేసే సమయానికి తన శిష్యులలో అందుకు తగినవారు ఎవ్వరూ లేకపోయినట్లయితే అతనికోసం వేచి ఉండాలి. ఒక మహాత్ముడు ఈ ప్రపంచం వీడి వెళ్ళిన నూట ఏభై సంవత్సరాల తర్వాత తన ప్రతినిధిని నియమించాడని ఒక వ్యాసంలో నేను చదివాను. స్వామి వివేకానంద మహాసమాధిని పొందిన తర్వాత ఎన్ని రోజులకు తన ప్రతినిధిని నియమించాడో నీకు తెలిసినదే. తన మిషన్‌లో తన అంచనా ప్రకారం యోగ్యుడైన మనిషి దొరక్కపోయిన కారణంగా, తన సంబంధాన్ని (Connection) మరో సంస్థతో ఏర్పరచుకొని నియామకం జరిపాడు. అసలు విషయం ఏమిటంటే, అటువంటి వ్యక్తి పరిపూర్ణశక్తిని సంగ్రహించుకున్నవాడై ఉండాలి. ఎందుకంటే, నిజమైన గురువు ఆర్జించిన ఆధ్యాత్మికత అంతా ఇక్కడే అనగా భూమిపైనే నిలిచిపోయి ఉంటుంది. యోగ్యుడైన వారెవ్వరూ దొరకకపోయినపక్షంలో ఆ శక్తిని ఇక్కడి వాతావరణంలో దాచి ఉంచుతాడు. గురువు జీవించి ఉన్న కాలంలోనే వారి శిష్యులు యోగ్యులుగా తయారుకావలసి ఉంటుందని, వారిలో ఏ ఒక్కరినో

తన ప్రతినిధిగా ఎంపికచేసుకోవచ్చు అని దాని అర్థం. ఫతేఘర్ నివాసి సమర్థగురు మహాత్మ శ్రీ రామచంద్రజీ మహరాజ్ మహాసమాధి పొందినప్పుడు, ఆ విషయం నాకు తర్వాత తెలిసింది. వారి సంపూర్ణ ఆధ్యాత్మిక శక్తి నాలో ప్రవేశించింది. అప్పుడు కలిగిన ఆ స్థితిని నేను డైరీలో వ్రాశాను. నేను ఈ పరిస్థితి ఏదో బదలాయింపు వంటిదని గ్రహించాను. ఆ తర్వాతనే 'వారు' (లాలాజీ సాహెబ్) మహాసమాధి చెందినట్లు నాకు వర్తమానం అందింది. ఈ శక్తిని జీర్ణించుకోవటంలో (అనగా ఇముడ్చుకోవటంలో) నా నాడీ మండలం అంతా కుదిపేసినట్లయ్యింది. వ్యాధికి గురైన తర్వాత (నరాలలో ఏర్పడిన గడబిడ కారణంగా) ఆ శక్తిని నాలో ఇముడ్చుకోగలిగాను. ఇప్పుడు **'వారి'** (లాలాజీ సాహెబ్) సంపూర్ణ శక్తి నాలో ఉంది. నేను ఆర్జించినది కూడా నావద్దనే ఉంది. అందువలన గురువు ప్రసాదించిన దానిని నేను వృద్ధి చేశాను కాని తగ్గించలేదు. ఇప్పుడు నా తర్వాత ఇది మరొకరికి బదలాయించబడుతుంది. అయితే ఇప్పటివరకు, ఈ శక్తినంతటినీ బదలాయించటానికి అర్హుడైన అభ్యాసీ ఎవ్వరూ నాకు కనిపించటం లేదు. అదే నాకు దిగులుగా ఉంది. ఎందుకంటే, అభ్యాసులు ఈ విధంగా తయారుకావటానికి ప్రయత్నించటం లేదు. నాకు కూడా సంవత్సరాలతరబడి నిరీక్షించే పరిస్థితి కలగకూడదని చింతిస్తున్నాను. ఇప్పుడు అసలు విషయానికి వస్తున్నాను.

గురువు ఆర్జించిన ఆధ్యాత్మికత అంతా (Representative) ప్రతినిధిలో ప్రవేశిస్తుంది. తర్వాత అతని ద్వారా దీక్ష పొందిన సభ్యులకు పాక్షికంగా లభిస్తుంది. ఈ శక్తి కేంద్రంగా ఆ ప్రతినిధియే ఉంటాడు. అతడు తన గురువుతో ఆంతరిక వార్తా సంబంధం కలిగి ఉండాలి. ఎందుకంటే, అతడు తన గురువు ఆజ్ఞానుసారమే వారి పనిని చేయాలి. ఆయన ఆజ్ఞలను ఇతరులు కాని, అనుయాయులుకాని అమలుపర్చవచ్చు. ఇతర అభ్యాసులు కూడా తగినంతగా పురోభివృద్ధి చెందినవారై ఉండి, వారి యొక్క పనిని చేయాలి. వారికి సమయోచితంగా తగిన సూచనలు అందించ బడతాయి. ప్రతినిధి ఎదిగినస్థాయికి ఇతర అభ్యాసులు కూడా ఎదగవచ్చు. అయితే దీనిలో ఉన్న భేదం ఏమిటంటే, ప్రతినిధి తన గురువుయొక్క శక్తి కేంద్రంగా ఉండగా, గురువు అతనిలో లయమై ఉంటాడు. ఇది గురువు ప్రపంచం విడిచి వెళ్ళిన తర్వాత కలిగే ప్రయోజనం.

చౌబేజి స్థితిని చూసి నాకు ఆనందం కలిగింది. నేను 2,3 సంవత్సరాల నుంచి వారి మీద నేను ఎంత శ్రమించినప్పటికి వారి స్థితిలో మార్పు రాలేదు. వారి విషయంలో ఏమి చేయాలో అర్థం కాలేదు. 'మాలిక్' అనుగ్రహం కలిగిన కారణంగా ఆయన (చౌబేజి) సంస్కరించబడి ఒక మంచి స్థితికి చేరుకోగలిగారు. ఆయన విధిగా సత్సంగ్‌లో పాల్గొంటూ ఈశ్వరప్రేమను పొందటానికి సాధన చేయాలి. అది సాధ్యపడాలంటే దైవాన్ని (మాస్టర్) నిరంతరం జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలి.

నీవు నవంబరు 13వ తేదీ ఉత్తరంలో ఒక విషయం ప్రస్తావించావు, ఒక విధమైన వెచ్చదనం అనుభవమవుతున్నది అని. ఇది ప్రేమ మూలంగా ఏర్పడిన ఒక స్థితి. ఆ ప్రేమ ఉప్పొంగినపుడు ఈ వెచ్చదనం యొక్క అనుభూతి కలుగుతుంది. ఎప్పుడైనా మరణంలాంటి స్థితి కలగవచ్చు. కలగబోతున్నస్థితి, అది ఎన్ని రోజుల్లో అయినా సరే, దానికి అది సూచనగా ఉంటుంది. ఈ మరణంలాంటి స్థితి అనగా జీవం లేదనిపించేటటువంటి స్థితి, లయ అవస్థకు చెందినదికాగా అది స్థిరంగా ఉన్నట్లయితే చాలా మంచి స్థితి. సాధారణ స్థితి కలిగి ఉండటం ఒక మంచి స్థితియే, ఇది ఆత్మకు సంబంధించి ఉంటుంది. స్థిరత్వం అనేది తెలియకపోవటం జరిగిందంటే అది దానికంటె కూడా ఉన్నతమైన స్థితి. నిశ్శబ్దంగా ఉండటం బాగుందని ఎందుకు అనిపిస్తుందంటే, ఆ నిశ్శబ్దంలో పరమానందం కలుగుతూ ఉంటుంది. నీకు మాట్లాడే అవకాశం ఉండదు. "అన్ని రంగులూ మిశ్రితమైపోయి ఒక్క తెలుపు రంగు మాత్రమే నిలిచి ఉంటోంది. అయితే దానిలో ఏదో ఒక రంగు తెలియనిదిగా ఉంది" అని వ్రాశావు. ఇదొక చాలా మంచి స్థితి. నీవు తెలియటం లేదు అని వ్రాసిన రంగు, వాస్తవికత (రియాలిటి) యొక్క అవశేషం. అర్థం చేసుకోవాలంటే దీనిని ఉషోదయ సమయపు రంగుగా చెప్పవచ్చు. ఇంక నవంబరు 16వ తేది ఉత్తరం విషయానికి వస్తే, దానిలో జవాబు

ఇవ్వదగిన అంశం ఏమీలేదు. అయితే ఒకటి, "ఒకవేళ 'మాలిక్' నాలో విలీనమైపోయి ఉండి ఉంటే, దాని అనుభూతి కలగటం లేదు" అని వ్రాసిన దానికి అర్థం, ఆ సమ్మేళనమైతే జరిగింది, కాని ఈ రెండింటి మీద దృష్టి నిలిపినపుడు అది అనుభవానికి వస్తుంది. అతిథి ఇంటికి చేరిపోయాక ఇంక అతని కోసం నిరీక్షణ ఉండదు. ఇప్పుడు నీ 'Z' పాయింట్ యొక్క యాత్ర పూర్తయినట్లు నాకు అనిపిస్తోంది. అయితే అది స్వల్పంగా, కొంచెం మందకొడిగా జరిగింది. అందువలన నీవు పూర్తిగా దాని అనుభూతి చెందలేదు. ఉన్నతస్థానాల యాత్ర ప్రారంభమైనపుడు అభ్యాసులు 'తమ' దృష్టిని అటువైపే (అనగా దాని మీదే) అంటి పెట్టుకునే విధంగా నిలపాల్సి ఉంటుంది. అప్పుడు దానిలో లీనమైపోవటమే కాకుండా దానిపై ఆధిపత్యం కలుగుతుంది. నేను ఇప్పుడు ఈ స్థానం గురించి ఆలోచనపెట్టాను. ఇంకా మిగులు ఏమీ లేకపోయినట్లయితే ముందుకు నడిపిస్తాను. బహుశా అసంపూర్ణత ఏమీ ఉండకపోవచ్చు. అయినా గాని బాగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటాను.

నేను డిశంబరు 6వ తేదీ సాయంత్రం జౌన్‌పూర్ వెళ్ళటానికి నిశ్చయించుకున్నాను. కడుపు నొప్పి ఇంతకు ముందు కంటె తక్కువగానే ఉన్నప్పటికీ ఇంకా ఉంది. శ్వాసకు సంబంధించిన ఇబ్బంది దాదాపు తగ్గిపోయింది. నేను జౌన్‌పూర్ వెళ్ళబోయేముందు డాక్టర్‌ను అడిగి మందు తీసుకుంటాను. దానివలన కొంత ఉపశమనం కలుగుతుంది. ఖర్చులు గురించి ఆలోచిస్తూ నేను డాక్టర్ దగ్గరికి వెళ్ళకుండా బాధను భరిస్తున్నాను. 18 నవంబరు 1954న 12గం. 30ని॥లకు నీలో ఏదో అలసట ఉన్నట్లుగా గుర్తించాను, నేను వెంటనే దానిని తొలగించాను. బహుశా నీవు కూడా దీనిని గ్రహించి ఉంటావు. ఇది ఆధ్యాత్మిక యాత్ర చేసిన మూలంగా కలుగుతుంది. ముఖ్యంగా, అభ్యాసులు ఎవరైతే వేగంగా యాత్ర జరుపుతారో వారికి ఈ అలసట కలుగుతుంది. ఈ అలసట కూడా ఒక శుభప్రదమైన విషయమే, ఎందుకు? అది శీఘ్ర గమనానికి శుభవార్త వంటిది. ఎప్పటివరకైతే అలసట ఉంటుందో అప్పటివరకు నిస్సందేహంగా యాత్ర కొనసాగించలేరు. అలసట అనేది ఎప్పుడు గుర్తించబడుతుందో అప్పుడు దానిని వెంటనే తొలగించటం శిక్షకుని బాధ్యత. ఎందుకంటే, అభ్యాసీ యొక్క సమయం వృధా కాకుండా ఉంటుంది. నవంబరు 27న మీ పినతండ్రిగారు అలహాబాద్ నుంచి మా రాష్ట్రీయ సమావేశానికి హాజరై నవంబరు 28న తిరిగివెళ్లారు.

చౌబేజికి ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 439

లఖీంపూర్,
22.11.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇటువంటి మహోన్నతమైన 'మాలిక్' దయకు కృతజ్ఞతగా ప్రసాదం అర్పించటానికని తమకు ఇష్టమైన తీపి పదార్థాలను తెప్పించాను. వాటిని జాగ్రత్తగా కట్టి ఉంచి, తమ వద్దకు రావటానికి సిద్ధంగా ఉన్న విష్ణు ద్వారా పంపించాలనుకున్నాను. 3 రోజుల నుంచి అతని కోసం ఎదురు చూస్తున్నాను. అతడిని కలుపుకువద్దామనుకున్న ప్రధాన్ అనారోగ్యం చెందటం వలన విష్ణు ప్రయాణం కూడా రద్దయ్యింది. ఈ పదార్థాలు 'మాలిక్'కే ప్రసాదంగా అర్పించబడ్డాయి. అవి వారికే చెందుతాయి, పంపలేకపోయాను అన్న దిగులుతో ఉన్నాను. నేను వెళ్ళి బాబూజీకి తినిపించి రావాలని భావించాను, కాని అది సంభవం కాదనిపించింది. అవి చెడిపోతాయను తలంపుతో కట్టిసిద్ధం చేసినవాటిని తెరచి సాయంత్రం అందరికీ పంచాలని అనుకున్నాను. అవి 'మాలిక్'కు చేర్చగలిగినా లేకున్నా అవి 'మాలిక్' ప్రసాదమే కదా! అవి తమవద్దకు

చేరాయి, తమరు ఆరగించారు అని నా దృఢ విశ్వాసం. (అనగా హృదయ పూర్వకంగా బాబూజీకి అర్పించబడ్డాయి, వస్తువు ఇక్కడే ఉన్నాగాని) 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, ఈ దశలో అదేమిటోగాని, 'మాలిక్'పట్ల భక్తికిగాని, గౌరవానికిగాని తావులేకుండాపోయింది. ఏమైనాగాని, అతడే నా సర్వస్వం. ఇపుడు మనస్సు నిరంతరం తన (నా) 'మాలిక్'తో మాట్లాడుతున్నట్లు అనిపిస్తోంది. అదేమిటో తెలియకున్నది. కాని ఈ విధంగా మాట్లాడటమనేది నా అలవాటుగా అయిపోయినట్లు అనిపిస్తోంది. ఈ మాటలు ఎవరితో ఏమి మాట్లాడుతున్నానో తెలియదు. నిద్రించిన తర్వాతగాని, మేల్కొన్న తర్వాతగాని ఇదే పరిస్థితి అవగాహనకు వస్తోంది. ఇది ఏమిటా అని ఆలోచిస్తే అంతుబట్టటం లేదు. నా హృదయంలోకి ఎవరు ప్రవేశించి దానిని మథించి, మనస్సుతో మాట్లాడిస్తున్నారో అర్థం కావటంలేదు. ఈ స్థితిలో ప్రతి ముసుగు 'మాలిక్'నే అయిపోయి, ప్రతి శ్వాస అతనిలోనే కలిసిపోయినట్లు ఉంది. ఆ సంగతి ఏమిటోగాని, ఈ విధంగా ఉండి కూడా, నేను కలిసిందెక్కడ, విడిపోయిందెక్కడ (దూరంగా ఉన్నదెక్కడ) అని చెప్పాలి. నాకు రెండూ సమానంగానే ఉన్నాయి. శ్రీ బాబూజీ, ఇలా ఉంటున్నప్పటికీ వాణి (వాక్కు) మాత్రం మౌనంగానే ఉంటున్నది. అది ఏమైనా చెప్పటంగాని, హృదయాన్ని అతని సమక్షంలో వ్యక్తం చేయటంగాని సాధించలేకపోతోంది. ఎందుకంటే, బహుశా దాని శబ్దాల ఖజానా కొల్లగొట్టబడి ఉంటుంది. మనస్సు మాత్రం మాట్లాడుతూనే ఉంది.అదేమిటో అర్థం కావటంలేదు. ఇంక హృదయమంటారా! అది ఏమైపోయిందో, దాని స్థితి నాకేమీ అర్థం కావటంలేదు. దాని కోశాగారం దోచుకోబడింది, దివాలా తీసింది. అయినా కూడా లెఖ్ఖచేయనట్లుగానే ఉంది. అది ఎంత హీనంగా అయిపోయింది అంటే, ఈ శబ్దం (దివాలాతనం) దానిపట్ల నిరర్థకమని అనిపిస్తుంది. స్వభావం మాత్రం, సామాన్యత మరియు సరళత్వాల వస్త్రం ధరించి ఉంది. అయితే ఈ సంగతి మనస్సుకు తెలియదు. దీనిని ఎటువంటి స్థితిగా చెప్పవచ్చును అంటే, మృతునితో ఎవ్వరైనాగాని నీలో ఇటువంటి మంచి గుణాలు ఉన్నాయి అనిగాని, నీకు ఎన్నో మంచి దశలు ఉండేవి అనిగాని చెప్పినట్లయితే ఆ మృతుడు ఉలుకూ పలుకూ లేకుండానే ఉంటాడు. ఈ దశ అటువంటిదేమో అర్థం కావటంలేదు. పరమ పూజ్య శ్రీ బాబూజీ! ఈ స్థితి ఏమిటోగాని, నయనాల్లో అశ్రుధారలు, హృదయంలో బాధ, శ్వాసలో ఆహా అని నిట్టూర్పుగాని లేకపోయినప్పటికీ, ఒక రాతిలాగా ఉంది. అయితే నా మనస్సు, ఎవ్వరైనా దగ్గర కూర్చుని ఉండి తనగోడు వినాలి అన్నట్లు ఉంది. ఇదేమిటో కూడా తెలియదు. ఇది జీవితం యొక్క మరో కోణంలాగ ఉంది. అది 'అతని' రంగులేని రంగులో, అది సాదాగా గాని, సరళంగా గాని, సహజంగా గాని ఉంది అని చెప్పినప్పటికీ, అది దానిలోనే కలిసిపోయి ఉంటోంది. హృదయం యొక్క ఆ పల్చటిపొర ఏదైతే 'మాలిక్'లో పూర్తిగా కరిగిపోవటానికి అడ్డంకిగా ఉన్నదో, మనస్సులో హాయిగా ఉండటానికి ఒక మసకబారిన రేఖలాగా ఏదైతే భంగపరుస్తున్నదో, అవన్నీ 'మాలిక్' కృపతో తొలగించబడ్డాయి. నేను ఇప్పుడు హృదయ మండలం దాటి నా దశలో తడారిపోయిన మైదానంలో ఈదుతూ ఉన్నాను. ఇంకా చెప్పాలంటే, అది నాలో చొచ్చుకుపోయి పీల్చుకుపోతూ ఉంది. దశ ఏమిటంటే, ఒక (Blotting paper) అద్దుడు కాగితంలాగా పీల్చుకోవటమే. బాబూజీ, ఇప్పుడు నాలో హృదయం ఉన్నదా లేదా అన్నట్లు ఉంది. కాని ప్రతిదీ బ్రహ్మగా అయిపోయాయి. కణకణంలోను, రక్తంలోను, బ్రహ్మరూపంలోను నా 'మాలిక్'యే కలిసిపోయినట్లు ఉంది. రెమ్మ రెమ్మలోను, ఆకు ఆకులోను, సమస్త జడపదార్థాల్లోను బ్రహ్మం ఒక్కడే లీనమై ఉన్నాడు. నేను బ్రహ్మలోనే లీనమై ఉన్నాను అన్నా ఒక్కటే. అందుచేత అదృశ్యరూపంలో నేను మాత్రమే అన్నింటిలోను లీనమై ఉన్నాను. కాని నాకు ఈ స్పృహ లేదు. ఇది బాగుండకపోయినప్పటికీ (అనగా ఇలా నిర్వచించటం), దశను గురించి వ్రాస్తున్నాను కనుక వ్రాయకతప్పలేదు, కనుక క్షమించండి. శ్రీ బాబూజీ, సమస్తంలోను ఈశ్వరుడు ఏ విధంగా లీనమై ఉన్నాడో, అలాగే అన్నింటితోను వేరై ఉన్నాడు. కనుక బహుశా 'అతని'కి స్పృహ ఉండకపోవచ్చు. అదే విధంగా నా దశ, నేను అన్నింటిలోను ఉన్నట్లుగాను, దాని స్పృహ లేనందువలన నేను అన్నింటితో వేరుపడి ఉన్నట్లుగాను

ఉన్నదని చెప్పవచ్చు.

'మాలిక్' నా బంధనాన్ని కూడా నిదానంగా త్రెంచివేశాడు, దారి సుగమం చేశాడు. ఇప్పుడింక శారీరక బంధనం మాత్రమే మిగిలి ఉంది అని చెప్పవచ్చు. కాని దాని అనుభవం కలగటం లేదు. అందుచేత నేను దీని నుంచి కూడా విముక్తమయ్యాను. నేను ఎవ్వరికీ లోబడి ఉండలేదు. మాట్లాడుతూ ఉంటే మాత్రం ఏమిటి, బహుశా అది 'మాలిక్'కు కూడా ఏమి వినిపిస్తున్నానో, 'అతడు' ఏమి వింటున్నాడో తెలియదు. నేను స్వయంగా నాతోనే మాట్లాడుకుంటున్నానేమో నాకు తెలియదు. ఎప్పుడైనా ముకుల్ వస్తున్నపుడు, ఆమెతో నాకు దాపరికం లేదు కనుక ఏమి మాట్లాడుతున్నానో తెలియదు. **ఈ లోకంలో ఉన్నవారైనాగాని, పరలోకంలోనివారికైనాగాని ఎప్పుడుబడితే అప్పుడు సిట్టింగ్ ఇవ్వగలుగుతున్నాను.** నా దశను పరిశీలించాక కబీర్ వచనం జ్ఞాపకం వచ్చింది –"కౌన్ ఠగ్వా, నగరియా తాటల్‌హొ" అనగా "ఏ జిత్తులమారో నగరాన్ని దోచుకుంటున్నాడు" అనగా మాయదారి దేవుడు హృదయాన్ని దోచుకుంటున్నాడు అని అర్థం చేసుకోవచ్చు. నా వలన అన్ని పనులు జరుగుతున్నా, జరగకపోయినా ఒక్కటే అన్నట్లు ఉంది. నా బాబూజీ, నా 'మాలిక్' ఆత్మను కూడా ఛేదించి దానిలో లీనమైపోతున్నట్లు ఉంది. కాని దశ మాత్రం పొడిగా అంటే పొడిగానే ఉంటోంది. రాత్రి సమయంలో నేడు, పెద్ద పెద్ద అగ్ని జ్వాలలు నిద్ర సమయంలోను, మేల్కొని ఉన్న సమయంలోనూ కనిపిస్తున్నాయి. నిద్రించటం, మేల్కొనటం వంటి దశ రేయింబవళ్ళు ఉంటూనే ఉంది. తమరు ఏమని చెప్పినాగాని దశ మాత్రం ఇదే విధంగా ఉంది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 440

లఖీంపుర్,
23.11.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం ఈ రోజున అందింది, చదివి సంతోషించాను. తమ కడుపునొప్పికి తగిన మందులకొరకు, ఇప్పుడు నావద్ద అంతా కలిపి 4 రూపాయలే ఉన్నాయి, పంపిస్తున్నాను. దయచేసి వాటిని తమవిగానే భావించండి. అంతేకాని నాకు తిరిగి పంపటం కాని, దాచిపెట్టటంగాని చేయకుండా మందుల కొరకు వినియోగించి, వాటిని వాడండి. నా దగ్గర ఉన్నదంతా 'మాలిక్' ఇచ్చినదే. నాకు తినడానికి, వస్తువులకు అయ్యే ఖర్చు కూడా 'మాలిక్' ఇచ్చిన దాని నుండియే. ఇంకా నా వద్ద ఏదైనా ఉండబోతే అది కూడా 'మాలిక్'దే అవుతుంది. నా పేరుతో ఏదైనా వస్తువు తయారైనా, తయారు కాబోతున్నా, అది 'శ్రీరామచంద్ర మిషన్'దే అవుతుంది. తమరు జౌన్‌పుర్ వెళ్ళటానికి తగిన ఆరోగ్యం తమకు సమకూరుతుందని ఆశిస్తున్నాను.

నవంబర్ 18వ తేదీన పగలు 12 గం. 30 ని॥లకు తమరు నాలో అలసట చూసినట్లు వ్రాశారు. అది ఇప్పుడు నాకు అర్థమైంది. ఈ అలసట గురించి అనుభవం రాకపోయినప్పటికీ, ఎప్పుడైతే తమరు దానిని సవరించారో, అప్పుడు నాకు అనుభవమయ్యింది. ఎందువలన అంటే, ఈ శిధిలత్వం లేదా అలుపు అతికొద్ది సమయం మాత్రమే కలిగింది. దానిని నేను అర్థం చేసుకోలేకపోయాను. ఎప్పుడైతే తమరు దానిని సవరించారో, అప్పుడు నాకు 'మాలిక్' నాపట్ల దయతో ఏదో చేశారు అన్న ఆలోచన కలిగింది. అయినా కాని గమనంలో అలసట గురించిన విషయం దృష్టికి రాలేదు.

'Z' పాయింట్‌లో యాత్ర సమాప్తమైపోయింది. ఈ విషయం కూడా నాకు 'మాలిక్' దయవల్లనే గ్రహింపుకు వచ్చింది. నేను నా దృష్టిని పూర్తిగా దానిపై లగ్నంచేసి ఉండలేదని తమరు ఖచ్చితంగానే వ్రాశారు. బాబూజీ, ఏమిటో

తెలియటం లేదు, ఎందుకోగాని నాకు ఈసారి దాని అంచనా లేదా ఊహ అయితే ఉంది కాని, ఎందుకోగాని ప్రయత్నించినా కూడా దాని జ్ఞాపకం మరిచిపోయి ఉన్నాను. బాబూజీ, క్షమించండి. ఇంక ఎప్పుడూ ఇలా జరగనివ్వను. ఈసారి నాకేమి అయ్యిందో ఏమోకాని, ఆ దశ యొక్క ఆలోచనను కొంచెం అల్పంగానైనా నిలుపుకున్నాగాని, దాని జ్ఞాపకాన్నే మరచిపోయాను. అలా లీనమై ఉండే ప్రయత్నాన్ని ఎక్కువసేపు నిలపలేక పోయాను. ఇంక ఈసారి ప్రయాణమంటారా, అది తమ మనస్సుకు నచ్చిన రీతిలో లేకపోయిందా? ఈ విధంగా ఇంకెప్పుడు నేను జరగనివ్వను. ఇంకా ఏమిటంటే, మృత్యువు స్థితికి చెందిన మత్తు లేదా మగత వంటిది కూడా నాలోను లేక నా మెదడులోను ఉంటూనే ఉన్నది. ఇందువలన మాట్లాడకుండా నిశ్శబ్దంగా ఉండటమే మంచిదని, దానిలోనే ఆనందం ఉంటుందని నేను భావిస్తున్నాను, అని తమరు వ్రాశారు. కాని నేను ఆ విషయం పరిశీలించి నపుడు, ఆనందానుభూతి అనేది నాలో కలగలేదు, నిశ్శబ్దం మాత్రమే అనుభవమయ్యింది. దానిలో తప్పకుండా ఆనందం లభిస్తుందంటే, మౌనంగా ఉండటమే మంచిదేమో అని నాకు అనిపిస్తోంది. కాని జరుగుతున్నది ఏమిటంటే, మనస్సు మాత్రం తప్పకుండా మౌనంగా ఉంటోంది, అయితే మౌనంగా ఉండటమనేది మంచిదనిగాని చెడ్డది అనిగాని అనిపించటం లేదు. మాట్లాడినా, మాట్లాడకపోయినాగాని ఏమీకాదు అన్నట్లు ఉంది. ఇప్పుడు ఏమైంది అంటే, పైన నేను (మత్తుగా) మగతగా ఉన్నది అని వ్రాసినటువంటిది, మృతునివంటి దశలో నా స్థితిలో ఇప్పుడు అది భ్రమవంటిదిగా అనిపిస్తోంది.

ఇప్పుడు తరచుగా, ఎవ్వరైనా 'మాలిక్'ను గురించి చర్చిస్తున్నట్లయితే, అక్కడి నుంచి లేచి పారిపోవాలని, మనస్సు కోరుకుంటోంది. ఇంకా ఏమిటంటే, 'అతని' పేరు ఎవ్వరైనా మాటమాటికీ స్మరిస్తున్నట్లయితే గుండె పట్టుకొని ఉండిపోతున్నాను. దాని వలన ఏమవుతుందోనన్న భావం కూడా కలగటం లేదు. నోటి నుంచి మాట రావటం లేదు. వెచ్చదనం లాంటిది కలుగుతున్నది అని నేను గతంలో వ్రాసినటువంటి స్థితి. ఇప్పుడైతే అటువంటి స్థితి ఉన్నప్పటికీ దాని అనుభూతి క్రమంగా తగ్గుతూ పోతోంది. ఎందుకంటే, దాని అనుభూతి యొక్క జ్ఞాపకాన్ని నేను మరచిపోతున్నాను. నా మనస్సులో ఏదో చల్లదనం కలిగినట్లుగా నాకు అనుభవమవుతోంది.

నాకైతే బాగా ఆరోగ్యంగా ఉండాలనిపిస్తోంది, ఉంటుంది కూడా. ఇది నా సంకల్పమే కాదు, నాకు విశ్వాసం కూడా ఉంది. నాలో ఏమీ జబ్బులేదని, బలహీనంగా ఉన్నానని అందరూ అంటున్నారు కాని నాకైతే దాని అనుభూతి కలగటం లేదు. తమ బలహీనత మరియు కష్టం గురించిన ఆలోచన నాకు ఎప్పుడూ ఉంటోంది. నేను వాడవలసిన మందులు గురించి డాక్టర్‌గారు నాకేమీ వ్రాయలేదు. మాస్టర్ సాహెబ్‌గార్కి ఇచ్చి ఉంటారేమో వారిని సంప్రదిస్తాను. 'తమరు' తప్పకుండా మందులు వాడండి, ఆరోగ్యవంతులవుతారు. అప్పుడప్పుడు నా స్థితిలో ఉద్రేకానికి గురవుతున్నాను. దాని వలన మనస్సులో నిలకడ క్షీణిస్తోంది. ఇప్పుడింక అలా మరల చేయను. ఏ స్థితి కలిగితే, దానినే నిలుపుకుంటాను.

తనవారికి చెందిన స్థితి గతులు ఎప్పటికప్పుడు తెలుపుతుంటారు అను ప్రతిష్ఠ నా 'మాలిక్'కు మాత్రమే చెల్లుతుంది. నాపై 'తమ' దయ ఎల్లప్పుడూ ఉంటున్నప్పటికీ పురోగమనంలోని అలుపును తొలగించివేసి నందుకు అనేకానేక ధన్యవాదాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 441

లఖీంపుర్,

26.11.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని ఆశిస్తున్నాను. ఇప్పుడు 'మాలిక్' అనుగ్రహంతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా బాబూజీ! మనస్సు గొణగుతోంది అని చెప్పాలో లేక దానితో టక్‌టక్ వంటి ధ్వనితో సంబంధం కలిగి ఉన్నదని చెప్పాలో నాకు అర్థం కావటం లేదు. మనస్సులో ఏమైనా ఉండనివ్వండి. కాని అది చలించటం లేదు. అది ఏ రకమైన ఆనందమో నాకు తెలియటం లేదు. ఇప్పుడు తపన తపనలోనే కలిసిపోయినట్లు ఉంది, దాని గురించి నాకు తెలియటం లేదు. దీనిని ఒక రకమైన హత్తుకుపోవటం అని చెప్పాలో ఏమోకాని, దానివలన స్వప్న సదృశమైన ఒక సెగ వంటిది తగులుతూ ఉంది. దానిలో వేడిమి ఉందో, చల్లదనం ఉందో అనుభవం కావటం లేదు. సెగ అయితే నాకు తగుల్తోంది, అంటిపెట్టుకోవటం లేదా సెగవంటిది, నేను తరచుగా వ్రాసినటువంటిది అనగా ఏదో వస్తువు నన్ను తనవైపు ఆకర్షించుకుంటున్నట్లుగా ఉన్నటువంటి దశతో సంబంధం కలిగి ఉన్నట్లు ఉంది. ఇప్పుడు దానిలో ఆకర్షణ లేదు. అది ఏమిటో, ఎటువంటిదో నాకు తెలియటం లేదు. ఎందుకంటే నాకు, దానికి (ఆకర్షించే వస్తువు) మధ్య ఆ సెగ అడ్డుగా ఉంది. ఇప్పుడు ఈ అంటిపెట్టుకోవటం లేదా ఆకర్షణ అనేది బలహీనపడుతున్నట్లు నేను గమనిస్తున్నాను. ఆ సెగ అయితే ఏదో ఒక రూపంలో ఉంటున్నది కాని, దానితో అంటిపెట్టుకొని ఉన్నటువంటి భావం మాత్రం కొంచెం కరిగిపోయి తొలగిపోయింది.

నా పరమ పూజ్య బాబూజీ! సమస్త ప్రకృతియే ఆ స్వల్పమైన వెచ్చదనంతో వేడి చేయబడుతున్నట్లుగాను, అదే ఈ ప్రకృతిని చైతన్య పరచినట్లుగాను అనిపిస్తోంది. (అనగా ప్రాణుల ఆవిర్భావానికి కారణం అని భావించవచ్చు.) ఎవరోగాని నన్ను ఎల్లప్పుడూ క్రమబద్ధం చేస్తూ, తన అదుపు, ఆజ్ఞలలో ఉంచుతున్నట్లు అనిపిస్తోంది. నిజం చెప్పాలంటే, నేను పగ్గాలు పట్టినడిపిస్తున్న ఒక జంతువులాగా ఉన్నాను. ఉన్న భేదం ఏమిటంటే, నామీద ఆ పగ్గాల భారం అనిపించటం లేదు. నేను నడుస్తున్నట్లు ఆలోచన ఉండటం లేదు. నేను ఇటువంటి అమాయక దశలో ఒక జంతువులాగ ఉన్నాను.

బాబూజీ! ఇప్పుడు నా దశలో ఈ విధంగా ఉంది: బంధనం బంధనంలో కలిసిపోయింది (అనగా విధేయతలో ఐక్యమైపోయింది అని). ఎవరి అధికారం లేదు. కాని నా 'మాలిక్' మాత్రం తప్పనిసరిగా ఉన్నారు, అధిపత్యం ఉన్నా, లేకపోయినా, 'అతడే' నా సర్వస్వం. ఇంతేకాదు, స్వచ్ఛత, స్వచ్ఛతలో కలిసిపోయింది. నమ్రత, నమ్రతలో అణగిపోయింది. అలాగే ఆధిపత్యం, ఆధిపత్యంలో కలిసిపోయింది. అదేమిటో అర్థం కావటం లేదు. శ్రీ బాబూజీ, ఇంకా చెప్పాలంటే, స్మృతి (జ్ఞాపకం) స్మృతిలోను, మరపు మరపులోను ఏకమైపోయాయి. ఇంతేగాకుండా, నాతో నా ఆలోచన (దృష్టి) యొక్క సంబంధం లేకుండా ఉన్నట్లు అనిపిస్తోంది. అయితే ఆలోచన, ఆలోచనతో మిళితమై ఉన్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు నావద్ద ఏముంది? అది 'మాలిక్'కే తెలియాలిగాని నాకు మాత్రం తెలియదు. ఈ దశను చూస్తూ ఉంటే, ప్రతిదశ కూడా తమ సూక్ష్మ స్థితిల్లోనే లయమైపోతున్నట్లుగాను, నాతో ఏవీరానట్లుగాను అనిపిస్తోంది. మనిషి ఒంటరిగా వస్తాడు, ఒంటరిగానే పోతాడు. కాని ఆ ఒంటరితనం మాత్రం అతని వెంటపోదు. నా పరిస్థితి ఇలాగే ఉంది. చెప్పటానికైతే చెబుతానుగాని నాకు నిశ్శబ్దం యొక్క అనుభూతి కూడా కలగటం లేదు. మనస్సు మాత్రం తరచుగా ఠక్ ఠక్ అను ధ్వనితో సంబంధం కలిగి ఉంటోంది. కాని అది ఎటువంటి అవరోధం కల్పించటం లేదు కనుక, చెడుగా తోచటం లేదు. నా పరమపూజ్య బాబూజీ, తమరు గతంలో ఇలా వ్రాశారు: "నీకు ఆలోచనలు చాలా వస్తున్నాయి. ఈశ్వరునికి నీపై అపారకృప ఉంది. అందుచేత నీవు ఎక్కడ ఉన్నాగాని అక్కడ కొంత సమతుల్యస్థితి (Balanced State) ఉంటోంది" అని. ఆ ఆలోచనలే ఇప్పుడు ఆలోచనలు కాకుండా ఉన్నాయి, కాని వాటిని గొణుగుడుగా వ్రాశాను. ఇప్పుడు మనస్సు ఆ ఠక్ ఠక్ ధ్వనితో సంబంధం కలిగి ఉన్నట్లు వ్రాస్తున్నాను. ఇప్పుడు స్థితి ఇలా ఉంది.

నా ఆరోగ్యం బాగానే ఉంది. తమ ఆరోగ్యం గురించి తప్పక వ్రాయగలరు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 442

షాజహాన్‌పూర్,
29.11.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు నవంబరు 19, 22 మరియు 26వ తేదీలవి అందాయి. నేను డాక్టర్‌తో వైద్యం చేయించుకోవటం ఆరంభించాను. బాధ తగ్గి మామూలు స్థితికి వచ్చింది. శ్వాస గురించి చెప్పాల్సివస్తే అది ఇంతకుముందే సాధారణస్థితికి వచ్చింది. **నీవు ఆరోగ్యంగా ఉండవలసిన అవసరం ఉంది. ఆలోచన ద్వారాను, ఇచ్ఛాశక్తి ద్వారాను దానిని (ఆరోగ్యం) పొందాలి. ఈ విధంగా చేయటమే నీ పూజగా భావించు. ఈ ఆరోగ్యంకొరకు నేను రెండు రకాల పద్ధతులను వ్రాస్తున్నాను. దానిని నీవు ఆచరించు. దీనిని నా సలహాగానో లేదా ప్రార్థనగానో స్వీకరించు.**

**మొదటిది – నీ శరీరంలో ఉన్న వ్యాధి, నీ శరీరం వెనుక భాగం నుండి పొగరూపంలో లేదా ఆవిరి రూపంలో బయటకు వెళ్ళిపోతున్నదని అనుకుంటూ కనీసం 15 నిమిషాలపాటు ధ్యానం చేయి. ఇందుకోసం ఒక సమయం కేటాయించు.**

**రెండవది – నీవు పూర్తిగా స్వస్థత చెందుతున్నట్లుగాను, వ్యాధులన్నీ పూర్తిగా తొలగిపోతున్నట్లుగాను భావించుకుంటూ ధ్యానం చేయాలి. మొదటి దానిని ముందుగాను, రెండవది దాని తర్వాతగాను ఆచరించు. ఇందుకుగాను ఉదయం, సాయంత్రం లేదా రాత్రి చేసుకోవచ్చు.**

ఇప్పుడు నీ ఉత్తరం నవంబరు 19వ తేది దానికి క్లుప్తంగా సమాధానం వ్రాస్తున్నాను. మనస్సు యొక్క బంధనం చాలా సడలిపోయినందున అది నీ అనుభూతికి అందటం లేదు. నేను ఇంకా 'మనోమయకోశం' తెరవలేదు కనుక అది ఇంకా మిగిలి ఉంది. (హార్ట్ రీజియన్) హృదయ మండలాన్ని ఇంకను దాటలేదు, అయితే నీవు దాని చివరివరకు దాదాపుగా చేరిపోయావు. "ఈశ్వరీయ హృదయంలో లయమైపోయాను" అని చెపుతున్నావంటే, నీవు దానిలో పూర్తిగా కలిసిపోయావని అర్థం. నీవు దానిలో కలిసిపోవటం, మరియు ఇంకా కలిసిపోతూ ఉన్న కారణంగా ఆనందం నీకు అనుభవంలోకి రావటం లేదు. దీనికి ఇంకొక కారణం కూడా ఉంది. నీలో ద్వైతభావం ఎప్పుడో తొలగిపోవటం జరిగింది కనుక ఇది లయ–అవస్థ కలగటానికి కారణంగా ఉంది. నీ హృదయం ఎడారిగా అయిపోయిందని చెప్పటం నాకు చాలా సంతోషం కలిగించింది. ఎవరి హృదయమైతే ఈశ్వరీయ హృదయంగా అయిపోతుందో దానిలో ఇంక తేమ ఎక్కడ ఉంటుంది! ఆ తేమ అనే దానిని మనం స్వయంగా మన ఆలోచనతో సృష్టించుకుంటున్నాము. దాని మూలంగా రకరకాల రంగుల పూలు వికసిస్తున్నాయి. మానవుడు తాను కల్పించుకున్న వనంలో పరవశించిపోతున్నాడు (అనగా బాహ్య ప్రపంచంలోని ఆకర్షణల్లో భౌతికానందాన్ని అనుభవిస్తున్నట్లుగా అర్థం చేసుకోవాలి). కాని ఇప్పుడు నీ విషయంలో అలా లేదు. ఆలోచన సూక్ష్మత్వం చెందినప్పుడు, దాని అనుభూతి కలగదు.

ఇప్పుడు నవంబరు 22వ తేదీతో ఉన్న నీ ఉత్తరానికి జవాబు వ్రాస్తున్నాను. "దశలో 'మాలిక్' యొక్క ప్రమేయం కాని, ఒత్తిడికి కాని అవకాశం లేకపోయింది" అని వ్రాశావు. ఇది నాకు పూర్తిగా అర్థం కాలేదు, కాని నీ అభిప్రాయం గ్రహించగలిగాను. దీనికి కారణం లయ–అవస్థ అని చెప్పగలను. గౌణగటమనేది అంత చెడుదేమి కాదు. 'మాలిక్'తో ఆలోచన అనుసంధానమై ఉన్నప్పుడు, ఆ ఆలోచన తనకు చెందిన విషయాన్ని మాలిక్‌కు సంధించి ఉంచుతూ స్వయంగా వ్యక్తం చేస్తూ ఉంటాయి. నీ ఆలోచన యొక్క ప్రభావాన్ని పూర్తిగా ఈ ఉత్తరం తెలియజేస్తూ ఉంది. దీనినిబట్టి నీవు ఎటువంటి ద్వైతం లేకుండా పూర్తిగా 'మాలిక్' శరణుజొచ్చావని ధృవపడుతోంది. నేను

గురు–సందేశ్ కరపత్రంలో దర్శనస్థితి గురించి తెలియజెప్పినటువంటిదే నీలో తెరుచుకుంది. దైవ సాక్షాత్కారం ఇదే విధంగా ఉంటుంది.

నీవు నవంబరు 23వ తేదీన వ్రాసిన లేఖ కూడా అందింది. దానికి జవాబు వ్రాసిన తరువాత నవంబరు 26వ తేదీ ఉత్తరానికి సమాధానం వ్రాస్తాను. నీ ఈ ఉత్తరంలో చాలా మంచి స్థితిని వ్రాశావు. భగవంతుడు నిన్ను ఆశీర్వదించుగాక! ఈ స్థితిలో నేను కూడా ఉండిపోయాను, మరి మన గురు మహరాజ్ అయితే ఈ స్థితిలో ఇంకా ఎక్కువ కాలం ఉండిపోయారు. ఎవరిలోనైతే ఈ స్థితి కలుగుతుందో వారు అంతిమం వరకు చేరగలరు, అని చెప్పే శుభవార్తగా ఉంటుంది. బిటియా! నీ గ్రహింపు శక్తి సాటిలేనిది, సాధకులు ఇదే దారిలో పయనిస్తూ ఉంటారు కాని ఈ విషయాల యొక్క అనుభూతి చెందరు. నేను ప్రశంసించినటువంటి స్థితి "ఈశ్వరుని పేరు తలంపుకు రాగానే గుండె చేత్తోపట్టుకొని నొక్కుకుంటున్నాను" అని వ్రాశావు. ఎవ్వరైనా దైవనామ స్మరణ చేసినపుడు, అభ్యాసీ ఆ విధంగా గుండెను అరచేతపట్టుకుని ఉండటమంటె దానిని "విరహం యొక్క బాధ"గా అనుభూతి చెందుతాడు. ఇది అతిప్రేమ వలన కలుగుతుంది. ఇది ఎంత గొప్ప స్థితి అంటె, దానిని వర్ణించటానికి మాటలు చాలవు.

ఇప్పుడు నవంబరు 26వ తేదీ ఉత్తరానికి చాలా క్లుప్తంగా జవాబు ఇస్తున్నాను. ఈ ఉత్తరం ఇంకా విచిత్రంగా ఉంది. ఈ ఉత్తరం మొత్తంలో ఉన్న విషయానికి ఒకే ఒక్క మాటలో వివరణ ఇవ్వవచ్చు. అది ఏమిటంటే, అన్నీ కలిసిపోయి ఒక్కటైపోతున్నట్లు సూచిస్తుంది. నీలో ఎన్ని దశలు కలుగుతాయో అవన్నీ చాలా సూక్ష్మమైపోతూ, చివరకు వాటి జాడ తెలియనట్లు అయిపోతుంది అని గ్రహించాలి. 'మార్పులేని స్థితి' (Unchanging condition) కలగబోతున్నట్లు తెలియజేయటానికి ఇవి చిహ్నాలుగా ఉంటాయి. నీ లయ–అవస్థ దినదినమూ అభివృద్ధి చెందుతోంది. సరే, ఈ తారీఖు ఉత్తరానికి ఇదే సమాధానం.

అస్సాం నుంచి కాశీరామ్ (అభ్యాసీ) నీ ఉత్తరాలు చదవటానికి, ఇతర అభ్యాసులకు చూపించటానికి కావాలని అడుగుతున్నాడు. నేను అక్కడికి పంపించాలనుకోవటం లేదు. అతడు నీ చిరునామా అడిగాడు, బహుశా నిన్ను కూడా అభ్యర్థించవచ్చు. నీవు అతనికి తిరిగి, రామచంద్ర వాటి నకళ్ళు తయారుచేయటానికి నీవద్దకే పంపించారు అని, సమయం దొరికినపుడు వాటిని వ్రాస్తున్నానని, మరి కొన్ని రామచంద్రవద్దనే అచ్చువేయించటం కోసం ఉన్నాయని జవాబు వ్రాయి. అంతేకాకుండా, ఆ విధంగా ప్రతి ఒక్కరూ వాటిని చూడవచ్చు అని, వాటిని గురించి ఏమన్నా చెప్పాలంటే రామచంద్రతో చెప్పమని అతనికి వ్రాయి.

29.11.1954వ తేదీ రాత్రి షుమారు 10 గం. 30 ని॥లకు నిన్ను 'Z' స్థానం నుంచి ముందుకు తీసుకొని వెళ్ళాను. ఇప్పుడు ఈ స్థానాలకు మళ్ళీ $A_1$, $B_1$ అని పేర్లు పెట్టాను. ఇప్పుడు నీ ఆధ్యాత్మిక యాత్ర '$A_1$'లో జరుగుతోంది. **నేను నిన్ను పైకి లాగినపుడు, మూడుసార్లు క్రిందికి అనగా 'Z' స్థానం మీదకు జారిపోయావు. అపుడు లాలాజీ సాహెబ్ ఒక్క కుదుపు (jerk) ఇవ్వమని సలహా ఇచ్చారు. నేను అప్పుడు ఆ విధంగానే చేసిన తర్వాత మళ్ళీ '$A_1$' స్థానం మీద నిలిచావు. దీనిలోని రహస్యం ఏమిటంటే, పైన ఉన్న శక్తి ఆ విధంగా నెట్టివేస్తుంది. అభ్యాసీ ఉన్నతంగా ఎదుగుతున్న కొద్దీ, ప్రకృతి శక్తి అధికంగా ఉన్న కారణంగా, ఇతరుల (మార్గదర్శకుని) సహాయం అవసరమవుతుంది.** నీ సోదర సోదరీలకు నా ఆశీర్వాదాలు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 443

లఖీంపుర్,

2.12.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ కృపతోడి మరియు ప్రేమాన్వితమైన ఉత్తరం నిన్న అందింది. చదివి చాలా సంతోషించాను. నన్ను '$A_1$' పాయింట్ మీదకు చేర్చి అక్కడ నిలిపినందుకు 'మాలిక్'కు అనేక ధన్యవాదాలు. "నీవు మూడుసార్లు క్రిందికి దిగి వచ్చావు" అని తమరు వ్రాశారు. అందుకు కారణం ఏమి జరిగిందంటే, 21వ తేదీ రాత్రి నేను తమరు వ్రాసిన గత ఉత్తరానికి నకలు తీస్తున్నాను, అపుడు విశ్రాంతి తీసుకున్న కారణంగా వెనుకపడిపోయాను. అదేమిటో అప్పుడు తెలియలేదు కాని మనస్సు పైనుంచి క్రిందికి దిగిరావటం జరిగినట్లు 2,3 సార్లు అనిపించింది. ఆ తర్వాత ఎవ్వరో మనస్సును జాగృతం చేసినట్లు అనిపించింది. ఎందుకో తెలియదు కాని ఆ రాత్రి నిద్ర కూడా తక్కువగానే ఉంది. 'తమ' బాధ మామూలు స్థాయికి వచ్చినట్లు తెలిసి నాకు మరియు అందరికీ సంతోషమైంది. తమరు, నాకు పూజ కొరకు చెప్పినటువంటి రెండు ధ్యానాలు, ఒకటి ఉదయం మరొకటి సాయంత్రం నేను చేయటం ప్రారంభించాను. నాకు తలనొప్పి, బాగా జలుబు చేసినప్పటికి, అవి కూడా ఆగిపోయినట్లు ఉంది. తమరు బహుశా నా (Low Bloood Pressure) తక్కువ రక్త పీడనం గురించి ఏదో చేసి ఉంటారని భావిస్తున్నాను. ఆపైన తమకే తెలియాలి. ఇప్పుడు నేను 'మాలిక్' కృపతో దర్శనం యొక్క స్థితిని పూర్తిగా అర్థం చేసుకున్నాను. వాస్తవానికి నేనేమి చెప్పాలో నాకు అర్థం కావటం లేదు. బాబూజీ, కాశీరామ్‌గారి ఉత్తరం ఇక్కడకు చేరగానే తమకు తప్పకుండా వ్రాస్తాను. మాటిమాటికీ క్రిందికి దిగి రావటానికిగల కారణాన్ని తమరు ప్రకృతి యొక్క (Force) వత్తిడి అని వ్రాశారు. అది సహేతుకమే. అయితే నాకు మాత్రం ఆ వత్తిడి యొక్క అనుభవం కలగలేదు. ఆ వత్తిడిలో వత్తిడి కలిసిపోయినట్లు అనిపిస్తోంది కాని పూర్తిగా అర్థం కావటం లేదు.

నేను ఒక ఒడ్డుకు చేర్చబడి అక్కడ నిలపబడినట్లుగా అనిపిస్తోంది. అది ఎక్కడ అంటే, గాలిలో కేవలం అమాయకత్వం (Ignorance) యొక్క అనుభూతియే ఉంటున్నట్లు అనిపిస్తోంది. ఇటువంటి దశ కలిగినపుడు, దానితోపాటుగానే మరొక మార్పులేని దశ కూడా కొంత మసకగా ఉన్నటువంటిది నాలోపల అనుభవానికి వస్తోంది. నా ఊహ ప్రకారం దానిని మృతస్థితి అని చెప్పవచ్చు. దానిలో మృత్యువు అనేది అనుభూతికి రావటం లేదు. దశ యొక్క శూన్యత మరియు ఒంటరితనం కూడా స్థితి వెంట కలిసిపోవటంలేదని నాకు అనుభవమవుతోంది.

తమరు ఇంత అనారోగ్యంతో బాధపడుతూ కూడా, అంత దూరం వెళ్తున్నారంటే, ఇతరులెవ్వరూ సాహసించలేరు. నేనయితే వెంటనే మానివేస్తాను. నాకు, సముద్రపు ఒడ్డున ఉన్నటువంటి ఆహ్లాదకరమైన గాలి, చెమ్మతో కూడినది నా ఎదురుగా వీస్తోంది. దానిలో వత్తిడి లేదు. ఇది ఎటువంటి స్థితి అంటే, ఉష్ణంలో ఉష్ణం, చల్లదనంలో చల్లదనం కలిసిపోయినట్లు ఉంది. నేనయితే ఒక వింతైన అమాయకపు (Condition of Ignorance) దశ యొక్క ఊహాలోనో లేక గాలిలోనో ఉన్నాను.

నా శ్రీ బాబూజీ, నాకు ఈ విధంగా అనిపిస్తోంది. అదేమిటంటే, నా కణకణం శక్తిహీనంగాను లేదా పూర్తిగా వత్తిడి రహితంగాను అయిపోయి ఒక వింతైన శాంతి లేదా అమాయకత్వం మాత్రమే కనిపిస్తున్నాయి. అవి వాతావరణంలో కలిసిపోయినట్లుగా ఉంది. అయితే నేను ఎక్కడికి పోవాలి. నేనయితే ఎప్పుడూ సేదతీరుతున్నట్లుగానే అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడు నా కణకణమూ జాడలేకుండా పోయినట్లుగాను, ఎక్కడో కలిసిపోయినట్లుగాను అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, కణకణం యొక్క వేడిమి వేడిమిలో కలిసిపోయినట్లుగా ఉంది. నాలో మాత్రం సేదతీరు వాతావరణం వంటిదే ఉన్నట్లు అనిపిస్తోంది. చల్లదనం లేదు. అది కూడా దాని ఉనికిలోనే కలిసిపోయింది.

ఈ కణాలు నాకు అనుభవం కావటం లేదు కనుక, నేను వాటిని అనవసరంగా పేర్కొంటున్నాను. అయితే వీటికి బదులుగా ఒక స్వల్ప శాంతియుత వాతావరణం నెలకొని ఉంది. నాలో సేదగొలిపే వాతావరణం ఉన్నప్పటికీ, ఒక రకమైన విచారం, నిర్లక్ష్యం వంటివి జతకూడినట్లు చూస్తున్నాను. అలా కాకుండా ఒక అజ్ఞానపు సామ్రాజ్యంలాగా తలపిస్తోంది. ప్రేమ అనాలంటే అనండి, అయితే ప్రేమ కూడా ప్రేమికునిలోనే లయమైపోయి అంతమైపోయింది. కనుక నాలో దాని జాడైనా లేదు. ఇప్పుడు నా శరీరం యొక్క ఉనికి కూడా దాని ఉనికిలోనే సమసిపోయి కలిసిపోయినట్లు అయ్యింది. దశను బాగా అభివ్యక్తం చేయలేకపోయాను, తర్వాత వ్రాస్తాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 444

లఖీంపుర్,
5.12.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని ఆశిస్తున్నాను. ఈరోజు పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి వద్ద ఉన్న తమ పోస్టుకార్డు ద్వారా నారాయణ దద్దా తమవద్దకు వస్తున్నట్లు తెలిసింది. బాబూజీ, నేను జబ్బుగా ఉన్నాననే తలంపు నా మనస్సులో లేనప్పుడు నేనేం చేయాలి? అయితే బాగవ్వటానికి కొంచెం ఆలస్యం అవుతుంది. ఇప్పుడు నేను 'తమరు' చెప్పినట్లుగా రెండు సమయాల్లోను ధ్యానం చేయటం ఆరంభించాను. నేనింక త్వరగానే ఆరోగ్యవంతురాలనవుతాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

దశ ఏమిటి అని అడిగితే మృతస్థితియే అని చెప్పాలి. కాని మృతతత్వం మాత్రం అనుభవానికి రావటంలేదు. లయ అవస్థ అంటారా దాని జాడ కూడా కనిపించటం లేదు. కనుక అది కూడా ఏమీ మిగలకుండా అంతమైపోయినట్లు ఉంది. ఇదే జీవనమోక్ష గతికి చెందిన స్థితిగా అయిపోయింది. ఎందుకంటే, నా కణకణంలోను పరిశీలించినప్పటికీ దాని జాడ కనిపించటం లేదు. బహుశా (Pressureless atoms) వత్తిడి లేని కణాలలో దీనికి (జీవనమోక్ష దశ యొక్క అనుభూతి) స్థానం ఎక్కడ ఉంది? ప్రతికణం యొక్క లోపల, బయట ఉన్న వేడిమి కూడా చల్లబడిపోయినట్లు అనిపిస్తోంది. కణాలన్నీ ఖాళీగా అయిపోయాయి. ఇటువంటి స్థితిలో, కణకణం కలిసి ఉనికి కోల్పోయినట్లు ఉంది. ఇంతేగాకుండా, కణాలకు మధ్య ఉన్న పరస్పర సంబంధం కూడా లేకపోయింది.

పూజ్య బాబూజీ, ఇప్పుడు నా స్వంత స్వభావం కాని, ప్రకృతిగాని లేకుండాపోయాయి. మనం సాధారణంగా ఫలానా వారి స్వభావం ఇటువంటిది, అటువంటిది అని చెప్తూ ఉంటాము కదా! నాపట్ల చెప్పిన స్వభావం కూడా అదే, స్వభావం స్వభావంలో కలిసిపోయింది. అది నాకు పట్టనట్లుగానే ఉంది. అన్ని అవస్థలు, తురీయ అవస్థతోసహా తమ స్థితిలోనే నిలిచిపోయినట్లు అనిపిస్తోంది. 'మాలిక్' నాకయితే వాటి అన్నింటినీ చూసి గ్రహింపజేసి వేరుచేసేశారు, అదేగాక ఇప్పుడు ఒంటరితనం కూడా నన్ను వెన్నంటి ఉండటంలేదు. ఇలా ఎందుకు అనిపిస్తోందో కాని, వేడిమి కూడా శీతలంగా అయిపోయింది. ఈ శీతలం కూడా ఎటువంటిది అంటే, నీటిచెమ్మ అని చెప్పదగి ఉంటుంది, అసలు ఏమిటో తమకే తెలియాలి. నాకు తెలియదు.

శ్రీ బాబూజీ, అదేమిటోగాని, శిరస్సు వెనుక, ఎక్కడ పాపిడి రేఖ ముగుస్తుందో దానికి కొంచెం దిగువన ఉన్న ఎముకలో ఒక గుంటవంటి పాయింట్‌మీద తరచుగా ఠక్ ఠక్ అను శబ్దం మరియు అదరటం ఉంటోంది. ఇంకొకటి ఏమిటంటే, వెన్నెముక ప్రారంభమయ్యే స్థానం, శిరస్సు వరకు మధ్య ఒక సర్పం వంటిది మధ్యభాగంలో

ఉన్నట్లుగాను, దానిలో జీవం మాత్రం లేనట్లుగాను, అక్కడే స్థిరపడి ఉన్నట్లుగాను కనిపించింది. ఇంక జ్ఞాపకం విషయానికి వస్తే, నేను 'మాలిక్' గురించిన విషయాలు మాస్టర్‌సాహెబ్‌గారి వద్దగాని, మా ఇంట్లోగాని మాట్లాడినట్లయితే, మళ్ళీ ఆ 'మాలిక్' విషయం జ్ఞాపకానికి రానట్లు ఉంటోంది. ఇంకా ఎలా ఉందంటే, ఆ జ్ఞాపకం కొన్ని నెలల్లో ఒక్కసారి తటాలున వచ్చినపుడు గుండె చీల్చుకుపోతున్నట్లుగాను, మళ్ళీ వెంటనే ఆ అనుభూతి తొలగిపోయి నేను గుండెపట్టుకుని ఉండిపోతున్నట్లుగాను ఉంటోంది.

అమ్మ తమకు ప్రేమాశీస్సులు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 445

జౌన్‌పూర్,
08.12.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం డిశంబర్ 2, 1954వ తేదీది, 6 డిశంబర్ 1954న అందింది. నారాయణ (అభ్యాసీ) షాజహాన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో నన్ను కలిశాడు. అతడు నాతోపాటుగానే ప్రయాణించాడు. 11.12.1954న మధ్యాహ్నపు రైలులో బయలుదేరి రాత్రి పదకొండు గంటలకు షాజహాన్‌పూర్ చేరాలని తలపెట్టాను. నేను జౌన్‌పూర్ రావలసిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే, శుక్లాజీ (అభ్యాసీ) యొక్క అవరోధాలను చాలావరకు అలహాబాద్‌లో నివారించాను. మళ్ళీ షాజహాన్‌పూర్‌లో కూడా నాకు బాధ ఉన్నప్పటికీ అతనిమీద దృష్టి కేంద్రీకరించాను. 2-4 రోజులలో భగవంతుడు అనుగ్రహిస్తే అతడ్ని మంచి స్థితికి తీసుకువస్తాను. నీ అనుభవం కొరకు నేను దీనిని వ్రాస్తున్నాను. నా జీవితంలో ఇదే తొలి అనుభవం. అది ఏమిటంటే, అతని గుండె ఆగిపోయేటటువంటి పరిస్థితి కలిగింది, ఆగిపోయింది కూడా. ఇప్పుడు దానికి సరిపడునట్లుగా ప్రాణమిచ్చాను, జీవం కలిగింది. అయితే నా తొందరపాటువలన కొంత తప్పు జరిగింది. ఇటువంటి సందర్భంలో ప్రత్యేక ఇచ్ఛాశక్తిని ప్రయోగిస్తాను. అతనికి జీవితం ఇవ్వవలసిన దానికంటె ఎక్కువగా ఇవ్వటం జరిగింది. దానిని వెంటనే గ్రహించి, అధిక జీవితం యొక్క భారం తగ్గించాను. సమస్థాయిని కల్పించటానికి ఇప్పుడు దానిని ఎంతవరకు తగ్గించాలో చూడాల్సి ఉంది. గుండె వెనుక వెన్నెముకతో అతుక్కుని ఉన్న (Vein) నాళంలో ఉన్న నలుపును తొలగించాను, కాని ఇంకా భారాన్ని తొలగించలేకపోయాను. దానిని ఎలా తొలగించాలో ఆలోచించాల్సి ఉంది. శుక్లాజీ లఖీంపూర్ నుంచి షాజహాన్‌పూర్ వచ్చినపుడు, వెన్నెముకలోని ఆ భాగంలో నా చేతివ్రేళ్ళతో కొద్దిగా చరిచాను, దానితో అతడు తనను తాను మరచిపోయే విధంగా చేయాలి అని. ఇది నా పరిశోధనగా నిలిచింది. అతడు అంత భారం ఎందుకు కల్పించుకున్నాడో నాకు అర్థం కాలేదు, కనుక దానిని ఇప్పుడు సరిదిద్దవలసి ఉంది. మిగతావన్నీ సర్దుబాటు అయ్యాయి. ప్రత్యేక శిక్షణ కొరకు అతడు తగిన వ్యక్తిగా, భగవంతుడు అందుకు తగినట్లు సిద్ధంచేసి పంపినట్లుగా నేను భావించాను. మీ అందరిలోను ఆ అధిచేతనా స్థితి (Super-conscious state) ఏర్పడాలని, దానితో మీరు దేనినైతే పరిశీలిస్తారో దానికి తగినట్లుగా చేయవలసింది మీ బుద్ధికి అప్రయత్నంగానే (Correct prescription) ఏమి చేయాలో తోచాలని నేను కోరుకుంటున్నాను. నేను ఏది అనుకుంటానో దానిని చెప్తాను, కాని అలా పరిశీలన చేసినవారుగాని, అనుభూతి చెందినవారుగాని ఎవరూ కనపడలేదు. ఒక ప్రసిద్ధమైన సామెత ఉంది - "శిక్షణ పొందిన పుత్రులు న్యాయస్థానానికి వెళ్ళరు" అని. ఇటువంటి విషయాలు చాలా ఉన్నాయి. కాని అవి నా మనస్సులో లేవు, అవసరమైనపుడు నాకు తప్పక భగవంతుడే తెలియజేస్తాడు. నేను ఇప్పుడు చాలా సోమరిగా అయ్యాను. దాని వలన నా సమయం వృథా కాకుండా, చేయవలసిన పని తొందరగా

చేయడంవలన ఒత్తిడి (Force) పెరుగుతుంది. అది ఇద్దరికీ సంబంధించి ఉంటుంది. నా సమయం, అభ్యాసీ సమయమూ కలిసి వస్తాయి. శిక్షణా విధానం చాలా ఉన్నతంగా ఉంటుంది. దానిలో నాకు తెలిసింది స్వల్పమే. నేను కాశీరామ్‌కు, కస్తూరి ఉత్తరాలలో చాలా భాగం కుటుంబ విషయాలు ఉన్నందువలన వాటిని పంపటానికి ఇష్టపడటం లేదని లేఖ వ్రాసేశాను. ప్రతి ఒక్కరికీ ఆ విషయాలు తెలియకుండా ఉండాలనే నా ఉద్దేశ్యం.

నీ యాత్ర యొక్క ప్రాంతం '$A_1$' అయి ఉండగా నీవు నీ ఉత్తరంలో 'A' అని వ్రాశావు. నేను దానిని సరిదిద్దాను. 'A' నుంచి 'Z'వరకుగల స్థానాలన్నింటినీ నీవు దాటి వేశావు. అక్షరమాలలో ఇంతకుమించి అక్షరాలు లేనందున '$A_1, B_1, C_1$' అని వ్యవహరించటం జరిగింది. ఇప్పుడు నీవు ఉన్నది '$A_1$' స్థానం, నీవు అక్కడ ఉండటం చూసి నేను ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను. దాని సుగంధం నాకు కూడా కొంతగా అనుభవమవుతూ హృదయం ఉల్లాసభరితమవుతోంది. ఈ స్థానంలో ఉన్న సువాసనను సుగంధం అని చెప్పినట్లయితే ఆ స్థానాన్ని భారంగా చేసినట్లవుతుంది. కాని ఇది చాలా ప్రత్యేకమైన ఆనందం. నాకయితే నీవు ఉన్న స్థానాన్ని చూస్తూనే ఉండిపోవాలని అనిపిస్తోంది. ఎందుకంటే, అలా చూడటంలో చూపు అలసిపోవటం లేదు. ఇది ఎంత స్పష్టంగా ఉందంటే, దీనిని అద్దంతో పోల్చటం కూడా తప్పు అనిపిస్తుంది. దానిని కాంతి అందామంటే, అది కూడా దానికంటె భారమవుతుంది. ఇప్పుడు నా పాయింట్స్ (స్థానాలు) వెదికినా నాకు కనిపించటం లేదు. నేను నెగేషన్‌లో ఎంతగా మునిగిపోయాను అంటే, దాని నుంచి ఒక్క క్షణం కూడా వేరుపడటానికి నా హృదయం అంగీకరించటం లేదు. అందువలన ఈ స్థితికి చేరిన అభ్యాసీ యొక్క గతిని చూసి సంతోషంతో ఉప్పొంగిపోతాను. నా స్థితి అయితే "ఉప్పులేని రాయి" వంటిది. ఇప్పుడు రుచిని మార్చటానికి మసాలా తినకపోయినప్పటికీ దాని ఘుమ ఘుమల తోనే సంతృప్తి చెందుతాను. '$A_1$' స్థితి యొక్క ప్రశాంతతను చూసి నా హృదయం ఎంతగానో సంతృప్తి చెందింది. నీవు మార్పులేని స్థితిని (Unchanging condition) గురించి వ్రాస్తూ "నాలో ఏదో మగతగా అనుభవమవుతోంది" అని తెలియజేశావు. అది ఈ స్థానానికి సంబంధించినది కాదు కాని, ఇది కూడా ఏదో ఒక స్థితియే అన్నట్లుగా ఉంది. ఎక్కడైతే మార్పు అంతమైపోతుందో అక్కడి నుంచి మార్పులేని స్థితి ఆరంభమవుతుంది. ఇది పూర్తిగా ఒకానొక దివ్యస్థితి. దీనికోసం గొప్పగొప్ప మహాత్ములు, యోగులు తపించిపోయారు. కబీరు ఎంతో ఉన్నతస్థాయికి చెందినవాడై ఉండి కూడా కనీసం దీనిని దర్శించలేదు. ఇది కేవలం మన గురుమహరాజ్ (సమర్థగురు మహాత్మ శ్రీ రామచంద్ర మహరాజ్, ఫతేఘర్) యొక్క సాహసం మాత్రమే. వారు స్వయంగా ఈ దివ్య స్థితిని పొంది, ఇతరులకు కూడా తలుపులు తెరిచారు. నీ గమనం (గతి) మరియు ఆధ్యాత్మిక ఉన్నతినిబట్టి, దైవేచ్ఛగనుక ఉంటే, ఏదో ఒక సమయంలో నీకు ఈ స్థితి తప్పక కలుగుతుందని నాకు అనిపిస్తోంది. లఖీంపూర్‌కు చెందిన మాస్టర్ ఈశ్వర్‌సహాయ్‌గారు కూడా ఈ స్థితిని పొందుతారని ఆశిస్తున్నాను, వారు ఆ స్థితికి దరిదాపుగా చేరుకున్నారు. మన సంస్థలో కనీసం ఒక్కరైనా ఈ స్థితికి చేరనున్నారు అంటె భగవంతునికి తప్పకుండా ధన్యవాదాలు తెలుపుతున్నాను. అయితే ఈ స్థితికి అభ్యాసులందరు చేరినప్పుడు మాత్రమే నాకు సంతృప్తి కలుగుతుంది. అందరూ కాకపోయినప్పటికి కనీసం నలుగురు, ఐదుగురు అయినా చేరాలి. విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ విధంగా ఉన్నతి చెందాలను జిజ్ఞాస ఎవ్వరిలోను కలగటం లేదు. అయినప్పటికీ నేను ఈ మార్పులేని స్థితిని ఒక నిజమైన స్థితిగా చెప్తూ దీని కొరకు ప్రయత్నించాలని అంటున్నాను. బిటియా! దైవం అనుకూలిస్తే, ఈ మార్పులేని స్థితిని పొందటం కష్టతరంకాదని నేను వాస్తవంగా చెబుతున్నాను. ముఖ్యంగా, **ప్రకృతి తన రెండు హస్తాలతోను తన నిధిని వితరణ చేస్తున్న ఈ సమయంలో, మనలోనే ఉన్న 'వారి'ని మనం సాక్షాత్కరింపజేసుకోవాలని అనుకుంటున్నాము. కనుక 'కష్టం' అను శబ్దాన్ని ఆధ్యాత్మిక పదకోశం నుంచి తొలగించాల్సి ఉంటుంది. తనదైన దానిని చూడటానికి, అర్థం చేసుకోవటానికి మానవుడు కష్టమని భావిస్తున్నాడంటే, చాలా ఆశ్చర్యకరంగా ఉంది.** నాకు జౌన్‌పూర్ రావాలను కోర్కె కలిగింది కనుక వచ్చేశాను. ప్రయాణం ఇబ్బందికరమను ఆలోచన కలిగి ఉంటే

ఇక్కడకు రావటం జరిగేది కాదు.

"(Ignorance) తెలియకపోవటాన్ని, మృతస్థితిగా చెప్పబడుతుంది, కాని అది అనుభవంలోకి రావటం లేదు" అని నీవు వ్రాశావు. మృతస్థితి అనగా జీవం లేకపోవటం (Lifeless) అంటే దైవానికి తనను తాను అర్పించుకొన్నట్లయితే, **'అతడు'** దానిని తన ఇష్టం వచ్చిన రీతిలో ఉంచుతాడు. మేల్కొన్నప్పుడు కల కరిగిపోయినట్లుగా హృదయం నుంచి ప్రాపంచిక ఆర్భాటాలు, అనుభవం తొలగిపోతున్నపుడు ఇది సంభవిస్తుంది. ఈ జీవచ్ఛవస్థితి, (Ignorance) తెలియని స్థితికి సంబంధం కలిగి ఉంటుంది. **ఎప్పుడైతే మనం, దైవం –ఇద్దరి యొక్క ఉనికి తెలియకుండా పోయేటంతగా మనం, 'అతని'లో (దైవంలో) కలిసిపోతామో అప్పుడే దానిని సంపూర్ణ నెగేషన్ (Complete Negation) అనగలుగుతాం. అనగా ఇద్దరూ కనుమరుగైపోయినట్లే. సూఫీ సాధువులు దీనిని 'ఫనాఫిల్లాఫ్' గా అంటారు. వారు జీవితాంతం దీని కోసమే సాధన చేసినప్పటికి ఎవరూ ఈ స్థితికి చేరుకోలేదు. ఎందుకంటే, ఊర్ధ్వముఖంగా ఉన్న దివ్యశక్తి ప్రవాహంలో మనల్ని ఎవరైనా తీసుకుపోయేవారు లేనంతవరకు అక్కడికి చేరటం కష్టమే కాదు, అసంభవం కూడ. ఆ ఊర్ధ్వశక్తిలో ఏవైతే స్థితులు ఉన్నాయో, వాటిల్లో లయమైపోయినవారు మాత్రమే ఆ స్థితుల్లో మనల్ని లయింపజేస్తారు. ఇది ఇలాగే జరుగుతుంది. ఇంకా చెప్పాలంటే, అంధులు అందరు కలిసి, ఒకరు దాని తోకను, ఒకరు దాని తొండాన్ని, మరొకరు కాలును పట్టుకొని తాము పట్టుకున్నదే ఏనుగుగా భావించినట్లుగా ఉంటుంది. ఎవరికి వారు కొద్దిగా దాని గాలి సోకగానే పూర్తిగా ఈశ్వరునిలో లయమైపోయినట్లుగా భావించుకుంటున్నారు.** ఇక్కడ నేను కొన్ని కఠినమైన పదాలు వాడక తప్పలేదు. అలా ఎందుకంటే, అందుకు అర్హులైన అభ్యాసులు చాలా అరుదుగానే ఉంటారు. అభ్యాసీ తన సాధన ప్రారంభించగానే అతని దృష్టి మూలాధారం (అసలు, భాండాగారం) మీద పడి అక్కడికి చేరటమే అతని గమ్యంగా భావిస్తాడు. సాహసమంటూ ఉంటే ఇది సాధ్యమే. అక్కడకు చేరినటువంటి వారిని తన మార్గదర్శకుడుగా ఎంచుకున్నప్పుడు అది సులభసాధ్యమే కాగలదు. ఇది అభ్యాసీ జీవితకాలంలో నెరవేరకపోయినప్పటికీ అతని ముక్తిమీద ఎటువంటి ప్రభావం ఉండదు. ముక్తి పొందటమే చాలామంది అభ్యాసుల ఉద్దేశ్యంగా ఉంటుంది. ప్రకృతిమీద పట్టు సాధించటమే యోగి యొక్క లక్ష్యంగా ఉంటుంది. కాని అతడు పూర్తిగా భగవంతునిలో ఐక్యమైపోయినపుడు మాత్రమే అతనికి ఆ ప్రకృతిమీద పట్టు దక్కుతుంది.

నీవు ఇప్పుడు ఉల్లాసంగా ఉన్నట్లు అనుభూతి చెందుతున్నట్లుగా వ్రాసినది సరిగ్గానే ఉంది. వేడిమి, చల్లదనం గురించి నేను గతఉత్తరంలోనే వ్రాశాను. ఇప్పుడు ఒత్తిడి (Pressure) బాగా తగ్గిపోతూ ఉన్నట్లు కలుగుతున్న అనుభూతి సరిగ్గానే ఉంది. మిగతా సంగతులన్నీ బాగానే ఉన్నాయి. వాటికి ఇంక సమాధానం లేదు. శుక్లాజీ మరియు నారాయణ అందరికీ నమస్కారాలు తెలుపుతున్నారు.

నీకు ఒక మాట వ్రాయాలనుకొని మరచిపోయిన దానిని ఇప్పుడు వ్రాస్తున్నాను. నా సహాయం లేకుండానే అభ్యాసీ ప్రకృతి యొక్క అఖండ శక్తిని ఛేదించుకుని ముందుకు సాగిపోవాలని నేను కోరుకుంటాను. దాని మూలంగా ఉన్నతంగా పురోగమించటానికి అందరికీ సులభమవుతుంది. అభ్యాసీ తనంతటతానుగా ప్రాణాహుతిని కల్పించుకోగలిగితే, నా మీద ఆధారపడాల్సిన అవసరం ఉండదని, అందుకు నేను చెప్పిన దానిని అవలంబించాల్సి ఉంటుంది అని నేను ఇంతకుపూర్వమే నీకు వ్రాశాను. నీవు, మాస్టర్ సాహెబ్‌గారు కూడ ఆ విషయం గురించి బాగా యోచించండి. ప్రతి విషయం నా దృష్టికే రావాలనిగాని, ప్రతి పనిని నేనే నిర్వహించవలసి రావటంగాని అవుసరం లేదు. విమల (అభ్యాసీ) యొక్క ఉదంతం నీకు తెలిసినదే. నేను నెలల తరబడి శ్రమించినప్పటికీ ఆశించిన ఫలితం సాధించ లేకపోయిన దానిని నీవు సాధించావు. నిజానికి నీవు ఆమెను పూర్తిగా మార్చివేశావు. జరగబోతున్న బసంత్‌పంచమి ఉత్సవానికి విమల జడ్జిగారితో కలిసి వస్తోందని జడ్జిగారు నాకు తెలియజేశారు.

ఇప్పుడు మళ్ళీ విషయానికి వస్తున్నాను. ఆరంభం నుంచే ప్రత్యేక ఇచ్ఛాశక్తిని వినియోగించి ఆ శక్తిని ఉత్పన్నం చేయగలిగినట్లయితే అభ్యాసీ ప్రకృతి యొక్క ఊర్ధ్వశక్తి ప్రవాహంలో ఈదుకుంటూ పోవచ్చు. అభ్యాసీ ఈ శక్తిని భరించలేకపోవచ్చు. అందుచేత ఈ విధానం అంతగా ఉపయోగపడదు కూడ. అభ్యాసీ ఒక బిందువు మీద ధ్యానం చేసినట్లయితే అతడు గమ్యానికి చేరగలిగేటట్లుగా ఆ బిందువు ఉండాలి. ఇటువంటి గురుతరమైన విధానాలు అన్వేషించాలి. ఈ ఉత్తరం వ్రాయిస్తూ ఉండగానే ఒక విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై నేను ఇంకా బాగా ఆలోచనపెట్టలేదు. నా రాజయోగ ప్రభావం పుస్తకంలో మానవుని మెదడు మధ్యలో (Occipital bone) ఆక్సిపిటల్ ఎముకగా చెప్పినచోట కొంత ఆకర్షణశక్తిని కల్పించి కొంత సమయం నిర్ణయించినట్లయితే అది ఆ అభ్యాసీని తన (భూమా) వద్దకు గుంజుకుంటుంది. దేవుని దయవలన ఇది సాధ్యపడుతుంది కూడ. అయితే ఇది నేను చేయవల్సిన పనిగానే ఉంది. ఎవరికైతే ఈశ్వరుడు ప్రత్యేక ఇచ్ఛాశక్తిని అనుగ్రహిస్తాడో అతని ద్వారానే అన్ని పనులు జరుగుతాయి. ఈ అసాధ్యం సుసాధ్యం కావాలంటే అభ్యాసీ ఏమి చేయాల్సి ఉంటుంది అను విషయం ఇప్పుడు ఆలోచించాలి. ఇలా ఈ ఉత్తరం నీకు వ్రాయిస్తూ ఉండగానే ఆ విధానం కూడా నాకు తట్టింది. అభ్యాసీ ఏ స్థానంలోనయితే ఉండి, తన యాత్ర ముగిసింది అని అనుకుంటాడో, అపుడు దానికి ముందున్న స్థానంమీద అతడు ధ్యానం చేయవలసి ఉంటుంది. ఈ విధానాన్ని లాలాజీ సాహెబ్ నాకు ఇప్పుడే తెలియపర్చారు. 'లాలాజీ సాహెబ్' యొక్క అనుమతితో ఈ విధానాన్ని నేను కొంతగా సంస్కరించాను. దానినిబట్టి అభ్యాసీ (Master cell) ముఖ్యకణం మీద ధ్యానం చేయాలి. ఎక్కడైతే కేంద్రీకృతమైన శక్తి (Concentrated energy) స్థావరం ఉంటుందో ఆ స్థానానికి ఈ (Master cell) ముఖ్యకణం కేంద్రంగా ఉంటుంది. ఇప్పుడు ఇది చాలా సులభమైపోయింది; కాని ఒక భయం కూడ ఉంది. అతడు బ్రహ్మాండ మండలంలో ఉండి, పరబ్రహ్మాండ మండలంలో ప్రవేశించటానికి ధ్యానం చేయకపోవచ్చు. ఈ సందర్భంలో అతని యాత్ర బ్రహ్మాండ మండలం పూర్తి అయి ఉండకపోవచ్చు. ఈ రెండవ ఉత్తరం మాస్టర్ సాహెబ్‌గార్కి చేర్చాలి.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 446

జౌన్‌పూర్,

10.12.1954

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నేను ఇక్కడి నుండి పంపిన ఉత్తరం నీకు చేరిందని అనుకుంటున్నాను. నిన్న ఆజ్‌మగడ్ (అజ్మీర్) నుంచి రైలు రాలేదు. ఉదయం డాక్టర్‌గారు కూడా వచ్చినందున మేము కూడా ఆగిపోయాము. ఇంక 12.12.1954 రాత్రికి షాజహాన్‌పూర్‌కు చేరుకుంటాము. నీవు నీ ఉత్తరాలలో వ్రాసినదానినిబట్టి, నీవు మంచి లయ-అవస్థను పొందినట్లు ఉంది. మున్ముందు కూడా ఇదే కొనసాగుతుంది.

ప్రకృతితో సంబంధం తెగిపోయినపుడు, తత్ఫలితంగా కలిగే వేడివంటిది అనుభూతికి రాదు. దానికి బదులుగా ప్రకృతి కంటె ఉన్నతమైనది ఏదో ఒకటి అనుభూతమవుతుంది. అది వేడిమికి విరుద్ధంగా ఉంటుంది. కేశమూలం క్రింద ఏదో ప్రకంపనం ఉన్నట్లుగా వ్రాశావు. '$A_1$' స్థానం ఇంచుమించుగా అక్కడే ఉంటుంది. చైతన్యపర్చటం కోసం అందులో జరిగే ప్రక్రియలు, ప్రకంపనం రూపంలో అనుభవానికి వస్తాయి. వెన్నెముకలో ఏదో గుంటలాగా ఉందని, అది సర్పంలాగా ఉందని నీవు వ్రాసిన దానినిబట్టి దానిని కుండలినిగా అర్థం చేసుకోవాలి. బిటియా! జ్ఞాపకం అంటే మళ్ళీ రాకుండా ఉండేదే అసలైన జ్ఞాపకం, మంచిది కూడా. దానిని గురించి ఏదైనా వింటున్నపుడు ఆ జ్ఞాపకం కలిగిందంటే, పైన తెలిపిన స్థితికి తీసుకువెళ్ళ కోరుతున్నట్లు గ్రహించాలి.

మాస్టర్ సాహెబ్‌గారి రెండు ఉత్తరాలు, చౌబేజీ డైరీ కూడా అందాయి. మాస్టర్ సాహెబ్‌తో ఆయన తెలిపిన అభిప్రాయం సరైనదేనని, నేను దానిని అమలుపర్చానని చెప్పాలి. మాస్టర్ సాహెబ్ తన ఆధ్యాత్మిక స్థితిని గురించి కూడా వ్రాశారు. దైవానుగ్రహం ఉంటే, ఈ జాబు చేరుతూనే అది నిర్మలమైపోతుంది. చౌబేజీ మరియు మాస్టర్ సాహెబ్ చలికాలం సెలవుల్లో ఇక్కడకు రానున్నారని తెలిసి సంతోషపడుతున్నాను. నేను నీకు దీనికిముందు పంపిన కవర్‌లో మాస్టర్ సాహెబ్‌కు చెందిన ఉత్తరం కూడా జతచేశాను. దానిని నీవు అందజేశావనుకుంటాను.

చౌబేజీ మరియు అమ్మగార్కి నమస్కారాలు, నారాయణ కూడా అందరికీ నమస్కారం తెలుపుతున్నాడు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 447

లఖీంపుర్,

12.12.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందిందని ఆశిస్తున్నాను. బాగా జలుబు, దగ్గు మూలంగా నేను ఉత్తరం వ్రాయలేకపోయాను. సాయంత్రం అయ్యేసరికి జ్వరం బాగా ఉండటమేగాక, బలహీనంగా కూడా ఉంటోంది. తమరు వ్రాసిన రెండుసార్లు ధ్యానం, చెప్పిన విధంగా చేస్తున్నాను. దానివలన పూర్తిగా కోలుకుంటానని భావిస్తున్నాను. ఉత్సవం రోజులు దృష్టికి వస్తున్నాయి. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, నా స్థితి ఎలా ఉందంటే, 'మాలిక్' నా కళ్ళలో జ్యోతిగా ఉంటున్నప్పటికీ లేదా నేను జ్యోతిలో ముగ్ధురాలిని అయి ఉండి కూడా, నేను కోల్పోయినట్లుగాను, ఎప్పుడు మేల్కొని ఉండనట్లుగాను ఉంటున్నాను. అందువలన అవి రెండు నాకు సమానమే. 'అతడు' నా దృష్టిలోనే తిష్టవేసి ఉన్నాడను అనుభూతి ఎప్పుడు కలుగుతుంది అంటే, 'అతని' జ్ఞాపకం లేదా 'అతని' గురించిన ఆలోచన మనస్సు నుంచి పూర్తిగా తొలగిపోయిన చాలా సమయం తర్వాతనే కలుగుతుంది. అప్పుడు కళ్ళలో అదే చిత్రాన్ని పొందుతున్నాను. కాని కళ్ళల్లో నిలిచిన ఆ రూపాన్ని నిశితంగా నిలుపు కోవటానికి నాలో శక్తియే లేకుండాపోయింది. నాకు ఏమైందో ఆ దైవానికే తెలియాలి, ఎందుకు తరచుగా నా (Vision) ఛాయమాత్ర దర్శనంలో లేదా స్వప్న దృశ్యంలో నిరవధికంగా ఆధ్యాత్మిక యాత్ర కొనసాగుతుంది అని. ఆధ్యాత్మిక యాత్ర గురించిన ఒక అస్పష్టమైన ఆలోచనతోపాటు, మనస్సు మనస్సుతోనే మాట్లాడుకుంటూ, లేదా మనసులోనే స్వగతం చెప్పుకున్నట్లు కాకుండా నేను ఇంతకుముందు వ్రాసినట్లుగా నా దృష్టి 'మాలిక్'తోపాటు భ్రమిస్తోంది. ఇది కూడా సమాప్తమైపోయి, నాకు అన్నీ సమానంగానే కనిపిస్తున్నాయి లేదా (Vision) దృశ్యంలోనే కలిసిపోయాయి. నా బాబూజీ! నాకు ఏమి అనిపిస్తోంది అంటే, నేను ఎక్కడ ఉంటే అక్కడ యితర సుగంధానికి అవకాశమే లేనటువంటి ఒక ప్రత్యేకమైన సుగంధం ఉంటోంది. దానిని పవిత్రత అని చెప్పటానికి వీలులేకుండా ఉంది. అద్దాన్ని స్పర్శించినపుడు అనుభవమయ్యే చల్లదనం వంటిదే అయినప్పటికి, అక్కడ అద్దం లేదు, దాని శుభ్రతా లేదు. నేను ఎల్లప్పుడూ సముద్రతీరాన ఉంటున్నట్లుగా అనిపిస్తోంది. అటువంటి చల్లని ప్రశాంత వాతావరణం నా శరీరమంతటిలోను, అణువణువులోను అనుభవమవుతోంది. దాని సుగంధాన్ని అనుభూతి చెందుతున్నాను గాని, ఇంకనూ దానిలో ప్రవేశించలేదు. నా ఎదుట ఉన్న సముద్ర ప్రయాణమే నా ప్రయాణ స్థలమవుతుంది. ఇప్పుడు 2,3 రోజుల నుండి మనస్సు దిగులుపడి ఉంటోంది, ఎందుకో తెలియదు. అక్కడ దానికి (మనస్సుకు) ఈ సంగతే తెలియకుండా ఉంది. కనుక నేనేమి చెప్పగలను! అప్పుడప్పుడు మనసు నిశ్చలంగా ఉండిపోయినట్లు అనిపిస్తుంది. అప్పుడప్పుడు మాట పలుకు లేకుండా ఉండటంలో నాకు భయం కలుగుతోంది. మాటి మాటికీ నా నుండి మనస్సు

తొలగిపోయి పారిపోవాలి అన్నట్లు అనిపిస్తోంది. ఇదేమిటో నాకు అర్థం కావటం లేదు. ఎక్కడకు వెళ్ళాలో తెలియటం లేదు. నా బాబూజీ! సత్, రజ్, తమ్ అను త్రిగుణాలు లేకుండా మనిషి జీవించలేడు అంటూ ఉంటారు, కాని నా మనస్సైతే ఈ మూడింటిని త్యాగంచేసి ఎక్కడికో వెళ్ళిపోయినట్లు నేను చూస్తున్నాను. నేను శ్వాస, తత్త్వాలు మరియు చలనం లేకుండానే జీవిస్తున్నట్లు చెప్పబడుతోంది. అంతేకాని నేను చనిపోయినట్లు చెప్పటం లేదు. నాకు మృత్యువుతో సంబంధం లేదు, అలాగే జీవితంతోనూ అనుబంధం లేదు. నా దశ ఎలా ఉందంటే, ఒకవేళ దీనురాలిని, పేదరాలును అని చెప్పుకుందామంటే, నేను దీనత్వం, పేదరికం లేనిదానిలాగానే ఉంటున్నాను. నా దశ ఒక అజ్ఞాన బాలకుని వంటిది అని చెప్పవచ్చు. ఎందుకంటే, అతనికి ఎటువంటి జ్ఞానం కాని, అర్థం చేసుకొనగల సామర్థ్యంగాని ఉండవు. నా దశ అమాయకత్వం వంటిది కాదు, కాని దానిని అజ్ఞానం అనటమే సరియైనదిగా ఉంటుంది. కాదంటే ఏమిటో తమకే తెలియాలి. శ్రీ బాబూజీ, నా మనస్సుతో ఇప్పుడు నా సంబంధం తెగిపోయినట్లు నేను చూస్తున్నాను. అది ఎలా అంటే, ఇప్పుడు నేను నా స్వంత స్వభావాన్నే పొందలేకపోతున్నాను. ఈ (Nature) స్వభావం, స్వభావంతో కలిసిపోయింది.

అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 448

లఖీంపుర్,
16.12.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం నిన్న అందింది, చదివి సంతోషించాను, నారాయణ దద్దా తమతో వెళ్ళాడని చదివి చాలా ఆనందించాను. **వాస్తవంగా, ఎవ్వరైతే తమ కాలాన్ని నా 'మాలిక్' యొక్క చరణాలతో అనుసంధానించగలరో, అటువంటివారే కాలం యొక్క విలువను బాగా గ్రహించగలుగుతారు. సాధకుడు ఏ విధంగానైనాగాని 'తమ' సాహచర్యంలో ఎంతకాలం గడపగలుగుతాడో, వాస్తవానికి ఆ క్షణాలే నిజజీవితంలో విలువైనవిగా గుర్తించబడతాయి.** కాని నా దృష్టికి వచ్చినంతవరకు, ఎంత ఆధ్యాత్మిక లాభమైతే పొందవలసి ఉందో, అంతగా మేము పొందలేకపోతున్నాము అని నాకు అనిపిస్తోంది.

పూజ్య బాబూజీ, తమ పరిశోధన ప్రకారం ఒక నాళం (Vein) హృదయానికి వెనుకభాగంలో వెన్నెముకతో అనుసంధానమై ఉందని, దాని వలన శుక్లాజీకి కొంత భారం ఉందని వ్రాశారు. అది ఇప్పుడు తొలగిపోయింది. శుక్లాజీ లఖీంపుర్ నుంచి షాజహాన్‌పూర్ వెళ్ళాక, నాకు ఒక విషయం వ్రాశారు. అది ఏమిటంటే, తమరు చేతివ్రేలితో మెడ పైభాగంలోని గుంటలో కొద్దిగా తట్టిన కారణంగా శుక్లాజీకి స్వయంగా తనను తాను మర్చిపోవటంలో సహాయపడింది అని. ఇది వాస్తవమే, ఎందుకంటే నేను బహుశా మొదట వ్రాసిన ఉత్తరాలలో నేను, "పని చేస్తున్నా కూడ, దానిమీద ధ్యాస ఉండటంలేదని, ఏదో మర్చిపోయినట్లుగా ఉంటున్నాను" అని వ్రాశాను. నేనింకా చాలాసార్లు "గుండె వెనక ప్రాంతంలోని వెన్నెముకలో పెద్దగా అదురుతున్నదని, ఏదో గిలిగింతలాగానో లేదా సరసరమంటున్నట్లుగానో ఉంటున్నది" అని వ్రాశాను. ఇప్పుడు తమ పరిశోధనా విషయం వ్రాసిన తర్వాత నాకు పూర్తిగా అర్థమయ్యింది. "హృదయం యొక్క స్థితి, దాని జీవితం ముగుస్తున్నట్లుగా ఉంది" అని తమరు వ్రాసినది ఏమిటో అర్థం కాలేదు.

శ్రీ బాబూజీ, మా (Super-conscious state) అధిచేతనా మానసిక స్థాయి వృద్ధి చెందకపోవటానికి కారణం, మనస్సుతోను, దీక్షతోను మేము (Super-Human-Being) మానవాతీతమైన వానితో సంబంధించి ఉండవలసిన

సమయం కంటే, ఎక్కువ సమయం ప్రాపంచిక విషయాలపైన ఉండటమే అనిపిస్తోంది. అందువల్లనే (Super-conscious) అధిచైతన్యంలో ఎక్కువ సామర్థ్యం పొందలేకపోతున్నాం. తమ నూతన పరిశోధన ప్రకారం, అభ్యాసీ తమ సహాయం లేకుండానే, (Force of Nature) ప్రకృతి యొక్క అటకాయింపును దాటుకుంటూ (తప్పించుకుంటూ) పైకి అనగా ముందుకు పోగలగాలి. 'తమరు' వ్రాసిన పద్ధతి ప్రకారం కొన్ని సెకన్లు నేను '$A_1$' యొక్క మాస్టర్ సెల్ అనగా ముఖ్యకణాన్ని లేదా బిందువును చూసినపుడు నా లోపల కొద్దిపాటి స్పందన కలిగింది. బాబూజీ! నేను మాత్రం తమరు ఎక్కడికి తీసుకువెళ్ళితే అక్కడికే వెళ్తాను. అంతకుమించి నాకేమీ తెలియదు. ఇప్పుడు నేను దేనిమీదా ధ్యానం చేయలేనట్లు అనిపిస్తోంది. ఎందుకంటే, నాలో ఎంతమాత్రం సత్తా లేకుండా పోయింది. 'మాలిక్' జీవింపజేసినట్లే జీవిస్తాను. ధ్యానంలో నా కణకణం ఖాళీ అయిపోయినట్లు కనిపిస్తోంది. ఆ శూన్యత్వం గురించి ఏమి చెప్పను. అసలు కణకణం అనేవి ఉన్నాయా లేవా అనే సందేహం వస్తోంది. లేదా అంతా 'రాముడు'కే తెలుసు అనుకుందాము అంటే 'అతని'కి మాత్రం ఏం తెలుస్తుంది. ఎందుకంటే, 'లేదు' అన్నది 'ఉన్నది' కాబోదు, 'ఉన్నది' అన్నది 'లేదు' కాబోదు.

నా స్థితి ఏమిటో నాకు తెలియకున్నది. 'మాలిక్' సోఫామీద కూర్చుని ఉండటం నేను స్వయంగా నా కళ్ళతో చూస్తున్నాగాని, నేను నా 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకోలేకపోతున్నాను. ఇంకా ఏమిటంటే, నేను ఎప్పుడైనాగాని మాస్టర్ సాహెబ్‌తోనో లేక ఇతరులెవ్వరితోనో మాట్లాడుతూ ఉంటూనే ఉన్నా, ఏదో అమనస్కంగా ఉంటోంది. అదేమిటో తెలియటం లేదు. ఇప్పుడు నా హృదయం ఒక రాయిలాగా అయిపోయింది. ఎవ్వరైనా 'మాలిక్' విషయం ఎంతసేపు మాట్లాడుతున్నాగాని, 'అతని' జ్ఞాపకమే రావటం లేదనిపిస్తోంది. జ్ఞాపకం అని చెప్పుకున్నా జ్ఞాపకానికి రావటం లేదు. ఎప్పుడు, ఎలా నాకు జ్ఞాపకం లేకుండాపోయింది అనుకుంటే, హృదయంలో ఏదో గ్రుచ్చుకుంటూ ఉన్నట్లు అనిపిస్తున్నా, బాధ మాత్రం అనుభూతికి రావటం లేదు. కాని అప్పుడప్పుడు నేను జ్ఞాపకం కోసమని శిలలాగా ఉంటున్నాను. ఇంకా చెప్పాలంటే, జ్ఞాపకం నాకు ఒక శిల (రాయి)లాగ ఉంది. రాళ్ళు ఎప్పుడైనా పొరపాటున పరస్పరం ఢీకొనవచ్చు. నేను తరచుగా జ్ఞాపకం గురించి వ్రాస్తున్నపుడుగాని, మాట్లాడుతున్నపుడుగాని, అది ఉదాసీనతగానే ఉంటున్నది. ఎందుకో తెలియటం లేదుగాని, ఇప్పుడైతే సేదతీరుతున్నటువంటి దశ కూడా అనుభవం కావటం లేదు.

అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

**ఉత్తరం సంఖ్య – 449**

లఖీంపుర్,
22.12.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందనుకుంటున్నాను. ఈ రోజు తావూజీ ఇక్కడ నుండి లక్నో వెళ్ళుతున్నారు. అక్కడి నుండి తమవద్దకు చేరుకుంటారు. కాని నా ఆలోచన యొక్క ప్రయాణం ఈ రోజునే ప్రారంభమైపోయింది. ఇప్పుడు అది తమ పాదాలవద్ద, ఎక్కువ రోజులు ఉన్న శీతాకాలపు శెలవులను గడిపి ముగించుకుంటుంది. బసంత్‌పంచమి గాలి సోకటం ప్రారంభమైపోయింది. అవును, బసంత్ పంచమికి ఇంకా సమయం ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

శ్రీ బాబూజీ, ఇప్పుడు ఈ దశను చూస్తే, స్థిరంగా ఉండటంచేతగాని లేదా ఉదాసీనత కారణంగా కాని, నాకు సంతోషమంటూ కలగటం లేదు. అయినా గాని, నిరీక్షణతో వాలిన కనురెప్పలకు, 'మాలిక్' యొక్క అభయహస్తపు కమలాలే భరోసా కల్పిస్తున్నాయి. ప్రయాణించాల్సింది ఇంకా చాలా ఉంది. ఇప్పుడు నేను స్వయంగా నా గమనాన్ని ప్రాకుతూ పోతున్నా కూడా దాని అనుభవం పొందలేకపోతున్నాను. అయినప్పటికీ నాకు అలుపు రావటం లేదు, ఆగిపోవటమూ లేదు. ఇది నా గట్టి నమ్మకం. నా నడక దారి మలుపు తిరిగినట్లు అనిపిస్తోంది.

నా పరమపూజ్య శ్రీ బాబూజీ! ఇంతకుపూర్వమైతే నేను నన్నే మరచి ఉన్నట్లు ఉండేది. ఏమిటో తెలియదుకాని ఇప్పుడైతే అటువంటి భావన ఒక్క క్షణమైనా కలగటం లేదు. నేను ఎంత గమనించినాగాని అది నా దృష్టికి రావటం లేదు. నేను ఈ విధంగా సందిగ్ధంగా అయిపోయి, దానిని ఏమి అనాలో తెలియటం లేదు. ఒకవేళ మన దగ్గర ఉన్నది ఏదైనా పోగొట్టుకుంటే, దానిని మరచిపోవటం ఎలా జరుగుతుంది. మూలధనం అంటూ ఉంటే వడ్డీ కలిపి మిశ్రమ ధనం ఉంటుంది. అసలు వస్తువు లేకుండా, మూలం లేకుండా, ఏం ఉంటుందని చెప్పాలి? మరైతే ఇప్పుడు అలా లేదు. నాకేమీ అర్థం కావటం లేదు. దీనిని దివాలా తీయటం అందాము అంటే అది సరికాదు. ఎందుకంటే, ఇతరుల ధనం దోచుకోవటమే దివాలాతనం అవుతుంది. నా విషయంలో అటువంటిది ఏమీ లేదు. ఇంక ఏమి చెప్పాలంటే, ఎప్పుడో దివాలా తీసిన నేను ఇప్పుడూ అలాగే ఉన్నాను అని.

నా పరమ పూజ్య బాబూజీ! నేను ఈ విధంగా చెప్తే బాగుంటుందేమో. ఏమని అంటే, నావరకు నేనే కాకుండా, ప్రపంచం అంతా నాకు ఒక ఛాయా (Shadow) మాత్రంగా కనిపిస్తోంది. నిశితంగా పరిశీలించినా గాని ఛాయా మాత్రంగానే అనిపిస్తోంది. ఇప్పుడు (Attachment) బంధనం మరియు (Liberation) ముక్తి అను శబ్దాలు రెండూ నాకు అర్థహీనంగానే అనిపిస్తున్నాయి. అదేమిటో 'మాలిక్'కే తెలియాలి. శ్రద్ధ, విశ్వాసం, భక్తి, ప్రేమ, పవిత్రం, అపవిత్రం అను మాటలు నాకు నిరర్థకంగానే తోస్తున్నాయి. ఇంతేకాదు, జీవనం-మృత్యువు, పూజ-ధ్యానం, స్థిరత్వం-శాంతి, సామ్యావస్థతోసహా నాకు అర్థంలేనివిగా అనిపిస్తున్నాయి. ఇవన్నీ పేరుకు మాత్రమే శబ్దాలు. కాని వాటిలో సారంగాని, రహస్యంగాని, గాంభీర్యంగాని నాకు అనుభవానికి రావటం లేదు. బాబూజీ, ఇప్పుడు ఇలా అనిపిస్తోంది. 'సహజం' లేదా 'ప్రకృతి' అను శబ్దాలను మాత్రం నేను పసిగట్టగలిగాను. అలా పసిగట్టటమేకాదు, వాటి గాంభీర్యం లేదా రహస్యం నా జీవన విధానంగా అయిపోయాయి. ఇది ప్రకృతియే కాని, సత్యత్వం కాదు. ఇప్పుడు 'ఉన్నది' మరియు 'లేదు' అనేవి రెండూ నాకు సమానమేనని అనిపిస్తున్నట్లు నా దశ ఉంది.

అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 450

లఖీంపుర్,
27.12.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తావూజీ అక్కడకు చేరుకుని ఉంటారని ఆశిస్తున్నాను. నా ఉత్తరం మరియు ప్రణామం కూడా తమకు చేరి ఉంటాయని భావిస్తున్నాను. పూజ్య మాస్టర్ సాహెబ్ నిన్న నాకు ట్యూబ్ మందు ఇచ్చి వెళ్ళారు. అయినప్పటికి నేను తమరు సూచించిన ధ్యానాన్ని ఆచరిస్తున్నాను. ఇందువలన నాకు మందు అవసరం లేదనిపిస్తోంది. కాశీరామ్‌గారు అస్సాం నుంచి తాను రాగలిగితే 10,12 రోజుల్లో వస్తున్నట్లు వ్రాశారు.

నాకు ఈ విధంగా ఎందుకు అనిపిస్తోందో కాని, నేను నా దశతో కూడా నిర్లక్ష్యంగా ఉంటున్నాను. దీనికి ఏం చేయాలో తమరే చెప్పండి. 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆధ్యాత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ స్థితిలో, నా శరీరం యొక్క కణకణంలోను, అన్ని పాయింట్లలోను పూజ మరియు ధ్యానంతో కడిగివేసినట్లు ఉన్నాయి. కేవలం ప్రాపంచిక భావంతోనే ఉన్నటువంటి సాధారణ మనుష్యుల్లో నేను కూడా లెక్కించ బడతాను. అటువంటి వారికి ప్రపంచంతప్ప, ఈశ్వరుడు అంటె ద్వైతంగా అనగా వేరుగానే భావించబడతాడు. ఈశ్వరునివైపు తలతిప్పి చూసే తీరికైనా లేనటువంటి వారు, ఆ ఆలోచన లేనటువంటి వారితోనే నేను కూడా గుర్తింపబడతాను. మిఠాయి తిన్నా కూడా తీపి తెలియనట్లు ఉంది. అయితే ఏమి అంటానంటే, బెల్లంలో తీపిలేకపోతే ఏమవుతుంది. 'మాలిక్' యొక్క బందీగా (అనగా భక్తురాలుగా) చెప్పుకుంటూ ఉంటాను. అదియే నాకు మధురంగా ఉంటోంది. బాబూజీ, నా ఈ దశలో, పుష్పాలు ఎంత సౌందర్యంగా ఉన్నప్పటికీ వాటిలో సుగంధం లేకపోతే ఎలా ఉంటుందో, అదే విధంగా అనిపిస్తోంది. ఇంక నా శారీరక దశ ఎలా ఉందంటే, అది నా శరీరమంతటా లయమై ఉండి, నేను చేతివ్రేలును చూసినట్లయితే, జీవనం మరియు మృత్యువు రెండూ లేనట్లుగాను, అసలు అది అనగా ఈ చేతివ్రేలు నాదా లేక వేరే ఎవ్వరిదైనా అయి ఉంటుందా అన్నట్లు ఉంది. దానిని వ్రేలు అన్నా, కర్రపుల్ల అన్నా నాకు ఏమీ పట్టనట్లు ఉంది.

బాబూజీ, అదేమిటో 'మాలిక్'కే తెలియాలిగాని, నా శరీర స్థానంలో శరీరం కాకుండా ఒక ఉతికిన వస్త్రం ఉన్నట్లు ఉంది. దానిలో తెలుపు కూడా లేదు. అంతేగాకుండా, ఈ దశను స్వతంత్రమైనది అనిగాని, పరతంత్రమైనది అనిగాని చెప్పినా కూడా నా దశ మీద ఎటువంటి ప్రభావం కనిపించటం లేదు. ఇప్పుడు దశయే నా శరీరం అని చెప్పినా, నా శరీరమే దశ అని చెప్పినా చెప్పవచ్చు. ఏదో దశయే శరీరమైపోయినట్లు ఉంది. అసలు అది శరీరం ఏమిటి? అది ఒక ఉతికిన వస్త్రం అనే చెప్పాలి. శరీరం ముందు, వెనుకా పాయింట్లు ఏమోకాని, ఒక ఉతికిన దుప్పటి వంటిది మాత్రమే పరచబడి ఉన్నట్లు అనిపిస్తోంది. ఆ రంగులేని దుప్పటి మీద మడతలు మాత్రమే పరచబడి ఉన్నట్లు అనిపిస్తోంది. ఆ రంగులేని దుప్పటి మీద మడతలు కూడా లేవు. ఒకవేళ మడతలు వేసినా అది ఉన్నది ఉన్నట్లుగానే ఉంది. అదేమిటో తెలియదుకాని, బాబూజీ! అప్పుడప్పుడు ఏదో ఒక కర్తవ్యం వంటిది పూర్తయిపోయినట్లు ఉంటోంది. ఆ కర్తవ్యం ఏమిటో నాకు తెలియటం లేదు. ఈ విధంగా నేను ఇంతకుపూర్వపు ఉత్తరాలలో అప్పుడప్పుడు ఏదో సంతోషం అనో లేక ఓదార్పు అనో చెప్పినట్లుగా అనిపిస్తోంది. కాని దృష్టి మాత్రం నిలకడగా ఉంది. అదేమిటోగాని, నేను 'మాలిక్'తో మనస్సులో ఏదైనా మాట్లాడినా, ఆ మాటలు కూడా 'వారి'లోనే లయమైపోతున్నట్లు ఉంది. ఇప్పుడు దశ ఉదాసీనంగా కాకుండా పాడైపోయినట్లు ఉంది. ఇక్కడ షుమారు 6,7 రోజుల నుండి సాయంత్రం వేళ మనస్సులో ఏదో భీతి వంటిది లోపల కలుగుతోంది. అది రాత్రంతా ఉండటం లేదు, చీకటిగాని, ప్రకాశంగాని ఉన్నా ఏమీ తేడా ఉండటం లేదు. ఒక్క కణంలోతప్ప ఊరట అనేది శరీరం అంతటా కణకణంలోనూ ఉంది. దానిని ఆలోచన లేదా మరేమైనా అనండి, దానిలో మాత్రం లేదు. శ్రీ బాబూజీ, నా శరీరాన్ని రాజయోగి అనండి. కాదంటే ఏమనాలో తెలియదు. నేను ఎక్కడ ఉన్నాను, నేను ఏమిటి, జీవించి ఉన్నానా లేక మరణించి ఉన్నానా అనేది కూడా తెలియకుండా ఉంది. ఆ పాడుపడిన ప్రదేశం, ఎటుచూసినా ఏమీ కానరానటువంటిది, అదే నా నివాసంగా ఉంది. ఈ స్థితి కొద్దికాలం మాత్రమే ఉంటుంది, అదే నా విస్తరణగా ఉందని చెప్పవచ్చు. ఇంకా ఈ దశలో ఎలా ఉందంటే, నా స్వంత ఇంటిలోనే నన్ను నేను కోల్పోయినట్లు గాను, వెదకి వెదకి వేసారిపోయినట్లుగాను, అయినా జాడ తెలియనట్లుగాను ఉంది. చివరకు వెదకటమే మానివేశాను. అయితే, ఆలోచన మాత్రం తప్పకుండా కొంత ఊహామాత్రంగా ఉంటోంది ఇంతకుపూర్వం, కాని ఇప్పుడు అది జ్ఞాపకం రావటం లేదు. అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 451

లఖీంపుర్,
29.12.1954

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందిందని భావిస్తున్నాను. రేపు పరమ పూజ్యులు మాస్టర్ సాహెబ్ తమ వద్దకు చేరనున్నారు. దానివలన ఇక్కడి జ్ఞాపకం తమకు మరొక్కసారి తాజాగా కలుగుతుంది. రేపు బాభీ (వదిన) మరియు సరళ జిజ్జీ (అక్క) అలహాబాద్ వెళ్ళిపోతారు. తమకు ప్రణామం చెబుతున్నారు.

బాబూజీ, ఇప్పుడు ఏమయ్యిందో ఏమోకాని, మనస్సు మరియు ఆలోచనలతోనే నేను ఎక్కడెక్కడో విహరిస్తూ ఉన్నాను. రాత్రి సమయంలో నిద్రలోను, స్వప్నంలోను ఇదే దశ ఉంటోంది. అయితే అలా విహరించటంలో దాని వెనుక 'మాలిక్' గురించిన ఆలోచన దాగి ఉంటోంది, ఇది నా విశ్వాసం. ఎందుకంటే, మొన్న రాత్రి నేను ఒక కలగాంచాను. దానిలో షుమారు 3,4 గంటలపాటు తమ వెంట ఎక్కడో తిరిగాను, కాని ఆ ప్రాంతాలన్నీ పాడుబడినవానిలాగా కనిపించాయి. చాలాసేపు ఈ దృశ్యం చూశాక, మాస్టర్ సాహెబ్ మరియు తమరు ఒక మంచం మీద కూర్చున్నట్లు తిలకించాను. ఎక్కడి నుంచి తెచ్చానో ఏమోకాని, తాజాగా ఉన్న పొడవాటి తీయని పేటాలు (స్వీట్స్) తమవద్ద ఉంచగా తమరు వాటిని బాగా తిని వెళ్ళిపోతున్నట్లు చూశాను. అది చూసి నా హృదయం ఉప్పొంగిపోయింది. మాస్టర్ సాహెబ్ కూడా తిన్నారు. ఇలా చూస్తూ ఉంటూనే, నా మనస్సులో ఎక్కడెక్కడో తిరుగుతున్న భ్రమ వంటిది ఉంటోంది. కాని ఎప్పుడైతే ఆ భ్రమకు చెందిన ఆలోచన నావైపు వస్తుందో అప్పుడు నాకు పైన చెప్పిన అనుభవం కలుగుతోంది. నిన్నటి నుంచి సాయంత్రం సమయంలో నాలో కలుగుతున్న భయం వంటిది ఇప్పుడు లేదు. బాబూజీ, ఎందుకోగాని అప్పుడప్పుడు నేను ఏదో బాధతో భయకంపితురాలను అవుతున్నాను. ఏమని అంటే, 'మాలిక్' ఎప్పటికైనా నాపట్ల తమ ప్రేమ పంచుతారా, అని. హృదయ పూర్వకంగా నేను 'అతడి'ని ప్రేమించగలనా? ఇది కూడా నా బాధకు కారణమే. ఈ రకమైన బాధ తరచుగా నా మెదడును తొలుస్తోంది. అలా కాదంటే, తపన లేదా బాధ కూడా తమ గూడు పీక్కొని ఇల్లు ఖాళీచేసి నన్ను ఒంటరిగా వదిలివేసి దశ నుంచి వెళ్ళిపోయాయా అన్నట్లు ఉంది. పూజ్య బాబూజీ, దశలో నా ఆలోచనను ఎలా నిలిపి ఉంచగలను? నాలో ప్రతి విషయానికి చెందిన (Memory) జ్ఞాపకం తరుగ్గా ఉంది. అలాగే (Forgetfulness state) మరపుస్థితి కూడా నన్ను విడిచి పారిపోయినట్లు ఉంది. ఇప్పుడు నేను ఎక్కడకు వెళ్ళినా కూడా అక్కడ నా ముందు వెనుకల పాడుబడిన మార్గంలాగానే ఉంది. 'మాలిక్' సహాయం మాత్రమే నన్ను దాటించగలదు. ఇప్పుడు నావద్ద చేతికర్ర ఊతం కూడా లేదు. ముందుకు నడుస్తున్నానుగాని స్పృహలేదు; అడుగులు పడుతున్నాయో లేదో తెలియదు; లేవగలుగుతున్నానో లేదో తెలియదు. ఎవరి సాయంతోనైనా సరే, 'మాలిక్'యే సక్రమంగా నిర్వహిస్తాడు. ఈ రోజు పూజా సమయంలో ఒక వింత జరిగింది. పూజలో కూర్చుని ఉండగా, నీటితో నిండి ఉన్న గ్లాసు తిరగబడి వెంటనే ఆ నీరు, తలమీద జుట్టు పాపిటికి చివర, దానికి కొంచెం క్రిందుగా అరచేతికంటె కొద్దిగా తక్కువ వైశాల్యంలో పడింది. అప్పటినుండి అక్కడ ఏదో రంధ్రం విచ్చుకున్నట్లు అనిపించింది. అదేమిటోగాని, 'మాలిక్' నాలో ఇముడటం లేదు. ప్రయత్నించినా కూడా ఫలితం పొందలేకపోయాను. ఇముడ్చు కోవటానికి ప్రయత్నించినా కూడా హృదయం ఖాళీగానే ఉంటోంది. ఎంతగా నింపినాగాని, నిలవటం లేదు. బ్రహ్మాండం యావత్తు సమస్త సృష్టి యొక్క అణువణువూ ఛిన్నాభిన్నమైపోయి, చిందరవందరగా అయిపోయినట్లు ఉంది. కళ్ళెదుటనైతే 'మాలిక్' కూర్చుని ఉన్నట్లు అనుభవమవుతోంది కాని, సృష్టిలో వ్యాపించి ఉన్నట్లు లేదు. ఎందుకంటే, నాలో స్థానమే లేకుండాపోయింది. అయినా కాని, నా బాబూజీ నా నుంచి వియోగం చెందరు అని నమ్ముతాను. మరి సంయోగం (Union) యొక్క స్పృహ కూడా లేకపోయింది. ఇది ఎంతగానంటె, నాకు తెలియకపోయినప్పటికి, 'అతడు'

నాలో ప్రవేశించకపోయినా గాని, నేను నన్ను తాకినాగాని, ఏదైనా వస్తువును లేవనెత్తుతున్నాగాని స్పృహ కలిగి ఉన్నట్లయితే ప్రతి స్పర్శలోను అతడినే స్పర్శించినట్లు ఉంటోంది. కాని నాలో స్పృహ లేనట్లు ఉంది.

అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 452

షాజహాన్‌పూర్,

01.01.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సదా సుఖీభవ. నీ ఉత్తరాలు చాలా చేరాయి. వాటిల్లో 16.12.1954వ తేదీ ఉత్తరానికి జవాబు వ్రాస్తున్నాను. నేను, నీకు తెలియడం కోసం శుక్లాజీ (అభ్యాసి)కి సంబంధించిన విషయాన్ని వ్రాస్తున్నాను. దానితో నీకు స్పష్టత వస్తుంది. శుక్లాజీ ప్రేమగుణం కలిగినవాడు, చాలా చిత్తశుద్ధి కలిగినవాడు. ఆయన లఖీంపూర్‌లో ఉండేవారు. వారి హృదయం, వ్యవస్థ (System) చాలా పవిత్రంగా ఉండేది. అది చూసి నేను ఆయనకు ఒక క్రొత్త విధానంలో శిక్షణ ఇవ్వాలనుకుంటున్నాను. దానిని ఆరంభించాను. నా అనుభవం ద్వారా నాది తప్పు అని గ్రహించాను. ప్రకృతి సిద్ధాంతం ప్రకారం ప్రతిదానికి విరుగుడు (Anti-dote), దానిని అంటిపెట్టుకునే ఉంటుంది. ఆటంబాంబుకు విరుగుడు (Anti-dote) గురించి మనుషులు పరిశోధిస్తున్నారు కాని ఇంతవరకు అంతుబట్టలేదు. ఈ (Scientist Atom) శాస్త్రీయ అణువును అర్థం చేసుకోవటానికి నేను దానిని (Master-Piece) అమోఘమైనదిగా చెబుతాను. దానిని ఛేదించటం వలన వినాశనం కలుగుతుంది. ఆటంబాంబు యొక్క విరుగుడు దానితోపాటే ఉంది. దాని రూపం ఒక చిన్న (Bracelet) కంకణంలాగా ఉంటుంది. దాని శక్తిని వినియోగించినట్లయితే ఆ అణువు యొక్క ప్రభావం నిర్వీర్యమవుతుంది. నా ఈ పరిశోధన తిరుగులేనిది. ఏ శాస్త్రవేత్త అయినా దీనిని పరిశోధించి చూడవచ్చు. **ఎవ్వరైతే తనను తాను చదవగలుగుతారో, అటువంటివారికి ఇంక తెలుసుకోలేని విషయమంటూ ఏదీ ఉండదు.** 'నిన్ను నీవు తెలుసుకో (Know Thy Self)' అని సోక్రటీసు చెప్పినదే మన వేదాలలో కూడా చెప్పబడింది. యోగమార్గంలో, మనం చివరకు దేనిని చేరాలో దానికి అవసరమైన విషయాలనే స్వీకరిస్తాం. **భక్తి మార్గమని ఇటీవల చెప్పబడుతున్న దానిలో ఏవైతే మనం నిషేధించామో లేదా ఏవైతే మనం చేయకూడదో వాటినే చేస్తున్నాం. దాని మూలంగా మన లక్ష్యానికి ఇంకా దూరమైపోతూ ఉన్నాం. మల్లయోధులు రెండు గంటలపాటు బరిలో పోరాడి కసరత్తు పూర్తయినట్లుగా భావించునటువంటిదే ఇది కూడా. అలాగే ఒకరు రెండు గంటలు, మరొకరు కొంచెం ఎక్కువ సమయం ధ్యానంచేసి దానితో తమ మానసిక వ్యాయామం పూర్తయిపోయినట్లుగా సంతృప్తిపడతారు.**

ఇప్పుడు అసలు విషయానికి వస్తాను. శుక్లాజీ వెన్నెముక యొక్క ఒక కీలుమీద నేను ఒక నెట్టునెట్టినపుడు, అది చాలా మంచి ప్రభావం చూపించసాగింది. అయితే కాలమహిమ, ఆలోచనల ప్రభావంతో ఆయన ఆ భాగంతో తన సంబంధాన్ని త్యజించిన కారణంగా వెలుగుకు బదులు చీకటి ఏర్పడింది. ఏ విధంగానైతే అణువు (Atom) దాని నంటిపెట్టుకున్న వాటితో ప్రభావితమవుతుందో, అదే విధంగా శుక్లాజీ వెలుగుకు బదులు చీకటిని సమకూర్చుకోవటం మూలంగా అతని హృదయం ఒక చీకటి గదిగా తయారైపోయి, దానితో అతని వ్యవస్థ (System) అంతా చీకటి అయ్యింది. ఈ అంధకారాన్ని కొంతవరకు నేను అలహాబాద్‌లోను, మిగిలిన దానిని ఇక్కడ తొలగించాను. వ్యవస్థ యొక్క అంధకారాన్ని మాత్రం జౌన్‌పూర్ వెళ్ళబోయేముందుగానే తొలగించాను. కాని హృదయపు చీకటి జౌన్‌పూర్‌లో ప్రయత్నించినప్పటికి తొలగిపోలేదు. ఇక్కడ కూడా ప్రయత్నించాను కాని ప్రయోజనం లేకపోయింది. చివరకు దైవం

నా దిగులు చూసి నాకు సహాయమందించాడు. దానితో మాస్టర్ సాహెబ్‌కు ఉత్తరం వ్రాస్తూ ఉండగా నా ఆలోచన ఆ దిశగా మళ్ళింది. ఎప్పుడైతే నేను దానిని అడ్డగించానో అప్పుడు అతనికి చీకటి నుంచి విముక్తి కలిగింది. ఇప్పటికీ సాలెపురుగు వలలాగా కొంత మిగిలి ఉంది. ఇప్పుడు దానిని కూడా తొలగించాలి. అక్కడ అంధకారమైతే లేదు కాని, పూర్తిగా కాంతి మాత్రం ఇంకా ఏర్పడలేదు. ఇది నా మూర్ఖత్వపు గాథ. మరి ఈ సాలిపురుగు వల లాంటిది ఎప్పుడు తొలగిపోతుందో వేచి చూడాలి. భగవంతుడే నాకు సహాయపడాలి. నీవు కూడా అతని హృదయ పరిస్థితిని గమనించి నీ ఆలోచనకు వచ్చిన దానిని వ్రాయి.

'మాలిక్'పట్ల విశ్వాసం, ప్రేమ లేకపోవటంవలన ఈ విధంగా జరుగుతుంది. "హృదయం యొక్క స్థితి, దానిలో ప్రాణంలేనట్లు ఎందుకు ఉంది?" అని నీవు ప్రశ్నించావు. దీనికి జవాబు నేను ఇదివరకే వ్రాశాను. కాంతి అనేది ఆధ్యాత్మిక జీవనం. అది సత్యం యొక్క భావనగా తలపిస్తూ ఉంటుంది. అంధకారం ఆధ్యాత్మిక జీవితం యొక్క మరణాన్ని తలపింప జేస్తుంది. ఈ అంధకారం ఉండటం వలన తమోగుణానికి చెందిన వృత్తులు ఏర్పడి, జీవితం నిష్ప్రయోజనమవుతుంది.

అధిచేతనా స్థితి (Super-Conscious state) గురించి నీవు వ్రాసింది సరిగ్గానే ఉంది. అది వృద్ధి చెందకపోవటానికి ఇదే కారణం. ఉదాహరణకు మీ తండ్రిగారు ఉన్నారు. వారి దివ్యచేతనా స్థితి మెదడు వరకు చైతన్యవంత మయ్యింది, కాని దానిని వారు ఉపయోగించుకోవటం లేదు. దానికి కారణం భక్తి మరియ ఆసక్తి లేకపోవటమే. ఏదైతే కష్టపడకుండానే దక్కుతుందో దాని ఫలితం ఇలాగే ఉంటుంది. ఆధ్యాత్మికంగా గొప్పవారైన వారి వయస్సు నిండుగా మీదపడినప్పటికీ వారి హృదయం యొక్క దివ్యచేతనా స్థితి పూర్తిగా వికసించదు. నేను తలచుకుంటే మీ తండ్రిగారి కుండలిని కూడా వికసింప జేస్తాను. దానిని కలిగి ఉన్నందుకు వారు సంతోషపడటానికి మాత్రమే అది పరిమితమవుతుంది. దాని మూలంగా అహంకారం ఏర్పడుతుంది. **పురాతన పద్ధతి ప్రకారం గురువర్యులు శిష్యుల ద్వారా కఠిన శ్రమ ఫలితం పొంది ఆ తర్వాత వారికి ధ్యానం చేయటం నేర్పేవారు. ఇది శిష్యుల యొక్క కుతూహలాన్ని పరీక్షించేందుకే ఈ విధంగా చేసేవారు. కాలం దిగజారిపోయిన తర్వాత, గురువులు దీనిని భ్రష్టు పట్టించారు. వారి సుఖభోగాల కోసం శిష్యులను పీడించటం ప్రారంభించారు. సేవలు అంది పుచ్చుకోవటం తమవంతుగాను, సేవ చేయటం తమ వంతు కానట్లుగాను వ్యవహరించారు. కనుక ఈ విధానాన్ని కొనసాగనివ్వడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. శిష్యునికి పనివారులాగ సేవ చేయడం గురువు యొక్క కర్తవ్యం. దీనిని మన లాలాజీ సాహెబ్ విధిగా అమలు జరిపి చూపించారు.**

నీవు జ్ఞాపకం గురించి ఒక అభియోగం వ్రాశావు. ఇది అభియోగం అనడానికి వీల్లేదు కాని చాలా మంచి విషయం. కబీర్ ఇలా వ్రాశారు:

**"ఏక్ ఏక్ కా కరయి విచార్, జహాఁ మిలౌని, తహాఁ విచార్"**

అనగా ఏకత్వం గురించి ఆలోచిస్తూనే, కలయిక జరిగినపుడు మళ్ళీ ఇద్దరుగా ఆలోచన రావటం అని అర్థం.

నీలో ఇంకా కొంత ద్వైతం ఉండిపోయింది కనుకనే జ్ఞాపకం గురించిన తలంపు ఉంటోంది. ఎవ్వరికైనా తనను గురించిన జ్ఞాపకం లేనప్పుడు, ఇతరుల గురించిన జ్ఞాపకం పెరుగుతూ ఉంటుంది. ఇతరులు ఎవ్వరూ ఎదుటలేనపుడు వారి జ్ఞాపకం రాదు. నేను "సహజమార్గం యొక్క దశ నియమాల వ్యాఖ్య"లో ఒక వాక్యం వ్రాశాను. అది ఏదో ఖచ్చితంగా ఇప్పుడు జ్ఞాపకం లేదుకాని, దాని అర్థం ఏమిటంటే, **"జ్ఞాపకం అనేది మళ్ళీ తలంపుకు రానిదిగా ఉండాలి. ఇంకొక రకంగా చెప్పాలంటే, జ్ఞాపకం యొక్క జ్ఞాపకం కూడా లేకుండా పోవాలి.** నీకు అనుభవమవుతున్న ఒంటరితనం, ఒక ఎడారి భూమికి నిదర్శనంగా ఉంది. మనం చేరవలసింది కూడా అక్కడికే.

నీవు డిశంబరు 22వ తేదీన వ్రాసిన ఉత్తరంలో కొన్ని స్థితులు ఉన్నాయి. అందులో మొదటిది 'సంతృప్తి' గురించి. అది నీలో కలగలేదు. అయితే ఎటువంటి స్థితులూ కలగనపుడు మాత్రమే దాన్ని అనుభూతి చెందుతావు. "ఇదివరకు మరపుస్థితి కలుగుతూ ఉండేది కాని, ఇప్పుడు అది అనుభూతికి రావటం లేదు" అని వ్రాశావు. అంటే నీవు మరపుస్థితిని కూడా మరచిపోయావన్న మాట. ఇది లయ-అవస్థకు చెందిన ఒక మంచి స్థితి. నీ ఈ ఉత్తరంలో ఒక మంచి మాట, "బంధనం మరియు ముక్తి అనేవి రెండూ నాకు అర్థరహితంగా అనిపిస్తున్నాయి" అని వ్రాశావు. ఇది చాలా ఉన్నతమైన ఆలోచన. బాగా ఆలోచించినట్లయితే ముక్తి కూడా ఒక బంధనమే. ఒక రకంగా మనం దానితో బంధనం కల్పించుకుంటున్నాం. దానిని ఒక హద్దుగా అనుకుంటున్నాం. హద్దులేని స్థితి అక్కడ లేకపోవడం వలన మన ఆలోచనలో హద్దు లేకుండా ఉండే లోపం కలుగుతుంది. దాని కారణంగా, మనం హద్దులేని దిశగా ముందుకు సాగలేకపోతున్నాం. జగమంతా ముక్తికోసం తపన చెందుతోంది. **ముక్తి అనేది బంధనాల నుంచి విముక్తి అయితే, ముక్తి నుంచి విముక్తి పొందటమే వాస్తవికత (రియాలిటీ) అవుతుంది. మనం ఈ రెండింటినీ కూడా విడిచిపెట్టినట్లయితే అనంతంవైపు పయనిస్తాం, అయితే ఇది మాత్రమే కాదు. ఈ అనంతం అను ఆలోచన మన మనసులో ఉండినట్లయితే మన గమనం కూడా ఒక హద్దుకు పరిమితమై పోయి, 'హద్దులేమి' దిశగా మనం పురోగమించలేకపోతాం.** ఎవ్వరైనా మన గురుమహరాజ్ శిక్షణా విధానంపైన ధ్యాస నిలిపితే వాస్తవికతను గురించి తెలుస్తుంది. మరి అది ఎవ్వరికి? తెలుసుకోవాలనే సంకల్ప నిశ్చయం ఉన్న వారికే. మనం మన సాధన ప్రారంభం నుంచే అభ్యాసులకు 'హద్దు' మరియు 'హద్దులేమి' యొక్క ఆలోచన కలుగనీయం. చెప్పటానికి మాత్రం మనం కూడా 'అనంతం' వైపు సాగిపోవాలి అని అంటాము. ఎందుకంటే, మనం చేరుకోవాల్సిన స్థానాన్ని తెలపటానికి తగిన మాట లేదు కనుక. ఈ ఉత్తరంలో మిగిలినదంతా లయ-అవస్థను గురించిన మంచి వివరణ ఉంది.

నీవు 27.12.1954వ తేదీతో పంపిన ఉత్తరంలో ఉన్న ప్రతి అనుభూతికి వివరణ పూర్తిగా ఇవ్వాల్సి ఉంది. అయితే సమయాభావం వలన అంతగా అవసరం లేదనిపిస్తోంది. అందులో ఒక మాట, "జీవనం, మరణం రెండూ ఒక్కటిలాగే అనిపిస్తున్నాయి" అనేది నాకు బాగా నచ్చింది. ఇది (Originality) 'మూలం'. దానినే నిరూపిస్తోంది. దానిని వివరించటం అంత సులభం కాదు. నీ ఉత్తరం 29.12.1954వ తేదీతో ఉన్న దానిలోని విషయాలకు జవాబు ఇవ్వాల్సిన అవసరం లేదు. "ఒక గ్లాసు నీళ్ళు నెత్తి మీద పడినట్లుగాను, దాని వలన ఒక రంధ్రం ఏర్పడినట్లుగాను అనిపిస్తోంది" అని వ్రాశావు. దానినిబట్టి 'మాలిక్' తన వార్తలను పంపటానికి ఒక స్థానాన్ని నిర్ణయించినట్లు నాకు అనిపిస్తోంది. ఈ విషయం అక్కడకు చేరేసరికి ఆ స్థితి అంతటతో ముగింపు కావచ్చు. ఇప్పుడు నీవు '$A_1$'స్థానం మీద ఉన్నావు. దానిలో నీ యాత్ర ప్రారంభమయ్యింది కాని నిదానంగా ఉంది. మాస్టర్ సాహెబ్ ద్వారా నీ ఆరోగ్య పరిస్థితి తెలిసింది. అందుకు ధన్యవాదాలు. నీ ఆరోగ్యం ఇప్పుడు వృద్ధి చెందుతూ ఉండటం వలన నీ ఆధ్యాత్మిక యాత్రపై దృష్టి నిలుపుతాను. ఇప్పుడు నా ఆరోగ్యం కూడా బాగుంది.

చౌబేజీ నా ప్రణామాలు అమ్మకు అందజేస్తానని మాట ఇస్తున్నారు కనుక ఇక్కడ వ్రాయలేదు. కేసర్, విమల మరియు ఉమ వ్రాస్తున్న ఉత్తరాలు అందుతూనే ఉన్నాయి. జవాబులు కష్టం మీద చేర్చగల్గుతున్నాను. తులసీదాస్ అలహాబాద్ చేరుకుని 30.12.1954న ఢిల్లీకి ప్రయాణమైపోయి ఉండవచ్చు. ఇంకా కొన్ని పుస్తకాలు వ్రాయాలని నేను అనుకుంటున్నాను, అలాగే మాస్టర్ సాహెబ్ కూడ భావిస్తున్నారు. ఆలోచించిన మీదట, నాకు తెలిసినది ఏదో అంతా వ్రాసివేశాననీ అనిపిస్తోంది. ఇప్పుడు నాకు ఇంకా వ్రాయాలని అనిపించటం లేదు. ఎందుకంటే, వ్రాయాల్సిన విషయం అంటూ ఏమీ మిగలలేదనిపిస్తుంది. ఇప్పుడు నేను ఏమి వ్రాయాలో నీవు చెప్పు!

ట్యూబులు (మందులు) దొరుకుతున్నంతవరకు వాడుతూ ఉండు. ధరల గురించి ఆలోచించవద్దు. రామచంద్రా మిషన్ ద్వారా నీ కొరకు వచ్చిన పుస్తకాన్ని నీకు పంపుతున్నాను. దానిలో ఒక మనియార్డర్ ఫారమ్ కూడా జత

చేశాను. నీకు ఎంత వీలైతే అంత మిషన్‌కు పంపించు. నేను, నీ తరఫున ఒక రూపాయి బసంత్‌పంచమి ఉత్సవం కొరకు ఇచ్చాను. నేను చౌబేజిని రెండు రోజులపాటు నిలువరించాను. ఆయన మంగళవారం నాడు వస్తారు, ఇప్పుడు బాగున్నారు. నారాయణ అందరికీ నమస్కారాలు తెలుపుతున్నాడు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 453

లఖీంపుర్,
4.01.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమ' ఉత్తరం మరియు పుస్తకం సోదరుడు పుత్తీబాబు ద్వారా చేరాయి. ఉత్తరం చదివాక అత్యంత ఆనందం కలిగింది. ఈ రోజు తావూజీ కూడా 3 గంటలకు వచ్చేశారు. వారి ద్వారా తమ ఆరోగ్యం మరియు ఇతర విషయాలు విని చాలా సంతోషమయ్యింది. తమరు పంపిన టానిక్ సీసా కూడా అందింది. నేను బసంత పంచమి నాటికి తమరు సంతోషించే విధంగా ఆరోగ్యవంతురాలను కావటానికి ప్రయత్నిస్తూ ఉన్నాను. సోదరుడు శుక్లాజీ స్థితిని చూసిన తర్వాత చాలా విచారం కలిగింది. ఇది 'తమరు' పట్టుకోవటం వలన కలిగిన ఫలితమే అయినా గాని, దానికి తరుణోపాయం తమరు తలపెట్టే ఉంటారు. వారికి కూడా దీనిని గురించిన చింత స్వయంగా ఉన్నట్లయితే ఈ స్థితి కలిగి ఉండేది కాదు.

బాబూజీ! ఇప్పుడు నాకు ఈ విధంగా అనిపిస్తోంది. ప్రయాణంలో నడక కొంత వేగమైతే పుంజుకుంది కాని పగ్గాలు లాగుతూ ఉన్నాయి. నా దృష్టిలోనయితే ఈ పగ్గాలు లేకపోతే అభ్యాసీకి చాలా త్వరగా అలుపు వస్తుంది. నాకు 'మాలిక్' పగ్గాలు మెడకు చుట్టి ఉంచినట్లయితే, ఎలా నడిపిస్తే అలా నడవొచ్చును కనుక, ఇదే బాగుంటుందని అనిపిస్తోంది. నా దశ ఎలా ఉందంటే, ఆరిపోతున్న దీపంలో అప్పుడప్పుడు కాంతి పెల్లుబుకుతూ ఉన్నట్లుగానే, జ్ఞాపకం లేదా ప్రేమ గురించి ఇతరులలో ఉన్న ప్రేమను చూసి ఆశ చిగురిస్తోంది, అయితే తైలం అయిపోయింది. మరి దీపం ఎంతసేపు వెలుగుతుంది! మనస్సు పరిస్థితి ఎలా ఉందంటే, దానికి ఐక్యం కావాలను స్పృహయే లేకుంటే, అది ఎలా జరుగుతుంది. ఇది నా దశకు సంబంధించి అర్థరహితంగా ఉంది. ఇప్పుడు నేను ఎక్కడకు వెళ్ళినా, అక్కడంతా నిస్సారమైన మిట్టపల్లాల మైదానంలాగా ఉంటోంది. నేను ఎంత స్పృహ లేకుండా ఉన్నానంటే, అసలు పాదం మోపుతున్నానో లేదో, ముందుకు పోవటానికి నిలబడుతున్నానో లేదో తెలియటం లేదు. అదేమిటోగాని, నేను స్పృహ లేకుండానే ఉన్నాను. అది నాకు తెలియదు. అందువలన స్పృహయే ఉన్నట్లయితే నాకు దాని జాడ తెలిసి ఉండేది. ఆపైన 'మాలిక్‌'కే తెలియాలి. ఇంకా చెప్పాలంటే, ఒక దిక్కు దివాణంలేని శవం నిస్సారమైన మైదానంలో పడి ఉన్నట్లుగా, మనస్సు కలయ చూసినా, వెనుదిరిగి చూసినా అలాగే గ్రహింపుకు వస్తోంది. ఇంతేగాకుండా, ప్రతి జడచైతన్యమూ అన్నీ అకారణంగా మృతులై ఉన్నట్లుగానే అనిపిస్తోంది. కారణం అంటూ లేనప్పుడు, ఏదైనా అర్థరహితం, ప్రయోజన రహితమే అవుతాయి. శ్రీ బాబూజీ, నా జ్ఞాపకం గురించిన స్థితి ఇలా ఉంది, ఎందుకంటే జ్ఞాపకం యొక్క పేరు కూడా నాకు రావటం లేదు. స్థితి ఈ విధంగా ఉన్నపుడు మృతునికి (అనగా నాకు) ఏదైనా సరే, నిరుపయోగంగానే ఉంటుంది. నేను ఇంతకుపూర్వం, ఎవరైనా 'మాలిక్' పేరు స్మరించినట్లయితే గుండెలు అదిమిపట్టుకుని ఉండేదానను అని వ్రాశాను కదా, కాని ఇప్పుడు అలా లేదు. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, ఏ విధంగానైతే శవం మీద రాళ్ళు విసిరినా, పుష్పాలు విరజిమ్మినా ఏమిపట్టనట్లు ఉంటుందో నాకు అలానే ఉంది. అసలు స్వయంగా నేను అర్థం పర్థం లేకుండా ఉన్నాను. ఇప్పుడు నలుదిక్కులా ఒంటరి క్షేత్రం లేదా ప్రదేశంగా ఉంది. అదేమిటో నాకు తెలియదు.

బాబూజీ, 'తమరు' నన్ను వ్యాసం వ్రాయమని అడిగారు. నాకు అంతటి జ్ఞానమే లేకపోయాక నేనేమి చేయగలను. ఎప్పుడైనాగాని, 'తమరు' ఏది చెప్తే, దానినే నేను గ్రహించగలుగుతున్నాను. ఇంతకుమించి నాకేమి తెలుసు. కనుక, బాబూజీ, దయచేసి క్షమించండి. 'తమ'కు ఏది వ్రాసినా కూడా అది ప్రపంచ కళ్యాణానికే అవుతుంది.

బాబూజీ! ఇది నిజంగా అర్థరహితం, ప్రయోజన రహితంగా ఉన్న దశ. అందుకని మరణస్థితిగా పేర్కొన్నాను. అదేమిటో 'మాలిక్'కే తెలియాలి.

అమ్మ తమకు శుభాశీస్సులు, మాస్టర్ సాహెబ్‌కు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. మాస్టర్ సాహెబ్‌గారికి నా నమస్కారాలు కూడా తెలియజేయండి.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 454

లఖీంపుర్,

9.01.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందిందని భావిస్తున్నాను. తమ కడుపునొప్పి పెరుగుతున్నట్లు పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి నుంచి తెలుసుకున్నాను. ఉత్సవ సమయంలో తమకు ఏమాత్రం ఎక్కువ కష్టం కలగకూడదు. నేను కూడా ప్రస్తుతం చాలా బాగున్నాను. మేము, మాస్టర్ సాహెబ్‌గారు వగైరాలు 25వ తారీఖు రాత్రికి గం. 11 లకు చేరిపోతాము. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

పూజ్య శ్రీ బాబూజీ! నేను ఇప్పుడు ఒక నిరర్థకమైన, నిరుపయోగమైన దానిలాగా ఉన్నాను. నా ఆత్మ కూడా నన్ను విడిచిపెట్టి పోయినట్లు ఉంది, అదేమిటో తెలియదు. నిర్జనారణ్యంలో పడియున్న మృతదేహం కూడా ఎక్కడకు పోయిందో తెలియటం లేదు. అది నాకు కనిపించటం లేదు. అదేమిటోగాని, ఇప్పుడు ఈ దశను బ్రహ్మగతి అని చెప్పాలంటే, నాకది ఆనందంగా ఉండదు. ఎందుకంటే, ఆ విధంగా చెప్పాలనుకున్నప్పుడు, ఎందుకోగాని నాలోపల కొద్దిగా అశాంతి వంటిది కలుగుతోంది. ఆత్మ యొక్క పరిస్థితి కూడా ఇదే. ఆత్మ అని చెబుతూ ఉంటే ఒక వింతైన భయాందోళన కలుగుతోంది. బాబూజీ, ఆత్మ లేకుండా కూడా శరీరం జీవించి ఉంటుందంటారా? అది తమకే తెలియాలి. నాకు మాత్రం ఏమీ తెలియటంలేదు. అనగా నాలో బుద్ధి, వాక్కు, కళ్ళు, చెవులు ఏవీ లేనట్లు ఉన్నాయి, నేను ఇంకేమి చెప్పాలి. అయితే ఏదో విధంగా వ్యాసం వ్రాయబడింది. అయినా కూడా నాకేమి జ్ఞాపకం వస్తున్నదంటే, వ్యాసం వ్రాస్తున్న సందర్భంలో కూడా నాలో ఏమీ లేనట్లుగాను, బహుశా నేనే లేనట్లుగాను అనిపించటం, ఏమి జరిగింది, ఎలా జరిగింది అనేది కూడా నా అవగాహనకు రాలేదు. అదేమిటో దైవానికే తెలియాలి. ఆత్మయే శరీరాన్ని విడిచిపోయాక, ఇంక నేను ఎవర్ని? ఇంకా ఏమిటంటే, ఈ విధంగా ఆత్మ నాలో లేకపోవటమేకాక, ఇతరులలో కూడా నాలాగానే ఆత్మ లేకపోవటం, నిరర్థకం, నిరుపయోగం, కారణం లేకుండా ఉన్నట్లు అనిపిస్తున్నాయి. ఇప్పుడింక ఈ మాట 'అనిపిస్తున్నది' అనే దానిని తొలగించినట్లయితే, బహుశా దశ సక్రమంగా వివరించినట్లవుతుంది. నాకు స్వయంగానే నేనంటే నాకు భయం కలుగుతోంది, అను విషయం ఎవ్వరితోనైనా చెప్పితే నవ్వుతారు కదా! వీపు వెనకభాగం ఏవో క్రిములపాలిట పడినట్లుగాను, అది అంతా నశింపు అయిపోయి అస్థిపంజరంలాగా ఉండి దానిలో కేవలం ప్రక్కటెముకలు మాత్రమే ఉండి, వెన్నెముక ఒక నిలువు రేఖలాగాను ఉండిపోయింది. నా ఈ దశను మృతదశలాగా చెప్పుదామంటే, ఆ మృత్యువు కూడా నాకు అపరిచితమే అనిపిస్తోంది. అసలు ఆత్మయే లేనపుడు ఆ శరీరం ఎవ్వరిదని మాత్రం చెప్పగలం. ఆ మృత శరీరాన్ని స్పర్శించి దానిని పైకి లేవనెత్తుదామని అనుకుంటే, అది

మృతదేహమో లేక వస్త్రమో అనుభూతికి రావటం లేదు. అసలు మరణించాడో లేదా ఉలుకుపలుకు లేకుండా ఉన్నాడో తెలియని దశగా ఉంది. దీనిలో వాస్తవం ఏమిటో బాబూజీ, తమకే తెలియాలి. నా స్థితి ఎలా ఉందంటే, ఈశ్వరుని కనుగొనాలనిగాని, 'అతడ్ని' కనుగొనాలన్న ఆశగాని లేకపోగా ఈ విధంగా వ్రాస్తున్నప్పుడు నా ప్రాణం ఉక్కిరి బిక్కిరైపోతోంది. నేను మాత్రం ఉదాసీనంగా (మార్పు లేకుండా) అయి పోయాను. అదేమిటోగాని బాబూజీ, ఇప్పుడు ఉత్సవానికి వెళ్ళాలి అనిగాని, తమవద్దకు చేరుకోవాలనిగాని ఆలోచన రాగానే గుండె గాబరాపడుతోంది. అందుచేత ఈ ఆలోచన ఒక క్షణమైనా నిలుపుకోలేకపోతున్నాను. ఈ ఆలోచనతో నేను సంతృప్తి చెందాలని కూడా భావించటం లేదు. అయినా గాని, అక్కడకు రావటానికని అన్నీ సిద్ధం చేసుకుంటున్నా కూడా ఏమీ అనిపించటం లేదు. ఇంతేకాదు, ఆ ఆలోచనల్లో మునిగి ఉందామని అనుకుంటున్నప్పటికీ, నా మనస్సుతో ఏమీ ఆలోచించలేకపోతున్నాను. ఎలా ఉన్నానో అలానే ఉండాలి అనుకుంటే ఏ దిగులూ లేదు. ఈ స్థితి ఏమిటోగాని బాబూజీ, నాకు తమరుతప్ప ఏమీ తట్టటం లేదు. తమరు తలచిన విధంగానే ఉంటాను. నేను తమ పాదాలు పట్టుకుని ఉన్నాను, వదిలించుకోవాలనుకున్నా ఆ పట్టు సడలదు. కావాలంటే, తమరే ఆ పట్టు సడలించండి, కాని అది సాధ్యం కాదు. నాకు మాత్రం దాని యొక్క ఎరుకగాని, 'మాలిక్' యొక్క ఎరుకగాని లేదు. కేవలం దృఢ విశ్వాసం మాత్రమే ఉంది.

అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 455

లఖీంపుర్,
14.01.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. బహుశా తమరు తీరిక లేకుండా ఉండటం వలన చాలా రోజులుగా తమ ఉత్తరం రాలేదు. నా ఉత్తరం అంది ఉండవచ్చు. ఇప్పుడింక ఉత్సవానికి 2 వారాల వ్యవధి మాత్రమే ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

శ్రీ బాబూజీ! ఇప్పుడు నాకు పాడుబడిన స్థితిగా కాకుండా, స్వయంగా నా స్వరూపమే ఒక నిర్జన, నిస్సార భూమిలాగా శూన్యమైపోయింది అని అనిపించటమేకాదు, నేనే ఉదాసీన (దిగులు) రూపంగా అయిపోయాను. ఏదైనా వస్తువు వంక చూస్తున్నాగాని, గానం నేర్చుకుంటున్నాగాని, కొంతసేపు అయ్యేసరికి దానిని జ్ఞాపకం చేసుకోవటానికి ప్రయత్నిస్తే, స్వప్నంలో జ్ఞాపకం చేసుకుంటున్నట్లు ఉంటోంది. ఎప్పుడైతే ఆ జ్ఞాపకాన్ని మానివేస్తానో అప్పుడు అంతా సమాప్తమైపోతుంది. అనగా యధాస్థితికి వస్తుంది. బాగా చూస్తూ ఉంటే, మెదడు ఎల్లప్పుడూ ఆలోచనలో నిమగ్నమై ఉంటున్నట్లు ఉంటోంది. అవి (ఆలోచనలు) ఎలాంటివో, ఎక్కడివో నా అవగాహనకు అంతుబట్టనివిగా ఉన్నాయి. అటు ఆలోచనలు ఒకవైపు ఉంటే మరొకవైపు నేను ఉదాసీన రూపంగా ఉన్నాను. ఈ రెండూ ఒక దానితో ఒకటి కలిసి ఉండనట్లయితే, 'ప్రయోగం' (Practical) అను మాట నాకు లేకుండా పోతుంది. ఒక ఉదాసీనం, నిస్సారమైన దశ పూర్తిగా నా దశలో అనగా నా స్వరూపంలో, నాలో కరిగిపోతున్నట్లుగాను, ఇంకిపోతున్నట్లుగాను అనిపిస్తోంది. దానిని ఉదాసీనత యొక్క సహజ రూపమని చెప్పినప్పటికీ సబబే అనిపిస్తోంది. ఎందుకంటే, నేను కూడా పూర్తిగా సహజత్వంలాగా అయిపోయినట్లు చూస్తున్నాను కనుక. అది ఇప్పుడు నాకు కేవలం శూన్యత్వం యొక్క భావాన్నే కలిగిస్తోంది. ఇటువంటి సంపూర్ణ దశయే నాలో లయమవుతూ వస్తోంది, దాని

అంతులేకుండా ఉంది. దృష్టిని నావైపుకు తరలించినా కూడా ఒక సహజ సామ్యావస్థ వంటి ధారతప్ప మరేమీ అనుభవానికి రావటం లేదు. ఇది నాలోనే కాదు, ప్రతి సమయం, ప్రతిచోట ఒకే ఒక సహజధార అనుభవమవుతోంది. అది గమనం లేనిదిలాగనైనా చెప్పండి, లేదా చాలా నిదానంగా ప్రవహిస్తోంది అని అయినా చెప్పండి. నాకు అనుభవమవుతున్నది మాత్రం అదే. ఈ దశ నా దృష్టిలో వ్యాపించిపోయిందని అనుకుంటాను. కాని హృదయం లేదా నేను, ఉదాసీనంగానో లేక శూన్యంగానో ఉండిపోయాము. ఈ స్థితిలో ఇదే కొనసాగుతూ వస్తోంది. నా పరమపూజ్య బాబూజీ! ఇంతేకాదు, ప్రతి వస్తువు లేక విషయం, ప్రతి సమయంలోను నా లోపల బయట ఉన్నవి అన్నీ ఉదాసీనంగా లేక శూన్యంగానే కనిపిస్తున్నాయి. స్వయంగా నా రూపమే ఏమై ఉంటుంది? ఇంకేముంది, శూన్యం అని మాత్రమే నిర్వచించగలుగుతున్నాను. ఒక్కటైతే ఉంది, దానిని నా దశగా  ఉందని చెప్పాలో, లేదా నా మైదానం అని చెప్పాలో అర్థం కావటం లేదు. నాకయితే ఒక మైదానం నుంచి ఈ విధంగా కనిపిస్తోంది: ఒక కేంద్ర బిందువు, దానిచుట్టూ కొన్ని బిందువులు. దీని సంగతి ఏమిటో బాబూజీ, నాకు అర్థం కావటం లేదు. నేనయితే ఉదాసీనతలోకి జారుకుని అక్కడే ఉండిపోయాను. నా కణకణం, అలాగే సమస్త బ్రహ్మాండం యొక్క కణకణం శూన్య రూపంగా అయిపోయాయి. ఆ శూన్యం ఏమిటో తెలియదు. ఇంకా ఏమిటంటే, అసలు ఏమిటి, ఎవరు అను జ్ఞానమే లేకుండాపోయింది. ఒకవేళ షాజహాన్‌పూర్‌లో నేను ఉన్నాను అనుకుంటే, ప్రతికణంలోను 'వారి' ప్రకాశమే పొందుతున్నట్లు అనుభవమవుతోంది. ఇప్పుడు నేను ఏమి చెప్పాలో నాకు అర్థం కావటంలేదు. ఎందుకంటే, నాకు అసలు జ్ఞాపకమే లేకపోయింది ఈ దశలో అని చెప్పటానికి కూడా హక్కు లేదనిపిస్తోంది. ఎందుకంటే, జ్ఞాపకమును దానిని జ్ఞాపకం చేసుకుందామనుకున్నా కూడా జ్ఞాపకం శూన్యంగానే ఉంటోంది. యదార్థం ఏమిటంటే, కస్తూరీ యొక్క ఆలోచనా భాండాగారం ఛిద్రమైపోయింది. దశ యొక్క ఆంతర్యం కూడా బహిర్గతమై పోతోంది. ఇంక ఏమిటో 'మాలిక్'కే తెలియాలి. నేను ఇప్పటివరకు నిర్వచించిన శూన్యత లేక ఉదాసీనత అనేవి నా దశకు చెందిన ఊహాగానం లేదా భ్రమ.

అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 456

షాజహాన్‌పూర్,
15.01.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలు 04.01.1955 మరియు 09.01.1955 తేదీలవి చేరాయి. కాశీరామ్‌గారు తన ధర్మపత్నితో కలిసి బసంత్ ఉత్సవంలో పాల్గొనేందుకు 09.01.1955న ఇక్కడకు చేరుకున్నారు. కాశీరామ్‌గారి స్థితి చాలా బాగుంది. అది చూసి నా హృదయం ఆనందించింది. అతడి ధర్మపత్ని కూడా ఆధ్యాత్మికతను నేర్చుకోవాలను అభిలాష కలిగి ఉంది. నేను ఆమెతో అస్సాంలో సాధన చేయమని వ్రాశాను. దానిని ఆమె సక్రమంగా చేస్తోంది. ఇప్పుడు ఆమె దానిని నియమానుసారంగా నేర్చుకోవాలనుకుంటోంది. నేను ఆమెతో కస్తూరి ఇక్కడకు 26.01.1955వ తేదీన వస్తుందని, ఆమె తగిన పద్ధతిని వివరిస్తుందని చెప్పాను. కాశీరామ్‌గారు మిషన్ గురించి అస్సాంలో మంచి ప్రచారం చేశారు. చైనీయులు, బర్మీయులు కూడా నేర్చుకోవాలని అనుకుంటున్నారు. కాని వారు ఇక్కడకు రావటం కష్టమవుతుంది.

వాస్తవంగా నీ పగ్గాలు నా చేతిలో ఉన్నాయి. **బాగా ఉన్నతి చెందినవారి పగ్గాలు నా చేతిలోనే ఉంచుకోవలసి ఉంటుంది. దానికి కారణం ఏమిటంటే, వారు ఏదైనా మహిమను చూసి ముగ్ధులైపోయి దానిలోనే మునిగిపోకూడదు అని. మన గురుమహరాజ్‌కు ఉన్న విద్య ఎటువంటిదంటే, ఒకవేళ వేలకొలది అభ్యాసులు ఉన్నతి చెందినవారు ఉన్నప్పటికీ, వారందరి పగ్గాలు వాటికి అవే నా చేతిలోనే ఉండేటట్లు చేశారు. ఈ విధంగా చేయటం వలన కలుగు గొప్ప లాభం ఏమిటంటే, అందులో మొదటిది – నాకు వారి స్థితిని గురించి ఎప్పుడు అవసరంపడుతుందో, అప్పుడు నిమిష నిమిషానికి ఆ సంగతి తెలుస్తుంది. ఇక రెండవ లాభం– అభ్యాసులు పురోగమన వేగం సహజమైన రీతిలో నియంత్రించబడుతుంది. వారికి తమంతట తాముగా ముందుకు నడిచే శక్తి కూడా లభిస్తుంది. ఆ విధమైన నియంత్రణ లేకుండినట్లయితే అలసిపోవటం జరుగుతుంది అని నీవు వ్రాసినది సరైనదే.** ఈ పగ్గాల ఫలితం మన గురుమహరాజ్ యొక్క ఘనత మూలంగానే అన్న విషయాన్ని నీవు ఆలోచనలో పెట్టుకోలేదు. ఆ ఘనత ఎటువంటిదంటే, దాని వలన పురోగమిస్తున్న అభ్యాసీకి ఎంతో సాఫీగా అనుభూతి కలుగుతూ, అలసిపోకుండా, భయం కూడా లేకుండా ఉంటుంది. దైవం అనుగ్రహించిన స్థితులను అంటిపెట్టుకొని ఉన్న అభ్యాసులకు మాత్రమే ఇది అనుభూతికి వస్తుంది.

నీవు నీ ఉత్తరంలో నీకు స్పృహలేకపోవటం గురించి వ్రాశావు. నేను ఇంతకుపూర్వమే ఒక ఉత్తరంలో నీవు స్పృహలేనటువంటి స్థితిలో ఉన్నావు అని వ్రాశాను. అయితే అప్పుడు దానిని అనుభూతి చెందలేక పోయావు, కాని ఇప్పుడు దానిని అనుభూతి చెందుతున్నావు. ఇంతకీ స్పృహ లేకపోవటం అంటే ఏమిటి? ఇది ఆత్మ యొక్క ఒక స్థితి, ఇది మన దృష్టి నుంచి భౌతిక ప్రపంచం తొలగిపోయినపుడు అనుభవమవుతుంది. మనం ఈశ్వరునిలో స్వయంగా పూర్తిగా లయమైపోనంతవరకు ఈ స్థితి వృద్ధి చెందుతూనే ఉంటుంది. ఈ విధంగా జరిగిన తర్వాత, దేనిలోనైతే మనం ఇప్పుడు నిలిచి ఉన్నామో మళ్ళీ అదే పరిస్థితి కలుగుతుంది. అనగా స్పృహలేనితనం యొక్క స్పృహ కూడా కోల్పోవటం జరుగుతుంది. నేను ఇప్పుడు నా సంగతి తెలుపుతున్నాను. అది ఒక వింత గాథ. నా స్థితి పూర్తిగా స్పృహలేని స్థితిగానే ఉన్నదని చెప్పగలను. కాని అది నాకు ఎప్పుడు తెలిసిందంటే, ఎప్పుడైతే నేను ఎవ్వరితోనో మాట్లాడుతూ ఉన్నానో, అప్పుడు నేను ఎవ్వరితోనో ఏదో మాట్లాడుతున్నట్లుగా ఆలోచన కలిగింది. అటువంటి స్పృహలేని స్థితి కలిగి ఉన్నప్పుడు, నేను ఎవరికైనా ఏదైనా తెలియజెప్పవలసి వచ్చినా లేక ఎదుటివారి ప్రశ్నకు బదులు చెప్పాల్సి వచ్చినా నేను నా అధిచేతనా మనస్సును అదుపులో పెట్టుకోవాల్సిన అవసరం ఏర్పడింది. బిటియా! ఇంతకీ చెప్పాలంటే, మనకు స్పృహలేని స్థితిలో కూడా ఎంతోకొంత స్పృహ ఉంటుంది. ఈ నిజాన్ని జనం అర్థం చేసుకోలేకపోవచ్చు. ఎందుకంటే, వారు ఈ స్థితికి చేరి ఉండలేదు కనుక.

అభ్యాసీ తన స్థితిలో లీనమై ఉంటున్నప్పుడు, ప్రేమ మరియు ఆసక్తి పెరుగుతూ ఉంటాయి. అప్పుడు అతని స్థితి ప్రపంచంలో వ్యాప్తి అగునట్లుగా అనిపిస్తుంది. అతని ధోరణిలో మార్పు రావటమే దీనికి కారణంగా ఉంటుంది. నీ స్థితి కూడా ఇటువంటిదే. నీవు ఆ మృత్యువు అంతటా వ్యాపించి ఉన్నట్లుగా చూస్తున్నావు. చనిపోయినవానికి ప్రతిదీ చనిపోయినట్లు గానే ఉంటుంది. ఎందుకంటే, మరణం పొందినవాడు ఇంక దేనితోను అనుబంధం కలిగి ఉండడు. అందుచేత అన్ని అనుబంధాలు తెగిపోయిన తర్వాతనే ఈ స్థితి కలుగుతుంది.

ఇప్పుడు 09.01.1955వ తారీఖు ఉత్తరానికి జవాబు ఇస్తున్నాను. దీనికి జవాబు వ్రాయబోయేముందు నాకు 13.01.1955న వచ్చిన కల గురించి వ్రాస్తున్నాను. దానిలో, నీవు నీ సోదరీలు, మీ అమ్మగారితో కలసి మీ ఇంట్లో ఉండగా నేను నీకు '$A_1$' స్థానం మీద ప్రాణాహుతి ఇస్తూ ఉన్నాను. ఆ రోజున నేను ఈ స్థానం మీద చాలాసార్లు ప్రాణాహుతి ఇచ్చాను. ఇప్పుడు అసలు విషయానికి వస్తాను. నీవు ఉన్న స్థితిని గురించి వ్రాశావు. అది నాకు ఎంత ఆనందం కలిగించిందంటే, నేను స్వయంగా ఆ స్థితిలో ఉన్నప్పుడు కూడా నాకు ఇంత ఆనందం కలగలేదేమో. **మరణస్థితి యొక్క మరణం కూడా జరిగిపోయిన స్థితి అది. ఈ స్థితి గురించి నాకు ఒక అభ్యాసీ ద్వారా తెలిసింది. ఇది నా**

**అదృష్టం. ఈ స్థితి చాలా మంచి స్థితి. దీనినే లయ–అవస్థ యొక్క లయ అని అంటారు.** దీని తర్వాత స్థితి, బకా (పరిపక్వత) ప్రారంభమైంది. ఈ బకా స్థితినే 'లాలాజీ సాహెబ్' తురీయావస్థగా పిలిచారు. ఈ తురీయావస్థను జనం బాగా కోరుకుంటారు. ఈ తురీయావస్థలో చాలా రకాలు ఉన్నాయి. ఈ తురీయావస్థ నీలో ఇంతకుముందు నుంచే ఉంది. ఇప్పుడు కలుగనున్న తురీయ స్థితి, దీనికంటే స్వచ్ఛమైనదిగా ఉంటుంది. అభ్యాసీలో ఎప్పుడైతే లయ–అవస్థ బాగా వృద్ధి చెందుతుందో, అప్పుడు అతనికి దైవం యొక్క స్మరణ చేసినపుడు భయభ్రాంతి కలుగుతుంది. ఎందుకంటే, దైవ స్మరణ చేసినపుడు దైవం నుంచి వేరుగా ఉండటం జరుగుతుంది. అది అతని హృదయం తట్టుకోలేదు. ఈ కారణంగానే నేను నీకు ఇప్పుడు పూజ లేదా ధ్యానం చేయవల్సిన అవుసరం లేదని చెప్పాను. ఇది కూడా ఒక కారణం– ఉత్సవానికి (బసంతపంచమి) హాజరుకావాలను ఆలోచన కలిగినపుడు హృదయం కలత (భయం) చెందుతుంది. ఎందుకంటే, ఇటువంటి ఆలోచనతో ద్వైతం ఏర్పడుతుంది. మరి నీవేమో ఏకత్వంలో లీనమై ఉన్నావు. ఈ ఉత్తరంలో చాలా విషయాలకు జవాబు ఇవ్వవలసి ఉంది, కాని జవాబు ఇచ్చినంతవరకు సరిపోతుంది. నీవు "నాకు స్వయంగా నావల్లనే భయం కలుగుతోంది" అని కూడా వ్రాశావు. ఇది ఎంత మంచి స్థితి అంటే వివరించటానికి మాటలు దొరకవు. ఇది ఎటువంటి రహస్యం అంటే దీనిని విప్పిచెప్పటానికి మనస్సు అంగీకరించటం లేదు సరికదా, నిజానికి ఇది దైవరహస్యం. బసంత్ ఉత్సవానికి మీరందరూ షాజహాన్‌పూర్‌కు రాబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. కేసర్, విమల ఇంకా ఉమా ఉత్తరాలు వచ్చి రెండు రోజులు అయింది. అవకాశం ఉంటే, వారికి కూడా జవాబు వ్రాస్తాను. అమ్మ, చౌబేజిగార్లకు ప్రణామం. ఇప్పటికి చౌబేజీ చాలా మంచిగా తయారై ఉంటారు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 457

షాజహాన్‌పూర్,
05.02.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వచనాలు. మీరందరూ 2వ తారీఖున మీ ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. నాకు మధ్యాహ్నం 12 గం. 30 ని॥లకు హరి ద్వారా మీరందరూ బస్‌స్టేషన్‌కు చేరిపోయినట్లుగాను, 2 గం. 30 ని॥లకు బస్సులో వెళ్ళుతున్నట్లుగాను తెలిసింది. నేను మొదట బస్‌స్టేషన్‌కు రావాలనుకున్నాను. కాని ఒక గంట వేచి ఉండటానికి అనుమతి తీసుకోవలసి వస్తుంది. అంతేగాక నేను మిమ్మల్ని వదలి వస్తున్నప్పుడు మీకు వీడిపోవలసి వస్తుందన్న బాధ కలుగుతుందని ఒక ఆలోచన కలిగింది. వీటి అన్నింటిని దృష్టిలో పెట్టుకుని బస్‌స్టేషన్‌కు రాలేకపోయాను. అయినప్పటికి బస్‌స్టేషన్ న్యాయస్థానం దగ్గరలోనే ఉన్నందున తప్పనిసరిగా మీ అందరిని మీ ఇంటివరకు చేర్చి ఫిబ్రవరి 3వ తేదీన షుమారు మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి వచ్చాను. ప్రయాణంలో మీకు అంత కష్టమనిపించలేదని అనుకుంటాను. ఇలా ఎందుకంటే, రోగికి సహాయపడే సేవకుని అవుసరం ఉంటుంది. అదీగాక చౌబేజీ నీకు కడుపులో ఏదో వాపు ఉన్నట్లుగా చెప్పటం కూడా ఒక కారణం. మైనపు పట్టీ కట్టినట్లయితే, కొంత ఉపశమనం కలుగుతుంది. అది నాకు కూడా అనుభవమైంది. నీవు కూడా ఒకే రాత్రి దీనివలన ప్రయోజనం చేకూరినట్లు చెప్పావు. ఏదైనా గానీ నీవు బాగున్నావు. మళ్ళీ ఈ వాపు రాకుండా దైవం నిన్ను కాపాడుగాక! డాక్టర్ సూచించిన మందులు సేవిస్తూ, మళ్ళీ నేను ఆరోగ్యం గురించి చెప్పిన ధ్యానం చేస్తూనే ఉన్నావు కనుక నీకు లాభం ఉంటుంది.

దైవకృపతో నీవు '$B_1$' స్థానానికి చేరావు కాని అక్కడ కొంచెం తీవ్రత ఉన్నట్లు నాకు అనిపించింది. దానికి కారణం నేను నీకు చెబుతాను; ఎందుకంటే, నీవు ఇతరులకు కూడా నేర్పాలని. నీవు '$A_1$' స్థానాన్ని విడిచిపెట్టటానికి

ఇష్టపడనందున, నేను ఆ స్థానం మీద కంపనం (Vibration) సృష్టించాను. ఈ కంపనం ప్రయోజనం కలిగించునట్లుగా నాకు అనుభవమైతే దానిని '$B_1$' స్థానంలో (Absorb) జీర్ణించుకునేలా చేస్తాను. ఆ తర్వాత మళ్ళీ యాత్ర ప్రారంభింపజేస్తాను. నేను ఇప్పుడు ఆ కంపనం (Vibration) జీర్ణింపజేసి, యాత్రను ప్రారంభించే స్థితికి తీసుకురావాలని నిర్ణయించాను. అది తొలగిపోయేవరకు నిన్ను '$B_1$' స్థానం మీదనే నిలపాలనుకుంటున్నాను. ఈ విధంగా చేయటంవలన, నీవు ఒక స్థానం నుంచి మరొక స్థానానికి తరలివెళ్ళిపోవటానికి ఇష్టపడని స్థితి ఇంక రాదు. స్థానం మార్పిడి గురించిన అయిష్టత తొలగిపోయిన తర్వాత ఒకే స్థానంలో స్థిరంగా ఉండాలను భావం రాదు. ఎందుకంటే, చలనం, అచలనం (స్థిరం) రెండూ పరస్పర విరుద్ధమైనవి. చలనం ఉన్నచోట స్థిరత్వం ఉండదు. ఆ చలనం కూడా అతిసూక్ష్మంగా ఉండి కేవలం దాని ప్రభావం మాత్రమే ఉండేటట్లు చేస్తాను. తర్వాత నాకు ఏది అవసరం అనిపిస్తే దానినే చేస్తాను. ఇది ఏదైనా స్థానంలో అవసరపడినప్పటి సంగతి. నీ ఉదరంలో పరిస్థితి బాగుపడునంతవరకు కొంత వేచి ఉంటాను. అది త్వరలోనే బాగుపడుతుంది. ఒక్క వారంలోనే అది జరిగితీరాలి.

నేను లఖనౌర్‌కు సంబంధించి నీతోను, మాస్టర్ సాహెబ్ మరియు చౌబేజీతోను చాలా విషయాలు చర్చించాను. అందులో ఒక విషయం చాలా ఉన్నతమైనది. దాని గురించి నాకు నిన్న ఆలోచన వచ్చింది. అది ఏమిటంటే, ఎవరికో నాకు బాగా జ్ఞాపకం లేదుగాని, అతడు పండిత్ హరిసరన్‌కు సత్సంగ్‌లో సహచరుడు అయి ఉండవచ్చు. అతనికి ఈ జన్మలోనే మోక్షప్రాప్తి కలుగుతుందని చెప్పటం జరిగిందంట. ఈ విధంగా ఎవరికైతే మోక్షప్రాప్తి కలుగుతుందని చెప్పబడిందో, సదరు వ్యక్తి ప్రవర్తన గురించి హీనంగా చెప్పబడింది. అమ్మ, చౌబేజిగార్లకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 458

లఖీంపుర్,
4.02.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. విషయం తెలుసుకొని సంతోషించాను. అదేమిటో తెలియదు కాని, షాజహాన్‌పూర్ నుంచి బయలుదేరినప్పటి నుండి, విరహాగ్నికి తావులేకుండా పోయింది. ఇక్కడకు చేరుతూ ఉండగానే అదంతా ఒక మసకబారిన చిత్రం యొక్క ఛాయలాగా నిలిచిపోయింది. ఎలా అంటే, షాజహాన్‌పూర్‌కు వెళ్ళాను, ఉత్సవంలో పాల్గొన్నాను, తర్వాత ఇక్కడకు వచ్చేశాను– ఇదంతా ఒక భ్రమలాగా అయిపోయింది. మొన్న షాజహాన్‌పూర్ నుండి వచ్చాక, ఎటువంటి స్థితి కలిగిందంటే, ఇతరులు ఎవ్వరైనా అయితే ఆత్మహత్యకు పాల్పడేవారు అన్నట్లు ఉంది. ఎందుకంటే, ఈ స్థితిలో అసలు నేను ఎక్కడకు వెళ్ళానో కూడా జ్ఞాపకం లేకపోయింది. నేను ఎక్కడికీ వెళ్ళలేదని, తిరిగి రాలేదని, ఎక్కడ ఉన్నానో అక్కడే ఉన్నానని, ఎలా ఉన్నానో అలాగే ఉన్నాను అను భావన కలిగింది. ఉత్సవం అయిపోయింది కాని అది కూడా తెలియలేదు. ఉన్న భేదం ఏమిటంటే, ఉత్సవానికి ముందైతే వెళ్ళటానికి సిద్ధమవుతూ ఉండే దానను. ఇప్పుడు ఆ గొడవలేదు. కేవలం ఉత్సవంలో పాల్గొన్న ఊహామాత్రమే ఉంది. అక్కడ ఎవరిని చూశాను, ఏమిటి అనేది స్వప్న సదృశంగానే ఉండిపోయింది. ఇప్పుడు ప్రస్తుతం ఉన్న ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు శిరస్సు అంతటాను, శిరస్సు మొదలుకొని వీపులో వెన్నెముక క్రింది ఎముక వరకు ఒక్కసారిగా పొగలాంటిది వ్యాపించినట్లు అయ్యింది. దీనిని పొగ అని ఎందుకు అంటున్నాను అంటే ఆ స్థితి అంత తేలికగా ఉంది కనుక, తేటతెల్లమయ్యేందుకు అలా చెప్పాను. శిరస్సులో ఒక ప్రశాంతమైనటువంటి తుషారం పడుతున్నట్లు

అనుభవమవుతోంది. నా స్వరూపం ఒక ప్రశాంత సాగరమైపోయినట్లుగాను, దానిలో బుడగలు కూడా ఉత్పన్నం కానట్లుగాను నేను చూస్తున్నాను (అనగా బుడగలు ఉత్పన్నం కానంత ప్రశాంతంగా ఆ సాగరం ఉందని అర్థం). ఇంకా ఏమనిపిస్తోంది అంటే, 'మాలిక్' యొక్క దయకు చెందిన పగ్గాలు నాకు సహజ చైతన్యం కల్పిస్తున్నట్లుగాను, ఈ సహజ చైతన్యమే హృదయానికి బాధ వంటిది కల్పించకపోతే నేను ఎక్కడో చలనరహితంగా, స్థిరంగా ఉండిపోయే దానను అని. అదే నాకు స్మృహను కల్పించి దశ యొక్క జ్ఞానం (స్మృహ) కలగజేస్తోంది. అదే (జ్ఞానం) దానిలో (అనగా దశలో) లయం చేస్తోంది, నింపుతోంది మరియు జీర్ణింపజేస్తోంది. అలా జరగకపోతే నా అణువణువూ గమనం లేనివిగా అయిపోయేవి. ఇలా నావరకే కాదు, సమస్త జగత్తు కూడా, గమనం లేకుండా, స్థిరంగా నా దశలోనే కలిపి ఉంచేది. మనస్సు ఎందుకోగాని ఆలోచనా రహితంగా ఉంటోంది.

శ్రీ బాబూజీ! తమరు నన్ను '$B_1$' పాయింట్‌కు చేర్చారు, అందుకు అనేక ధన్యవాదాలు. ఈ దశలో, స్మృహ (జ్ఞానం) అనేవి కేవలం ఒక ఊహలాగా ఉంటున్నది కాని స్మృహ లేకపోవటమనేది లేదు. ప్రస్తుత దశయే నా రూపంగా కనిపిస్తోంది. వర్తమాన దశయే స్వయంగా నా రూపమని అనుభవానికి వస్తోంది. అలా కాకుండా మరేదీ లేదు. ఇంకొక స్థితిలో సమస్త బ్రహ్మాండంలోను నా హృదయమే వ్యాపించి ఉండగా నేను ధ్యానం ఎక్కడ నిలపాలని అనిపిస్తోంది. ఇదే నా సహజస్థితిగా అయిపోయింది. ఏమని వ్రాయను బాబూజీ! ఇదొక ఆశ్చర్యకరమైన సహజ దశ. అది ఏమిటంటే, 'మాలిక్' ఎదుట ఉండి ఉన్నా కూడా నేను గుర్తించలేకపోయాను. ఇప్పుడు సాహసం పెరిగినట్లుగాను, దశ అద్దంలాగా ఉన్నట్లుగాను అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడు విస్మృతియే నా రూపంగాను, వర్తమాన దశ యొక్క అనుభూతియే నా స్మృతిగాను ఉన్నాయి. ఇంతేకాదు, బయట లోపల ఒక విధమైన విస్మృత స్థితి వ్యాపించి ఉన్నది. కాని ఏ పాయింట్ మీద చైతన్యం ఉంటుందో నాకు తెలియదు. ఆ చైతన్యమే నన్ను ముందు మార్గంలో మార్గదర్శకంగా నడిపిస్తుంది. అలా సర్వత్ర విస్మృతి అనేది రాజ్యమేలుతున్నా కూడా ఎంతో కొంత స్మృహ తప్పక ఉంటోంది.

అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 459

లఖీంపూర్,
8.02.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. బాబూజీ! ఇప్పుడు సాహసంతోపాటు, లోలోపలనే ఏదో జీర్ణమైపోతున్నట్లు నేను ఉన్న స్థితి ఏర్పడినట్లుగా చూస్తున్నాను. అది ఏ స్థాయికి చెందినదిగా ఉందంటే, ఒకవేళ అది ఎంతమాత్రం పైకివచ్చినా నేను ఆత్మహత్యకు పాల్పడవచ్చు అన్నట్లు ఉంది. బాబూజీ, దానిని తపన అనిగాని, బాధ అనిగాని చెప్పటానికి వీలులేదు. ఇది నా హృదయమే ఏదో దశగా తయారైనట్లు ఉంది. కనుక ఈ దశలోనే నేను ముందుకు సాగుతున్నట్లు ఉంది. బాబూజీ, శిరస్సు నుంచి పాదాలవరకు సమస్త జగత్తు కేవలం ఒక్క నేత్రంగా అయిపోయినట్లు అనుభూతి చెందుతున్నాను. అలా కాదు, కాంతియే ప్రజ్వరిల్లుతున్నట్లు ఉంది కనుక నేత్రం యొక్క అవసరమే లేకుండా పోయింది. ఇప్పుడు ఇంకొక దశలో కళ్ళు మూసుకుని ఉన్నా, నిద్రలోను, మేల్కొని ఉన్నప్పుడు కళ్ళు మూసుకొని ఉన్నట్లు అనుభవం కావటం లేదు. నా రూపం ఎందుకని ఒక అద్దంలాగా అయిపోయింది, ఆ అద్దం ఎటువంటిదో నాకు తెలియకుండా ఉంది. దయచేసి ఇదేమిటో తమరే చెప్పాలి. దశ చెప్పనలవిగానిదంతా సున్నితంగా ఉంది.

ఇప్పుడు ఒక రహస్యం వెల్లడైంది. దాని ప్రకారం ప్రతి వస్తువు ఒక కాంతిమయంగా అయిపోయింది. దానిలో ప్రకాశానికి తావులేదు కాని ప్రకాశమైతే వెలువడుతూనే ఉంది. స్వయంగా నా రూపం కూడా ఇలాగే కాంతిమయంగా అయిపోయి అన్నింటిలోను ఏకమైపోయింది. ఇంకా ఎటువంటి స్థితి అంటే, చీకటిలో కూడా చీకటి యొక్క అనుభూతి కలగటం లేదు, అలాగే ప్రకాశం కూడా తెలియ రావటంలేదు. ఇది 'కొంచెం' దీనమైన లేదా సున్నితమైన దశ. 'మాలిక్' చరణాలకు చెందిన ఒక అల్పమైన భిక్షకురాలిలాగా ఉన్నప్పుడు, 'కొంచెం' అను శబ్దం దశలో కళంకం వంటిది కల్పించినట్లవుతుంది. 'లేదు' అని చెప్పినా కూడా కొంచెం అసభ్యతగానే ఉంటుంది. బాబూజీ, వీటన్నింటినీ ఒక ప్రక్కనపెడితే స్థితి ఎలా ఉంటుందో, అలా ఉంది అనుకుంటే బాగుంటుంది. అదే విధంగా ప్రకాశం దాని నుంచి వెలువడుతూనే ఉంది. ఈ కాంతి ఎంత వినయపూర్వకమైన విస్మృతిగా ఉన్నది అంటే, దానిలో విస్మృతి యొక్క స్పృహ కూడా లేదు. ఇప్పుడింక నా లోపల, బయట అంతటా కూడా ఇదే దశ వ్యాపించి ఉంది. అదే నా రూపంగాను ఉంది. అల్పహృదయంలో దశ మొత్తం ఇమిడిపోతున్నట్లు చూస్తున్నాను. బిందువులో సింధువు ఇమిడిపోతున్నట్లు అనిపిస్తోంది. అయినా కూడా బిందువు బిందువుగానే ఉంటోంది. దానికి (దశకు) స్పృహ లేదు. అది ఒక వినయపూర్వకమైన విస్మృతస్థితిలో లయమై ఉంది. అది ఒక దీనాతిదీనమైన ఆధ్యాత్మిక భిక్షకురాలి వంటి స్థితిమయంగా అయిపోయింది.

చిన్నవారైన సోదర సోదరీ లందరుకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 460

షాజహాన్‌పూర్,

13.02.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ రెండు ఉత్తరాలు 4.2.1955 మరియు 8.2.1955 తేదీలవి చేరాయి. అవి జవాబు ఇవ్వడానికి కష్టతరమైనటువంటి సూక్ష్మస్థితులు. అయినప్పటికీ ఎంతోకొంత వ్రాస్తున్నాను. వాస్తవమైన నీ స్థితిని ఎవ్వరైనా స్పష్టంగా వివరించాలంటే అందుకు తగిన పదాలు దొరకవు. అసలు (రియాలిటీ) స్థితి మూలంగా కలిగే స్థితి మార్పును నీవు బాగా వివరిస్తున్నావు. నిజం చెప్పాలంటే, నిద్రకు, మెలుకువకు మధ్యన ఉన్న స్థితిగా ఉంది. పాయింట్ '$B_1$'లో చాలా (Force) ఒత్తిడి ఉన్నట్లు నాకు ఈ సమయంలో అనిపిస్తోంది. దానికి కారణం నేను '$A_1$'లో కొంత కంపనం (Vibration) కలిగించి '$B_1$'లోకి చేర్చినందువల్లనే. ఈ విధంగా ఎందుకు చేశానో గతఉత్తరంలోనే నేను వ్రాశాను. ఈ ఒత్తిడిని (Force) బాగా ఆలోచించి తగిన జాగ్రత్తతో కల్పించాను. నీవు 4.2.1955వ తేదీ ఉత్తరంలో సరళం మరియు సహజమైన చైతన్యం వంటిది నీలో ఉంటున్నది అని వ్రాశావు. మన విధానంలో రెండు స్థితులు సమాంతరంగా కొనసాగుతూ ఉంటాయి. ఇందులో ఒకటి (రియాలిటీ) వాస్తవికతకు చెందినదైతే రెండవది దాని వలన కలిగినది. ఆంతరిక స్థితి యొక్క మార్పును ఈ వాస్తవిక స్థితి తెలియజేస్తుంది. అంటే హృదయం, దాని మూలంగా ఉన్నతి చెందుతూ ఉంటుంది. **ఉన్నతి అంటే క్రింది స్థితుల నుంచి పై స్థితులకు వెళ్ళటం. హృదయం ఎప్పుడైతే ఉన్నతి చెందుతూ తన (రియాలిటి) అసలులో లయమైపోతుందో అప్పుడు "మార్పులేని స్థితి" ఏర్పడుతుంది. ఇటువంటి అదృష్టం భగవంతునికి కూడా ఉండదు. ఈ హక్కు భూమాకు చెందినది మాత్రమే.** ఇది వాస్తవం. ఇప్పుడు నీ విషయం విను. సహజచైతన్యం, నీ స్థితిని అనుభూతికి తెస్తున్నది అని వ్రాశావు. ఇది ఒక మానసిక స్థితి. ఇది మానవుడు జీవించి ఉన్నంతవరకు, ఎంత ఉన్నతిని ఆధ్యాత్మికంగా సాధించినప్పటికీ, సహజచైతన్యం ఏదో ఒక రూపంలో ఉంటుంది. వాస్తవం ఏమంటే, మనస్సు వాస్తవికత యొక్క స్థితిలో మమేకమైపోయి తన అసలు స్థితినే

తెలియనట్టిదిగా అయిపోతుంది. "నాకు ఎక్కడికి వెళ్ళింది జ్ఞాపకం లేదు. అక్కడ ఎవ్వరిని చూశానో తెలియదు. అదంతా ఒక స్వప్నంలాగా ఉంది" అని నీవు వ్రాశావు. దీనికి అర్థం, మనస్సు సత్యత్వానికి హత్తుకుపోయి ఉండటమే. ఈ మనస్సే ఎంతెంతగా సత్యత్వంతో మమేకమైపోతూ ఉంటుందో అంతగా ఏకత్వం యొక్క భావన పెరుగుతూ ఉంటుంది. **మరణానంతరం మరుజన్మ ప్రారంభమవుతుందన్న విషయం విదితమే. మరణించినవాడు పుట్టక తప్పదు. ఈ విధంగా ఎప్పుడైతే అభ్యాసీ జీవించి ఉంటూ మరణిస్తాడో (అహం మరణించటం, Death of Ego), అప్పుడు అదే రకమైన ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమవుతుంది. ఈ రకమైన జీవితం ఆరంభమయ్యాక మళ్ళీ అదేరకంగా మరణం కలిగిన కారణంగా, మనం ఇంక పునర్జన్మ చెందవలసిన అవుసరం ఉండదు. ఇలా ఎందుకంటే, జీవించి ఉంటూనే మరణించటం మూలంగా కలిగిన జీవితానికి కూడా మరణం ఉంటుంది. దాని విధానం మరొక విధంగా ఉంటుంది. చివరకు దేనినైతే శాశ్వత జీవితం అంటామో అటువంటి జీవితం కలుగుతుంది కనుక దానిలో ఉదయాస్తమానాలు అంటూ ఉండవు.**

ఫిబ్రవరి 8వ తేదీ ఉత్తరంలో, "ఎక్కడ చూసినా ప్రకాశమే కనిపిస్తోంది" అని వ్రాశావు. అది తీక్షణంగా ఉంటే, (బహుశా ఉండకపోవచ్చు), '$B_1$' స్థానం యొక్క స్థితి దాని అసలైన స్థితి రాలేదన్న మాట. స్థితి మూలంగా మెదడుపైన ఏదైనా ఒత్తిడి, ప్రకంపన కలుగుతున్నదేమో నీవు తెలియజేయి.

ఈ రాత్రికి నీ స్థితిని గమనించి సరైన స్థితికి తీసుకువస్తాను. ఏదైతే కాంతి విశ్వమంతా నిండిపోతుందని నీవు అనుభూతి చెందుతున్నావో అది కాంతి కాదు. అది '$B_1$' మీద కలుగునటువంటి ఒత్తిడి మరియు ప్రకంపనల వ్యాప్తి. వాస్తవికత (రియాలిటీ) ఉన్నచోట ప్రకాశంగాని, అంధకారంగాని ఉండవు. ఇది ఒక అద్భుతమైన విషయం. చౌబేజీ డైరీ నాకు చేరింది. వారి స్థితి కొంచెం స్పష్టంగా, బాగానే ఉంది. కాని ఛాతీ కుడివైపున ఏదో నలుపుగా ఉన్నట్లు అనిపిస్తోంది. వారి ఆత్మ బంధనాలను కొంతవరకు నిర్మలీకరించాను. కాని ఇంకా కొంత శుభ్రపరచవలసి ఉంది. ఇప్పుడు వారు ధ్యానం మీద దృష్టి నిలుపుతున్నారు. నీవు కూడా పరిశీలించి నీకు ఏమని అనిపిస్తుందో దానిని వ్రాయి.

మాస్టర్ సాహెబ్‌కు కోపం తొలగించుకోవలసిందిగా నేను వ్రాశాను. దానికి వారు ప్రయత్నిస్తున్నారు. దీనిని ప్రతి మానవుడు అదుపులో ఉంచుకోవాలి. నా విషయానికొస్తే నేను అడుగడుగునా 'లాలాజీ సాహెబ్'కు భయపడుతూ ఉంటాను. నా కోపం మూలంగా నాకు ఉన్న భయం ఏమిటంటే వారికి (లాలాజీ సాహెబ్‌కి) కూడా కోపం రావచ్చు అని. నేను ప్రార్థన ద్వారా నా కోపాన్ని తొలగించుకుంటాను. నీవు కూడా ఆశీర్వదించు. మాస్టర్ సాహెబ్‌కు సత్సంగంలో ఈ మచ్చను తొలగించు. దీని వలన ఫలితం బాగుంటుంది. ఈ విషయంలో చిన్న, పెద్ద తేడాలేదు. ప్రతి ఒక్కరు ఇతరులకు సహాయం చేయాలి.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 461

లఖీంపూర్,
11.02.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం అందింది, చదివి సంతోషించాను. నా ఉత్తరం కూడా తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఈ దశలో ప్రపంచంలోని ప్రతిదీ ఒక చైతన్యంలేని రంగులోనే ముంచి ఉంచబడినట్లు అనిపిస్తోంది. కొన్ని నెలల తరబడి నా నాభిలో చాలా తేలికపాటి బాధ ఉంటోంది. ఆ బాధ ఇంకా పెరిగినపుడు కంపనం లేక అదురుడు కూడా ఎక్కువగా ఉంటోంది. శిరస్సుకు వెనుక, మెడలో గుంటలాగా ఉన్నచోట, దానికి తిన్నగా నిలువుగా ఈ ఎక్కువ అదురుడు ఉంటోంది. ఈ రోజు తావూజీకి భోజనం వడ్డించే సమయంలో ముందుకు ఒక్క కుదుపు వంటిది కలిగి కళ్ళెదుట చాలా స్వల్ప పసుపు రంగువంటి ప్రకాశం కలిగింది. అదే విధంగా మరొకసారి కూడా కనిపించింది. ఒక కుదుపు వంటిది కలిగి కళ్ళు తెరచినట్లుగాను లేదా నిద్ర నుంచి ఉలిక్కిపడి లేచినట్లుగాను అనిపించింది. నాకైతే అదేమిటో తెలియలేదు, తమకే తెలియాలి. తమ ప్రయోగానికి తెలియాలి.

బాబూజీ, ఇప్పుడు సూక్ష్మరూపం యొక్క అనుభవం కూడా కలగటం లేదు. ఏమిటా అని దీర్ఘంగా ఆలోచిస్తే, 'మాలిక్' యొక్క రూపమే ఎదుట నిలుస్తోంది. 'అతడే' స్వయంగా నాలో కలిసిపోయాడు లేదా నేనే 'అతని'లో కలిసిపోయినప్పుడు 'అతడ్ని' ఎంత వెదికినా ఎక్కడ కనపడతాడు! 'అతడు' బంధనాల నుంచి విముక్తుడై స్వతంత్రుడైపోయినట్లు అనిపిస్తోంది. ఎందుకో తెలియదు కాని, ఈ స్థితిలో, తమ గురించి ఎక్కువగా మాట్లాడినట్లయితే దశలో అసహనం కలుగుతోంది. **ఈశ్వరుణ్ణి ఇప్పుడు నాలాగానే భావిస్తూ ఉంటే లేదా నా కంటే ఉన్నతుడుగా భావిస్తున్నట్లయితే అది భరింపశక్యం కాకుండా ఉంటోంది.** నేను ఏమిటి, నా రూపం ఏమిటి, ఒక అల్పమైన సాదాస్థితిగా ఉంది. ఈ స్థితియే లయ–అవస్థకు చెంది పోయిందా లేక స్వయంగా నేను లయ–అవస్థగా అయిపోయానా అన్నట్లు ఉంది. ఇప్పుడు నాకు లయ–అవస్థ అనేది ఎక్కడా కనిపించటం లేదు. కనుక నేను ఎలా లయం కావాలి? ఇటువంటి ఈ దశను సమత్వస్థితి (Balanced State) అందాము అంటే, అది నాకు అర్థహీనంగానే అనిపిస్తోంది. ఇప్పుడు ఆ దశను గురించి చెప్పాలంటే, ఎవరో నన్ను ఉన్నపళంగా నిలబెట్టినట్లుగాను, దానిలో విచారానికి అవకాశం లేనట్లుగాను ఉంది. చెప్పాలనుకుంటే, దానిని పరిశుభ్రమైన సమతలంగా చెప్పవచ్చు. దీనికిమించి ఇంకేమి వ్రాయాలి!

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 462

లఖీంపుర్,
21.02.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. చదివి చాలా సంతోషించాను. 'మాలిక్' కృపతో ఏర్పడిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నేను ఇప్పుడు ప్రేమ వలయం నుంచి కనుమరుగై పోయినట్లు అనిపిస్తోంది. నాకు నిరంతరం శూన్యం మరియు ఖాళీ వంటి దశగా ఉంటోంది. నాకయితే లోతు, లోతులేని అను రెండు శబ్దాలు వ్యర్థంగానే అనిపిస్తున్నాయి. ఎందుకంటే, అవి రెండూ కూడా నా స్థితికి పనికిమాలినవి. స్వర్గ నరకాలు రెండూ నాకు అర్థంలేనివిగానే ఉన్నాయి. ముక్తి యొక్క జ్ఞానం కూడా నాకు లేదనిగాని, అటువంటి శబ్దాలు నాకు నిరుపయోగం అనికాని చెప్పవచ్చు. ఇది ఎటువంటి ఉదాసీన స్థితి అంటే 'ఉంది' అని చెప్పినా లేదా 'లేదు' అని చెప్పినా కూడా ఏమీ భేదం ఉండటం లేదు. నాకు అవి రెండూ సమానంగానే అనిపిస్తున్నాయి. ఇప్పుడు స్థితిలో ఏదైనా మార్పు కలగకపోయినప్పటికి, ఉన్నదేదో ఉంటుందిలే అని సరిపెట్టుకుంటున్నట్లు ఉంది. ఇప్పుడు సింధువు, బిందువు అని ఏమీ చెప్పను. ఎందుకంటే, అవి ఏమీ చెప్పకుండా ఉంటేనే సంతోషంగా ఉంటోంది. అలా కాకుంటే, ద్వైతం ఏర్పడుతుంది. నేను చెప్పగలిగింది

ఏమిటంటే, స్థితి అనేది ఏకత్వం నుంచి వేరుపడిపోయింది. ఎందుకంటే, దానిలో 'ద్వంద్వం' అను అతుకులు ఇప్పుడు అంటడం లేదు. అందుకని ఏకత్వం అని చెప్పటానికి వీల్లేదు, ఎందుకంటే అది కూడా లోపల ఉన్న ఆ సహజదశతో అంటిపెట్టుకొని ఉంది.

బాబూజీ, ఇంతకుపూర్వం నేను తరచుగా, ఏ వస్తువునైనా పొందటానికి నా హృదయమో లేక నేనో పాత్రులుగా ఉన్నాము అని వ్రాసేదానను, కాని ఇప్పుడు ఆ పాత్రతగాని, వస్తువుగాని అనుభవానికి రానిస్థితిగా ఈ స్థితి ఉంది. ఇప్పుడు పరిశుభ్రమైన సమతలమే నాదిగా ఉంది. బయట కూడా ఆ మైదానానికి చెందినవి ఏమీ నాకు కనిపించటం లేదు. అంతటా ఖాళీగానే ఉంది. నా స్వరూపం కూడా ఖాళీగానే ఉంది లేదా ఖాళీ రూపమే నేను అన్నట్లు ఉంది. బయట, లోపల కూడా ఖాళీ దశయే వ్యాపించి ఉన్నది. అయినా కూడా ఆ ఖాళీతనం అనుభవానికి రావటంలేదు. ఎందుకంటే, అది కూడా స్వయంగా ఖాళీ రూపంగా అయిపోయింది. ఇప్పుడు విశ్రాంతి వంటి దశ నా రూపంగా అయిపోయి వ్యాపించిపోయింది. ఒక వింతైన విశ్రాంతి దశ అన్ని దిక్కులా ఉండి, అది నాలో వ్యాపించింది. దానిని నేను చెప్పాలని ప్రయత్నించినా కూడా చెప్పలేకపోతున్నాను. దీనికి ఉదాహరణగా ఇలా చెప్పవచ్చు: కష్టాల అనంతరంగాని, రోగ విముక్తి తర్వాతగాని శరీరంలో చాలా విశ్రాంతి అనుభవానికి వచ్చినటువంటిదిగా చెప్పవచ్చు. ఇది సంపూర్ణ విశ్రాంతి దశ. బయట, లోపల, కణకణం విశ్రాంతిమయంగా అయిపోయాయి. బాబూజీ, ఇప్పుడు లయ, ప్రళయం రెండూ కూడా ప్రళయమైపోయాయి. అవి నాకు నిస్సారంగానే అయిపోయాయి. ఇంకొక రకంగా చెప్పాలంటే, నేను ఒక (Odd number) అసాధారణ సంఖ్యగా అయిపోతున్నాను. ఎందుకంటే, దశలో ఏదీ కలపటానికి వీలులేదు అన్నట్లు చూస్తున్నాను. ఈ విధంగా ఉంటున్నప్పటికీ, ఎంతోకొంత చెప్పబడుతూనే ఉంది, చెబుతున్నాను కూడా. ఇలా ఎందుకంటే, విశ్రాంతిమయం అయిపోయినప్పటికి కూడా, ఆంతరికంగా ఏదో మూలన విరామం లేనిదశ మిగిలి ఉన్నట్లుగా నేను గ్రహిస్తున్నాను. ఇప్పుడు ఈ దశ ఎటువంటిదంటే, ఎదుట సముద్రం, దానిలో అపరిమిత విశ్రాంతి వ్యాపించి ఉండటం. అయినాగాని దానిలో ఇది ఉంది, అదిలేదు అని చెప్పటానికి వీలులేనట్లుగా ఉంది. ఇంకా ఇలా చెప్పవచ్చు. ఒక మృతుడు, మరణత్వాన్ని పరిశీలించటానికి ప్రయత్నిస్తున్నట్లు ఉంది, అని. దీనిని పూర్తిగా శాంతిమయ వాతావరణంగా చెప్పవచ్చు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 463

లఖీంపుర్,
1.03.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందిందని భావిస్తున్నాను. నా ఆరోగ్యం ఇప్పుడిప్పుడే మెరుగుపడుతోంది. కనుక ఆలోచించాల్సిన అవసరం లేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను, నాకు అర్థమైనంతలో వ్రాస్తున్నాను.

వాస్తవిక శిథిలత్వం (Real destruction) నా ఎదుటకు సూటిగా శీఘ్రంగా వస్తున్నట్లు నా అనుభవానికి వస్తోంది. ఎండిపోయిన భూమి మీద సముద్రం, సముద్ర స్థానంలో పర్వతాలు, అగ్నిపర్వతాలు మరియు భూకంపాల గర్జనతో భూమి దద్దరిల్లుతున్నట్లు అనిపిస్తోంది. అన్నీ తల్లక్రిందులవుతున్న స్థితిగా అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, మాడు నుంచి మొదలుకొని శిరస్సు వెనుక వరకు అనగా పాపిడి చివరన, దానికి సూటిగా నాలుగు అంగుళాల

దిగువ వరకు అనేక రంధ్రాలు పడినట్లుగాను, అవి ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉన్నట్లుగాను అనిపిస్తోంది.

బాబూజీ, నాకు అర్థంకాని విషయం ఏమిటంటే, తరచుగా నేను కూర్చుని ఉండీ ఉండగానే ఏ స్థితితో అంటిపెట్టుకుని అచేతనమైపోతున్నానో తెలియటం లేదు. ఆ సమయంలో ఎవ్వరైనా చేయిపట్టుకుని లేపినా కూడా ఏమాత్రం శక్తి లేనట్లుగా అనిపిస్తూనే, మళ్ళీ కొంతసేపటికే సూటిగా నా దశలోకే వస్తున్నాను. దీనిని ఎవ్వరైనా మరపుస్థితి అనిగాని, ఇంకా ఏదైనా అనిగాని చెప్పవచ్చు. ఎందుకంటే, ఒక్కపెట్టున ఇలా జరుగుతోంది. ఈ రోజు రాత్రి తమరు సిట్టింగ్ ఇచ్చినప్పటి నుండి, దశలో శక్తి అంతా జీర్ణించుకొనిపోయి దాని (స్థితి) వ్యక్తిత్వం కోల్పోయినట్లు అనిపించింది. ఇప్పుడింక శరీరంలో రెండే దృశ్యాలు ఉంటున్నాయి. అందులో ఒకటి చైతన్యంలేమితో సంబంధించి ఉండగా రెండవది నా దశలో లయమై ఉన్నట్లు ఉంటూ ముందుకుపోవటం. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, ప్రపంచం తారుమారైనా గాని ఒకసారి ఏర్పడిన దశ మార్పులేకుండా ఉండిపోయింది. నేను ఏమి మాట్లాడినా, ఏమి చేసినా కూడా ఏమీ తేడా ఉండకపోగా, నేనే తరచుగా అచేతనంగా అయిపోయి మరపుస్థితి కలిగిన దానిలాగా ఉంటున్నాను. అప్పుడప్పుడు స్థితి లోలోపలనే (Shivering) వణుకుతూ ఉన్నట్లుగాను, ఆ (Thrilling) కంపనం లేదా వణకు (Shivering), ఎడమవైపున గుండ్రంగా తిరుగుతున్నట్లుగాను ఉంటోంది. అయితే నా స్థిరమైన దశపైన దీని ప్రభావం ఏమీ ఉండటం లేదు. అది యథాతథంగానే సమానంగా ఉంటున్నది. ఇది ఒక దశగాకుండా, నా స్వంత శరీర నిర్మాణంలాగానే అయిపోయింది. 'మాలిక్'ను పొందటం కోసమే ఈ శరీరం రూపు దాల్చిందా అన్నట్లుగాను, దీనిని స్పర్శిస్తూ ఉన్నటువంటి అచేతనం, ప్రాణం అన్నట్లు ఉంది. నేను ఇదివరకు స్పృహ లేనితనం వంటి స్థితి లోపల, బయట వ్యాపించి ఉంటోంది అని వ్రాసి ఉండగా ఇప్పుడు స్పృహ కలిగిన స్థితియే వ్యాపించి ఉందని వ్రాస్తున్నాను. ఎందుకు అంటే, స్పృహ లేకపోయినటువంటి స్థితిలో ఇప్పుడు స్పృహ యొక్క రంగు (ఉనికి) చోటుచేసుకుంది. అచేతనావస్థలో చైతన్యం రూపుదాల్చి వస్తోంది. దీనినే ఈ దశను చేతనా అచేతనాల సమ్మిశ్రమంగా చెప్పవచ్చు. నేను ఇప్పుడు ఈ అనుభూతిలో కూడా మరపు దాల్చి ఉంటున్నాను. ఇప్పుడు (Blank condition) ఖాళీదశ కూడా దశ ఖాళీ అవుతున్నట్లు అనుభూతి చెందుతూ ఉన్నాను. ఇప్పుడు పృథ్వి యొక్క కణకణంలోను (Construction) నిర్మాణత వ్యాపించి ఉంది. దాని ఫలితంగా (Distruction) శిథిలత్వం తలపిస్తోంది.

చిన్నవారైన సోదర సోదరీ లందరుకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 464

షాజహాన్‌పూర్,
22.02.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలు చాలా వచ్చాయి. నేను అక్కడకు రావటం, రాకపోవటం రెండూ ఒకటిగానే అనిపించటమనే దానినిబట్టి, నీ ఆలోచన నుంచి అహం యొక్క భారం చాలా తొలగిపోయినట్లుగా నిరూపిత మవుతుంది. అహం అనగా 'నేను ఉన్నాను' అను దానికి కట్టుబడిపోతాం. అది అహంకారం యొక్క ఏలుబడిలోకి వస్తుంది. ఇది దీని చీకటివైపు, అయితే దీని వెలుగువైపు ఇంకొకరు రావచ్చని అనుకోవటం వలన కలిగే భారం మన హృదయం మీద పడుతుంది. వాస్తవానికి ఇది అహం యొక్క సూక్ష్మదశ. ఈ రెండూ హానికరమే. నా మాస్టర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఎందుకంటే, మొదటి దాని భారం లేదు, రెండవ దాని భారం చాలా తక్కువ, అయితే ఇంకా ఉంది. నీకు (Inactivity) అచేతనంతో అంటిపెట్టుకుని ఉన్నట్లు కలుగుతున్న అనుభూతి వాస్తవానికి అది

అంటిపెట్టుకుని ఉండటం కాదు. కాని దానికి బదులు, ముందు రానున్న స్థితి యొక్క పొగలో చిక్కుకుపోవాలి. ఇంకొక విధంగా చెప్పాలంటే, వేడి నీటి ఆవిరిలో దూరిపోవటం. నీవు మాత్రం స్వయంగా వేడి నీరు కావు. "ప్రపంచం మారిపోయినా నా స్థితిలో ఎటువంటి మార్పులేదు" అని వ్రాశావు. దీనిని మార్పులేని స్థితి అనడానికి బదులు (Condition of Firm Renunciation) దృఢవైరాగ్యస్థితి అని చెప్పాల్సి ఉంటుంది. కాదంటే వైరాగ్యం యొక్క అత్యంత ఉన్నత స్థితిగా చెప్పాల్సి ఉంటుంది. మార్పులేని స్థితిలో ఈ విషయం ఉత్పన్నమవుతుంది. కాని ఈ 'మార్పులేని స్థితి'కి, 'అసలు మార్పులేని స్థితి'కి మధ్య భేదం ఉంది. ఈ వైరాగ్యస్థితిలో ప్రాపంచికంలోని మంచిచెడులమీద దృష్టి పెట్టటం జరగదు కాని, 'అసలు మార్పులేని స్థితి'లో ప్రాపంచికంలోని మంచిచెడులవైపు దృష్టి నిలుస్తుంది. మొదటిది (Intoxication of Renunciation) వైరాగ్యపు మత్తువంటిది అయితే, ఈ రెండవదానిలో (Intoxication) మత్తు అనుభూతికి రాదు.

**స్వామి వివేకానంద (అంతర్వాణి):** దీనిని చాలా చక్కగాను, ఖచ్చితంగాను వివరించటం జరిగింది. స్వామి అనదగినవారు ఈ విధంగా వ్యక్తపరుస్తారా? ఎవ్వరైనా ఈ విధంగా చెప్పటానికి సాహసించగలరా? ఇది దివ్య జ్ఞానం. ఈ వాక్యానికి ప్రతిఫలంగా నేనయితే వేయి మాటలు ఇచ్చి ఉండేవాడిని. అయితే ఈ విషయమై నీకు నీ స్వంత మాటయే ఉండగా, వాటికి విలువ ఉండదు.

**లాలాజీ సాహెబ్:** భాయీ! ఈ విషయం సువర్ణాక్షరాలతో లిఖింపతగినది. ఇంత గొప్పగా వివరించటం నేను ఎప్పుడూ చూడలేదు.

**స్వామి వివేకానంద:** ఇది చాలా ముఖ్యమైన ఉత్తరం.

నీవు (Shivering in a circular way) గుండ్రంగా తిరుగుతున్న కంపనం గురించి వ్రాశావు. ఈ కంపనంతో నీ గుండె కూడా కంపిస్తూ ఉందేమో బాగా పరిశీలించి వ్రాయి. దాని తర్వాతనే నేను దానికి జవాబు వ్రాస్తాను. అయినా ఇప్పుడే నేను జవాబు ఇస్తున్నాను. హృదయం ఊగిసలాడుతూ ఉన్నట్లయితే అది మూలాధారం (Real-Source) నుంచి కంపనం తీవ్రంగా వస్తున్నట్లుగాను, దాని ప్రభావం చూపుతున్నట్లుగాను దాని అర్థం. అది కనుక కేవలం ఒక రకమైన స్పర్శలాగా అనుభవమైతే, హృదయం పూర్తిగా దానితో (మూలశక్తి కంపనంతో) ప్రభావితం కావటం లేదని దాని అర్థం. ఇకపోతే, చైతన్యం, అచేతనం (స్పృహ, స్పృహ లేకపోవటం) గురించి నీవు వ్రాసినది '$C_1$'కు చెందిన ఆధ్యాత్మిక యాత్ర. ఇక్కడ స్థితి ఒక నీడలాగా ఉంటుంది. దానిని పట్టించుకోనవసరం లేదు.

నీ రెండవ ఉత్తరంలో నీ ఆలోచనా పరంపర గురించి వ్రాశావు. ఆ ఆలోచనలు ఏమిటో నీవు వివరించగలవా? వాస్తవంగా, అసలు వస్తువు యొక్క ప్రభావం పనికిరాని పొరలమీద పడినపుడు, గలగలమని శబ్దం కలుగజేస్తాయి. మనలో జీవం ఉంది కనుక ఈ శబ్దాన్ని ఆలోచనలుగా పరిగణిస్తాము. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటో, దానినిబట్టి అర్థం చేసుకో. చౌబేజీకి, అమ్మకు నా ప్రణామం. నీ సోదర సోదరీలకు నా ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 465

లఖీంపుర్,
4.03.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ఉత్తరంలో తమ ఆరోగ్యం మళ్ళీ చెడిపోయింది అని వ్రాశారు. దయచేసి ఇప్పుడు ఎలా ఉందో వ్రాయండి. 'మాలిక్'

దయతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా స్థితిలో నాకు ప్రతిదీ ఏమిలేనట్లుగానే ఉంది. ఎలా అంటే, ప్రతిస్థితి కూడా నాకు చివరలో ఏమీ లేనట్లుగానే అయిపోతూ ఉంది. ఆలోచనలు గొలుసుకట్టులాగా పూర్తిగా ఉంటున్నాయి. కాని అవి ఆలోచనలా లేక ఎక్కడో తెలియని (Result of Vibration) ప్రకంపనల ఫలితమా అనేది ఇప్పటివరకు నిశ్చయించుకోలేకపోయాను. స్థితి స్పష్టంగా ఉండగా, చెప్పదగినదిగా ఏమిలేనప్పుడు ఏమని వ్రాయగలను. అయితే '$C_1$' పాయింట్ స్పష్టంగా అయిపోయి నా కళ్ళెదుట వ్యాపిస్తున్నట్లుగా ఉంది. నేను ఆ దశలో కూడా ఎప్పుడో ఇదివరకే కలిసి ఉన్నట్లుగా అనుభూతి చెందుతున్నాను. నేను చేయాలనుకున్నది స్వయంగా ఎందుకు చేయలేకపోతున్నానో నాకు తెలియకుండా ఉంది. ఎందుకంటే, ఈ దశ అలా ఉంది, ఆచి తూచి అడుగులు వేయాల్సి వస్తోంది. ఒక సహజరీతిలో 'మాలిక్' నన్ను తీసుకు వెళ్ళుతున్నట్లుగా నేను గ్రహిస్తున్నాను. దాని మూలంగా ప్రతి అణువు ఒక ఆశ్చర్యకరమైన సహజస్థితికి వచ్చేశాయి. దశ కూడా లోపల, బయట ఒకే విధంగా ఉంటోంది. నేను ఎందుకు ఒక సాక్ష్యంగా ఉండిపోయాను అంటే, 'హాయ్' అనేది నాకు వ్యర్థమైనదిగా అనిపిస్తోంది. అంటే నా 'హాయ్' అనే దానికి ప్రభావం లేకుండా పోయింది. 'మాలిక్'ను చూసి కూడా నాలో ప్రేమ ఉత్పన్నం కావటంలేదు. నేను ఎటువంటి యంత్రంలాగా అయిపోయాను అంటే, దానిని మెలిత్రిప్పినా, విరగగొట్టినా, ఇంకేమి చేసినా గాని యంత్రం ఉన్నది ఉన్నట్లుగానే, ఎటువంటి ప్రభావం లేకుండా ఉంటోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 466

లఖీంపుర్,

8.03.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం.నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఉదయం నిద్ర నుంచి లేవగానే, కళ్ళు తెరుస్తూనే నేను స్వయంగా నా నుంచి వేరుపడిపోయినట్లు తరచుగా అనుభవమవుతోంది. అయినప్పటికీ, ఆ వేర్పాటు దశ కూడా సామ్యావస్థ స్వరూపంలాగానే ఉంటోంది. అది నా నుండి బహిర్గతమైనట్లు అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, నేను నా నుంచి ఎప్పుడూ వేరుపడనట్లుగాను, పైన చెప్పిన దశలోనే ఉన్నట్లుగాను అనిపిస్తోంది. ఇది ఏమిటో అర్థం కావటం లేదు. దీనిని ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు. ఎలా అంటే, ఒక మనిషి ఇంటి నుండి బయటకు అనగా ఆరుబయట ప్రాంగణంలోకి వచ్చినా కూడా, అతడు ఇంటితో సంబంధం కలిగి ఉంటాడు. ఈ దశ ఆ విధంగా ఉదయం లేచినప్పుడే కాకుండా, పగలు అంతాను, నడుస్తూ తిరుగుతున్నా ఒక్కపెట్టున కళ్ళు విచ్చుకుంటున్నట్లుగాను లేదా చైతన్యంలేని స్థితి నుండి స్పృహ కలిగినట్లుగాను, ఇప్పుడు ఇటువంటి దశను అనుభూతి చెందుతున్నాను. బాబూజీ, ఇప్పుడు చెప్పాలంటే, చైతన్యత యొక్క దశలో చైతన్యం లేనిదశ యొక్క జ్ఞానం కలుగుతుందో అప్పుడు ఇటువంటి దశను అనుభూతి చెందుతున్నాను. నాకు ఈ విధంగా తోస్తుంది: నా ఇంటిలో చైతన్యతయే ఉంది, కాని బయటి ప్రాంగణంలో చైతన్యంలేని దశ యొక్క జ్ఞానం కలుగుతుంది. నేను ఇంటిలో ఒక్కర్తెనే ఉంటున్నప్పటికీ, వేరుగా ఉంటున్నట్లు లేదు కాని ఆరుబయటకు రాకతప్పనప్పుడు వచ్చి ఉండగా, నిద్రించటానికి, మేల్కొనటానికి మధ్యన ఉన్న అంతరం (భేదం) వంటి దశ కలుగుతోంది. అప్పుడు

దశ తన సామ్యావస్థను కూడా త్యాగం చేసినట్లుగా అనిపిస్తోంది. ఇంతేకాదు, ఇంటిలో ఈశ్వరుడు కూడా లేనందున, ఈశ్వర దర్శనం యొక్క స్థితి నుంచి కూడా సంబంధం తెగిపోయింది. నాకు అనుభవానికి అయితే రావటం లేదు కాని, బయట ప్రాంగణంలో 'వీరి' (దైవం) సువాసన వస్తోంది. నా ఒక్క అడుగు ఇంటి లోపల, మరొక అడుగు ప్రాంగణంలో ఉంటున్నా కాని నా దృష్టి ఇంటిలోనే నిమగ్నమై ఉంటోంది. ఇప్పుడు ఇల్లే నా ఇల్లుగా అయిపోయింది. ఇంకా ఏమి భావం కలుగుతుంది అంటే, నా దృష్టిలో ప్రాంగణం కూడా ఇల్లుగా అవుతోంది. ఎందుకంటే, ఇల్లు నాది అయినప్పుడు ప్రాంగణం నాది కాకుండా ఉండదు కదా! నేను చెప్పటానికి ఇల్లు అని చెబుతున్నాగాని దానిని నా స్వరూపంగానే అనుభూతి చెందుతున్నాను. ఇంకా ఏమిటంటే, నా స్వరూపాన్నే నేను స్వయంగా మరచిపోయాను. దానిని, బుడగలు నీటిని గుర్తించటం వంటిదిగా చెప్పవచ్చు. (ఎందుకంటే, బుడగలు నీటి మీదనే కదా ఏర్పడుతుంటాయి.)

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 467

షాజహాన్‌పూర్,
13.03.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం 08.03.1955వ తేదీది అందింది. నీ ఆరోగ్యం గురించి తెలియజేయి. ఒక చిన్న ఉత్తరం డాక్టర్ సిన్హాగారికి కూడా వ్రాశాను. దాని నకలును నీకు, మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా పంపించాను. నేనయితే వ్రాశాను. దాని ప్రభావం ఎలా ఉంటుందో, 'మాలిక్' తనకూ ఉన్నాడు కనుక, ఆయనకు తోచినట్లుగా చేస్తారు. **నాకయితే, ఎవ్వరైతే 'మాలిక్'ను, వ్యాపించి ఉన్న సమస్త జగత్తును 'వాని'దిగానే భావిస్తూ, తనను ఒక దీన దరిద్రునిగా భావించునటువంటి వ్యక్తి (అభ్యాసీ) కావాలి. (అనగా దైవమే తనకు ఆధారమని దైన్యంగా భావించు వ్యక్తి అని అర్థం.) నిర్భాగ్యునికి 'మాలిక్' ఏదైనా ఇస్తారు కాని, స్వయంగా తన (భౌతిక) సామ్రాజ్యంలోనే విస్తరించిపోయినవానికి (సంస్కారాలతో సతమతమయ్యేవానికి) అతనివద్ద భిక్షాపాత్రయే లేకుండినపుడు 'మాలిక్'కు దానిని నింపవలసిన అవుసరం ఏముంటుంది!**

నీవు నీ ఉత్తరంలో ఒక మంచి విషయం వ్రాశావు. అది– నీవు నిద్రించి మేల్కొంటున్నపుడు నీవు నీలో నుంచి బయటకు వచ్చినట్లు అనిపిస్తోంది– అని. **మన సంస్థలోని శిక్షణా విధానంలో మనస్సు యొక్క సంబంధం, దాని వాస్తవికత స్థితితో సంబంధం కల్పించుతాము. అందుచేత అభ్యాసీని తటాలున నిద్రలేపటం కాని, అభ్యాసీ ఒక్క ఉదుటున మేల్కొనటంగాని చేయకూడదు. ఈ విధంగా జరిగినట్లయితే అతనికి ఒక కుదుపు కలుగుతుంది.** ఈ స్థితి నీలో బాగా పెంపొందింది. నీవు నిద్రిస్తున్నప్పుడు నీ వ్యాపకత్వం బాగా విస్తరిస్తుంది. దాని వలన నీవు మేల్కొన్నప్పుడు నీ నుంచి నీవు బయటకు వచ్చినట్లు అనిపిస్తుంది. నీవు ఆ సమయంలో నిశితంగా పరిశీలించినట్లయితే నీకు నిద్ర సమయంలో ఎంతోకొంత ఆనందం కలిగినట్లు అనుభవమవుతుంది. అయితే ఆ ఆనందం ఎలా ఉంటుందంటే, నిద్రిస్తున్నపుడు కలిగిన స్థితిని, మేల్కొంటున్నపుడు కలిగిన స్థితిని పోల్చినట్లయితే కొంత భేదం ఉన్నట్లు తెలియటమే కాదు, కొంచెం కష్టమైన దానిని అనుభూతి చెందుతావు. నీవు ఉన్న ఈ స్థితిని చూసి అప్పుడు నాకు కలిగిన స్థితి జ్ఞాపకం వచ్చింది. ఇది తెలిసినవారు నన్ను నేను పొగుడుకుంటున్నాని అనుకుంటారు. నా నోటికి అదుపులేదు. అభ్యాసీకి ఈ స్థితిని చేరుకోవాలనే ఆసక్తి కలుగుతుందని నేను దీనిని అలవాటు చేసుకున్నాను. అందుకని నేను దీనిని నీకు వ్రాస్తున్నాను. అభ్యాసీ నిద్రిస్తున్నప్పుడు, అతని యొక్క ఆధ్యాత్మిక యాత్రలో సామాన్యంగా విహరిస్తూ ఉంటాడు. ఎప్పుడైతే హద్దులు, బంధనాలు తెగిపోతాయో, అప్పుడు అతడు ఇంకా ఎక్కువగా వ్యాప్తి చెందుతాడు.

దైవాన్ని కలుసుకోవటానికి ఇదే అనుకూల సమయం అని నేను చెబుతాను. నేను ఇంకొక విషయం కూడా చెబుతాను. ఈ బంధనాలన్నీ తెగిపోయాక ఇలా ఎందుకు అవుతుంది, దాని అవసరం ఏమిటి? దానికి కారణం ఏమిటంటే, కేంద్రానికి (Centre) క్రింద ఉన్న శక్తి, అతని వ్యాప్తి ద్వారా అందరికీ పంపిణీ చేస్తూ ఉంటాడు. ఈ విధంగా శక్తి (Real Source) మూలాధారం నుంచి అందరికీ లభ్యమవుతూ ఉంటుంది. అయితే ఈ ఆధ్యాత్మిక శక్తి (దివ్య శక్తి) ఎప్పుడైతే తరిగిపోతూ ఉంటుందో, అపుడు ఇటువంటి వ్యక్తిత్వం ఉన్న వారిని దైవం పంపుతాడు. నేనైతే ఈ స్థితిని గురించి వ్రాసేసాను. ఇది ఎవ్వరి స్థితి అయి ఉంటుందో నీవు అర్థం చేసుకోవచ్చు. నాకయితే నిద్ర హాయిగా అనిపిస్తుంది. అది కూడా కుంభకర్ణుని నిద్ర వంటిదైతే మరీ ఇష్టం. ఎందుకంటే, నేను ఆ స్థితిలో నా ఇంటిలో (భూమా) విహరిస్తూ ఉంటాను. అలాగే బ్రైటర్‌వరల్డ్‌లో కూడా తిరుగుతూ ఉంటాను. అక్కడ నాకు ఏవైతే దక్కుతాయో వాటిని నా వద్ద నిలుపుకోను. ఈ స్థితి నాకు చెందినదా లేక ఇతరులకు చెందినదా అనటానికి ఇదే కారణం. ఆధ్యాత్మిక శక్తితో కణకణమూ భర్తీ అయిపోయింది. ఎవ్వరైనా సెయింట్స్ లేదా మహాత్ములు దీనిని గ్రహించగలిగితే వారు ఎక్కువ లాభం పొందుతారు. బిటియా! ఇప్పుడు సుఖనిద్రను ఎవరు పొందుతున్నారు నీవే చెప్పు. వేదాలలో దీనిని తురీయస్థితి, తురీయాతీత స్థితి లేక ఇంకా ఏదైనా స్థితి, అని అంటారో తెలియదు. నీవు చౌబేజీని సంప్రదించి, వేదాలలో దీనికి ఏ మాటలను ఉపయోగించారో, ఈ నిద్రను ఏమని పిలుస్తారో తెలుసుకొని వ్రాయి. నీవు తప్పనిసరిగా అడగాలి. అడిగితే ఆయన చెప్పగలుగుతారు. ఇప్పుడు నీకు ఒక విషయం గురించి జవాబు ఇచ్చాను. ఇంక మిగిలినవి '$C_1$' స్థానానికి చెందినవి. నీవు బాగా వర్ణించావు కాని ఇంకా అనిర్వచనీయంగానే ఉంది. ఇప్పుడు '$C_1$' స్థితిలో నాకు కనిపిస్తున్నది ఏమిటంటే, నీకు ఆ స్థానంలో ఇంకా ఉండాలని అనిపిస్తోంది. నేను '$B_1$' స్థానంలో కల్పించినటువంటి కంపనం ఇప్పుడు '$C_1$' స్థానంలో పునరావృతమైంది. దాని మూలంగా నీకు ఉన్నతంగా పోవాలనే కోర్కె కలుగుతుంది. నేను లఖీంపూర్‌లో ఉన్నప్పుడు ఈ కంపనాన్ని దాదాపు అణచివేశాను. కాని దాని బీజం (మూలం) లేకుండా చేయలేదు. నీవు ఎక్కడ ఆగి ఉండాలని అనుకున్నప్పటికీ ఈ కంపనం అలా నిలవనివ్వదు. నిజానికి ఇప్పుడు నీకు నా సహాయం యొక్క అవసరం లేదు. నీ గమనంలో ఆ కదలికయే (Vibration) స్వయంగా వేగాన్ని పెంచింది. నీకు కదలటానికి ఇష్టపడకపోయినప్పటికీ ఆ కంపనం (Vibration) నిన్ను పైకి లాగుతూ ఉంటుంది. అయితే నా పర్యవేక్షణ ఇంకా పెంచవలసి ఉంది. ఇందుకోసం చిన్నపని చేయవలసినది ఇంకా మిగిలి ఉంది. అది ఎలా నంటే ఈ కంపనాన్ని (Vibration) నేను నియంత్రించవలసిన బాధ్యత ఉన్నది. అవసరాన్నిబట్టి నేను దానిని నియంత్రిస్తాను. చౌబేజీ **ఈ కాపలాదారునకు చాలా తక్కువ వేతనం ఇస్తున్నారు. ధరలన్నీ పెరిగిపోయిన ఈ కష్టకాలంలో కడుపు నిండటం లేదు. నా జీతం (నిరంతర స్మరణ) తప్పనిసరిగా పెంచమని వారితో నీవు చెప్పు.** దక్షిణభారతదేశంలో ఒకరిద్దరు ధ్యానం ప్రారంభిస్తున్నారు. కాని వారు ఇక్కడకు రావటం కష్టం. అందుచేత అక్కడ ఉండియే శిక్షణ పొందాలని అనుకుంటున్నారు. ఎలా అభ్యాసం చేయాలో వారికి నేను తెలియజేస్తాను. దైవం అంతటా ఉన్నాడు. ఆ సంగతి **అతనే** చూసుకుంటాడు. ఈశ్వరుని కృపతో ఈ విషయం త్వరగా వృద్ధి చెందనున్నట్లు కొన్ని సూచనలు కనిపిస్తున్నాయి. అమ్మకు నా జన్మదినం జరపాలని కోరిక ఉంది. కాని దానికి 4 లేక 5 రూపాయలకు మించకుండా ఉండునట్లు ఖర్చు చేయమని ఆమెతో చెప్పు.

'సహజ-సమాధి' పుస్తకం వ్రాయతలపెట్టినట్లు వ్రాశావు. దానిలో కనీసం 40 లేక 50 పేజీలు ఉండాలి. నీవు ఎప్పుడు వ్రాయ నారంభిస్తావో అప్పుడు దానిని చాలా బాగా వ్రాయగలుగుతావు. అది చూసి నీకే ఆశ్చర్యం కలగుతుంది. ఇందుకు నా ఆశీస్సులు అందిస్తున్నాను. దైవానుగ్రహంతో అది ఆ విధంగానే జరుగుతుంది. అవకాశం ఉంటే, నా ఉత్తరాలు, పుస్తకాలలోని కొన్ని వ్యాఖ్యలు (Quotations) నీకు సరైనవి అనిపించినవి నీ పుస్తకంలో సమకూర్చు. శాప విముక్తి కలిగించే విధానాల గురించి నేను నీకు క్లుప్తంగా వివరిస్తున్నాను. 'లాలాజీ సాహెబ్' ఈ విషయాలన్నీ నాకు చెప్పారు. ఋషులు సామాన్యంగా ఏ స్థితిలో ఉంటారో ఆ స్థితి నుంచే ఆశీస్సులు లేక శాపాలు

ఇస్తూ ఉంటారు. ఆ శాపం యొక్క ప్రభావాన్ని రద్దుచేయాలని అనుకున్నప్పుడు, ఆ స్థితికి ఉన్నతంగా ఉన్న స్థానంమీద శాపవిముక్తి గురించి దృష్టి నిలపాలి. బ్రహ్మగతిని పూర్తిస్థాయిలో కలిగి ఉన్నవారు ఎవరైనా ఉంటే, వారు ఆ దోషాన్ని ఒక్క చిటికెలో తొలగించగలుగుతారు. వారు ఏ ఇతర స్థానం గురించి వెదకాల్సిన అవసరం ఉండదు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 468

లఖీంపుర్,

15.03.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, ఎవ్వరిదైనా మరణం తర్వాత, శవం తరలించిన తర్వాత, ఒక రకమైన నిశ్శబ్దం, ఒక విధమైన స్థితి ఏర్పడినట్లుగానే నా శరీరంలో ప్రతిచోట, ప్రతి ఘడియ అటువంటి నిశ్శబ్దమే ఆవరించి ఉంటోంది. నేను ఎప్పుడూ ఇటువంటి వాతావరణంలోనే నన్ను కోల్పోయినట్లుగా ఉంటున్నాను. పూజగది నుంచి బయటకు రావాలనిపించదు. ఎవ్వరితోనూ మాట్లాడాలనిపించదు. నాతో ఎవ్వరైనాగాని, ఏ విషయమైనా మాట్లాడకూడదు అనే నా మనస్సు కోరుకుంటుంది. పూజగదిలో పూజ చేస్తూ ఉండకపోయినప్పటికీ, అక్కడే కూర్చుండిపోతున్నాను. పూజపట్ల ప్రేమయే లేకపోయినపుడు, పూజ ఏమి చేస్తాను. 'మాలిక్'పట్ల ప్రేమయేలేనపుడు పూజపట్ల ప్రేమ ఎందుకు ఉంటుంది? ఎందుకంటే, 'మాలిక్'ను గురించి మాట్లాడాలన్నా, వినాలన్నా శరీరానికి కోరికయే లేకపోతోంది, నాకు అది రుచించటంలేదు. నా హృదయం యొక్క అశృవులు కూడా ఇంకిపోయాయేమో అన్నట్లు ఉంది. ఇంక ఇల్లేముంది (అనగా హృదయం), నాకు శ్మశానంగా అయిపోయింది. శరీరం ఆరిపోయి ఉంది, ఊదినా కూడా బూడిదయే లేస్తోంది. ఒక అదృశ్యమైన ఆవిరి యొక్క వేడిమి సాయంతో దారి తెలుసుకోబడుతోంది అని, అది కూడా ఇప్పుడు దానిలో వేడిమి యొక్క జాడ లేనంతగా చల్లబడిపోయిందని, చల్లదనం యొక్క ఆశ కూడా ఆరిపోయిందా అన్నట్లు ఈ స్థితి ఉంది. ఇది ఒక అస్పష్టమైన దశగా ఉంది. 'మాలిక్' కూడా నా నుంచి తొలగిపోతూ ఉన్నాడేమో అని నాకు అనిపిస్తోంది. ఇదివరకైతే, "హృదయమనే అద్దంలో ప్రియుని రూపం ఉంది" అనే పరిస్థితి ఉండేది, కాని ఇప్పుడైతే హృదయమే స్వయంగా ఒక మసకబారిపోయిన చిత్రంగా అయిపోయి అదృశ్యమైపోతోంది అన్నట్లు ఉంది. దీనిని ఒక అద్భుత దృశ్యంగా చెప్పవచ్చు. ఎందుకంటే, 'మాలిక్' ఎలాగైతే కనుమరుగైపోతున్నారో అలాగే దృశ్యం, దృష్టి కూడా 'అతడి'ని వెన్నంటి చాటైపోతున్నట్లుగాను, ఏదో ఒక రోజున మహాప్రళయం యొక్క సామ్రాజ్యం అయిపోతుందని అనిపిస్తోంది.

బాబూజీ, నాకు నిద్రించటం మరియు మేల్కొనుటం స్థితులు ఎటువంటివి కలుగుతున్నాయి అంటే, మేల్కొనట స్థితిలోనైతే ఏమీలేదు, ఒకవేళ ఏదైనా ఉన్నా (Limit) పరిమితంగా ఉంటోంది కాని, నిద్రించటంలో మాత్రం (Limitlesss) అపరిమితంగానే ఉంటున్నట్లు అనుభూతి చెందుతున్నాను. ఇంకొక విషయం ఏమిటంటే, మేల్కొనటంలో శరీరం 'మాలిక్'తో వేరై ఉన్నట్లుగాను, నిద్రలో 'మాలిక్'తో కలిసి ఉన్నట్లుగాను ఉంటోంది. ఇప్పుడింక '$C_1$' ప్రయాణం పూర్తయినట్లు భావిస్తున్నాను. ఇంకా ఏమి అనుభవమవుతోంది అంటే, హృదయం మేల్కొనాలనే కోరుకుంటోంది కాని ఎవరో నిద్రపోవాలని నన్ను ఒత్తిడి చేస్తున్నట్లుగా చూస్తున్నాను. ఇంకా ఏమి గ్రహిస్తున్నాను అంటే, మేల్కొన్నమీదట శరీరం కొంత నిర్బంధించబడి ఉన్నట్లుగాను, నిద్రలోనైతే ఎటువంటి నియంత్రణ లేకుండా స్వేచ్ఛగా ఉంటున్నట్లుగాను అనుభవమవుతోంది. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 469

లఖీంపుర్,

24.03.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అంతా కుశలమే. అక్కడ 'తమరు' కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటోగాని శరీరం తనకుతానే అన్నట్లు అయిపోతోంది. ఎలా అంటే, ఏడ్వటం, నవ్వటం, మాట్లాడటం, పచార్లు చేయటం, తినటం, త్రాగటం, ఆఖరికి జీవించి ఉండటం కూడా నాకు కష్టసాధ్యంగా అనిపిస్తూ ఉన్నాయి. జీవనంలో మృత్యుఛాయ లేదా మృత్యువు యొక్క మత్తువంటిది వ్యాపించి ఉంటోంది. చూసేవాళ్ళు నన్ను జబ్బుగా ఉన్నట్లు భావిస్తున్నారు. బాధ ఏమిటో చెప్పమన్నా, చెప్పలేకపోతున్నాను. అందుచేత నేను నా బాధను దాచిపెట్టున్నానని అనుకుంటున్నారు. నా ప్రళయం జరిగిపోయిందా అన్నట్లు ఉంది. పూర్తిగా తామసీ ప్రవృత్తి ఏర్పడింది, అంటే స్నానం చేయాలనిగాని, శరీరం శుభ్రంగా ఉంచుకుందామనిగాని, ఆఖరికి మరుగుదొడ్లో చేయిని శుభ్రం చేసుకోవాలనిగాని అనిపించదు. నేను ఎంత అంధురాలుగా ఉన్నానంటే, కేవలం నా ఈ తామస స్థితియే అన్నివైపులా కనిపిస్తోంది. తామసీకి చెందిన పరదా వేయబడినట్లుగాను, కళ్ళు మూసుకుపోయినట్లుగాను ఉంది. పూజ లేక సత్సంగంలో పాల్గొనటానికి శరీరం వశం కాకుండా ఉంది. ఎవ్వరైనా మాట్లాడుతుంటే కోపం వచ్చినట్లు ఉంటుంది కాని కోపం వ్యక్తం చేయటం లేదు. జీవితంపైన మృత్యువు యొక్క మత్తు ఉంది కాని మృత్యువు లేదు. ఈ విధంగా నాకు ఎందుకు అనుభవమవుతుందో, బాబూజీ! అది తమరే చెప్పాలి.

ఇక్కడ పైన చెప్పినటువంటి చైతన్యం లేనిస్థితి కేవలం అందుకే ఏర్పడుతోంది. ఎప్పుడైతే నేను నా నుంచి పగలు రాత్రి బయటకు రాకుండా ఉంటానో, లోపలనే నిమగ్నమై ఉంటానో, అప్పుడు ఈ మత్తు ఏర్పడినట్లు అనిపిస్తుంది. లోపల అయితే వాస్తవంగా ప్రకృతి యొక్క ప్రళయం కూడా జరిగిపోయిందా అన్నట్లు తోచగానే కళ్ళు విచ్చుకుపోతాయి. నిన్నటి నుంచి నేను చూస్తున్నది ఏమిటంటే, మహాప్రళయం సంభవించినా కూడా, దానిలోనే ఇమిడి ఉండియో లేదా కలిసి ఉండియో కూడా నేను నా నుండి బయటనే ఉంటున్నాను. ఇప్పుడు ఈ దశను చూస్తూ ఉంటే, ఈ మత్తును గురించి భయం నాకు లేదనిపిస్తోంది. ఎందుకంటే, నా బుద్ధి లేదా శరీరం దీని నుంచి ముఖం చాటుచేసుకుంది. ఇప్పుడు నా దశకు సంబంధించి (సురత్-సుహాగిన్) జ్ఞాపక-సౌభాగ్యం అను మాట పూర్తిగా అనుచితమని అనిపిస్తుంది. ఇప్పుడు, స్థితి నుంచి జీవనం, మృత్యువు అను రెండు మత్తులు అంతమైపోయినట్లు గ్రహిస్తున్నాను. జాగరణ-నిద్రల మధ్య ఉన్న అవస్థ యొక్క మత్తు కూడా వీడిపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు దశకు ఎక్కడా సముద్రం కాని, మైదానం కాని లేవు. ఇంకా ఏమున్నాయో వానికి జాడలేదు. ఎందుకంటే, నా బుద్ధి, నా మనస్సు నాకు అర్థంలేనివిగా ఉన్నాయి. అది ఎంతవరకంటే, నా ఆత్మ కూడా నా నుండి కనుమరుగైపోతున్నట్లు ఉంది. ఇంతకుపూర్వం నా లోపల, బయట స్థూలశరీరం మీద కూడా నా దృష్టి మరలినపుడు కేవలం 'మాలిక్' యొక్క అనుభూతియే కలుగుతూ ఉండేది, కాని ఇప్పుడు ఇలా లేదు. అన్నీ కూడా నా దృష్టి నుంచి తొలగిపోయాయి. ఇంక నాకు ఏమీ కనిపించటం లేదు. నా గ్రహింపు కూడా నశించిపోయింది, అహంలో జీవనమోక్షగతి కూడా నాకు వ్యర్థం, నిరర్థకంగా నిరూపితమయ్యాయి. బాబూజీ, ఇప్పుడైతే ఏ దశ అంతమైనా శూన్యం, లేదా స్వయంగా నా అంతమైనా, శూన్యం అనగా ఏమీలేనట్లుగా ఉంది. నా హృదయం యొక్క ఖజానా ఖాళీ అయిపోయినట్లు, లూటీకాబడినట్లు అనిపిస్తోంది. ఇప్పుడింక నిశ్శబ్దశాంతి లేదా నిశ్శబ్ద ప్రళయ సామ్రాజ్యం బయట, లోపల కూడా ఏలుబడిలో ఉంది. ఇప్పుడు నాపై ఋతువుల ప్రభావం ఏమీ లేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 470

షాజహాన్‌పూర్,
28.03.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలన్నీ చేరాయి. ఇటీవల కొంచెం పని ఎక్కువగా ఉంటున్నది. మద్రాసు అభ్యాసుల నుంచి చాలా ఉత్తరాలు వస్తున్నాయి. వాటికి సమాధానాలు వ్రాయాల్సి ఉంది. మిషన్ యొక్క బాధ్యత తమ మీద ఉందని తలచేవారు కేవలం ముగ్గురు లేక నలుగురు మాత్రమే మిషన్‌లో ఉన్నారు. ముముక్షు ఆశ్రమంలో ఉత్సవం బాగా జరిగింది. నేను, కాశీరామ్‌గారు అక్కడికి రెండుసార్లు వెళ్ళాము, రెండు రూపాయలు ఖర్చయ్యాయి. చాలా యోగ్యులైనవారు వచ్చారు. **ఇప్పుడు మన మిషన్‌ను అభివృద్ధిపరచాలను ఆలోచన కలిగినట్లయితే, అది వేలకొలది నక్షత్రాలను హరించి (ఖండించి) ఉదయం అయినట్లుగా ఉంది. ఇటువంటి లక్షణాలే ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడుతున్నాయి. ఆ విధంగా మనం ఉదయాన్ని వీక్షించాలని భగవంతుని అభీష్టంగా కూడా ఉంది. అంతటా అల్లర్లు జరిగే అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కూడా తన గతిని బంగ్లాదేశంవైపు మార్చుకుంటుందేమో ఎవరికి తెలుసు. ఇటువంటివి ఎన్ని సంగతులు జరుగుతాయో ఊహించలేము. పాకిస్తాన్‌లో ఒక పెద్ద ప్రాంతం ఎడారి (Barren) కావచ్చు. నదులు ఇంకిపోవచ్చు, దారిద్ర్యం తాండవమాడవచ్చు. వినియోగదారులకు గోధుమలు చూపి బార్లీ అమ్ముతున్నటువంటి మహాత్ములే దీనికంతటికీ బాధ్యులు. ఈ విధంగా దీనిలో అంధకారం అలుముకుంటోంది.** నాకు తీరిక లేనందువలన ఈ విషయాలమీద దృష్టి పెట్టలేదు. పని ఒత్తిడి బాగా ఉంటున్నందువలన నా మెదడు అలసిపోతోంది. మాస్టర్ సాహబ్‌వంటివారు మరెవ్వరైనా తోడు ఉన్నట్లయితే నేను ఇటువంటి ముఖ్యమైన పనులమీద శ్రద్ధ పెట్టేవాడిని. మాస్టర్ సాహెబ్ వంటి వారిని ఎవరినైనా తయారుచేద్దామంటే దానికి అర్హులు ఎవరూ కనిపించటం లేదు సరికదా, ఒకవేళ ఉన్నప్పటికీ ఎవరికీ అటువంటి అభిరుచి కూడ లేదు. **ఇప్పటివరకు ఇన్ని సంగతులు వ్రాశాక మరొక సంతోషకరవార్త కూడా వ్రాస్తున్నాను. ఇప్పుడు భారతదేశంలో బంగారం ఉత్పత్తి కావడం ప్రారంభమైంది. అది కూడా (అస్సామ్‌లో) కాశీరామ్ నివసించే చోటు కావటం విశేషం. భారతదేశానికి మంచిరోజులు వస్తున్నాయి; చాలా ప్రాంతాలలో వచ్చేశాయి కూడ. విశేషించి దక్షిణ భారతదేశంలో ప్రత్యేకమైన లోహం తయారౌతుంది.** నీ ఉత్తరంలో నీవు ఏది వ్రాసినప్పటికీ దానిని మళ్ళీ చదవను. దానిలో వాస్తవికత (రియాలిటి) లక్షణాలు బాగా కనిపిస్తుంటాయి. నిన్న రాత్రి గం.11.00లకు నిన్ను '$D_1$' మీదకు లాగాను. ఈ స్థానంలో, చైతన్యరహిత స్థితిలో కొంత మార్పు వస్తుంది. ఇప్పుడు జీవన్మరణాల భావం తొలగిపోయింది అని నీవు వ్రాశావు. ఇది వాస్తవంగా తొలగిపోయినట్లయితే దీనిని వాస్తవికత (రియాలిటి) యొక్క మంచి స్థితిగా చెప్పవచ్చు.

నీకు దైవీయకార్యం కొంత చేయమని ఇచ్చాను. కాని ఇప్పుడు దానిని చేయాల్సిన అవసరం లేదు. ఇప్పుడు అవి పూర్తయిపోయాయి. మిషన్ అభివృద్ధి కొరకు నీవు చేస్తున్న కృషి బాగుంది, దానిని కొనసాగించు.

అమ్మకు నా ప్రణామం అందజేయి.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 471

లఖీంపుర్,

28.03.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం ఈరోజు అందింది, చదివి చాలా ఆనందించాను. తమరు నన్ను '$D_1$' పాయింట్‌కు చేర్చారు. అందుకు ధన్యవాదాలు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు దశ ఎప్పుడైనా ఒక్కసారిగా పొగలాగ అయిపోతోంది. ఒకప్పుడు మత్తు మాదిరిగా తేలికపాటి మరుపుతోను, ఒకప్పుడు భ్రమలాగాను, మరొకప్పుడు పూర్తిగా నిశ్శబ్దంగాను, శాంతిమయంగాను ఈ దశ ఉంటోంది. నేనే 'మాలిక్'గా అయిపోయి, 'మాలిక్'ను కోరుతున్నట్లుగాను లేదా జ్ఞాపకం చేసుకుంటున్నట్లుగాను అనిపిస్తోంది. ఎందుకంటే, పూర్తిగా స్పృహ లేదా మంచిగా ఉన్న దశలో నేను ఇలాగే అనుభూతి చెందాను. జీవితం నుంచి పాదాభివందనం గావించటం తొలగిపోయిందని అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, ప్రతిమానవుడు ఆఖరికి ప్రతి జంతువు పాదాలవద్దనే నా శిరస్సు ఉంటోందని అనిపిస్తోంది. అనగా ప్రతి ఒక్కరికీ పాదాక్రాంతమైనట్లుగా అనిపిస్తోంది. ఇదొక ఆశ్చర్యకరమైన దశ, దీనిలో అంతటా పాదాభివందనం చేయటమే ఉంటోంది కాని, ఆ ప్రణమిల్లటం నా జీవితం నుంచి ఎగిరిపోయింది. ఇప్పుడు 'మాలిక్'ను నాలో సంపూర్ణ రూపంలో చూస్తున్నాను. 'అతడు' సంపూర్ణరూపంలో నాలో ఇమిడిపోయినట్లు ఉంది. ఇప్పుడు స్థితి ఏమిటంటే, నేను చైతన్యం లేకుండా ఎప్పుడూ ఉండను మరియు చైతన్యం ఎప్పుడూ కలగదు. సూక్ష్మ శరీరం, కారణ శరీరం వాటి అస్థిత్వాన్ని కోల్పోయి నా జీవితం నుంచి ఉడాయించినట్లు ఈ దశలో అనుభవమవుతోంది. అసలు అవి నాలో ఎప్పుడూ ఉత్పన్నం కాలేదు అన్నట్లు తోస్తోంది. ఇంక ఆత్మయే శరీరంలో ప్రకాశిస్తూ ఉండగా దానిలో కూడా 'మాలిక్' లయమైపోయినట్లు అనుభవమవుతోంది. ఇప్పుడు 'ఏదీలేదు' అని చెప్పినట్లయితే కూడా, శరీరం కొంచెం తక్కువ భారం అనుభూతి చెందుతున్నట్లు ఉంది. పక్షి గూడు విడిచి ఎక్కడో స్థిరపడినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు 'అతడి' ఉనికి యొక్క అనుభూతి స్వల్పంగానైనా ఉండటం లేదు. నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. అలాకాదు, నిశ్శబ్దం కూడా మౌనం దాల్చింది. ఎందుకంటే, అది కూడా ఇప్పుడు నన్ను దాని పేరు తలచకుండా చేస్తోంది. ఎందుకంటే, ఇలా చెప్పినట్లయితే ఆ స్థితిలో పీల్చటం వంటిది కలుగుతోంది. ఇంతకీ అసలు సంగతి ఏమిటంటే, గూడు ఖాళీగా పడియుంది. స్థితిని చూస్తూ ఉంటే చాలాసేపటివరకు నేను చలనం లేనట్లు అయిపోతున్నానని అనుభవానికి వస్తోంది. ఇంక ఇదేమిటో తమకే తెలుసు, తమ నిర్వహణకే తెలుసు. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 472

షాజహాన్‌పూర్,

01.04.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. 1955 మార్చి 28వ తేదీ ఉత్తరం అందింది. ఈరోజు శ్రీరామనవమి, చాలా మంచి రోజు. రామనామ స్మరణ లెక్కపెట్టూ చేశాను. లెక్క అయితే పూర్తయిందిగాని నేను మాత్రం చిక్కులో పడిపోయాను. ఆ చిక్కు ఏమిటంటే, లెక్క అయితే ఉందిగాని రాముడు లేకుండాపోయాడు. మనం రాముడినే పొందాలనుకుంటే, లెక్కించే ప్రయత్నం విరమించుకుని ఆ లెక్కకు మూలమైన విషయం మీదనే దృష్టి పెట్టాలి. ఆ విషయం ఏదై ఉంటుంది? అది

"సున్నా (Zero)"; ప్రతి సంఖ్యలోను కలగలిసి ఉంటుంది. అది (Zero) వ్రాతలోను, సంఖ్యల్లోను ఉండకపోతే వాటి విలువ ఎక్కువగా అంచనా వేయబడదు. అనగా మనకు సంఖ్యలను తెలియచేయటానికి అది (Zero) ఉపయోగపడుతుంది. ఇప్పుడు మనం అన్నింటా కలగలసి ఉన్న దీనిని (Zero) మర్చిపోయి, మన ఎదుట ఉన్న వాటిని మాత్రమే గుర్తు ఉంచుకుంటున్నాము. ఇది ఎలా ఉందంటే, మన ఆంతరికంలో ఉన్న 'మాలిక్'ను విస్మరించినట్లు ఉంది. మనం మండలేశ్వరుడు లేదా మహా మండలేశ్వరుడు కాబోతున్నప్పటికీ, మన స్థాయి (హోదా)లో మార్పు లేకపోయినట్లయితే, మనల్ని మనం (అహం) విస్తరింపజేసుకున్నట్లవుతుంది. ఆ శూన్యం (దైవం)ను మరుగుపరచి మనం మండలేశ్వరుడో లేదా మహా మండలేశ్వరుడో కాదలచుకుంటే మన ప్రతి లెక్కను ఒక వర్గం (Square) చేయాలి. ఇప్పుడు కలిగే మరొక ఇబ్బంది ఏమిటంటే, ఈ హోదాను నశింపు చేసుకోవాలనుకుంటే వర్గమూలం (Square-root) యొక్క సమీకరణం కూడా జ్ఞాపకానికి వస్తోంది. ఇలా తగ్గించుకుంటూ మనం స్వయంగా అచేతనమయ్యేంతవరకు చూస్తూ ఉండాల్సిందే. అంతవరకు మన చిక్కుముడి తొలగిపోదు. మన కలలో ఈ హోదా సుడులు తిరుగుతూ ఉంటూ మనం ఇంకా జటిలమైపోతున్నందువలన ఈ విధంగా అచేతనం కావటం కష్టతరమవుతుంది. ఒకే శక్తితో సృష్టించగలవాడు, వినాశనం చేయగలవాడు అయిన ఆ భగవంతుడుతప్ప ఇంకెవరు మనకు దాని నుండి విముక్తి కల్పించగలుగుతారు. అయితే దైవానికి ఆ సంకల్పం ఎందుకు కలుగుతుంది? ఎప్పుడైతే నీ సంకల్పం, దైవ సంకల్పంగా అవుతుందో అప్పుడు నీ ఆలోచన 'అతడి' దృష్టికి వెళ్తుంది.

ఇప్పుడు నీ ఉత్తరానికి జవాబు వ్రాస్తూ, నేను నిన్ను పైన చెప్పిన స్థితిలో ఉంచుతున్నాను. గణితం యొక్క గందరగోళమైతే నీలో లేదు కాని, మండలేశ్వరులు, మహామండలేశ్వరులు అలాగే నేటి మహాత్ముల యొక్క భావజాలంతో కలిగిన వేడిమి ప్రభావం సామాన్య మానవులమీద పడుతున్నటువంటిది ఇంకా ఉంది. వారి మాటల మూలంగా చెలరేగిన పొగ ఏదైనా నీ ఆలోచనకు వచ్చినప్పటికీ, ఇప్పుడు అది లేదు. లెక్కింపు అయితే ముగిసిపోయింది, శూన్యం (Zero – దైవం)పై దృష్టి సారించబడింది. ఆ దృష్టి ఎలా ఉందంటే, నీవు 'మాలిక్'ను నీ దృష్టిలో ఉంచుకున్న కారణంగా మానవులు, జంతువుల కాళ్ళపై నీ శిరస్సు ఉంటుంది. ఇప్పుడు నీవు పైకి లేవాలి. నీవు కోరుకున్నట్లయితే నీ దృష్టి మానవుల మరియు జంతువుల కాళ్ళపై ఉండదు. ఇది ఒక స్థితి. దీనిలో అందరిలోను 'మాలిక్' యొక్క ఉనికి అనుభూతికి వస్తుంది. ఈ స్థితిని 'తత్త్వమసి' అనగా 'అది నీవై ఉన్నావు' (Thou art that) అని అర్థం. దీనినే ఫారసీ భాషలో 'హమావోస్తు' అని అంటారు. ఇది అహం బ్రహ్మోస్మి (నేను బ్రహ్మను) కంటే చాలా ఉన్నతమైన స్థితి. అహం అనేది బ్రహ్మోన్ని మౌనంగా తాకుతూ ఉంటుంది. ఎందుకంటే, అది చివరకు దాని మార్పు చెందిన స్థితికి రావలసి ఉంటుంది. జనం అహం బ్రహ్మోస్మి స్థితిని వాస్తవంగా కాని, అవాస్తవంగా కాని పొందటమనేది గొప్ప విషయం. అది ఏమిటో భగవంతునికే తెలియాలి. ఎవరికి దీని గురించి తెలియదో వారే తెలుసుకోగలుగుతారు. ఇది చాలా ఉన్నతమైన స్థితి. దాని తర్వాత ఇంకా చాలా ఉన్నాయి. దీనిని జన్మదాల్చనివారు, మరణం చెందనివారు మాత్రమే తెలుసుకోగలుగుతారు. నీవు "ప్రతి కణంలోకి పొంచి చూసినా కస్తూరి కనబడటం లేదు" అని వ్రాశావు. ఈ మాటకు జవాబు ఏమిటంటే, నిజంగా కస్తూరి తనను ఎక్కడో కోల్పోయింది, కాని ఆమె పరిమళం ఇంకా ఎక్కడో ఉంది. అందువల్లనే నీవు "స్వయంగా 'మాలిక్'నే అయిపోయి కూడా 'మాలిక్'ను కోరుతున్నాను" అని వ్రాశావు. ఈ విషయం, నీ పరిమళం వలన ఆత్మకు మరపుస్థితి (విస్మృతస్థితి) ఇంకా ఆరంభంకాలేదని తెలుపుతుంది. ఎప్పుడూ స్పృహలేకుండా ఉండటం గాని, ఎప్పుడూ స్పృహ చెందటం గాని జరగటంలేదని కూడా నీవు వ్రాశావు. ఇది ఆత్మ యొక్క వాస్తవమైన స్థితి. ఉత్తరంలోని ఇతర విషయాలన్నీ ఈ స్థితికి సంబంధించినవే. వాటి అన్నింటికి ఒక్కటొక్కటిగా జవాబు వ్రాయటం చాలా కష్టం.

కాశీరామ్‌జీ ఇప్పుడు వెంటనే అస్సాం వెళ్ళబోతున్నారు. అక్కడకు వెళ్ళి బాగా ధనం సంపాదించి, దివ్యత్వాన్ని కూడా సాధిస్తాడు. అమ్మకు, చౌబేజీకి ప్రణామాలు. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

**Note:** ఒక సంఖ్యను అదే సంఖ్యతో హెచ్చించి అధికంగా చేయటం (Square). అలాగే అధికంగా ఉన్న సంఖ్యను దాని వర్గమూలం (Square-root)తో అల్పంగా చేయటం వంటి సమీకరణాలను గణితశాస్త్రరీత్యా బాబూజీ ప్రయోగించారు. గణితశాస్త్రానుభవం ఉన్నవారికి ఇది సులభమేకాని సామాన్యులకు ఇది అర్థం కాదు. దీని వెనుక వారి భావం, మనల్ని మనం గొప్పగా భావించుకోవటంతో అహం పెరిగిపోతుందని, దానిని తగ్గించుకోవటానికి దాని మూలం అన్వేషించాలి అని చెప్పటమే.

## ఉత్తరం సంఖ్య – 473

లఖీంపుర్,

1.04.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. చదివి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

అంతర్గత ఆనందం యొక్క బంధనం సమాప్తమైపోయింది. లోపల (ఆంతరికంగా) అయితే అపరిమితానందం నిండి ఉంది కాని, దాని స్వాధీనం 'మాలిక్' యొక్క కమలహస్తాలలో ఉంది. అతడు పగ్గాలు పట్టియున్నాడు, ఏమాత్రం సడలింపు ఇవ్వటం లేదు. ఎంతైనా కొద్దిగా వదులుచేసినప్పటికీ మళ్ళీ లాగిపట్టుతున్నాడు. (గుర్రపుస్వారీలో రౌతు చేస్తున్న పనిగా ఊహించుకోవచ్చు.) ఇప్పుడు ఈ ఆనంద భాండారం తరిగిపోయి బాహ్యాంతర కణాలన్నింటిలో నిండిపోయినట్లు అనిపిస్తోంది. నా ఆత్మ కూడా కరిగిపోయి 'మాలిక్'లోనే కలిసిపోయినట్లు ఉంది.

బాబూజీ, లయావస్థ ఇప్పుడు నాకు అర్థం లేనిదిగా కనిపిస్తోంది. ఇతరులలో లయావస్థ గురించి లక్ష ప్రశంసలు చేస్తూ ఉంటాను కాని, స్వయంగా నామీద దాని ప్రభావం ఏమి ఉండటం లేదు. అచైతన్యం కూడా నిశ్చలమైపోయి సామ్యావస్థలో లయమైపోయిందని అనిపిస్తోంది. ఇదేమిటో తెలియకుండా ఉంది. 'మాలిక్' మహిమ, 'అతని' గుణాల పొగడ్త 'అతని' గొప్పతనం వంటిది అసలు నా హృదయంలో లేకుండాపోయాయి. ప్రయత్నించటానికి కూడా నా మనస్సు అంగీకరించటం లేదు. ఇప్పుడు ఆధ్యాత్మికత కూడా నాకు రుచించటం లేదు. ఒక స్పృహ లేకపోవటం వంటి మత్తు దశ లేదా మసకబారిన నీడలాగా ఏ దశ అయితే వ్యాపించి ఉండేదో, అది ఇప్పుడు పూర్తిగా శుభ్రపడిపోయింది. 'మాలిక్' యొక్క నియంత్రణ ఏదైతే నాకు ప్రతిసమయంలోను అనుభవమవుతూ ఉండేదో, అది ఇప్పుడు పూర్తిగా బలహీనపడిపోయింది అన్నట్లు ఉంది. అది ఏమిటో అర్థం కావటంలేదు. దృష్టిలో కూడా మార్పు కనిపిస్తోంది. అది నా స్థితిపట్ల బాగానే ఉంది. ఎలా అంటే, నేను పూర్తిగా ఒక సాధారణమైన గృహస్థులాగ ఉంటున్నాను. 'మాలిక్'ను కూడా ఇదే దృష్టితో చూసినట్లయితే నేను అప్పుడప్పుడు, ఇదేమిటా అని భయకంపితురాలిని అవుతున్నాను. ఇందులో నా తప్పు ఏమీలేదు. ఇప్పుడు నాలో మత్తు లేదు. ఆ మత్తు తర్వాత అలసత్వం లేకపోగా ఒక స్వచ్ఛమైన స్థిరమయ్యే స్థితి ఉంటున్నది. దీనిని అమాయకపు (లేక అజ్ఞాన) దశ అంటే బాగుంటుందేమో. నా స్థితి యొక్క మెరుపు తరిగిపోతూ ఉంది. ఇప్పుడు ఉన్న ఈ మెరుపు మిరుమిట్లుగొల్పటం లేదు. ఎప్పుడైనా గాని, ఎవరిలోనైనాగాని విశేషత్వం అంటూ నాకు కనపడకుండా పోయాయి. ఒక సాధారణ దశయే వ్యాపించి ఉంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 474

షాజహాన్‌పూర్,
07.04.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నేను ఒక ఉత్తరం మాస్టర్ సాహెబ్ ఉత్తరంతోపాటు పంపించాను. అది చేరే ఉంటుందని అనుకుంటాను. దానిలో ఏప్రియల్ 1వ తేదీ ఉత్తరానికి జవాబు కూడా ఉంది. ఆ స్థితియే ఇప్పటికీ ఉంది. '$D_1$' స్థితి ఇంకను తెరుచుకోలేదు. కాని అది త్వరలోనే తెరుచుకోవచ్చు. నీ ఉత్తరంలో, "ఆనందం యొక్క నిధి కరిగి, లోపల, బయట ప్రతికణంలోను నిండిపోయింది" అని వ్రాశావు. ఇది పూర్తిగా ఆత్మ యొక్క స్థితి. దీనిలో ఆనందంకాని, విచారంకాని, తనది అనికాని, ఇతరులది అనికాని ఏదీ ఉండదు. నీవు ఈ మైదానంలోకి చేరిపోయావు. కాని దానిలో లయావస్థ ఇంకను జరగలేదు. ఈ స్థితినే నీవు అనేక రకాలుగా వ్రాశావు.

నీవు "మాలిక్ యొక్క గొప్పదనం హృదయంలో లేకుండాపోయింది" అని వ్రాశావు. ఈ స్థితి ఇంతకుముందు ఉన్న స్థితికంటె చాలా మంచిది. మన స్థితిలో (Greatness) గొప్పదనం యొక్క అనుభూతి ఉన్నంతవరకు, బంధనాల నుంచి విముక్తి కాలేము. అది ప్రారంభం కాకుండా ఏ పనీ జరగదు. ఉత్తరంలో ఉన్న మిగతా విషయాలన్నీ ఆత్మ యొక్క స్థితినే తెలియజేస్తున్నాయి.

ఉత్తరానికి సంబంధంలేని ఒక క్రొత్త విషయం ఇప్పుడు వ్రాస్తున్నాను. గీతా ప్రెస్‌వారు ఒక పుస్తకం "మన్ సే వార్తాలాప్" (మనస్సులోని మాట) పేరుతో ముద్రించారు. ఈ విషయంమీద స్వామి శుకదేవానంద్‌జీ కూడా బాగా వ్యాఖ్యానించారు. ఇది నీ ఇంటిలోనే నీకు అనుభవానికి వచ్చింది. ఈ స్థితిలో జనం ఎటువంటి కష్టాల్లో పడతారో ఇది నిరూపిస్తోంది. ఈ పుస్తకం ద్వారా శుకదేవానంద్‌జీ బాగా మెప్పును పొందారు. దీనినిబట్టి స్వామీజీలు జనానికి ఎంత నష్టం కలుగజేస్తున్నారో నీవు విశ్లేషణ చేయి. **ఆధ్యాత్మికత అభివృద్ధి కావాలని భగవంతుడు కోరతాడు, కాని స్వామీజీలు ఈశ్వరుని సంకల్పం నెరవేరనివ్వరు.** ఏమి జరగనున్నదో నాకు తెలియదు. **ఇటువంటి స్వాములకు శిక్ష విధించినట్లయితే దాని ఫలితం వారికి ఈ జీవితం తర్వాతనే అనుభవానికి వస్తుంది. వాస్తవంగా వారు తమంతట తాము శిక్ష వేసుకుంటున్నారు. ఇది కూడా ఒక విధంగా మంచిదే. ఎందుకంటే, ఈ స్వాముల ఇచ్ఛాశక్తి బాగా అభివృద్ధి చెందలేదు. అలా జరిగితే ఇంకా విషపూరితంగా ఉండి ఉండేది.**

అమ్మకు ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 475

లఖీంపుర్,
8.04.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ మేమంతా కుశలమే. తమరు సదా ఆరోగ్యంగా ఉండాలని 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను. ఎందుకంటే, తమ కృప మా అందరికీ సదా లభిస్తూ ఉంటుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

క్రితం వ్రాసిన ఉత్తరంలో నేను మత్తువంటి దాని గురించి ఏదైతే వ్రాశానో, ఇప్పుడు అది కాదని గ్రహించాను. అది ఒక సూక్ష్మమైనటువంటి మరుపుస్థితిగా ఉండి వ్యాపించి ఉంది. కాని ఇప్పుడది లేదు. కాని నేను గమనిస్తున్న

దానినిబట్టి, లోపల మరియు బయట నుంచి అది ముడుచుకు పోయి నాలో జీర్ణించుకుపోతున్నట్లు ఉంది. దశ యొక్క రంగు లేతగోధుమ రంగులాగా ఉంది. దానిని ఎక్కువగా అనుభూతి చెందటంగాని, చూడాలని గాని, దానికి దగ్గర అవ్వటానికిగాని ప్రయత్నించినట్లయితే నాలో అచైతన్యం వంటిది వ్యాపిస్తోంది. ఇది ఏమిటో నాకు తెలియకుండా ఉంది. కాని ఇప్పుడైతే అది స్వయంగా నా రూపమే అయిపోయిన దశగా ఉంది. కాబట్టి దానితో కలిసి ఉండాలనే ప్రశ్నయే తలెత్తదు. ఇదంతా ఈ విధంగా ఉండి ఉంటూ కూడా, ఒక కలత చెందటం వంటిది లేదా తపన వంటిది కలుగుతోంది. అయితే దానికి ద్వైతంతో సంబంధం లేకుండా ఉంది. ఎందుకంటే, దానికి లక్ష్యం అంటూ లేదు కనుక. లోపల మరియు బయట ప్రతి కణమూ సంతోషంలో తిష్టవేసినట్లుగాను లేదా అవే సంతోషం యొక్క రూపందాల్చినట్లుగాను గ్రహిస్తున్నాను. కాని ఈ తపన అనేది నా నుండి దూరమైపోయింది. ఈశ్వరీయ మార్గం యొక్క వాంఛ లేనట్లుగాను, 'మాలిక్' ఇచ్చే దానిని స్వీకరించాలని అనిపిస్తోంది. అదేమిటోగాని ఒక రకమైన అయిష్టత చోటుచేసుకుంది. దానివలన ధ్యానంగాని, నిరంతర స్మరణగాని రుచించటం లేదు. చివరకు నా జీవనంగాని, మృత్యువుగాని రుచించటం లేదు. నేను ఏదైనా మాట్లాడినా, చెప్పినా, వ్రాసినా గాని, పిల్లవాడు తొలి పాఠ్యపుస్తకం తీసి కూర్చుంటె, ప్రతి శబ్దం క్రొత్తదిగా తోచినట్లే ఉంటోంది. ఇప్పుడు జీవితం యొక్క ప్రతిదశ, ఉదయం, సాయంత్రం వంటివి కూడా నాకు ఒక క్రొత్త దశగానే అనిపిస్తోంది. అయినా కూడా నాకు ఇవి ఇంపుగా అనిపించటం లేదు. ఎదుట కనిపిస్తున్న ప్రపంచానికి చెందిన ప్రతిదీ అనగా జడ, చేతనాలన్నీ కేవలం తేలికైన పొగతో సమానంగా అనిపిస్తున్నాయి. ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, జీవితం యొక్క నూతన దశ అంటూ లేకపోవచ్చు కాని పాతదశ, మరపుస్థితి (విస్మృతస్థితి) మాత్రం ఉంది, అంతకుమించి ఇంకేమీ లేదు. సరళత్వం, స్వచ్ఛత అని చెప్పాలనుకుంటే చెప్పవచ్చును కాని, అది క్రొత్తదీకాదు, పాతదీ కాదు. నేను నా లోపల, బయట అని చెబుతున్నానంటే అది ఏ భావనా లేనటువంటిదే. నాకు ఇప్పుడు లోపల, బయట అనేవి అనుభవానికి రావటం లేదు.

ఇప్పటి నా ఈ స్థితిలో, రోజంతా నేను ఏమి చేయాలో గ్రహింపుకు రావటం లేదు. శిరస్సు మధ్యలో పాపిటికి అతిసమీపంలో ఒక రక్తనాళంలో, ఎవరో సన్నని తీగను వ్రేళ్ళతో మీటి వదలినట్లయితే కలిగే ధ్వని లాంటిది మరియు దానిలో పిప్పరమెంట్ వంటి చల్లదనం ఉంటున్నాయి. అప్పుడప్పుడు ఆ చల్లదనం నుదుటి వరకు చేరుతుంది. ఆ చల్లదనం చాలా స్వల్పమైనదిగా ఉంటుంది. ఇప్పుడు నా 'మాలిక్' యొక్క పాత్ర కూడా పూర్తయిపోయింది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 476

లఖీంపుర్,
13.04.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడంతా కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వాస్తున్నాను.

బాబూజీ, దశ ఇప్పుడు నిలకడగా ఉండిపోయినట్లు ఉన్నది. ఇలా కాకపోయినప్పటికీ, చైతన్య దశ అనిగాని, చైతన్యం లేనిదశ అనిగాని చెప్పటానికి వీలుపడనట్లు ఉంది. దశను ఖాళీగా ఉన్నదని చెప్పటానికి వీలులేదు, అలాగని శూన్యం అని చెబుదామన్నా దశ యొక్క వాస్తవిక రూపం అనుభవానికి రావటం లేదు. నాకు అంతా వ్యర్థమనిపిస్తోంది. విషయం ఏమిటంటే, ఈ దశ మాటలుగాని, ధ్వనిగాని లేనట్టిదిగా ఉంది. స్పర్శ కూడా ఉందో లేదో తెలియనట్లు

ఉంది. బ్రహ్మదశ అని దీనిని చెబుదామనుకుంటే, దశ పూర్తిగా విడమర్చబడి ఉండలేదు. దశ అయితే మహాశూన్యంవైపు అనుసంధానించబడుతోంది. (Blankness) ఖాళీతనం లేదా శూన్యం మరియు (Surrender) శరణాగతి యొక్క అనుభూతి అనేవి కూడా అంతమైపోయినట్లు ఉంది. ఉత్సవం జరుగుతున్నప్పుడుగాని, అవి ముగిసిన తర్వాతగాని నా హృదయం ఎందుకు ఆనందంగా ఉండటంలేదో నాకు తెలియటం లేదు. ఒక ఆశ్చర్యకరమైన సామ్యావస్థ అని చెప్పాలంటే దానిలో సామ్యావస్థ కూడా సమసిపోయింది. మరపుస్థితి (విస్మృతి దశ) కూడా నాకు దూరమైపోయినట్లు ఉంది. 'మాలిక్'తో నా సంబంధం వీడిపోలేదు కదా! అనే భయం కలిగిన స్థితి ఉంటోంది. అయినప్పటికీ 'మాలిక్' ఎవరినైతే పట్టుకుంటారో అనగా ప్రేమతో తన దృష్టిలో నిలుపుకుంటారో వానిపట్ల జాగ్రత్తగానే నిర్వహిస్తూ ఉంటారు. నాకయితే 'వారి'పట్ల భిన్నమైన స్థితి ఉన్నా కూడా 'వారి'ని చేరుకోవాలను తపన ఎందుకు లేకపోతోందో తెలియటం లేదు. కాని 'వారి' దర్శనభాగ్యం కొరకు ఆసక్తి మాత్రం ఉంటోంది. ఇదివరకు 'మాలిక్' యొక్క ఏ ఆకర్షణ అయితే నన్ను ఎప్పుడూ తనవైపు గుంజుతూ ఉండేదో, అది కూడా ఇప్పుడు అనుభవానికి రావటం లేదు. వీపు అంతటికీ చెదపట్టినట్లుగాను, ఇప్పుడు శిరస్సుకు కూడా పట్టినట్లుగాను ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 477

షాజహాన్‌పూర్,

17.04.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం 13.04.1955వ తేదీది చేరింది. ప్రస్తుతం నీది '$D_1$' స్థానం. దానిలో నీవు సగానికి మించి ఇంకొంచెం ముందుకు వ్యాపించావు. నీ యొక్క ఈ స్థితిని గురించి నేను తెలుపుతున్నాను. వాస్తవానికి చైతన్యం, అచైతన్యం –ఈ రెండింటిలోనూ ఏమీలేదు. నీకు చైతన్యం యొక్క అనుభూతి కొంచెమైనా కలిగినట్లయితే అది కూడా బంధనమే అవుతుంది. అలాగే అచైతన్యం యొక్క అనుభూతి కొంచెమైనా కలిగినట్లయితే అది చైతన్యం యొక్క మరొక భావంలో మనస్సు లగ్నమై ఉంది. అంటే చైతన్యం యొక్క భావన ఇంకా ఉంది. ఈ రెండింటి యొక్క అనుభూతి కలగకుండా ఉండటమే మంచిది. ఎందుకంటే, వాటి ప్రభావం మనమీద పడకుండా ఉంటుంది. దీని తర్వాత కలిగే మరొక స్థితిని 'పటుత్వం' (Potentiality) అని అంటారు. మనం దీనిని కూడా అధిగమించినట్లయితే గమ్యానికి చాలా దగ్గరగా ఉన్నట్లు అర్థం చేసుకోవచ్చు. కాలం వృధా కాకుండా ఉండటానికి మరికొంత సంక్షిప్తంగా వ్రాస్తున్నాను. నీవు ఇప్పుడు బ్రహ్మదశ (బ్రహ్మ యొక్క స్థితి)ను కలిగి ఉన్నావని అనటంలో సందేహం లేదు. కాని దానిని అర్థం చేసుకోగలగడానికి ఈ విధంగా వివరించాలి. ఎవ్వరైనా బ్రహ్మగతి యొక్క సువాసన అనుభూతి చెందుతున్నా లేక 'అతని' మండలంలో ఉన్నట్లు అనిపిస్తున్నా –ఇవన్నీ బ్రహ్మకు చెందినవే. ఈ అనుభవాన్ని నీవు 'బ్రహ్మగతి'గా చెబుతున్నావంటే అది మాట వరసకే. దీనినిబట్టి తెలుస్తున్నది ఏమిటంటే, దాని (బ్రహ్మ) శుద్ధత యొక్క భావం నీలో అభివృద్ధి అయ్యింది. దాని వలన బ్రహ్మం యొక్క గుబాళింపు స్థితికంటె నీవు ఇంకా ఉన్నతంగా వెళ్ళగలవని ఆశించవచ్చు. అభ్యాసీకి ఈ విషయాలన్నీ ఆధ్యాత్మికమార్గంలో అనుభవానికి వస్తూనే ఉంటాయి. లయ–అవస్థ మొదలైనవి వాటి గురించి నీవు వ్రాసిన ఇతర ఉత్తరాలకు, పైన వ్రాసినటువంటిదే సమాధానం. "మాలిక్‌తో సంబంధం తెగిపోయిందేమో" అని నీకు కలిగిన అభిప్రాయాన్ని దూరం చేసుకో. నా అభిప్రాయం ప్రకారం, 'మాలిక్' యొక్క భౌతికరూపంతో సంబంధం

తెగిపోయింది, కాని 'మాలిక్' (దివ్యత్వం)తో ఆ బంధం ఇంకా దృఢమైంది. పశ్చిమ దేశాలలో 'సెయింట్' అని పిలువబడుతున్న వారిని మన దేశంలో 'సంత్' అని పిలుస్తారు. నీలో ఇంకా ఈ సంత్ యొక్క స్థితి (సంత్-గతి) ప్రారంభం కాలేదు. నీవు 'సంత్' అవుతావు అను గట్టినమ్మకం నాకు ఉంది. అందుచేత నిన్ను 'సెయింట్' అని వ్రాయటం ప్రారంభించాను. దీనిలో ఉన్న భేదం ఇంతే కనుక 'సెయింట్' అనే వ్రాస్తున్నాను. నీ వెనుకభాగం, తల చెదపురుగులు తింటున్నట్లు ఉంటున్నది అని నీవు వ్రాసిన అనుభూతి నాకు సరిగ్గా అర్థం కాలేదు. దీని వలన ఏదైనా ఇబ్బంది కలుగుతున్నదా? ఏదైనాకాని, నీ అనుభూతి ప్రకారం అది వెన్నుముకలోనా లేక పూర్తిగా వెనుకభాగంలోనా? అది శిరస్సులోనయితే ఏ భాగంలో? ఒకవేళ ఘల్లుఘల్లుమను శబ్దాన్నిగాని లేకా వెనుకభాగంలో ప్రకంపనాన్నిగాని చెదపురుగులు తింటున్నట్లు నీవు వ్రాశావా?

అమ్మకు నా ప్రణామాన్ని అందజేయి.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 478

లఖీంపుర్,

16.04.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. చదివి ఆనందించాను. బాబూజీ, నాకు 'సెయింట్' అను పదం అర్థం లేనిదిగాను, ప్రాముఖ్యత లేనిదిగాను అనిపిస్తోంది. ఇంతకుముందు తమరు ఈ పదం ప్రయోగించి నపుడు ఒక ప్రత్యేకత ఉండేది, కాని ఇప్పుడు అది లేదు. ఇంక దశను గురించి చెప్పాలంటే, ఖాళీతనమే ఉంది కాని అది కూడా అంచనాకు రావటంలేదు. బాబూజీ, ఇప్పుడు సెయింట్‌గా వేసిన రంగు కూడా వెలిసిపోతూ క్రమంగా అంతమైపోయింది. సరేగాని బాబూజీ, ఉన్నదేదో ఉంది, అది తమకే తెలుసు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నేను ఎప్పుడైతే ఏమీ చెప్పకుండా మౌనంగా కూర్చుంటున్నానో అప్పుడు నా దశ యొక్క భావన ఎంతోకొంత కలుగుతున్నట్లుగా నేను గ్రహిస్తున్నాను. మూగవానికి బెల్లం ఇస్తే తీపి తెలపలేనట్లుగానే, ఏమిటోగాని స్పృహ లేకుండా ఉండటం లేదుకాని, ఎవ్వరైనాగాని "కస్తూరీ, బాబూజీ నుంచి నీకు ఉత్తరం వచ్చింది" అని చెప్పినపుడు నేను దానిని తీసుకుంటున్నాను. ఎందుకంటే, అది (ఉత్తరం) నావైపు చూపబడి ఉంటోంది. అయితే కస్తూరీ ఎవ్వరో, బాబూజీ ఎవ్వరో అను స్పృహ నాకు ఉండటం లేదు, అదేమిటో తెలియదు. అంతేకాదు, ఎవ్వరైనా, ఏమైనా చెబుతున్నా, చెప్పకపోయినా నాకు విషయం గురించిగాని, మాట్లాడుతున్న వాని గురించిగాని, ఎరుక ఉండటం లేదు. నాలోని శక్తి, నా అంతరాత్మ నిద్రించాయి. ఎరుక లేదన్న సంగతి కూడా ఎరుక లేకుండా ఉంది. నాకు ఏమయ్యిందో తెలియని విషయం ఏమిటంటే, శరీరం 'మాలిక్' చరణాలను ఎక్కడా వదిలి ఉండలేదు కదా! అని అనిపిస్తుంది. ఎందుకంటే, నా శరీరాన్ని అక్కడ కూడా నేను పొందలేకపోతున్నాను. ఈ శరీరం యొక్క అద్భుతం ఏమిటోగాని, నేను పాడలేను, ఏడ్వలేను, మౌనంగా కూర్చుని ఉండలేను. ఆఖరికి దాని చలనం కూడా నాకు అనుభవానికి రావటం లేదు. నా బాబూజీ, ఎక్కడైతే చీకటి అంటే చీకటే ఉందో, ఆ చీకటిలో కూడా చీకటి అంటూ లేదో, దేనిలోనయితే ఒక చీకటి నిద్రావస్థలో వ్యాపించి ఉన్నటువంటి దానివైపు నేను సాగిపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఏమయ్యిందో ఏమోకాని, ఇప్పటివరకు నేను నా స్థితిలో ఎల్లప్పుడూ లయమైపోయినట్లు ఉండేదానను, కాని ఇప్పుడు నాలో ఆ స్థితి లేదు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు, కేసర్ మరియు బిట్టొ ప్రణామం చెప్పుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 479

లఖీంపుర్,

19.04.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అంతా కుశలమే. తమ దగ్గు ఇప్పటికి తగ్గిపోయి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నా శరీరమంతటిపైన ఎవ్వరో పిప్పరమెంట్ బిందువుల వర్షం కురిపించినట్లు తరచుగా అనిపిస్తోంది. అది అప్పుడప్పుడు ఎడమవైపు కొంచెం అధికంగా ఉంటోంది. ఇంకను శిరస్సులోను, పాల భాగంలోను, పాపిటికి కుడిచేతివైపున ఇలాగే అధికంగా ఉంటోంది. నేను, ఇప్పుడు కేవలం సుషుప్త అవస్థ కూడా నిద్రావస్థలోనే వ్యాప్తమైపోయినట్లు ఉన్నటువంటి మైదానంలో ఉన్నట్లు అనుభవమవుతోంది. ఇప్పుడు నన్ను ఎవ్వరైనా మరణించావు అని చెప్పితే మరణించినట్లుగాను, జీవించి ఉన్నట్లుగా చెప్పినాగాని ఏమి పట్టనట్లు ఉంటోంది. నా జీవిత ఉద్దేశ్యం ఏమిటో తెలియకుండా ఉంది. నా స్థితి ఎలా ఉంది అంటే, ఎవ్వరైనా ఎవ్వరినైనాగాని బాల్యవితంతువు అని చెప్తూ దయ ప్రకటిస్తున్నప్పటికీ నేను మారుమాట్లాడకుండా ఉంటున్నాను. నాకు విధవరాలు, సౌభాగ్యవతి అనేవి దృష్టికి రావటం లేదు. స్వయంగా నన్ను ఎవ్వరైనా ఆ విధంగా చెప్పినా కూడా పైన చెప్పినట్లుగానే నా దృష్టికి వస్తోంది. అది ఎంతగానంటే తెలియని వ్యక్తి ఎవ్వరైనా మంజు, మున్నీని వీరు మీ కుమార్తెలేనా అని అడిగినట్లయితే కూడా నాకు అలాగే అనిపిస్తోంది. సదా 'మాలిక్' యొక్క పర్యవేక్షణ లేకపోయినట్లయితే, ఈ ప్రపంచం నన్ను ఇంక ఎన్ని విధాలుగా వర్ణిస్తూ ఉండేదో, అయినాగాని నాకేమీ పట్టింపులేదు. ఎందుకంటే, నాకు ఈ ప్రపంచమే కనిపించటం లేదు. బాబూజీ! ఇటువంటి తేలికైన స్థితి నా కణకణంలో కలిసిపోయింది. ఇటువంటి అమాయకమైన దశను 'మాలిక్' నాలో ప్రతిష్టించారు. ఎలాగంటే నాకు అనుభవమైతే కలుగుతోంది కాని మౌనం దాల్చటమే మేలనిపిస్తోంది. దీనిలో నుంచి 'మేలనిపిస్తోంది' అన్న మాటను తొలగిస్తే, అప్పుడు సరిగ్గా ఉంటుందనుకుంటాను. నేను మౌనం పాటిస్తున్న దశలోనే ఉన్నట్లు నా స్థితి ఉంటోంది. నేనయితే ఎప్పుడూ మౌనం విడిచి మాట్లాడలేదు, మాట్లాడను కూడా. నా మాటగాని, ఇతరుల మాట అయినాగాని వినిపించదు. ఇది ఇటువంటి అజ్ఞానంతోను, మౌనంతోను కూడిన స్థితిగా ఉంది. దీనిని 'మాలిక్' మాత్రమే తెలుసుకోగలరు, కాని నేనైతే ఏమీ చెప్పలేను. ఇంకా ఏమిటంటే, నాకు ఇప్పుడు ఆ అజ్ఞాన దశ కూడా జ్ఞాపకం ఉండటం లేదు.

సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 480

షాజహాన్‌పూర్,
23.04.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలు 16 మరియు 19 ఏప్రియల్‌వి చేరాయి. రెండింటికి కలిపి జవాబు వ్రాస్తున్నాను. నేను 19.04.1955వ తేదీన వ్రాసిన ఉత్తరంలో ఒక వాక్యం, "మాలిక్‌తో సంబంధం తెగిపోయిందేమో అని భావించవద్దు" అను దానిని నీవు అపార్థం చేసుకున్నావు. దీనికి అర్థం ఏమిటంటే, నీ సంబంధం తెగిపోవడం కాదు. నీవు ఎప్పుడూ అలా ఆలోచించవద్దు. నీవు దీక్షను (Initiation) పొందావు అనగానే అదే ఒక ఖచ్చితమైన సంబంధం. అది జరిగిపోయింది కనుక వారితో సంబంధం స్థిరపడిపోయినట్లే. ఇంక రెండవది, దీనికంటె ఉన్నతమైనది, ప్రేమ మరియు ఆధ్యాత్మికత మార్గం.

ఇప్పుడు నేను నీకు బాగా వివరిస్తాను. **గురువు యొక్క భౌతిక రూపాన్ని ప్రేమిస్తూ ప్రేమిస్తూ అభ్యాసీ ఎటువంటి స్థితికి చేరతాడంటే, ప్రియతముని ఆంతరిక స్థితితో సంబంధం కల్పించుకుంటాడు. అప్పుడు అభ్యాసీ యొక్క దృష్టి అంతా గురువు యొక్క ఆంతరిక స్థితి మీదనే కేంద్రీకరించబడటమే కాకుండా దానితో కలసి లయమైపోతాడు. ఇప్పుడు ఆ సంబంధం గురువు యొక్క భౌతికరూపంతో వేరుపడి 'అతని'తోనే (Divine) కలిసి ఉంటాడు. గురువు అంటే శరీరం కాదు. ఒకవేళ ఆ విధంగా భావించటమే జరిగితే కబీరు సాహెబ్ వర్ణించిన విధంగా అభ్యాసీ ఒక గురు-పశువు (గురువు యొక్క భౌతికరూపానికే దాసుడైనవాడు)గా అవుతాడు.** ఋషియైన యాజ్ఞవల్కుడు తన భార్య మైత్రేయితో, గురువును గురువుగానే (Divine) భావించాలి, పూజించాలి అని చాలా కఠోరంగా చెప్పాడు. మొదట ప్రేమయన్నది శరీరం అనగా రూపంతో ఏర్పడుతుంది, తర్వాత అభ్యాసీ గురువు యొక్క ఆత్మతో సమ్మిళితమైపోతూ ఉంటాడు. నేను గతఉత్తరంలో వ్రాసినటువంటిది- శరీరం (భౌతికరూపం)తో సంబంధం తొలగిపోయింది. కాని నాతో చాలా గాఢంగా పెనవేసుకుపోయింది అను దానికి పైన చెప్పినదే అర్థంగా భావించుకోవాలి. అభ్యాసీకి 'మాలిక్' యొక్క దేహంతో ఎంతోకొంత సంబంధం నిలిచే ఉంటుంది కాని, అది అతడు ఆ స్థితిని పొందినపుడు మాత్రమే అతనికి అనుభవమవుతుంది. ఉన్నతంగా ఎదగటం అంటే గురువు యొక్క (Inner-most Condition) అత్యంత ఆంతరికస్థితిలో లయమైపోవటమే. అలా జరగనట్లయితే జీవిత లక్ష్యం (పరమైక్యం) నెరవేరదు. నీవు చాలా ఉన్నతంగా పురోగమనం చెందుతూ ఉండి కూడా నా మాటను నీవు తప్పుగా ఎలా అర్థం చేసుకున్నావు. నీకు ప్రతి విషయం అనుభవమవుతూనే ఉంది. ఇప్పుడు నీకు బాగా అర్థమయ్యిందని అనుకుంటున్నాను. ఒకవేళ అర్థంకాకపోతే నేను మళ్ళీ అర్థమయ్యేటట్లు చేస్తాను. నేను ఏప్రియల్ 13వ తేదీ ఉత్తరానికి జవాబు ఇచ్చాను. ఇప్పుడు ఏప్రియల్ 19వ తేదీ ఉత్తరానికి జవాబు ఇస్తున్నాను. ఈ ఉత్తరంలో నీవు "జీవించి ఉండాలని అనిపించటం లేదు" అని వ్రాశావు. అనగా జీవనం గురించి విముఖత్వం ఏర్పడినట్లుగా నీ అభిప్రాయం. నీవు ఇంకా ఇది కూడా వ్రాశావు: "నన్ను ఎవరైనా మరణించావు అని చెప్పినా, అలాగే జీవించి ఉన్నావు అని చెప్పినప్పటికీ ఎటువంటి స్పందనా లేకపోతోంది" అని. దాని అర్థం ఏమిటంటే, నీవు ఎలా ఉన్నావో, అలాగే ఉన్నావు అని. నీవు ఇంతకుపూర్వం జన్మించి ఉండ లేదు, మరణించి ఉండలేదు అని నీ స్థితి తెలియజేస్తుంది. ఇది చాలా ఉత్తమ స్థితికి ఆరంభం. నేను చౌబేజీకి ఈ స్థితి గురించి వ్రాశాను. ఎప్పుడైతే దాని గురించి అనుభూతి కలగకుండా ఉంటుందో అదే అసలైన స్థితి. అభ్యాసీ ఉన్న స్థితికి వెనుకనున్న ఏ స్థితిని కావాలని కోరుకుంటే ఆ స్థితిని పొందగలిగినట్టి ఆధిపత్యం వృద్ధి చెందాలి. అభ్యాసీ ఎప్పుడైతే గురువు యొక్క ఆంతరిక స్థితిలో ప్రవేశం ఆరంభించి దానిని చేరుకుంటాడో అప్పుడు మాత్రమే ఈ స్థితులు కలుగుతాయి. గురువు యొక్క దేహాన్ని తీసుకున్నట్లయితే అది కూడా జంతు శరీర నిర్మాణంలోని ధాతువులతో నిర్మింపబడినదే.

అసలు విషయమంతా దాని వెనుక ఉన్న దైవ చైతన్యమే. నీ లక్ష్యం గురించి నీవు అడిగావు. **ప్రతి ఒక్కరి జీవిత లక్ష్యం అతని వాస్తవికతలో లయమైపోవటం.** ఈ లక్ష్యం నెరవేర్చుకోవటానికి పరిస్థితులనుబట్టి తనకు అవకాశం ఉన్న రీతిని అనుసరించాలి. ఒకవేళ అడవుల్లో నివసించటం ద్వారా ఈ స్థితి సంప్రాప్తమవుతుంది అనుకుంటె, ఆ ఆలోచన బలీయంగా ఉన్నప్పుడు దానినే స్వీకరించాలి. ఒకవేళ ఇంటిలోనే ఉండి **దానిని** (వాస్తవికతను) సాధించగలననే గుండె నిబ్బరం ఉన్నట్లయితే తన ఇంటిలోనే నివసిస్తూ సాధన చేయవచ్చు. ఇంకొకరకంగా ఒకవేళ ఇంటిలోనే ఉండి సన్యాసవృత్తిని స్వీకరించాలనుకుంటె ఆ విధంగా నిర్ణయించుకుని అందుకు తగినట్లుగా ఇంటివద్దనే నివసించవచ్చు. కొంతమంది ఇంటిలోనే ఉండి వివాహాదులు చేసుకోకుండా, తమ కర్తవ్యం నెరవేర్చుకోగలమనుకునే వారు ఉంటే, అలాగైనా చేయవచ్చు. కనుక జీవిత లక్ష్యం సాధించటానికి, నీ సంస్కారాల ఫలితంగా నీవు నిర్ణయించుకున్న జీవనస్థితి అనుకూలమైనదిగానే నీవు చెప్పవచ్చు. ఎందుకంటే, పైన చెప్పిన విధంగా జీవిత ధ్యేయాన్ని సాధించటమే ముఖ్యం కనుక, దాని కొరకు అవసరమైన త్యాగాలు అన్నింటిని చేయాల్సి ఉంటుంది. నీ లక్ష్యం సాధించటానికి నీవు ఇప్పటికే త్యాగాలు చేసావు. ప్రతి చైతన్యం ఉన్న మనిషి, నీవు సాధించిన దానికి ఆనందిస్తూ నిన్ను గౌరవించి తీరాలి.

నీవు '$D_1$' పాయింట్‌వద్ద కొంత కఠినత్వం ఉన్నట్లుగా ఎక్కడో వ్రాసావు. నీకు కలిగిన అనుభవం సరైనదే. దైవం తలిస్తే ఇది కూడా సరిదిద్దబడుతుంది. డాక్టర్ కె.సి.వరదాచారిగారి ఉత్తరం వచ్చింది. దాని నకలు పంపుతున్నాను. నీవు దానిని చదివి, అర్థం చేసుకుని, వారికి తగిన విధంగా సహాయం చేయి. వారు వెలుగు చూడాలనుకుంటున్నారు. వారు వ్రాసిన ఉత్తరంలో, నా జన్మదినం, సమయం, జీవితంలో ముఖ్యఘటనల తేదీలు తెలుపవలసిందిగా కోరారు. నా జన్మచక్రం చౌబేజీవద్ద ఉంది. దానిని చూసి నా జన్మదినం వివరాలు చూసి నాకు వ్రాయి. మా అమ్మగారు ఇక్కడ లేరు. ఉండి ఉంటే నేను ఆమెను అడిగి తెలుసుకునేవాడిని.

అమ్మగారికి, చౌబేజీకి ప్రణామాలు. మీ సోదర సోదరీలకు దీవెనలు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 481

లఖీంపుర్,
1.05.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. చదివి చాలా సంతోషించాను. నా స్థితి సర్వదా సమానంగా ఉంటున్నట్లు చూస్తున్నాను. 'మాలిక్' దయతో నా ఆధ్యాత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

నేను ఎప్పుడూ జన్మించలేదని, ఎప్పుడూ మరణించలేదని, అలాగే ఎప్పుడూ మరణించను అన్నట్లుగా చూశాను. అసలు నాలో ఎప్పుడైనా ఇలా జరిగిందా లేదా జరుగుతుందా అనేది కూడా నాకు జ్ఞాపకం రావటం లేదు. ఈ స్థితిలో నేను వెనుదిరిగి చూసినట్లయితే, దాని ఆనందాన్ని మాత్రమే ఆనందించగలను అని ఆశిస్తాను కాని అది నా స్వంతమైనదిగా చెప్పలేను. ఇదేకాదు, నా అనుభవానికి వచ్చే ఏ స్థితియైన తాత్కాలికంగానే ఉంటోంది. ఎందుకంటే, నేను నీటిలోని తామరాకుల్లాగా ఏమీ అంటనట్లుగా ఉంటున్నాను. కాని అనుభూతి అనేది, ఆ నీరంటని అనుభూతి కూడా అసమర్థంగా ఉంది. శరీరం ఏమీ తెలియనిదిగా ఉంటోంది. నా దశలో మిట్టపల్లాలు (ఎక్కువ తక్కువలు) ఏవీ అనుభూతికి రావటం లేదు. ఒక మృత కళేబరం స్నానం చేయించేవాని చేతిలో ఉన్నట్లు నా స్థితి ఉంది. అలా కాకుంటే నేను జీవితంలో ఎన్నటికీ పైకి రావటం అంటూ ఉండదు. ఎలా నడుస్తూ ఉందో అలాగే నడుస్తుంది. నా జీవితంలో ఒక సాధారణ గృహస్త జీవనంలాగా అయిపోయింది.

24వ తేదీ రాత్రి, సూక్ష్మస్థితికి చెందిన మరకను బాబూజీ శుభ్రపరుస్తున్నట్లు చూశాను. మృత్యువు సమీపించినా కూడా నాలో ఏమాత్రం భయం లేనట్లుగాను, లోపలిస్థితిలో ఎంత మాత్రం చలనం లేనట్లుగాను చూశాను. దశలో పరమానందం లేదు. దానిని (Selfless condition) అహంభావరహిత స్థితిగా చెప్పవచ్చు. అది కూడా మరపుస్థితిలోనే. ఇంతకుపూర్వమైతే నేను గృహంలోకి వెళ్ళుతూ ఉండేదానను కాని ఇప్పుడు గృహమే నాలో ఇమిడిపోయి ఉంటోంది. ఎందుకంటే, నాకు ఇప్పుడు గృహం యొక్క అనుభూతియే లేకుండా పోయింది. ఎందుకో తెలియదు కాని, తరచుగా నాపైన అలసత్వపు దశ కలుగుతోంది. కొంచెం ఆలస్యంగానైనా మళ్ళీ సరైన మార్గానికి వస్తోంది. ఇప్పుడు 'మాలిక్' ప్రేమ మరియు దయ యొక్క స్పందనయే నన్ను ముందుకు తీసుకు వెళ్తోంది. అలా కాకుంటే, నాలో ఆవేశంకాని, ఉత్సాహంగాని ప్రేమగాని కనిపించేవి కావు. ఇంతేకాదు, స్వయంగా నా గమనం కూడా నా అనుభూతికి రావటం లేదు. అయితే ఎందుకోగాని స్థితి నిలిచిపోవటం మాత్రం వెంటనే గ్రహింపుకు వస్తోంది.

నా స్థితి ఒకప్పుడు ఉన్నటువంటి ఒక విధమైన దృఢత్వం వంటిది ఇప్పుడు కనిపించటం లేదు. అలా అని శిథిలత్వం అని చెప్పటానికి వీల్లేదు. ఇప్పుడు దృఢత్వం, ఉత్సాహం, ప్రేమ మొదలైనవన్నీ నాకు పరాయివిగానే అనిపిస్తున్నాయి. కాని 'మాలిక్' ఆజ్ఞననుసరించి, ఆ ఆజ్ఞను నిర్వర్తించటం కోసం దృఢత్వం, ఉత్సాహం కలిగాయి. మళ్ళీ వెళ్ళిపోయాయి. 'మాలిక్' ఏది ఇస్తారో అదే ఉంటోంది కాని మరేమీ ఉండటం లేదు. ఇందువలన నాకు ఇప్పుడు రోషంగాని, కోపోద్రేకంగాని కలగటం లేదు. ఎవ్వరైనా పూజ (ధ్యానం) చేస్తూ ఉంటే, వారి పూజ నా ద్వారా జరిగిందా లేదా అనేది తెలియటం లేదు కాని అభ్యాసీ శరీరం మాత్రం ధ్యానంలో నిమగ్నమైంది అని చెప్పటం జరుగుతోంది. నా లోపల తాపంగాని, చల్లదనంగాని లేవు. 'మాలిక్' నాకు అప్పుడప్పుడు కొద్ది సమయానంతరంలోనే ఏది ఇస్తున్నాడో అది ఇస్తున్నట్లు ఉంది. కాని అలసత్వం అలముకుని అప్పుడప్పుడు నాలో సోమరితనాన్ని నింపుతోంది. ఈ విధంగా సోమరిగా ఉంటూనే నాలో అది ఎంతమాత్రం నాలోకి రాకుండా ఉన్నట్లుగాను చూస్తున్నాను. అమాయక స్థితి ఉండి కూడా నేను దానిని తెలియకున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 482

షాజహాన్‌పూర్,

04.05.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం మే 1వ తేదీది అందింది. డాక్టర్ వరదాచారిగారి ఉత్తరం యొక్క నకలును పంపిస్తున్నాను. దానిని చదివి, ఏదైనా అర్థంకాకపోయినట్లయితే చౌబేజీని అడిగి తెలుసుకో. ఆ ఉత్తరం యొక్క నకలును ఎందుకు పంపిస్తున్నానంటే, నీవు కూడా వారికి శిక్షణ ఇస్తున్నావు కనుక, నీకు అతని స్థితి తెలియాల్సి ఉంది. అంతేగాకుండా నీవు అతని లోపాలు తెలుసుకుని, వాటిని సరిదిద్దటానికి ప్రయత్నించాల్సి ఉంది. నేను నీకు పంపించిన అభ్యాసుల జాబితాలో నేను చేర్చటం మరచిపోయి ఉంటే, ఆ పేర్లు: 1. ఎస్.కె.రాజగోపాలన్, ఢిల్లీలో ఇంజనీర్ 2. కుమారస్వామి మరియు వారి శ్రీమతి, మద్రాసు. వాటిని కూడా చేర్చాలి.

నీ ఉత్తరాలకు జవాబు వ్రాయటం కష్టమవుతోంది. ఎందుకంటే, రెండు స్థితులు మాత్రం నీలో గాఢంగా కొనసాగుతూ ఉన్నాయి. వాటిలో ఒకవైపు నుంచి తొలగించటం, మరోవైపు కలపటం (అనగా భౌతికతను తొలగించటం, ఆధ్యాత్మికతను చేర్చటం). నీ స్థితి ఎలా ఉందంటే, నీవు ఒక ప్రక్క లయమైపోతూ ఉంటూనే మరొకప్రక్క నిన్ను నీవు

**కోల్పోతూ ఉన్నావు. నీవు నీ ఉత్తరంలో, "ఏదైనా ఉత్తరం కస్తూరికి వ్రాసినట్లయితే, నేను దానిని ఆమెకు అందజేస్తాను" అని వ్రాశావు. దీనిలో దాగి ఉన్న స్థితిని ఎంత పొగిడినా అది తక్కువే అనిపిస్తుంది. నిన్ను నీవు కోల్పోతున్నట్లు చెప్పటానికి ఇదే పరిపూర్ణ నిదర్శనం.**

**అభ్యాసీ తనను తాను పూర్తిగా లయింపజేసుకుంటున్నప్పుడు, అతని వాస్తవిక జీవనం ఆరంభమవుతుంది. ఆ స్థితిలోనే క్రమంగా ఈ 3 విషయాలు జరగటం ప్రారంభమవుతాయి: 1. దివ్య ఆలోచన (Divine Thought) 2. దివ్య చర్య (Divine Action) 3. దివ్య జ్ఞానం (Divine Wisdom).** ఈ ఉత్తరంలో వ్రాయబడిన ఇతర విషయాలు అన్నీ లయావస్థకు చెందిన మంచి వివరణలు. దీనికి అంతం ఇంకా చాలా దూరంగానే ఉంది. దీని తర్వాత కలిగే జీవనం కూడా లయం కావటం ఆరంభమవుతుంది. నాకు తెలిసినంతలో అంతిమగతి, ఏకత్వంలో చేరిపోవటమే. కాని ఈ సంగతి గ్రహింపుకు రాదు. జవాబు ఇంతవరకు సరిపోతుందనుకుంటాను. దైవానుగ్రహంతో నీవు చాలా యోగ్యవంతురాలవయ్యావు. నీవలన మిషన్‌కు మంచి లాభం చేకూరుతుంది.

అమ్మగార్కి ప్రణామం అందజేయి.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 483

లఖీంపుర్,
12.05.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. తమరు దయ ఉంచి నన్ను '$E_1$' మీదకు చేర్చారు. అందుకు చాలా చాలా ధన్యవాదాలర్పిస్తున్నాను.

ఈ స్థితి ఎలా ఉందంటే, కస్తూరీ గురించి చర్చ జరుగుతున్నట్లయితే వింటూ ఉంటాను. కాని ఆ చర్చ నా గురించేనని నాకు తెలియటం లేదు. నా లోపల ఏమి అనిపిస్తున్నది అంటే, నేను బయటకు వెళ్ళిపోదామన్నాగాని, తిరిగి వెనక్కు వద్దామన్నాగాని, ద్వారం లేకుండా ఉంటోంది. అంతా బట్టబయలుగా ఉంది. ఎవ్వరైనా రావచ్చు లేదా పోవచ్చు. ఎప్పుడైనా లోపలికి దృష్టి సారించినట్లయితే నేను పై విధంగానే అనుభూతి చెందుతున్నాను. హృదయం మీద దృష్టి నిలిపినపుడు, హృదయం స్వయంగా నా కన్నుగా అయిపోయినట్లు ఉంటోంది. ఇదేమిటో అర్థం కావటం లేదు. ఇంకా ఏమిటంటే, నేను ఎప్పుడూ హృదయాన్ని చూసి ఉండలేదన్నట్లుగాను, 'మాలిక్'ను మాత్రమే చూసినట్లుగాను అనిపిస్తోంది. నేను నా ఇంటిని ఎప్పుడూ చూడలేదు. నా దృష్టి అయితే ఆ ఇంటి యొక్క 'మాలిక్' (యజమాని)నే వెన్నంటి ఉంది. ఇప్పుడు ఇల్లు, వాకిలీ మరిదేని జాడా లేనటువంటి అమాయక స్థితిగా ఉంది. నేను 'మాలిక్' వెంట తిరుగుతూ ఉండటం వలన 'అతని' జ్ఞాపకం యొక్క తపన లేదా తపన యొక్క జ్ఞాపకం ఎక్కడో ఉన్నాయి. కాని అవి ఎందుకు ఉన్నాయో, ఎక్కడ ఉన్నాయో తెలియటం లేదు. ఈ తపన కూడా ఆంతరికంగా ఉండటం లేదు. కాని దీనిని (డివైన్) దివ్యత్వం అని చెబితే సరియైనదిగా ఉంటుంది. హృదయం కూడా ఇప్పుడు దివ్య నివాసంగా ఉంది. అంతకుమించి మరేమీ లేదు. అంతేకాదు, ఇప్పుడు దశ కూడా నాది కాదు అన్నట్లు ఉంది. నా ఆత్మ కూడా ఎక్కడా లేకుండా ఉంది. నా లోపలి దివ్యస్థితి (Divine condition), దివ్యాత్మ (Divine soul) మరియు దివ్య ప్రేరణ (Divine spirit) మాత్రమే ఈ కస్తూరీ పేరుతో ఉన్న ఇంటికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇంకా ఏమిటంటే, దశ కూడా ఇప్పుడు నాది కాకుండా ఉంది, కాని ఎవ్వరి ఆధీనంలోనో ఉంచబడినదిగా అనుభవానికి వస్తోంది.

ఇప్పుడు నా స్థితినిబట్టి 'అతడు' 'ఒక్కడు'గా గాని 'అనేకం'గా గాని కనిపించటం లేదు. ఇప్పుడు అసలు నాకు ఎవ్వరూ కనిపించటం లేదు. ఈ విధంగా ఎవ్వరూ కనిపించకపోయినప్పటికీ కూడా విమలను కేసర్‌గాను లేదా ఉమను విమలగాను ఎందుకు అర్థం చేసుకోవటంలేదో తెలియటం లేదు. (అనగా ఎవరిని చూడనప్పటికీ ఎవరికి వారినే గుర్తించటం జరుగుతోంది) ఎవ్వరి ప్రత్యేక వ్యక్తిత్వంగాని, లేదా సమానత్వంగాని (అందరూ సమానమేనన్న భావన) అనుభూతికి రావటం లేదు. ఎందుకంటే, నాకు ఈ శబ్దాలలో ఉన్న తత్వం లేక అర్థం తెలియటం లేదు. అందరూ కూడా (Immortal) అవినాశంగానే ఉంటున్నారు, అనగా ఎన్నడూ పుట్టినట్లుగా లేదు, మరణిస్తారనీ లేదు. ఈ విధంగా స్వప్నంలో కూడా ఎన్నడూ అనుభవానికి రాలేదు. ఇంకా అర్థంకానిది ఏమిటంటే, స్వప్నం అనేది స్వప్నం అనిపించటం లేదు. ఎందుకంటే, నిద్ర, నిద్రగా అనిపించటం లేదు, మేల్కొనటం, మేల్కొనటంగా అనిపించటం లేదు. ఇలా ఎందుకంటే, ప్రపంచం ప్రపంచంగా అనిపించటం లేదు, శరీరం శరీరమనిపించటం లేదు. ఏమీ అనుభవానికి రావటం లేదు. ఎంతగా నంటె ఇప్పుడు నా స్థితిలో కేవలం ఈ మాత్రమే అని చెప్పటానికి కూడా అవకాశం లేకుండా ఉంది.

బాబూజీ, దశను గురించి ఇంకా ఏమి వ్రాయమంటారు! ఇప్పుడు ఆనందం అనేది ఆనందం కాదు; బాధ, దిగులు యొక్క దశ అని చెప్పటానికీ తగదు. ఇంతకుక్రితం, నేను మరో ప్రపంచంలో ఉంటున్నాను అని వ్రాస్తూ ఉండేదానిని. కాని ఇప్పుడు ఏమైందో ఏమోగాని మరో ప్రపంచం అనే మాటకు అర్థం లేకుండా పోయింది. అసలు నాకు ఏ ప్రపంచమూ లేదు. మానవుడు మాట్లాడతాడు, పాడతాడు. అయినా గాని ధ్వని యొక్క అనుభూతి కలగటం లేదు. ఇలా ఉండి కూడా ఎవ్వరి మాటకైనా సరియైన జవాబే చెబుతున్నాను. ఇంతేకాకుండా భజనలు, కీర్తనలు చేస్తున్నాను, కాని నా కంఠస్వరాన్ని స్వయంగా వినలేకపోతున్నాను. మాటలు చెప్తున్నాను అంటే అబద్ధం చెబుతున్నానో, లేక సత్యం చెబుతున్నానో అటుంచి అసలు మాట యొక్క ధ్వని కూడా ఉండటం లేదు. ఇందువలన నామీద నాకు విశ్వాసం లేకుండాపోయింది. ఎవ్వరైనా అబద్ధం చెప్పినా, నిజం చెప్పినా అన్నీ సక్రమమేనని అనిపిస్తోంది. ఎవ్వరితోనైనా ధ్యానం చేయిస్తున్నపుడు, వారు– మనస్సు ధ్యానంపై నిలవలేదు అని చెబుతారు. ఏమిటి, 'తమరు' సిట్టింగ్ ఇవ్వలేదా అని భావిస్తానుగాని, అలా జరగదు కూడ. 'మాలిక్' తప్పకుండా ధ్యానం కల్పిస్తాడు. నాకు 'అతని'పై నమ్మకం ఉంది. అసలు నేనంటూ లేకపోయినపుడు ఇంకొక ప్రపంచం అను భావన ఎందుకు వస్తుంది. 'జీవించటం' అను మాటయే లేనపుడు దానికింక స్థానం ఎక్కడ ఉంటుంది.

సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 484

లఖీంపుర్,
14.05.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నాకు కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. బాబూజీ, భక్తి గీతాలు వింటున్నపుడు లేదా పాడుతూ ఉన్న సమయంలో 'బాబూజీ' ప్రతిచోట కనిపిస్తున్నట్లు ఉంటుంది. ఆ తర్వాత మళ్ళీ ఏమైపోతుందో తెలియదు. ఈ స్థితి, ఈ విధంగా ఉంటోంది. ఇంకొక స్థితి ఏమిటంటే, **'మాలిక్'ను ఎప్పుడు జ్ఞాపకం చేసుకున్నాగాని, అక్కడే 'అతడి'ని పొందుతున్నాను, 'అతడు' అక్కడే ఇంతకుముందే ప్రతిష్ఠితమై ఉన్నట్లు అనిపిస్తోంది.** నా దశను ఉన్నది ఉన్నట్లుగా వ్యక్తీకరించటానికి తగిన శబ్దాలు దొరకటం లేదు. ఎందుకంటే, ఉన్నది ఉన్నట్లుగా అభివర్ణించటానికి ఒక

ఆలోచన వంటిది కలుగుతున్నదిగాని, అది నా దశకు తగినట్లుగా లేదు. ఒక రకంగా ఇది అజ్ఞానం వంటి దశ. ఈ దశవైపు దృష్టి నిలపాలంటే కూడా అది స్థిరంగా ఉండటం లేదు. 'మాలిక్' అంతటా ఉన్నాడు కాని ఎక్కడా లేడు అన్నట్లు ఈ స్థితి ఉంది. 'మాలిక్'యే జ్ఞాపకాన్ని తన వెంట తీసుకొని వచ్చి తిరిగి తీసుకుని వెళ్ళిపోతున్నట్లు అనిపిస్తోంది. ఒకవేళ దానిని వదిలిపెట్టి వెళ్ళాలన్నా ఎవరో బలం, సామర్థ్యం ఉన్న వారు కావాలి. కాని నేనయితే శక్తిహీనురాలను, బలహీనురాలను. నా నరనరం శక్తిహీనంగా ఉన్నాయి, కాని ఎలాగో తిరగ్గలుగుతున్నాను. శరీరంలో బలహీనతలేదు, మానసిక శక్తి కూడా నాలో కలగటం లేదు. 'మాలిక్' తన పని కోసమని ఇచ్చినపుడు, అది ఉన్న అనుభూతి కలుగుతుంది. ఎప్పుడు పని పూర్తవుతుందో అప్పుడు అది కూడా వెళ్ళిపోతుంది. నేను ఎక్కడో వ్యాపించిపోయినట్లు అనిపిస్తుంది. ఏదో దశ నాలో జీర్ణించుకు పోయినట్లుగాను, మళ్ళీ ఇప్పుడు ఆ జీర్ణించుకపోయిన దశ కూడా అంతమై పోయినట్లుగాను అనిపిస్తోంది. ఇది ఒక రకమైన లయ-అవస్థ అయి ఉండవచ్చునేమో! ఎందుకంటే, ఈ లయ-అవస్థను కూడా 'మాలిక్' తన జ్ఞాపకంతోపాటుగా తీసుకుని వచ్చి మళ్ళీ తీసుకుని వెళ్ళిపోతున్నట్లు నేను చూస్తున్నాను. ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, 'అతడే' నా సర్వస్వంగా ఉన్నాడు. ఎందుకంటే, నేను 'అతడి'ని చూస్తున్నపుడు, దర్శించుకుంటున్నపుడు మాత్రమే నాలో అన్ని దశలూ కలుగుతున్నాయి, అలా కాకుంటే ఏమీ ఉండవు. ఆఖరికి చైతన్యం వంటిది కూడా ఉండదు.

సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 485

షాజహాన్‌పూర్,
20.05.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలు మే 12 మరియు 14వ తేదీలవి చేరాయి. నేను, కేసర్ పరీక్షల వలన ఆమె దృష్టిని ఆధ్యాత్మికత నుంచి కొంత తగ్గించాను. దీని వలన ఆమెకు ఆధ్యాత్మికలో కొంత నష్టం వాటిల్లింది. ఆమె పరీక్షా ఫలితాలు వచ్చాక నేను దానిని సరిచేస్తాను.

ఇప్పుడు నీ ఉత్తరాలకు జవాబు ఇవ్వటం చాలా కష్టంగా ఉంది. ఎందుకంటే, ఇప్పుడు లయ-అవస్థ, తర్వాత దాని (లయ-అవస్థ) యొక్క జీవితం ముగిసిపోతుంది. ఇక్కడ జీవితం అంటె 'బకా'. 'బకా'ను 'తురీయ' అని అంటారు. నా అభిప్రాయం ప్రకారం ప్రతి లయ-అవస్థ తర్వాత ఒక తురీయ వస్తుంది. ఆ క్రమం అలాగే కొనసాగుతుంది. అక్కడ ఒకే ఒక భేదం ఉన్నది అది నాణ్యత మరియు అతినాణ్యత (Fine and Super Fine). నీవు వ్రాసిన ఆధ్యాత్మికస్థితులు అన్నీ (Laya of Laya-awastha) లయ యొక్క లయ-అవస్థను తెలియజేస్తున్నాయి. నీవు ఏయే వ్యక్తుల ఆధ్యాత్మిక ఉన్నతికొరకు పని చేస్తున్నావో, వారందరి ఆధ్యాత్మిక స్థితి బాగుంది.

అమ్మగార్కి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 486

లఖీంపుర్,

23.05.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం అందింది. విషయం తెలుసుకొని సంతోషించాను. ఇక్కడ అంతా క్షేమం. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఉన్న స్థితిని గురించి చెప్పాలంటే, కొద్ది రోజుల క్రితం ఒకరోజున పగలు కన్నులు మూసుకుని పండుకొని ఉన్నాను. ఇంతలో శిరస్సువద్ద నాలుగువైపులా ఒక లావుపాటి పొడవైన సర్పం పండుకుని ఉంది, అది ఒక్కసారిగా మాయమైపోయింది. వెంటనే లేచి వెదికాను కాని కనిపించలేదు. ఇదేమిటో తమకే తెలియాలి.

ఇప్పుడు ఒక స్థితి ఏమిటంటే, పిల్లవాడిని ఒడిలో పెట్టుకుని తిరుగుతున్నాను. అయినా కూడా ఆ బిడ్డ స్పర్శ నాకు అనుభవం కావటం లేదు. అంతేకాదు, ఏదో శక్తి నన్ను (శరీరాన్ని) ఈ ప్రపంచంలోకి లాగి ఉంచుతున్నట్లు ఉంటోంది. దీని మూలంగా కొంత స్వప్నసదృశమైన అనుభూతి లేదా చేతనా ప్రపంచపు పనులు నిర్వహించవలసి ఉంటోంది. ఎందుకంటే, నేను గమనిస్తున్నదానినిబట్టి, డాక్టర్ నా పరిస్థితి గురించి ఏదైనా చెప్పినాగాని లేదా ఎవ్వరైనా అభ్యాసీ తన స్థితిని గురించి చెబుతున్నాగాని, ఏదో శక్తి నా శరీరాన్ని క్రిందికి గుంజినట్లు నేను తరచుగా అనుభూతి చెందుతున్నాను. దానివల్లనే నేను ఇతరుల మాటలు వినగలుగుతున్నాను. ఈ స్థితిని, "ఒకే ఒక్కరు ఉన్నారు, అదేమిలేదు కాని, ఇంకొకరు (అనగా ద్వైతం) ఉన్నారంటే నిందించినట్లు ఉంటోంది అని వర్ణించవచ్చు." ఇంతేగాకుండా, నేను చూస్తూ, వింటూ వచ్చిన దాని ప్రకారం, ఈశ్వరుడు సర్వవ్యాపి, సర్వాంతర్యామి అని. అయితే ఇప్పటి నా స్థితినిబట్టి నాకు 'అతని' గుణగణాలు, విశిష్టతలను గురించి అనుభూతి కలగటం లేదు. ఇంకొక అసలు విషయం ఏమిటంటే, ఈశ్వరుడు లేడు, మరెవ్వరూ లేరు. ఇదంతా భ్రమయే అన్నట్లు ఉంది. వాస్తవంగా ఏమిటంటే, అసలు ఏమి లేనేలేదు. ఏదైనా తయారుచేయటంగాని, చెడగొట్టటంకాని లేవు. అలాగే ఏది తయారుకాలేదు, చెడిపోలేదు. అసలు ఎక్కడా శక్తిగాని, ఇంకేదిగాని లేకపోయినప్పుడు తయారు కావటం, చెడిపోవటాలు ఏమి ఉంటాయి! కాలమూ లేదు, ఆదిమధ్యాంతాలు లేవు. ఇవన్నీ కేవలం భ్రమగానే తలపించాయి. అదంతా 'మాలిక్'కే తెలియాలి. ఇప్పుడు దృష్టి యొక్క మసక వంటిది శుభ్రపడిపోయినట్లు ఉంది.

సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 487

లఖీంపుర్,

27.05.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'మాలిక్' దయతో ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. నా అనుభవానికి వచ్చిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నాకు నిన్నటి నుండి '$E_1$' పాయింట్ యొక్క యాత్ర సమాప్తమైపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడింక 'మాలిక్' చేతుల్లో ఉంది. నేను, క్రితం ఉత్తరంలో నా దృష్టి యొక్క మసక తొలగిపోయింది అని వ్రాసిన తర్వాతనే '$E_1$'పాయింట్ యొక్క యాత్ర సమాప్తమైంది. ఇప్పుడు ఏమైందో ఏమోగాని, 'మాలిక్' అను శబ్దం నాకు అర్థం

లేనిదిగా అయిపోయింది. 'అతని' గురించి తెలుసుకోవాలనే ఆసక్తి కలగటం లేదు. ఆంతరికంగా ఎటువంటి మార్పు లేదు. 'మాలిక్' అనే శబ్దంలో నేను విలీనమైపోయానేమో అన్నట్లుగాను, వ్యాపించిపోయానేమో అన్నట్లుగాను ఉంది.

కేసర్ తమకు ప్రణామం చెబుతోంది. పిల్లలు, సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 488

షాజహాన్‌పూర్,

03.06.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలు రెండూ, మే 23 మరియు 27వ తేదీలవి చేరాయి. కేసర్ ఉత్తరం కూడా అందింది. ఆమె వ్యవస్థలో ఇప్పుడు తీగలు (Strings) ఏమీలేవు, కాని ఒకప్పుడు అవి ఉన్నట్లుగా తెలుస్తోంది. దాని అర్థం అవి సూక్ష్మరూపంలోను, చాలా తేలికగాను ఇంకా మిగిలి ఉన్నాయి అని. కేసర్ వ్రాసిన ఉత్తరంలో మిగిలిన స్థితిని చూస్తే ఆమె క్రమంగా మంచి పురోగతి చెందుతుందని అనిపిస్తుంది. ఆమె స్థితియే ఆమె ప్రశంసకు కారణమవుతున్నప్పుడు దీనిని వివరించటానికి నేను ఎందుకు సమయం వృధా చేయటం!

'$E_1$'కు చెందిన నీ యాత్ర పూర్తయిపోయింది అను నీ ఆలోచన సరైనదే. దీనిని నేను పరిశీలించాను. ఈ స్థానాన్ని చూసి, ముఖ్యంగా దాని పవిత్రతను చూసి నా మనస్సుకు నిన్ను ఈ స్థానంలో మరికొంత కాలం నిలపాలనిపించిన కారణంగా నిన్ను ఇంకా ముందుకు నడిపించలేదు. ఏమైనప్పటికీ ఇంకా ఎక్కువ కాలం నిన్ను ఇక్కడ నిలపను. నీ ఉత్తరంలో "మాలిక్ శబ్దానికి అర్థమే లేకుండా పోయింది" అని వ్రాశావు. అది వాస్తవమే. **నీవు దేనికోసమైతే వెతుకుతున్నావో లేదా ఏ 'మాలిక్' యొక్క అవుసరం నీకు ఉన్నదో అది స్వయంగా నీవుగానే అయిపోతున్నావు.** హృదయంలో 'గురువు' లేదా 'మాలిక్' యొక్క భావన ఉండటమంటే అది కూడా ఒక బంధనమే. "ఈశ్వరుడు ఇత్యాదులు అంతా భ్రమ" అని నీవు వ్రాశావు కాని దానిని సరిగ్గా వివరించలేదు. ఈ అనుభూతి చాలా మంచిది. అన్ని వస్తువులు నాశనమవుతున్నట్టి మహాప్రళయం యొక్క స్థితితో నీవు సంబంధం కల్పించుకున్నావని ఇది తెలియజేస్తుంది. కాని ఇది నిజరూపం దాల్చటానికి ఇంకా చాలా సమయం పట్టుంది. ఎందుకంటే, దీనిలో చాలా స్థితులు మార్పు చెందుతూ ఉంటాయి. ఎప్పుడైతే ఐకమత్యం అను ఆలోచన ముగిసిపోతుందో అప్పుడు ఇది దానంతట అదే జరుగుతుంది. నీవు "మాలిక్‌ను ఎప్పుడు పొందుతాను, ఎలా పొందుతాను?" అని వ్రాశావు. ఈ విషయాలు ప్రేమ అధికమైనపుడు అలా ఉత్పన్నమవుతాయి. ఆ విధంగా ప్రేమించటం మూలంగా అది ఒక విధమైన అలవాటుగా మారి, గమ్యాన్ని చేరుతున్నప్పటికీ దానిని ఇంకా మనం వెతుక్కుంటున్నట్లుగా ఉంటుంది.

**మురీద్ ఖాల్ ఖాల్ హోతేc, ఔర్ ఫిదాయీ హజారోమ్ మే ఏక్I**

ఆరాధకులు అన్నిచోట్లా దొరుకుతారు కాని, భగవంతుని శరణాగతి పొందిన నిజమైన భక్తుడు దొరకటం అరుదు, అని భావం.

అమ్మగార్కి నా ప్రణామం. నీ సోదర సోదరీలకు దీవెనలు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 489

లఖీంపుర్,

6.06.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి ఆనందించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఒక రోజున ప్రార్థన తర్వాత భక్తి గీతాన్ని పాడినపుడు ఏమి జరిగిందో ఏమో కాని, 'తమరు' (శ్రీ బాబూజీ) ప్రతి అభ్యాసీ ఎదుట ప్రత్యక్ష్యంగా నిలిచారు. రెండవ పాటలోని ఈ పంక్తి "జాగే మన్, నేకు విచార్ కరో" అనగా "ఓ మనసా! మేల్కొని, దానిని గురించి ఆలోచించు" అను దానిలో 'జాగృతి' లేదా 'మేల్కొని' అను శబ్దం రాగానే వాస్తవంగా 'శ్రీ చరణాల' నుండి ప్రకాశం వెలువడి, మా అందరివైపు వచ్చినట్లుగాను, అకస్మాత్తుగా అందరి హృదయాలలోను ఈశ్వరీయ ప్రకాశపు జ్యోతి ఒక్కసారిగా వెలిగినట్లుగాను అనిపించింది. ఎందుకోగాని నా హృదయంలో మాత్రం వెలగలేదు. బాబూజీ! నిజం చెప్పాలంటే, 'మాలిక్' మనల్ని ఎంతగా ప్రేమిస్తున్నారో మనం అతడ్ని అంతగా ప్రేమించటం లేదనిపిస్తుంది. నేనయితే ప్రేమ మరియు భక్తి యొక్క పరిభాషనే మరచిపోయాను. ఈ మాటల యొక్క ప్రభావమే నాపై లేనపుడు పరిభాషను జ్ఞాపకం చేసుకుని మాత్రం ఏం చేయను! పూర్వం అయితే నేను ప్రేమ లేదా భక్తి అను మాటలు స్ఫురించగానే లోపల కరిగిపోవటం వంటిది చూస్తూ ఉండేదానను. హృదయం యొక్క అశ్రువులు కూడా స్రవించుతున్నట్లు ఉండేది. కాని ఇప్పుడైతే ఆంతరికం నిశ్చలంగా, చలనరహితంగా ఉండిపోయింది. ఇప్పుడు హద్దులులేని మైదానంలాగ ఉంది. హద్దులులేవన్న అనుభూతి కూడా కలగటం లేదు. అంతా శూన్యంగా కనిపిస్తోంది బయట మరియు లోపల కూడా. హృదయం 'మాలిక్' దర్శనం కొరకు తహతహలాడుతోంది. ఎందుకోగాని మనస్సు మాత్రం తమరు ఎలాగైనా తప్పకుండా ఇక్కడకు వస్తారు కదా అని వేదన చెందటంలేదని గ్రహిస్తున్నాను. మనస్సు నన్ను వదలిపెట్టివెళ్ళి 'తమ'లో కలిసిపోయినట్లు అనిపిస్తోంది. ఈ దశ ఎటువంటిది అంటే, ఇంతకుముందు ఎన్నడూ ఇలా లేదు. నేను ఉండి ఉంటే ఇలా ఉండను. అన్నివైపులా శూన్యతయే వ్యాపించి ఉంది. చెప్పాల్సింది ఏమీలేనపుడు ఇంక ఏమి చెప్పాలి, అంతా తమకే తెలుసు.

బాబూజీ, నా స్థితి ఎలా ఉందంటే, రాయి వంటి కళ్ళెదుట, ఎటువంటి మేలైన చిత్రాలు ఉంచినప్పటికి వాటిని చూడటానికి అంధకారం మినహా మరేమీ లేదు. నేనయితే శూన్యదశ అని వ్రాస్తున్నాను కాని, శూన్యత్వం యొక్క అనుభూతి కలగటం లేదు. ఏమి ఉందో తెలియటం లేదు. ఏదో ఒకటి చెప్పాలి కనుక ఈ మాట చెప్పాను. నా పటారం (మెరుగు) తెరుచుకుని 'మాలిక్' ఎదుట చెదిరిపోయినట్లుగా ఉంది. దీనిని ఈ విధంగా అన్వయించుకోవచ్చు:

**బీతీ తొ బిసర్ గయీ, ఆగేకీ సుధినాహి॥**

**పథరాయీ ఆంఖియాన్ సోం, అబ్ తొ దీఖత్ నాహి॥**

అనగా నేను గతాన్ని మర్చిపోయాను. నా ముందు ఏముందో తెలియదు. నా కళ్ళు రాళ్ళుగా అయిపోయాయి. కనుక నేను ఏమి చూడలేకున్నాను.

'తమరు' నన్ను దయతో '$E_1$' నుంచి తొలగించి '$F_1$' మీదకు చేర్చారు. దీనికి తమకు ధన్యవాదాలు తెలపటానికి నావద్ద అందుకు తగిన మాటలు లేవు. ఇప్పుడు లోపల, బయట అంతటా శూన్య మైదానం ఉన్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు దశలో చదవటానికి ఏమీలేనట్లుగా అనిపిస్తోంది. 'మాలిక్' ఏది అనుభవానికి తెస్తే అదే ఉంటుంది. నాకు చెందిన వారెవ్వరూ లేరు. నేను ఎవ్వరికీ చెంది ఉండలేదు. ప్రపంచం ఉన్నదో లేదో తెలియదు. ఇప్పుడు నేను (Light) జ్యోతికి అవకాశం లేనటువంటి చోటుకు వెళ్తున్నాను. దానిని అంధకారమని చెప్పినా చెప్పవచ్చు. అది కూడా

ఉన్నదో, లేదో తెలియదు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. పిల్లలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 490

షాజహాన్‌పూర్,

11.06.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం 6.06.1955వ తేదీది చేరింది. అది చదివి చాలా సంతోషించాను. మనలో నుండి ఎవరో ఒకరు రాతి కళ్ళతో దర్శించేవారు తయారవుతున్నందుకు 'మాలిక్'కు ధన్యవాదాలు అర్పిస్తున్నాను. వాస్తవానికి బ్రహ్మవిద్య (Spirituality) యొక్క సౌందర్యాన్ని చూడటానికి రాతికళ్ళు యొక్క అవసరం ఉంది. భౌతిక ప్రపంచాన్ని చూసే కళ్ళు మూసుకుపోయినపుడు మాత్రమే పైన చెప్పిన బ్రహ్మవిద్య యొక్క దృశ్యాలు చూడగలరు. భౌతికమైన కళ్ళు మూసుకోవటం అని చెప్పడంలో నా ఉద్దేశ్యం, భక్తుడు, కవి అయిన సూరదాసు తన కళ్ళు పొడుచుకొని భక్తితో తన్మయుడైపోవటం వంటిది కాదు. ఆ సమయంలో అతనికి అది తగినపని అనిపించి ఉండవచ్చు. ఈ విషయం (కళ్ళు ఛిద్రం చేసుకోవటం) ఎక్కడైనా, ఎవ్వరైనా ఆచరించటం జరిగితే దానిని పిరికితనంగాను, పాపకర్మగాను చెప్పాల్సి ఉంటుంది. నీ ఉత్తరంలో పూర్తిగా నీవు వ్రాసిన దానిని పరిశీలించితే, ఇది అమాయకత్వదశగా (Condition of Innocence) నిరూపితమవుతోంది. ప్రేమ అధికమవుతూ ఉన్నప్పుడు అమాయకత్వం వృద్ధి చెందుతుంది. నేను ఇంకొక విషయం తెలుపుతున్నాను. ఒకవేళ ఈ ప్రేమలో పిచ్చితనం వంటిది కలిగితే దానిని ఆత్మ సంబంధమైన ప్రేమ అనతగదు. అసలైన ప్రేమ అంటే మనకు తెలియకుండా మన హృదయంలోపల ఎప్పుడూ దహించుకుపోతూ ఉంటుంది. నీవు శూన్య అవస్థను గురించి వ్రాశావు. దానితోపాటు ఆ శూన్యత యొక్క అనుభవం కలగటంలేదని కూడా వ్రాశావు. ఈ స్థితిని (శూన్యత) ఖాళీతనం (Emptiness) అని చెప్పటం సముచితంగా ఉంటుంది.

నీవు '$F_1$' పాయింట్‌మీద అడుగుపెట్టినట్లుగా నీకు కలిగిన భావన సరైనదే. అక్కడ నీ అంతట నీవే పాదం మోపావు. కాని ఇది ఒక పాదం '$E_1$' మీద, మరోపాదం '$F_1$' మీద మోపి ఉన్నటువంటి స్థితి. నిన్న అనగా జూన్ 10వ తేదీ రాత్రి గం. 11.53 ని॥ల సమయంలో నేను నీ రెండవ పాదం కూడా '$F_1$' మీద మోపునట్లు చేశాను. ఇప్పుడు నీవు '$F_1$' పాయింట్ మీద ఉన్నావు. కేసర్ ఉత్తరం కూడా అందింది. ఆమె స్థితి కూడా బాగా మెరుగుపడుతూ ఉంది. నీవు నీ ఉత్తరంలో చాలా విషయాలు వ్రాశావు. కేసర్ వ్రాసిన దానిలో ప్రేమ యొక్క స్థితిని గురించి ఉంది. ఇటీవల నా ఆరోగ్యస్థితి చాలా బాగుంది. బాగా ఇబ్బందిపెట్టున్న విషయాలు ఏమీలేవు. రెండు పూటలా భోజనం చేస్తున్నాను. డాక్టర్ సేన్ (అభ్యాసీ) నాకు మందులు ఇస్తున్నారు. ఎ.గణేషన్ తిరుచునాపల్లి వెళ్ళాడు. అతనికి సంతృప్తి కలిగిందని నేను భావిస్తున్నాను.

అమ్మగార్కి నా ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 491

లఖీంపుర్,

12.06.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కృపతో వ్రాసిన ఉత్తరం అందింది. తమ ఆరోగ్యం బాగు పడిందని తెలిసి సంతోషం కలిగింది. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశను ఏమనాలి? అది ఒక అద్దంలాగా ఉండి, చూస్తే ప్రతిబింబం కూడా కనిపించనటువంటి దానిలాగా ఉంది. ఆఖరికి నా ముఖం కూడా కనిపించటం లేదు. అద్దం ముందు పగలంతా తిరుగుతూ ఉన్నా కూడా దానిలో ఎటువంటి చిత్రంగాని, ప్రతిబింబంగాని కనిపించటం లేదు. ఈ అద్దం ఎటువంటిది అంటే, అది ఎప్పుడూ తయారు కాబడలేదు, ఎప్పుడూ చెడగొట్టబడదు. అది ఎలా ఉన్నదో అలానే ఉంది.

ఇప్పుడు ఈ స్థితిలో, జనమందరూ "నీవు మంచం ఎందుకు ఎత్తుతున్నావు, పిల్లల్ని ఎందుకు ఎత్తుకుంటున్నావు, ఇంత బరువు మోయవద్దు" అని చెప్పినట్లు ఉంది. కాని నా దశను చెప్పాలంటే, నేను అసలు బరువునే స్పృశించలేనట్లు అనిపిస్తోంది. ఇంతేగాకుండా నేను అసలు మాట్లాడటమే లేదు. ఒకవేళ ఎప్పుడైనా మాట్లాడి ఉన్నానేమో కాని తెలియదు. ఎప్పుడైనా ఏదైనా మాట్లాడుతానేమో అదీ తెలియదు. నా వద్ద వాక్కు, శబ్దం, భావం మరియు భావన ఏమీలేవు. బాబూజీ, నాకు ఎప్పుడూ రాత్రి కలగడం లేదు, పగలు రావటమూ లేదు. స్థితి అనేది ఏదీలేదు, స్థితిలేమి అని చెప్తామంటే అదీ తెలియదు. స్థితిని స్వచ్ఛంగానే ఉందని చెప్తామంటే అది అనుభూతికి రావటంలేదు. స్వల్పమైనది అని అందామా అంటే దానికి కూడా అర్థం లేకుండా ఉంది. స్థితి, ప్రభావం చూపలేనిది అని చెప్పాలంటే చెప్పవచ్చు. పోనీ తురీయావస్థగా చెబుదామా అంటె, అదేమిటో నాకు ఏమాత్రం తెలియని దానిగా ఉన్నాను.

ఎందుకో తెలియదు కాని, నేను తరచుగా చూస్తున్నది ఏమిటంటే, స్వయంగా నేను మాట్లాడుతున్నా కూడా తీవ్రమైన కుదుపుకి (Shock) గురవుతున్నాను. నా మాటలను నేను స్వయంగా వినలేకపోతున్నాను. అదేమిటోగాని, నా ఆత్మ కరిగిపోయి విస్తరించిపోయినట్లు అనుభూత మవుతోంది. ఇందువలన లోపల బయట, ప్రతికణం ఆత్మగానే అయిపోయినట్లు ఉంది. నీ ఆత్మను నీవు సాక్షాత్కరించుకోవాలి అని ఎవరో చెప్పినట్లు వినిపించినపుడు, అసలు నాలో ఆత్మయే లేనపుడు నేనింక ఎలా సాక్షాత్కరింపచేసుకోవాలి అన్న భావన కలుగుతుంది. వాస్తవానికి "సాక్షాత్కారం" (Realisation) అను పదం నాకు అర్థం లేనిదిగా అనిపిస్తోంది. ఇది నాకు ఏమి చేయాలో, ఏమి చేయకూడదో తెలియని (Ignorant condition) అమాయక స్థితిగా ఉంది. నేను 'మాలిక్'కు చెందిన దాననే, దీనిని నేను అంగీకరించియే ఉన్నాను. అలా కాకుంటే, ఇది కూడా నాకు ఎందుకు అనుభూతి కలగటం లేదు.

ఇప్పుడు అర్థంకాని విషయం ఏమిటంటే, హృదయం మీద ఏదో (Shock of Vibration) అఘాతం యొక్క ప్రకంపనం వంటిది ఏర్పడి ఉంటోంది. నేను ఏ వస్త్రం ధరించినా దాని దారంగాని, ఏదైన వస్తువు నా శరీరాన్ని తాకినపుడుగాని దానిలో శ్రీ బాబూజీయే ఇమిడి ఉన్నారని అనిపిస్తోంది. అలాగని నావైపు పరిశీలించుకుంటే, నాలో శ్రీ బాబూజీ జాడ లేకుండా ఖాళీగా ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. నా హృదయంలో మూలమూలన తిరిగి వచ్చినాగాని శ్రీ బాబూజీని పొందలేకపోతున్నాను. ఇప్పుడు అశాంతి లేదా దిగులు నన్ను వెతుక్కుంటూ వెంటాడుతున్నట్లు ఉంది. నన్ను నేనే గుర్తుపట్టలేకపోయినపుడు, నేను 'వారి'ని ఎక్కడని గుర్తించగలను! అది ఎంతగానంటే, నేను నా ఫొటోను కూడా గుర్తించలేకపోతున్నాను. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు, కేసర్ ప్రణామం చెబుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 492

లఖీంపుర్,

15.06.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అంతా కుశలం. అక్కడ కూడా తామందరు కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

నిన్న 4,5 గంటలపాటు శ్రీ బాబూజీ గురించిన విషయాలు తావూజీ ద్వారా నేను వినటం జరిగింది. ఎందుకోగాని మనస్సులో ఆనందం కలగాల్సిందిపోయి ఒక విచిత్రమైన ఉదాసీనతయే వ్యాపించి ఉంది. మనస్సులో ఆ ఉదాసీనత ఎంత గాఢంగా పాతుకుపోయింది అంటే, దానికి (మనస్సు) అసలు సంతోషపడటం అనేదే తెలియదేమో అన్నట్లు ఉంది. పైకి మాత్రం అప్పుడప్పుడు సంతోషంగా ఉంటుంది. కాని దానిని 'మాలిక్' మాత్రమే ఉంచుకొంటాడు. అయితే బాహ్య ఆనందం భిన్నమైనది. అది మనస్సుకు సంబంధించినది కాదు. ఎందుకంటే, ఆ ఆనందమనేది నాకు తెలియకుండా ఉంది. ఇంకా ఏమయ్యిందో ఏమోకాని, ప్రార్థన, భక్తిగీతాలు, పూజ వంటివన్నీ ఒక సాధారణ దినచర్యలాగానే అయిపోయాయి. కళ్ళు శిలగా మారిపోయినట్లు కూడా తెలియదు. ఎందుకంటే, దీని అనుభూతి కూడా కలగటంలేదు. తమ ఉత్తరం చదివినా కూడా ఏమీ అర్థం కావటం లేదు. ఇప్పుడు ఉన్న దశలో శాంతి, అశాంతి రెండూ లేవు కాని హృదయంలో ఒక రకమైన బాధ ఉంటోంది. ఆ బాధ కనుక అనుభూతి చెందితే, దానిని అశాంతి అనిగాని, దిగులు అనిగాని చెప్పవచ్చు. అది కనుక అనుభవంలోకి రాకపోయినట్లయితే దానిని శాంతి అని అనండి. నేనొక చీకటి నగరంలో తిరుగుతున్నట్లు చూస్తున్నాను. దీనిని మాటమాత్రంగా చీకటి అని చెబుతున్నాను. ఇది ఎటువంటి నగరం అంటే, దీనిలో ఏది లేనటువంటిదిగాను, ఎటువంటి భీకరశబ్దంగాని, భయం కలిగించేదిగాని లేదు. ఆ అంధకార నగరం 'నా రూపం'గా మారిపోయినప్పుడు, అసలు భయం ఎందుకు కలుగుతుంది. అక్కడ ఏమి లేనపుడు, నా హృదయం ఖాళీతనంలో సంతృప్తి చెందుతోంది. ఆ 'ఏదైనా' అను దానిని నేను పరిశీలిస్తూ ఉన్నపుడు, అది 'మాలిక్' యొక్క సహజమైప కృపగా అనిపిస్తోంది. ఆ కృప ఏమిటంటే, ఆ ఖాళీ నగరం నాకు ఒక (Soothing way) సుతిమెత్తని మార్గంలాగా ఉంది. నా కథ ఇంతటితో సమాప్తమైపోయింది. ఎందుకంటే, చెప్పటానికి అంటూ ఏ విషయాలు లేవు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. సోదర సోదరీలైన చిన్నవారికి నా ప్రేమాశీస్సులు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య -493

షాజహాన్‌పూర్,

19.06.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలు 1955 జూన్ 12 మరియు 15వ తేదీలవి చేరాయి. నేను ఈ రెండింటికీ కలిపి జవాబు వ్రాస్తున్నాను. నీ ఉత్తరాలు చదివాక ఒక వాక్యం జ్ఞాపకం వచ్చింది. దానిని ఎవరు చెప్పారో జ్ఞాపకం లేదు. బహుశా దీనిని కబీరు వ్రాసి ఉండవచ్చు. అది, "అవును, కాదుల మధ్య ఏదైతే ఉందో **అది** ఉంది" అని. ప్రపంచంలో రెండు స్థితులు - ఉష్ణం, శీతలం ఉన్నాయి. వీటిలో ఏది ప్రధానమైనదో దానిలోనే మనం ఉన్న భావనతో ఉంటాము. ఎప్పుడైతే వాటి ప్రాధాన్యత అంతరించుకు పోతుందో అప్పుడు మిగిలి ఉండేది 'సత్యత్వం'

(రియాలిటి). దానిలో నీ యాత్ర ప్రారంభమైపోయింది, కాని అది వాస్తవికత (రియాలిటి) కంటె భారంగా ఉంది. నీ ఉత్తరంలోని ఈ విషయం– "నాకు రాత్రి ఎప్పుడూ రావటం కాని, పగలు ఎప్పుడూ ప్రవేశించటం కాని లేకుండాపోయాయి" –నాకు బాగా నచ్చింది. అంటే నీలో సమత్వస్థితి (Balanced condition) నడుస్తూ ఉంది. నీ స్థితిని సమత్వస్థితిగా చెప్పవచ్చు, కాని భస్మంలో ఇంకా కొంత వేడిమి (నివురుగప్పిన నిప్పులాగ) మిగిలి ఉంది. అయితే దానిని గుర్తించటం చాలా కష్టం. "హృదయం మీద ఏదో (Shock of vibrations) స్పందన యొక్క అదురుపాటు ఉన్నట్లు అనిపిస్తోంది" అని నీవు వ్రాశావు. అది నా హృదయం యొక్క స్పందనలు నీ హృదయంలోకి చేరుతూ ఉండటం కావచ్చు. నేను దీనిని ఎందుకు చెబుతున్నానంటె, నేను ఆధ్యాత్మికంగా బాగా ఉన్నతి పొందినప్పుడు ఇటువంటి స్పందన (Vibration) నా గురు మహరాజ్ నుంచి వచ్చినటువంటిది అనుభవమవుతూ ఉండేది. "నా ఆత్మ పూర్తిగా కరిగిపోయింది" అని నీవు వ్రాశావు. అయితే దీనినిబట్టి నీ ఆత్మ ఇంకా పూర్తిగా కరిగిపోలేదు. ఇది గమ్యానికి చివరి స్థానం. ముమ్ముందు అది ఇంకా ఎక్కువుగా సూక్ష్మమవుతుందని ఆశిస్తున్నాను. కాని అది కూడా ఇంకా ప్రారంభం కాలేదు. "సాక్షాత్కారం అను శబ్దానికి అర్థం కాని, విలువకాని లేకుండా పోయింది" అని కూడా నీవు వ్రాశావు. ఇది సరైన అభిప్రాయమే. ఎందుకుంటే, ప్రేమలో మునిగిపోయినవానికి ఆ ప్రేమ యొక్క ఉద్దేశ్యం ఏమిటో తెలియదు.

జూన్ 15వ తేదీ ఉత్తరానికి జవాబు పూర్తయ్యింది. నీ లయ–అవస్థ రోజు రోజుకు వృద్ధి చెందుతూ ముందుకు సాగిపోతోంది.

అమ్మ మరియు చౌబేజీకి ప్రణామం. సోదర సోదరీ లందరికీ ఆశీర్వాదాలు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 494

లఖీంపుర్,
21.06.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసినది ఏదైతే ఉందో అది ఈ దీనురాలిపై తమ యొక్క కృపా ఫలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ! ఇప్పుడు ఈ స్థితి ఏమిటోగాని, ఏదో విధంగా ఎప్పుడూ నిద్రపోవాలని, మేలుకోకూడదని మనస్సు కోరుతోంది. ఎందుకంటే, మేల్కొన్నట్లయితే ఏదో అశాంతి కలుగుతుంది, అది బాగుందని అనిపించదు. నిద్రలో ఉన్నంత సౌఖ్యం మెళకువగా ఉన్నప్పుడు ఉండదు.

నాకు ఏమైందో తెలియదు. ఒకటి, రెండు రోజులు ఏ పనియైనా చేయకుండా ఉంటే, ఆ పని నాకు అసలు తెలియదని అనిపిస్తోంది. ఉదాహరణకు రెండు రోజులు వంటగదికి వెళ్ళకుండా ఉంటే, రోటి ఎలా తయారుచేయాలో తెలియదు అనే ఆలోచన వస్తోంది. కాని ఎప్పుడైతే వంటగదిలో ప్రవేశిస్తానో వెంటనే 'మాలిక్' సహాయంచేసి అన్ని సక్రమంగా ఉంచుతాడు. ఒకరోజు స్నానం చేయకపోతే ఎప్పటికి స్నానం చేయటానికి ఇష్టం ఉండటం లేదు. ప్రతి పాయింట్‌కు మైదానం యొక్క వ్యాప్తి నా ఊహకు అందటం లేదు. అది దానికి అతీతంగా ఉంటోంది. నాకు పురోగమనం యొక్క చింత ఉన్నదా లేక నిశ్చింతగా ఉన్నానో తెలియనటువంటిదిగా నా స్థితి ఉంది. పాయింట్ ఇంకా పూర్తిగా విచ్చుకోలేదని అనిపిస్తోంది. అది ఏమిటోగాని ఆత్మిక ఆనందం కూడా ఎన్నడూ కలగటం లేదు. అలాగని ఎప్పుడూ కోపంగాని, ఇంకా ఏదైనా చెడుమాటగాని రావటం లేదు. ఈశ్వరుని కలిస్తే చాలా ఆనందం కలుగుతుందని అందరూ అంటూ ఉంటారు, కాని నాకయితే దానిలో కూడా ఆనందం ఉంటుందో లేదో తెలియదు. నాకు ఎటువంటి కోరికా

లేదు. ధ్యానం కూడా నేను చేయించగలుగుతున్నానో లేదో తెలియదు.

శిరస్సులో ఎక్కువగా పాపిటికి ఎడమవైపున ముందుకు 5 వ్రేళ్ళ పరిమాణంలో కొంత బరువుగా ఉన్నట్లుగా నాకు అనుభూతి కలుగుతోంది. దానితోపాటు కొంత ప్రకంపనం మరియు గిలిగింత (సురసురమనటం) చెప్పనలవికానంతగా ఉంటోంది. ఇదే విధంగా పాపిటికి కుడివైపున కొంచెం తక్కువ స్థాయిలో ఉంటోంది. దాని ప్రభావం శిరస్సు అంతటి నరాల్లోను ఉంటోంది. దీని మూలంగా అప్పుడప్పుడు చాలా తేలికపాటి బాధ, ఏదో ప్రాకుతున్నట్లుగా శిరస్సులోని నరాల్లో ఉంటోంది. శిరస్సుకు ముందు భాగంలో అధికంగాను, వెనుకభాగంలో కొంచెం తక్కువగాను ఉంటోంది. పాపిటి తిన్నగా ఎక్కడ అంతమవుతుందో అక్కడ గుంట లాంటిది ఉంటోంది. శిరస్సు యొక్క అన్ని ఎముకల్లోను, నరాల్లోను ఎంతగానో ప్రకంపనం ఎప్పుడూ ఉంటోంది. ఒక్కటి, శిరస్సు మధ్యలో ఉన్న పాపిటికి ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద ఎముకలలో వెలుగు నాడి ఉన్నట్లుగాను, ఈ కారణంగా ఎంతోకొంత వెలుగు శరీరం యొక్క మొత్తం ఎముకలలోను, నరాల్లోను ఉంటున్నట్లుగాను అనుభూతమవుతోంది. అయితే ఈ వెలుగు చాలా తక్కువ స్థాయిలో ఉంటూ మెరుపులు కల్పించటం లేదు.

బాబూజీ, ఇప్పుడు ఈ స్థితి ఏమిటంటే, సమస్త ప్రపంచం యొక్క జడ చైతన్యాలు, పశుపక్ష్యాదులు అన్నింటి యొక్క అస్థిత్వం (ఉనికి) సమానంగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఇంతకు దశ యొక్క అసలు సంగతి ఏమిటంటే, దాని నుంచి కూడా, 'ఉనికి' మరియు 'ఒకటి' అను రెండు శబ్దాలను తొలగించాల్సి ఉంటుంది. అందరూ నాకు నేను శ్రద్ధ చూపటం లేదు అని అంటారు. కాని నేను ఎవరితో చెప్పను, ఏమని చెప్పను, జీవితం ఒక ఆట వంటిదని, అది ముగిసిపోయింది అని. ఇంకా చెప్పాలంటే, మృత్యువు ఒక సాకు (వంక) వంటిది, అది కూడా అంతమైపోయింది. ఇంత దీర్ఘమైన జీవితంలో ఈశ్వరుని యొక్క జ్ఞాపకం వచ్చిందో లేదో, ఎప్పుడైనా వస్తుందో కూడా తెలియదు. ఇదంతా తమకే తెలియాలి, తమ నిర్వాకానికి తెలియాలి, నాకు ఎందుకు వచ్చింది.

సోదర సోదరీలైన చిన్నవారికి నా ప్రేమాశీస్సులు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 495

లఖీంపుర్,
29.06.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరూ క్షేమం. తమరు కూడా క్షేమమే అని భావిస్తున్నాను. నా గ్రహింపు వచ్చినంతలో నా ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఎలాంటిది అంటే, మనం ఉన్నాము అనుకున్నట్లయితే దానికి ఒక కారణంగాని, ప్రమాణంగాని లేదు. నేను చూస్తున్న ఈ దశలో ఈశ్వరుడు ఉన్నాడా లేదా అను దానికి ప్రమాణం ఉన్న ప్రదేశం కోసం చూస్తున్నాను. ఇంతేగాదు, ఇప్పుడు ప్రతిదీ నాకు నిరాధారమైనదిగానే అయిపోయినట్లు ఉంది. ఇప్పుడు ఈ దశ నుండి ఈశ్వరుని యొక్క రంగు ఏదైతే ఉందో అది కూడా తుడిచిపెట్టుకుపోయింది. ఇంతకుముందు అయితే ఈశ్వరుడు ప్రతి దానిలోను, బయట, లోపల, జడ చైతన్యాలు, అన్నింటిలోను నెలకొని ఉన్నట్లు అనిపించేది. కాని ఇప్పుడు ఈశ్వరుడు ఎక్కడా ఉన్నట్లు అనిపించటం లేదు. నేను ఉన్నాను అనుదానికి ఏదైనా కారణంగాని, ప్రమాణంగాని లేదు.

ఇప్పుడు ఈ స్థితిలో ఇప్పటివరకు ఉన్నదేదో అది కూడా అంతమైపోయింది. ఉన్నది ఏది, అంతమైనది ఏది అను తెలివి లేకపోయినప్పటికీ అలా జరిగిపోయింది. ఒక అతిసాధారణ అభ్యాసీ యొక్క దశ కూడా నా దశ కంటె

ఉన్నతంగా అనిపిస్తోంది. ఇప్పుడు ఉన్న స్థితి ఎలా ఉందంటే, ఎప్పుడూ ఆకలి వేయటంగాని, పొట్ట నిండటంగాని ఉండటం లేదు. ఒక సాధారణ అభ్యాసీలో ప్రేమ నిండుగా ఉన్నట్లు గమనిస్తున్నాను కాని అది లేనిదానిగానే నేను ఉంటున్నాను. ఎంత పని ఉన్నా, ఎంతమంది జనం వచ్చినా, 24 గంటల్లో ఒక్క సెకను అయినా తీరిక దొరికినా, దొరకకుండా ఉన్నాగాని (Disturbance) అంతరాయం అనేది ఉండటం లేదు. ఇది అటువంటి దశగా ఉంది. శరీరానికి సంబంధించినంతరకు అంతరాయం అను మాటయే వ్యర్థంగా అయిపోయింది. నేను ఏమీ చేయటం లేదన్నపుడు, ఈ అంతరాయం అనే ప్రశ్నేలేదు.

కేసర్ తమకు ప్రణామం చెబుతున్నది. సోదర సోదరీలైన చిన్నవారికి నా ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 496

షాజహాన్‌పూర్,

03.07.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు 1955 జూన్ 21 మరియు 29వ తేదీలవి అందాయి. నేను నీ ఆధ్యాత్మిక యాత్రను '$F_1$' పాయింట్‌లో పూర్తి చేయించలేకపోయాను. నేను కొంచెం ఆలోచించాను, దాని ఫలితంగా అక్కడ శక్తి వ్యాపించింది. ఇప్పుడు నీ ఆధ్యాత్మిక యాత్ర త్వరలోనే ప్రారంభమవుతుంది. నీ ఉత్తరాలకు జవాబు ఇవ్వటం చాలా కష్టమైపోయింది. ఎందుకంటే, ఇప్పుడు మంచి లయ–అవస్థ మరియు తర్వాత దాని తురీయ–అవస్థ ప్రక్క ప్రక్కన వస్తూ ఉన్నాయి. ఇది ఎలాంటిదంటే, దీనిని వివరించటానికి మాటలు చాలవు. శిరస్సులోపల అనేక స్థానాలు ఉన్నాయి. నీలో కలిగే గగుర్పాటు, స్పందన, దానిలోని స్థానాలు జాగృత అవస్థలోకి వస్తున్నట్లుగా తెలియజేస్తున్నాయి. నీ శిరస్సుకు ఎడమవైపున 5 వ్రేళ్ళు ఉన్నట్లుగా తెలుస్తున్నది ఏమిటో నాకు ఇప్పుడు అర్థమైంది. ఇక్కడ మిరుమిట్లుగొల్పే కాంతి కలిగిన శక్తి ఉంది. అది వశంలోకి రానంతవరకు, గురుమహరాజ్ యొక్క నియంత్రణ హస్తం ఉంటుంది. అలా ఎందుకంటే, అది వశంలోకి రాబోయేముందు దానిపై పట్టుసడలించినట్లయితే అభ్యాసీకి కూడా నష్టం కలిగిస్తుంది. అక్కడ ఝుంకారం ఉండటాన్నిబట్టి, ఆ స్థానంలో నిద్రావస్థలో ఉన్నటువంటిది ఇప్పుడు మేల్కొంటుంది. ఈ నిద్రావస్థలో ఉన్నదానిని గురించి నీకు ఇంతకుపూర్వమే ఉత్తరంలో వ్రాశాను. నీ తలలో గుంటలాగా ఉన్నదాని గురించి నేను ఇంతకుపూర్వమే ఒక ఉత్తరంలో వ్రాశాను. శిరస్సు వెనుక అనుభూతికి వస్తున్న కంపనం కలిగిన ప్రాంతమే (Central Region) కేంద్ర మండలం. మన విధానంలో (Reflection) ప్రతిబింబం దాదాపు అన్నిచోట్ల పడుతూ ఉంటుంది. అందరూ ఒకే జాతికి చెందడమనేది వాస్తవికత (రియాలిటి)లో తగినంత ఈదగలరని సూచిస్తుంది. నీవు ఒక ఆశ్చర్యకరమైన విషయం గురించి ప్రశ్నించావు. అది "ఎప్పుడైనా 'మాలిక్' యొక్క జ్ఞాపకం వచ్చిందా, లేదా?" అని. కోల్పోయినవారిని జ్ఞాపకం చేసుకుంటున్నప్పుడు, జ్ఞాపకం చేసుకుంటున్నవారు కూడా కోల్పోతారు. కోల్పోయినవారిని వెదుకుతూ మానవుడు తనకు తాను కోల్పోతాడు. ఇది అనంతం యొక్క అంచనాకు సిద్ధపడుతున్నట్లుగా శుభవార్త నందిస్తుంది. ఈ ప్రశ్న నన్ను నీవు అడుగుతున్నావు. అది ఎలా ఉందంటే, పుట్టుకతోనే కళ్ళులేని గ్రుడ్డివాణ్ని "కాంతి అంటే ఏమిటి?" అని ప్రశ్నించినట్లుగా ఉంది. నీవు వ్రాసిన మరొక విషయం– "నేను ఉన్నాను, అని చెప్పటానికి కారణంగాని, ప్రమాణంగాని ఏమీలేదు" అని. ఇది బాగానే ఉంది. అయితే నీవు ఇప్పటికీ ఉన్నావు, కారణం ప్రమాణం తెలిసి ఉన్నా, లేకపోయినా సరే. నీ ఉనికి యొక్క జ్ఞానం చాలావరకు హరించిపోవటమనేది వేరే విషయం. ఇది నీ అస్థిత్వాన్ని కోల్పోతున్న స్థితి. జీవించి ఉన్న వానికి దర్శనమంటూ ఉంటుంది. కాని జీవితం కోల్పోయినవానికి అనగా

మరణించినవాని స్థితివంటి దానిలో ఉన్నవానికి రంగు మారిపోయినట్లుగా మాత్రమే అనుభూతమవుతుంది. ఇంకా చెప్పాలంటే, స్వయంగా తన్నుతాను కోల్పోయినవానికి అంతా కోల్పోయినట్లుగానే అనిపిస్తుంది. అది "తాను మునిగితే జగమంతా మునిగిపోయినట్లు"గా ఉంటుంది.

శ్రీ విశ్వనాథన్, మహర్షి రమణ యొక్క మహాయోగం సాధన చేస్తూనే, దానితోపాటుగా మన సహజమార్గ సాధన అభ్యాసం కూడా చేస్తున్నారు. వారికి కూడా నేను ఎంతోకొంత చేస్తున్నాను కాని దానికి ఆయన సహకారం చాలా తక్కువగా ఉంది. మిగిలినవారు అందరూ పురోగమిస్తున్నారు. జూలై 5వ తేదీన డాక్టర్ వరదాచారిగారి ఉత్తరం వచ్చింది. వారి స్థితిని గురించి నీవు తెలుసుకోవటానికి ఆ ఉత్తరం నకలును నీకు పంపిస్తున్నాను. ఆ ఉత్తరం (Commitment) కట్టుబడిగా ఉండకుండా చాలా సంరక్షణగా ఉంటుంది.

అమ్మకు నా ప్రణామం. నీ సోదర సోదరీలకు నా దీవెనలు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

**కస్తూరీగారి గమనిక:** నేను పాయింట్ '$F_1$' లో ప్రవేశించటంతోనే 4వ వలయంలో యాత్ర ప్రారంభమైంది అని శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పారు.

## ఉత్తరం సంఖ్య - 497

లఖీంపూర్,
2.07.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు దశ ఎలాంటిది అంటే, దానికి పెనుగాలులుగాని, తుఫానుగాని దరిజేరనట్లుగాను, దశకు చల్లని చిరుగాలి కూడా సోకనట్లుగాను ఉంది. ఆత్మిక దశ, ప్రాపంచిక దశ ఒకటిగానే అయిపోయాయి. నేను 'మాలిక్'కు ఈ ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నానా లేక ఇంకేమైనా అనేది నాకు అర్థం కాకుండా ఉంది. ఎందుకంటే, నా స్థితి ప్రాపంచికమైనది అనిగాని, ఆధ్యాత్మికమైనది అనిగాని చెప్పటానికి వీల్లేకుండా ఉంది. ఒక మార్పు కలగని స్థితియే నడుస్తున్నట్లుగా నేను చూస్తున్నాను. ఇంకొక స్థితి ఏమిటంటే, నా శరీరం ఇంటి నుంచి పారిపోవటానికిగాని, ఇంటిలోనే ఉండటానికిగాని ఇష్టపడటం లేదు. ఇది ఎటువంటి ఖాళీతనం వంటి దశ అంటే, దానిలో శూన్యత (లేక ఏకాంతం) అనేది లేదు. ఎందుకంటే, నేను పూర్తిగా ఖాళీ మైదానంలోనే వ్యాపించి ఉన్నాను. అయితే స్వయంగా నా రూపమే ఇటువంటి ఖాళీదిగా అయిపోయింది. అందులో తరచుగా నావల్లనే నాకు భయం కలుగుతున్నట్లు అనిపిస్తోంది. మాట్లాడటానికి శరీరం ఎంతమాత్రం ఇష్టపడటం లేదు. నేను ధ్యానం ఎప్పుడూ చేయనప్పటికీ, అభ్యాసులచేత కూడా ధ్యానం ఎప్పుడూ చేయించనట్లుగా ఈ దశను చూస్తున్నాను. నావద్దకు ధ్యానం చేయటం కోసం వచ్చే జనం ప్రాణాహుతిని పొందుతున్నారో, లేదో తెలియటం లేదు. నాకు ఏమీ తెలియకుండా ఉంది. ఇంక దశ అంటారా, అది నా (Example) నమూనాగా ఉంది. ఇలా ఉంటే, నేను ఏం వ్రాయాలి, ఏమి చెప్పాలి?

కేసర్ తమకు ప్రణామం చెబుతున్నది. సోదర సోదరీలైన చిన్నవారికి నా ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 498

లఖీంపుర్,

9.07.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ఉత్తరం ద్వారా తమ గురించిన సమాచారం తెలిసింది. తమరు ఆరోగ్యంగా ఉన్నారని తెలుసుకుని సంతోషించాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో వ్యాప్తి అనేది లేనట్లు అనిపిస్తోంది. ఎందుకంటే, ఇప్పుడు వ్యాప్తి చెందగలిగినంత శక్తి నాలో లేకపోయింది అని అనుభూతి చెందుతున్నాను. ఇది కూడా ఎందుకంటే, నాలో ఇప్పుడు దశను గురించి ఆలోచన చేసుకునేంత స్తోమత కూడా లేనట్లుగా గుర్తిస్తున్నాను. ఇప్పటివరకు ఈ రెండు విషయాలు అనగా శక్తి మరియు వ్యాప్తి అనేవి నా ఎదుట మసకగా ఉన్నప్పటికీ, ఇప్పుడు పూర్తిగా సాదాగాను, స్థిరంగాను ఉన్నటువంటి దశయే ఉంది. ఈ స్థిరత్వం యొక్క దశ ఎటువంటిదంటే, లోపల మరియు బయట కణాలు అన్నీ స్థిరత్వ రూపమే దాల్చినట్లుగా అనిపిస్తోంది. అవి ఉన్నవి ఉన్నట్లుగా ఉండిపోయాయి. అవి కేవలం నా కొరకే జడత్వం వహించి ఉన్నాయి. ఎందుకంటే, మొక్కలు, చెట్లు, భూమ్యాకాశాల మాదిరిగా అన్నీ జడత్వం దాల్చినట్లుగా నేను గ్రహిస్తున్నాను. నా లోలోపలి ప్రతి అణువూ, కణమూ, చివరకు శరీరం యావత్తు జడరూపం దాల్చినట్లుగాను, కనీసం గుండె దడ వంటిది కూడా గుర్తించలేనంతగాను అయిపోయాయి. ఎవరైనా 'మాలిక్' గురించిన చర్చ జరిపినపుడు ప్రతి ఒక్కరు ఆనందంగా ఉన్నా కూడా నేను మాత్రం ప్రభావితం కాకుండానే ఉంటున్నాను. ఈ ఆలోచన నా దృష్టికి రానప్పటికి ఒకసారి మా ఇంటిలోనివారు అందరు ఏదో చర్చించుకుంటున్న సందర్భంలో నేను ఉన్న స్థితిని గురించి నాకు చెప్పారు. అందుకని తమకు వ్రాస్తున్నాను. నా స్థితి ఎలా ఉందంటే, ప్రభావరహితంగా ఉన్నానని చెప్పినప్పటికి ఎటువంటి ప్రభావం నా మీద ఉండటం లేదు. నాకయితే అన్ని ప్రభావాలు సరియైనవేనని అనిపిస్తోంది. ఇంకా ఏమిటోగాని, నిర్గుణ, నిరాకారం గురించిన చర్చ జరిపినపుడు, ఆ నిర్గుణ, నిరాకారాలు నన్ను తమలోనే విలీనం చేసుకుని నాకు వాటి రూపమే ఆపాదించినట్లు అనిపిస్తోంది. అదే చర్చ భగవంతుని గురించి కాకుండా ఉంటే నాకు ఏమీ అనిపించటం లేదు.

నిన్న నేను సంగీత పాఠశాల నుంచి వస్తూ ఉండగా, ఒక్కసారిగా శిరస్సు వెనుక, దేనినైతే తమరు సెంట్రల్ రీజియన్ పాయింట్‌గా చెప్పి ఉన్నారో, ఆ పాయింట్‌కు సూటిగా ఉన్న పాయింట్ నుంచి మూడు వ్రేళ్ళు ఎడంగా ఏదో నరంగాని లేదా మరేదైనాగాని టక్కున తెగిపోయినట్లు అనిపించింది. దాని తీవ్రత ఎంతగా ఉందంటే, 5 నిమిషాలపాటు ఆ పాయింట్‌ను అదిమిపట్టుకుండిపోయాను. వేరే బాధ ఏమి లేదు. అదే స్థానంలో ఈ రోజు అటువంటిదే కొంచెం స్వల్పంగా కలిగింది. ఇంతే సంగతులు. సోదర సోదరీలైన చిన్నవారికి నా ప్రేమాభిమానాలు. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 499

షాజహాన్‌పూర్,

14.07.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం 08.07.1955వ తేదీది అందింది. దానిలో కేసర్ కూడా తన స్థితిని గురించి వ్రాసింది. ప్రహ్లాద్‌గారివద్ద ఉన్న (Logic) తర్కశాస్త్రం, (Psychology) మనోవిజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలలో

మనోవిజ్ఞానశాస్త్ర పుస్తకాన్ని నేను చదువుతాను. కేసర్ స్థితి చాలా బాగా సాగుతోంది. అయితే ఆమె శారీరక వ్యవస్థలో (System) ఇంకా కొంత అలజడి (రోగప్రభావం) ఉంది. అది నెమ్మది నెమ్మదిగా నయమైపోతుంది. కేసర్ ఉత్తరం ద్వారా, నీ ఆరోగ్యం సరిగ్గాలేదని తెలిసింది. నీవు బ్రహ్మాండ మండలం నుంచి శక్తిని తీసుకోవటం నిలిపివేశావా? ఒకవేళ ఆ పని నిలిపివేసినట్లయితే ఈ రెండు విధానాలు మళ్ళీ ఆచరించు. ఒక వారం రోజుల తర్వాత నీ ఆరోగ్య పరిస్థితిని తెలియజేయి. దైవేచ్ఛ కలిగితే నీవు వారం రోజుల లోపునే ఆరోగ్యవంతురాలవవుతావు.

నీవు నా పని గురించి ఎంతో శ్రద్ధ వహిస్తున్నావు. అందుకు నా హృదయం నుంచి ఆశీస్సులు వెలువడుతున్నాయి. నీవు డబ్బు లేదా చెల్లించాల్సినవాటి గురించి ఆలోచించవద్దు. దైవం ఇవ్వదలిస్తే తనంతట తానుగా ఇస్తాడు. దీనిని గురించి ఎవ్వరినీ అడగాల్సిన అవసరం ఉండదని నేను భావిస్తున్నాను. 'అతని' నుంచి ఇవ్వాలని ప్రేరణ కలిగినప్పుడు జనం వారంతట వారుగా దీని గురించి ఆలోచిస్తారు.

**"మంగబొ భలొన బాప్ సె, జొ విధనా రాఖేలాజ్"**

**ఆఖరికి తండ్రినుంచి అయినా ధనం కోరటం సబబుకాదు, దైవం తలిస్తే నీ ఆత్మ గౌరవాన్ని కాపాడుతాడు– అని దీని అర్థం.**

**బిటియా! నేనైతే నేటివరకు జనంకోసం కేవలం ఆధ్యాత్మికతనే కోరుతూ వస్తున్నాను. దానికి మూల్యంగా మీరు చెల్లించాల్సింది ఆ అసలు మాలిక్‌నే మాలిక్‌గా భావించటం (గౌరవించడం) మాత్రమేగాక 'అతడు' ఇచ్చినదానితో సంతృప్తికరంగా ఉండాలి.** మన మిషన్‌లో చాలామంది స్వార్థపరులు ఉన్నారు, వారు ఎటువంటి త్యాగం చేయటానికి ఇష్టపడరు, అని నీవు గ్రహించి ఉండకపోవచ్చు. దైవం తలిస్తే ఇది కూడా తొలగిపోతుంది.

నీ ఉత్తరంలో వ్యాప్తి ఏమీ జరగటం లేదు అని వ్రాశావు. దీనికి కారణం, వాప్తి ఇంతకుముందే జరిగిపోయింది. ఇప్పుడు అది సహజమైన రీతిలో ఉండటం వలన దాని అనుభూతికి రాదు. భూమి, ఆకాశంలాగ నీవు జడత్వం పొందినట్లుగా ఉంది అని వ్రాశావు. దాని అర్థం ఏమిటంటే, నీ ఆలోచన మరియు దృష్టి పూర్తిగా అటువైపు (సత్యత్వంవైపు) ఆకర్షితమైపోయాయి, కనుక దేహం యొక్క భావన కూడా ఇప్పుడు లేకుండా పోయింది. నీకు దాని ఆలోచన కలిగినట్లయితే, అప్పుడు ఒక దీర్ఘశ్వాస తీసుకోవాల్సి ఉంటుంది. దానివలన శరీరానికి సరిపడిన ఆక్సిజన్ (ప్రాణవాయువు) సమకూరుతుంది. నా పరిస్థితి ఎటువంటిదంటే, నేను చాలా సమయం వరకు శ్వాస తీసుకోవటం లేదు. ఎప్పుడైనా ఒక నెలకో, రెండు నెలలకో అది నా దృష్టికి వస్తే కొంచెం ఎక్కువుగా దీర్ఘశ్వాస తీసుకుంటాను. ఇప్పుడింక నేను కూడా దాని మీద ధ్యాస నిలుపుతాను.

నీవు సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలం) సమీపంలో ఏదో నాడి తెగినట్లుగా ఉంది అని ఉత్తరంలో వ్రాశావు. నాకు కూడా నా అభ్యాసకాలంలో ఇటువంటిదే అనుభవమయ్యింది. అక్కడ ఉన్న శక్తి జాగృతమయ్యింది అని దాని అర్థం. నీ కుడిపాదం బొటనవ్రేలి చివర మండుతున్నట్లుగా ఉందని వ్రాశావు. అది మంట కాదు, అది పొక్కటంవలన కలిగిన వేడి మాత్రమే. అక్కడ ఉన్న అనవసరమైనవి (Foreign matter) తొలగిపోయినప్పుడు ఈ అనుభూతి కూడా పోతుంది. సెంట్రల్ రీజియన్‌తో దీని సంబంధం బహుదూరంగా ఉంటుంది. నేను సహజమార్గ సాధన గురించి కొన్ని విషయాలను వ్రాశాను. దానిలో కుడిపాదం బొటనవ్రేలు మధ్యలో ఉన్న స్థానం మీద ధ్యానం చేసినట్లయితే (Central Region) కేంద్రమండలం తెరుచుకుంటుంది అని, ఇంకా చాలా విషయాలు కూడా వ్రాశాను. జపాన్‌లో జరిగిన మూడవ ప్రపంచ మత సమావేశంలో మన మిషన్ యొక్క వ్యాసం ప్రచురించబడటం చాలా ఆనందదాయకమైన విషయం.

నీవు అర్థం చేసుకోవటానికి, బాగా ఆలోచించటానికి ఇంకొక విషయం కూడా వ్రాస్తున్నాను. దీనిని నీ ఉత్తరాలతోపాటుగా ప్రచురించాలి. అది జాతి అభిమానం (దీనిలో లాభం లేదు, కేవలం హాని మాత్రమే ఉంటుంది)

పెంచుకొని ఉన్నటువంటి వారి కోసం. ఇది అహంకారపూరితమైన విషయం. బ్రహ్మయే కనుక తాను బ్రహ్మం అని తలచినట్లయితే అతడు తన స్థానం (బ్రహ్మత్వం) నుంచి పతనం చెందుతాడు (పదవీభ్రష్టుడు అవుతాడు). ఇక్కడ కనీసం బ్రహ్మగతిలో కూడా లేనటువంటివారు ఇతరుల మీద ఒత్తిడి తెచ్చి, వారితో తనను బ్రహ్మగా అంగీకరించేటట్లుగా ప్రవర్తిస్తున్నారు. ఇటువంటి వారు బ్రహ్మకు దూరమైపోతూ ఉంటారు, అదీగాక ఈ విషయం మానవ సభ్యతకు విరుద్ధమైనది కూడా. బ్రహ్మగా ఎవరైనా తయారుకావాలనుకుంటే నాకు ఏమీ అభ్యంతరం ఉండదు కాని అతడు తన పతనానికి పరిస్థితులు కల్పించుకుంటూ ఉంటే అది చాలా బాధాకరంగా ఉంటుంది. దానికి నేను నిస్సహాయకుడనవుతాను. ఎవరైతే బ్రహ్మవిద్యకునోచుకోరో మరియు భగవంతుడిని తనవైపు ఆకర్షించుకోవటానికి ఇష్టపడడో, అటువంటివాని దశ ఈ విధంగా సంభవిస్తుంది. ఎవరి సమూహం (Anybody's Group) లోనైనా ఈ జాతి అభిమానం వృద్ధి చెందితే, వాళ్ళ హృదయాలు శిలగా మారిపోవటమే కాకుండా వారు మనుష్యులుగా పరిగణించరు. అటువంటివారు ఒక విషాన్ని విరజిమ్మి ఇతరులకు కూడా హాని కలిగిస్తారు.

అమ్మకు ప్రణామం. సోదర సోదరీ లందరికీ ఆశీర్వాదాలు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 500

లఖీంపుర్,
19.07.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ కృపతో కూడిన ఉత్తరం అందింది. తమ విషయాలు తెలిశాయి. నా ఆరోగ్యం ఇప్పుడు బాగుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ! అది ఏమిటో నేను చూస్తున్నాను, పాయింట్ '$A_1$' నుండి '$F_1$' వరకు ప్రయాణించినా ఎక్కడా ఎటువంటి ఆనందం కలగలేదు. ఎలా అయితే 'తమర్ని' చూసినపుడు ఆనందం కలిగిందో అలా ఎక్కడా కలగలేదు. ఇంకా ఏమి చూస్తున్నానంటే, ప్రతిస్థితిలోను, అది కష్టమైనది లేదా విశ్రాంతియైనది అయినా, అందులో ఏదైనా ఆధ్యాత్మిక స్థితి ఉన్నాగాని, లేకున్నాగాని, నా లోపల ఒక శాశ్వత ఆనందం యొక్క ప్రకంపన (Vibration of Everlasting bliss) ఉంటూ ఉండేది. దానిని నిద్రపోతున్నపుడు, మేల్కొని ఉన్నపుడు, ప్రతి దశలోను నా లోపల అనుభూతి చెందుతాను. నేను అలా భావిస్తూ ఉంటాను. కాని దశ ఏ విధంగా ఉంటుంది అంటే, నేను అక్కడ లేకుండాపోయినట్లుగా ఉంటుంది. ఎందుకంటే, ఈ శాశ్వత ఆనందం యొక్క ప్రకంపనం ఉంటూ ఉన్నా, ఇది స్వయంగా నా లోపలగాని, మరెక్కడైనగాని జాడ తెలియనిదిగా ఉంటుంది. వాస్తవంగా, శారీరిక శ్రమ అధికంగా ఉన్నపుడు కొంచెంగా అనుభూతి చెందుతున్నాను లేకపోతే అంతా ఖాళీగానే ఉంటున్నాను. దశలు మారుతున్నాయి, గడచిపోతున్నాయి. కాని నేను మాత్రం ఉన్న దానిని ఉన్నట్లుగానే ఉంటున్నాను. దాని వలన ఏ విధమైన అనుభూతి కలగడం లేదు. ఈ ఆనందం లోపల, బయట, ప్రతిచోట వ్యాపించి ఉన్నట్లుగా కనిపిస్తోంది. అప్పుడు (Treasure of Divine bliss) ఈశ్వరీయ ఆనందపు నిధి విస్తరించి ఉంది. కాని నా కళ్ళు, దృష్టి అక్కడ లేకుండా ఎక్కడో ఉంటున్నాయి. ప్రతిచోట, ప్రతి సమయం కొంచెంగా (Vibration) కంపనాన్ని అనుభూతి చెందుతున్నానుగాని, అది ఒక మెరుపులాగ ఉంటోంది. నా దశతో దానికి సంబంధం లేకపోయినప్పటికి, ఎందుకోగాని నాకు ఈ విధంగా అనిపిస్తోంది.

ఇప్పుడు ఉన్న స్థితి ఎటువంటిది అంటే, కళ్ళు మూసుకుని కూర్చుని ఉన్నా కూడా దశను పరిశీలించలేకపోతూ ఉన్నాను. దశ ఎటువంటిది అంటే, ఒక శుభ్రమైన గోడ / తెరలాంటిది, దాని మీద చిత్రకారులు అనేక చిత్రాలు

చిత్రించి చెరిపేస్తున్నట్లుగా ఉంది. అయితే అది ఆ గోడకు / తెరకు ఏమి తెలుస్తుంది. నా స్థితి కూడా ఇటువంటిదే, ఈ దశ ఏమిటో అర్థం కావటం లేదు. పూజ్య బాబూజీ! ఇప్పుడు నేను దశ గురించి అల్పంగానే వ్రాస్తున్నాను. దానిని తమరు కేవలం ఒక (Hint) సూచనగానే భావించండి. ఇప్పుడు నా దశ ఏమిటంటారా, అన్నీ కూడా ఏమీ లేకుండా అయిపోయాయి. ఇంకొక విధంగా చెప్పాల్సివస్తే, అంతా కూడా ఉన్నది ఉన్నట్లుగానే ఉండిపోయింది. కాని నా అవగాహన మరియు దృష్టి మాత్రమే లోపించిపోతున్నాయి. అయితే నేను, నాకు ఏమీ తెలియదు అని ఎలా చెప్పగలను. శూన్యం లేదా ఖాళీస్థితిలో నేను దూరిపోయి కలిసిపోయాను, దానిలో అదృశ్యమైపోయాను. ఇప్పుడు ఎక్కడ చూసినా శూన్యం లేదా ఖాళీనే అనుభూతి చెందుతున్నాను. ఇది ఏమిటోగాని ఖాళీ అని చెప్పినా కూడా దశ యొక్క శోభగా కనిపించటం లేదు. ఇప్పుడింక అంతా తమకే తెలియాలి, 'తమ' నిర్వహణకే తెలియాలి.

కేసర్ తమకు ప్రణామం చెబుతున్నది. సోదర సోదరీలైన చిన్నవారికి నా ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ